# భారత దర్శన్

## ఆత్మ దర్శనాభిలాషతో...

(మొదటి భాగం)



బాలచంద్ర

# భారత దర్శన్

ఆత్మ దర్శనాభిలాషతో...

బాలచంద్ర

# భారత దర్శన్

ఆత్మ దర్శనాభిలాషతో...

**(మొదటి భాగం)**

**బాలచంద్ర**

Published by
**abhaya FOUNDATION**
Hyderabad - 500 004. TG
www.abhayafoundation.org

# Bharata Darshan

In Search of Self

Author : **Balachandra**
Copy Right © Balachandra
Translated by : Lakshmi

All rights reserved. No part of this work may be reproduced in any form without written permission of the publisher

First Edition : January, 2025
Copies : 1000
Price : Invaluable

Typing & Layout Design
R. Bhagya Laxmi
+91 9542247373

Published by
**abhaya FOUNDATION**
502, Vipanchi Residency, Lane Besides Paradise Take Away,
Masab Tank, Hyderabad - 500 028. Telangana
abhayafoundation@yahoo.com | abhaya@abhayafoundation.org
Mobile: 99592202450 | What's App: 8143707803

www.abhayafoundation.org | www.abhayahome.org
fb: abhayafoundationHyd | fb Page: abhaya Foundation - Home of Happiness
Twitter: abhayaheart | Youtube: abhayaheart
fb: Balachandra Sunku | Youtube : Balachandra Sunku

Printed at :
Dolphin Graphics
IDA, Uppal, Hyderabad - 500 039, TG
dolphingraphicsads@gmail.com
Ph: 8106988009

# మంగళాశాసనములు

"జై శ్రీమన్నారాయణ!" భారత దర్శన్ అనుభవము మిమ్మల్ని, అద్భుతమైన సేవ యొక్క తదుపరి స్థాయి అయిన భగవంతుని దివ్య స్వరూపానికి తీసుకువెళ్లిందని మేము నమ్ముతున్నాము. మీరు మీ అనుభవాలను చక్కగా వ్రాసి వాటిని పంచుకోవడం అన్నది మంచి పని. తద్వారా ఇతరులు భారత దర్శన్ చేయడానికి ప్రేరణ పొందుతారు, అంతేగాక పరోక్షంగా దివ్యానుభూతినీ పొందుతారు.

భారతదేశం అంటే ఒక ఖండం మాత్రమే కాదు, భూమి మాత్రమే కాదు, భగవంతుడు తన అవతారములలో తనను తాను ప్రకటించుకొన్నప్పుడు, వారి దివ్య పాదము ఈ భూమిపై ఉన్న మట్టిని తాకిన ప్రదేశము, ఆయన ఇక్కడ, ప్రతి మూల మూలల్లోనూ ఉన్న ఆలయములలో, దేవతా రూపములలో నివసిస్తున్న పవిత్ర క్షేత్రం ఇది.

ప్రాచీన కాలంలో ఋషులు, జ్ఞానులు, దివ్యజ్ఞానాన్ని అనుభవించి, వేదాలను మనకు ప్రసాదించిన భూమి ఇది. వేద పఠనం ద్వారా భారతదేశం చుట్టూ ఉన్న వాతావరణం శతాబ్దాలుగా శుద్ధి చేయబడింది.

భారతదేశంలో చూడవలసినవి చాలానే ఉన్నాయి కానీ, మనం జలపాతాలను, ప్రవహించే నదులను, అద్భుతమైన పర్వతశ్రేణులను మాత్రమే చూడటం కాదు వాటిలో ఇమిడి ఉన్న దివ్యత్వాన్ని కూడా ఆత్మ చక్షువులతో దర్శించుకోవాలి, పక్షుల కిలకిలరావాలని, సింహ గర్జనలను వీనులతో వినగలగాలి.

భారతదేశం, విదేశీ ఆధిపత్యాన్ని, దండయాత్రలను ఎదుర్కొని కూడా స్థిరంగా వేళ్ళూనుకుని నిలబడింది. చుట్టుపక్కల ప్రజల పేదరికం చూసినప్పుడు వారిలోని పేదరికం కాకుండా వాళ్లు ఆ సవాళ్లను ఎదుర్కునేందుకు వాళ్ళ గుండెల్లో

దాగున్న పట్టుదలని, వాటిని అధిగమించగలిగే వారి ఆత్మవిశ్వాసాన్ని చూడాలి. ధనవంతులను చూసినప్పుడు వారి ధనాన్ని కాకుండా వారిలో ఉన్న దాన గుణాన్ని చూడాలి, నిరక్షరాస్యులను చూసినప్పుడు వారిలో ఉన్న భక్తిని చూడాలి. ఇవన్నీ పేదరికపు, నిరక్షరాస్యపు సాకులు కాదు. ఈ బాహ్యమైన తొడుగులను పక్కనపెట్టి అందరిలో ఉన్న ఆత్మని చూడమన్న పిలుపుని వినాలి. మనమంతా ఆ దేవదేవుని ఆత్మలోని అణువులు మాత్రమే అని గ్రహించుకోవాలి. దేవుని ఆత్మలోని అంశలే అని, ఆయన పిల్లలమే అని గ్రహించుకోవాలి.

ఈ భూమిపైన భగవంతుని ఆరాధించడానికి, అనుభవించడానికి భారతదేశము ఒక దివ్య ప్రదేశం. ఈ పుణ్యభూమిలో భగవంతుడు తనను తాను రమణీయమైన రూపాల్లో వెల్లడిస్తాడు, మనం సందర్శించే ప్రతి ప్రదేశము, అన్వేషించే వివిధ రూపాలు, ఆ నిర్దిష్ట రూపంలో భగవంతుని అందాన్ని మాత్రమే వివరిస్తాయి. భగవంతుని ఉనికి ఒక రహస్యము, మనం నిజాయితీగా స్వచ్ఛమైన హృదయంతో ఉన్నప్పుడు ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా సేవలు చేస్తున్నప్పుడు ఆయన తనని తాను వివిధ సమయాలలో వివిధ రూపాలలో, అభి వ్యక్తీకరించుకుంటాడు.

మీ భారత దర్శన్ ఖచ్చితంగా మానవత్వాన్ని అర్థం చేసుకోవడానికి, పేదలకు సేవ చేసేలా ప్రేరేపిస్తుంది. మన దేశంలోని విభిన్నమైన సంస్కృతుల్ని అర్థం చేసుకోవడంలో, మీ నిష్కళంకమైన అవిశ్రాంత కృషి కొనసాగుతూనే ఉండాలి. దీనికి శక్తివంతమైన అంతర్వాహిని, వేదజ్ఞానం రాజీలేని అభ్యాసాలే మీకు ఆధారంగా నిలుస్తాయి.

భారతదేశంలోని వివిధ సంస్కృతులను వివిధ మతాలను గౌరవిస్తూ బ్రతికే శక్తికి మనం గర్వ పడదాము. అన్ని మతాలను గౌరవిస్తూ, మన మతాన్ని మనం ఆరాధిస్తూ బ్రతకాలి. భారత దర్శన్ ద్వారా మీరు గత అనుభవాల్ని ప్రస్తుత అనుభవాలతో కలిపి భవిష్యత్తుకు పునాదులు వేస్తూ, ఇతరులను కూడా ప్రేరేపిస్తూ ముందుకు సాగాలని కోరుకుంటున్నాను.

మా మంగళశాసనాలు మీ ఉజ్వల భవిష్యత్తుకు ఎల్లప్పుడూ మీ వెంటనే ఉంటాయి.

**– చిన్న జీయర్ స్వామీజీ**

# నన్ను భారత యాత్రకు తీసుకెళ్ళినట్లు వుంది!

ఒకటో రెండో మూడో అయితే చెప్పడం చాలా సులభం. కానీ ఎన్ని అనుభవాలు? ఎన్ని అనుభూతులు? ఎన్ని అభ్యాసనలు? భారత దర్శన్‌తో మా సొంతం చేసారు స్వామీజీ.

ఆంగ్ల పుస్తకం చదువుతుంటే... అనువాదం చేస్తుంటే వారితో పాటుగా నన్ను భారత యాత్రకు తీసుకువెళ్లినట్లే వుంది. వారు చూసిన రాముని నేను చూసాను, వారు చూసిన కృష్ణుని నేను చూసాను, వారు చూసిన ప్రతి ఒక్క విషయాన్ని నేను అనుభూతిలోకి తెచ్చుకున్నాను. వారు ఎక్కడికి వెళ్తే అక్కడికి... నేను కూడా బస్సులో, ఆటోలో, మోటార్ బైక్‌లో, విమానంలో... వారితో పాటే ప్రయాణిస్తూ, ప్రవాహాల్ని జలపాతాల్ని చూసేసాను. అంతే కాదు, ప్రకృతితో మమేకమై వాగుల్లో, అడవుల్లో, కొండల్లో, గుట్టల్లో చేసిన ప్రయాణాలు... వాటిల్లో భగవంతుని చూస్తూ ప్రయాణం చేసాను.

ఒక సైనికుడిలా... వారి మాటలు వింటూ ప్రతి వ్యక్తిలో దాగున్న భగవంతుణ్ణి చూస్తూ వివిధ సంస్థలు చేస్తున్న సేవా కార్యక్రమాల్లో పరోక్ష భాగస్వామిగా మారి... వారితో నడుస్తూ ఏం నేర్చుకున్నాను నేను? క్లుప్తంగా వ్యక్తీకరించాలి అంటే...

1. మనిషి జన్మ సార్థకం అవ్వాలి అంటే మార్గదర్శకత్వం కావాలి... ఆ మార్గంలో నడవాలి.
2. అణువణువులో ఉన్న ఆ భగవంతుని చూడాలంటే మన లోపలికి మనం ప్రయాణించాలి.
3. ఈ ప్రపంచంలో ఉన్న ప్రతి వ్యక్తికి ఒక లక్ష్యం ఉండాలి, లక్షణమూ ఉండాలి.
4. మాటలు కాదు చేతలు కావాలి.

5. ప్రజలతో మమేకమై, చెప్పకనే చెప్పే సమస్యలకి మార్గం చూపించాలి.
6. ఎవరి జీవితాలకు వారే చేయూతగా నిలిచేలా నిర్భయత్వాన్ని నింపాలి.
7. ఆలయాలు వాటి నిర్మాణాలు వాటి వెనక ఉన్న శాస్త్రీయత అందరికీ చాటి చెప్పాలి.
8. భారత దర్శన్ పుస్తకము ప్రతి వ్యక్తికీ కరదీపికలా మారి ముందుకు నడిపిస్తుంది.

నా అసక్తతను, అలసత్వాన్ని, అప్పుడప్పుడు పలకరించిపోయే సోమరితనాన్ని, వారు భరించి, క్షమించి, సహించి, స్వామిజీ! ఇంకా సమయం ఇవ్వండి అంటూ సతాయించిన నాతో, తెలుగు అనువాదం చేయించి తద్వారా వారితో పాటు నాకు కూడా భారత దర్శనం చేయించారు.

చిన్నపిల్లవాడు అక్షరాలు తప్పుగా వ్రాస్తుంటే వాడు వ్రాసాక, వాటిని సరిచేసి... తరవాత నువ్వు బాగా వ్రాసావురా! భలే వ్రాసావు!! అని వాడిని ప్రశంసించినట్లు, తెలుగు అనువాదాన్ని నాతో చేయించిన స్వామీజీకి కోటాను కోట్ల కృతజ్ఞతలు మరియు వందనములు.

వారి అభిమాని

**– లక్ష్మి**

# విక్రయం కాదు - ప్రసాదం

అందరికీ నమస్కరించి వ్రాయునది!

భగవద్ సంకల్పం చేత, నన్ను నేను పునీతం చేసుకోవడానికి...

నా భావనలను మెరుగు పరచుకునేందుకై ఆత్మాన్వేషణకై, నేను 2019లో చేసిన యాత్ర భారత దర్శన్. ఈ నా యాత్ర, ప్రతి రోజు ఆత్మ పరిశీలనలను, అనుభవాలను మరియు దివ్య సాక్షాత్కారాలను అందించడం జరిగింది. యాత్రలో నాకు ఎదురైన మంచి చెడులకు, నాలో ప్రకటితం అయిన ప్రతి భావనకు అక్షర రూపాన్ని ఇవ్వడం మొదలుపెట్టాను. భారత దర్శన్‌లో ప్రతిరోజు నిద్రపోయే ముందు నా ఆలోచనల్ని క్రమం తప్పకుండా సామాజిక మాధ్యమాల ద్వారా, కుటుంబ సభ్యులతో, స్నేహితులతో, సహచరులతో, శ్రేయోభిలాషులతో వారి ద్వారా తెలిసిన వాళ్ళు తెలియని వాళ్ళతో పంచుకొని విశ్రమించే వాడిని. ఈ యాత్రా వృత్తాంతాలు అన్ని కూడా మొదట ఆంగ్ల భాషలో వ్రాయడం జరిగింది.

భారత దర్శనం అన్నది దైవ సంకల్పంతో నెరవేరిన ఒక వాస్తవము. ఇక పుస్తక ప్రచురణ అనేది ఆ దైవం రాసిన రాత.

కుమారి సోమిశెట్టి లలిత లహరి, అభయ ఆత్మ బంధువు, నేను ప్రతిరోజు పోస్ట్ చేసిన వాటిని ఒక పద్ధతిలో క్రోడీకరించి, సరి చేసి, తప్పులు సరిదిద్ది, పుస్తక రూపంలోకి తెచ్చింది. నేను హైదరాబాద్ తిరిగి వచ్చాక మొదటి కాపీని చూసి సమీక్షించి మెరుగుపరిచాము.

ఈ విషయాలన్నింటినీ ఆంగ్ల పుస్తక రూపంలోకి తెచ్చి ప్రస్తుత మరియు భావితరాల వారికి భరతమాత గొప్పతనాన్ని, వైభవాన్ని, ఆమె దివ్యాత్మని తెలుసుకునేందుకు సహాయం చేయాలని తద్వారా అందరూ భారత మాతను అర్థం చేసుకునే ప్రయత్నంలో సఫలీకృతం అవుతారని అనుకున్నాము.

శ్రీ గౌరా శ్రీనివాస్, శ్రీ Ch. వెంకటేశ్వరరావు, CS దేవకి వాసుదేవరావు,

నేను ఈ పుస్తకాన్ని ప్రచురించాలని అనుకున్నానని, తెలుసుకున్న వెంటనే, పుస్తకాన్ని విక్రయించదగిన వస్తువుగా కాక పవిత్ర ప్రసాదంగా అందించాలని ఉదారతతో, ప్రేమతో ఆర్థిక సహాయాన్ని అందించారు.

శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారు భారత దర్శన గ్రంథమునకు మంగళాశాసనములు అందించడమే కాక, ఆంగ్ల పుస్తకమును ఆనాటి తెలంగాణ గవర్నరు డా. తమిళిశై సౌందరాజన్ గారి సమక్షంలో ఆవిష్కరించారు (2020).

ఆ తదుపరి, ఆంగ్ల పుస్తకాన్ని అభయ ఆత్మ బంధువు, సోదరి శ్రీమతి లక్ష్మి, హైదరాబాద్ సాయంతో తెలుగులోకి అనువదించి ప్రతి నెలా ధారావాహిక లాగా శ్రీవాణి సాంస్కృతిక మాస పత్రిక మరియు అభయ సమాచార పత్రిక ద్వారా ప్రచురించడం జరుగుతోంది.

అలా గత 5 సంవత్సరాలుగా అనువదించిన వ్యాసాలు మొదటి భాగాన్ని 27 జనవరి 2025 నాడు విడుదల చేయాలని సంకల్పం చేసాము.

శ్రీ ఏ రాజశేఖర్ రెడ్డి గ్రాఫిక్ డిజైనర్, అభయ ఆత్మబంధువు, ఈయనతో నాకు 25 సంవత్సరాల అనుబంధం, తమ ఆఫీస్ పని వేళల తర్వాత తర్వాత పుస్తక రూపకల్పనలో నాతోపాటు కూర్చునేవారు. తెలుగు డిటిపి చేసేందుకు శ్రీమతి భాగ్యలక్ష్మి ఎంతో ఓపికతో సాయం చేసింది. డాల్ఫిన్ గ్రాఫిక్స్ అధినేత మరియు అభయ ఆత్మ బంధువు శ్రీ రంజాన్, హైదరాబాద్, దీనిని ఒక అందమైన పుస్తకంగా ముద్రించడానికి శాయశక్తులా కృషి చేసారు. ఇంత అందమైన పుస్తకాన్ని అందరికీ చేరువ చేసేందుకు వారి జ్ఞానాన్ని, సమయాన్ని, సంపదను, సహాయ సహకారాలను, అందించిన ప్రతి ఒక్కరికి వారి శ్రేయోభివృద్ధి కోసం ప్రార్థనలు చేస్తున్నాను.

ఈ గ్రంథాన్ని కూడా శ్రీ చిన్న జీయర్ స్వామి వారు, తెలంగాణ గవర్నర్ శ్రీమాన్ జిష్ణుదేవ వర్మ గారి సమక్షంలో 27.01.2025 విడుదల చేసారు.

ఈ తెలుగు పుస్తకం ప్రచురణలో తోడు నిలచిన వారందరికి ధన్యవాదాలు. ఈ రోజో, రేపో, ఎప్పుడైనా సరే భారత దేశం గురించి తెలుసుకోవాలన్న అన్ని తరాల వారికి ఈ పుస్తకం ఉపయోగపడుతుందని ఆశిస్తున్నాను.

చివరగా, దైవానుగ్రహం మరియు ఆశీస్సులు లేకుండా ఏదీ జరగదు.

అలా నన్ను ప్రతిక్షణం నడిపిస్తూ, నా తోడుగా, నీడగా, నా జీవితమంతా నిలిచిన... నిలుస్తున్న భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి దివ్య పాద పద్మములకు శరణు వేడుతూ... నమస్కరిస్తున్నాను. సమస్త లోకాః సుఖి నోభవంతు.

దేశం కోసమై ప్రేమతో...

**బాలచంద్ర**


B.Sc., L.L.B., F.C.S.,

వ్యవస్థాపకుడు,

అభయ ఫౌండేషన్,

హైదరాబాద్

9963002727

# ప్రముఖుల స్పందన

సహృదయులు, సేవాభిలాషులు, సమాజ సేవకులు మరియు శ్రీ సత్యసాయి భక్తులు, సోదరులు శ్రీ బాలచంద్ర, B.Sc., LL.B., FCS, అభయ పాఠకులకు సుపరిచితులు. వీరు రామచంద్ర స్వామివారి అంతఃప్రేరణతో 'భారత దర్శన్' గావించారు. భారతదేశ సనాతన ధర్మ వైశిష్ట్యాన్ని, నిగూఢమైన ఆధ్యాత్మిక అంతరార్థాలను చాటిచెప్పే మన ప్రాచీన దేవాలయాలు, పవిత్ర ప్రదేశాలను సందర్శించారు. ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకొన్న ప్రాంతాలను, ప్రాధాన్యతకు నోచుకోని ప్రదేశాలను కూడా పర్యటించి వాటి ప్రభావాన్ని, వాటి వైభవాన్ని పాఠకులందరికీ అందించడానికి అంగీకరించడం ముదావహం. 2020 నుండి ప్రతి మాసము భారత దర్శన్ ధారావాహిక ద్వారా యాత్ర యశోవైభవాన్ని చాటి చెప్పే చిత్రాలతో వ్యాసములను మాసపత్రికలలో అందించడం జరుగుతుంది. అట్టి ధారావాహికలను కూర్చి పుస్తకం మొదటి భాగాన్ని మీ చేతులలో పెడుతున్నాం. జిజ్ఞాసులు, జ్ఞానాభిలాషులు, దేశాభిమానులు ఈ గుభాళించిన ఆధ్యాత్మిక పరిమళాలను ఆస్వాదించి ఆనందించి అందరికి పంచుతారని ఆశిస్తున్నాము.

భగవత్ సంకల్పమే భారతదర్శనంకు నాంది...
భద్రాద్రి రాముని చెంత ప్రేరణ కలిగింది...
వికారినామ ఉగాది పండుగ నాడు గోచరమైంది...
పుట్టు పండుగ నుండి స్వీయ సాధన చేయమంది...
భారత దర్శనకాంక్ష అకుంఠిత దీక్షగా మారింది...
భారత సౌజన్య సౌశీల్య సౌభాగ్యములే లక్ష్యమైంది!

శ్రీ బాలచంద్ర, ఏప్రిల్ 6వ తేదీ 2019 వికారి నామ ఉగాది పర్వదినం రోజున భద్రాద్రి సీతారామచంద్ర స్వామి వారి సమక్షములో ప్రేరణను అందుకుని

సుమారు 180 రోజుల పాటు శ్రీ శంకర భగవత్పాదుల వారి దిగ్విజయ మార్గంలో యావత్ భారతదేశమును దర్శించి సెప్టెంబరు 30వ తేదీ 2019 నాడు స్వస్థలమును చేరుకున్నారు.

ప్రతిరోజు తాను దర్శించిన క్షేత్రాలు, తీర్థాలు, పురములు, నదులు, వనములు మరియు అరణ్యముల గూర్చిన వింతలు, విశేషాలను, స్వీయ అనుభవాలను, దివ్యానుభూతులను ఎప్పటికప్పుడు ఆంగ్లములో వ్రాసుకుని శ్రేయోభిలాషుల సూచన మేరకు ఆంగ్లంలో పుస్తకంగా ప్రచురించినారు. ఈ పుస్తకము జనవరి 2020 మాసంలో శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చిన్న జీయరు స్వామి వారి కర కమలముల చేత ఆవిష్కరించబడింది. ప్రస్తుతము తెలుగులో అనువదించబడిన భారత్ దర్శన్ ప్రథమ భాగం కూడా శ్రీ చిన్న జీయర్ స్వామి వారి చేతుల మీదుగా ఆవిష్కరించబడుతోంది.

బాలచంద్ర గారిచే వ్రాయబడిన ఈ పుస్తకమును చదివి స్పందించి ముందుమాటగా తెలిపిన కొద్దిమంది ప్రముఖుల అంతరంగ ఆవిష్కరణను అందించితే పాఠకులకు 'భారత దర్శన్' యొక్క విలువ అవగతమవుతుందనే ఆకాంక్షతో బహుకొద్ది మంది భావాలను వారి మాటల్లో అందించే ప్రయత్నం చేసాము. గమనించగలరు.

**– సంపాదక వర్గం**

* * *

"భారత దర్శనము శ్రీ బాలచంద్ర గారిని తప్పక సర్వ ప్రాణులకు సేవలు అందించే మార్గంలో మరింత ముందుకు తీసుకుని వెళ్ళడానికి ఉపయోగ పడుతుందని నమ్ముతాను. నా అదృష్టము వలన నేను కూడా శ్రీ బాలచంద్ర గారితో భారత దర్శన్‌లో ఒక రెండు రోజులు ఢిల్లీలో పాల్గొన్నాను. అప్పుడు అర్థం అయింది. ఆయన సంకల్పం ఎంత గట్టిదో, ఎంత వ్యయ ప్రయాసలకు ఓర్చుకుని వారు ముందుకు వెళ్తున్నారో అని".

**– దేవకీ వాసుదేవరావు,**

భారతీయ జనతాపార్టీ, తెలంగాణ రాష్ట్రం.

* * *

“I am sure, your experiences while travelling across the breadth and corner of this noble land will surely beneficial to the readers of this book. I convey my best wishes to you and all those who stood by you during Bharata Darshan.”

- **MVR Krishna Teja,** IAS,
Govt of Andhra Pradesh

* * *

“No journal or travelogue or book of this sort can contain the spiritual experiences and englightenment, one goes through, when one embarks upon a spiritual journey on the trail of His Holiness Sri Adi Shankaracharya. But Balachandra has done a stupendous work in bringing most of his experiences in the form of this book for our benefit.”

**- Dr. PV Pradeep Kumar,** IRS,
CIT, TG.

* * *

“సత్యాన్వేషకులకు, యాత్రికులకు శ్రీ బాలచంద్ర వ్రాసుకున్న అనుభవాల పుస్తకము, భారత దర్శనము, ఒక కరదీపిక లాగా ఉపయోగ పడుతుంది. కారణం భారతీయ సంస్కృతి సంప్రదాయాలను మరియు పూర్వ వైభవాన్ని చక్కగా వివరించారు. బాలా తన యాత్రను ఎలాంటి ప్రణాళిక లేకుండా ఒక సన్యాసిలా దేశమంతా పర్యటించారు. అన్ని ప్రదేశాలలో ఇమిడి ఉన్న అద్భుతమైన విశేషాలను ఆధ్యాత్మిక విలువలను ఏరి కూర్చినాడు. పుస్తకము చదువుతుంటే నేను కూడా తనతో పాటుగా ప్రయాణించినట్లు ఉంది”.

**– శ్రీ పిడతల గోపి కృష్ణ,** MBA
శ్రీ సత్యసాయి సేవా సంస్థలు, హైదరాబాద్.

* * *

"అయ్యా బాలచంద్రా! నీ భారత దర్శనము విశేషాలు వింటూ ఉంటే చాలా ఆనందము కలుగుతోంది. అయితే నీ అనుభవాలను ఆంగ్లములో గ్రంథీకరించావు. శ్రమ అనుకోకుండా తెలుగులో అనువదిస్తే కోట్ల మంది తెలుగు వాళ్ళకు ఉపయోగపడుతుంది. అంతేగాక, 200 పేజీలున్న పుస్తకం చదవడం కష్టం. శ్రీవాణి లాంటి మాస పత్రికల ద్వారా నెలనెలా ధారావాహికగా వేస్తే బాగుంటుంది."

**డా. నలబాల అంజనయ్య,** MA., Ph.D
పూర్వ రాష్ట్ర అధ్యక్షులు, శ్రీ సత్యసాయి సేవా సంస్థలు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్.

* * *

"Dear Balachandra, Sai Ram, I am blessed to go through your amazing journey and equally appreciative narration. There is no place where my pen could find to correct or modify. Kindly organize a befitting release function, preferably in a holy place."

**- Dr. K.S. Ratnakar,** MBBS

* * *

"శ్రీ ఆది శంకరాచార్య, శ్రీ రామానుజచార్యుల వారివలే బాలచంద్ర గారు కూడా ఆర్యావర్తనమంతా దర్శించి వారి అనుభవాలను పుస్తకంలా చేసి ఒక ప్రసాదంలాగా ఈ అమృతాన్వేషకులతో పంచుకున్నారు. వారి అద్భుతమైన శైలితో ఎంతో సరళంగా తమ అనుభవాలను గ్రంథీకరించి అందరినీ తమతో పాటుగా దివ్య, భవ్య భారత దర్శనము గావించారు."

**– శ్రీ వి.వి. లక్ష్మీనారాయణ,** IPS Retd.,

* * *

**గమనిక:** ప్రముఖులు తమ అభిప్రాయాలను ఇంకా సవివరంగా తెలియ చేసినప్పటికినీ స్థలాభావము వల్ల వారి భావాలను సంక్షిప్తంగానే అందించడం జరిగింది. భరత భూమి యొక్క మహోన్నత పరిజ్ఞానాన్ని ప్రతిబింబించే విశేషాలను తెలుసుకోవడం ప్రతి భారతీయుని కనీస బాధ్యత అని గుర్తించాలి.

**– సంపాదక బృందము**

# భారత దర్శన్...

**తెలంగాణ**

49వ పుట్టు పండుగరోజున భద్రాచలంలో ..........
దైవ ప్రేరణ.................................... 21
దివ్య సాకేతము.................................... 22
ఇంద్రకీలాద్రి ...................................... 22
శ్రీ చిన్న జీయర్ స్వామి.......................... 22
పావగడలో మార్గాన్ని సూచించిన శీతలాంబా.......
మాత ......................................... 23
బెంగుళూరులో తల్లిదండ్రుల దర్శనం............ 24
అభయతో పుష్కర కాల ప్రయాణం .............. 25
భారతదర్శనానికి ఆశీస్సులు ..................... 25
త్యాగమే నిజ జీవిత పరమావధి ................. 25
హనుమంతులవారి ఆశీస్సులు .................. 27
ఇంటి దైవమైన శ్రీరంగనాథునికి, ....................
శీతల యంత్రము............................ 27
అవగాహనకు అతీతమైన అద్భుతవరాలు ....... 27
శ్రీ సత్యసాయిబాబా – నా స్ఫూర్తి ప్రదాత ...... 28
శ్రీ చిన్న జీయర్ స్వామి వారి ప్రసాదం ......... 28
వైశాఖ దశమి నాడు భారత దర్శన యాత్రకై ... 30
హృదయ పూర్వక ప్రార్థనలు...................... 31

**కేరళ**

కేరళ – దేవుడి సొంత భూమి.................... 32
కాలడి ............................................ 32
గురువాయూర్.................................... 33
నవముక్త కుండములు ........................... 34
108 వైష్ణవ దివ్య దేశములు ..................... 35
ఇతర దర్శనీయ స్థలాలు ......................... 36
నదులు/ సముద్రములు .......................... 36
శబరిమల, ఒక పవిత్ర గమ్యం................... 37
జటాయువు: పరాక్రమ రెక్కలు –...................
చదాయు మంగళం .......................... 39
శివగిరి మఠం .................................... 40
ఆలింగన మాతా అమృతానందమయి ........... 41
సాయిగ్రామం .................................... 43
బిజెపికి మళ్ళీ కేంద్రంలో అధికారం ............ 45
పెద్దవాడి నుండి పేదవాడు ...................... 46
పోయిన బ్యాగు మళ్ళీ వెనక్కి వచ్చింది........... 46
కృష్ణ తేజ ఐఎఎస్ గారికి హృత్ పూర్వక ...........
ధన్యవాదాలు ................................. 47
కేరళలో అభయ సేవా పథకాలు ................ 48

**కర్ణాటక**

మంగుళూరులో పసి బిడ్డతో భేటీ ................ 55
కుక్కె సుబ్రహ్మణ్య దేవ సర్పము .................. 56
రత్నగిరి బాహుబలి............................... 57
ధర్మస్థల మంజునాథ ............................. 58
ఆలయ ధర్మాధికారితో భేటీ ...................... 58
హొర్నాడు అన్నపూర్ణేశ్వరి....................... 59
శృంగేరి............................................ 60

విద్యాశంకర దేవాలయం ........................ 61
ఆదిశంకర దేవాలయం .......................... 61
శృంగేరి – ఇతర ఆకర్షణలు .................... 62
శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ తీర్థస్వామి, ..............
భారత దర్శనకు దీవించడం ................ 63
ఉడిపి – ఆకర్షణ కృష్ణుడు ....................... 64
శ్రీకృష్ణ మఠం విశిష్టతలు ........................ 65
పాకజ ............................................ 66
కొల్లూరు మూకాంబికా.......................... 66
మురుడేశ్వర దేవాలయం ....................... 69
షిమోగా / శివమొగ్గ............................. 70
స్వగృహం – బెంగళూరు ....................... 71
గాయత్రి... మూర్తీభవించిన ప్రేమ.............. 71
మైసూరు – మహిషాసురుని ఊరు ............. 72
నంజుండేశ్వరుని దర్శనం....................... 73
బసవన్న సామాజిక సంస్కర్త.................... 73
ఇండియన్ టిబెట్ – బైలకుప్పే ................. 74
శ్రీరంగపట్నం..................................... 75
బనశంకరి అమ్మ దేవాలయం .................. 76
యువశక్తి – భారతీయ శక్తి ..................... 77
దైవ సోదరి జ్యోతి దర్శనం ...................... 77
బళ్లారి ............................................ 78
హంపి – ఒక అద్భుతం ......................... 78
విరూపాక్ష దేవాలయం ........................... 79
విఠల దేవాలయ సముదాయం.................. 80
శిలారథం ......................................... 80

## గోవా

గోవా ఇంకో కోణంలో .......................... 82
దూద్‌సాగర్ జలపాతం .......................... 83
గోవాకు చేరిన వెంటనే... ....................... 83

## కర్ణాటక

ఉత్తర కర్ణాటక: భాగల్‌కోట, ........................
కూడల సంగమ & బాదామి............... 87
బసవన్న బోధనలు ............................... 89
బసవ కళ్యాణ...................................... 90

## మహారాష్ట్ర

మహానుభావుల మహారాష్ట్ర...................... 92
పండరీపూర్...................................... 92
కొల్హాపూర్........................................ 94
శక్తిపీఠాలు ....................................... 95
జ్యోతిబా .......................................... 96
మాలేశ్వర్ ........................................ 96
మహాబలేశ్వర్ .................................... 97
నారాయణపూర్ .................................. 98
అష్టవినాయక దర్శనం .......................... 98
సిద్ధి వినాయక .................................... 99
షోలాపూర్ – శివయోగి సిద్ధేశ్వర ఆలయం..... 99
అక్కల్ కోట.................................... 100
గానిగాపూర్.................................... 100
తుల్జాపూర్ .................................... 100
పర్లీ వైద్యనాథ్.................................. 101
గ్రిష్ణేశ్వర్ ....................................... 102
శని శింగణాపూర్ ............................. 104
షిరిడి నా రెండవ గృహం...................... 105
ఓర్ఝర్, విఘ్నహర్ గణపతి .................... 106
అష్టవినాయకము .............................. 107
భీమ్‌శంకర్ – ప్రకృతి సంపూర్ణ .....................
అభివ్యక్తీకరణము .......................... 108
ముంబై సిద్ధి వినాయకుడు ..................... 109

సహచరులతో సమయం ముంబైలో ........... 110
ఫానసవాడి శ్రీ వెంకటేశ్వరుడు ................. 111
ముంబ + ఆయీ = ముంబై ................... 112
మహాలక్ష్మి ఆలయం ............................ 113
గేట్ వే ఆఫ్ ఇండియా .......................... 114
హాజీ అలి దర్గా ................................. 114
శతాబ్ది ఎక్స్‌ప్రెస్................................ 116

## గుజరాత్

ఐక్యతా విగ్రహము & నర్మదా సరోవర్ ............
ప్రాజెక్టు..................................... 117
పావ్‌గడ్ మహాకాళి ............................. 120
దకొర్ ........................................... 121
మోదేరా సూర్యదేవాలయం .................... 121
సూర్య కుండ్ ................................... 122
అంబాజీ.......................................... 123
వైభవ గుజరాత్.................................. 123

## రాజస్థాన్

మౌంట్ అబూ ................................... 124
గురు శిఖర్ ...................................... 125
భామషా (1542-1600)...................... 126
దిల్వాడ జైన ఆలయం ......................... 126

## గుజరాత్

మహంత్ స్వామిజీ ఆశీర్వాదములు: ........... 128
స్వామినారాయణ గురు పరంపర .............. 129
అంతర్జాతీయ యోగా దినోత్సవం.............. 130
సబర్మతి... సబ్కో సన్మతి.... ..........................
దేశ్‌కో స్వేచ్ఛాగతి!! ......................... 131
గాంధీజీ స్మారక సంగ్రహాలయము............ 133
ప్రభుత్వానికి వినతి ............................. 133
అక్షరధామ్... ఆధ్యాత్మికతకు అక్షయము ...... 134
అక్షరధామ్‌లో తెలుసుకున్న ముఖ్య అంశాలు . 135
నా వినయపూర్వక ప్రార్థన...................... 136
ద్వారక: కృష్ణ నివాస ద్వారము ................. 137
ద్వారక - స్వర్గద్వారము ........................ 138
హరిగృహ (శ్రీకృష్ణుల వారి నివాస స్థలం) .... 138
భారతీయుల సంకల్పం - ...........................
సోమనాథ జ్యోతిర్లింగం .................... 139
బాణ స్తంభం.................................... 140
సముద్ర వీక్షణ స్థానం........................... 141
స్వామి నారాయణ మందిర్, గొండల్ ......... 141
విర్‌పూర్ జాలారాం బాబా ...................... 142
చోటిల చాముండి ఆలయం ................... 142
అక్షరధామ్, గాంధీనగర్ ........................ 143

## మధ్యప్రదేశ్

ఓంకారేశ్వర జ్యోతిర్లింగం....................... 145
మహేశ్వరం..................................... 146
రాజమాత రాణీ అహల్యాబాయి................ 146
ఉజ్జయినీ మహాకాళేశ్వర్ - జ్యోతిర్లింగం ...... 147

## రాజస్థాన్

అజ్మీర్ ............................................ 150
ఖాజా గరీబ్ నవాజ్............................ 151
సోనీ జీ కిన జియాన్ .......................... 154
స్టేట్ మ్యూజియం .............................. 155
నరేలి జైన్ ఆలయం ........................... 155
పుష్కర్........................................... 156
సావిత్రి మహా మందిరం........................ 157
హట్పటేశ్వర్ ఆలయం ......................... 157
మిరాజ్ సినిమాస్‌లో భరత్ మూవీ, అజ్మీర్ ... 157

## ఢిల్లీ


రిషబ్ ట్రావెల్స్ .................................. 159
దేశ రాజధాని: ఢిల్లీ... దేశ నాయకుల .............
గమ్య స్థానం ................................ 159
రాజ్‌ఘాట్ ....................................... 160
సదైవ అటల్.................................... 161
ఇండియా గేట్.................................. 162
జాతీయ యుద్ధ స్మారకం ...................... 163
గాంధీ మ్యూజియం ............................ 163
అక్షరధామం .................................... 163
అక్షరధామం అక్షర సత్యాలు.................... 164
నా కలల భారతదేశం........................... 164


## బెంగళూరు


తల్లిదండ్రులతో సమయం ...................... 165
అభయ యువ సాధికారత కేంద్రం ........... 165
జూన్ 29, 2019 తండ్రిగారి నిష్క్రమణము.. 166
తండ్రి పాదాల వద్ద అష్ట పద్మముల సమర్పణ 168
నాన్నగారి అంతిమ యాత్ర జరగుతుంటే...... 170
స్వామి వివేకానంద (1863-1902).......... 172
విప్లవజ్యోతి అల్లూరి సీతారామరాజు ........... 173


## ఉత్తర ప్రదేశ్


వారణాసిలో పిండ ప్రధానం:................... 177
సోదర త్రయం - నదీత్రయం - ...................
త్రివేణి సంగమం .......................... 179
కుటుంబంతో కావేరినదీ తీరానికి .............. 181
అయ్యా, మీరు సద్గతిని పొందుదురు గాక .... 185
నాన్నగారి జ్ఞాపకార్థం అంకితం ................ 187


## ఆంధ్రప్రదేశ్


ప్రశాంతి నిలయం ............................. 190
సాయి ఆత్మబంధువు మధుసూదనరావు ....... 191
సాయిసన్నిధిలో గురుపూర్ణిమ .................. 191
చిన్నిగురువు లలిత లహరి...................... 192
అభయ సాధికారత ప్రాంగణం, రోటరీపురం . 192


## తమిళనాడు


కోయంబత్తూరు... ఈషా ఫౌండేషన్! .......... 194
CS PS రావు గారికి .................................
పుట్టినరోజు శుభాకాంక్షలు ................. 195
హిమాలయాలకు నా ప్రయాణం .............. 196


## జమ్మూ & కాశ్మీర్


వైష్ణోదేవి నిర్మలమైన ప్రకృతి అభయారణ్యం .. 198
జవాన్లతో ప్రయాణం........................... 200
బ్యాగ్లీహర్ డ్యామ్ ................................ 202
ఖీర్ భవాని....................................... 203
సహయాత్రికుడు 60వ జన్మదినోత్సవం ....... 206
భద్రతా సిబ్బందికి కృతజ్ఞతలు, అభినందనలు 206
లంగర్లో విశ్రాంతి .............................. 207
చంద్రయాన్ 2 .................................. 207
అమర్‌నాథ్ పరమశివుని పవిత్ర నివాసం ..... 208
ముస్లిం యువకుడితో అనుభవం............... 210
శ్రీనగర్ దాల్ సరస్సు .......................... 213
తేలియాడే ఇంట్లో బస .......................... 213
కర్ణాటక ఒక నాటకం.......................... 214
గుల్మార్గ్.......................................... 214
జమ్ము ........................................... 216
రఘునాథ్ ఆలయం ............................ 217

**పంజాబ్**
అమృత్‌సర్ – త్యాగ భూమి .................... 218
జలియన్ వాలాబాగ్............................ 219
నా దేశ ప్రజల కోసం రక్తదానం............... 220
డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం .................... 221
సన్యాసికి ఐదు నక్షత్రాల .............................
హెూటల్ అనుభవం ....................... 222
అత్తారి బార్డర్.................................... 222
స్వర్ణ దేవాలయం ప్రకృతిలో ..........................
నిజమైన బంగారం ......................... 224
పోయిన సామాను దొరికింది.........................
(మళ్లీ ఒకసారి)............................ 227

**హర్యానా... మొత్తం హరితం**
కురుక్షేత్రం ...................................... 230

**ఢిల్లీ**
సూపర్ 30 ..................................... 232

**ఉత్తరాఖండ్**
ఋషికేశ్ ....................................... 234
కన్వర్ వార్షిక తీర్థయాత్ర ....................... 234
ధారీ దేవి......................................... 236
గుప్త కాశీ ....................................... 237
త్రియుగి నారాయణ్ ............................ 237
కేదారనాథ్ ...................................... 239
బద్రీనాథ్ ........................................ 242
హరిద్వార్, మానసాదేవి ........................ 246
ఆర్టికల్ 370/35ఎ రద్దు ........................ 249

**ఢిల్లీ**
MP గారి ఇంటికి అతిథిగా .................... 251
భారత పార్లమెంటులో:.......................... 252
శ్రీమతి సుష్మా స్వరాజ్‌కి నివాళులు: ........... 254

**నేపాల్**
పశుపతినాథ్: .................................... 257

చైనా .............................................. 261

**టిబెట్**
దర్చన్/దర్శన్.................................... 263
నడక కర్ర మాయాజాలం ...................... 265
భక్తితో ఆరాటపడడం ........................... 266
అనారోగ్యమే కానీ దృఢత్వం.................... 268
మానస సరోవర్................................. 269
ఆనందంగా ఉండడం ఆశీర్వాదంగా.................
భావించాను ................................ 270
నా జీవితంలో చారిత్రాత్మక రోజు.............. 278

* * *

# భారత దర్శన్

## ఆత్మదర్శనాభిలాషతో...

**49వ పుట్టు పండుగరోజున భద్రాచలంలో దైవ ప్రేరణ :**

"నేను నీ దివ్య సంకల్పమును నిర్వర్తించే సేవకుడిని. అది వ్యక్తిగత హోదా కన్నా, ధనం కన్నా, ఖ్యాతి కన్నా ఎంతో పవిత్రమైనది. సురాతల... పాతాళ... భూతలములలో ఉన్న అన్నింటికన్నా మిన్నదైనదిగా దానిని ఎంచి ముందడుగు వేస్తున్నాను".

ఏప్రిల్ 6 2019న భద్రాచల శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దివ్య పాదపద్మముల చెంత అభిషేక సేవలో తరిస్తున్న నా హృదయంలో ఆయన ఇచ్చు మేరకు "భారత దర్శన్" దివ్య సంకల్పం జన్మించినది. నా భద్రాచల యాత్ర సఫల కారణమైన శ్రీ మోతుకూరి నారాయణ రావు మరియు సిఎస్ దేవకీ వాసుదేవ రావు, ఖమ్మం గార్లకు నా హృదయ పూర్వక కృతజ్ఞతలు.

వికారి నామ ఉగాది, మంగళకరమైన ఆ మొదటి రోజున నా '49'వ పుట్టు పండుగ కూడా కావడం యాదృచ్ఛికం కాదు. గర్భగుడిలో స్వామివారి దివ్య మంగళ మూర్తులకు వేద పండితులు గావిస్తున్న అభిషేక దృశ్యమునకు సాక్షీ భూతుడై ఉన్న నేను, మిగిలిన నా జీవితానికి శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దివ్య ఆశీస్సులు అర్థిస్తూ... దిశానిర్దేశం చేయమని ప్రార్థిస్తూ... నా మనసులో గట్టిగా వెక్కి వెక్కి ఏడుస్తున్నా. సరిగ్గా ఆ సమయంలో నాకు 'భారత దర్శన్' ప్రేరణ అందినది. ఎప్పుడు? ఎలా? లాంటి ప్రశ్నల పరంపరను పక్కకు పెట్టి, నన్ను నేను అడగకుండానే, ఏ మాత్రం సందేహం లేకుండానే ఆ అంతర్యామి దైవీ భావనలతో నిండిపోయిన నా హృదయం అలౌకికానందముతో పొంగి పొరలుతుండగా.. భారత దర్శనము చేయడానికి నిర్ణయించుకున్నాను.

**దివ్య సాకేతము:**

కానీ ఎలా వెళ్ళాలి అన్నది అర్థమే కాలేదు. చెప్పి వెళ్ళాలా లేక ఎవరికీ చెప్పకుండా వెళ్ళాలా అన్న సందిగ్ధముతో చాలా రోజులు అలా ఆలోచిస్తున్నాను. 9 రోజుల తరువాత కుమారి లీలావతి (అభయ సంస్థ ద్వారా చదువుకుని స్థిరపడిన అమ్మాయి) అడిగిన కారణం చేత ఏప్రిల్ 14, 2019 శ్రీరామనవమి పర్వదినం రోజున హైదరాబాద్ దగ్గరలో ఉన్న ముచ్చింతల్ గ్రామంలోని దివ్య సాకేతంలో జరిగిన శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దివ్య కల్యాణము మరియు స్వామివారి సామ్రాజ్య పట్టాభిషేకం వేడుకలను చూసేందుకు వెళ్ళాను. శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారి దివ్య చరణములకు భారత దర్శన సంకల్పం, దానికి కావలసిన విధి, విధానాలను, సన్యాస దీక్ష గురించి (కొన్ని నెలల ముందు నాకు వచ్చిన కలని ప్రస్తావిస్తూ), అభయ ఫౌండేషన్ (www.abhayafoundation.org) మొదలగు వాటి మీద వారి దిశా నిర్దేశం అర్థిస్తూ మెయిల్ పంపాను. ఆయన ఎంతో దయతో ప్రత్యుత్తరం ఇచ్చారు. "జై శ్రీమన్నారాయణ! మీరిప్పుడు సన్యాసే కదా.. కాకపోతే తెల్ల దుస్తుల్లో ఉంటారు." కానీ వారు భారత దర్శన్ గురించి ఏమీ మాట్లాడనే లేదు.

**ఇంద్రకీలాద్రి:**

శ్రీ చిన్నజీయ్యర్ స్వామి వారి మంగళాశాసనములు... పవిత్రమైన స్పందనతో నాలో ఉత్సాహం పెల్లుబికింది. ఏది ఏమైనప్పటికీ భారత దర్శనము మరియు మిగతా విషయాలలో నాకు స్పష్టమైన సమాధానం లభించలేదు. మరో మూడు రోజుల తర్వాత, బి.వి. ప్రసాద్ గారితో కలిసి విజయవాడలో ఇంద్రకీలాద్రి పైన కొలువై ఉన్న కనకదుర్గమ్మ దర్శనం చేసుకునే అవకాశం కలిగింది. అమ్మని నాకు భారత దర్శన మార్గాన్ని చూపమని మరియు నా స్నేహితుడికి, వారి కుటుంబానికి ఆశీస్సులు ఇవ్వమని కోరుకున్నాను. హైదరాబాద్‌కు వెనుతిరిగి వచ్చాను.

**శ్రీ చిన్న జీయర్ స్వామి:**

అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడపబడే "ఆనంద నిలయానికి" వెళ్ళే

మార్గంలో ఉన్నాను, ఏప్రిల్ 20, 2019. ఇంతలో ఆత్మీయుడు మిత్రుడు దేవకి వాసుదేవరావు గారు, మరియు జనరల్ ఎలక్షన్స్‌లో ఆయనకు చేదోడు వాదోడుగా ఉన్న మిత్ర బృందంతో శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ వారిని దర్శించుకుంటున్నాము. నన్ను కూడా వారితో చేరి రమ్మని ఆ సమాచార సారాంశం. ఎంతో ఆనందంగా నేను మధ్యాహ్నం వారితో చేరి దివ్య సాకేతమునకు వెళ్ళాను. శ్రీ చిన్నజీయ్యర్ స్వామి వారు ఎంతో ప్రత్యేకముగా నాతో ముచ్చటించి "భారత దర్శన్" సంకల్పము చాలా పవిత్రమైనది అని సెలవిస్తూ, తమ దివ్య ఆశీస్సులను అందిస్తూ... అభయ ఉద్భవ కారణాలని, మానవతా విలువల్ని మరియు మానవ జీవితం యొక్క లక్ష్యాన్ని ఈ యాత్రలో ప్రకటించమని "తదేవ లగ్నం, సుదినం తదేవ తారా బలం చంద్ర బలం" అంటూ నన్ను పవిత్ర మాలాలంకృతుడిని చేసి ప్రసాద వితరణ చేస్తూ వైశాఖ దశమి (ఏప్రిల్ 14, 2019)న భారత దర్శన్ ముహూర్తాన్ని నిర్ణయించారు.

**పావగడలో మార్గాన్ని సూచించిన శీతలాంబా మాత:**

ఏప్రిల్ 21, 2019 రోజున కుమారి లీలావతితో ఆమె పెళ్ళి సంబంధం గురించి మాట్లాడటానికి కర్ణాటక రాష్ట్రంలో వున్న గ్రామానికి వెళ్ళి వచ్చేటప్పుడు మార్గ మధ్యములో పావగడ క్షేత్రంలో కొలువై ఉన్న "శీతలాంబా మాత" అమ్మవారిని దర్శించుకున్నాను. నాలుగు వందల ఏళ్ళ చరిత్ర ఉన్న అమ్మవారి స్థానం అది. భయంకర కరువు కాటకాలతో అల్లాడుతున్న ఆ ప్రాంత ప్రజలని రక్షించడానికి ఒకానొక సిద్ధుడు 3 రోజుల పాటు ధ్యానంలో ఉండి వారికి సిద్ధించిన 72 బీజాక్షరాలను 6 అడుగుల పొడవు గల రాతి బండ మీద చెక్కి అమ్మవారి చల్లని చూపులు అందరిమీద ప్రసరించాలని ఆ శీతలాంబా మాతను శిలలో అవాహనము చేసి, దివ్య శక్తిని ప్రతిష్టించారు. ఆ అమ్మవారి గురించి అడిగినప్పుడు అక్కడున్న పూజారి నన్ను ప్రాకారం లేకుండా, బయలు ప్రదేశంలో కొలువై ఉన్న ఆ తల్లి సమీపంలోకి నా చేతులు పట్టుకొని తీసుకెళ్ళారు. రోమాంచితుడనయ్యాను! అమ్మ వారికి అలంకరించిన వస్త్రములు తొలగించి చూపారు. అప్పుడు అర్థం అయింది. అక్కడున్నది ఆ 6 అడుగుల శిలయే అని దిగ్భ్రమాశ్చర్యములతో అమ్మను ఆలింగనం చేసుకుని చెప్పాను. "తల్లీ, భారతదేశ

సౌభాగ్య, సౌజన్య, సౌశీల్యముల కోసం భారత దర్శన్ సంకల్పం చేసాను! దారి చూపు తల్లీ, మళ్ళీ మీ దర్శనం చేసుకుంటాను.” ఆ క్షణాల్లోనే అక్కడ మరో దివ్యవాణి నాకు వినబడింది. “ఏయ్! శంకరాచార్యుల దిగ్విజయ మార్గంలో వెళ్ళు...” అని.

నా ఆనందానికి అవధులే లేకుండా పోయాయి. ఇక ఆలస్యం చేయొద్దు అనుకున్నాను. నా కూడా వచ్చిన లీలావతి బృందాన్ని తిరిగి హైదరాబాద్‌కు వెళ్ళమని చెప్పేసి పావగడ నుండి సుమారు 5 గంటలు ప్రయాణం చేసి బెంగుళూరుకు చేరుకున్నాను. బస్సులో చివరి సీటులో కూర్చుని వినీలాకాశంలోకి తొంగిచూస్తూ పక్షము రోజులుగా జీవితంలో చోటు చేసుకుంటున్న విషయాల గురించి ఆలోచిస్తూ చేతిలో ఉన్న మొబైల్లో శంకర భగవత్ పాదుల వారి దిగ్విజయ మార్గం దొరుకుతుందేమో అన్న ఆశతో చూస్తున్నాను. చాలా అలవోకగా కంచి కామకోటి పీఠం వారు ప్రచురించిన శంకర దిగ్విజయ యాత్ర మార్గము చిత్రపటం మరియు వారు దర్శించిన క్షేత్రాల పట్టిక కనిపించింది. ఏదో తపస్సు ఫలించి దైవ సాక్షాత్కారం పొందిన అనుభూతి కలిగింది.

**బెంగుళూరులో తల్లిదండ్రుల దర్శనం :**

భగవత్ అనుగ్రహ ప్రేరణ, ఆ భద్రాచల రాముని దివ్య సన్నిధిలో జరిగిన తర్వాత, నా ఇష్టదైవమైన శ్రీ సత్యసాయి బాబా అనంతమైన ప్రేమను తలచుకుంటూ, శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారి పవిత్ర ఆశీస్సులతో, నా తల్లిదండ్రులు, గురువు శ్రీమతి జ్యోతి మరియు అభయ ధర్మకర్తలందరి అనుజ్ఞను తీసుకుని, భారత పుణ్య భూమిలో ‘49’ వసంతాలు పూర్తి చేసుకున్న ఈ దేహాన్ని, ప్రేమ, దయ మరియు అభయ విలువల వ్యాప్తికై నడిపించడం మొదలుపెట్టాను.

భారత దేశంలోని అన్ని ప్రాంతాలలోని క్షేత్రాలను దర్శించే ప్రణాళికతో... కేరళ రాష్ట్రంలోని శ్రీ ఆది శంకరాచార్యుల వారి జన్మస్థలమైన కాలడి నుండి మే 14, 2019 నాడు భారత దర్శనాన్ని ప్రారంభించాను.

**అభయతో పుష్కర కాల ప్రయాణం :**

12 వసంతాలు (పుష్కర) అభయ సంస్థ తోటి నా ప్రయాణం, దేశంకోసం నన్ను నేను స్వార్థరహితంగా ఎలా అర్పితం చేసుకోవాలో నేర్పింది. సంపూర్ణ జీవితాభివృద్ధి కోసం నేర్చుకోవడం, నేర్చుకున్నది వదిలేయడం, మళ్ళీమళ్ళీ కొత్త పాఠాలు నేర్చుకోవడం లాంటి వాటి కోసం నాలో ఉన్న మరో వ్యక్తి కోసం ఆత్మాన్వేషణ మొదలు పెట్టాను. వీటికి సమాధానం లాగా భారత దర్శన సంకల్పం జరిగిందని నా ప్రగాఢ విశ్వాసం. పెద్దల సలహా మేరకు ఈ ప్రయాణంలో ఎంత మంది వీలైతే అంతమంది సత్యాన్వేషకులను కలవాలని నిర్ణయించు కున్నాను. అభయ జాతీయ మార్గదర్శన్ మండలి సభ్యులను, అభయ కార్యవర్గ సభ్యులను, నిర్వాహకులను, ధర్మకర్తలందరితో సమావేశం అయి నా పరోక్షంలో అభయ సంస్థను H.E.A.R.T తో ముందుకు తీసుకొని వెళ్ళమని అర్థించాను. వారెంతో ప్రేమతో దయతో అంగీకరించారు. అంతే కాక అందరూ నన్ను ఉత్సాహపరిచి తోచినంత ధనసహాయం కూడా చేసినారు. ఇక అందరికీ భారత దర్శన్ సంకల్పాన్ని వివరిస్తూ విషయాన్ని తెలియపరిచాను.

**భారత దర్శనానికి ఆశీస్సులు :**

"నీకు వచ్చిన ఆశీస్సులను లెక్కపెట్టుకోకు. వేరొకరు లెక్కపెట్టుకొనే ఆశీర్వచనం నువ్వు అవ్వు". వికారినామ ఉగాది పర్వదినం రోజు (6-4-2019) భారత దర్శన్ కాంక్ష నాలో మొదలయ్యాక నా జీవితంలో ఎన్నో విషయాలు జరిగాయి. ముందుగా నేను కలియుగ దైవము తిరుమల వేంకటేశ్వర స్వామి, ఇంటి దైవము ఆలూరు కోనరంగనాథ స్వామి, ఇష్టదైవం భగవాన్ శ్రీ సత్యసాయి బాబా, పుట్టపర్తి, ప్రశాంతి నిలయం, ప్రత్యక్ష దైవములు బెంగుళూరులో ఉన్న నా తల్లిదండ్రులను దర్శించి "భారత దర్శన్" కై ఆశీస్సులు తీసుకోవాలని నిర్ణయించుకున్నాను.

**త్యాగమే నిజ జీవిత పరమావధి :**

CA బి.వి. ప్రసాద్ గారికి ప్రయాణ ఏర్పాట్లు చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుకున్నాను. శ్రీవారి మెట్టు మార్గంలో కాలినడకన తిరుమల చేరుకొని

నాలో ఉన్న అహాన్ని, వ్యతిరేక ఆలోచనలు నశింపచేయమని స్వామి వారిని ప్రార్థిస్తూ శిరోముండనం చేయించుకున్నాను. గత 8 సంవత్సరముల నుండి ఇదే విధంగా నేను ఎక్కడున్నా ఇలాంటి భావనతోనే శిరోముండనం చేసుకుంటున్నాను. స్వామివారిని చూడటానికి సర్వదర్శనం మార్గంలో నిల్చున్నాను, సాంప్రదాయేతర దుస్తుల్లో ఉన్న ఒక కుర్రవాడిని పోలీసులు అడ్డగించినప్పుడు అతను సహాయం కోసం అర్థిస్తుండగా చూసి నా భుజం మీద వేసుకున్న కండువాని ఇచ్చాను. ఎందుకంటే అక్కడ గంటల తరబడి నిల్చుంటూ, నడుస్తున్నప్పుడు భగవత్ దర్శనానికి ముందు ఈ రకంగా ఆపివేయబడటం ఎంత కష్టమో అర్థం చేసుకొన్న వాడిని కాబట్టి, నేను ఇచ్చిన కండువాను ధరించి, భగవత్ దర్శనానికి ముందుకు కదులుతున్న తన కళ్ళల్లో నాకెంతో ఆనందం కనిపించింది.

ముందుగా అనుకున్నట్లుగానే నేను తాడిపత్రి, ఆలూరు కోనలో కొలువై ఉన్న నా ఇంటి దైవం, కుటుంబంలోని వయోవృద్ధుల ఆశీస్సులు తీసుకోవడానికి వెళ్ళాను. మే 5, 2019 నాడు తాడిపత్రి చేరుకున్నాను. అన్నయ్య కుమారుడు శ్రీ సుంకు బాలమురళీకృష్ణ ఆలూరుకోన వెళ్ళడానికి వాహనం ఏర్పాటు చేశాడు. నేను బయలు దేరే ముందు నాకు ఒక కొత్త పంచెల చాపు ఇచ్చారు ఎంత వద్దన్నా కూడా. ఆశ్చర్యకరమైన సంగతి ఏంటంటే 'అది' నేను తిరుమల సర్వ దర్శన క్యూలో ఒకతని అవసరార్థం ఇచ్చిన కండువాయే అవ్వడం. ఈ విషయం నిజంగానే దేవుని ఆశీస్సులు అని అనిపించింది.

నా జీవితంలో మొట్టమొదటిసారిగా ఆలూరుకోనలో ఉన్న శ్రీరంగనాథునికి ప్రత్యేక అభిషేకం చేసుకొన్నాను పూర్వం దండకారణ్యంలో శ్రీరాముడు తాటకిని చంపినప్పుడు ఆమె శరీరం పత్రంలా పడిపోయిన స్థలమిది. కాలక్రమేణా తాటక పత్ర, తాడిపత్రిగా మారిపోయింది. విశ్వామిత్ర మహర్షి ఇక్కడే తపస్సు చేసారు మరియు శ్రీరంగనాథుని స్వయంభువుడిగా వెలసిన క్షేత్రమిది. ఆ తర్వాత అక్కడి రాజులు ఒక సుందరమైన గుడి నిర్మించారు. అభిషేక సమయంలో అక్కడి పూజారి నన్ను గోత్రనామాలు అడుగగా నేను, కాశీ గోత్రం, భారత దర్శన సంకల్ప సిద్ధర్థ్యం, సకల జన సంరక్షణార్థం, సర్వలోక సంక్షేమార్థం, ప్రార్థనాం కరిష్యామి అని చెప్పాను. దాని అర్థం ఈ సమస్త లోకాలు బాగుండాలని.

**హనుమంతులవారి ఆశీస్సులు :**

నేను పూజ తర్వాత అభిషేక ప్రసాదం తీసుకొని బయటకు అడుగుపెట్టిన మరుక్షణం ఒక పెద్ద వానరం నా చేతిలోని ప్రసాదాన్ని ఉంచిన సంచిని అలవోకగా తీసుకుని, అందులో డబ్బాలో ఉంచిన పంచామృతాన్ని జుర్రుకొని, అరటిపండు తిన్నప్పుడు! స్వామి వారు, వారి బంటునే నా భారత దర్శనానికి ఆశీస్సులుగా పంపించారని అనుకుని ఆనందించి ఆ వానరమునకు శిరము వంచి చేతులు జోడించి నమస్కరించాను.

**ఇంటి దైవమైన శ్రీరంగనాథునికి, శీతల యంత్రము :**

నేను గుడి బయటకు రాగానే, సుంకు కుటుంబంతో చిరపరచితులైన అక్కడి పూజారి నన్ను అంతరాలయానికి ఒక ఎ.సి. ఇవ్వమని అడిగారు. ఇది నేను అభయ ఫౌండేషన్ స్థాపకుడనని ఆయనకు తెలియక, అభయ ఫౌండేషన్ సభ్యులకు తెలియచేయమని అడిగిన కోరిక. నేనా కోరికతో సంభ్రమాశ్చర్యానందాలకు గురయ్యాను. భారత దర్శనానికి ముందు నా ఇంటి దైవానికి నేను చేయగలిగే గొప్ప సేవగా భావించి ఒక మూడు రోజులలో శీతల యంత్రము అందించగలమని చెప్పాను. పూజారి గారు ఆ గుడి పాలకమండలి తరపున ధన్యవాదాలు తెలుపుతూ అందరికీ మంచి జరగాలని ప్రార్థించారు.

**అవగాహనకు అతీతమైన అద్భుతవరాలు :**

భారత దర్శనానికి ముందుగా ఎంతోమంది శ్రేయోభిలాషులు మరియు అభయ కుటుంబ సభ్యుల ప్రేమ, సంరక్షణతో పాటుగా నా జీవితంలో ఉన్న మరెంతో మంది సహృదయులు, నా క్షేమాన్ని ఆకాంక్షించారు. ప్రేమించారు, సంరక్షించారు, కాపాడారు, మార్గదర్శనం చేసారు. నన్ను కార్యోన్ముఖుని గావించి స్ఫూర్తి నింపినారు. ఇంతకు మునుపు నేచేసిన తీర్థయాత్రలు అన్నీ కొద్ది గడువులోనే, కావల్సినంత సదుపాయాలతో నా జీతము వెచ్చించి చక్కగా ముగించేవిగా ఉండేవి. కానీ ఎప్పుడైతే నేను NCC గ్రూప్ కంపెనీ సెక్రటరీగా 2013లో పదవీ విరణ చేసి పూర్తిస్థాయి అభయ సామాజిక కార్యకర్తగా మారానో, అప్పటి నుంచి పరిమితమైన నిధులతో నడుస్తున్న నాకు వందల కొద్దీ ప్రజలు

సుమారు 6,00,000 లక్షల రూపాయల దాకా సేకరించి ఇచ్చారు.

అందులో వయోవృద్ధులు, గృహిణులు, పిల్లలు, విద్యార్థులు, ఉద్యోగులు, బంధువులు, స్నేహితులు, సహా ఉద్యోగులు మరియు అభయ ధర్మకర్తలు అందరూ చేయూతని ఇచ్చారు. భారత దర్శనానికి అందులో ప్రతి ఒక్కరి గురించి స్ఫూర్తి నిచ్చే కథని వ్రాయాల్సి ఉంటుంది. కానీ, కృతజ్ఞతలు మినహా నేను ఏమి ఇవ్వగలను? అభయ ఆశ్రమంలో ఉన్న వారి నుంచి, అభయ కార్యకర్తల నుంచి వచ్చిన ప్రేమ మరియు కృతజ్ఞతతో కూడిన చిన్న మొత్తాలు నా హృదయాన్ని నులి వెచ్చని ప్రేమతో నింపాయి. వారి నుంచి పొందిన ఆ ధన సహాయం నా హృదిని తేనెతో నింపినట్లుగా అనిపించింది.

అదే విధంగా నా భారత దర్శన్ యాత్రలో ఎంతో మంది తెలియని వారి నుంచి వచ్చిన ఆదరణ, సహాయం, ఈ యాత్ర దీర్ఘలక్ష్య సాధనకు దేవదేవుడు నన్ను నడిపిస్తాడు, కాపాడుతాడు, సహాయ పడుతాడు అన్న దానికి నిదర్శనం అని నేను అనుకుంటున్నాను.

### శ్రీ సత్యసాయిబాబా – నా స్ఫూర్తి ప్రదాత :

నా తదుపరి క్షేత్ర దర్శనం పుట్టపర్తి. నా ఇష్టదైవం, నా గురువు, నా మార్గదర్శి, నా రక్షకుడు అయిన భగవాన్ శ్రీ సత్యసాయి బాబాకి ప్రార్థనలు సమర్పించుకుని నా తల్లిదండ్రులను కలవడానికి బయలు దేరాను. నా తండ్రిగారు '83' ఏళ్ళ వయో వృద్ధుడు మంచానికే పరిమితమైన వారు. మా అమ్మగారు, ఒక సహాయకుని తోడుతో ఆయనకు సేవలు చేస్తున్నారు. నేను నా 'భారత దర్శనం' గురించి నాన్నగారికి తెలియపరచడానికి ప్రయత్నించినప్పుడు ఆయన అర్థం చేసుకున్నట్లుగా అనుమతిస్తున్నట్టుగా కనుసైగతో అంగీకారం తెలిపారు. అమ్మ నా కష్టతర ప్రయాణం గురించి భయాందోళనకు గురి అయినప్పటికీ తన ఆశీస్సులతో ప్రయాణానికి అనుమతి ఇచ్చారు.

### శ్రీ చిన్న జీయర్ స్వామి వారి ప్రసాదం :

మే 13, 2019 నా ప్రయాణ సన్నాహాలు శిఖర స్థాయిలో ఉన్నాయి. ఎంతోమంది శ్రేయోభిలాషులు మరియు పిల్లలు నాతో కలసి ఉన్నవారు

తోచినంత సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఆ సమయంలో ప్రశాంతి నిలయం నుంచి సునీల్ వైట్ల కుటుంబము దివ్య సాకేతంలో ఉన్న శ్రీ చిన్న జీయర్ స్వామివారి దర్శనం చేయించమని, తోడు రమ్మని అడిగారు. అది నా బాధ్యత కానప్పటికీ వారికి తోడుగా వెళ్ళడం సేవ అనుకున్నాను.

అంతేగాక స్వామీజీ వారిని కలవడానికి భారత దర్శనానికి ముందు వచ్చిన మరో అవకాశమని అనుకున్నాను. అనంతరం నేను, సునీల్ కుటుంబం, సినీ నటుడు టార్జాన్, ఆశ్రమంకు వెళ్ళాము. ఆశ్చర్యంగా స్వామి వారు మమ్ముల్నందరిని గదిలోకి ఆహ్వానించారు. స్వామీజీ నన్ను ఆశీర్వదించి ఆశ్రమంలో జరుగుతున్న లోకకళ్యాణ యజ్ఞంలో పాల్గొనమని ఆదేశించారు. నాకు అక్కడ కంకణ ధారణ చేయబడింది. భారత దర్శన్ సంకల్పం చేసాను. పూర్ణాహుతి అయింది. తీర్థ ప్రసాదాలు ముందు స్వామి వారికి ఆ తరువాత యజ్ఞశాలలో ఉన్న వందలాది మందికి అందించారు. స్వామివారు 3 సార్లు ఆరగించి తమ చేతిలో పెట్టుకున్న ప్రసాదం దొన్నెను అక్కడున్న వందల మందిలో నన్ను పిలిచి నా చేతిలో పెట్టి ఆశీర్వదించారు. అలాగే నా భారతసందర్శన ప్రణాళిక, లక్ష్యాన్ని గురించి అడిగారు. ఇట్టి ఆశీస్సులు అందుకోవడానికి కారకులైన, నా స్నేహితునికి కృతజ్ఞతలు తెలుపుకున్నాను.

# వైశాఖ దశమి నాడు భారత దర్శన యాత్రకై

భద్రాద్రి రాముడు భారత దర్శన సంకల్పమిచ్చాడు
దివ్యసాకేత రాముడు దానికి అక్షర రూపమిచ్చాడు.
శ్రీ చిన్న జీయర్ స్వామి వారు లగ్నము పెట్టినారు
శీతలాంబ దేవి మార్గము సుగమము చేసినది
తిరుమల కొండల్లో నడచి శ్రీనివాసుని చూసాను
కోన రంగనాథుడే తమ బంటును పంపినాడు
ప్రశాంతినిలయ మందు సాయి సన్నిధికి మ్రొక్కి
తల్లి తండ్రులతో యాత్రకు అనుమతిని గైకొని
బంధు మిత్రులందరి ప్రేమ బంధములు వేసుకుని
అభయ ధర్మకర్తలందరి సౌజన్యమరసినాను
వైశాఖ దశమి నాడు భారత దర్శన యాత్రకై
అభయులందరి అభయము కోరుతున్నాను...
కాసింత ప్రేమను అభయకు పంచమంటున్నాను
నేనున్న లేకున్న అభయ సేవలు ముందుకు సాగాలి
నన్ను నేను శోధించి, సాధించి, పరమార్ధ దర్శన కాంక్షతో
భారత దర్శన్‌కు బయలుదేరాను నేడు
దేవుడి ఆశీస్సులకై హృత్ పూర్వక ప్రార్థనలతో

ప్రేమతో... మీ
**బాలచంద్ర**

# హృదయ పూర్వక ప్రార్థనలు

భగవద్ అనుగ్రహ ప్రేరణతో... సర్వజన హితం కోసమై... జీవిత పరమావధిని వెతుక్కుంటూ... అందరికి దైవానుగ్రహం ఆర్థిస్తూ... సర్వలోక సంక్షేమార్థమై... భారత దర్శన్ యాత్ర సంకల్పం చేసాను.

దేవుడిచ్చిన సంకల్పముతో... తల్లితండ్రులు, బంధుమిత్రులు, గురువుల ప్రేమానురాగములు మరియు అభయ పెద్దల ఆశీస్సులు తీసుకుని, 49 వసంతాలు నిండిన ఈ దేహం చేయాల్సిన పనేదైనా మిగిలిందేమో వెతుకుదాం అన్న భావనతో...

వైశాఖ మాస దశమి నాడు (మే 14, 2019) బయలుదేరి భారతదర్శనం చేయాలని వెళుతున్నాను. ఇందు కోసమై, శ్రీ శంకర భగవద్ పాదుల వారు చేసిన భారత దిగ్విజయ మార్గమును ఎంచుకున్నాను. వారి జన్మ స్థలమైన కాలడి నుండి ప్రయాణం ప్రారంభం అవుతుంది.

యాత్ర చేసే సమయంలో నేను అరుదుగా మీకు అందుబాటులో వుండొచ్చు. అవసరం వుంటే మధ్యలో వచ్చి పనులు చూసుకుని మళ్ళీ భారతయాత్ర చేసే విధంగా కల్పన చేస్తున్నాను. నేను ఏమి చేసినా, ఎక్కడున్నా మీ అందరి ప్రేమ మరియు ప్రార్థనలు నాకు తోడు నిలచి ముందుకు నడిపిస్తాయి అని మీరు గ్రహించండి.

దైవానుగ్రహం వుంటే మళ్ళీ అందరిని కలిసి... నా అనుభవ పాఠాలను మీకు నివేదిస్తాను. శుభం భూయాత్. సమస్తలోకా సుఖినోభవంతు.

ప్రేమానురాగములతో మీ

**బాలచంద్ర**

# కేరళ - దేవుడి సొంత భూమి

**వెయ్యి మైళ్ళ ప్రయాణమైనా ఒక్క అడుగుతోనే ప్రారంభమవుతుంది**

ఆ భగవంతుని ఆశీస్సులతో... శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి వారే స్వయంగా పెట్టిన ముహూర్తము నాడు (వైశాఖ దశమి, 14 మే 2019 రోజు) సత్యాన్వేషణలో భాగ్యనగరం నుండి వందలకొద్దీ శ్రేయోభిలాషుల, ప్రియమైన వారి ప్రేమ, సహాయ సహకారాలతో భారత దర్శన్‌కు బయలుదేరాను. సి.ఎస్. కిరణ్ కుమార్ గుప్త, సి.ఎస్. బాగా రెడ్డి, డా. కె. సాయిలత, ఎస్. లీలావతి, ఎస్. విశ్వనాథ రెడ్డి మరియు ఎ. శివకుమార్ రెడ్డి మొదలగు వారు వ్యక్తిగతముగా వచ్చి రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద వీడ్కోలు పలుకగా హైదరాబాద్ నుండి కేరళకు బయలుదేరాను.

**కాలడి:**

సుమారు రెండు గంటల ప్రయాణం తరవాత కేరళలోని కాలడి చేరుకున్నాను. నా అభ్యర్థన పై శృంగేరి శంకరాచార్య మఠంలో జగద్గురు విదు శేఖర భారతి స్వామి వారి పేర వసతి గృహంలో నా బస ఏర్పాటయింది. ఈ అద్భుత స్థలం జగద్గురు ఆది శంకరాచార్యుల వారు తన అద్వైత సిద్ధాంతాల ద్వారా మన భారత ప్రజలను ఉద్ధరించిన తీరుని మనకు గుర్తుకు తెస్తుంది.

కాలడి శ్రీ శంకరాచార్యులవారు జన్మించిన పుణ్య స్థలం. ఎనిమిది సంవత్సరాల చిరు ప్రాయంలోనే నాలుగు వేదములను నేర్చుకొని, 16 ఏళ్ళ వయస్సులోనే బ్రహ్మసూత్రములని విశదీకరించి, 32 ఏళ్ళ వయస్సులోనే మోక్షాన్ని పొందిన కారణ జన్ముడు... మహానుభావుడు ఆయన. ఆయన జన్మ స్థలములో, ఆయన జీవితానికి, వారి సన్యాస దీక్షకి కారణమైన వారి తల్లిదండ్రులు ఆర్యాంబ శివగురువులకు మరియు వారి కుల దైవమైన శ్రీ కృష్ణునికి శరణు వేడుకున్నాను.

సాక్షీ భూతంగా నిలిచిన పూర్ణా నదిని దర్శించాను. ఆయన అసలు ఆయుర్దాయము 16 సంవత్సరాలు అయినప్పటికీ, వేద వ్యాసుల వారు వీరిని మరొక 16 సంవత్సరములు జీవించమని ఆశీస్సులు అందించారు.

నేను శంకరా చార్యుల వారి విజయ స్తూపము (దీనినే కీర్తి స్తంభము అని కూడా అంటారు)ను దర్శించాను. ఇచ్చట ఎత్తైన స్తూపము లోపల దిగువ నుంచి పై వరకు శంకరాచార్యుల వారి జీవిత చరిత్ర పూర్తిగా చిత్రాలతో ఏర్పాటు చేయబడి ఉన్నది. నేను బ్రహ్మచారిగా నా జీవితమును కొనసాగించుట వెనుక అతి చిన్న వయసులో నన్ను ప్రభావితుని చేసింది శంకరులే అని చెప్పక తప్పదు. అంతేగాక శంకరుల యొక్క పాండిత్యము, బాల్యంలోనే సన్యాసము ద్వారా ఆధ్యాత్మిక మార్గము నెంచుకొనుట, వారి కనకధారా స్తోత్రం, భజగోవిందం స్తోత్రం, అద్వైత సిద్ధాంతము, భారత దిగ్విజయం (4 పర్యాయములు అఖండ భారత యాత్ర చేయుట), దేశము 4 దిక్కులలో, 4 పీఠముల స్థాపన తదితర అంశాలు నన్నెంతో ప్రభావితము చేసాయి.

నా చిన్నతనంలో నేను శంకరాచార్యుల వారి లాగా దుస్తులు ధరించి భజగోవిందం స్తోత్రం పాడటం నాకు ఇంకా గుర్తు ఉన్నది. నాపై శంకరుల ప్రభావం అంత ఎక్కువగా ఉన్నది. నిజానికి ఇటువంటి గురువుల మూలంగానే మన దేశంలో హిందూ మతం ఇంకా సజీవంగా ఉంది. ప్రతి ఒక్కరూ కూడా వారి యొక్క బోధలను, వేదాంతములను అర్థం చేసుకుంటే వారి జీవితం అర్థవంతం అవుతుంది. కేరళను 'దైవ భూమి' అని అంటారు. అవును, నిజమే అని మనకు ఆ సుందర రాష్ట్రాన్ని పర్యటించినప్పుడు మాత్రమే తెలుస్తుంది. నాకు అటు వంటి సుందర ప్రదేశంలో గల వివిధ స్థలములను చూసే అదృష్టం కలిగింది.

## గురువాయూర్:

ఈ పవిత్ర ప్రదేశమును 'భూలోక వైకుంఠము' గా పిలుస్తారు. సూతపన్ దంపతులు సంతానము కొరకు తపస్సు చేయగా, శ్రీ మహా విష్ణువు ఆయన స్వయంగా బ్రహ్మను పూజించి పొందిన విగ్రహమును వారికి ప్రసాదించి, పూజించమని ఆజ్ఞాపించెను. శ్రీ మహా విష్ణువు వారికి మూడు యుగములలో,

మూడు జన్మలు పొందునట్లు అనుగ్రహించెను. ప్రశ్నీ గర్భంలో మొదటి జన్మ కృతయుగంలో, రెండవ జన్మలో వామనుడిగా, మరియు మూడవ జన్మ ద్వాపర యుగములో శ్రీ కృష్ణుడిగా జన్మించినట్లు గా వరము ఇచ్చెను.

**నవముక్త కుండములు:**

ఈ ప్రదేశంలో 9 మంది యోగులు, 9 విష్ణు విగ్రహాలను ప్రతిష్టించారు. అయితే కాలక్రమంలో వాటిల్లోని 8 విగ్రహాలు భూమిలోనికి వెళ్లిపోయాయి. ఆదిశంకరులు ఆ గుడికి వచ్చినప్పుడు ఈ విషయము తెలుసుకొని మోకాళ్లపై ప్రదక్షిణము చేసారు. ఇది చూసి అక్కడున్న ఇతర భక్తులు ఆయనను గెలిచేస్తు నవ్వగా, అప్పుడు శ్రీ మహాలక్ష్మి అమ్మ, వారికి బుద్ధి చెప్పడానికి తన చేతులను తలక్రిందులుగా చేసుకొన్నది. నేటికీ ఆ విగ్రహము ఆ విధంగా ఉండటం మనం చూడవచ్చును.

శ్రీ కృష్ణుడు అవతారము సమాప్తి చేయునప్పుడు, ఉద్ధవుని పిలిచి తన విగ్రహమును భద్రపరిచి, మానవాళి దర్శనార్థం ప్రపంచములోని పవిత్ర స్థలంలో ప్రతిష్ట చేయమని తెలిపెను. ఉద్ధవుడు, దేవ గురువు బృహస్పతిని, వాయుదేవున్ని ఈ విషయంలో సహాయము అడిగెను. వారు ముగ్గురూ కలిసి మహాశివుడు తపస్సు చేయుచున్న రుద్ర తీర్థమను సుందర ప్రదేశమును కనుగొని వెళ్ళిరి. వారిని చూచిన శివుడు వారితో కృష్ణ విగ్రహమును అక్కడ ప్రతిష్టించమని తెలిపి, తాను మరొక సమీప ప్రదేశమునకు (మహమాయూర్) తరలెను.

అప్పుడు, గురువు, వాయువు కలిసి ఆ విగ్రహమును అక్కడ ప్రతిష్టించుటచే, ఆ ప్రదేశము 'గురువాయూర్' గా పిలువబడి, నేడు లక్షలాది భక్తులచే పూజింప బడుచున్నది. గురువాయూర్ అప్పన్ కోవెల కాలక్రమంలో అనేక పరీక్షలకు తట్టుకొని నిలిచింది. మళ్ళీ కలియుగములో ఆదిశంకరులు ఆకాశ మార్గంలో శృంగేరికి వెళుతూ గురువాయూర్ దేవాలయము వద్దకు చేరినప్పుడు విష్ణు మాయ చేత ఆపివేయ బడగా చూసి, అక్కడ దిగి ఆ దేవున్ని పూజించి వెడలెను. నేటికిని ఆయన అక్కడకు పయనించిన గుర్తుగా ఆదిశంకరుల వారు ఆలయ పై భాగములో దిగిన ప్రదేశంలో కప్పు లేకుండా చేపట్టిన నిర్మాణం కలదు.

నేను దర్శనమునకు ఆలయములో ప్రవేశించు సమయానికి నైవేద్య నివేదన

జరుగుతున్నది. చాలా జనసమర్ధము ఉన్నది. ఆలయము నందు ఉన్న రెండు గంటల కాలములో అచ్చట గోడలపై గల శిల్పములు, పై కప్పు నందు కల శిల్పములు, గోపురము నందు కల శిల్పసంపదను చూస్తూ గడిపాను. తరువాత, వెంటనే స్వామి పవిత్ర దర్శనం చేసుకున్నాను.

## 108 వైష్ణవ దివ్య దేశములు:

వైష్ణవ దివ్య దేశములు అనగా ఆళ్వారులచే పాశురములో కీర్తించబడి ప్రబంధములను గ్రంథములలో పేర్కొనబడిన 108 వైష్ణవ ఆలయములు. దివ్య అనగా పవిత్రము, దేశము అనగా ఆలయం. ఈ 108 దివ్య దేశములలో 105 మన దేశంలోనూ, ఒకటి నేపాల్ దేశములో, మిగిలిన 2 భూమికి ఆవల ఉన్నవి.

మన భారత దేశంలో ఈ దివ్య దేశములు తమిళనాడులో 85, కేరళలో 11, ఆంధ్రప్రదేశ్‌లో 2, గుజరాత్‌లో 1, ఉత్తరప్రదేశ్‌లో 4, ఉత్తరాఖండ్‌లో 3 కలవు. ముక్తినాధ్ నేపాల్ దేశములో ఉంది. చివరి రెండింటిలో ఒకటి తిరు పాలకడల్ అంటే పాలసముద్రం. రెండవది పరమపదం అనగా సాక్షాత్తు విష్ణుమూర్తి నివాసమైన వైకుంఠం.

ఈ వైష్ణవ దివ్య దేశములు అన్నీ 12 గురు ఆళ్వారులచే వ్రాయబడిన 4000 పాశురాలలో పేర్కొన బడినవి. అందుచేత నేను మొత్తం 108 దివ్య దేశములలో ఈ భూమి పై గల 106 దివ్య దేశములు దర్శించాలని నా ఈ భారత దర్శన యాత్రలో తలపెట్టాను.

నేను దర్శించిన క్షేత్రముల సంక్షిప్త వివరాలు.

1) తిరుమూకుడై (వుయ్యనంద పెరుమాళ్)
2) తిరు వన్నాయ (నవ ముకుంద పెరుమాళ్)
3) తిరుమూజ కలం (లక్ష్మణ పెరుమాళ్)

నేను అందరికంటే చివరిగా 8:00 (రాత్రి) గంటలకు దర్శనముకు వెళ్ళినప్పుడు; అచట అర్చకులు నా కోసమే వేచి చూస్తూ, నేను దర్శనం చేసుకున్న తరువాత తలుపులు మూసేశారు. భగవంతుడు నా మీద దయ చూపుట చేతనే, నేను అలా ఆ రోజు దర్శించుకోగలిగానని నా విశ్వాసం.

**ఇతర దర్శనీయ స్థలాలు:**

పునతూర్ కోట (గురువాయూర్ గజశాల), మమ్మియుర్ శివాలయం, పార్థ సారథి కోవెల (రథ ఆలయం), చాముండేశ్వరి ఆలయం మరియు వేంకటాచలపతి కోవెల (కేరళ తిరుపతి).

**నదులు/ సముద్రములు:**

భరతా నది, పూర్ణా నది మరియు చవక్కాద్ సముద్ర తీరం చూసాను.

మే 16, 2019

**కాలడి తరువాత నేను దర్శించిన మరికొన్ని దర్శనీయ క్షేత్రములు.**

**108 వైష్ణవ దేశములు:**

1) తిరుకాక్కర్ (వామనమూర్తి పెరుమాళ్)
2) తిరుకొడితనం (అద్భుత నారాయణ పెరుమాళ్) సహదేవ ప్రతిష్ఠ
3) తిరువెళ్ళ (శ్రీ వల్లభ నాథన్ పెరుమాళ్)
4) తిరువాన వందూర్ (శ్రీ సాంబ నాయినప్పా పెరుమాళ్) నకుల ప్రతిష్ఠ
5) తిరుచిత్తరు (ఇమాయ వరప్పా పెరుమాళ్) యుధిష్ఠిర ప్రతిష్ఠ
6) తిరుపు వియ్యూర్ (మాయాపిరాన్) భీమ ప్రతిష్ఠ
7) అరముల (పార్థ సారథి) అర్జున ప్రతిష్ఠ తిరువరన్ విల్లయ్

కేరళ పర్యటనలో నేను వైష్ణవ దివ్య దేశములు దర్శించిన సమయంలో కొన్ని అతి ముఖ్యమైన విషయాలు గమనించదగినవిగా అనిపించి ఇక్కడ ప్రస్తావిస్తున్నాను:

1) ప్రతి ఆలయం శ్రీ మహా విష్ణువు లేక భాగవతంతో ముడిపడి ఉన్నది.
2) ఈ ఆలయాలన్నీ 5000 సంవత్సరాల పూర్వము నిర్మించబడినవి.
3) ఆలయంలోని స్వామిమూర్తి మానవాళికి ఒక అద్భుత సందేశం అందిస్తున్నట్లుగా ఉంటుంది.
4) ఆళ్వారుల ఈ ఆలయంలో, మూర్తుల గురించి వారి పాశురములలో రచించినారు.
5) ప్రతి ఆలయం విశ్వకర్మ స్థపతి శైలిలో అద్భుత శిల్ప సంపదతో పూర్తిగా

కలపతో నిర్మించబడి ఉన్నది.

6) ప్రతి ఆలయం చాలా సువిశాల ప్రదేశంలో ఉండి చూపులకు కనువిందు చేయుచున్నది.

7) మూల విరాట్టు విగ్రహము గర్భ గుడిలో తైల దీపముల కాంతితో, పవిత్రముగా, సుందరముగా కనిపిస్తుంది.

8) ప్రతి ఆలయం ఉదయం 5:00 గంటల నుండి 11:30 వరకూ మరియు సాయంత్రము 5:00 గంటల నుండి రాత్రి 8:00 గంటల వరకూ మాత్రమే తెరిచి ఉంటుంది.

9) వివిధ ప్రదేశములలో విస్తరించి వున్న ఆలయముల చుట్టూ మానవ జీవనము, నాగరికత అభివృద్ధి చెంది ఉన్నది.

10) ఈ రోజు నేను దర్శించిన దేవుళ్ళు అందరూ పాండవుల చేత ప్రతిష్టింపబడినవారు.

11) ఈ రోజు నేను దర్శించిన అందరి దేవుళ్ళలోనూ శ్రీ వల్లభ పెరుమాళ్ విగ్రహం అత్యంత సుందరంగా ఉన్నది.

తరువాత ఎడపిల్లై ఆర్యా జార్జ్ చర్చ్‌ని చూసాను. తరువాత శంకరా చార్యుల వారు కర్ణాటక లోని కొడతాచల పర్వతముల నుంచి తెచ్చిన భగవతి అమ్మవారు వేంచేసిన దేవాలయాన్ని దర్శించాను.

**శబరిమల, ఒక పవిత్ర గమ్యం:**

నాకు వసతి మరియు దర్శనమునకు మంచి ఏర్పాట్లు చేసిన శ్రీ కృష్ణతేజ ఐఏఎస్ గారికి నా ధన్యవాదములు తెలిపాను. నేను పంబా నది, వాజర్ మసీదు, ఎరుమలయి మరియు శబరిమల ను దర్శించాను.

నేను రాత్రి 9:00 గంటలకు చేరుకున్న ప్రదేశము నెలక్కల్. ప్రభుత్వ రవాణా బస్సులో మాత్రమే అక్కడి నుండి పంబా ప్రాంతం వద్దకు ప్రయాణించాలి. పంబ వద్ద ప్రవహించే శబరి నదిలో పవిత్ర స్నానం చేశాక, శబరిమల చేరడానికి అక్కడ నుంచి 7 కిలోమీటర్లు నడవాలి. నేను నది స్నానం చేయలేక పోయినా, 7 కిలోమీటర్ల నడకలో నా శరీరం స్నానం చేసినట్లు గానే అయింది. నాకు శబరిమల చేరడానికి సుమారు 2 గంటల సమయం పట్టింది. ఆ సమయమంతా

కూడా నేను "సమస్త లోకా సుఖినో భవంతు" అనే మంత్రాన్ని పఠిస్తూ మనసులోకి ఏ ఇతర ఆలోచనను రానివ్వక, నడక వలన కొంచెం శరీర శ్రమ కలిగినప్పటికీ అలాగే ముందుకు సాగాను.

## మే 17, 2019

శబరిమల, కోట్లాది భారతీయులకు ఒక అద్భుతమైన ఆధ్యాత్మిక గమ్యస్థానం. నేను ఇంతకు ముందే శబరిమల క్షేత్రాన్ని దర్శించే అదృష్టాన్ని పొంది ఉన్నప్పటికీ ఈసారి నా భారత దర్శన యాత్రలో భాగంగా ఇక్కడికి వచ్చుట చేత ఈ దర్శనము నాకు ప్రత్యేకమైనది. సుమారు తెల్ల వారు ఝామున నాకు దేవస్థానమునకు ఎదురుగా కల ఎక్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ గారి క్యాంపు కార్యాలయంలో విశ్రాంతి తీసుకొనే అవకాశం లభించింది.

ఉదయం 5:00 గంటలకు వినిపించిన అయ్యప్ప స్వామి సుప్రభాతంతో నేను నా 4 గంటల నిద్ర నుండి మేల్కొన్నాను. అయ్యప్ప స్వామి దర్శనానికి తరలి వచ్చిన భక్త జన సంద్రాన్ని నేను అప్పుడు ఆశ్చర్యంగా చూసాను. ఒక అధికారి నన్ను ప్రత్యేక దర్శన ద్వారం నుండి లోపలికి పంపినారు. నేను దైవ సన్నిధానంలో ఒక గంటపైగా గడిపే అదృష్టాన్ని పొందాను. నేను అభిషేక దర్శనాన్ని తిలకించగలిగాను మరియు ఆలయములో ప్రదక్షిణలు చేస్తున్నంత సేపూ 'సమస్త లోకా సుఖినో భవంతు' అనే మంత్రాన్ని జపిస్తూనే వున్నాను. దర్శనం అయిన వెంటనే నేను మళ్ళీ 7 కిలోమీటర్లు కొండ కిందకు నడిచి పంబా వద్ద గల శబరి నదికి ఉదయం 8:00 గంటలకు చేరుకున్నాను. ఈ సారి నేను ఆ నదిలో పవిత్ర స్నానం చేసే అవకాశాన్ని వదులుకోలేదు.

**శబరిమలలో గమనించదగిన / నేర్చుకొన వలసిన విషయములు:**

1) ఏకాగ్రతతో భక్తితో దృష్టి పెడితే, అది మనకు బ్రహ్మానందాన్ని కలిగిస్తుంది.
2) పుణ్య క్షేత్ర యాత్రలు చేయాలంటే మనం భౌతికంగా శక్తివంతులుగా ఉండటం చాలా అవసరం.
3) సుందరమైన అడవులలో ప్రయాణించడం కన్నుల విందుగా ఉంటుంది.
4) ఇతర రాష్ట్రాల నుండి వచ్చు భక్తులకు ఇక్కడ సరయిన ఆహారము

కనిపించదు.

5) కొన్ని సమయాల్లో మన దగ్గర అన్నీ ఉన్నా (పాదరక్షలు, గొడుగు, బట్టలు, మందులు, ఫోన్, డబ్బు) మనకు ఇబ్బందులు తప్పవు. ఇవేవి మనకు సహాయపడవు.

మనదైన భక్తి, తపనతో ముందుకు వెళ్ళాలన్న కాంక్ష మాత్రమే మనలను ఆదుకొంటుంది. కాని, నేను అనుభవించిన విషయము ఏమిటంటే అటువంటి సమయంలో మన అహంకారం పటాపంచలు అవుతుంది. భగవంతుడు మనకు కఠిన సమయాల్లో ఎలా బయటపడాలి అన్నది అనేక పాఠాల ద్వారా నేర్పుతాడు.

**జటాయువు: పరాక్రమ రెక్కలు - చదాయు మంగళం:**

నేను త్రివేండ్రం దిశగా ప్రయాణిస్తుండగా నాకు చడాయు మంగళం అనే ప్రదేశం కనిపించినది. నా టాక్సీ డ్రైవర్, ఈ స్థలంలోనే రావణాసురుడు సీతా అపహరణ సమయంలో తనను ఎదిరించిన జటాయువు పక్షి రెక్కను నరికాడు అని చెప్పాడు. పురాణం ప్రకారం ఆ స్థలమును అప్పుడు నెడిలి పరంతక నెడుం చేదయన్ అనే రాజు పాలిస్తున్నాడు.

ఇంకా డ్రైవర్, ఆ పట్టణం దగ్గర గల (1) జటాయు భూమి కేంద్రం (2) జటాయు ఉద్యానవనం మరియు (3) జటాయు పర్వతం మొదలగు దర్శనీయ స్థలాల గురించి చెప్పాడు. ఆ పర్వతం ప్రపంచములోనే అతి పెద్ద పక్షి శిల్పాన్ని కలిగి ఉన్నది. ఇది 200 అడుగుల (61 మీటర్లు) పొడవు, 150 అడుగులు (46 మీటర్లు) వెడల్పు, 70 అడుగులు (21 మీటర్లు) ఎత్తు ఉంటుంది). ఈ శిల్పం 15000 చ॥ అడుగుల భూమి పై విస్తరించి ఉన్నది.

ఈ పథకం వెనుకగల గొప్ప వ్యక్తి శ్రీ రాజీవ్ ఆంచల్. ఈయన మలయాళం సినిమా దర్శకుడు, రచయిత మరియు కళా దర్శకుడు. 1997వ సంవత్సరంలో ఆయన 'గురు' అనే చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం అకాడమీ అవార్డు కు (విదేశీ చిత్రాల విభాగంలో) ఎంపిక అయినది. ఆయన నిర్మించిన మొదటి ఆంగ్ల చిత్రం బియాండ్ ది సోల్ (2003). మానవ మాత్రులకు అసాధ్యమైన ఇటువంటి (జటాయు పర్వతం) అద్భుత శిల్పాన్ని ఆయన ప్రభుత్వ మరియు ప్రైవేట్ భాగస్వాములతో నిర్మించాడు.

జటాయువు ధైర్య సాహసాలకు మరోపేరు. తన ప్రాణాలను పణంగా పెట్టి సీతామాతను, ఆమెను అపహరిస్తున్న రావణుని బారి నుండి విడిపించడానికి తన శాయశక్తుల ప్రయత్నించాడు. అందుచేత ఈ జటాయు శిల్పాన్ని మన భారతీయ మహిళ రక్షణకు ప్రతీకగా నిలిచింది. జటాయువు కాలంలో మానవులు, జంతువులు, పక్షులు మరియు ఇతర ప్రాణులు కలిసి కట్టుగా శాంతి యుతంగా ఈ భూమిపై జీవించేవని తెలుపటానికి ఇది ఒక తార్కాణం.

రాజీవ్ ఆంచల్ గారి మాటలలో చెప్పాలంటే జటాయువు శిల్పం, ఈ రోజు ఉన్న సమాజ పరిస్థితిలో, స్త్రీ హింస ఎక్కువగా ఉన్న ఈ కాలంలో ఎంతో ప్రాముఖ్యం కలిగి ఉన్నది. ఈ ప్రదేశం మనందరికీ కూడా ఒక అసహాయురాలైన స్త్రీ మూర్తిని రక్షించటానికి, మన ప్రాణాలైనా పణంగా పెట్టాలని బోధిస్తున్నది. ఆ విధంగా చూపరులకు అనిపించక మానదు.

**శివగిరి మఠం:**

భక్తి, సమానత్వం, ఆధ్యాత్మికత, సమాజసేవ, విద్య, ఉద్ధరణ మరియు వేదాంతము ఇవన్నీ కలగలిపిన పవిత్ర స్థలమే, వర్కలలో గల శివగిరి మఠం. ఇచ్చట శ్రీ నారాయణ గురు దేశ ప్రజలను ఉద్దరించుచు ఎన్నో సంవత్సరాలు జీవించారు. ఆయన సద్గుణములు, విలువలు మరియు సామాన్య మానవులలో కనిపించని అద్భుత లక్షణములు కల గలిపిన మహా మనిషి. ఆయన ఒక మోక్ష గామి, బోధకుడు, వేదాంతి, అద్భుత వ్యక్తి, శాస్త్రవేత్త, సాధువు, సంఘ సంస్కర్త, జాతి నిర్దేశకుడు మరియు కవి. కోట్లాది భక్తులకు ఆయన ఒక భగవత్ అవతారము, జ్ఞాన ప్రదాత, సత్యాన్వేషకుడు, ఆయన బోధలు చాలా సులువుగా, సూటిగా, ఆధ్యాత్మికతను, నీతిని, తెలియచేస్తాయి.

నేను చాలా ఏళ్ల నుండే ఈ మఠాన్ని దర్శించాలని అనుకున్నప్పటికీ, ఇన్నాళ్లకు నాకు ఆ అవకాశం లభించింది. శ్రీ రితుభిషానంద స్వామి వారు నాకు ఆశ్రమములో స్వాగతము పలికినారు. ఆయన ఎంతో శ్రద్ధతో నా వసతి, భోజన సౌకర్యం ఆశ్రమంలో ఏర్పాటు చేసారు.

నేను శివగిరి ఆశ్రమంలో ఒక రోజు గడిపాను. నేను అక్కడ శారద మఠం, పర్ణశాల, గురునివాస్, బోధ మయానంద స్వామి వారి సమాధి మరియు

మహాసమాధి మొదలైనవి దర్శించాను. ఈ ఆశ్రమంలోని అన్నశాలలో వేలాది మంది భక్తులకు అన్న ప్రసాదము పెడతారు. నేను ఈ ఆశ్రమంలో జరుగుచున్న సత్కార్యములు చూశాక నాకు ఈ జీవితము యొక్క పరమార్థము బోధపడింది. స్వామి వారికి ఇంకా ఎన్నో ఆలోచనలు ఈ ఆశ్రమం గురించి ఉన్నాయని తెలుసుకున్నాను, అవి కూడా ఆధ్యాత్మిక, ఇతర విషయాలని తెలిశాక చాలా ఆశ్చర్యపోయాను. ఆయన సంస్కృత మంత్రాలను మలయాళ భాషలో ఎంతో సులువుగా పలికించారు. దేశంలో అద్వైత సిద్ధాంతం ఎంతో సామాజిక విప్లవాన్ని తెచ్చింది. నేను ఈ ఆశ్రమంలో ఒక రోజు గడపటం, ఒక మహాత్ముని గురించి తెలుసుకోవడం వలన ఎంతో ఆనందాన్ని అనుభవించాను.

శివ గిరి ఆశ్రమంలో ఉన్న సమయంలోనే డా. కె.ఎన్. ఆనందకుమార్ గారు వారి సతీమణి వ్యక్తిగతంగా నా వద్దకు వచ్చి నన్ను సాయి గ్రామానికి వచ్చి అక్కడ ఉండవలసిందిగా ఆహ్వానించారు. వారి యొక్క ప్రేమాభిమానాలకు సంతోషించి నేను నా యాత్రా కార్యక్రమంలో సాయి గ్రామాన్ని దర్శించేలా మార్పులు చేసుకొన్నాను.

**ఆలింగన ఆశీర్వాద మాతా అమృతానందమయి:**

కొల్లం జిల్లాలోని వర్కల పట్టణములో గల శివ గిరి ఆశ్రమమును దర్శించుకున్న తరువాత, నేను మాతా అమృతానందమయిని దర్శించాలని నిశ్చయించుకున్నాను. గూగుల్‌లో వెతికితే, ఆమె దర్శనము మే 18, 19, 2019 తేదీలలో దొరుకుతుందని తెలిసింది. 18.5.2019 సరిగ్గా రాత్రి 8:30గంటలకు నేను అమృతపురిలో గల మాతా అమృతానందమయి ఆశ్రమానికి చేరుకున్నాను. అక్కడ గల సిబ్బంది, నా భారత దర్శన యాత్ర గురించి తెలుసుకొని నన్ను ఎంతో ఆదరంగా ఆహ్వానించి, నాకు వసతి, భోజన సదుపాయాలు సమకూర్చారు.

ఆ సమయంలో ఆశ్రమంలో వేలాది మంది అమ్మ భక్తులు ఆమె దర్శనం కొరకు వేచి ఉన్నారు. ఆశ్రమ సేవకుడు ఒకరు నన్ను దగ్గరుండి దర్శనం జరుగు హాల్‌కు తీసుకొని వెళ్లారు. అతను నన్ను మరొక ఉన్నత స్థాయి ఆశ్రమ సేవకుడికి పరిచయం చేయగా, వారిద్దరూ కలిసి నన్ను తిన్నగా వేదికపై గల

అమ్మ వద్దకు తీసుకొని వెళ్ళారు. చాలా ఆశ్చర్యంగా నేను అమ్మకు నా భారత దర్శన యాత్ర గురించి, మరియు అభయ గురించి వివరించాను. అమ్మ కేరళలోని సేవా పథకాలను గురించి కూడా వాకబు చేసారు. అక్కడ ఉన్న ఆశ్రమ సేవకులు మలయాళ భాషలో ఆమెకు వివరించారు. అమ్మ నన్ను ఆలింగనం చేసికొని, ముద్దు పెట్టుకొని ఆశీర్వదించారు. నిజంగా అది ఒక మధురమైన అనుభూతి. మరో ప్రక్క నా భారత దర్శన యాత్ర గురించి అలెపీ జిల్లా కలెక్టర్ గారి ద్వారా విన్న సాయి గ్రామం స్థాపకులు మరియు డైరెక్టర్ గారు అయిన శ్రీ కె.ఎన్.ఆనంద కుమార్ గారు ఫోన్ చేసి నన్ను సాయి గ్రామంలో కొన్ని రోజులు గడపమని సూచించారు.

## మే 19, 2019

మాతా అమృతానంద మయి ఆశీస్సులు తీసుకున్న తర్వాత నేను ఎర్నాకులం వెళ్లాను. మార్గమధ్యంలో ఓచిర పరబ్రహ్మన్ క్షేత్రాన్ని సందర్శించాను. ఈ ప్రదేశంలో దేవత విగ్రహం లేదు, కానీ చాలా పాత మర్రి చెట్లతో కూడిన ఒక అద్భుతమైన భారీ ప్రదేశం భూమికి అంకితం చేయబడింది. వందలాది గ్రామీణ సంఘాలు భగవంతుని దివ్య నామాన్ని జపించడం చాలా అద్భుతంగా ఉంది.

అక్కడి నుండి నేను ఎర్నాకులతప్పన్ ఆలయాన్ని (ఎర్నాకులం ప్రభువు.... ద్వాపర యుగంలో అర్జునుడికి పాశుపతాస్త్రాన్ని అందించినది ఆయనే) సందర్శించాను.

భరత్ హోటల్ వద్ద, శ్రీ కెఎన్ ఆనంద్‌కుమార్ (సాయి గ్రామం) నన్ను స్వాగతించారు మరియు విశ్రాంతి కోసం ఒక గది కూడా ఏర్పాటు చేసారు. దుమ్ము ధూళితో కూడిన హోటల్‌లో బస చేయడం వల్ల నేను రోజంతా తీవ్రమైన పొడి దగ్గుతో బాధపడ్డాను. డాక్టర్ సాయిలతను సంప్రదించి, తను సూచించిన మందులు వేసుకుని, సార్వత్రిక ఎన్నికల తర్వాత వచ్చే ఎగ్జిట్ పోల్స్ న్యూస్ చూస్తూ... రోజంతా విశ్రాంతి తీసుకున్నాను.

మే 20న, నేను, ఆనంద కుమార్ గారు మరియు వారి బృందంతో కలిసి ఎర్నాకులంలోని ఇందిరా గాంధీ కోఆపరేటివ్ హాస్పిటల్‌కి వెళ్లాను, అక్కడ శ్రీ సత్యసాయి ఆర్ఫనేజ్ ట్రస్ట్ (SSSOT) వారు, ప్రజల ఉపయోగార్థం ఏర్పాటు

చేసిన ఉచిత డయాలసిస్ సదుపాయాన్ని ప్రారంభించారు. దీనిని పర్యాటక మరియు దేవాదాయ శాఖ మంత్రి అయిన శ్రీ కె సురేంద్రన్, పలువురు ప్రముఖుల సమక్షంలో ప్రారంభించారు. కేరళ రాష్ట్రంలో SSSOT ఏర్పాటు చేసి నిర్వహించ బడుతున్న 10 కేంద్రాలలో ఇక్కడి డయాలసిస్ సౌకర్యం ఒకటి.

**సాయిగ్రామం:**

శ్రీ కె. ఎన్. ఆనందకుమార్ గారు నన్ను స్వయంగా సాయి గ్రామానికి తీసుకొని వెళ్లారు. కొల్లంబ జిల్లా ఎర్నాకులం నుండి ఐదు గంటల ప్రయాణ దూరంలో ఉన్నది ఈ ప్రదేశం. శ్రీ సత్యసాయీ ఆర్ఫనేజ్ ట్రస్ట్, కేరళలో 1996 జూన్ 17వ తేదీన ఒక స్వచ్ఛంద సంస్థగా ఏర్పాటు చేయబడింది. దాన్ని ప్రారంభం నుంచి, ఈ ట్రస్ట్ పవిత్రమైన నినాదం "మానవ సేవయే - మాధవ సేవ".

భగవాన్ శ్రీ సత్యసాయీ బాబా వారి దివ్యాదేశం మేరకు ఈ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసినారని విన్నాను. వ్యవస్థాపకులు, శ్రీ కె.ఎన్. ఆనందకుమార్ గారు మరియు జస్టిస్ చంద్రశేఖర్ మెనన్ గారు ఈ సంస్థను భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి ఆశీర్వాదంతో ప్రారంభించారు. స్వామి వారి దివ్య సూచనల మేరకు గత 25 వసంతాల నుంచి కేరళ రాష్ట్రంలో ఈ ట్రస్ట్ నిస్వార్థ సేవలను అందిస్తూ, సామాజిక, సాంస్కృతిక, నైతిక మరియు ఆధ్యాత్మిక స్తంభాలను బలోపేతం చేయడానికీ కృషి చేస్తోంది.

సుమారు 200 సేవా పథకాలతో... అద్భుతమైన దాతృత్వ వ్యవస్థను ట్రస్ట్ చేపట్టింది. కేవలం 9 మంది అనాథలతో ప్రారంభమైన ఈ సంస్థ ఎన్నెన్నో సేవా కార్యక్రమాల ద్వారా, ఘన కార్యాల ద్వారా సదా సాయి ప్రేమ కాంతులతో మెరుస్తూ ఉండటానికి ఈ ట్రస్ట్ యొక్క శ్రద్ధా భక్తులే కారణం అని చెప్పొచ్చు.

**సాయిగ్రామం - History... HIS Story: An Inspiration:**

ఒక వ్యక్తి తన జీవితంలో భగవంతుని వల్ల ప్రేరేపింపబడితే - అతను చరిత్రను (History) సృష్టించగలడు. అని నేను ఎప్పుడూ చెప్తుంటాను... అది చరిత్ర (History) కాదు... అది అతని కథ (His Story) భగవంతుని పేరు

మీద తరతరాల వరకూ ప్రేరణను ఇచ్చే కథ. అద్భుతమైన సేవలో రెండున్నర దశాబ్దాల ప్రయాణం... జీవితంలో ప్రతీ శ్వాస, ప్రతీ ఒక్క గుండె సవ్వడి శ్రీ సత్యసాయి బాబా కోసమే చేసే పనితనం, శ్రీ కె.ఎన్. ఆనందకుమార్ గారి నిజ జీవితం. దేశ ప్రజల కోసం ఒక అద్భుతమైన కథను అంతర్నిర్మితము చేసారు. ఉదయం నుండి నేను స్వేచ్ఛగా 30 ఎకరాల స్థలంలో విస్తరించిన సాయిగ్రామంలో కనీసం 50 సేవా కేంద్రాలను చూస్తూ తిరిగాను... ప్రతిది పూర్తిగా ఉచితంగా నిర్వహించబడుతుంది.

శ్రీ సత్యసాయి అనాధ ఆశ్రమ ట్రస్ట్, దక్షిణ భారత రాష్ట్రాల్లో కేరళలోని అతిపెద్ద స్వచ్ఛంద సంస్థగా చెప్పొచ్చు. ఏకాభిప్రాయంతో కొంత మంది స్వామి భక్తులు కలిసి ట్రస్ట్ ద్వారా అద్భుతమైన సేవలను అందిస్తున్నారు. ఈ ట్రస్ట్ మరియు వాటి కార్యకలాపాల గురించి చాలా తక్కువ కంపెనీలకు మాత్రమే తెలుసు. నేను కేరళ రాష్ట్రంలోనే కాక, దేశములో వివిధ ప్రదేశాలలో ఉన్న కంపెనీలకు విన్నవించేది ఏమిటంటే ఒక్కసారి సాయిగ్రామానికి విచ్చేసి, అక్కడ జరిగే సేవలను గమనించి, అవసరమైన వనరులను సామాజిక సేవా బాధ్యతలో భాగంగా అందించగలిగితే ఆ వనరులు అవి తప్పక సద్వినియోగం అవుతాయి.

శ్రీ ఆనందకుమార్ గారు మరియు వారి ధర్మపత్ని కేరళలోని అట్టడుగు వర్గాల కోసం వారి జీవితం అంకితం చేసారు. అక్కడ గడిపిన సమయం నాకు జీవితంలో అత్యంత చిరస్మరణీయమైనదిగా తలుస్తాను... ఎందుకంటే ఒక మనిషి భగవంతునిపై విశ్వాసం ఉంచితే ప్రపంచంలో తను ఏమైనా సాధించగలడు అనేదానిని నేను ఈ రోజు ప్రత్యక్షంగా నా కన్నులతో చూసాను.

అనాథ ఆశ్రమం, వృద్ధాశ్రమం, వైద్యాలయం, దేవాలయాలు, విశ్రాంతి గృహాలు, ఫలహార శాలలు, మానసిక వికాస కేంద్రం, చేతిపనుల కేంద్రం, పుస్తకాల అంగడి, కళల కేంద్రం, వ్యవసాయం, పాఠశాల, కళాశాల, సభా మందిరం, పాఠశాల బస్సులు, పర్యావరణ సంరక్షణ, వర్షపు నీటితో సాగు, సౌరకాంతి, చెరువులు, నదులు, లాండ్‌స్కేపింగ్, గోశాల, గోబర్ గ్యాస్, పర్యాటక కేంద్రాలు, ఆయుష్ కేంద్రం, మహిళా సాధికారత కేంద్రం... ఏది లేదు? ప్రతి ఒక్కటి సాయిగ్రామంలో ఉన్నవి. ఇవి కాకుండా కేరళ రాష్ట్రంలో 10 ఉచిత డయాలసిస్ కేంద్రములు నడుస్తున్నాయి. అంతేకాదు, సుమారు 200 మంచాలు

గల ఉచిత సూపర్ స్పెషాలిటి వైద్యశాల కసర్‌గుడలో ప్రారంభం చేస్తున్నారని విన్నాను.

ఈ దివ్య సేవా కార్యములలో మునిగివున్న శ్రీ కె.ఎన్. ఆనందకుమార్ మరియు వారి కార్యవర్గానికి శిరము వంచి అభివాదం చేయాల్సిందే. సాయి భక్తులు ఎవరైనా సరే, కనీసం ఒక్కసారైనా చూడవలసిన క్షేత్రం సాయిగ్రామం. కుమార్ గారి బృందం శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేస్తున్నాను. వారి కథ నిజంగా భగవంతుని స్వంత కథయే... అది కూడా భగవంతుని స్వంత దేశమైన కేరళలో!!!

నేను సాయి గ్రామములో ఆటిజం విద్యార్థుల సమావేశంలో మరుసటి రోజు గడిపాను. వారి అమాయకత్వం నన్ను ముగ్ధున్ని చేసింది. నన్ను వారితో ప్రేమలో పడేలా చేసింది. నేను వారితో ఆడుకున్నాను, సంభాషించాను మరియు ఆనందించాను. మలయాళం మాత్రమే ఎక్కువగా మాట్లాడే కేరళలో నేను అద్భుతమైన అనుభవాలను సేకరించాను. చేసే పనిని ఇష్టపడినప్పుడు భాష అడ్డంకి కానే కాదు అని తెలుసుకున్నాను!

**అభ్యాసనలు & పరిశీలనలు:**

1. జీవితంలో ఎవరైనా భగవంతుడితో స్ఫూర్తి పొందితే అతను HISTORY (His Story)ని సృష్టించవచ్చు. తద్వారా ముందు తరాలకి స్ఫూర్తి నింపవచ్చు.
2. నువ్వు చేస్తున్న పని మీద నీకు ప్రేమ ఉంటే భాష ఎప్పటికీ ఒక అడ్డంకి కాదు.

## మే 23, 2019

### బిజెపికి మళ్ళీ కేంద్రంలో అధికారం:

బిజెపి పూర్తి ఆధిక్యంతో మళ్ళీ అధికారంలోకి వచ్చింది. ఇది భారతదేశానికి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతదేశ ప్రజలకి చారిత్రాత్మకమైన రోజు. నాలుగు దశాబ్దాలుగా ఒక జాతీయ పార్టీ వరుసగా రెండవసారి ఐదేళ్లపాటు తన సొంత బలంతో అధికారంలోకి రావడం అరుదైన సంఘటన అని చెప్పాలి. కేంద్రంలో

బిజెపి ప్రభుత్వం వచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది. శ్రీ నరేంద్ర మోడీ గారు భారతీయ జనతా పార్టీ కేంద్ర కార్యాలయం ఆవరణలో గుమికూడిన వేలాది మందితో మాట్లాడుతూ... దేశ ప్రజలను ఉద్దేశించి వివిధ చానల్స్ ద్వారా ఉద్వేగభరితంగా అందరికీ కృతజ్ఞతలు తెలియచేయడం టీవీలో చూసాను.

## పెద్దవాడి నుండి పేదవాడు :

సాయి గ్రామం నుంచి అల్లెప్పి వెళ్తున్నప్పుడు నేను ముందు ఊహించి నట్లుగానే జరిగింది నా సామాను అంతా బ్యాక్ ప్యాక్‌లో పెట్టాను దాంతో ప్రయాణమయ్యాను. బస్సులో నేను కూర్చున్న సీటు దగ్గర స్థలం లేక బ్యాగు కాస్తా డ్రైవర్ దగ్గర పెట్టేసాను. బస్సు నిండా జనం ఉన్నారు. నిదానంగా నిద్రలోకి జారుకున్నాను. ఆ బ్యాగ్ కాస్త ఎవరో దొంగిలించి వేశారు.

వేసుకున్న బట్టలు తప్ప నా దగ్గర ఇంకేమీ లేవు భగవంతుడు నన్ను రోడ్డు మీద బిక్షగానిగా చేసారు. ఆ ఒక్క క్షణం వైరాగ్యం వచ్చింది, జరిగిన సంఘటన నన్ను ఏమీ బాధ పెట్టలేదు. కానీ ఒక బాధ్యత గల పౌరుడిగా నేను పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసాను. నాకు నిజంగా నమ్మకం ఏమీ లేదు నా బ్యాగ్ తిరిగి వస్తుందని. శ్రీ కృష్ణ తేజ ఐఎఎస్, సబ్ కలెక్టర్, అల్లెప్పి గారికి ఫోన్ చేసాను... వారు అందుబాటులో లేరు. అయినా ఏదో లాగా సమాచారం ఇచ్చాను. వారు (ఆయన ఎన్నికల ఓట్ల లెక్కింపు పనులలో చాలా హడావుడిగా ఉన్నప్పటికీ) కార్యాలయ సిబ్బందిని పంపారు. నన్ను స్వగతించడానికి వాహనం కూడా పంపించారు. ఇక అక్కడి నుండి మేము వెళ్లి అవసరమైన వస్తువులు మరియు వస్త్రాలు తీసుకున్నాము. నిర్లిప్తతతో కూడిన ప్రయాణం మళ్ళీ మొదలుపెట్టాను. ఏం చెప్పాలో నాకు తెలియటం లేదు. కానీ నేను మోస్తున్న బరువు తగ్గిపోయింది. అనుభవం వచ్చింది. ఇంకా దూరం ప్రయాణించాలి ఇది ఒక గుణపాఠం నాకు.

## పోయిన బ్యాగు మళ్ళీ వెనక్కి వచ్చింది:

నిజం చెప్పాలంటే, జరిగిన విషయం మహిమ కంటే ఏమాత్రం తక్కువ కాదని చెప్పాలి. నాకు ఒక ఫోన్ కాల్ వచ్చింది. సంతోష్, ఇన్స్‌పెక్టర్, కొట్టాయం,

కొల్లం జిల్లా నాతో మాట్లాడారు. నేను బస్సులో పోగొట్టుకున్న బ్యాగ్ వారి వద్దకు నిజాం అనే యువకుడు రోడ్డు మీద పడి వుందని పోలీసు స్టేషన్‌లో అప్ప చెప్పారు అని తెలియ జేసారు. చాలా ఆశ్చర్యం మరియు ఆనందం కలిగింది. ఆ దేవుడు భారత దర్శన్‌లో నా వెన్నంటి వున్నాడు అనడానికి ఇంత కంటే నిదర్శనం ఏముంది అని భావించి పొంగి పోయాను. వెంటనే, ఒక టాక్సి మాట్లాడుకుని సుమారు 2 గంటలు ప్రయాణం చేసి ఆ బ్యాగ్ పోలీస్ స్టేషన్ నుండి తెచ్చుక్కున్నాను. అక్కడి రక్షక భటులకు ధన్యవాదాలు తెలుకోవడం మరవలేదు.

ఓ ప్రక్క జరిగిన విషయం ఆనందం కలిగించేది అయినా... నా అజాగ్రత్తకు చింతించి ప్రయాణంలో ఇంకా ఉషారుగా జాగ్రత్తగా ఉండాలని నిర్ణయించు కున్నాను.

## కృష్ణ తేజ ఐఎఎస్ గారికి హృత్ పూర్వక ధన్యవాదాలు:

నిజానికి సబ్ కలెక్టర్ గారు తమ సిబ్బందిని పంపించి నన్ను ప్రభుత్వ అతిథి గృహంలో దిగ బెట్టడం అన్నది చాలా అద్భుతమైన విషయం అని చెప్పాలి. నా బ్యాగ్ పోవడంతో వచ్చిన సిబ్బంది నాకు ఏ ఇబ్బందీ కలుగకుండా నాకు అవసరం అయిన వస్తువులు తెచ్చుకోవడానికి సాయం చేసారు. ఎన్నికల హడావుడి వున్న ఆ రోజు, వారి పనులు ముగించుకుని రాత్రి ఇంటికి వెళుతూ... నా గదికి వచ్చి కుశల ప్రశ్నలు వేసి, క్షేమ సమాచారాలు తెలుసుకున్నారు వారు.

అంతే కాదు మరుసటి రోజు, అల్లేపి నెహ్రూ ట్రోపి వార్డ్‌కు వెళ్లి ఆ ప్రాంతంలో అభయ సంస్థ ద్వారా వరద భదితుల కోసమై వరదలు వచ్చినా నీట మునగకుండ కట్టించబడిన పక్కా గృహాలను చూసి రమ్మని పంపించారు. నిజానికి వరద భాదితులు కోసమై ఇలాంటి ఇళ్ళు కట్టించిన మొదటి సంస్థ అభయ ఫౌండేషన్ అని వారు తెలిపారు. అందులోనూ... కొత్త సాంకేతికతను ఉపయోగించి చాలా తక్కువ వ్యవధిలో కట్టడం అన్నది చాలా ప్రశంసనీయం అన్నారు.

ఇలాంటి సేవా అవకాశాలను అభయ సంస్థకు చూపించిన కృష్ణ తేజ

గారికి హృత్ పూర్వక ధన్యవాదాలు తెలుపుకోవాలి. వారితో చేరి సుమారు 6 నెలల పాటుగా వివిధ ప్రాంతాల్లో ఎన్నో సేవలు ఆనందంగా చేసాము. ఇలాంటి ప్రభుత్వ అధికారులు ప్రతి జిల్లాలో వుంటే అద్భుతాలు తప్పక జరుగుతాయి. భారత మాత ఔన్నత్యం మరింతగా ప్రకాశిస్తుంది అని నేను దృఢంగా విశ్వసించాను. వారికి, వారి కుటుంబ సభ్యులకు, అల్లెప్పి జిల్లా యంత్రాంగానికి నేను శిరము వంచి అభివాదం చేస్తున్నాను.

**కేరళలో అభయ సేవా పథకాలు:**

భారత దర్శన్‌లో మరచిపోలేని రోజుగా 25 మే, 2019ని చెప్పుకోవాలి. కారణం అల్లెప్పి సబ్ కలెక్టర్ కార్యాలయం నుండి వచ్చిన బృందం నన్ను నగరంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు తీసుకుని వెళ్లారు, అక్కడ “ఐ యామ్ ఫర్ అల్లెప్పి” ప్రణాళికలో భాగంగా అభయ విద్యార్థి ఉపకార వేతనం అందించారు. ఎన్నిక చేసిన యోగ్యమైన విద్యార్థులకు సాయం అందించారు.

ఈ సాయం చేస్తున్న సందర్భంలో (2000 రూపాయలు ఒక్కొక్కరికి) వివిధ పాఠశాలల నుండి వచ్చిన 40 మంది ప్రధానోపాధ్యాయులను కలవడం అన్నది నాకు వచ్చిన దివ్యావకాశంగా భావించాను. వారి కృతజ్ఞత మాటలలో కాక అక్కడ చేరిన తల్లిదండ్రులు మరియు విద్యార్థుల చిరునవ్వులతో నిండిన మోములతో... ముకుళిత హస్తాలతో తెలియపరిచారు. కృతజ్ఞతా భావాలను ఎన్నడూ మనం మాటల్లో వ్యక్తపరచలేము అనిపిస్తుంది. మలయాళ భాష నాకు రాకుండా నేను మాట్లాడాను అంటే నమ్ముతారా??? నేను మాట్లాడిన ప్రతి మాటను వాళ్ళు కేరింతలు కొడుతూ విన్నారు. ప్రేమను పంచడానికి భాష ఒక అడ్డంకి కానే కాదు అనిపించింది. ఉపాధ్యాయ సంఘాల వారు కూడా నా ఆలోచనలకు మాటలకు అంతే ఆనందపడ్డారు.

తరువాత, నన్ను సబ్ కలెక్టర్ గారి కొత్త కార్యాలయానికి తీసుకెళ్లారు. అక్కడ శ్రీ కృష్ణ తేజ IAS, గారు నన్ను కలవడానికి వేచి వున్న మత్స్యకారుల బృందంతో నన్ను స్వాగతించారు. వాళ్ళకి నన్ను పరిచయం చేసాడు. హ్యుందాయ్ మోటార్స్ గ్రూప్ మంజూరు చేసిన CSR నిధులతో అభయ సంస్థ, మరుసటి

రోజు రాష్ట్ర ఆర్థిక మంత్రి, మత్స్యశాఖ మంత్రి మరియు కొత్తగా ఎన్నికైన ఎంపీ సమక్షంలో కుట్టునాడు వద్ద 20 మత్స్యకార పడవలను అందజేస్తున్న కార్యక్రమం గురుంచి చర్చించుకున్నారు.

ఆ సందర్భంలో, కేరళ వరద సహాయం మరియు పునరావాసము కోసం అభయ సంస్థ TTK ప్రెస్టీజ్, హ్యుందాయ్ మోటార్స్ గ్రూప్, ఓరిక్స్ లీజింగ్ మరియు ఇతర కార్పొరేట్ దాతలు తమ సహాయాన్ని అందించినందుకు శ్రీ కృష్ణ తేజ చాలా కృతజ్ఞతలు తెలిపారు.

కేరళలో వరదల సమయంలో వాట్సాప్ గ్రూప్‌గా ప్రారంభమైన ఫ్లడ్ రిలీఫ్ వాలంటీర్స్ ఫ్యామిలీ (FVF) వ్యవస్థాపకుడు శ్యామ్‌ను, కృష్ణ తేజ నాకు పరిచయం చేసారు, అది ఇప్పుడు పునరావాసంలో ఉద్యమంగా మారింది. అభయకు కొన్ని ఇళ్ల మరమ్మత్తులలో వారితో కలిసి పనిచేసే అవకాశం వచ్చింది. శ్యామ్ తోడు వస్తె వెళ్లి మరమ్మత్తు చేయిస్తున్న ఆ ఇళ్లను సందర్శించి, లబ్ధిదారులతో కాసేపు మాట్లాడాము.

శ్యామ్ నన్ను వాళ్ళ ఇంటికి రమ్మని అభ్యర్థించారు... వాళ్ళ ఇంటికి వెళ్ళినప్పుడు తన సోదరి (దివ్యాంగ) తన ముఖంలో చిరునవ్వుతో నన్ను స్వాగతించింది. వారికి మరొక తోబుట్టువు కూడా ఉన్నాడు, అతను కూడా ఒక ప్రత్యేక వ్యక్తి అయినప్పటికీ చనిపోయాడు అని తెలిసింది. యువకుడైన శ్యామ్ స్ఫూర్తిని నేను అర్థం చేసుకున్నాను... వారి తండ్రి మరియు పూర్వీకులు బాగానే ఉన్నారు, కానీ, అవసరంలో వున్న వారితో, వారి దగ్గరున్న ప్రతిదీ పంచుకున్నారు. చిత్ర పరిశ్రమ వాళ్లతో సంబంధాలు వున్నప్పటికీ, అలాంటి పరిస్థితుల్లో జీవిస్తున్నప్పటికీ, వారు చిరునవ్వుతో అవసరమైన వారికి ఇంకా సేవ చేస్తునే వున్నారు, అతను తన జీవితం నుండి నాకు స్ఫూర్తినిచ్చాడు. వారి క్షేమం కొరకు ప్రార్థనలు చేయడం తప్ప నేను ఇంకేమి చేయలేక పోయాను.

అతని సోదరి అభయ దాతలకు, వారి కృతజ్ఞతగా విత్తనాలతో నింపిన కాగితము పెన్నులను బహుమతులుగా అందజేసింది, ఆమె చాలా ప్రతిభావంతురాలు మరియు చాలా బహుమతులు మరియు ప్రశంసలు అందుకుంది.

abhaya Kare & Love4Kerala ప్రణాళికలో భాగంగా హ్యుందాయ్

CSR బృంద సభ్యుడైన లక్ష్మీకాంత్ సుంకర హైదరాబాద్ నుండి కేవలం భారత దర్శన్ గురించిన నా అనుభవాలు సామాజిక మధ్యమాల ద్వారా తెలుసుకుంటూ, నన్ను కలవాలన్న ఆశతో అల్లెప్పి వరద పునరావాస ప్రణాళికలో పాల్గొనడానికి వచ్చారు. ఇలా, ఈ కారణంతో నా భారత దర్శన్‌లో భాగమై వారు నన్ను కలవడం ఎంతో ఉత్తేజం కలిగించింది. వారు కుడా నాతో పాటుగా కేరళ రాష్ట్ర ప్రభుత్వ అతిథిగా 2 రోజులు గడిపారు.

మరెన్నో క్షేత్ర దర్శనాలు, ఆ తదుపరి రోజు కూడా కొనసాగాయి. కూట్టునాడులోని అర్హత గలిగిన లబ్ధిదారులకు గృహాలు ఇవ్వడం, మత్స్యకారులకు పడవలు ఇవ్వడం మొదలైనవి, రాష్ట్ర ఆర్థిక మంత్రి గారు, మత్స్యశాఖ మంత్రి గారు, కొత్తగా ఎన్నికైన ఎంపీ గారు, జిల్లా ఉప కలెక్టర్ గారి పర్యవేక్షణలో జరిగాయి. లబ్దిదారులతో నేను ప్రవర్తించిన తీరు అక్కడికి వచ్చిన మంత్రులను కూడా సంభ్రమాశ్చర్యాలతో ముంచెత్తాయి. లబ్ధిదారులకు నూతన గృహాలు అందించిన సమయములో వారి మత విశ్వాసాలకు అనుగుణంగా నేను పాడిన పాటలు ఆర్థిక మంత్రికి స్ఫూర్తిని కలిగించాయి. సన్యాసి వేషములో నేను క్రీస్తును స్మరించటం వారికి చాల ఆశ్చర్యం ఆనందం కలిగించాయి.

నా గురించి చాలా స్ఫూర్తిదాయకముగా వారు స్వయంగా వ్రాసి చిత్రములతో సహా సమాజిక మాధ్యమాలలో పోస్ట్ చేయడం మరొక మరచిపోలేని అనుభూతి నాకు.

లక్ష్మీకాంత్ మరియు నేను అంబల్‌పుజ కృష్ణ దేవాలయం, కరుమడి కుట్టన్ మరియు అల్లెప్పి సముద్ర తీరాన్ని సందర్శించడానికి వెళ్ళాము. ఆ సమయములో సామాజిక మాధ్యమాలు, అభయ సేవలు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు మరియు వ్యక్తిగత సమస్యలకు సంబంధించిన అనేక విషయాల గురించి చర్చించుకున్నాము.

ఈ పర్యటనలో అతను తన వైర్‌లెస్ బ్లూ టూత్‌ను అక్కడ ఆలయ ప్రాంగణంలో చెట్టు కింద వదిలివేసాడు. మేము తరువాతి ప్రదేశానికి వెళ్లాము, ఒక గంట తర్వాత, అది లేదు అని గుర్తించి, వదిలేయడమా లేక తిరిగి వెళ్లడమా అన్న ఖర్చును పరిగణనలోకి తీసుకుంటే, తిరిగి వెళ్లడమే చవకైన విషయంగా ఎంచి, తన అదృష్టాన్ని పరీక్ష చేద్దాం అని చెప్పాడు. నేను నా బ్యాగ్‌ని ఎలా పొందానో, దేవుడు సంకల్పించినట్లయితే, అతను కూడా తను పొగట్టుకున్నది

పొందవచ్చని చెప్పాను. చాలా మంది సందర్శకులు ఈ ప్రదేశానికి వచ్చినప్పటికీ అదే ప్రదేశంలో ఎవరు తాకకుండా వదిలేసిన బ్లూ టూత్ అక్కడ ఉండడం మాకు ఆశ్చర్యం కలిగించింది. తిరిగి ప్రయాణం చేసి ఆనందంగా ప్రభుత్వ అతిథి గృహానికి చేరుకున్నాం.

**అభ్యాసాలు / పరిశీలనలు:**

అవసరంలో ఉన్నవారి సేవ చేయడానికి మనకు నిజంగా ఏమి కావాలి? కుటుంబ నేపథ్యమా? ఆర్థిక శక్తా? శారీరక ఆరోగ్యమా? అర్హతా? మంచి ఉద్యోగమా? ఏమిటి? వీటిలో ఏవీ కావు! శ్యామ్ మరియు అతని కుటుంబాన్ని కలిసిన తర్వాత, మనకు కావలసింది కేవలం ఆపదలో ఉన్నవారికి సేవ చేయాలన్న తపన మాత్రమే అని నేను గ్రహించాను. ఒక పౌరుడిగా తమ కర్తవ్యాన్ని దృష్టిలో ఉంచుకుని స్థిరంగా ఉండటానికి ఆత్మస్థైర్యం ముఖ్యం. ముకుళిత హస్తాలు మరియు చిరునవ్వు ద్వారా వ్యక్తీకరించబడిన కృతజ్ఞత వేల పదాల కంటే ఎక్కువ హృద్యమైనది అని చెప్పవచ్చు.

## మే 26, 2019

మే 26, 2019 రోజును అభయ ఫౌండేషన్ చరిత్ర పుటలలో సువర్ణాక్షరాలతో వ్రాయవలసిన రోజు అని చెప్పాలి. కారణం ఏమిటి అంటే దేశవ్యాప్తంగా ఉన్న అనేక మంది దయగల అభయ ఆత్మ బంధువులు మరియు వ్యాపార సంస్థల మద్దతుతో ప్రారంభించబడిన 6 నెలల అభయ మిషన్ "Kare& Love4Kerala" ముగించిన శుభ సందర్భం. సుమారు రూ. 5,00,00,000/ - (నగదు మరియు వస్తువుల విలువ) కేరళ వరద సహాయం మరియు పునరావాసం కోసం అల్లెప్పి మరియు ఎర్నాకులం జిల్లాలలో ఖర్చు చేయగలిగినందుకు ఎంతో ఆనందంగా వుంది.

- 6000 కుటుంబాలకు TTK ప్రెస్టీజ్ వాటర్ ప్యూరిఫైయర్లు
- 2000 ఇళ్లకు హ్యుందాయ్ అగ్రోమెక్ వారి వంట సామాను
- NAC హైదరాబాద్ విద్యార్థులచే 3000 గృహోపకరణాల మరమ్మత్తు
- 6 ORIX & TTK కలల ఇళ్ల నిర్మాణం

- 2 గృహాలకు మరమ్మతులు
- 20 మత్సకారులకు హ్యుందాయ్ పడవలు
- 20 అభయ ఉపకార వేతనాలు
- 8 అభయ పాడి అవులు మరియు దూడలు
- 2 అభయ జీవనోపాధి సాధనాలు
- RK విద్యాలయంలో అభయ డిజిటల్ క్లాస్ రూమ్
- 10 అభయ – పాఠశాలల్లో NAC నీటి RO ప్లాంట్లు
- ముఖ్య మంత్రి వరద సహాయ చర్యల నిధికి రూ. 50 లక్షల సాయం

గత 6 నెలలుగా ఆ ప్రాంతంలో జరిగిన వరద సహాయక చర్యలు చూసినప్పుడు ఎంతో ఆనందం కలిగింది. అలెప్పి సబ్ కలెక్టర్ MVR కృష్ణ తేజ IAS గారిని వారి అంకిత భావాన్ని వ్యక్తిగతంగా చూసి చాలా ఆశ్చర్య పోయాను మరియు ప్రేరణ పొందాను. ముగింపు కార్యక్రమంలో కేరళ రాష్ట్ర ఆర్థిక మంత్రి వర్యులు డాక్టర్ థామస్ ఇసాక్, మత్స్యశాఖ మంత్రి ఎం కుట్టి అమ్మ, పౌర సరఫరాల శాఖ మంత్రి సుధాకరన్, కేరళలో అధికార పక్షం తరపున గెలిచిన లోక్ సభ సభ్యులు, ఆరిఫ్, కృష్ణతేజ ఐఏఎస్, డిప్యూటీ కలెక్టర్ జహంగీర్, మునిసిపల్ కమీషనర్, లక్ష్మీకాంత్ సుంకర, హ్యుందాయ్ (ప్రపంచంలో అత్యంత ప్రజాదరణ పొందిన కార్ల తయారీ సంస్థ) ప్రతినిధి, తదితరులు పాల్గొన్నారు.

మేము కుట్టునాడు ప్రాంతాలలో అత్యంత అర్హులైన కుటుంబాలకు కొత్తగా నిర్మించిన గృహాలు మరియు ప్రత్యేకంగా తయారు చేసిన చేపల పడవలను అందజేశాము. పునరావాస పనులు ప్రారంభించిన అనేక మందిలో ప్రాజెక్టులను ముగించిన మొదటి సంస్థ అభయనే అన్న విషయం ఆనందం కలిగించింది.

ఆర్థిక మంత్రి, సెప్టెంబర్ 2019 నెలలో మా సమావేశం యొక్క మొదటి రోజును గుర్తు చేసుకున్నారు మరియు దాతల మద్దతుతో అభయ ఫౌండేషన్ చేసిన మంచి పనిని చిత్తశుద్ధిని, స్థిరత్వాన్ని ప్రశంసించారు. అభయ వంటి స్వచ్ఛంద సంస్థలు చేపట్టిన పనిలో ఎంతో వేగం కనిపిస్తోందని ఆయన అన్నారు. తెలుగు సబ్ కలెక్టర్ కృషిని ఆయన మరియు ఇతర అతిథులు అభినందించారు.

జీవనోపాధి కార్యక్రమంలో భాగంగా అభయ సంస్థ ద్వారా కెమెరాను అందించిన ప్రభుత్వ స్టాఫ్ రిపోర్టర్ సాజన్‌ని కూడా కలిసాను. అతను సమయాన్ని

తీసుకుని కృతజ్ఞతా భావంతో అభయ గృహ నిర్మాణ పథకం మీద మంచి వీడియోను రూపొందించాడు. గృహ లబ్ధిదారులందరినీ పరామర్శించి, మేము తిరిగి ప్రభుత్వ అతిథి గృహానికి వచ్చాము.

మే 26, 2019న రెండు కార్యక్రమాల మధ్య సమయాన్ని తీసుకుని, అలెప్పీలో ఉన్న ప్రసిద్ధమైన నాగరాజ దేవాలయాన్ని దర్శించాను. ఒక ఆసక్తికరమైన కథ ఈ దేవాలయానికి సంబంధించి ఉంది. వేలాది మంది నాగ దేవతలను పూజిస్తుండగ చూడటం జరిగింది. హరిపడ్గా పిలువబడే ఈ దట్టమైన అరణ్య ప్రాంతం మన్నారుసాల అనే గ్రామములో ఉన్నది. లక్షలాది నాగ దేవతలను ఆ గుడి పరిసరాలలో చూడొచ్చు. సంతానం కోసం వేలాది మంది దంపతులు ఇక్కడికి వస్తుంటారు. అసలు ఆ ఆలయం చరిత్ర కూడా చాలా వింతగా తోస్తుంది. పరశురాముని భూమిగా పిలువబడే కేరళలో వారు అక్కడి వారి కోసం వారి సౌభాగ్యం కోసం నాగరాజ స్వామిని గురించి తపస్సు చేసిన ప్రదేశం అంటారు. మందార వృక్షాల మధ్యలో నగరాజ స్వామి కొలువై ఉండటం వలన మందారశాల... కాల క్రమంలో మన్నారుశాలగా రూపాంతరం చెందింది.

కేరళ పర్యటనలో భాగంగా అభయ ప్రాజెక్టులను అనేకం సందర్శించే అవకాశం కలిగింది. కేరళ రాష్ట్రంలో ఎక్కడ చూచినా అద్భుతమయిన ప్రకృతి మనలను పారవశ్యం చేస్తుంది. కేరళలో ఉన్న అన్ని రోజులు కూడా అక్కడున్న దర్శనీయ క్షేత్రాలను చూస్తుంటే కాలం ఇట్టే గడచిపోయింది.

కేరళలో నా చివరి మజిలీలో అత్యంత సుందరమైన అల్లెప్పిలో సుమారు 4 రోజులున్నాను. అక్కడ సబ్ కలెక్టర్ శ్రీ కృష్ణ తేజ IAS గారి అతిథిగా వున్నాను. వారు స్వయంగా ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన బోటు పందేలు జరిగే నెహ్రూ ట్రోఫీ వార్డ్‌కి పంపించారు. చాలా సువిశాలమైన జల ప్రదేశంలో కూడా చిన్న చిన్న పల్లెలున్నాయి. మనము సిటీ బస్సులలో వెళ్లే విధంగా ఈ ప్రాంతంలో వాళ్ళు మర బొట్లలో ప్రయాణం చేస్తారు. అతి సాధారణ మైన జీవితమే కానీ అక్కడ అందరూ హాయిగా జీవిస్తున్నారు అనిపించింది. చుట్టూ నీళ్లు, చెట్లు, కను చూపు మేరలో కానరాని మైదాన ప్రదేశాలు... ఇలా వాళ్ళందరూ ప్రకృతి ఒడిలో ఉన్నట్లుగానే తోచింది. నిజంగా కేరళ దైవ భూమియే అనిపిస్తుంది మనకు.

పర్యాటక రంగము అక్కడున్న వేలాది మందికి ఉపాధి కల్పిస్తుంది. చాలా

సుందరమైన ప్రకృతి సోయగం, నయగారే నదీ జలాలు, సముద్ర తీరములు, హోలిడే గృహాలు, నీళ్లలో తేలియాడే ఇళ్లు, వసతి సముదాయాలు... ఇలా ఏవి చూసినా మనకు సంభ్రమాశ్చర్యాలు కలుగక మానవు. కొత్త జంటలు సంవత్సరం పొడుగునా ఈ ప్రాంతానికి వాళ్ళ హనీమూన్ చేసుకోవడానికి వస్తూనే వుంటారు. ప్రతి క్షణమూ పర్యాటకులకు ఒక మరచి పోలేని అనుభూతిని మిగులుస్తుంది.

నేను కేరళలో దర్శించిన ప్రతి ప్రదేశం ఏదో ఒక చారిత్రాత్మక, పౌరాణిక ప్రాముఖ్యతను కలిగి ఉంది. వాటన్నిటినీ వివరించాలని ఉన్నా ఇలాంటి పుస్తకాలు ఎన్నిటినో వ్రాయ వలసి ఉంటుంది. కానీ, నేను దర్శించినవన్నీ Google లో ఉన్నాయి కాబట్టి మనం దాన్ని శోధించి చూడొచ్చు, చదవవచ్చు. ఇంతటి అద్భుతమైన విషయాలను మనకు అందిస్తున్నందుకు మనమంతా గూగుల్ వారికి ధన్యవాదాలు తెలుపుకోవాలి.

భారత దర్శన్, మే 14, 2019న శ్రీ అదిశంకరుల వారి జన్మస్థలం అయిన కాలడి నుంచి మొదలయ్యింది. మే 29వ రోజు కేరళలోని అల్లెప్పిలో అభయ సేవా పథకాలతో ముగింపు వేడుక జరిగింది. కేరళలోని వారందరి క్షేమం కోసమై నా ప్రార్థనలు మరియు అభయతో పాటు నిలబడిన అందరికీ, లోక కళ్యాణానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు చెబుతూ, శ్రీ కృష్ణ తేజ గారి అనుమతి తీసుకుని ఆ రోజు రాత్రి కర్ణాటకకి బయలుదేరాను. అర్థ రాత్రి అయినా వారు నాకు వీడ్కోలు పలకడానికి రైల్వే స్టేషన్‌కు రావడం నాకు ఎంతో ఆనందం మరియు ఆశ్చర్యం కలిగించాయి.

సుమారు 10 రోజుల పాటు జరిగిన కేరళ సందర్శనములో ఎన్నో విశేషాలు నెమరు వేసుకుంటూ ట్రైన్తో పాటుగా పరుగులెత్తే మనసును ఆలోచనలను నియంత్రిస్తూ నిద్రలోకి జారి పోయాను.

**అభ్యాసాలు/పరిశీలనలు:**

నేను వ్యక్తిగతంగా, ప్రతి కుటుంబాన్ని, ప్రతి సంవత్సరం భారతదేశంలో కనీసం ఒక రాష్ట్రాన్నయినా సందర్శించాలని సలహా ఇస్తున్నాను, ఎందుకంటే ప్రతి రాష్ట్రంలో మనం నేర్చుకోవలసిన మరియు అనుభూతి చెందాల్సిన విషయాలు చాలా ఉన్నాయి.

# కర్ణాటక

## మే 27, 2019

**మంగుళూరులో పసి బిడ్డతో భేటీ:**

భారత్ దర్శన్ తదుపరి భాగంగా నేను 2వ రాష్ట్రము కర్ణాటకకు చేరుకున్నాను. కర్ణాటకలోని మంగళూరుకు చేరుకున్నాను. తరువాత ఎక్కడ వుండాలో తెలియదు. డబ్బులు ఖర్చు పెడితే ఇంకా తిరుగవలసిన ప్రదేశాలు చాలానే వున్నాయి అనుకుంటున్న సమయంలోనే నా ఆత్మీయుడు, మిత్రుడు, శ్రేయోభిలాషి, సి.ఎస్. కిరణ్ కుమార్ గుప్త, తాను, తన కుటుంబంలో కొత్తగా పుట్టిన తమ్ముడి కొడుకుని చూడటానికి మంగళూరుకు వచ్చిన వార్తను నాతో పంచుకున్నారు. నన్ను వచ్చి వారి అబ్బాయికి ఆశీస్సులు అందించమని కోరుకున్నారు. అలా మంగళూరులో నాకు విడిది దొరికింది. అప్పుడే పుట్టిన ఆ పసిపిల్ల వాడికి నా ప్రేమ, ఆప్యాయతలు అందించాను. కర్ణాటక యాత్ర మంగళూరులోని పవిత్ర స్థలాలు చూస్తూ మొదలు పెట్టాను. ప్రతి ఒక్క క్షేత్రము భగవంతుని దివ్య ప్రకంపనలతో నిండి ఉంది. స్థానికంగా ఓలా క్యాబ్ బుక్ చేసాను. డ్రైవర్ ముస్లిం అందులోనూ రంజాన్ దీక్షలో వున్నాడు. అతను చాలా ఓపికగా నన్ను వివిధ క్షేత్రాలకు తీసుకుని వెళ్ళాడు.

ప్రధానంగా శ్రీ గోకర్ణ నాథ క్షేత్రం, శ్రీ కాద్రి మంజునాథ క్షేత్రం, మాతా మంగళా దేవి ఆలయం, కుద్రోలి భగవతి దేవాలయం మొదలగునవి చూసాను. ఆయా స్థల పురాణాల గురించి తెలుసుకోవాలని ఉన్న వారెవరైనా గూగుల్‌లో శోధించుకోవచ్చు. ఎక్కడ చూచినా కేరళ సంస్కృతులే మనకు కనిపిస్తాయి... కారణం మంగళూరు కేరళ కర్ణాటక హద్దులలో వుండటం కావొచ్చు.

మంగళూరులో కిరణ్ వాళ్ళ కుటుంబముతో ఒక్క రోజు సమయం గడిపి అక్కడి నుండి నా యాత్రను మళ్ళీ ముందుకు సాగించాను. మార్గ మధ్యములో

అత్యంత దట్టమైన అడవులలో... పర్వత శ్రేణుల గుండా యాత్ర సాగింది. దక్షిణ చిరపుంజిగా పిలువబడే 'ఆగుంబే' పర్వత ప్రదేశములో కాసేపు సేద తీరాను. అక్కడ సూర్యాస్తమయము చూసేందుకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. నేను కూడా కాసేపు ఆ సుందర దృశ్యాలను చూస్తూ పరవశించి పోయాను. మార్గ మధ్యములో కనిపించే సుందరమైన జలపాతాలను చూస్తూ... అచ్చెరువొందుతూ, ఆస్వాదిస్తూ సాగాను.

## మే 28, 2019

### కుక్కె సుబ్రహ్మణ్య దేవ సర్పము:

మంగళూరు నుండి ప్రయాణం చేసి రాత్రికి కుక్కె పుణ్య క్షేత్రానికి చేరుకున్నాను. అక్కడ దేవాలయ అన్న సత్రంలో భోజనం చేసి వారి చేత నడుప బడే సాధారణ సత్రంలో బస చేసాను. మరుసటి రోజు ఉదయమే తయారయ్యి... శ్రీ కుక్కె సుబ్రహ్మణ్య మరియు ఆది సుబ్రహ్మణ్య స్వాముల దర్శనంతో ఆ రోజు మొదలు పెట్టాలనుకుని బయలు దేరాను. దేవాలయ ప్రాంగణం అంతా చాలా రద్దీగా ఉంది. ఎక్కడా నేను ప్రత్యేక దర్శనానికి టికెట్ తీసుకోవడం చేయకూడదని నిర్ణయించాను. దర్శనానికి బారులు తీరిన వందలాది భక్తులతో నేను కూడా సాధారణ వరుసలో నిల్చున్నాను.

సమస్త లోకా సుఖినోభవంతు అన్న వాక్యాన్ని తారక మంత్రంలా జపిస్తూ... నా లోకంలో నేను వుండగా, ఉన్నట్లుండి నేను నిలుచున్న వరుసలో 6 అడుగుల దూరంలో భక్తులందరూ భయంతో తొలగి క్యూ లైన్‌లో నుండి బయటకు వెళ్తున్నది గమనించాను. నేను నిలుచున్న చోటులోనే వుండి పోయాను. ఏమైందో అర్థం కాలేదు. నా ముందున్న వారు తొలగి పోయిన తరవాత అర్థం అయింది. దేవాలయ ప్రాంగణంలోని గర్భాలయం ప్రాకారం కన్నంలో నుంచి బయటికొచ్చిన ఒక చిన్న తెల్లటి సర్పాన్ని చూసి క్యూలోని వారు చెల్లా చెదరయ్యారు. కానీ నేను మాత్రం ఎట్టి జంకు లేకుండా నిజ మైన నాగరాజు దర్శనం చేసుకోగలిగాను. గర్భగుడిలో ఆవిర్భవించిన పుట్ట దాని పైన వెలసిన నాగ దేవతలను చూడటానికంటే ముందే నిజ రూప దర్శనం లభించడం వల్ల ఎంతో ఆనందాశ్చర్యాలకు లోనయ్యాను. దర్శనం సమయంలో దేవాలయ ప్రాంగణంలో చాలా సేపు వున్నాను.

సుప్రసిద్ధ శ్రీ కుక్కే సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానం కర్నాటక రాష్ట్రం, దక్షిణ కన్నడ జిల్లా, సుల్ల్య తాలూకాలోని సుబ్రహ్మణ్య అను గ్రామములో ఉంది. ఇక్కడ కార్తికేయుడిని సర్ప దేవుడు సుబ్రహ్మణ్యునిగా భక్తులు ఆరాధిస్తారు. గరుడికి భయపడి దివ్య సర్పం అయిన వాసుకి, ఇతర సర్పాలు సుబ్రహ్మణ్యుని చెంత శరణు పొందాయని పురాణాలు చెబుతున్నాయి.

అనాది కాలములో శ్రీ షణ్ముఖ ప్రభువు తారకాసుర మరియు శూరపద్మలను రాక్షసులను వారి అనుచరుల సమేతంగా సంహరించి కుమార పర్వతాన్ని చేరుకున్నారట. వారికి అక్కడ ఇంద్రుడు ఆహ్వానం పలుకుతాడు. రాక్షస సంహారం వల్ల చాలా సంతోషంతో ఉన్న ఇంద్రుడు, కుమారస్వామికి తన కుమార్తె దేవసేనను ఇచ్చి వివాహం కుమార పర్వతం పైన మార్గశిర మాసం శుద్ధ షష్టి నాడు జరిపించారట. ఆ వివాహంతో పాటు జరిగిన షణ్ముఖ పట్టాభిశేఖానికి దేవదేవులు బ్రహ్మ, విష్ణు, రుద్రాది దేవతలు ఆశీర్వాదాలు అందచేస్తారు. ఈ కార్యక్రమానికి ప్రసిద్ధ పుణ్య నదుల నుంచి పవిత్ర జలాలను తెచ్చి మహాభిషేకాన్ని నిర్వహించారు. అలా ఆ పుణ్య నదుల కలియిక నుంచి ప్రవహించిన ధార నేడు కుమారధారగా పిలవబడి అక్కడ ప్రవహిస్తోంది. గరుడుని దాడి నుంచి తప్పించుకోవటానికి సర్ప రాజు వాసుకి, కుక్కే సుబ్రహ్మణ్య క్షేత్రములోని గుహలలో శివ తపస్సు చేస్తుంటాడు. వాసుకి తపస్సుకు ప్రసన్నుడైన శివుడు, షణ్ముఖుడిని ఎల్లప్పుడూ తన ప్రియ భక్తుడు వాసుకికి అండగా, తోడుగా ఉండమని చెపుతాడు. అందుకే, వాసుకికి కానీ నాగరాజుకు కానీ చెయ్యబడే పూజలు సుబ్రహ్మణ్య స్వామి వారికి చేసినట్టే అని చెప్తారు. ఇక్కడ మధ్వ బ్రాహ్మణ బృందాలు పూజాదికాలు నిర్వర్తిస్తారు.

ఇంకా ఎన్నో విశేషాలు ఈ దేవాలయంతో ముడిపడి ఉండటం గమనించాను. చర్మ వ్యాధులతో బాధపడే వారెందరో ఇక్కడ పూజలు చేస్తుంటారు. అక్కడ కుమార ధారలో స్నానం చేసి స్వల్ప ఆహారం తీసుకుని బయలు దేరాను.

## రత్నగిరి బాహుబలి

జ్ఞానం కోసం సర్వం త్యజించి, బాహ్య ప్రపంచ అభిలాష ఇసుమంతైనా లేకుండా పూర్తిగా దీర్ఘ తపస్సులో చలనమే లేక నిలబడిపోయిన మహా

గోమతేశ్వరుడిని చూడటానికి రత్నగిరి వైపు బయలుదేరాను. అంత మహాపెద్ద ఆకారంలో ఉన్న బాహుబలి – గోమతేశ్వరుడు ఈ ప్రపంచంలోని తరతరాల వారికి వైరాగ్యాన్ని బోధిస్తూ నిలవడం అన్నది చాలా స్ఫూర్తినిచ్చింది.

## ధర్మస్థల మంజునాథ

రత్నగిరి నుండి నేను దివ్య శ్రీమంజునాథ స్వామి దర్శనం కోసం ధర్మస్థల వైపు ప్రయాణం సాగించాను. అత్యంత పవిత్రమైన వాతావరణంలో అరుదైన అభిషేక దర్శన భాగ్యం నాకు కలగటం అన్నది ఎంతో అదృష్టముగా భావించాను.

ఈ ఆలయంలో శివుడు, మంజునాథుడు, అమ్మవారు, చంద్రనాథ, కళారాలు అనే ధర్మమూర్తులు మరియు కుమార స్వామి, కన్యాకుమారి మొదలైన దైవమూర్తుల సన్నిధులు ఉన్నాయి. అసాధారణంగా ఈ ఆలయ నిర్వహణ జైన మతస్థుల ఆధ్వర్యంలో నిత్య పూజాదికాలు హిందూ పూజారుల చేత నిర్వహించ బడుతూ ఉంటాయి. నవంబర్, డిసెంబర్ నెలల మధ్య నిర్వహించబడే లక్షదీపాల ఉత్సవం ఈ ఆలయ ప్రత్యేకత. ఆలయంలోని ఆధునిక వంటశాలలో ఆలయ సందర్శనానికి వచ్చే భక్తులందరికీ వంటలు తయారు చేసి రోజూ ఉచితంగా అన్న ప్రసాదం వడ్డిస్తారు. ఆలయ దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆధునిక సౌకర్యాలతో ఉన్న అతిథిగృహ సౌకర్యం కూడా లభిస్తుంది.

ధర్మస్థలం మతసహనానికి ప్రతీక. ఈ ఆలయంలో జైన తీర్థంకరుల సేవలను ధర్మ దేవతలతో మంజునాథుడు కూడా అందుకుంటున్నాడు. ఇక్కడ పూజారులు వైష్ణవ బ్రాహ్మణులు. ఆలయ ధర్మకర్త హెగ్డే. ఆలయానికి చెందిన ఆశ్రమాలలో నివసిస్తున్న వారికి ఉచిత భోజనం, ఉచిత బస లభిస్తుంది.

## ఆలయ ధర్మాధికారితో భేటీ

పద్మభూషణ్ శ్రీవీరేంద్ర హెగ్డేగారు ప్రస్తుతము ఆలయానికి పారంపర్య ధర్మకర్తగా సేవలు అందిస్తున్నారు. శ్రీ వీరేంద్ర హెగ్డే గారిని కలవాలన్నది నాకు చిరకాల వాంఛ. నేను పూర్వము ఈ క్షేత్రానికి వెళ్ళినప్పుడు వారిని చూడాలని, ప్రయత్నించినప్పుడు అది నెరవేరలేదు. కాని ఈసారి మాత్రం వారి కార్యాలయం ప్రక్కగా వస్తున్న సమయంలో, ఆయన లోపలున్నట్లుగా

గమనించాను. సందర్శకులు వారిని చూసి మాట్లాడటానికి అక్కడున్న సిబ్బంది లోపలికి పంపించడం నన్ను ఆశ్చర్యానందాలకు గురి చేసింది. నేను కూడా సామాన్య సందర్శకుడిలా లోపలికి వెళ్లి, వారితో మాట్లాడగలిగాను. వారికి శుభాకాంక్షలు అందించాను. ధర్మస్థల క్షేత్రంలో నీటి ఎద్దడి త్వరగా పోయి సుభిక్షం కావాలని కన్నడలో చెప్పాను. అలాగే నా భారతదర్శనం గురించి విన్న హెగ్డేగారు శ్రీ మంజునాథుని వెండి పతకం ఇచ్చారు. వారినుండి ఆ 'దైవరక్ష' ను తీసుకోవడం అత్యంత విలువైనదిగా భావించాను. ఆయన, అక్కడున్న కార్యకర్తను పిలిచి నన్ను తీసుకొని వెళ్లి దేవాలయంలోని అన్నపూర్ణ (భోజనగది) ని చూపి ప్రసాదము ఇప్పించి మిగతా సౌకర్యాలను కూడా చూపించమని ఆదేశించారు. వారితో పాటుగా వెళ్లి అక్కడ జరిగిన కార్యక్రమాలన్నీ చూసి ప్రసాదం సేవించాను.

## హొర్నాడు అన్నపూర్ణేశ్వరి

ధర్మస్థలం నుంచి నేను హొర్నాడు బయలుదేరాను. కొండల నడుమ జరిగిన ఆ మూడు గంటల ప్రయాణం నా జీవితంలో చాలా మరుపురానిది. ఆకాశాన్ని అంటాయా అన్నట్లున్న ఎత్తయిన పర్వతాలు, దట్టమైన అరణ్యాలు, కాఫీతోటలు, అంతటా నిండిన పచ్చదనం, సహజమైన జలపాతాలు, ప్రశాంతమైన వాతావరణం, ఇవన్నీ కలిసి ఎవరినయినా సరే సునాయాసముగా నిర్మలత్వంలో ముంచెత్తుతాయి.

హొర్నాడు కర్ణాటక రాష్ట్రములోని చిక్కమగళూరులకి నైరుతి దిశగా 100 కి.మీ.ల దూరంలో ఉన్న హిందూ పుణ్యక్షేత్రము. ప్రకృతి రమణీయ సౌందర్యము వెల్లి విరిసే పశ్చిమ కనుమలలో ఉన్న ఈ గ్రామంలో ప్రసిద్ధమైన అన్నపూర్ణేశ్వరీ దేవి ఆలయం ఉంది. ప్రధాన దేవతా విగ్రహాన్ని ఆది శంకరాచార్యులు ప్రతిష్ఠించారు.

ఆదిపరాశక్తి, హొర్నాడు అన్నపూర్ణేశ్వరి దర్శనం భాగ్యం కలిగింది. కర్ణాటకలోని చాలా క్షేత్రాలలో మధ్యాహ్న సమయంలో ఆలయాలు మూసివేస్తారు. దారిలో ఒకరిద్దరు చెప్తుంటే విన్నాను. ఎక్కడా వేచి ఉండే అవసరం ఉండద్దని ప్రార్థించాను.

కారణం ముందుండే మరిన్ని క్షేత్రాల సందర్శన ఆలస్యమయ్యి రాత్రి బసకు

అడవులలో చిన్న ఊళ్లలో ఇబ్బంది అవుతుందని అనిపించేది. అమ్మవారి దర్శనం ఇక ఈ పూట కాదు అనుకున్న నాకు... దేవాలయ ప్రాంగణానికి చేరిన వెంటనే పెద్ద ఎత్తున ఘంటానాదాలు వినిపించాయి. అమ్మకు ఆచారపూర్వక నైవేద్యం మరియు మధ్యాహ్న హారతి సమర్పణ ఇస్తున్నారు. చివరి దర్శనం అని తెలిసి ఇక మెట్ల మీద పడి పరుగులు ఎత్తాను. హారతి సమయంలో అమ్మవారిని చూడటం అనేది కళ్లకి దక్కిన నిజమైన దివ్యమైన విందు అని చెప్పాలి.

అమ్మా నీ దివ్య పాదాల చెంత అన్నప్రసాదం లభించడం అనేది శరీరానికి, మనసుకు, ఆత్మకు, జీవితానికి, మరియు జీవనానికి అదృష్టమని తలుస్తూ, కడుపు నిండా భోజనం చేసాను.

## శృంగేరి

నేను సాయంత్రం 6 గంటలు కావస్తోందనగా శృంగేరి చేరుకున్నాను. శృంగేరి భక్తుల పాలిట ఒక పవిత్ర యాత్రా స్థలం. కర్ణాటక రాష్ట్రంలోని చిక్కమగళూరు జిల్లాలో తుంగభద్ర నది ఒడ్డున ఉన్న శృంగేరిలో జగద్గురు ఆది శంకరాచార్యులు మొదటి మఠాన్ని స్థాపించారు. శృంగేరికి దగ్గరగా ఉన్న శృంగ పర్వతం పేరు మీద దీనికి ఆ పేరు వచ్చిందని చెబుతారు.

ఆది శంకరాచార్యులు దేశాటన చేస్తూ తన శిష్యులతో ఈ ప్రదేశాన్ని పర్యటించారు. అప్పుడు ఆయన ఒక దివ్య సంఘటనను చూశారు. ఒక సర్పము ప్రసవించుచున్న ఒక మండూకానికి తన పడగ విప్పి నీడ కల్పించే దృశ్యం ఆయన్ను ఆశ్చర్యపరిచింది. ఆ ప్రదేశం ఎంతో విశిష్టత గల ప్రదేశంగా గుర్తించిన శంకరాచార్యులు శారదా పీఠాన్ని అక్కడ స్థాపించారు. ఆది శంకరాచార్యులు శృంగేరిలో 12 సంవత్సరాల పాటు నివసించినట్లు చారిత్రాత్మక గాథ. ఆచార్యుల వారు తమ ప్రత్యక్ష శిష్యులైన శ్రీ సురేశ్వరాచార్యుల వారిని ప్రథమ పీఠాధిపతిగా నియమించారు.

శారదాంబ దేవాలయాన్ని (శారదా దేవి ఆలయం) ఆది శంకరాచార్యుల వారు క్రీ.శ. 7వ శతాబ్దంలో స్థాపించారు. ఈ దేవత జ్ఞానాన్ని ప్రసాదిస్తుందని భక్తులు నమ్ముతారు. ఇతిహాసాల మేరకు క్రీ.శ. 14వ శతాబ్దంలో పురాతన గంధపు చెక్క విగ్రహం స్థానంలో బంగారం మరియు రాతి విగ్రహాన్ని పెట్టారు.

ఇక్కడే ఒక లింగం కూడా ఉంది. దీనిని శివుడు శంకరాచార్యుల వారికి ప్రసాదించినట్లు చెప్తారు.

ఇక్కడ ఒక మహామండపం ఉంది. దీనిలో ద్వారపాలకులు, మాత దుర్గాదేవి మరియు మాత రాజరాజేశ్వరి ఉంటారు. పర్యాటకులు అష్టలక్ష్మి చిత్రాలను ఎనిమిది ద్వారాలపై బంగారు పూతలతో దర్శించవచ్చు. ఈ దేవాలయంలో నవరాత్రి మరియు చైత్ర శుక్ల పూర్ణిమ వేడుకలు, కార్తీక పౌర్ణమికి దీపోత్సవం, లలితా పంచమి, మాఘ శుక్ల పంచమి మరియు శారదాంబ రథోత్సవాన్ని ఘనంగా జరుపుతారు. పర్యాటకులు దేవాలయానికి నైరుతి దిశలో కల శక్తి గణపతిని కూడా దర్శించవచ్చు.

## విద్యాశంకర దేవాలయం:

విద్యాశంకర దేవాలయాన్ని విద్యారణ్య స్వామి అనే మహర్షి నిర్మించారు. దేవాలయ శిల్పరచన, చాళుక్య, దక్షిణ భారత మరియు విజయనగర శిల్ప శైలులను ప్రదర్శిస్తుంది. దీనిపై అనేక శిలాశాసనాలు విజయనగర రాజ్యానికి సంబంధించి చూడవచ్చు. నలుచదరం కల ఈ దేవాలయానికి 12 స్తంభాలు కలవు. ఇవి 12 రాశులను తెలుపుతాయి.

ఆలయం లోపల దుర్గామాత, విద్యాగణేశ, బ్రహ్మ, విష్ణు, మహేశ్వర విగ్రహాలు ఉన్నాయి. దేవాలయ సీలింగ్ పైన అందమైన శిల్పకళాచిత్రాలు, గోడలపై శివ, విష్ణు దశావతారాలు, మాతా కాళీ, షణ్ముఖ మరియు వివిధ జంతువుల చిత్రాలను గమనించవచ్చు.

## ఆదిశంకర దేవాలయం:

ఆదిశంకర దేవాలయంలో జగద్గురు శంకరాచార్యుల విగ్రహం ఉంటుంది. ఈ విగ్రహాన్ని 2 అడుగుల ఎత్తులో ఒక పీఠంపై స్థాపించారు. ఈ విగ్రహం యోగాసన భంగిమలో సరిగ్గా శివలింగానికి ఎదురుగా ప్రతిష్టించారు. ఆలయంలో పంచామృత అభిషేకం, రుద్ర అభిషేకం, అర్చన వంటివి జరుగుతాయి. ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు తిరిగి సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 8:30 వరకు ఆలయాన్ని దర్శించవచ్చు.

## శృంగేరి - ఇతర ఆకర్షణలు:

శృంగేరి మఠం, కరేఆంజనేయ దేవాలయం, చెప్పారా ఆంజనేయ దేవాలయం, కిగ్గ, మల్లికార్జున దేవాలయం, మళయాళ బ్రహ్మ దేవాలయం, తోరణ గణపతి దేవాలయం, శ్రీ పార్శ్వనాథ దేవాలయం, నరసింహవనం, తుంగా నది, సిరిమనే జలపాతాలు అనేవి శృంగేరిలో చూడవలసిన ఇతర ఆకర్షణీయ ప్రదేశాలు.

ఆది శంకరుల వారు ప్రథమంగా స్థాపించిన ఆచార్యపీఠం ఉన్న ఈ క్షేత్రాన్ని చేరుతుంటే మనసంతా ఆనందంతో ఊగిసలాడింది. కారణం, కాలడిలోని ఆదిశంకరుల జన్మస్థానం నుండి బయలుదేరిన నాకు ఎదురైన మొదటి పీఠం ఇది. దక్షిణ భారత దర్శనంలో ఒక మైలురాయిగా భావించాను. దేవాలయ సముదాయానికి ఎదురుగా ఉన్న ధర్మశాలలో ఉచితంగా సాధారణ గదిలో వస్తువులు ఉంచి మొదటి మైలురాయిని చేరినందుకు గుర్తుగా... ఆదిశంకరుల వారిని తలుస్తూ అక్కడ కేశఖండనం చేయించుకున్నాను. గదికి చేరే సమయంలో తెలిసింది. జగద్గురువులు ఇరువురు నరసింహవనంలో దర్శనమిచ్చే సమయం అని ఆలస్యం చేయకుండా గురు నివాసముకు పరుగు పరుగున చేరుకున్నాను.

ఆశ్చర్యంగా జగద్గురు శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వామీజీ ఆశీర్వచనాలను అందుకున్న చివరి భక్తుడను నేనే. నా భారత దర్శనం గురించి విన్న వారు నన్ను ఆశీర్వదించి, సంతోషాన్ని ప్రకటిస్తూ, తమ ఆసనం విడిచి వెళ్లే ముందు, అటు పక్కనే ఉన్న శ్రీశ్రీశ్రీ విదుశేఖర భారతీ మహాస్వామీజీని కలవమని సూచించారు.

శ్రీశ్రీశ్రీ విదుశేఖర భారతీ మహాస్వామీజీ నన్ను చూస్తూనే, చిరునవ్వుతో పలుకరిస్తూ... అభయ సామాజిక సేవా కార్యక్రమాల గురించి గుర్తు చేసుకొని దీవించారు. వినయ విధేయతలతో చేతులు కట్టుకుని వారికి భారత దర్శనం గురించి, అనంతపురం ప్రాజెక్టు గురించి చెప్పాను. అభయ సమాచార పత్రికను కూడా వారు ప్రేమాసక్తితో చూశారు. స్వామీజీ దేవాలయాలు, వాటి నిర్వహణ కార్యక్రమాలలో మేము తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. నేను మరుసటి రోజు కూడా ఉంటున్న విషయాన్ని తెలుసుకున్న వారు ఉదయం

10:30 గంటలకు వచ్చి ఆశీర్వచనాలను తీసుకోవాలని నిర్దేశించారు.

సాయంత్రం శ్రీ శారద మాత దర్శనం లభించడం అన్నది, మరల ప్రసాదం స్వీకరించడం అన్నది నన్ను వరించిన మరో దివ్య అవకాశం. అమ్మవారి సమక్షంలో జరిగిన నిత్య సేవలలో ఎలాంటి అడ్డు లేకుండా, ఎలాంటి రుసుము లేకుండా, నా సొంత ఇంట్లోలాగా... సుమారు 2 గంటల పాటుగా వుండి నిత్య రథోత్సవములో పాల్గొన్నాను.

మళ్లీ రాత్రి 9 గంటలకు చంద్రమౌళేశ్వర అర్చనను శ్రీ జగద్గురువు సమక్షంలో చూచే భాగ్యం కలిగింది. హృదయం అంతా దేవీ ప్రకంపనలతో నిండిపోయింది. అక్కడ నుంచి సెలవు తీసుకుని నా భారత దర్శనంలో మరో రోజుకు స్వస్తి పలుకుతూ బసకు చేరి విశ్రమించాను.

బసకు చేరినప్పుడు అక్కడ యాదృచ్ఛికంగా వేద పండితులు మరియు సాయి సోదరులు అయిన శ్రీ అనిల్ కుమార్‌ను చూసాను. ఆయన నా భారత దర్శనం గురించి విని చాలా సంతోషించి, ఎంతో ప్రేమతో నా ఖర్చుల నిమిత్తం కొంత డబ్బు ఇచ్చారు. అది బాబానే స్వయంగా నాకు ఇచ్చిన డబ్బుగా అనిపించింది.

## మే 29, 2019

### శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ తీర్థస్వామి, భారత దర్శనకు దీవించడం:

మరుసటి రోజు ఉదయం జగద్గురువులు ఆదేశించిన విధంగా వారి దివ్య ఆశీర్వచనాల కోసం తుంగభద్ర నది ఆవలి తీరంలో ఉన్న గురు నివాసం చేరుకున్నాను. నన్ను చూసిన తరువాత మహాస్వామీజీ చిరునవ్వుతో ఆశీర్వచనాలు ఇస్తూ – “రా బాలచంద్రా, నీ ప్రయాణాన్ని ఆశీర్వదిస్తున్నాను. క్షేమంగా తిరిగి రా” అని, పూర్ణ ఫలాన్ని, అక్షింతలను అందించారు. శృంగేరి క్షేత్రంలో నిలువెల్లా నిండిన దివ్య ప్రకంపనలతో నా హృదయం తడిసి ముద్దయింది.

**పరిశీలనలు:–**

1. ప్రశాంతమైన వాతావరణం, నిర్మలమైన పరిసరాలు రెండూ కలిసి ఎవరికైనా నిర్మలమైన మనసునిస్తాయి.

2. నైవేద్య ప్రసాదం తీసుకుంటున్నప్పుడు మనకు ఒక విభిన్నమైన ఆనందం లభిస్తుంది.
3. నాకు నిజంగా తెలియటం లేదు ఆభగవంతుడు ప్రతీ రోజు నా మీద అంత దయతో ఎందుకు ఉంటున్నది అనేది.
4. భారత దర్శన్ సమయంలో ప్రతీ రోజు భగవంతుడు అందించిన అనుభవాలు నాకు ఆలోచనలో... వాక్కులో... కర్మలో స్వచ్ఛతను చేకూర్చాయి.

**ఉడిపి – ఆకర్షణ కృష్ణుడు**

శృంగేరి నుండి ఉడిపి శ్రీకృష్ణ ఆలయానికి బయలుదేరాను. అత్యంత దట్టమైన అరణ్యాల గుండా, పర్వతాలను, లోయలను చూస్తూ వెళ్తూ వుంటే మార్గం మొత్తం హృదయానికి, కన్నులకు పసందైన విందులా అనిపించింది. మార్గమధ్యంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఆగొంబే లోయను చూడగలిగాను.

కర్ణాటకలోని శిమోగా జిల్లాలో మూడు చదరపు కీ.మీ. చిన్న గ్రామం ఆగుంబే. జనాభా దాదాపు ఐదు వందలు. పక్షుల కిలకిలలు తప్ప పట్టణ ప్రాంతపు రణగొణ ధ్వనులేవీ ఇక్కడ వినిపించవు. పడమటి కనుమల్లో పుష్కలంగా వర్షాలు కురిసే ప్రదేశం ఇది. అందుకే పచ్చదనానికి చిరునామాలా ఉంటుంది. పొగమంచుతో కూడిన అడవి అందాలు అగుంబేలో కనువిందు చేస్తాయి. ఈ ప్రదేశాన్ని దక్షిణ భారతదేశపు చిరపుంజిగా అనిపిలుస్తారు. పశ్చిమ కనుమల వద్ద ఈ ప్రదేశంలో జూన్ నుండి సెప్టెంబర్ మధ్యకాలంలో అత్యధిక వర్షపాతం పడుతుంది. మాన్‌సూన్ సీజన్లో అడవి మొత్తం పొగమంచుతో ఉంటుంది. ఎన్నోరకాల పేర్లతో పిలువబడే వాటర్ ఫాల్స్ కనువిందు చేస్తాయి. కుంచికల ఫాల్స్, బర్కానా ఫాల్స్ అందాలు తనివితీరా చూడాల్సిందే. అగుంబే చుట్టు పక్కల ముఖ్యంగా చూడాల్సినవి ఇక్కడి జలపాతాలు. కొండల మీద నుండి నేల మీదకూ ఉరికే జలపాతాలు ఇక్కడ అడుగడుగునా తారసపడతాయి.

అలా మధ్యాహ్న భోజన సమయానికి ఉడిపి చేరుకున్నాను. స్వామి వారి ఆలయంలో అన్న ప్రసాదం తీసుకున్న తర్వాత, ఆ ఆలయ పర్యవేక్షణ అధికారిని కలిసాను, ఆయన నా భారతదేశ సందర్శన యాత్ర గురించి తెలుసుకున్నాక,

నాకు దయతో ఒక గది ఇచ్చారు, గదికి వెళ్లి త్వరగా సేద తీరి కార్యక్రమాలు ముగించుకుని గుడికి పరిగెట్టుకుంటూ వెళ్లాను.

అతి అందమైన శ్రీకృష్ణుని ఎన్నిసార్లు దర్శించుకున్నానో నాకు తెలియదు. కానీ నేను దర్శించుకున్న ప్రతిసారి హృదయం దివ్య హర్షాతిరేకముగా తన్మయత్వంతో భారమై పోతూనే ఉంది. కిటికీలోకి తొంగి చూస్తూ స్వామి వారి దివ్యమంగళ విగ్రహాన్ని చూసినప్పుడల్లా సమస్త లోకా: సుఖినోభవంతు అని ప్రార్థిస్తూ ఉన్నాను. జగద్గురు మధ్వాచార్యులు ఎలా ద్వారకా నగరం సముద్ర తీరం నుంచి వచ్చిన ఈ విగ్రహాన్ని తీసుకుని వచ్చి ఇక్కడ, ఉడిపిలో ప్రతిష్టించారు అనేది ఒక ఆసక్తికరమైన గాథ.

పదమూడవ శతాబ్దంలో ద్వైతవేదాంతాన్ని ప్రబోధించిన హిందూతత్వ వేత్త మధ్వాచార్యులు ఈ మఠాన్ని ప్రారంభించారని చెప్తారు. ద్వైతమతాన్ని ప్రచారం చేస్తూ ఇక్కడకు చేరుకున్న మధ్వాచార్యులకు సముద్రతీరంలో శ్రీకృష్ణుడి విగ్రహం కనిపించిందని, దానిని ఆయనే ఇక్కడ ప్రతిష్టించారనేది స్థల పురాణం.

ఎనిమిది మఠాలతో పూజా కార్యక్రమాలు: మధ్వాచార్యులు తన శిష్యుల్లో ఎనిమిది మందిని ఎంపిక చేసి.. వారితో ఈ ప్రాంతంలోనే ఎనిమిది మఠాలను (అవి పుత్తగె, పేజావర, పలిమారు, అదమారు, సోదె, శీరూరు, కాణియూరు, కృష్ణాపుర) ఏర్పాటు చేసారు. ఒక మఠం తరువాత మరొక మఠం వారు వంతుల వారిగా ఉడిపి శ్రీకృష్ణుడి పూజా కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాటుచేశాడు. ఆధ్యాత్మికతను ప్రబోధించడమే కాకుండా ధ్యాన కేంద్రంగా కూడా శ్రీకృష్ణ మఠం ప్రాచుర్యం పొందింది.

## శ్రీకృష్ణ మఠం విశిష్టతలు:

ప్రశాంతతకు, ఆధ్యాత్మికతకు, చక్కని వాతావరణానికి మారుపేరు శ్రీకృష్ణ మఠం. ఒక్కసారి మఠం చుట్టుపక్కలకి అడుగు పెట్టితే చాలు.. ఎవరైనా సరే.. తెలియని పరవశానికి లోనవుతారు. దాస సాహిత్యానికి పుట్టినిల్లుగా శ్రీకృష్ణ మఠాన్ని పిలుస్తారు. మిగతా హిందూ దేవాలయాలకు భిన్నంగా ఇక్కడ స్వామి దర్శనం ఉంటుంది. మఠం ఉత్తర ద్వారంనుంచి లోపలికి వెళ్ళితే మధ్యలో సరోవరం కనిపిస్తుంది. ప్రధాన ఆలయానికి ద్వారం ఎడమ వైపు ఉంటుంది.

అటు నుంచి కొద్దిగా ముందుకి వెళ్ళితే చెన్నకేశవ ద్వారం కనిపిస్తుంది. చెన్నకేశవ స్వామి ద్వారంనుంచి ముందుకెళ్లి ప్రదక్షిణం చేసిన తర్వాత శ్రీకృష్ణుడిని వెండితో తాపడం పెట్టిన నవరంధ్రాల గవాక్షంలో నుంచి దర్శనం చేసుకోవాలి. శ్రీకృష్ణ దర్శనం తర్వాత అనంతేశ్వర దేవాలయం, వెయ్యేళ్ల క్రితం నిర్మించినట్టు చెప్పే అష్టమఠాలు. ఉడిపి చుట్టు పక్కల కాపు బీచ్, సెయింట్ మేరీ ఐలాండ్, మాల్పే బీచ్, కుడ్లు జలపాతాలు ఇక్కడ సందర్శించాల్సిన మరికొన్ని పర్యటక ప్రదేశాలు.

**పాకజ:**

గుడికి 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న మధ్వాచార్య జన్మస్థలమైన పాకజ క్షేత్రానికి నేను బయలుదేరాను. ద్వైత సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన మధ్వాచార్యుల చిరకాల జ్ఞాపకాలను చూసి మంత్రముగ్దుణ్ణి అయ్యాను. మధ్వాచార్య లీలలను తెలియజేసే వాసుదేవతీర్థ, కుంజగిరి దుర్గాదేవి, పరశురామ దేవాలయాలను దర్శించుకున్నాను. నిజానికి చాలామంది ఉడిపి దాకా వెళ్ళి వస్తారు. ఆ చుట్టూ ఉన్న ఇంకొన్ని క్షేత్రాలకు మనం వెళ్ళగలిగితే ఇంకొన్ని మధురానుభూతులు మనవి అవుతాయి. తిరిగి ఉడిపికి వచ్చి స్ఫూర్తినిచ్చే కనకన కిండి తోపాటు అనంతేశ్వర, చంద్రమౌళీశ్వర, ఉడిపి శ్రీకృష్ణ ఆలయాలను దర్శించుకున్నాను.

ఉడిపి పలిమారు శ్రీకృష్ణ మఠ పీఠాధిపతి శ్రీ విద్యాదీషతీర్థ స్వామివారిని దర్శించుకొని ఆశీర్వచనాలు తీసుకున్నాను. శ్రీ విద్యాదీష స్వామి సమక్షంలో నైవేద్య సేవ, పల్లకి సేవ, రథ సేవ, హారతిని దర్శించుకున్నాను.

## మే 30, 2019

**కొల్లూరు మూకాంబికా:**

ఉడిపి శ్రీకృష్ణ దేవుని మరొక్కమారు తనివితీరా దర్శంచుకుని శ్రీ ఆది శంకరాచార్యులచే ఆరాధించబడిన కొల్లూరికి బయలుదేరాను. వాతావరణం, అరణ్యాలు, ఘాట్రోడ్లు, వేళపాళాలేని భోజనాల వల్ల, సాధారణ ప్రయాణపు సాధనాల వల్ల నాకు ఈసారి ప్రయాణం ఒక పీడకల అయ్యింది. కానీ కొన్ని వందల సంవత్సరాల క్రితం శ్రీ ఆదిశంకరుల వారు ఒట్టి కాళ్ల మీద ఎలా ఈ క్షేత్రాన్ని దర్శించారు అన్నది బహు ఆశ్చర్యకరమైన విషయమే.

ఆది శంకరాచార్యుల చేత ప్రతిష్టించబడ్డ ప్రధాన దేవత కొల్లూరు మూకాంబిక దేవాలయాన్ని చేరుకున్నాను. అత్యంత శక్తి స్వరూపిణి అయిన ఆ ఆది శక్తిని చూడటానికి మన ఈ రెండు కళ్ళు చాలవు... యధావిధిగా నేను అనేక సార్లు దర్శనం చేసుకున్నాను. అక్కడ అంత రద్దీ కూడా లేదు. నేను అందరి కోసం ప్రార్థన చేస్తూ ఉండిపోయాను. ఆ తల్లి ముందు నుండి అసలు కదలలేక పోయాను.

కర్ణాటకలో పడమటి కనుమల్లో అందమైన కొండలు, లోయలు, ఫలవృక్షాల మధ్య కొల్లూరులో మూకాంబిక క్షేత్రం ఉంది. కామాసురుడు అనే రాక్షసుడు శివుని అనుగ్రహం కోసం తీవ్ర తపస్సు చేస్తే ఆయన ప్రత్యక్షమై వరం కోరుకొమన్నాడు. కామాసురుడికి శివుడు వరం ఇస్తే లోకకంఠకుడు అవుతాడని భావించి వాగ్దేవి సరస్వతీదేవి వాడి నాలుకపై చేరి మాట రాకుండా మూగవాడిని చేసింది. మూగవాడై పోయినందువల్ల ఆ కామాసురుడు శివుడిని నోటిమాటతో ఏ వరమూ కోరకోలేక పోయాడు. అప్పటి నుంచి వాడిని "మూకాసురుడు" అన్నారు. అప్పుడు "కోలరుషి" ఉపాయం మేరకు పార్వతీదేవి, సకల దేవతల శక్తులన్నిటిని కలిపి ఒక తీవ్ర శక్తిగా సృష్టించింది. ఈమె మూకాసురునితో యుద్ధం చేసి సంహరించింది. వాడి ప్రార్థన మనస్ఫూర్తిగా అంగీకరించి వాడికి కైవల్యము ప్రసాదించింది. మూకాసురుడిని దేవి సంహరించిన ప్రదేశాన్ని "మారణకట్టే" అంటారు (మరణ గద్దె).

మూకాసురుడు అమ్మవారిని మూకాంబికగా తన పేరుపై విలసిల్లమని కోరుకొన్నాడు. వాడి కోరిక తీర్చి కొల్లూరులో మూకాంబిక నామంతో విరాజిల్లుతూ భక్తులకు కొంగు బంగారంగా ఉంది. ఈ ఆలయంలో మూకాంబికా దేవి పద్మాసనంలో ప్రశాంతంగా మూడు నేత్రాలతో దర్శనమిస్తుంది. శంఖం, చక్రం, గద ఆయుధాలను ధరించి ఉంటుంది.

ఆలయానికి కనీసం 1200 ఏళ్ల చరిత్ర ఉంది. హలుగల్లు వీరసంగయ్య అనే రాజు అమ్మవారి విగ్రహం చెక్కించాడని చెప్పుకొంటారు. మంగుళూరు నుంచి నూట ముప్ఫై కిలోమీటర్ల దూరంలో, ఉడిపి క్షేత్రానికి ఎనభై కిలోమీటర్ల దూరం కొండల మధ్య ప్రకృతి అందాలు విందు చేస్తుండగా కుడజాద్రిశిఖరంపై ఈ ఆలయం కనువిందు చేస్తుంది. తమిళనాడుకు అత్యంత సమీపంలో

ఉంటుంది. బంగారు శిఖరంతో భక్తజనాల దృష్టిని ఆకర్షిస్తుంది.

కొల్లూరులో పరమానందకరమైన దర్శనం అయ్యాక అక్కడ నుంచి మురుడేశ్వర్‌కి బయలుదేరాను. సముద్రతీరంలో నిర్మించబడిన అతిపెద్ద పరమశివుని విగ్రహం, దానితో పాటు పోటీపడినట్లుగా ఉండే రాజగోపురం వెరసి ఈ క్షేత్రాన్ని చాలా అందమైన ప్రదేశముగా మార్చేసాయి.

మురుడేశ్వర పట్టణం ఇతిహాసం త్రేతాయుగం నాటిది. రావణాసురుడు, శివుని గురించి అకుంఠిత తపస్సు చేసి మెప్పించి ఆత్మలింగాన్ని భూలోకానికి తెస్తాడు. కాని శివుడు ఇచ్చిన ఆత్మలింగం స్వభావం ప్రకారం భూమి మీద ఆ లింగం ఎక్కడ పెడితే అక్కడ స్థాపితమై, అక్కడ నుంచి తిరిగి ఎత్తశక్యం కాదని శివుడు చెబుతాడు. రావణాసురుడు ఆత్మలింగాన్ని లంకలో ప్రతిష్టిస్తే ప్రతికూల చర్యలు జరుగుతాయని భావించి దేవతలు విష్ణువును వేడుకొనగా విష్ణువు తన మాయతో సూర్యాస్తమయం అయ్యేటట్లుగా చేస్తాడు. అప్పుడు రావణుడు సూర్యాస్తమయం అయ్యిందని భావించి సంధ్యవార్చుకోవడానికి సంసిద్ధుడు అవుతాడు.

ఈ విషయం తెలుపుకొన్న నారదుడు వినాయకుని వద్దకు వెళ్ళి రావణాసురుని వద్ద నుంచి ఆత్మలింగం తీసుకొని భూమి మీద పెట్టాలని చెబుతాడు.

అప్పుడు వినాయకుడు నారదుడు కోరినట్లుగా రావణాసురుడు సంధ్యవార్చుకొనే సమయానికి బ్రాహ్మణవేషంలో వెడతాడు. ఆ బ్రాహ్మణ బాలకుడిని చూసిన వెంటనే రావణాసురుడు తాను సంధ్యవార్చుకొనవలసిన కారణమున ఆ బాలకుడిని లింగాన్ని పట్టుకొనవలసినదిగా కోరుతాడు. అప్పుడు వినాయకుడు లింగం చాలా బరువు ఉంటే తాను ఎక్కువ సేపు మోయలేనని, మోయలేకపోయే సమయంలో మూడు సార్లు పిలుస్తానని రావణాసురుడు రాకపోతే ఆ లింగాన్ని భూమిపై పెడతానని చెబుతాడు.

రావణాసురుడు అందుకు అంగీకరించగా, వినాయకుడు లింగాన్ని తన చేతులలోకి తీసుకొంటాడు. రావణాసురుడు సంధ్య వార్చుకోవడానికి వెళ్ళగానే గణపతి లింగాన్ని మోయలేకపోతున్నట్లుగా మూడు సార్లు పిలుస్తాడు. సంధ్య మధ్యలో ఉండడంతో రావణాసురుడు అక్కడకు వచ్చేటప్పటికి వినాయకుడు

లింగాన్ని భూమి మీద నిలుపుతాడు. రావణాసురుడు వచ్చి లింగాన్ని భూమి మీద నిలిపినందుకు గణపతి నెత్తిమీద మొట్టుతాడు, గణపతి నెత్తికి గుంట పడుతుంది. వినాయకుడు భూమి మీద నిలిపిన స్థలం గోకర్ణ, మురుడేశ్వర లింగం పడిన భాగాలలో ఒక ప్రదేశం.

విష్ణువు తన మాయను తొలగించగానే సూర్యుడు ఆకాశంలో మళ్ళీ కనిపిస్తాడు. ఈ విషయాన్ని గ్రహించిన రావణుడు ఎంతో కోపోద్రిక్తుడై ఆత్మలింగాన్ని తన చేతులతో పెకలించే ప్రయత్నం చేస్తాడు. ఆత్మలింగంపై నున్న కవచాన్ని విచ్ఛిన్నం చేసి విసిరి వేస్తే గోకర్ణకు 23 కి.మీ. దూరంలో సజ్జేశ్వర అనే ప్రదేశంలో పడుతుంది. లింగంపైనున్న భాగాన్ని తొలగించి విసిరి వేస్తే అది గోకర్ణకు 27 కి.మీ. దూరంలో ఉన్న గుణేశ్వరలో పడుతుంది. లింగంపై నున్న వస్త్రాన్ని విసిరి వేస్తే అది కందుకపర్వతం పై ఉన్న మృదేశ్వరలో పడుతుంది. ఆ పేరు కాలక్రమంలో మురుడేశ్వరగా మారింది.

**మురుడేశ్వర దేవాలయం:**

ఈ దేవాలయం కందుకపర్వతం మీద ఉంది. మూడు వైపుల అరేబియా సముద్రం ఆవరించి ఉంది. ఈ దేవాలయ గాలిగోపురం 20 అంతస్తులు వుంది. దేవాలయానికి వెళ్ళే మార్గంలో రెండు నిజమైన ఏనుగులు ఉన్నాయన్నంత భ్రమ కలిగే విధంగా వుంటాయి.

**మురుడేశ్వరకోట:**

ఈ కోట మురుడేశ్వర దేవాలయం వెనుక భాగంలో ఉంది. ఈ కోటని టిప్పు సుల్తాను పునరుద్ధరించాడు.

**శివుని విగ్రహం:**

ఆలయ సముదాయంలో ఉన్న ఈ శివుని విగ్రహం చాలా దూరం నుంచి కనపడుతుంది. ఆధారాల ప్రకారం ఈ విగ్రహం ప్రపంచంలోనే అతిపెద్ద శివుని విగ్రహం. 123 అడుగుల (37 మీటర్ల) ఎత్తు కలిగిన ఈ విగ్రహాన్ని చెక్కడానికి 2 సంవత్సరాలు పట్టింది. శివ మొగ్గకు చెందిన కాశీనాథ్, ఆయన కుమారుడు

శ్రీధర్, ఇతర శిల్పులు కలిసి కోటి రూపాయల ఖర్చుతో ఈ విగ్రహాన్ని చెక్కించారు. ఈ విగ్రహంలో మరో ప్రత్యేకత ఏమనగా సూర్యరశ్మి పడినప్పుడు ఈ విగ్రహం మెరుస్తుంది.

అక్కడి నుంచి త్వరగా బయలుదేరి బాలగణపతి, రావణుడు శివుడి ఆత్మలింగాన్ని శ్రీలంకకు తీసుకువెళ్ళకుండా నిరోధించి ఆ ఆత్మలింగాన్ని ఎక్కడైతే ప్రతిష్టించాడో... ఆ క్షేత్రం అయిన, గోకర్ణకు చేరుకున్నాను. కానీ నేను అక్కడికి చేరుకునే సరికి ఆ ఆలయ తలుపులు మూసివేశారు. ఇంకా నా చేతిలో మూడు గంటల సమయం ఉన్నందువల్ల, గోకర్ణకు దగ్గరలోనున్న ఓం ఆకారంలో ఏర్పడిన బీచ్‌కి వెళ్లాను. ఆ తర్వాత మహాబలేశ్వర్‌ని దర్శించుకొని అతిసుందరమైన శ్రీ బాలగణపతిని చూసాను. సాయంత్ర సమయం కావడంతో దేవాలయంలో ఎవ్వరూ లేరు. స్వామివారిని చూసి నన్ను నేను మరచిపోయానంటే నమ్మండి. ఆ విగ్రహాన్ని కౌగిలించుకోకుండా నన్ను అదుపు చేసుకోలేకపోయాను. అందరి కోసం హృదయపూర్వక ప్రార్థనలు చేసాను. అంతటి అందమైన ఆకర్షణీయమైన గణేశుని విగ్రహమును నేను ఎక్కడా చూడనేలేదు. ఇక్కడ మాత్రమే కాదు... భారత దర్శన్‌లో నేను వెళ్లిన ఆలయాలలోని ప్రతి దేవతాస్వరూపం ప్రేమలో నేను పడిపోయాను. బహుశా నేను వారిని నిజ స్వరూపాలుగా భావించినందున నా మీద నాకు అదుపు తప్పి, ఆ ఆలయాలలో ఒక ఉద్రేకమైన ఉత్తేజిత భావనతో ప్రవర్తించానని అనిపించింది.

ప్రధాని శ్రీ నరేంద్ర మోడీగారు, ఆయన కౌన్సిల్ ఆఫ్ మినిష్టర్స్‌తో రాష్ట్రపతి భవనంలో ప్రమాణ స్వీకారం చేసిన రోజు ఇదే అవ్వడము, నేను ఆ ప్రధాన దేవతలను పదేపదే దర్శించుకోవడం, ఆయన నాయకత్వంలో దేశ ప్రజలందరూ క్షేమంగా ఉండాలని హృదయపూర్వక ప్రార్థనలు చేయడం గమనించుకున్నాను.

## మే 31, 2019

### షిమోగా / శివమొగ్గ:

ఆ తర్వాత శ్రీ ఆది శంకరాచార్యులచే శతాబ్దాల క్రితం దర్శింపబడిన స్థలంగా నమ్ముతున్న షిమోగాకు బయలుదేరాను.

మంగళూరు నుంచి నాలుగు రోజుల ప్రయాణం తర్వాత క్యాబ్ డ్రైవర్

సిద్ధిక్ నన్ను ఉడిపిలో దింపాడు. అతను రంజాన్ ఉపవాసంలో ఉన్నప్పటికీ నాకు ఎలాంటి ఇబ్బందిని కలిగించలేదు. డ్రైవింగ్ కర్తవ్యంలో ఉండి కూడా చేస్తున్న తన రంజాన్ తీవ్ర ఉపవాస దీక్ష నన్ను ఆశ్చర్యచకితుడిని చేసింది. అంతటి అద్భుతమైన క్యాబ్ డ్రైవర్ అతను. ఉడిపి నుంచి 5 గంటల ప్రైవేట్ బస్సులో ప్రయాణం చేసిన తర్వాత ఉదయం నాలుగు గంటలకు షిమోగా చేరుకున్నాను.

ఘాట్ రోడ్లు కావడం చేత అసౌకర్యమైన నిద్రలేని ప్రయాణం అయ్యింది. చివరకి షిమోగా బస్టాండ్‌కు చేరుకున్నాను. సులభ్ కాంప్లెక్స్‌లో స్నానం ముగించుకొని ఇంతకు మునుపు శ్రీ ఆది శంకరాచార్యులచే దర్శించబడ్డ స్థలంగా నమ్ముతున్న కుడ్లీకి చేరుకున్నాను. ఆ ఉదయపు వాతావరణం, తుంగ, భద్ర నదుల సంగమ ప్రదేశం, ఆ పురాతన ఆలయాల దర్శనం, ఆ ప్రకృతి సౌందర్య దర్శనంతోనే నేను బాగా సేద తీరాను. నది ఒడ్డునున్న రామేశ్వర, నరసింహ, శారదాంబ ఆలయాలను దర్శించుకొని షిమోగాకు తిరిగి బయలుదేరాను.

ఉదయం ఎనిమిది గంటలకు కె.ఎస్.ఆర్. టి. సి. బస్సులో బెంగుళూరుకు బయలుదేరాను. 8 గంటల దుర్భరమైన ప్రయాణం, వేసవి వేడి, నీళ్ల మార్పు, నాణ్యతలేని ఆహారం వల్ల నాకు బాగా అసౌకర్యమై, నా పొట్ట బాగా దెబ్బ తిని నన్ను ఇబ్బందిపరచడం మొదలుపెట్టింది. కానీ ఆ భగవంతుని దయవల్ల నేను ఇబ్బంది నుంచి ఇంటికి చేరుకునే లోపుగా బయట పడ్డాను.

## జూన్ 1, 2019

### స్వగృహం - బెంగళూరు:

శివమొగ్గ నుండి ప్రయాణమై, బెంగుళూరులో తల్లితండ్రులను చూసి వారితో ఒక రోజు గడపాలన్న ఆశతో నా స్వగృహానికి చేరుకున్నాను. అన్నయ్య, వదిన, పాప చిన్మయిలతో భారత దర్శన్ విశేషాలు పంచుకుని... మంచానికి పరిమితమైన నాన్నను చూసి... అటునుండి తమ్ముడి కుటుంబాన్ని సందర్శించి... అబ్బాయి కౌస్తుభ్ 10వ తరగతి పరీక్షల కోసం శుభాకాంక్షలు, శుభాశీస్సులు అందించాను.

### గాయత్రి... మూర్తీభవించిన ప్రేమ

గాయత్రి మూర్తితో 3 దశాబ్దాల పరిచయం. నేను భారత దర్శన్

ప్రారంభించిన సమయంలో వారు ఇద్దరూ లండన్‌లో ఉన్న తమ కూతురు సాయిజాహ్నవి వద్ద వున్నారు. ఎంతో ప్రేమానురాగములతో నన్ను చూసుకునే ఈ ఆత్మబంధువులను చూడాలని... వాళ్ళ ఆశీస్సులు కూడా తీసుకోవాలని వారింటికి వెళ్లాను. నన్ను చూసిన వారి ఆనందానికి అంతేలేదు. నేను పంచుకున్న అనుభూతులను, అనుభవాలను వింటూ మైమరచిపోయారు. వాళ్లు కూడా నాతో పాటుగా ప్రయాణం చేసినట్లే అని భావించి ఆనందపడినారు. దారి ఖర్చుల నిమిత్తం కొంత డబ్బులు కూడా నాకిచ్చి వారి సంతోషాన్ని వ్యక్తం చేసారు. వారి నుండి సెలవు తీసుకుని ఇంటికి చేరుకున్నాను.

## జూన్ 2, 2019

**మైసూరు - మహిషాసురుని ఊరు:**

మా అన్నయ్య సి.ఎ. నారాయణ రంగయ్య, మైసూరులోని శక్తిపీఠం (చాముండిక్రౌంచ పట్టణం) దర్శించుకోవడానికై... నేను నెల రోజుల నుండి యాత్రలో గురైన అసౌకర్యానికి ఒకింత బాధపడుతూ, నా సౌకర్యార్థం వారి కారును మరియు డ్రైవర్‌ను ఏర్పాటు చేసారు. కొన్ని దశాబ్దాలుగా నాతో సన్నిహితంగా ఉన్న రామకృష్ణ నాకు తోడుగా వచ్చారు.

సోమనాథపురంలో ఉన్న పురాతనమైన శ్రీ చెన్నకేశవ ఆలయాన్నీ, అందులోని నయనమనోహరంగా, అతిసూక్ష్మంగా మలచబడ్డ హొయసల శిల్ప చాతుర్యమును మరియు విశాలమైన పురాతన దేవాలయ సముదాయమును దర్శించుకున్నాము. 12వ శతాబ్ధంలో సోమనాథ దండనాయకునిచే కావేరీ నది ఒడ్డున నిర్మించబడ్డ ఆ ఆలయం, అందులో ఉన్న అందమైన రాతి కట్టడాలను చూస్తుంటే, హృదయంలో అట్టిపెట్టుకోవడానికి రెండు చర్మచక్షువులు చాలవు. పురావస్తు ప్రాముఖ్యత కలిగిన అలాంటి పురాతన కట్టడాలను చూస్తూ ఉన్నప్పుడు ప్రతి ఒక్కరు మన భారతీయ సంస్కృతిని మరియు వారసత్వ సంపదను చూసి తప్పకుండా గర్వపడతారు.

అక్కడి నుంచి, మైసూరుకు దగ్గరలోని చాముండి కొండ మీదనున్న శక్తిపీఠం చాముండేశ్వరి ఆలయానికి బయలుదేరాము. మైసూరు (మహిషాసురుని ఊరు. మహిషూరు... ఇప్పుడు మైసూరు) చాముండేశ్వరి మహిషాసురుని మర్ధించిన స్థలం ఇది. మన అందరిచేత దర్శించబడవలసిన పుణ్యక్షేత్రం. అందరి క్షేమం

కోసం ఆ తల్లి పాదాలపై పడి ప్రార్థించాక, ప్రధాన ఆలయానికి పక్కనున్న మహాబలేశ్వర ఆలయాన్ని దర్శించుకున్నాము. సెలవుల ఆఖరి దినాల కారణంగా బహు రద్దీగా ఉన్నప్పటికీ మాకు చక్కటి దర్శనం అయ్యింది.

**నంజుండేశ్వరుని దర్శనం:**

అందరి మంచి కోసం వెలిసాడు అన్నట్టు నెలవైన నంజుడేశ్వరుడు ఆలయం ఉన్న నంజనగూడకు బయలుదేరాము. కర్ణాటకలోని నంజనగూడలో ప్రసిద్ధ శ్రీ కంఠేశ్వర స్వామి గుడిలో ఈ స్వామి పూజలు అందుకుంటున్నాడు. సముద్ర మథనానికి సంబంధించిన కథ ఇది. నంజుడికి అర్థం "విషం తీసుకున్న వాడని", దేవతల అర్థింపు మేరకు గరళాన్ని కంఠంలో నిలుపుకున్న వాడు కాబట్టి ఆయనను శ్రీ కంఠేశ్వరుడు అని అంటారు. ఈ ప్రధాన దేవునికి టిప్పు సుల్తాన్ గారు "హకీమ్ నంజుండేశ్వరుడు" అన్న బిరుదును కూడా ఇచ్చారు. తర్వాత దాసోహ భవన్‌లో అన్న ప్రసాదం తీసుకున్నాము.

**బసవన్న సామాజిక సంస్కర్త:**

ఎవరు కర్ణాటకని దర్శించినా బసవేశ్వరుడు ప్రభోదించిన శైవ సిద్ధాంతాలను – తత్వ శాస్త్రాన్ని తెలుసుకోవడం చాలా ముఖ్యము. 12వ శతాబ్దంలో బసవేశ్వరుడు తన బోధనల ద్వారా (వచనాలుగా ప్రసిద్ధి పొందినవి) సామాజిక స్పృహను కలిగించారు. లింగ వివక్షతను, సామాజిక వివక్షతను, మూఢ నమ్మకాలను, దూరాచారాలను నిష్కర్షగా ఖండించారు వారు. శివుని ఆకారంలో ఉన్న ఇష్టలింగహారాన్ని పరిచయం చేసారు. ప్రతి ఒక్కరూ, ఏ కులానికి చెందినప్పటికీ, ఇది వారికి శివుడి పట్ల ఉండే నిరంతర భక్తికి జ్ఞాపకలేఖగా ఉండాలని ప్రతిపాదించారు. ముఖ్యమంత్రిగాఉన్న ఆయన రాజ్యంలో, కొత్త ప్రజాసంస్థలను ప్రవేశ పెట్టారు.

**ఆధ్యాత్మిక అనుభవ మందిరము:**

ఇది అన్ని ఆర్థిక స్థాయిలలో ఉన్న ప్రజలు, స్త్రీ పురుష భేదం లేకుండా వారి వారి జీవితాలలో వచ్చే ఆధ్యాత్మిక మరియు ప్రాపంచిక ప్రశ్నలన్నింటినీ

అడగడానికి ఏర్పాటు చేయబడినది. అతని సందేశం గొప్పది. ఈ నాటికి కూడా ఆచరింపబడేది. మరణం తర్వాత కూడా బ్రతకడానికి ఉద్దేశించినవిగా చెప్తారు. బసవ సాహిత్యములో నచ్చిన వచనాలు ఇక్కడ పంచుకుంటున్నాను.

ధనవంతులు శివుడి ఆలయాన్ని కడతారు...
నా కాళ్ళే స్తంభాలు... నా శరీరమే గర్భ గుడి
పేదనైన నేను నీకేమి కట్టగలనయ్యా?
నా తలే, బంగారు గోపురం,
నదులను కలిపే ఓ భగవంతుడా విను,
నిలబడేవన్నీ కూలిపోవాల్సిందే
కానీ కదిలేవన్నీ ఎప్పటికీ నిలబడే ఉంటాయి.

నువ్వు గమనించు
శరణుడు నిద్ర లేచి స్నానిస్తే శివరాత్రి,
అతని ఆధ్యాత్మికత అంతా శరీరం
ఆత్మయే నిజమైన దేవాలయం అని,
దేవాలయాలు నిర్మించే బదులు
తానే దేవాలయంగా ఉండాలి

ఆయన త్రిమూర్తులు, గురువు, లింగ (శివ వ్యక్తిగత చిహ్నం) జంగమ (నడవడం మరియు నేర్చుకోవడం) కాయకవే కైలాస అని కూడా చెప్పారు.

నువ్వు గమనించు శరణుడు నిద్రపోతే అది జపం, నువ్వు గమనించు శరణుడు ఎలా కదిలినా అది పవిత్రీకరణ!

శరణుడు ఏ స్థితిలో ఉన్నా అదే శివతత్వం. శరణుడి శరీరం శివుడు, ఆతని జీవితం, లక్ష్యం, జీవించడానికి ఇచ్చిన గొప్ప సందేశంగా భావించాను. ఈ జీవితానికి దైవ ప్రమేయమిది అని అనుకుంటున్నాను. నదుల సంగమమే కైలాసం!

## ఇండియన్ టిబెట్ - బైలకుప్పే:

టిబెటియన్ల స్థావరాలు భారతదేశంలో చాలా ఉన్నాయి. అందులో ఒక స్థావరం అయిన బైలకుప్పేకు చేరుకున్నాము. ఇది లుగ్సంశ్యామ్ డూప్లింగ్

(1961) మరియు ఢిక్కిల్యారే (1969) లచే స్థాపించబడింది. టిబెట్ ధర్మశాల కాక ప్రపంచంలోనే రెండవ పెద్ద టిబెటియన్ల స్థావరం బైలకుప్పే.

కర్ణాటకలోని మైసూరు జిల్లాలో పశ్చిమంగా, సుమారు మైసూరుకు 80 కిలోమీటర్ల దూరంలో ఉంది బైలకుప్పే. అక్కడ బుద్ధుడి స్వర్ణ దేవాలయం ఉంది. ఆ ప్రదేశమంతా బౌద్ధ సంస్కృతి, వారసత్వంతో నిండింది. ఆ ప్రాంతంలో వేలకొద్దీ సందర్శకులను చూడవచ్చు. చాలా మందికి అది ఒక ఫోటోషూట్ కేంద్రం. కానీ దివ్యమైన ఆలోచన ఉన్నవాళ్లకు జీవితం విలువలను మార్చే టిబెటియన్ల బౌద్ధ మఠం మరియు అధ్యయన కేంద్రంగా నిలిచింది బైలకుప్పే.

వేలకొద్దీ యువత టిబెట్ నుండి వచ్చి బుద్ధుని ఆధ్యాత్మికతను ఇక్కడ అభ్యసిస్తున్నారని తెలుసుకొని ఆశ్చర్యచకితుడిని అయ్యాను. 1960లో మైసూరు ప్రభుత్వం సుమారు 3000 ఎకరాల స్థలాన్ని బైలకుప్ప దగ్గర ఇచ్చింది. టిబెటియన్ శరణార్థులకు ఇచ్చిన స్థావరం, మొట్టమొదటి పెద్ద స్థావరం. లగ్సంగ్ సాండూప్లింగ్ 1961లో ఉనికిలోకి వచ్చారు. కొద్ది సంవత్సరాల తర్వాత మరొక స్థావరం టిబెటియన్ డిక్కిల్యారే పిలవబడే ఆయనచే స్థాపించబడింది. ఆ తర్వాత మరో మూడు స్థావరాలు కర్ణాటక రాష్ట్రంలో స్థాపించబడ్డాయి. దీనితో ఆ రాష్ట్రాన్ని అతిపెద్ద శరణార్థుల జనాభా ఉన్న ప్రాంతంగా అభివర్ణించారు.

**పరిశీలనలు - అభ్యసనలు:**

ఆ వాతావరణం చూసాక ఇది భారతదేశం కాదు టిబెట్ అనిపించింది. మన దేశంలో బౌద్ధ ధర్మము వారిని ప్రశాంతంగా నివసింపచేయడం అన్నది మనకున్న సర్వమత సమభావనకు ప్రతీకగా అనిపించింది. (మార్గములు వేరైనా... గమ్యం ఒక్కటే) నా పవిత్ర మాతృభూమి భారత భూమి అయినందుకు ఎంతో గర్వపడ్డాను.

## జూన్ 3, 2019

**శ్రీరంగపట్నం:**

బెంగళూరుకు తిరిగి వెళ్తున్న మార్గంలో రాత్రి 8 గంటలకు శ్రీరంగపట్నం చేరుకున్నాము. దారి పొడుగునా అయ్యో గుడి మూసివేసే సమయం

అయిపోతుందేమో అన్న ఆతృత మరియు సందేహం నన్ను చాలా కష్టపెట్టింది.

ముందు చాలా సార్లు ఈ క్షేత్రాన్ని సందర్శించినా, భారత దర్శన్‌లో భాగంగా తప్పక చూడాలి అన్న భక్తి అనురక్తి నన్ను వివశుడిని చేసి... కారులో ప్రయాణిస్తున్నా, నా మనసు మాత్రం శ్రీరంగపట్నానికి చేరిపోయింది.

శ్రీరంగనాథ స్వామి గుడి తలుపులు మూసి వేస్తున్నారని ఎవరో చెబితే... ప్రధాన గోపురం వద్ద నుంచి అంతరాలయానికి ఒక పిచ్చివాడిలా.... వెర్రిగా పరిగెత్తాను. స్వామి వారికి అడ్డుగా తిరునామాల తెరవేసి... పూజారి ద్వారబంధాలు వేస్తున్నారు. నన్ను చూసి... బన్నీ బన్నీ... దర్శనమాడికొల్లి (రండి... రండి దర్శనం చేసుకోండి) అంటూ తలుపులు తీసి... తెర తీసి దర్శనం చేసుకొమ్మని చెప్పారు. స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందించారు.

స్వామి వారి దివ్య దర్శనం రాత్రి తెరలు దింపినా అవడం మరొక దివ్యానుభూతి అని చెప్పక తప్పదు.

3 రోజులుగా నాతో పాటు ప్రయాణం చేయడమే కాక... దారి ఖర్చులు సైతం తానే చూసుకుంటూ, ఎంతో ప్రేమానురాగములతో నాకు తన విలువైన సమయం ఇచ్చిన రామకృష్ణకు కృతజ్ఞతలు తెలుపుకున్నాను. 30 ఏళ్లుగా మా పరిచయం ఎన్నో విషయాలు నేర్పింది. ఇలాంటి మిత్రులు, తమ్ముళ్లు ఉన్నందుకు నేనెప్పుడూ గర్వపడుతుంటాను.

**బనశంకరి అమ్మ దేవాలయం:**

బెంగళూరు చేరిన తరువాత, కాస్త సేదతీరి... బనశంకరి అమ్మ దేవాలయాన్ని సందర్శించాను. 30 ఏళ్లుగా బెంగుళూరుకు వెళ్లిన ప్రతిసారి ఈ క్షేత్రం మీదుగా వస్తూ వెళ్తూ ఉన్నా కూడా ఎప్పుడూ కూడా దర్శనం చేసుకోలేదు. ఈ దేవాలయం బెంగళూరులో మైసూరు మార్గంలో ఉన్న కనకపుర రోడ్డులో వెలసింది. ఒక అనిర్వచనీయమైన అనుభూతి నన్ను ముందుకు నడిపించగా... నేను అమ్మవారి దర్శనం, ఆమె ఆశీర్వచనాలను తీసుకున్నాను. చాలా శక్తి కలిగిన క్షేత్రంగా భక్తులు వేలాది మంది ప్రతినిత్యము అమ్మవారిని దర్శించుకుంటారు.

## యువశక్తి - భారతీయ శక్తి

బెంగళూరు.... నమ్మ మెట్రో: 30 కి.మీ. దూరంలో ఉన్న అజగొండహళ్లికి బయలుదేరాను. ట్రాఫిక్ సమస్యల దృష్ట్యా నమ్మ మెట్రోలో ప్రయాణించాలి అని అనుకున్నాను. దూర ప్రయాణాలకు ఇది అనువుగా ఉంటుంది. ఈ మెట్రో ప్రాజెక్ట్‌తో బెంగళూరు తన ముఖకవళికలు మార్చుకుందని నేను తప్పకుండా చెప్పాలి. మెట్రోతో అనుసంధానింపబడిఉన్న ఏ స్థలానికైనా ఎలాంటి రణగొణ ధ్వనిలేకుండా, ప్రశాంతంగా వెళ్లడానికి బెంగళూరు వాసులకు లభించిన సౌకర్యం ఇది. చాలా సులభంగా నా గమ్యస్థానాన్ని చేరుకున్నాను.

భూషణ్ భారతీయ, యువశక్తి సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, నన్ను తీసుకువెళ్లడానికి మెట్రో స్టేషన్‌కు వచ్చాడు. అభయ ఫౌండేషన్‌తో ఆయన అనుబంధం ఒక దశాబ్దం నుండి అని చెప్పొచ్చు. నన్ను కలిసినప్పటి నుండి అతనికి జీవితంపట్ల దృక్పథం మారింది.

అభయకు సంబంధించిన అనేక సేవా కార్యక్రమాలలో అతడు కూడా పాల్గొనేవాడు. లోకోపకారి దొడ్డన్న చెట్టి మరియు అభయ ఫౌండేషన్ ద్వారా తన జీవిత అనుభవాలకు స్ఫూర్తి పొందిన అతను 'యువశక్తి సేవా ఫౌండేషన్' ను స్థాపించాడు. కర్ణాటకలోని ఎన్నో కార్యక్రమాలు ఆయన ద్వారా, ఆయన బృందం ద్వారా నిర్వహించబడుతున్నాయి.

అభయ ఫౌండేషన్ వారిని, ప్రధాన భాగస్వామిగా చేసుకుని, White Field ప్రాంతంలోని అజగొండహళ్లి అనే గ్రామంలో అభయ యువజన సాధికారిత కేంద్రాన్ని నిర్మించడం ప్రారంభించారు. వారు అనాధ పిల్లల కోసం పని చేస్తూ ఉంటారు. అభయ సుమారు 50 లక్షల నిధులతో ఈ ప్రాజెక్టును చేపట్టింది. నేను కర్ణాటకలోని అభయ శ్రేయోభిలాషులందరిని అభ్యర్థించాను, వారి సహాయాన్ని అందించమని. ఇప్పుడు ఆ ప్రాజెక్టు పరి సమాప్తి కావస్తుంది. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్యాల అభివృద్ధి కేంద్రంగా ఈ క్షేత్రాన్ని మలచాలని మా అభిలాష.

## దైవ సోదరి జ్యోతి దర్శనం:

ఆ తర్వాత నేను నా బాలవికాస్ గురువు మరియు మార్గదర్శి అయిన

అక్క శ్రీమతి నాగజ్యోతిని మున్నార్‌కొల్లాల్‌లో కలిసాను. వారి కుమార్తె సాయి ప్రణతి ప్రమోద్ ఆడపిల్లను ప్రసవించింది. ఐదు రోజుల వయసున్న ఆ చిన్నారి మనవరాలితో నేను నా ప్రేమను పంచుకున్నాను. పాప క్షేమం కోసం ప్రార్థించాను. తల్లిదండ్రుల, కుటుంబ పెద్దల ఆశీర్వచనాలు అర్థిస్తూ హంపి విరూపాక్షుని దర్శనము నిమిత్తం బళ్లారికి బయలుదేరాను.

## జూన్ 4, 2019

రంజాన్ పర్వదినం రోజును పురస్కరించుకుని, నా ఇస్లాం సోదరులందరికీ శుభాకాంక్షలు తెలియజేశాను. ISLAM అని అనగానే, స్వామి వారి సన్నిధిలో నేను తెలుసుకున్న అర్థం స్ఫురిస్తుంది. ISLAM అంటే "I Shall Love All Mankind". జీవులమైన మనం అంతా ఆ తారాచంద్రుల్లా దేవుడికి ఎప్పుడూ దగ్గరగా ఉండాలి అన్నది, మానవజాతికి అల్లా ఇచ్చిన సందేశం ఇది.

**బళ్లారి:**

బళ్లారిలో నాకు ఆశ్రయం, ఆహారం అందించిన శ్రీమతి & శ్రీ PVN రావు, అలాగే శ్రీమతి & శ్రీ P. గోవింద గుప్తలకు కృతజ్ఞతలు తెలియజేశాను. వారు నేను హంపి వైపు ప్రయాణించడానికి ఒక కారును, డ్రైవర్‌ను అందించారు. అంతేకాక, భారత దర్శనం చేయడానికి కొంత ధన సహాయం కూడా చేసారు.

**హంపి – ఒక అద్భుతం:**

హరిహర మరియు బుక్కరాయల చేత నిర్మించబడిన విజయనగర సామ్రాజ్య రాజధాని హంపి. విద్యారణ్య స్వామి ఇక్కడ తపస్సు చేసారు. ఆయన తుంగభద్రా నదీ తీరంలో ఈ సామ్రాజ్యాన్ని నిర్మించడంలో కీలకపాత్ర పోషించారు అని చెప్పొచ్చు. పరమేశ్వరుడు తన దేవేరి పంపావతితో విరూపాక్ష స్వామిగా కొలువై ఉన్న పుణ్య స్థలం ఇది. శ్రీ ఆది శంకరాచార్యులు హంపిని శంకర దిగ్విజయ యాత్రలో దర్శించారు. ఇది ప్రపంచ పురాతన శాఖ వారి అద్భుతంగా యునెస్కో వారసత్వ సంపదగా గుర్తించబడింది.

14వ శతాబ్దం నగర అవశేషాలు 26 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో

విస్తరించుకుని ఉంటాయి. ఉత్తరం వైపు తుంగభద్రా నదీ, మిగతా మూడు వైపుల పెద్ద పెద్ద గ్రానైట్ శిలలతో అప్పటి విజయనగర వీధుల వైభవాన్ని తెలియజేస్తూ ఉంటాయి. ఈ పట్టణంలోకి ప్రవేశిస్తుంటే కనిపించే విశాలమైన భవంతులు, పెద్ద పెద్ద ప్రాకారాలు అప్పటి నగర నిర్మాణ చాతుర్యాన్ని, సుల్తానుల అవివేక వినాశన వైఖరిని ప్రకటిస్తుంటాయి.

నగరం యొక్క ప్రధాన అవశేషాలన్ని కామలాపురం నుండి హంపి వెళ్లే రహదారిలో అందరూ చూడొచ్చు. మధ్యలో మల్యంవంత రఘునాధ స్వామి దేవాలయం వస్తుంది. ఈ దేవాలయం ద్రవిడ ఆలయ నిర్మాణ శైలిలో నిర్మించబడింది. ఆ ఆలయంలో వైవిధ్యభరితంగా చెక్కబడిన చేపలు, జలచరాలు పర్యాటకుల కళ్లకు విందు. 800 గజాల పొడవు 35 గజాల వెడల్పు ఉన్న హంపి వీధుల్లో అత్యంత సుందరమైన ఇళ్లున్నాయి.

**విరూపాక్ష దేవాలయం:**

హంపి వీధికి పశ్చిమ దిక్కులో చివర విరూపాక్ష దేవాలయం ఉంటుంది. 50 మీటర్ల ఎత్తు ఉన్న తూర్పు గాలి గోపురం విరూపాక్ష దేవాలయంలోకి మనకు స్వాగతం పలుకుతుంది. దేవాలయంలో ప్రధాన దైవం విరూపాక్షుడు (శివుడు). ప్రధాన దైవానికి అనుసంధానంగా పంపా దేవి గుడి, భువనేశ్వరి దేవి గుడి ఉంటుంది. ఈ దేవాలయానికి 7వ శతాబ్దం నుండి నిర్విఘ్నమైన చరిత్ర ఉంది.

విజయనగర రాజులు పతనమయ్యాక ముష్కరుల దండయాత్రల వల్ల 16వ శతాబ్దానికి హంపి నగరంలోని అత్యద్భుత శిల్ప సౌందర్యం అంతా నాశనమై పోయింది. విరూపాక్ష-పంపా ప్రాకారం మాత్రమే 1565 దండయాత్రల బారిన పడలేదు. విరూపాక్ష దేవాలయంలో దేవునికి ధూపం, దీపం, నైవేద్యాలు నిర్విఘ్నంగా కొనసాగుతున్నాయి.

ఈ దేవాలయానికి 3 ప్రాకారాలు ఉన్నాయి. 9 ఖానాలతో 50 మీటర్ల ఎత్తు ఉన్న తూర్పు గోపురంలో రెండు ఖానాలు రాతితో నిర్మించబడ్డాయి. మిగతా 7 ఖానాలు ఇటుకలతో నిర్మించబడ్డాయి. ఈ తూర్పు గోపురం నుండి లోపలికి ప్రవేశిస్తే, బయటినుండి ఆలయంలోకి వెళ్తె మొదటి ప్రాకారం స్తంభాలు లేకుండా

ఆకాశం కనిపించేటట్లు ఉంటుంది. ఈ ప్రాకారాన్నీ దాటిలోపలికి వెళ్ళితే, స్తంభాలతో పైన కప్పబడ్డ వసారా ఉంటుంది. స్తంభాలతో కూడి ఉన్న వసారాలో చిన్న చిన్న దేవాలయాలు ఉంటాయి. దీనిని కూడా, దాటిలోపలి ప్రాకారంలోకి వెళ్ళితే గర్భగుడి వస్తుంది.

తుంగభద్రా నది నుండి ఒక చిన్న నీటిప్రవాహం ఆలయంలోకి ప్రవేశించి గుడి వంటగదికి నీరు అందించి, బయట ప్రాకారం ద్వారా బయటకు వెళ్తుంది. రాజగోపురం నీడ ప్రధాన ఆలయంలోని ఒక చిన్న రంధ్రంలోనుండి క్రింద నుండి పైకి అనగా తల క్రిందులుగా కనిపించడం అప్పటి శిల్ప కళాచాతుర్యానికి నిదర్శనం. ఈ ఆలయ అభివృద్ధిలో శ్రీ కృష్ణదేవరాయల పాత్ర ఎంతో ఉన్నది అని తెలుస్తుంది. విరూపాక్ష దేవాలయంలోని బయట ప్రాకారంలో ఏక శిలలో చెక్కబడిన నంది ఒక కి.మి. దూరం వరకూ కనిపిస్తుంది.

## విఠల దేవాలయ సముదాయం

హంపికి ఈశాన్య భాగంలో అనెగొంది గ్రామానికి ఎదురుగా ఉన్న విఠల దేవాలయ సముదాయం అప్పటి శిల్ప కళా సంపత్తికి ఒక నిదర్శనం. ఈ దేవాలయం మరాఠీలు విష్ణుమూర్తిగా ప్రార్థించే విఠలుడిది. ఈ ఆలయం 16వ శతాబ్దానికి చెందినది. విఠలేశ్వర దేవాలయం ఆకర్షణీయమైన విశేషం సప్తస్వరాలు పలికే ఏడు సంగీత స్థంభాలు ఉన్నాయి. ఈ దేవాలయంలోనే పురందరదాస ఆరాధనోత్సవాలు జరగుతుంటాయి.

## శిలారథం

ఈ ఏకశిలా రథం విఠల దేవాలయ సముదాయానికి తూర్పు భాగంలో ఉంది. ఇంకో విశేషం ఏంటంటే ఈ రథానికి కదిలే చక్రాలు ఉంటాయి.

## తుంగభద్ర నది – యాంత్రోద్ధారక హనుమ మందిరం

విరూపాక్షుని దర్శించి... ఆ మండుటెండలో నడుస్తూ... వానర కిష్కింధగా పిలిచే తుంగభద్ర నదీ తీరం లోని కొండ కోనల్లోకి వెళ్ళాను. రాళ్లు రప్పలు ఎక్కి దిగుతూ... మధ్యలో దారి ప్రక్కనే ఏర్పాటు చేసిన చిన్న అంగళ్లలో మజ్జిగ

తాగుతూ... ఓ గంట తరువాత, శ్రీ విద్యారణ్యులవారు... తపస్సు చేసిన గుహని సందర్శించడం జరిగింది. వారి సాధనకు అడ్డుపడుతున్న చంచలత్వాన్ని పారద్రోలడానికి రాతి మీద చెక్కిన యాంత్రోద్ధారక హనుమ రేఖాచిత్రాన్ని దర్శించాను. చాలాచక్కటి అనుభూతికలిగింది. కాసేపు అక్కడ నామము జపము చేసుకుని... బయట ఏక శిల మీద చెక్కబడిన సీతా, రామ, లక్ష్మణ విగ్రహాలను కూడా చూసి వెనుతిరిగి బయలుదేరాను.

విరూపాక్షుని మరియు యంత్రోద్ధారక పూర్ణదేవరు (హనుమ) ని దర్శించుకోవడానికి ఓ అద్భుత అవకాశం వచ్చింది అని ఎంతో సంతోషించాను.

ఆ తర్వాత పెద్దమ్మ అయిన 90 ఏళ్ల శ్రీమతి లలితమ్మ ఆశీర్వచనాలు అందుకుని అక్కడే ఉన్న మరొక కుటుంబం శ్రీమతి & శ్రీ ఎస్. వీరశేఖర్‌ని కలిసి ప్రేమాభిమానాలు, ప్రార్థనలు అందించాను. ఆ సాయంకాలం బళ్లారిలో ఉన్న దుర్గమ్మ దేవాలయాన్ని దర్శించాను.

దేశంలో ఉన్న ఇలాంటి స్థలాలను చూడటం అన్నది నిజానికి చాలా ఆశ్చర్యకరం. ఆధ్యాత్మిక, ధార్మిక, చారిత్రాత్మక, సామాజిక, సాంఘిక, ఆర్థిక, సేవా చైతన్యాలు ఆయా ప్రాంతాలను ఎంత ప్రభావితం చేసాయి అన్నది తెలుస్తుంది.

# గోవా

## జూన్ 5, 2019

**గోవా ఇంకో కోణంలో:**

బళ్లారి నుంచి సెలవు తీసుకుని అమరావతి వాస్కో ఎక్స్‌ప్రెస్‌లో గోవా రాష్ట్రానికి బయలుదేరాను. సుమారు 10 గంటలకు మించిన ప్రయాణం. ప్రయాణంలో కొన్ని విషయాలు నన్ను ఇబ్బంది పెట్టాయి... మరికొన్ని సౌకర్యాన్ని అందించాయి. ఇది కేవలం గోవా ప్రయాణంలోనే కాదు... ఇప్పటిదాకా చేసిన భారత ప్రయాణంలో అన్ని చోట్లా ఎదురైనవి అని చెప్పాలి.

**నన్ను ఇబ్బందిపెట్టిన విషయాలు:**

1. మొత్తం రైలు నిండా మనుషులే... స్లీపర్ కోచ్‌లో కూడా స్థలం లేదు.
2. 90% మంది ప్రయాణికులు పొగాకుని వివిధ రూపాల్లో వాడటం గమనించాను.
3. రైలు బండి అస్తవ్యస్త నిర్వహణ.
4. మినరల్ వాటర్ తప్ప మరొకదాన్ని తీసుకోవడానికీ నేను ధైర్యం చేయలేక పోయాను.
5. బయట కాస్తున్న భయంకరమైన ఎండ, రైలులోపల ప్రయాణికులను నరకంలోకి నెట్టింది.
6. 8 గంటల ప్రయాణం అనుకుంటే అది కాస్త మరొక 3 గంటలు ఆలస్యమయ్యింది.

**నన్ను సౌకర్యానికి గురి చేసిన కొన్ని విషయాలు:**

1. మొత్తం ప్రయాణం అంతా దట్టమైన అడవి మార్గం గుండా సాగింది.

2. అంత వేడిలో కూడా కిటికీ ద్వారా బయటి ప్రకృతిని చూస్తూ బాగా సేద తీరాను.
3. రైలు సొరంగాల నుంచి ప్రయాణించటం అన్నది భారతీయ రైల్వే యొక్క గొప్పతనాన్ని గుర్తు చేసుకొని ఒకింత గర్వముగాను అనిపించింది.

**దూద్‌సాగర్ జలపాతం:**

ఈ మార్గంలో ప్రయాణం చేస్తున్న ప్రయాణికులంతా ఒక అందమైన అద్భుత దృశ్యం కోసం కళ్లు విప్పార్చి ఉండవలసిందే. రైలు గోవా కర్ణాటక సరిహద్దు మార్గం దాటుతున్నప్పుడూ కిందికి ఉరుకుతున్న జలపాతాల శబ్దం వినిపిస్తుంది. రైలు ఒక ఇరుకు బ్రిడ్జి మీద ప్రయాణం చేస్తున్నప్పుడు నురుగులతో ఆకాశం నుండి భూమి మీదకు ప్రవహించినట్లుగా, అద్భుతమైన దూద్‌సాగర్ జలపాతం బ్రహ్మాండంగా ప్రవహిస్తూ, ఆ పర్వతాల మధ్య నుంచి పూర్తిగా కనిపిస్తుంది.

వారధి మీదుగా రైలు వెళ్తుంటే... ఆ సుందర జలపాతం రైలు వారధి కిందుగా వెళ్ళుతుంది. చూడటానికి 2 కళ్లు చాలవంటే నమ్మాలి. నిజానికి ఈ సుందర దృశ్యం కనిపించేది అత్యంత కొద్ది సమయమే అయినా మన ప్రయాణం టికెట్ డబ్బులు ఖచ్చితంగా విలువనిస్తుంది అని చెప్పాలి.

## జూన్ 6, 2019

**గోవాకు చేరిన వెంటనే...**

రైలుస్టేషన్ నుండి వీపు మీదున్న బరువైన బ్యాగుని మోయడానికి ఇబ్బంది అనిపించింది. ఆటో వాడిని అడిగి ఏదైనా వసతి గృహానికి చేర్చమని అడిగితే... వాడికసలు నా భాషే అర్థం కాలేదు... మొత్తానికి ఒక ఆటో వాడితో మాట్లాడి చవకైన గది చూపించమని చెప్పి బయలుదేరాను. వాడు కాస్తా ఒక చోట వదిలేసి నీ చావు నువ్వు చావు అంటూ వెళ్లిపోయాడు.

హతవిధి అనుకుంటు... బ్యాగు వేసుకుని అతికష్టం మీద నడుస్తూ బయలుదేరాను. కనిపించిన ప్రతి చిన్న లాడ్జి ముందు నిలచి నా ఖర్చుకు సరిపోయిన గది కోసం వెతకడం మొదలుపెట్టాను. సుమారు ఒక గంట అలా

తిరిగిన తరువాత మొత్తానికి ఒక చవకైన గది దొరికింది. అది కూడా కామన్ రూం అన్న మాట. రోజుకు 150 ఇవ్వాలి. నా ఆలోచన ఏమిటంటే కేవలం ప్రొద్దున్నే స్నానం చేసి... రాత్రి వచ్చి పడుకునేందుకు అనవసరంగా డబ్బులు ఖర్చు చేయొద్దు అని. నేను గోవాలో ఆలయ దర్శనానికి విచారించినప్పుడు అక్కడ చాలా మంది నన్ను ఒక రకంగా చూసారు. నా ఆకాంక్ష తీర్చుకోవడం అంటే కాస్త కష్టసాధ్యంగా అనిపించింది.

గోవా బీచుల్లో తిరగడం గురించి కాకుండా ఇలా ఆలయ దర్శనం గురించి అడగడం అక్కడున్న స్థానికులకు వినోదంగా తోచింది. చాలా కష్టపడి ఒక టాక్సీని పట్టుకుని, ఆ డ్రైవర్‌ని ఇక్కడ స్థానికంగా ఏమేమి ఆలయాలు ఉన్నాయొ ఒకటి రెండు రోజుల పాటు తిప్పమని అడిగాను. డ్రైవర్ ఒక ముస్లిం. వాడికి అసలు ఏమి తెలియదు. నేను మ్యాపులు పెట్టుకుని వచ్చి రాని హిందీలో వారికి వివరిస్తూ తీసుకుని వెళ్లాల్సివచ్చింది.

గోవాలో ఉన్న ఆలయాలను చూసి చాలా ఆశ్చర్యపడ్డాను. అక్కడున్న అనేక ఆసక్తికర ప్రదేశాలు, కొండకోనలు, పర్వతాలు, అరణ్యాలు, దూరంగా ఉన్న ప్రాంతాలను చూసాను. 5 గంటల పాటు 100 కిలోమీటర్ల ప్రయాణంలో బాలిశ్రీశాంతదుర్గ, కైటల్ శాంతదుర్గ, కునార్కలిశాంతదుర్గ, ఫతోర్పశాంతదుర్గ, శ్రీ చంద్రేశ్వర్‌భూతనాథ్, శ్రీ సోమేశ్వర్ మరియూ శ్రీ దామోదర్లను దర్శించాను.

ఈ దేవతలకు సంబంధించిన పురాణ గాథలు ఏమిటి అన్నది ఆ ఆలయానికి సంబంధించిన వ్యక్తులకు కూడా తెలియదు. ఈ అజ్ఞానమే ఈ ప్రాంతంలో అనేక ఇతర మతాల వ్యాప్తికి దోహదం చేసిందని అనిపించింది.

## జూన్ 7, 2019

గోవా రాష్ట్రంలో అనేక పురాతనమైన గుడులను దర్శిస్తుంటే సమయం కాస్తా అలా మాట్లాడకుండానే గడిచిపోయింది. గోవాలోని మారుమూల క్షేత్రాలకు నేను ప్రయాణం చేస్తుంటే, ఎలా ఉన్నది అంటే జనారణ్యంలో దేవుని వెతుకుతున్నట్టు ఉంది. అంత అందమైన ఆలయాలు ఉన్నాయని చాలా మందికి అక్కడ తెలియదు. ప్రతి ఒక్క ఆలయం ఒక అమర కథను చెబుతుంది. అక్కడ హిందువులకు మనము కృతజ్ఞతలు తెలపాలి. ఎందుకంటే పోర్చుగీసు,

క్రిస్టియానిటి, ఇస్లాం మతాల తాకిడికి నిలబడగలిగే విధంగా పూర్వీకులు హిందూమతమును, ఆచారాలను, ఆలయములను, వారసత్వమును, సంస్కృతిని కాపాడగలిగారు. మన ఘనమైన వారసత్వ సంపదలను ఆధ్యాత్మికతతో ముడివేసి వాటిని వారు భద్రపరచగలిగారు. గుడులు అన్నీ దట్టమైన అరణ్యాలలో, పర్వతాల మధ్య, చెట్ల వెనకాల, శివారు ప్రాంతంలో ఉన్నాయి. ఎవరికైనా సరే ఒక మంచి టాక్సీ డ్రైవర్ దొరకకపోతే, వాటిని వెతుక్కోవడం అసాధ్యమవుతుందన్న భావన వచ్చింది.

దీనితోపాటు, కామాక్షి అమ్మవారు, లార్డ్ మంజూష, రామనాథ్, శాంత దుర్గ అమ్మవారు, లార్డ్ నాగేశ్, మహాలక్ష్మి అమ్మవారు, మాలస అమ్మవార్లు ఉన్న మరికొన్ని దేవాలయాలన్నీ చూసాను. ఆలయము, దాని పరిసరాలు, వాస్తు నిర్వహణ, పూజావిధి విధానాలు, ప్రధాన దేవతా ప్రాంగణం, ఆభరణాలు.... అన్నీ కూడా మనకి కావాల్సిన ప్రశాంతమైన చిత్తాన్ని, జీవితానికి ప్రశాంతతను ప్రసాదిస్తాయి.

నాకు అలసట లేదు, కానీ టాక్సీ డ్రైవరు బాగా అలసిపోయి డస్సి పోయాడు... అతన్ని పెద్దగా ఇబ్బంది పెట్టకుండా, నన్ను పానాజీ బస్టాండ్‌లో దింపమని అడిగాను, గోవా రాష్ట్రంలోని దేవాలయాల సందర్శన మరియు వివిధ కథనాల అధ్యయనం, చర్చల ఆధారంగా నేను ముగించాను. స్థానికులతో, నేను ఈ క్రింది వాస్తవాలను కనుగొన్నాను:

గోవాలో సహజంగా ఉన్న ఆలయాలు అన్నీ పోర్చుగీసు వారి చేత పడగొట్ట బడ్డాయి. ఆలయాల పోషకులు ఆ రోజుల్లో ప్రాణాలకు తెగించి ఆయా మందిరాలలోని దేవతా విగ్రహాలను తీసుకొని వేరే ప్రాంతాలకు వెళ్లిపోయారు. అసలు గోవా ఆలయాలు, sedimentary రాళ్లతోను, రాళ్లతోనూ మరియు సున్నపు రాయితోనూ కట్టబడినాయి. దేశంలో హేమంత్ పంత్ శైలిలోనూ నిర్మించబడిన ఆలయాలు చాలా అరుదు. ఒకే ఒక పురాతన ఆలయాన్ని నేను చూడలేక పోయాను. అది తంబడిసుర్ల మహాదేవ్ పురాతన ఆలయం. ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం లేకనే నేను వెళ్లలేకపోయిన గుడి అది. ఇప్పుడు ఉన్న గోవా ఆలయాలు అన్నీ నగర నిర్మాణ విజ్ఞానంతో కొద్ది మార్పులతో నిర్మించబడ్డాయి. ఈ నిర్మాణ విజ్ఞానం భారతదేశంలో ఉన్న ఒక అపూర్వమైన విజ్ఞానం. ఒక ఆలయాన్ని

గమనిస్తే అనేక కోణాలను గమనించవచ్చు.

అది బయట నుండి ఒక మసీదులా... చర్చిలా లేదా ఒక రాజ భవనంలా కనిపిస్తుంది. కారణం ఆ రోజుల్లో ముష్కరుల దృష్టిని ఆకర్షించకూడదని అలా నిర్మాణం చేసి వుంటారేమో అనిపిస్తుంది.

ప్రతి ఒక్క ఆలయం ముందు ఒక జలాశయం, తాలి లేదా తల్లై మనం చూస్తాము. ప్రవేశ ద్వారం దగ్గర నగరీ ఖానా ఉండడం అన్నది గోవా ఆలయాల విలక్షణమైన లక్షణం. దీప స్థంభం దేవాలయం అంతర్భాగంలోనిది. ఆలయాలతోటి కూడి ఉన్న వివిధ నిర్మాణాలు: అగ్రశాల, భోజనశాల, యోగశాల, వాహనశాల, సంబంధిత కార్యాలయాలు, నగర ఖానా ఇలా ఎన్నో భాగాలు ఉంటాయి. అక్కడి ఆలయాలన్నీ మామూలుగా తెల్లటి రంగు లేదా లైటు రంగులతో వేసి మట్టి టైల్స్‌తో కప్పబడిన బంగారు కలశంతో ఉంటాయి. సభా మండపం, అంతరాలయం, చౌక్, గర్భగృహ (గర్భ కుడ్కొంకణిలో) ప్రదక్షిణ మార్గంగా ఆలయ భాగాలు ఉంటాయి.

ఆలయాల గోడల మీద రామాయణ మహాభారత వర్ణనలతో కూడిన చెక్క శిల్పాలు ఉంటాయి. గర్భగృహం వెండితో తాపడం చేయబడి ఉంటుంది. ప్రముఖ విగ్రహం నల్లటిరాయితోనూ... కొన్నిసార్లు సాల గ్రామ శిలతోనూ చేయబడి ఉంటుంది. గోవా దేవాలయాలు అన్నీ రెండు మూర్తులతో ఉంటాయి. ఒకటి మూలమూర్తి అలంకారాలు చేసేందుకు పురాతన మూలంగావస్తున్నది, మరొకటి ఉత్సవ మూర్తి ఆలయావరణంలో ఉంచేందుకు. ఉత్సవ మూర్తులను వెండితో, బంగారంతో లేదా మిశ్రమ లోహాలతో తయారుచేస్తారు. మిశ్రమ లోహాలతో తయారు చేసిన ప్రసాద మూర్తిని కూడా చూడవచ్చు. దక్షిణాది దేవాలయాల్లో స్తంభాలు స్పష్టమైన శిల్పాలతో ఉంటాయి. పైకప్పు కూడా శిల్ప తరువులతోను, షాండ్లియర్‌తోను ఉంటుంది. చౌక్ ప్రవేశ ద్వారం దగ్గర పెద్ద గంటలు వేలాడదీయబడివుంటాయి. ఈ స్థలాన్ని వారు చాలా పవిత్ర స్థలంగా భావిస్తారు.

# కర్ణాటక

## జూన్ 8, 2019

### ఉత్తర కర్ణాటక: భాగల్‌కోట, కూడల సంగమ & బాదామి

ప్రజా రవాణా బస్‌లో అర్ధరాత్రి 12 గంటలకు భాగల్‌కోట చేరుకున్నాను. ప్రయాణం పొడుగునా భారీ వర్షం... చాలా అసౌకర్యం అయ్యింది. ఆ పట్టణం చేరే సమయానికి చిమ్మ చీకటి, రోడ్లన్నీ బురద నీరుతో నిండి, నడవడానికి కూడా కష్టమైంది. కాసేపు ఎటు వెళ్ళాలో తెలీదు. ఒకే ఒక లక్ష్యం... భారత దర్శనము. అంతే, అలా మొండిగా, కాసేపు బస్టాండ్‌లో తల కింద బ్యాగు పెట్టుకుని బెంచీ మీద పడుకున్నాను.

కాస్త వెలుతురు వచ్చిన తరువాత ఎక్కడైనా చవకగా వసతిగృహాలు ఉన్నాయేమో అని వెతికాను. ఒక మూడు నాలుగు లాడ్జిలు చూసిన తరువాత మొత్తానికి ఒక వసతిగృహంలో వారు దయతో రోజుకు 150 రూపాయల చొప్పున తీసుకొని ఒక గది ఇచ్చారు. ప్రయాణాలలో వసతికి చాలా తక్కువ ఖర్చుపెట్టాలనినేను నిర్ణయించుకున్నాను. భారత దర్శన్ మొదలుపెట్టినప్పటి నుంచి ఎక్కడా ఎక్కువ డబ్బులు ఖర్చు పెట్టలేదు, చాలాసార్లు ఉచిత వసతి సదుపాయాలనే ఉపయోగించుకున్నాను. అక్కడ కామన్ బాత్రూమ్. నాకేంటి, సంతోషంగా అలా వెళ్లిపోయాను. రోడ్డు పక్కన ధోభీ షాపు ఉంటే వెళ్లి అడిగాను... బాబు నేను యాత్రలో ఉన్నాను కాస్తా ఈ మాసిన బట్టలు ఉత్తికిపెట్టు అని. విచిత్రంగా అతను జతకు 200 అడిగాడు. చాలాబాధ అయ్యింది. వచ్చేసాను. స్నానం ముగించుకుని, ఒక ఆటోవాడిని మాట్లాడుకుని ఆ ఊళ్లో ఉన్న గుడులు గోపురాలు చూపించమని అడిగాను. ఆటోలో నా బట్టలు బ్యాగ్‌లో వేసుకుని, ధోభీలు ఉన్న ప్రాంతానికి వెళ్లి అక్కడ అతిచవకగా అన్ని బట్టలు ఉతికిస్తే ఒక 200 ఇస్తాను అని మాట్లాడుకుని ఇచ్చేసాను.

ఆ తరువాత ఒక టాక్సీ గురించి విచారించినపుడు ఒకతను రోజుకు 2000 రూపాయలు తీసుకొని నన్ను తీసుకెళ్లడానికి ఒప్పుకున్నాడు. నేను భాగల్‌కోట జిల్లాలోని బాదామి గుహలు, కూడల సంగమం, ఐహోలే, పట్టడకల్, మహాకూటమి మరియు బనశంకరీ మొదలగు క్షేత్రాలను దర్శించాను.

బాదామి, పట్టడకల్, ఐహోలి: ఇవి భారతదేశంలోని ప్రధాన పురాతన చారిత్రాత్మక స్థలాలు. 1600 సంవత్సరాలుగా ఉన్న మనోహరమైన ఆ చారిత్రాత్మక స్థలాలు, భారతదేశ వాసులకి, సంస్కృతి, శిల్పకళలు, ప్రతిభ, నైపుణ్యాలు, నాగరికత మొదలగు వాటితో వెలుగునిస్తూ ఉన్నాయి. బాదామి నన్ను మన దేశం గురించి గర్వపడేటట్లు చేసింది. అక్కడున్న పర్వతాలు మొత్తం గుహలుగా మార్చబడ్డాయి. ప్రతిఒక గుహ శైవ, వైష్ణవ, బౌద్ధ మతాలకు అంకితం చేయబడ్డవి. ఈసారి నేను అక్కడ మార్గదర్శకుడిని తీసుకొన్నాను. అక్కడ శిల్పకళను చూడటం, అవి ఎలా సంస్కృతితో అనుసంధానించబడ్డాయో కూడా తెలుసుకోవడం అన్నది సందర్శకులకు కనువిప్పులాంటిది. ఇది నిజంగా కళ్ళకు వెలుగు. పర్వతాలను ఎక్కడం ద్వారా మనలోని అంతర్గత జీవిని తట్టి లేపుతాయి. నేను ఈ స్థలాన్ని, కుటుంబంలో ఉన్న పిల్లలతో, యువతతో, తప్పక దర్శించమని సలహా ఇస్తాను. ఇది అందరికీ గొప్ప అనుభవమవుతుంది అని నేను గాఢంగా నమ్ముతున్నాను. నేను నిజంగా ఈ బాదామి గుహలను మరియు ఐహోలి, పట్టడకల్ చారిత్రక స్థలాలను చూసి మంత్ర ముగ్ధుడినయ్యాను. భారత పురావస్తు పరిశోధక కేంద్రం వారు ఈ యాత్ర స్థలాన్ని చక్కగా నిర్వహిస్తున్నారు.

ఈ జిల్లాలోనే ఉన్న ప్రాచీన బనశంకరి మరియు మహకుడేశ్వర ఆలయాలను కూడా, దర్శించుకున్నాను.

నేను దర్శించిన వాటిలో ఇంకొక మనోహరమైన ప్రదేశం కూడలసంగమం, కృష్ణానది, మలప్రభ ఇక్కడే సంగమిస్తాయి. ఈ కూడలసంగమం దగ్గర స్వయంభువుగా వెలసిన సంగమేశ్వరుడిని ఆరాధిస్తారు.

నేను కూడల సంగమాన్ని దర్శించుకోవడానికి ఒక ముఖ్యకారణం ఏమంటే ఈ ప్రదేశంలోనే బసవన్న సాధన చేసారు. చివరి మజిలీలో సంగమేశ్వరుడిలో లీనమయ్యారు. నేను చిన్నతనం లోంచి ఈ సామాజిక సంస్కర్త నుంచి స్ఫూర్తి

పొందాను, ఉత్సాహితుడిని అయ్యాను. అభయ నమ్మకాలు, వేదాంతము సేవలు అన్నీ కూడా ఆయన బోధనలకు సరిగ్గా అతుకుతాయి.

**బసవన్న బోధనలు:**

దొంగతనం చేయకు, ఎవరిని కూడా చంపకు, అబద్ధాలు ఎప్పుడు చెప్పకు, నిగ్రహాన్ని ఎప్పుడూ కోల్పోకు, ఇతరులను అసహ్యించుకోకు, నిన్ను నీవు గొప్ప పరచుకోకు, ఇతరులను నిందించకు, ఇదే అంత: పవిత్రత, ఇదే బాహ్య పవిత్రత, ఇదే కూడలసంగముని చేరే త్రోవ.

భగవంతుణ్ణి గెలవాలి అంటే అంతర్గతంగా, బాహ్యంగా కూడా స్వచ్ఛంగా వుండాలని బసవన్న చెప్పాడు. పవిత్రతను ఎలా పొందాలో కూడా మార్గాలు చెప్పాడు. బసవన్న చెప్పిన పదాలు చాలా సాధారణమైనవి కాని అసాధారణమైన ప్రభావాన్ని సామాన్య జనులపై చూపించాయి. ప్రపంచంలోని అన్ని మతాల సారాంశం ఇదే. పైన చెప్పిన బసవన్న మాటలను “వచనములు” అని అంటారు. వాటిని బసవన్న రచించారు. అతని స్వీయ దైవం కూడల సంగమేశ్వరుడు. ఆ నామాన్ని ఆయన ప్రతి వచనం చివర మకుటంలా చేసి చెప్పారు.

రెండు నదులు సంగమించిన సంగమేశ్వర ఆలయానికి సరిగ్గా ఎదురుగా ఉన్న ఐక్యమండపాన్నీ దర్శించాను. పూర్వము ఈ ప్రదేశములోనే బసవన్న తన భౌతిక దేహాన్ని విడిచి భగవంతుడిలో ఐక్యమయ్యాడు.

**అభ్యాసాలు & పరిశీలనలు... పాఠాలు:**

క్షేత్రదర్శనం చేయడం నిజంగా కనులకు విందు, పర్వతాలు ఎక్కడం అనేది కూడా మనలో ఉన్న చైతన్యాన్ని తట్టిలేపుతుంది. నేను ఈ ప్రదేశాన్ని కుటుంబంలోని పిల్లలు, యువత కలిసి దర్శించాలని సలహా ఇస్తాను. ఇలాంటి యాత్రలు అందరికీ చక్కటి అధ్యయనం అవుతాయని నేను ప్రగాఢంగా నమ్ముతాను. బాదామి గుహలు, ఇహొూలే, పట్టడకల్ ఇతర ప్రదేశాలు అన్నీ నిజంగా మంత్రముగ్ధుడిని చేశాయి. భగవంతుని గెలవాలంటే, మనం లోపల బయట పవిత్రంగా ఉండాలి.

## జూన్ 9, 2019

**బసవ కళ్యాణ:**

బీదర్ జిల్లాలో ఉన్న బాగల్‌కోట నుండి బీజాపూర్, బీజాపూర్ నుండి బసవకళ్యాణ్‌కి ప్రయాణం చాలా దూరమైంది. సాధారణ ప్రజా రవాణా బస్సులో ప్రయాణం దరిదాపుగా పది గంటలు పట్టింది. దాంతో పాటు భరించలేని ఎండ నాతో పాటు ప్రయాణించింది. నేను బసవ కళ్యాణ్‌కి వెళ్ళకుండా షోలాపూర్ దగ్గర నుంచి మహారాష్ట్రలోనికి వెళ్ళిపోదాం అనుకున్నాను కానీ బసవ కళ్యాణ్ నన్ను తన దగ్గరకు లాగింది. జగజ్యోతి బసవేశ్వరుడు అక్కడే నివసించి, తన కార్యాన్ని అక్కడ నుంచే ఎక్కువ కాలం నిర్వహించాడు. అక్కడున్న ప్రతి అణువణువూ ఆయన దివ్యచరణాలతో పవిత్రం అయిపోయింది. అందుకే ఎంత దూరం అయినా... కష్టమైనా... మళ్ళీ ఇంత దూరం రాగలనో లేదో అన్న భావనతో... ముందుకే వెళ్ళాను. సాయంకాలం 6:00కు నేను ఆ ప్రదేశాన్ని చేరుకున్నాను.

అక్కడ ఉన్న ప్రతి అణువణువూ ఆయన దివ్యచరణ స్పర్శతో పునీతం అయిపోయింది. బసవకళ్యాణ సంస్థ వారి యాత్రి నివాసములో బస చేసాను. అక్కడ గబగబా స్నానం చేసి... గుడికి త్వరగా వెళ్లాను. నా హృదయం అంతా బసవన్న జీవితం, సందేశాలతో, ఆధ్యాత్మికతతో నిండిపోయింది. దర్శనం ముగిసాక చాలాసేపు ఆ గుడిలోనే సమయం గడిపాను.

ప్రపంచ పర్యావరణ దినోత్సవమును ఆ రోజు బసవేశ్వర గుడి కార్యవర్గ సభ్యులు నిర్వహించారు. కొత్తగా ఎన్నుకోబడ్డ బిజెపి ఎంపీ భగవంత్ కుమార్, ఆ సభలో ప్రసంగించారు. నాకు అక్కడ మాట్లాడిన బసవ సంప్రదాయ పెద్దల నుండి బసవన్న వచనాలు వినే అవకాశం దొరికింది.

బసవన్న తన కార్యాన్ని ఎక్కువ కాలం ఇక్కడ నుండే నిర్వహించారు. అక్కడ వారి జీవిత విశేషాలు చూస్తుంటే... వింటుంటే నా జీవిత ఆశయం కోసం పని చేస్తున్న నాకు బసవన్న వచనాలు నా మానసిక స్థితికి తగ్గట్టుగా అనిపించాయి.

జగజ్యోతి బసవేశ్వరుడు ఈ బసవకళ్యాణం చుట్టు పక్కలే ఉన్నాడు అనే దానికి ఎన్నో చారిత్రాత్మక ఆధారాలు ఉన్నాయి. అతను ఎక్కడ నివసించాడు,

ఎక్కడ బోధిస్తూ ఉండేవాడు, అనుభవ మండపం, దాసోహక్షేత్రం మొదలైనవి, నిదర్శనాలు 108 అడుగుల బసవన్న విగ్రహం ఇక్కడ మరొక ఆసక్తికరమైన స్థలం. పుణ్య పురుషులు మనం ఎలా జీవించాలో, ఎలా ప్రేమిస్తూ బ్రతకాలో చెప్పిన ఎనిమిది వందల సంవత్సరాల తర్వాత కూడా సంఘంలో వచ్చిన అనేక దురాచారాల గురించిన ఆలోచనలతో... బాధాపరితప్త హృదయంతో అలా నిద్ర పోని రాత్రితో ఆ రోజు ముగిసింది. నిజానికి నా మానసిక స్థితి బసవన్న పలికిన ఈ క్రింది వచనాలకు సరిగ్గా అతికినట్లు ఉందని అనిపించింది.

పెదవులపై పదాలు దివ్యనామామృతంతో నిండినాయి.
మీ దివ్యరూపాన్ని చూసి కళ్ళు సంపదను పొందాయి.
మనసంతా దివ్యమైన ఆలోచనలతో నిండింది.
చెవులు మీ దివ్యవైభవంతో నిండిపోయాయి.
కూడలసంగమదేవా మీ పాదపద్మాల దగ్గరనే
నేను ఒక తుమ్మెదనై ఉన్నాను.
నన్ను ఎవరితను, ఎవరితను అన్న విధంగా చూడకయ్యా
నన్ను నా వాడే, నా వాడే అన్న విధంగా చూడయ్యా.
కూడలసంగమదేవా నేను మీ ఇంటివాణ్ణి అన్నట్టు మసలుకోవయ్యా.

విశ్వజ్యోతి బసవేశ్వరుడి స్థలాలు, కథలు, ఆయన జీవితం,
ఆయన పనులు నిద్రపోతున్న నా ఆత్మని ఖచ్చితంగా తట్టిలేపాయి.

# మహారాష్ట్ర

## జూన్ 10, 2019

**మహానుభావుల మహారాష్ట్ర**

బసవకళ్యాణ (కర్ణాటక) నుండి ఉదయం 11:30 గంటలకి షోలాపూర్ (మహారాష్ట్ర) చేరుకున్నాను. కర్ణాటక పర్యటనలో ఉన్నప్పుడే (మూడు రోజుల క్రితం) గూగుల్ సెర్చ్ నుంచి శ్రీ సమర్థ టూర్ యజమాని సాగర్‌తో మాట్లాడాను. ఆయన చాలా మంచి నిపుణుడైన వ్యాపారవేత్త. ఆయన వైఖరిని నేను చాలా ఇష్టపడ్డాను. ఫోన్, మెసేజెస్, మెయిల్ ద్వారా నాకు టూర్ ప్లాన్, టాక్సీతో సహా అన్ని వివరాలు ఇచ్చారు. ఒక వ్యక్తి ప్రయాణించడానికి కాస్త ఖర్చు ఎక్కువే అయినప్పటికీ, మిగతా ఖర్చులు తగ్గించుకోవడానికి నిర్ణయించుకుని మహారాష్ట్ర అంతా ఒక వారం రోజులు ప్రయాణం చేసేందుకు ఆ టాక్సీని అద్దెకు తీసుకున్నాను. ఆ టాక్సీ డ్రైవర్ పేరు శ్రీకాంత్.

దేశంలో కేవలం దక్షిణాది రాష్ట్రాలలోనే తిరిగిన అనుభవం... కొద్దిగా స్నేహితులు ఉన్నారు... బంధువులు ఉన్నారు. దక్షిణాది దాటేకొలది... నాకున్న ఒకే ఒక స్నేహితుడు గూగుల్ భాయ్. వాడినే ఆధారం చేసుకున్నాను. నాకు తోచినంతలో ఆలోచించి... దేవుడు ఇచ్చిన తెలివితేటలకు పదనుపెట్టి, దారి చూచుకునే వాడిని... మనుషులను అర్థం చేసుకునే వాడిని. అలా శ్రీకాంత్ డ్రైవర్‌తో మాట కలిపి... వచ్చి రాని హిందీ భాషలో నా భావాలను వాడికి అర్థం అయ్యే విధంగా చెప్పటానికి ప్రయత్నిస్తూ ప్రయాణం చేసాను.

**పండరీపూర్:**

మహారాష్ట్రలో మొదటి గమ్యం అయిన పండరీపూర్‌కు చేరుకున్నాను. తల్లిదండ్రుల సేవలో మునిగిపోయి ఉన్న తన భక్తుడైన పుండరీకుడిని

ఆశీర్వదించేందుకు వేచి నిలిచిన విగ్రహాన్ని మనం ఇక్కడ చూస్తాం. ఈ కథ ఈ దేశంలో అందరికీ తెలిసినదే కాని చాలా కొంత మంది మాత్రమే తమ తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకుంటున్నారు. ఇది సత్యం.

నాకు అనిపించింది ఇలాంటి చోట్లకి తీర్థయాత్రకు వచ్చి డబ్బులు ఖర్చు చేసే బదులు... ఆ డబ్బులతో తమ తల్లిదండ్రులను ఇంటి దగ్గర ప్రేమగా చూసుకుంటే ఆ పాండురంగడు తప్పక సంతోషిస్తాడని.

స్థలం ఏదైనా... క్షేత్రం ఏదైనా... అందులో తప్పక తెలుసుకోవాల్సిన జీవిత పాఠాలు... జీవిత నైపుణ్యాలు ఉంటాయి. వాటిని గమనించి ఆచరించ గలిగితే జీవితం సార్థకం అయినట్లే.

ఏడో శతాబ్దం నుండి దేశంలో మొదలైన భక్తి ఉద్యమానికి కారణ భూతమైనది కూడా పండరీపూర్ అని చెప్పుకోవచ్చు. అసలు మహారాష్ట్ర ప్రాంతం అణువణువు భక్తులతో... భావకులతో... కవులతో... అవధూతలతో నిండి ఉందని అనిపిస్తుంది. ఏ ప్రదేశానికి వెళ్లినా అక్కడ స్థానికంగా కొలిచే ఎందరో మహానుభావుల గురించి తెలుసుకుంటూ ప్రయాణం చేస్తున్నాను.

తర్వాత రుక్మిణీ పాండురంగల దేవాలయాన్ని దర్శించాను. ఎండాకాలం అవడం చేత... సామాన్య దర్శన వరుసలోనే వెళ్ళడం వల్ల... చాలా అలసి పోయాను. కానీ, తనువెల్లా... ఆ దివ్య మంగళ విగ్రహాలను చూడాలని తహతహలాడింది.

దేవుని దర్శించాక నేనా దేవాలయ ప్రాంగణాన్ని వదిలి వెళ్లలేకపోయాను. మళ్లీ మళ్లీ ఆ భగవానుడి దర్శన కోసం అర్రులు చాచాను. దర్శన సమయంలో ఇక్కడ అందరికీ నిజ పాద సేవా భాగ్యం కల్పిస్తారు. ఆ పాండురంగడి పాదాల మీద నివశుడినై పడ్డ నన్ను ఆ పూజారి గమనించి ఆ ప్రభువు పాదాల దగ్గర ఉన్న మధుర ప్రసాదాన్ని అందించాడు. మూడు గంటలు నుండి వరుసలో నడవడం వల్లొచ్చిన బాధను మరచి... నన్ను నేను కూడా మరచిపోయిన నేను ఒక అనిర్వచనీయమైన ఆనందకరమైన స్థితిలో ఉండిపోయాను.

అసలు నిజంగానే... ఆ పాండురంగని సశరీరంతో చూసినట్లుగా అనుభూతి పొందాను. వేరే ఏ ఆలోచన రాలేదు. అలాగా స్థాణువై ఆ దివ్యక్షేత్ర పరిసరాలలోనే ఉండిపోయాను. ఎంతో భక్తి విశ్వాసంతో దైవ దర్శనం కోసం అక్కడికి చేరిన

వారిని చూస్తుంటే విశ్వరూపం చూసినట్లుగా ఉంది.

ఈ పాండురంగడు తన దివ్యదర్శనం ద్వారా ఎంతో మందిని పవిత్రాత్ములుగా... మహానీయులుగా... భక్తులుగా... మార్చాడు. ఆ మహానీయులలో ప్రతి ఒక్కరూ అపూర్వమైన భక్తికి నిదర్శనం గాను, ఆణిముత్యంగా నిలిచారు.

**అభ్యాసనలు/పరిశీలనలు:**

పుండరీకుడు, సతీ సక్కుబాయి, సంత్ తుకారాం, సంత్ నామ్‌దేవ్, సంత్ జ్ఞానేశ్వర్, సంత్ సమర్థరామదాస్, సంత్ ఘోరాకంబర్, సంత్ కంహెూపాత్ర, సంత్ సవాత్మలి, సంత్ ఏక్‌నాథ, సంత్ చొక్కమేళ, మరి ఇంకా ఎంతో మంది. వీరందరూ భక్తి మార్గాన్ని బోధిస్తూ వారిని వారు ఎలా సంస్కరించుకున్నారో తెలుసుకుంటూ ఉంటే హృదయం పులకరించిపోయింది.

ఎన్నో శతాబ్దాలుగా గడిచిపోయిన మన భారతీయ సంస్కృతిని ఈనాటికి సజీవంగా వుంచిన ఈ ఋషి పుంగవులందరికీ 134 కోట్ల భారతీయు లందరము రుణపడి వున్నాము అనిపిస్తుంది.

ఏ రాష్ట్రంలో పర్యటిస్తూవుంటే... ఆ రాష్ట్రంలోని మహానుభావుల జీవిత సంగ్రహాలను నా నేస్తమై పోయిన గూగుల్ భాయితో అడిగి తెలుసుకునేవాడిని. ప్రయాణంలో అసాంతమూ అదే పని ఇక. మన భారతీయుల మంచి భవిష్యత్తు కోసం ఈ మహనీయుల జీవితం, వారి కార్యం, వారి లక్ష్యాల గురించి ప్రతి ఒక్కరును చదివి, పిల్లలకు అందివ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని నా అభిప్రాయం.

**కొల్హాపూర్:**

శ్రీ మహాలక్ష్మి (అంబాదేవి) దర్శనానికి కొల్హాపూర్ వెళ్ళబోయే ముందు కృష్ణాతీరంలో ఉన్న శ్రీ దత్తాత్రేయ రెండవ అవతారమైన శ్రీ నరసింహసరస్వతి గురు స్థానం దర్శించుకునే భాగ్యం కలిగింది. చాలా నిశ్శబ్ద మనోహర ప్రదేశం అది, కాని సమయాభావం వల్ల త్వరగా దర్శించుకుని అక్కడి నుంచి 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొల్హాపూర్‌కు బయలుదేరాను. నేను అంతకు ముందు

ఎప్పుడూ ఇంత విస్తీర్ణమైన దేవాలయంలో కొలువై ఉన్న దేవతను చూడలేదు. ఇది ఒక కోట లాగా కట్టిన నాలుగ్గోడల మధ్య ఉన్న ఒక గ్రామం లాగా ఉంటుంది. కొల్హాపూర్ మహాలక్ష్మి భారతదేశంలో ఉన్న పద్దెనిమిది శక్తిపీఠాలలో ఒకటి. ఆ తల్లి దివ్యదర్శనం అయ్యాక నా హృదయం అంతా ఆనందంతో నిండిపోయింది. సర్వలోకహిత మంత్రమైన గాయత్రీ మంత్రాన్ని ఎంత సేపు ఆలపిస్తూ ఉన్నానో నాకు తెలియదు. అమ్మను చూస్తుంటే ఆ గర్భగుడి నుంచి బయటకు రావాలనిపించనేలేదు అంటే నమ్మండి. అంతటి దివ్య సౌందర్యమైన విగ్రహము. అమ్మను స్వయంగా చూస్తున్నట్లే అనిపించింది.

అన్నిచోట్ల దైవదర్శనాలలో ఒంటరిగా ఉండటం అనేది నిజానికి కలసి వచ్చింది. నా స్వంత ప్రపంచంలోనే నేను అలా వుండి పోయేవాడిని. అన్ని ఇంద్రియాలు దైవదర్శనం కోసం ఐక్యమయిపోయేవి. రాత్రి సమయం... వస్తున్న వర్షాన్ని పరిగణలోనికి తీసుకుని నేను కొల్హాపూర్ మహాలక్ష్మి ధర్మశాల వసతి గృహంలో ఉండిపోయాను. అసలు... నా నివాసం కోసం ఎక్కడా కూడా ఎక్కువ డబ్బులు ఖర్చు చేయలేదు.

దేవాలయములో వారి ఆధ్వర్యములో నడిపే ధర్మశాల అయిన కారణం చేత... సామాన్య వసతి తీసుకోవడం వల్లనైతేనేమి... కేవలం రెండు వందల రూపాయలతో పని అయింది. రోడ్డుప్రక్కనే బండిలో వేస్తున్న వేడి వేడి ఇడ్లి, దోశ తినేసి... వెళ్లి సంతోషంగా సేద తీరాను.

**శక్తిపీఠాలు:**

దేవి యొక్క త్రినేత్రము ఈ ప్రదేశంలో పడిందని చెప్పారు. ఈ శక్తి యొక్క పేరు మహిషమర్ధిని, కొల్హాపూర్, మహాలక్ష్మి అమ్మ వారి చేత సృష్టి ఆదిలో సృష్టించబడ్డ కరివీరక్షేత్రం అని చెపుతారు. చాలా పవిత్రక్షేత్రం అని భావిస్తారు. ఈ దేవాలయాన్నీ నీలపురాయితో శ్రీ యంత్ర రూపంలో నిర్మించారు. కోలాసుర రాక్షసుడి పేరుతో కొల్హాపూర్‌ని పిలుస్తారు. కాశీ నుంచి తిరిగి వచ్చిన అగస్త్య మహర్షి ఆయన సతీమణి లోపాముద్ర ఇక్కడ స్థిరపడ్డారని చరిత్ర చెపుతుంది.

**అభ్యాసాలు / పరిశీలనలు:**

అన్ని దివ్య ప్రదేశాలలో కూడా ఒంటరిగానే ఉండటం వలన, ముఖ్యంగా దర్శనం చేసుకునేటప్పుడు నా స్వంత లోకంలో ఉన్నట్లే అనిపిస్తుంది. ఆ సమయంలో ఇక చుట్టూ మాట్లాడే వాళ్ళు లేక ఒంటరిగా పరమాత్మ దర్శనం కోసం నిలబడినప్పుడు ఇంద్రియాలన్నీ ఏకమయ్యి దృష్టి అంతా దేవుడి మీద లగ్నం అవుతుంది.

## జూన్ 11, 2019

కొల్హాపూర్ శ్రీ మహాలక్ష్మి అమ్మవారి సుప్రభాత దర్శనం మరియు ప్రాతఃకాల హారతిని తీసుకుని... అంతరాలయములో శ్రీ ఆదిశంకరుల వారిచే ప్రతిష్టించ బడిన శ్రీచక్రమును చూసి... అందరి బాగు కోసమై అక్కడ కాసేపు ప్రార్థన చేసి... ఆ ప్రాంతానికి దగ్గరలో ఉన్న సహ్యాద్రి పర్వత శ్రేణుల గుండా ప్రయాణం చేసాను. అతి దుర్లభమైన ప్రయాణమని చెప్పాలి. ఇప్పటి దాకా మహారాష్ట్రలో సుమారు 800 కిమీ ప్రయాణం చేసాను. అతిశక్తివంతమైన క్షేత్రాలు కష్టమైనా సరే ఇష్టంగా ప్రయాణిస్తేనే చూడగలనని నమ్మి అలుపు సొలుపులు లేకుండా ముందుకు వెళ్లాను.

**జ్యోతిబా:**

కొల్హాపూర్ జిల్లాలోని రత్నగిరి సమీపంలో ఉన్న వాడి క్షేత్రంలో నెలవై వున్న జ్యోతిబా ఆలయం హిందువులకు పవిత్ర ప్రదేశం. ఆలయములో కనిపించే దేవుడూ అదే పేరుతో పిలువబడతాడు. స్థానికులు ఆ దేవుణ్ని త్రిమూర్తుల స్వరూపంగా మరియూ జమదగ్ని అవతారంగా భావిస్తారు. స్వామి వారు రత్నాసుర మరియూ రక్తభోజరాక్షసులను సంహరించి ఈ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు దుష్టపీడను నివారించారు. అందుకే వారి పేరు మీదే జనము కూడా గ్రామాన్ని పిలుచుకుంటారు.

**మాలేశ్వర్:**

ఈ ఆలయ దర్శనం నాకు ఒక ఆహ్లాదకరమైన ఆశ్చర్యం. నన్నీ ప్రదేశానికి

వెళ్ళమని సలహా ఇచ్చిన డ్రైవర్ శ్రీకాంత్‌కు కృతజ్ఞతలు. ఈ మారుమూల ఉన్న స్థలం ఇష్టంగా అనిపించింది. సహజ జలపాతాల మధ్యలో ఉన్నది ఈ ఆలయం. కొండపై సహజంగా ఏర్పడిన గుహలో స్వామి వారు కనిపిస్తారని ఎవ్వరూ ఊహించలేరు. ఆహ్లాదకరమైన దర్శనం కలిగింది. ఈ కొండను చేరుకోవడానికిని నేను 600 మెట్లు ఎక్కవలసి వచ్చింది. ఎంత కష్టసాధ్యమైనా సరే, అయ్యో మళ్ళీ ఇంత దూరం భారాల కోర్చి రాలేనేమో అన్న భావనలో లేని ఓపికని తెచ్చిపెట్టి నడిపించందని చెప్పాలి. లేదంటే ఇన్ని వేల కిలోమీటర్ల ప్రయాణం చేయడం సాధ్యమైన పని కాదు.

**మహాబలేశ్వర్:**

మాలేశ్వరు నుండి ప్రయాణం చేసి ఇంకొక దివ్యక్షేత్రానికి వెళ్ళాను. పర్వత ప్రాంతంలో వర్ధిల్లే ఈ క్షేత్రం పేరు మహాబలేశ్వర్. ఈ పర్వతశ్రేణులలో ప్రయాణాలు చేస్తున్నప్పుడు... ఎవరైనా ఈ క్షేత్రాలను ఆహ్లాదకర యాత్రాస్థలంగా, విశ్రాంతి స్థలంగా, వినోద ప్రదేశంగా, సెలవు ప్రదేశంగా చూస్తారేమో... కానీ దీనికి మించిన చాలా నిగూఢమైన రహస్యాలు దాగి వున్నాయని చాలా తక్కువ మంది గుర్తిస్తారు.

ఈ క్షేత్రములో కొలువైన మహాబలేశ్వరదేవుడు, అతిబలేశ్వర్ మరియు కోటేశ్వర్ చూస్తున్నప్పుడు ఒళ్ళు అంతా ఒక రకమైన గగుర్పాటుకు గురి అవుతుంది. అక్కడ వెలసిన స్వయంభూ శివలింగంను చూడడం ఎలా ఉంటుందంటే ఒక అసాధారణమైన, పెద్ద రుద్రాక్ష చూసినట్లుగా ఉంటుంది.

కొన్ని వందల సంవత్సరాల క్రిందట శ్రీ శివాజీ మహారాజు తన తల్లి జిజియాభాయి ఎత్తు బరువు ఉన్న బంగారాన్ని ఆ దేవదేవుడికి బహుమతిగా ఇచ్చాడని తెలుసుకున్నప్పుడు నేను ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అయ్యాను. ఇంకా ఆ కొండప్రాంతంలో పంచగంగ తీర్థాలు ప్రవహిస్తున్నాయి. ఈ ప్రదేశాన్ని పవిత్రం చేస్తూ ఐదు నదులు ప్రవహిస్తున్నాయి అని నమ్ముతారు. ఆ స్వామి దర్శనం కాగానే, ఆ స్వామి దర్శనం కోసం కొండల మధ్య గంటల కొద్దీ ప్రయాణం, కొన్ని వందల మెట్లు ఎక్కడంలో పడిన శ్రమ అంతా అత్యంత, అరుదైన తృప్తిగా మారిపోయింది.

**నారాయణపూర్:**

ఏకముఖ దత్తుడుకి నారాయణపూర్ ప్రసిద్ధి. సహజంగా దత్తాత్రేయ స్వామి త్రిముఖుడిగా ఉంటారు కానీ ఈ నారాయణపూర్‌లో ఏకముఖ దత్తుడుగా ఉంటారు. ఏకముఖ దత్తుడు విగ్రహం అత్యంత సుందరంగా ఉంది. మనం వారి పాదుకలను కూడా చూడవచ్చు. దత్తాత్రేయుల వారు సమాధిలోకి వెళ్లక ముందు వారు స్వయంగా ఈ పాదుకలను గర్భగుడిలో ఉంచారు. ఇక్కడ ఉన్న పురాతనమైన ఔదుంబర వృక్షాన్ని యాత్రికులంతా ఆరాధిస్తుంటారు, పూజిస్తుంటారు.

**అష్టవినాయక దర్శనం:**

అష్టవినాయక అంటే ఎనిమిది గణపతులని అర్థం. గణేశుడు అంటే ఐక్యతను, సంపదను, అభ్యాసమును ఇచ్చి అడ్డంకులన్నింటిని తొలగించేవాడని అర్థం. అష్టవినాయక ప్రయాణం ఒక తీర్థయాత్రను సూచిస్తుంది. భారతదేశంలోని మహారాష్ట్రలో 8 దేవాలయాలు, 8 విలక్షణమైన గణపతి విగ్రహాలు కలిగినవి. పూణే చుట్టూ ఉన్న 8 పురాతన పవిత్ర గణపతి దేవాలయాలను కలిపి ఉంచే క్రమంలో ఉన్నాయి. ఈ దేవాలయాల్లో ప్రతి ఒక్కదానికీ భిన్నమైన పురాణం మరియు చరిత్ర ఉన్నది. ప్రతీ ఆలయంలోని విగ్రహాలు ఒకదానికి ఒకటి విభిన్నంగా వుంటాయి లేదా ప్రతి గణేశ విగ్రహం అతని దంతం ఒకదానికొకటి విభిన్నంగా ఉంటుంది.

మహారాష్ట్రలో ప్రయాణం మొదలైనప్పటి నుండే, అష్టవినాయక దర్శనం చేయాలని ఉవ్విళ్లూరాను. కారణం మహారాష్ట్ర ప్రజలు ఈ 8 క్షేత్ర దర్శనములను జీవితంలో ఒకసారైనా చూడాలని కోరుకుంటారట. అలాంటిది జీవిత కాలపు యాత్రను భారతదర్శనములో చేరుకోవాలనుకున్నాను. కార్లో ప్రయాణం కాస్త ఖర్చుతో కూడినదే అయినా... వెనకాడకుండా మిగితాఖర్చులు తగ్గించే ఆలోచన చేసాను. మొదటి రోజున 3 వినాయక క్షేత్రాలను చూడగలిగాను.

మోరేగావ్, తేయుర్, రంజన్‌గావ్‌లలో దేశసౌభాగ్య, సౌశీల్య, సౌజన్యముల గురించి ప్రార్థన చేసి ఆశీర్వచనాలు తీసుకోనే చక్కటి భాగ్యం దొరికింది. ఉదయం 6 గంటల నుండి కాలంతో పాటు పరుగెత్తుతున్నట్లు అనిపించింది.

ఎన్నో చోట్ల జరిగినట్లే యధావిధిగా, రంజన్‌గావ్‌లో రాత్రి 10 గంటలకు మహాగణపతి దేవాలయంలో చివరి దర్శనం చేసిన వ్యక్తిని నేనే. ఆ తర్వాత ఆలయాన్ని మూసివేశారు. సంతృప్తికరమైన రోజును ముగింపు చేస్తూ ఆలయ ఆవరణలోని ఒక గది తీసుకుని... ఇక ఆ రోజూ జరిగిన విశేషాలను వ్రాసుకుని సుమారు 12 గంటలకు కునుకు తీశాను. రంజన్‌గావ్‌లోని మహాగణపతి దేవాలయంలో ఆ స్వామి వారి అద్భుత ప్రభాత దర్శనం అయ్యాక, సిద్ధిటెక్ ఆలయానికి బయలుదేరాను.

**అభ్యాసాలు/పరిశీలనలు:**

భగవంతుని దర్శనం పొందడానికి ఎవరైనా కొండలు అధిరోహించాలి... లేదా అనేక వందల మెట్లు ఎక్కాల్సి వుంటుంది... కానీ భగవద్ దర్శనం చేసిన తర్వాత కలిగే అపారమైన సంతృప్తి ప్రయాణంలో ఎదురయ్యే అన్ని బాధలను మరచి పోయేలా చేస్తుంది.

## జూన్ 12, 2019

**సిద్ధి వినాయక:**

సిద్ధి టెక్‌లో ఉన్న శ్రీ సిద్ధి వినాయక ఆలయం, గణేశ స్వామి వారిది. అహ్మద్ నగర్ జిల్లాలోని పేరుగాంచిన అష్టవినాయక గుడులలో ఇది ఒకటి.

**షోలాపూర్ - శివయోగి సిద్ధేశ్వర ఆలయం:**

ఈ సిద్ధేశ్వర గుడి శ్రీశైలం మల్లికార్జునుని భక్తుడైన శివయోగిచే నిర్మించ బడింది. ఈయన, తన గురువు ఆజ్ఞ ప్రకారంగా 68 శివలింగములను ఇక్కడ ప్రతిష్టించాడు. వీరశైవ మతంలోని ఆరుగురు మహాపురుషులలో ఒకరైన శ్రీ సిద్ధేశ్వర స్వామి వారు అక్కడ జన్మించడం వల్ల ఆ నగరం సుసంపన్నమైనదని, అక్కడున్న దైవం భక్తుల పాలిట వరదాయకుడని అంటారు.

మహారాష్ట్రలో ప్రవేశించగానే అక్కడ జిల్లాలలోని అధ్వాన్నమైన రహదారులు గమనించాను. అక్కడి ప్రజల జీవనంపై ఈ అసౌకర్యాలు చాలా దుష్ప్రభావం చూపుతున్నాయి. ఆ రోడ్ల మీద ప్రయాణం చేస్తున్నప్పుడు కొంచెం ఆశ్చర్యపడ్డాను.

కొత్త రహదారులు రెండు సంవత్సరాలుగా వేస్తున్న గుర్తులు కనిపించాయి. అలాంటి రహదారులపై ప్రయాణం గంటకు 20 కిలోమీటర్ల వేగంతో పోతున్నట్లు అనిపించింది... కానీ డ్రైవరు మిత్రుడు శ్రీకాంత్ నైపుణ్యంగల డ్రైవర్ అయినందువల్ల జాగ్రత్తగా, ప్రయాసపడకుండా, చక్కగా తీసుకువెళ్ళాడు. ఒక్క మూడు రోజుల్లోనే నేను 1500 కిలోమీటర్ల పైగా తిరిగాను.

**అక్కల్ కోట:**

అక్కల్ కోట మహారాజుగా పేరుపొందిన శ్రీ స్వామి సమర్థులు దత్తాత్రేయ భక్తులకు గురువుగా భారతదేశ రాష్ట్రాల్లో గౌరవింపబడుతున్నారు. నేను చిన్నప్పటి నుంచి శ్రీ శ్రీ దత్తాత్రేయ ఐదు అవతారాల గురించి వింటుండే వాడిని (శ్రీపాద వల్లభ, నృసింహసరస్వతి, అక్కలకోట మహారాజు, మాణిక్యప్రభువు, గురు దత్తాత్రేయ). కానీ ఇన్నేళ్లకు నేను ఈ వయసులో ఆయన సమాధిని దర్శించుకుని, ఈ అవధూత గురించి విన్నందుకు ఎంతో తృప్తి అనిపించింది. 19వ శతాబ్దంలో ఆయన దేహధారిగా అయ్యారు. నడిచే దేవుడుగా ఆయన కథ వినడం హృదయానికి చాలా ఆహ్లాదంగా అనిపించింది. అక్కడి నుంచి గానిగాపూర్ క్షేత్ర దర్శనము కోసం కర్ణాటక ప్రయాణం అయ్యాను.

**గానిగాపూర్:**

శ్రీ నృసింహసరస్వతి (1378–1450) శ్రీ గురు దత్తాత్రేయ గురుపరంపరకు ఆద్యుడు. శ్రీ గురు చరిత్ర ఆధారంగా కలియుగంలో శ్రీపాద శ్రీవల్లభుల అవతరించాక రెండవ అవతారంగా శ్రీ నృసింహసరస్వతి వారిని అందరూ కొలుస్తారు. ఈ అవతార లక్ష్యం, కథ చాలా ఆసక్తిదాయకంగా ఉంటుంది. ఆయన తన లక్ష్య సాధన చివరి మెట్టులో వదిలి వెళ్లిన 'పాదుకుల' గురించి తప్పకుండా మనమందరము తెలుసుకోవాలి. అసలు ఆ పాదుకలను చూస్తే చాలా వింతగా, ఆశ్చర్యంగా అనిపిస్తుంది!

**తుల్జాపూర్:**

తుల్జా భవాని ఆలయం భవాని మాతకు అంకితమైంది. 51 శక్తిపీఠాల్లో

ఒకటిగా ఉన్న తుల్జాపూర్, ఉస్మానాబాద్ జిల్లాలో ఉంది. షోలాపూర్ నుంచి 45 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ఆలయం 12వ శతాబ్దంలో నిర్మించబడింది.

దేశాన్ని రక్షించడానికి కావాల్సిన దీక్ష, దక్షతలను పొందడానికి శివాజీ ఆయన తల్లి గారు ఇక్కడికి వచ్చేవారట. అత్యంత శక్తివంతమైన ఆ తల్లి, శివాజీ మహారాజ్ కుటుంబ దేవత. ఆమె దర్శనమే అత్యంత ధైర్యాన్ని, జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని అందిస్తుంది. మరాఠీ ప్రజలు ఆమెను వారి స్వంత కుటుంబ సభ్యురాలుగా పరిగణిస్తారు.

ఆ ఆలయం ఒక కోట రూపంలో ఉంది. ఆమె సమక్షంలో అందరి శ్రేయస్సు కోసం గాఢంగా ప్రార్థించడం నాకు ఎంతో సంతోషదాయకం అయింది. ఆ ఆలయ ప్రథమ ప్రాంగణంలో ఎల్లప్పుడూ ప్రవహించే గోముఖ తీర్థంనూ దర్శించుకున్నాను.

నేను ఎప్పుడూ అనుకుంటుంటాను... ఒక్కసారి దైవ దర్శనం చేసినా చాలు, మనలోని మాలిన్యమంతా ప్రక్షాళనైపోవడం ఖాయం. ఇక అందరి శ్రేయస్సు కోసం ప్రార్థించడం ఒక్కటే చాలు. అందువల్లనే నేను ఎప్పుడూ అర్చనకి, హారతికి, ప్రత్యేక సేవలకు, ప్రత్యేక దర్శనానికి, ఆర్జిత సేవలకు, తిలక ప్రసాదానికి డబ్బులు వెచ్చించనేలేదు. సామాన్యుడిలా వెళ్లేందుకు మాత్రమే మొగ్గు చూపేవాడిని. ప్రతి పైసా ఎందరో మహానుభావులు సమకూర్చిందనుకుని... సర్వదర్శన కాంక్షతోనే ముందుకు వెళ్లాను.

కానీ ఈ తల్లి సమక్షంలో నేను అమ్మవారి పవిత్ర పాదాల దగ్గర ప్రార్థిస్తూ ఉన్నప్పుడు, అక్కడ ఇద్దరు పూజారులు నా నుదుటిపై తిలకం అద్దాలని ప్రయత్నించగా నేను సున్నితంగా తిరస్కరించాను. కానీ నేను గర్భగుడి దాటుతూ ఉండగా ఒక పూజారి ఆకస్మాత్తుగా నా ముందు వచ్చి నా నుదిటిపై తిలకం అద్దేశాడు. జరిగినది చిన్న విషయమే అయినా అది నాకు చాలా ఆశ్చర్యంగా అనిపించింది. అమ్మ దీవెనలు అలా నాకు వద్దన్నా అందించారని అనుకున్నాను.

## పర్లీ వైద్యనాథ్:

బీడ్ జిల్లాలోని పర్లీ ఒక తాలూకా. జ్యోతిర్లింగ వైద్యనాథ్‌గా పేరుపొందిన (వైద్యనాథ గుడిగా ప్రసిద్ధి పొందింది) ఆ గుడి ఒక చిన్న కొండ మీద రాతితో

నిర్మించబడి... చుట్టూ ఒక ప్రహరీగోడ రక్షణగా ఉంది. పర్లీ ఆలయం చేరుకోగానే (ప్రధాన రహదారి పక్కనే ఉంది) ప్రధాన ఆలయం వైపు జ్యోతిర్లింగ దర్శనం కోసం వేగంగా పరుగెత్తుకుంటూ వెళ్లాను. అది ఆలయం మూసే సమయం కావడంతో అక్కడ రద్దీ లేదు. నేను చక్కగా దైవ దర్శనం చేసుకున్నాను. అందరి కోసం ప్రార్థిస్తూ నేను జ్యోతిర్లింగాన్ని నా రెండు చేతులతో స్పృశించి మరొక్కసారి తలతోనూ స్పర్శించాను. అదృష్టవశాత్తు నేను బయటకు వస్తూనే ఎన్నో చోట్ల జరిగినట్లే ఇక్కడ కూడా 10:00కి ఆలయం మూసివేసే సమయంలో దైవ దర్శనం పొందగలిగాను.

నేను శయన హారతికి హాజరయ్యాను. ఆలయ ప్రాంగణం చాలా బాగుంది. అక్కడ రాత్రి విశ్రమించడానికి అద్దెకు గదులు ఉన్నాయి. కానీ సామాన్యుల గదులు గాని, సార్వజనిక విశ్రాంతి నిలయాలు గాని ఎక్కడా లేవు. చివరి ప్రయత్నంగా దేవస్థానం పక్కనే ఉన్న ఒక చత్రంలో, బీదర్ నుండి వచ్చిన వంద మంది శైవమత భక్తులతో పాటుగా నేను ఉన్నాను. వాళ్లు ఎంతో ప్రేమతో, ఆదరణతో నాకు ఆ రాత్రి భోజనం పెట్టారు.

నేను కార్లో ప్రయాణించి వచ్చినప్పటికీ... దారి పొడుగు నా అస్తవ్యస్తంగా ఉన్న గుంతలు, రాళ్ళపైన నడచి వచ్చినట్లుగా అనిపించి చాలా అలసిపోయాను.

## జూన్ 14, 2019

### గ్రిష్ణేశ్వర్:

దక్షిణ భారతదేశ శిల్పశైలికి ఉదాహరణగా గ్రిష్ణేశ్వర్ ఆలయం వుందని చెప్పొచ్చు. ఎరుపు రాళ్లతో కట్టబడిన ఈ ఆలయం ఐదు అంతస్తుల శిఖరంతో రూపొందించబడింది. ఈ ఆలయం శివాజీ మహారాజు తాతగారైన అమాలోజీ భోస్లే గారి చేత పునర్నిర్మించబడింది.

ఆ తరువాత 18వ శతాబ్దంలో, రాణి అహల్యాబాయి హోల్కర్ మళ్లీ ఈ ఆలయాన్ని అనేక విధాలుగా జీర్ణోద్ధరణ చేసింది. అంతేకాదు, ఆ మహనీయురాలికి దేశంలోని ప్రధాన హిందూ ఆలయాలైన శ్రీ కాశీ విశ్వనాథ ఆలయం, శ్రీ విష్ణు దేవాలయం, అలాగే జ్యోతిర్లింగం వెలసిన ఆలయం సోమనాథ్ తో పాటు ఎన్నో వందల దేవాలయాలను పునర్నిర్మించిన ఖ్యాతి దక్కింది.

భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలకు రక్షణగా నిలిచి... ఎంతో భక్తి, శ్రద్ధలతో జీవించిన రాణి అహల్యాబాయిని తలచుకుని ఆశ్చర్యపోయాను.

మహారాణి అహల్యాబాయి హొల్కర్ (1725–1795), మరాఠాలను పరిపాలించిన మాల్వా సామ్రాజ్యపు హొల్కర వంశ రాణి. రాజమాత అహల్యాబాయి మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ ప్రాంతానికి చెందిన చౌండీ గ్రామంలో జన్మించారు. ఆమె తన పరిపాలన కాలంలో హిందూ మత కార్యకలాపాలు, ధార్మిక కార్యక్రమాలు నిర్వహించి పేరు పొందారు.

అహల్యాబాయి భర్త ఖండేరావు హొల్కర్ 1754లో కుంభేరి యుద్ధంలో మరణించారు. పన్నెండు సంవత్సరాల తర్వాత, ఆమె మామ మల్హర్‌రావు హొల్కర్ మరణించారు. ఒక సంవత్సరం గడిచాక ఆమె మాల్వా రాజ్యపురాణిగా సింహాసనాన్ని అధిష్టించారు.

ఆమె రాజ్యాన్ని థగ్గులనే దోపిడీదారుల నుండి, ఇతర దుండగుల నుండి రక్షించేందుకు ప్రయత్నాలు చేసారు. ఆమె యుద్ధాల్లో వ్యక్తిగతంగా సైన్యానికి నాయకత్వం వహించి ముందుకు నడిపించింది. తుకోజీరావు హొల్కర్‌ను సేనానాయకునిగా నియమించారు.

రాణి అహల్యాబాయి ఇండోర్, మహేశ్వర్ ప్రాంతాల్లో అనేక హిందూ ఆలయాలను నిర్మించి ప్రసిద్ధికెక్కారు. ఆమె దేశంలో కూడా అనేక పవిత్ర స్థలాల్లో ధర్మశాలలు నిర్మించారు. వాటిలో తూర్పు నుండి ద్వారక, ఉత్తరంలో వారణాసి, మధ్యలో ఉజ్జయిని, నాసిక్, గయ, వైద్యనాథ్ వంటి ప్రాంతాలలో ధర్మశాలలు నిర్మాణం చేసారు.

ఆ మహిళామ తల్లి ఆ రోజులలోనే మహిళా సాధికారత గురించి విశేష కార్యక్రమాలు చేసారు. యుద్ధ విద్యల్లో స్త్రీలను ప్రోత్సహించి ఒక మహిళా సేనను ఏర్పరిచారు. వితంతువులకు భర్త ఆస్తి సంక్రమించేలా చేసారు. కాలువలు, చెరువులు త్రవ్వించి వ్యవసాయ అభివృద్ధికి పాటు పడ్డారు. మహేశ్వర నేత కార్మికులను ప్రోత్సహించి మహేశ్వరం చీరలు అనే కొత్తవి అందుబాటులోకి తెచ్చారు. ఈ నాటికి మహేశ్వరం చీరలు మహారాష్ట్రలోనే కాక భారతదేశం అంతటా ప్రసిద్ధి అని తెలిసింది.

అటు నుంచి, ఆ ఆలయానికి ఒక కిలోమీటరు దూరంలో ఉన్న ఎల్లోరా

గుహలను దర్శించాను. ప్రపంచ వారసత్వ సంపదగా UNESCO వారిచే గుర్తించబడిన ఈ ఎల్లోరా గుహలు మహారాష్ట్రలోని ఔరంగాబాద్ జిల్లాలో ఉన్నాయి. 600–1000 C.E. మధ్యకాలంలో హిందూ, బౌద్ధ, జైన మత కళాకృతులతో నిర్మితమైన స్మారక కట్టడాలు, ఒక పెద్ద రాయిని తొలిచిచేసిన గుహల సముదాయంతో నిర్మించిన వాటిలో ఇది ఒకటి.

ప్రపంచంలోనే ఏక శిలాపై నిర్మించబడిన 16వ గుహ, కైలాస ఆలయం రథాకారంలో చెక్కబడిన శివుడికి అంకితం చేయబడింది. ఈ కైలాస ఆలయంలో ఉన్న శిల్పాలు దేవతల ఆకారాలలోను, వైష్ణవ, శాక్తేయ సంప్రదాయాలలో ఉన్న పురాణ ఇతిహాసాల ఇతివృత్తాలతో నిండి వున్నాయి.

ఈ స్థలాన్ని దర్శించాక, అందులోని అద్భుతమైన కళాకృతులను చూశాక, ఎలాంటి రవాణా మరియు ఆధునిక యంత్ర సామాగ్రి లేకుండా... వేల మంది శిల్పులు... సంవత్సరాల పాటుగా అతి నైపుణ్యంతో చెక్కబడటం ఒక ఎత్తైతే ఇన్ని వందల సంవత్సరాల తరువాత కూడా అలా చెక్కు చెదరకుండా ఉన్నాయనడం మరొక ఎత్తు. అది అసలు ఊహాతీతం, ఏ కొలమానంతోనూ కొలువలేని, అత్యంత మహోన్నతమైన సౌందర్యం, మానవుని పరిశీలనా దృక్పథానికి అందనిది, ఏ యంత్రతంత్ర శాస్త్రీయ దృక్పథంతో వారు వాటిని నిర్మించారూ అన్న విషయం నేటికీ కూడా మనకు తెలీయదు అని చెప్పక తప్పదు.

వాళ్ళు అద్భుతాలు చేసారా లేక భగవంతుడే వాటిని స్వయంగా నిర్మించాడా? అన్న ప్రశ్న మనకు తప్పక ఉదయిస్తుంది. ఈ స్థలాలు మనం నిత్యమూ పూజించే ఆలయాల కంటే కూడా ప్రాముఖ్యత కలిగినవి అనిపించింది. ఆ స్థలాన్ని అలా వీక్షించడానికి నాకు సుమారు రెండు గంటలు పట్టింది. ఎల్లోరా నుండి నేను శనిశింగణపూర్ వైపు ప్రయాణం కొనసాగించాను.

### శని శింగణాపూర్

నల్ల రాతితో స్వయంభూగా వెలసిన శనీశ్వరుడు వెలసిన క్షేత్రమే ఇది. ఆ శిల కూడా అలా బహిరంగంగా... తలుపులు... గోడలు... ఆలయం లేకుండా ఆకాశమే కప్పుగా భక్తులకు కనిపిస్తుంది. ఇక్కడికి భక్తులు అన్ని రోజుల్లోనూ వస్తారు.

ఖచ్చితంగా ఏ కాలానికి చెందినదో ఎవరికీ తెలియనప్పటికీ, స్థానిక పల్లెటూరికి చెందిన గొర్రెల కాపరుల ప్రకారం స్వయంభూ శనీశ్వరుడు అనాదిగా ఇక్కడ కొలువై ఉన్నాడు. కనీసం కలియుగం ప్రారంభం నుండి ఇది ఇక్కడ ఉన్నట్లుగా నమ్ముతారు. పూర్వంలో ఒక గొర్రెల కాపరి పదునైన చువ్వతో రాతిని కొట్టినప్పుడు దానిలోంచి రక్తం ప్రవహించడం ప్రారంభమైంది. దీని తో గొర్రెల కాపరులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే పల్లె మొత్తం ఆ అద్భుతాన్ని చూసేందుకు గుమిగూడింది. ఆ రాత్రి, అత్యంత భక్తిశ్రద్ధలు గల గొర్రెల కాపరి యొక్క స్వప్నంలో శనీశ్వర స్వామి ప్రత్యక్షమయ్యాడు. తాను "శనీశ్వరుడి" నని చెప్పాడట.

అద్వితీయముగా కనిపించుచున్న ఆ నల్లరాయి తన స్వయంభూ రూపమని కుడా ఆయనే చెప్పినాడు. గొర్రెలకాపరి స్వామిని ప్రార్థించి ఒకవేళ తనకు స్వామికి ఆలయం నిర్మించవలెనేమో అని అడిగెను. దీనికి సమాధానంగా శని మహాత్ముడు ఆకాశం మొత్తం తనకు నీడ అని కావున, తనకు ఎటువంటి నీడ అవసరం లేదని, తానూ బాహాటముగా ఉండుటకే ఇష్టపడతానని చెప్పెను. ప్రతిరోజూ పూజ చేస్తూ శని వారాలలో తప్పకుండా 'తైలాభిషేకం' చేయమని ఆయనే గొర్రెలకాపరికి చెప్పాడట... అంతేకాకుండా మొత్తం పల్లెలకు బందిపోటుల లేదా కన్నములు వేసేవారు, దొంగల భయం ఉండదని మాట ఇచ్చాడని చెప్తారు. అందుకే అక్కడ ఎక్కడా మనకు తలుపులకు తాళాలు వేసి ఉండటం చూడము. స్వామివారి పాదాలకు నా ప్రార్థనలు సమర్పించి షిరిడి బయలుదేరాను.

## షిరిడి నా రెండవ గృహం

సాయిబాబా భక్తులకు అత్యంత పవిత్ర ప్రదేశం షిరిడి. నాకేమో షిరిడీ నా రెండవ ఇల్లు అని అనుకుంటాను. మొదటిది పర్తియే కదామరి. చాలా రోజుల తర్వాతనే నేను బాబాను దర్శించుకున్నాను. భక్తులతో నిండిపోయిందా ప్రాంతం అంతా. ఇదీ నెమ్మదిగా తిరుమల అవుతుందేమో అనిపించింది. మరుసటి రోజు ప్రయాణాన్ని దృష్టిలో ఉంచుకుని, డ్రైవరుసోదరుడు అభ్యర్థనను దృష్టిలో ఉంచుకుని 100 రూపాయల ప్రత్యేక దర్శన క్యూలో నిలబడ్డాను.

అయినా సరే చాలాసేపు దర్శన వరుసలలో నిల్చోవాల్సి వచ్చింది. అందరికోసం ప్రార్థన తప్ప హృదయంలో మరొక ఆలోచన లేదు... ఆ క్యూలో కదులుతూ ఉన్నప్పుడు. నేను బాబా సమాధిని దర్శించుకుని... అతి కష్టము మీద చేతులనూ కడ్డీలలో పెట్టి, సమాధిని ముట్టి... దివ్యానుభూతికి లోనై... వివశుడినై వెనుతిరుగుతుంటే... బాబా వారి సన్నిధి దగ్గర ఉన్న పూజారి బాబా దివ్య సమాధి మీద శాలవా తీసి నా తల మీద వేసారు. నేను ఆ ఆశీర్వాదాన్ని మాటల్లో వర్ణించలేను. నాకు అది నా తాతయ్య నాకు ఇచ్చిన బహుమతిగా భావించాను. బాగా గుర్తుపెట్టుకోండి, నేను ఎక్కడా కూడా పూజలకు, ప్రదక్షిణలకు, సంభావనలకు ఒక్క రూపాయి కూడా ఏ ఆలయంలోనూ సమర్పించలేదు... హృదయపూర్వక ప్రార్థనలూ తప్ప. అయినా సరే ఇలాంటి అనుభవాలు జరుగుతుంటే... దైవానుగ్రహము కాక మరి ఏమనుకోవాలి.

**ఓర్ఝర్, విఘ్నహర్ గణపతి:**

షిర్డీ దర్శనం తర్వాత నేను పూణే వైపు వెళ్లాను. రాత్రి 9 గంటలకు ఓర్ఝర్ చేరుకున్నాను. ఓర్ఝర్ విఘ్నహర్ గణపతి ప్రత్యక్షమైన ప్రదేశం, ఇది మహారాష్ట్రలోని అష్ట వినాయక దేవాలయాలలో ఒకటి. నేను భోజనానికి రూ. 25/– ఖర్చు చేసాను మరియు రూ. రాత్రి విశ్రాంతి తీసుకోవడానికి వసతి గృహంలో 100/–. ఖర్చు చేసాను

**అభ్యాసనలు / పరిశీలనలు:**

ఇప్పుడు సాధించిన శాస్త్రీయ సాంకేతిక విజ్ఞానం మన పూర్వీకులతో పోల్చుకుంటే అసలు మనం ఏమీ సాధించలేదనే చెప్పవచ్చు. వేల కొద్ది శిల్పులచే నిర్మించబడ్డ అత్యంత అద్భుతమైన శిల్పకళ, అసలు ఎల్లోరా గుహలని చూడటం ఒక మరచిపోలేని మహా అద్భుతం. భారత దర్శనంలోని ప్రతి రోజు నాకు జ్ఞానాన్ని ఇచ్చిందే.

గత రెండు రోజులుగా మహారాష్ట్రలోని మహనీయుల గురించి, పంచావతారాలు అయిన శ్రీపాద వల్లభుడు, శ్రీ నృసింహసరస్వతి, శ్రీ అక్కల్‌కోట మహారాజ్, శ్రీ మాణిక్యప్రభువు, శ్రీ షిర్డీబాబా... అలాగే శ్రీ స్వామిసమర్థ, శ్రీ

గజానన్ మహారాజ్, శ్రీ శ్రీబాలుమామ మరియు ఇంకెందరో... వారందరూ అవధూతలాగా జీవించారు. వారి జీవిత చరిత్రలు తెలుసుకున్నప్పుడు, వారి జీవితాలలో ప్రధాన అంశం ప్రేమ మరియు సేవ అనేది తెలుసుకుని ఎంతో సంతోషించాను. అది సరియైన జీవిత పరామార్థం అని అవగతమై నప్పుడు... ఇక నా లక్ష్యం మరింత బలోపేతం అయింది.

## జూన్ 15, 2019

15 జూన్ 2019 నాటికి, భారతదర్శనం మొదలు పెట్టి 30 రోజులు అయ్యిపోయింది. నన్ను చాలామంది అడిగారు ఇంకా ఎన్ని రోజులు పడుతుంది అని నాకు తెలియదని చెప్పాను. కారణం నాకు కూడా సరైన సమాధానం తెలియదు కాబట్టి. ఈ 30 రోజులకే నేను నాలుగు రాష్ట్రాలు అంటే కేరళ, కర్ణాటక, గోవా, మహారాష్ట్ర దర్శనం పూర్తి చేసాను. భారతదేశ సందర్శన పూర్తి అయ్యేందుకు కావలసిన శక్తిని ఇమ్మని ఆ సర్వేశ్వరుని వేడుకున్నాను. ఎందుకంటే ఈ యాత్ర ఆయన సంకల్పమే కదా! ఇలాంటి ఆలోచనలతో ముందుకు సాగాను.

**అష్టవినాయకము:**

పూణే నగరానికి చుట్టు పక్కల, మారుమూలలో ఉన్న, ఖ్యాతి గడించిన ఓజహర్, లీనంద్రి, పాలి, మహడే క్షేత్రాలలో కొలువై ఉన్న అష్టవినాయకులలోని నాలుగు రూపాలని దర్శించాను. ముంబై పట్టణానికి రాత్రి లోపుగా చేరుకోవాలన్న హడావిడిలో ప్రతి ఆలయానికి పరుగులు తీస్తున్న నాకు మధ్యాహ్న భోజనం తీసుకునే అవకాశం కూడా కలగలేదు.

నేను ఆ ప్రాంత సందర్శనలో గుహల్ని కొండ ప్రాంతాల్లో చూస్తున్నప్పుడు నాలో చాలా ప్రశ్నలు ఉద్భవించాయి:

1. అసలు ఈ కొండలను గుహలను ఎవరు గుర్తించారు?
2. సౌకర్యాలు ఇంత అభివృద్ధి చెందిన ఈ సమయములో కూడా మనము ఆ స్థలాలను చేరుకోలేక పోతున్నాము, మరి శతాబ్దాల క్రితం ప్రజలు ఎలా చేరుకోలిగారు?

3. ఈ గుహలు ఎందుకు మతాన్ని, నాగరికతను, సంస్కృతిని వ్యాప్తి పరుస్తున్నాయి?
4. ఎలాంటీ యంత్రాల సాయం లేకుండా ఈ అంత పెద్ద పెద్ద గుహలను ఎలా నిర్మించగలిగారు?
5. ఇన్ని శతాబ్దాల తర్వాత కూడా ఆ గుహలు ఎలా చెక్కు చెదరకుండా ఉన్నాయి?
6. కఠినమైన రాతి కొండల్లో, ఒకటి రెండుకాదు ఎన్నో కిలోమీటర్ల దూరం వరకు, అదీ కాక మూడు అంతస్తులుగా ఇలా గుహలను ఎలా నిర్మించగలిగారు?

ఈ విషయాలన్నీ నా అవగాహన సామర్థ్యానికి అవతలే ఉన్నాయి అనిపించింది. ప్రతి విగ్రహం శిల్పశాస్త్రం అనుసరించే ఉంది. దర్శించుకునే వారు భావన ఏమైనప్పటికీ వారందరూ ఈ స్మారకచిహ్నాలు చూసి ఆశ్చర్యచకితు లవుతారు. అందులో చాలా స్థలాలు ప్రపంచ వారసత్వ కేంద్రాలుగా UNESCO వారిచే గుర్తింపబడ్డాయి.

లైనంద్రి దగ్గర ఉన్న పురాతన గుహ ఇలాంటిదే అందులో ఉన్న గిరిజాత్మక వినాయకుని దర్శించుకున్నాను. నా ఈ ఆలోచనలను పంచుకోవడం అనేది నాకు చాలా ఆనందాన్ని ఇస్తుంది. ఎవరైతే భారత సంస్కృతిని, ఆచారాలను తెలుసుకోవాలనుకుంటారో వారందరూ ఇలాంటీ స్థలాలన్ని చూస్తే, భారత దేశం పట్ల గౌరవం పెరిగినట్లే అవుతుంది. జయహో భారత్!

## భీమశంకర్ – ప్రకృతి సంపూర్ణ అభివ్యక్తీకరణము:

మూడు గంటల ప్రయాణం. దారిలో ఎక్కడ చూసినా లోతైన లోయలు, జలపాతాలు, పెద్ద పెద్ద పర్వతాలు, దట్టమైన అరణ్యాలు కనిపిస్తాయి. మామూలుగా అయితే పర్వతాల మీద భగవంతుని చూస్తాము అందుకు భిన్నంగా ఇక్కడ ఈ భీమశంకరుని దర్శించుకోవడానికీ సుమారు 550 మెట్ల ద్వారా లోతుకు వెళ్ళాలి. మహాదేవుడు ఒక లోతైన లోయలో కొలువై ఉంటాడు. నాకు ఆహ్లాదపూర్వకమైన దర్శనము మరియు స్పర్శనము లభించాయి. భూమి మీద ఉన్న ఇలాంటి అద్భుత స్థలాలను చూడగలగడం అనేది ఒక గొప్ప వరంగా భావించాలి.

నేను మహారాష్ట్రను సందర్శిస్తున్నప్పుడు అక్కడున్న నాలుగు జ్యోతిర్లింగాలని చూడాలని తపించాను. పర్లీ వైద్యనాథ్, నాగేశ్వర్, నాసిక్ త్రయంబకేశ్వర్, భీమశంకర్ ఇలా ఆ భగవంతుని ఆశీస్సులతో వాటన్నింటినీ చూడగలిగాను.

**ముంబై సిద్ధి వినాయకుడు:**

మహడ్ నుంచి బెంగళూరుకు ముంబై జాతీయ రహదారిలో సుమారు రెండు గంటల ప్రయాణం చేసి ముంబై మహనగరాన్ని చేరుకున్నాను. ఆ తరువాత నేను మొదటిసారిగా దర్శించింది శ్రీ సిద్ధివినాయక ఆలయం.

సిద్ధివినాయక దేవాలయము ప్రభావతీ ప్రాంతంలో ఉంది. దీనికి రెండు శతాబ్దాల చరిత్ర ఉంది. ఈ దేవాలయం నవంబరు 19, 1801లో లక్ష్మణవితు అంరియు దూబె పాటిల్ చేత నిర్మించబడింది. ఇది ముంబైలోని అతి ఐశ్వర్యవంతమైన దేవాలయం. ఈ ఆలయానికి పర్వదినాలలో భక్తుల తాకిడి ఎక్కువ. మంగళవారం నాడు సుమారుగా ఏభై వేల మంది భక్తులు వస్తుంటారు. ఈ ఆలయానికి ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో నూట ఇరవై ఐదుకోట్ల రూపాయలు ఉన్నాయి. ప్రతీ ఏడు కానుకలుగా పదికోట్ల పైగా వస్తుంటుంది. ఈ ఆలయ సంపద విలువ మూడు వందల యాభై కోట్ల రూపాయలపైగా ఉంది. 1801 సంవత్సరంలో చిన్న ఆలయంగా ప్రారంభమైన ఈ గుడి కాలక్రమంలో ఆరు అంతస్తులతో ఉంది. ఆలయ శిఖర గోపురానికి బంగారు తాపడం చేయించారు. ఆర్యసమాజ్‌కు చెందిన దూబె పాటిల్ అనే శ్రీమంతురాలు ఈ ఆలయాన్ని కట్టించింది. పిల్లలు కలగని మహిళలు ఈ స్వామివారిని దర్శిస్తే పిల్లలు కలుగుతారని భక్తుల విశ్వాసం.

ఈ ఆలయంలో వినాయకుని ఎత్తు 2.6 అడుగులు. వినాయకుని తొండం కుడివైపుకి తిరిగి వుండడము ఈ ఆలయం ప్రత్యేకత. ఒక చేతిలో కమలం, ఒక చేతిలో గొడ్డలి, ఒక చేతిలో తావళం, ఒక చేతిలో కుడుములు ఉన్న పాత్ర ఉన్నాయి. ప్రముఖ వ్యాపారవేత్తలు, సినీ ప్రముఖులు ఈ ఆలయాన్ని దర్శించుకుంటున్నందున ఈ ఆలయానికి అత్యంత ప్రాధాన్యత వచ్చింది. ఈ దేవాలయ గోపురం లోపలి భాగంలోని పైకప్పు బంగారంతో తాపడం చేయడం జరిగింది.

మహారాష్ట్రలో సుమారు 3,000 కిలోమీటర్ల ప్రయాణంలో నాతో పాటు అన్ని విధాల నాకు అనుకూలంగా ఉండి నా గురించీ శ్రద్ధ చూపిన శ్రీకాంత్‌కి అనేక కృతజ్ఞతలు తెలుపుకొన్నాను. ఏ ఒక్క సమయంలోనూ ఎలాంటి ఇబ్బందిని పెట్టని మంచి కుర్రవాడు. గూగుల్ ద్వారా పరిచయమైన శ్రీ సమర్థ టూర్స్ అండ్ ట్రావెల్స్ యజమాని సాగర్ గారు సోలాపూర్‌లో చాలా మంచి వ్యాపారవేత్త. తన బిల్లును ఎలాంటి వాదప్రతివాదాల లేకుండా సంతోషంగా ఇచ్చేసాను. వారి కోసం నా ప్రార్థనలు. ఎలాంటి ఇబ్బందులు, కష్టాలు లేకుండా జరిగిన నా ఆనందకరమైన మహారాష్ట్ర ప్రయాణ పుణ్యము వీరిద్దరిదీ అనుకున్నాను. కానీ మూడు వేల కిలోమీటర్లు, 25 ప్రదేశాల దర్శనం ఒక్కరితోనే జరగడం అన్నది నాతో పాటు వచ్చిన శ్రీకాంత్‌కు ప్రత్యేకమైన అనుభవం, అదీ నా ద్వారా జరిగింది. నాతో పాటు తనూ ఎంతో శ్రద్ధాభక్తులతో అన్ని క్షేత్రాలలో దర్శనం చేసుకున్నాడు.

భారతీయ ఆర్థిక రాజధానికి చేరుకున్న నేను, ముంబాయిలో నివసిస్తున్న అభయ ఆత్మీయులందరికి కబురు చేసాను. ఆ రాత్రి అనిత సునీల్ నాయర్ నాకు ఆతిథ్యం ఇచ్చారు.

## జూన్ 16, 2019

## సహచరులతో సమయం ముంబైలో:

అనిత సునీల్ నాయర్, ముద్దుగా ఉన్న వారి పిల్లలు నయన్, రిషీలు కాందవాలి లోని వారి ఇంట్లో నాకు బస కల్పించారు. మరుసటి రోజు అల్పాహార సమయం వారింట్లో ఎంతో మంచిగా జరిగిపోయింది. ఆ కుటుంబానికి నా కృతజ్ఞతలు. ఆ తర్వాత దగ్గరలో ఉన్న హొటల్‌కి భోజనానికి వెళ్ళాము. ఆత్మీయులు శ్రీ కె.వి. రామకృష్ణ, అభయ నేషనల్ అడ్వైజరీ కౌన్సిల్, చిన్ననాటి స్నేహితుడు & అభయ ఫౌండర్ ట్రస్టీ, సుంకు రామ్‌ప్రసాద్ మరియు ముంబయిలోని శ్రీ కశ్యప్ చోక్షీలను కలిసాను. అక్కడ అందరికీ భారత దర్శనం గురించి క్లుప్తంగా వివరణ ఇచ్చాను. భోజనం చేస్తూ మేమంతా ఓ రెండు గంటలూ ఆహ్లాదంగా గడిపాము. భోజనం తరువాత యాక్సిస్ బ్యాంక్‌లో వైస్ ప్రెసిడెంట్‌గా పని చేస్తున్న నా చిన్ననాటి స్నేహితుడు, సహ విద్యార్థి, సుంకు రాంప్రసాద్ నన్ను తోడ్కొని బోరువలి (ఈస్ట్) లో ఉన్న వాళ్ళ ఇంటికి తీసుకెళ్లాడు.

వాళ్ళ అమ్మాయి అభినయ డాక్టర్ కావాలని, తనకు అభినందనలను తెలుపుతూ షిరిడీ సాయిబాబా ఆలయంలో పూజారి గారు నాకు ఇచ్చిన శేష వస్త్రాన్ని బహుమతిగా ఇచ్చాను. నేను వారి కుటుంబంతో చాలా సంతోషంగా గడిపాను. వారితో ఇలా సంతోషంగా గడపడం తప్ప నేను ఇంకా ఆ రోజుకీ ఏమీ చేయలేదు.

ముంబై పట్టణాన్ని సందర్శించడానికి స్నేహితుడు రాంప్రసాద్ ఒక కార్ ఏర్పాటు చేసారు. అతను అహ్మదాబాద్‌లో పూర్వం ఉద్యోగం చేయడం వలన గుజరాత్ రాష్ట్ర పర్యటనకు ఎలా వెళ్లాలో కూడా సలహా ఇచ్చారు. అక్కడ ఆయన ఐదు సంవత్సరాలు పని చేసారు. శ్రీమతి సునీత ప్రసాద్ గారు నన్ను, ఒక అమ్మలా, చాలా జాగ్రత్తగా, ఒక చెల్లిగా చాలా ప్రేమతో చూశారు. అలాంటి వ్యక్తులు నా జీవితంలో లభించటం అనేది నా అదృష్టమే అని చెప్పుకోవాలి.

తనకు తెలిసిన గైడ్ రాజును ప్రత్యేకంగా నా కోసం ఏర్పాటు చేసాడు. తను కూడా తెలుగు వాడు. చాలా ఏళ్ల క్రితం తెలంగాణ నుంచి ముంబై పట్టణానికి వలస వచ్చి స్థిరపడిపోయాడు. ఆ తరువాత క్యాబ్ నడిపిస్తూ... అన్ని ప్రదేశాలు తెలిసిన కారణంగా సందర్శకులకు ఒక మార్గదర్శిగా మారిపోయాడు.

**ఫానసవాడి శ్రీ వెంకటేశ్వరుడు:**

ఆ ఆలయము వందేళ్ల క్రితం శ్రీ కంచి పరమాచర్య వారిచే స్థాపించబడింది. చాలా అందమైన ఆలయం. నేను అంతరాలయంలోకి ప్రవేశించగానే అక్కడ ఉన్న ప్రధానాచార్యులు నన్ను పూల దండ, తీర్థ ప్రసాదాలతో ఎదురువచ్చి లోనికి తీసుకెళ్లినారు. ఒక్క క్షణం నేను ఆశ్చర్యచకితుడినయ్యాను. అసలు ఏమి జరిగింది అన్నది కూడా నాకు అర్థం కాలేదు. నాతో పాటు లోనికి కారు డ్రైవరు కూడా జరిగినది చూసి ఆశ్చర్యపోయాడు. ఇదంతా ముంబైలో నాకు అందిన దైవ ఆశీర్వాదంగా స్వీకరించాను.

జూన్ 16, 2019 రోజున మాతల్లిదండ్రుల 55వ వార్షికోత్సవం సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలుపుతూ, వారి కోసం ప్రార్థన చేసాను. అంతేకాక ఫాదర్స్ డే 2019 సందర్భంలో మా నాన్నగారి కోసం ప్రార్థన చేసాను.

సీమ కశ్యప్ దంపతులు నన్ను వారి ఇంటికి మధ్యాహ్న భోజనానికి

ఆహ్వానించారు. ఈ 30 రోజులు నేను తిన్న మంచి భోజనం అక్కడే అని చెప్పాలి. వారికీ మనఃపూర్వక కృతజ్ఞతలు తెలుపుతూ వారి శ్రేయోభివృద్ధుల కోసం ప్రార్థనలు చేసాను. ఫానసవాడి శ్రీ వెంకటేశ్వరుని ఆలయంలో పూజారి గారు నాకు ఇచ్చిన పూల మాలతో వారిని సత్కరించి స్వామివారి ప్రసాదాన్ని కూడా ఇచ్చాను. వారి కోసం ప్రార్థించాను.

ముంబైలో అందరు తలమునకలుగా పనిలో వుండేవాళ్ళు, ఇతరుల కోసం సమయం వెచ్చించడం అన్నది చాలా కష్టం, అలాంటిది అనిత నాయర్, సునీత రాంప్రసాద్ మరియు సీమా కశ్యప్ దంపతులు నా కోసం వారి అమూల్య సమయాన్ని కేటాయించడం అనేది భారతదేశ దర్శన యాత్రకు విలువను చేకూర్చింది.. ఇలాంటి వాళ్లతోనే నా జీవితం విలువ పెరుగుతుంది. ఎవరైతే పరులకు అవసరములో చేయూతను ఇస్తారో, అలాంటి మనుషులతోనే మనము మన జీవితాన్ని లెక్కించుకోవాలి.

## జూన్ 17, 2019

### ముంబ + ఆయీ = ముంబై:

ముంబైలో ఆసక్తికరమైన ప్రదేశాలు చూడడానికి మిత్రుడు శ్రీరామప్రసాద్ ఒక వాహనాన్ని చోదకుడితో పాటుగా ఏర్పాటు చేసారు. అభయ స్వయం సేవకుడు శ్రీ సునీల్ నాయర్ నాకు తోడుగా ఉండి స్థానికంగా ఉన్న దర్శనీయ ప్రదేశాలు చూపించే నిమిత్తమై వచ్చారు. తెలంగాణ మంచిర్యాల నుండి బ్రతుకు తెరువు నిమిత్తమై, సుమారు పాతికేళ్ల క్రితం ముంబై వచ్చిన తెలుగు అతను రాజు భాయి గైడ్, మమ్మల్ని ఉదయం 6.45 గంటలకి కలిసాడు. అతను పదిహేడు గంటలు పైగా నగరమంతా మమ్మల్ని తిప్పుతూ గైడ్ చేసాడు. అతను చాలా మంచి పని చేసాడు. చుట్టూ పక్కల అలాంటి వాళ్లు ఉండటం చూసి చాలా సంతోషం అయింది. అతని మర్యాద, చురుకుతనం నాకూ చాలా నచ్చాయి. పర్యాటకులకు ఇలాంటి క్యాబ్ డ్రైవర్లు దొరకడం అనేది సందర్శకులకు గొప్ప అదృష్టం అని చెప్పుకోవచ్చు.

ముంబై వాసులు అందరూ ప్రధాన దేవతగా కొలిచే ముంబాయి దేవిని దర్శించుకున్నాము. ఆమె ఈ ముంబై ఉనికికి హేతువు మరియు మూల

కారణముగా చెప్పొచ్చు. ముంబా + ఆయి = ముంబై. ఈ దేవత ఏడు శతాబ్దాల క్రితం నుంచి ఉంది. అప్పటి నుండి అమ్మవారు ముంబై ప్రజలకి జీవితాన్ని, సౌభాగ్యాన్ని ప్రసాదిస్తూనే ఉంది.

పూర్వము, కైలాసములో పార్వతిదేవి ఏకాగ్రత పట్టుదల ఎలా సాధించాలో చెప్పాలని తన శ్రీవారైన శివుడిని అడిగిందట. అప్పుడు శివుడు అమ్మవారిని భూమిలోని ఒక సముద్రతీరంలో బెస్తవారి దగ్గరికి వెళ్ళమని సెలవిచ్చారు. అమ్మవారు ఆ ప్రదేశానికి వచ్చి బెస్తవారితో జీవనం సాగిస్తూ... వారి జీవితశైలిలో ప్రస్ఫుటంగా కనిపించే ఏకాగ్రత పట్టుదలను నేర్చుకుంటూ... అందరి చేత అంబా అని పిలిపించుకుంటూ జీవనం గడిపేది. చాలా రోజుల తరువాత అమ్మవారిని పెళ్ళి చేసుకుని కైలాసానికి తీసుకుని వెళ్ళేందుకై శివుడు వచ్చాడు. ఆ సమయంలో తమతో జీవించిన అంబా సామాన్య మహిళ కాదు... మహా అంబాగా గుర్తించి, తల్లిని శతవిధాలుగా పూజించి, ప్రార్థించి తమకు కరుణించమని తమ ప్రాంతంలో వర్ధిల్లమని కోరుకున్నారు. ఆ తల్లి కూడా వాళ్ల మీద ఉన్న ప్రేమానురాగములతో అక్కడ విగ్రహ రూపంలో కొలువైంది. మహా అంబామాతగా... మహా అంబా ఆయిగా... ముంబా ఆయిగా... ముంబాయి కాలక్రమేణా వినుతికెక్కింది. ఆ బెస్తవారు ఉన్న ప్రాంతం తదనంతరం జనారణ్యమై ముంబై పట్టణంగా రూపాంతరం చెందింది. ముంబై వాసుల భాగ్యదేవతగా ముంబై గ్రామదేవతగా... దేశమును రక్షించే దివ్యశక్తిలా ఆ తల్లి అక్కడ నిలచి కటాక్షిస్తోంది అనటంలో ఎట్టి సందేహం లేదు.

ఆ తర్వాత కొత్త మరియు పాత ముంబై ప్రాంతాలను ఒక చుట్టు చుట్టి వచ్చాము. వెళ్ళిన ప్రతి ప్రదేశమునకూ ఒక ప్రత్యేకమైన చరిత్ర, ప్రాముఖ్యత, ఇతిహాసం ముడిపడి వున్నదని గ్రహించాను.

**మహాలక్ష్మి ఆలయం:**

బ్రిటిష్ వారు ఏడు ద్వీపాలను ఏకీకృతం చేసే సమయంలో ఒకానొక ప్రదేశంలో పనులు చాలా సార్లు ఆగిపోవడం, చేసిన పని అంత మధ్యలోనే ఆగిపోవడం జరుగుతుండేదట. అప్పుడొక రోజు ఒక ఇంజనీర్‌కి అమ్మవారు కలలో కనిపించి అక్కడ తాను ఉన్నానని, తన విగ్రహాన్ని మరొక స్థలానికి

మార్చితే తప్ప వారు చేసే పనులు సవ్యంగా జరగవని, ఆ విగ్రహాన్ని మార్చమని ఆజ్ఞాపించారట. అప్పుడా బ్రిటిష్ వారు ఆ స్థలంలో ఉన్న అమ్మవారి ఆలయాన్ని కనుక్కుని, ఇప్పుడున్న కొండమీదికి ఆలయాన్ని మార్చారట. ముంబై ప్రజల భాగ్యవిధాతగా... అదృష్టంగా అమ్మవారిని కొలుస్తూ ఉంటారు.

### గేట్ వే ఆఫ్ ఇండియా:

1948లో బ్రిటిష్ సైన్యం చివరిగా ఇండియాను విడిచి వెళ్ళిన ప్రదేశము. దానిని చూడటం చాలా సంతోషం అనిపించింది. 20వ శతాబ్దం ప్రారంభంలో నిర్మించిన ఈ బృహత్తర ద్వార నిర్మాణం మనకు స్మారక చిహ్నంగా నిలిచింది.

హిందూ-ముస్లిముల శిల్ప శైలిలో చేసిన నిర్మాణం ఒక అద్భుతం అని చెప్పుకోవచ్చు. అక్కడ తప్పక చేయాల్సింది, చక్కటి ఫోటో తీసుకోవడం, అక్కడ ఏర్పాటు చేసిన మహనీయుల విగ్రహాలను చూడటం... విశాలమైన సముద్రాన్ని కన్నులప్పగించి... చూడటం. గంభీరమైన సముద్రం... దానికి సాటిగా మరింత గంభీరంగా నిలచిన భారత ముఖ ద్వారాన్ని చూసి తీరవలసిందే. ఇది చూడకుండా... ముంబై పర్యటన పూర్తి కానే కాదని చెప్పాలి.

### హాజీ అలి దర్గా:

ఒక ధనవంతుడైన ముస్లిం వ్యాపారస్తుడి జ్ఞాపకార్థంగా గొప్ప దర్గా నిర్మించబడింది. ఆయన మక్కాకి వెళ్ళబోయే ముందు, ఈ ప్రపంచంలో ఆయనకు ఉన్న సంపదనంతా వదిలివేశారట. ఈయన బుఖారా నుండి ఇప్పుడూ ఉజ్బెకిస్తాన్‌గా పిలవబడే నగరం నుంచి 15వ శతాబ్దం దాకా ప్రపంచమంతా తిరుగుతూ చివరికి ముంబైలో స్థిరపడ్డారట.

ఆయన చనిపోయే దాకా ఇస్లాం గురించిన జ్ఞానాన్ని ప్రజలకు అందించాడట. ఆయన భక్తులు అంతా ఆయన్ను క్రమం తప్పకుండా దర్శించుకుంటూ ఉండేవారట. ఆయన చనిపోయే ముందు తన భక్తులకి ఇలా చెప్పారట, తన శవాన్ని ఎక్కడ పాతి పెట్టకుండా ఒక మూటలా కట్టి సముద్రంలో వేయమని, అది ఎక్కడైతే మళ్ళీ కనిపిస్తుందో అక్కడ దానిని పాతి పెట్టమని చెప్పారట. అతని కోరికను అతని శిష్యులు పాటించారట. సముద్రం మధ్యలో

కనిపించిన వారి శరీరం దగ్గర ఈ దర్గా నిర్మించారట. సముద్ర మట్టానికి కొంత ఎత్తులో రాళ్ల దిబ్బపై నిర్మించబడి ఉన్నది ఇది.

చాలా ఆసక్తికరమైన ఈ విషయాలను విని ఎంతో శ్రద్ధతో సముద్రమునకు దగ్గరగా ఉండే ఈ దర్గాను చూడాలని ప్రయత్నం చేసాను, నేను వెళ్ళే సమయానికి అధిక ఆటుపోట్ల కారణంగా మార్గం అంతా సముద్రంలో మునిగిపోయి సందర్శకులకు మూసివేయబడింది. ఈ విషయం నాకు చాలా నిరుత్సాహం కలిగించింది. కాని అదే మార్గంలో మళ్ళీ తిరిగివస్తున్నప్పుడు ఆశ్చర్యంగా అలల ఉధృతి తగ్గి నీటి మట్టం తగ్గింది. నేనూ అత్యంత సంతోషంగా హాజీ అలీ దర్గాను సందర్శించాను. అక్కడి పూజారులు నాకు నెమలి ఈకలతో ఉన్న చీపురుతో ఆశీర్వదించారు.

ఒక వైపు ధనికులు నివసించే ప్రదేశం... అనేక విలాసాలతో నిండి ఉండడం! మరొక వైపేమో క్లిష్టమైన జీవనశైలితో నిండిన పేదల ప్రదేశాలను చూడడం అన్నది నన్ను చాలా ఆశ్చర్యంలో ముంచాయి. ఏది ఏమైనప్పటికీ నా దృష్టి అంతా ఆధ్యాత్మికత మరియు దేశభక్తి నిండిన ప్రాంతాలపైనే ఉండింది. నేనూ దర్శించిన ప్రతీ ఒక్క ప్రదేశం... కేవలం నమ్మకాల మీదనే ఉన్నదన్న సత్యాన్ని స్పష్టంచేసింది. భారతదేశపు ధనికుల ఇళ్లలాగా ముంబై నగరం ఉంది... సమృద్ధిగా ధనం ఉన్నవారంతా పేదవారి కోసం పని చేసేలా చేయమని నేను ఆ భగవంతుని వేడుకున్నాను. సారాంశం చాలా సరళమైనది... విశ్వాసం ఏదైనా అయినప్పటికీ, ముక్తికి మార్గం ఒకటే అదే నిస్వార్థత. బాబునాథ్ ఆలయం, అరేబియా సముద్రం, మెరైన్ డ్రైవ్, నారీమన్ పాయింట్, హనుమంతుడి ఆలయం, హ్యాంగింగ్ గార్డెన్స్ మరియు బూట్ గార్డెన్, ఛత్రపతి శివాజీ టర్మినల్, తదితర ప్రదేశాలను అన్నీ చూసాను. నేను రాంప్రసాదుకు నా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాను. వారూ ముంబైలో నాపై చూపిన శ్రద్ధ మరియు ప్రేమలకు కృతజ్ఞత తప్ప మరేమి చెప్పగలను.

**అభ్యసనలు / పరిశీలనలు:**

1. విశ్వాసం ఏదైనా నిస్వార్థ సేవే మోక్షానికి మార్గం అని.
2. ముంబై ప్రజల శ్రద్ధ, ప్రేమలతో నేను ప్రేరణ పొందాను.

3. ఎల్లవేళలా, ఎల్లప్పుడూ చేదోడు వాదోడుగా ఉండే వ్యక్తులతోనే మన జీవితం ప్రభావితమవుతుందని గ్రహించాను.
4. నేను సందర్శించిన ప్రతీ ప్రదేశం కూడా మన దేశం నమ్మకాలపై మాత్రమే నిలబడి ఉందన్న వాస్తవాన్ని గ్రహించేట్లు చేసింది.

## జూన్ 18, 2019

**శతాబ్ది ఎక్స్‌ప్రెస్:**

ముంబై పర్యటన ముగించుకుని, మిత్రుడు రాంప్రసాద్‌కు కుటుంబము వద్ద సెలవు తీసుకుని... వాళ్లకు శుభం జరగాలని కోరుకుంటూ రైల్వే స్టేషన్‌కు బయలుదేరాను.

గుజరాత్‌లోని బరోడా చేరడానికి నేను ఉదయం ఏడు గంటలకి శతాబ్దిలో బయలుదేరాను. ఆ రైలు మొత్తం ఎయిర్ కండిషన్డ్. అంత అద్భుతమైన రైలును ప్రజలకి అందుబాటులో తెచ్చినందుకు భారతీయ రైల్వే వారికి నేను తప్పనిసరిగా కృతజ్ఞతలు చెప్పాలి. ఒక టికెట్టు మీద రైలులో విలాసవంతమైన రాజ ప్రయాణం, పుష్ బ్యాక్ సీటు, కావలసినంత వెలుతురు, పారదర్శకమైన కిటికీలు, చార్జింగ్ పాయింట్, తినేందుకు బల్ల, వాటర్ బాటిల్, కాఫీ, భోజనం, జ్యూస్, దినపత్రికలు, పరిశుద్ధమైన సౌచాలయాలు, సేవకులు దొరకడం అన్నది నిజంగా ఒక అద్భుతం. బరోడాకి నాలుగు గంటల ప్రయాణం ఇది. చక్రాలపై సృష్టించిన సౌకర్యాలు నాకూ నోట మాట రాకుండా చేసాయి. జయహో భారత్!

బరోడాలో నన్ను తీసుకెళ్లడానికీ రాంప్రసాద్ ఒక కారుని & డ్రైవర్ని ఏర్పాటు చేసాడు. ఉదయం 11:30 గంటలకూ బాబు భాయ్, బాలు భాయ్‌ని తీసుకు వెళ్లడానికి వచ్చాడు.

# గుజరాత్

## ఐక్యతా విగ్రహము & నర్మదా సరోవర్ ప్రాజెక్టు

గుజరాత్‌లోకి ప్రవేశించగానే, నేను సందర్శించిన మొదటి క్షేత్రం ఐక్యతా విగ్రహం మరియు నర్మదా సరోవర్ ప్రాజెక్ట్. నాటి గుజరాత్ ముఖ్యమంత్రి మోడీజికి (2013) వందనాలు. వారి వజ్రసంకల్పానికి మరియు దాని అమలుకు ప్రశంసలు. ఇలాంటి ప్రాజెక్టులు ప్రతి భారతీయుని మనసులను ఖచ్చితంగా ప్రజ్వలింప చేస్తాయి. నేను ఇంతకు ముందూ ఇట్టి క్షేత్రాన్ని చూడలేదు మరియు వినలేదు. ఇది L&T వారి ఇంజనీరింగ్ అద్భుతం. నా దేశం కోసం నన్ను జీవింప చేయడానికీ ఈ ప్రదేశం నాకు ఎంతగానో ఉత్తేజపరిచింది.

నర్మదా సరోవర్ ప్రాజెక్టు మరియు ఐక్యతా విగ్రహం గురించి చాలా విశేషాలు తెలుసుకున్నాను. ఈ క్షేత్రాన్ని దర్శించుకోగలిగినందుకు నన్ను నేను అభినందించుకున్నాను. ఆ విశేషాలు అన్నీ కూడా మీతో పంచుకోవాలనుకుంటున్నాను.

## సర్దార్ వారి కల నర్మదా సరోవర్ ప్రాజెక్టు:

మోడీగారు తమ పది సంవత్సరముల గుజరాత్ పాలనకు చిహ్నంగా ఈ ప్రాజెక్టును ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. గుజరాత్ వారికి గర్వకారణమయిన ఈ ప్రాజెక్టు ఎన్నో కారణాల చేత ఆలస్యంగా పూర్తి చేయబడింది.

1. యావద్భారత ప్రజల వద్ద నుండీ 135 MTC టన్నుల ఇనుమును విరాళముగా సంపాదించారు.
2. 182 మీటర్ల ఎత్తు గుజరాత్‌లోని 182 అసెంబ్లీ స్థానాలకు ప్రతీక.
3. 3.5 సంవత్సరాలలో ఈ ప్రాజెక్టును పూర్తి చేసారు.
4. దీనిని పూర్తిగా చూడడానికి ఒక రోజంతా పడుతుంది.

5. సర్దార్ తన కలల ప్రాజెక్టు నర్మదా డ్యామ్ వైపు చూస్తున్నట్లుగా విగ్రహం.
6. బోటింగ్ సేవలు త్వరలో ప్రారంభిస్తారు.
7. పూల లోయ అభివృద్ధి చేస్తున్నారు.
8. కెమెరాలు, ఫోన్లు ఆ భవన సముదాయాల్లోకి అనుమతిస్తారు.
9. విగ్రహం: భావవ్యక్తీకరణను, నిలబడే తీరు, ఆయన విశ్వాసాన్ని, ఉక్కు సంకల్పాన్ని అదేవిధంగా ఆయన వ్యక్తిత్వంలో కరుణను ప్రతిబింబించి నట్లుగా మలచబడింది. విగ్రహం, తలపైకి ఎత్తి చూస్తున్నట్లుగా, భుజాల చుట్టూ కప్పబడిన శాలువా ఎగురుతున్నట్లుగా, చేతులు రెండు పక్కకి మలచబడిన, ఆయన నడవడానికి సిద్ధంగా ఉన్నారు అన్నట్లుగా తయారు చేయబడిన విగ్రహం, ఆయనే అక్కడ నిలబడి ఉన్నారు అన్నట్లుగా ఉంది.
10. ఈ కట్టడం నిర్మాణంలో వేల మంది పని చేసేవారు, 250 మంది ఇంజనీర్లు పాల్గొన్నారు.
11. నర్మదా డ్యామ్‌ను కొండ ప్రాంతం నుండి చూడవచ్చు.
12. పర్యాటక ఆకర్షణ: ప్రతిరోజు వేల సంఖ్యలో ప్రజలు సందర్శనకు వస్తుంటారు.
13. విలాసవంతమైన ఏసీ బస్సుల్లో పర్యాటకులను ఆ చుట్టూ పక్కల తిప్పడం ఒక అద్భుతం.
14. ఈ ప్రాజెక్టు వల్ల వేలాది మంది స్థానిక యువతీ యువకులకు ఉద్యోగ కల్పన జరిగింది.
15. పర్యాటకులు విగ్రహం లోపల ఉన్న లిఫ్టు నుంచి 135 మీటర్ల ఎత్తువరకూ ప్రయాణించవచ్చు.
16. ఇక సర్దార్ మ్యూజియంను ఎట్టి పరిస్థితుల్లోనూ దర్శించి రావలసినదే. అక్కడ ఉన్న మార్గదర్శకులు సైనికుల్లాగా ఆ ప్రాజెక్టు గురించి విశేషాలను, వివరాలను అందిస్తారు.
17. ఐక్యతా విగ్రహ ప్రాంగణం అంతా కూడా సాంకేతికత ఉపయోగానికి పరాకాష్టగా నిలుస్తుంది అనటంలో ఎలాంటి సందేహం లేదు.

**అభ్యసనలు/పరిశీలనలు:**

1. ప్రాజెక్టు సందర్శన వల్లనే నేను చాలా ఉత్తేజభరితుడిని అయ్యాను.
2. ప్రపంచంలో ఉన్న భారతీయులంతా ఈ విగ్రహాన్ని తప్పనిసరిగా చూడవలసిందిగా నాకు చెప్పాలనిపిస్తుంది.
3. ఐక్యతా విగ్రహం ఈ శతాబ్దపు అద్భుతంగా చెప్పవచ్చును.
4. ప్రస్తుత మరియు భవిష్యత్తరాల వారికి ఇది ఒక ఇంజినీరింగ్ అద్భుతముగా గుర్తుంచుకుంటారు.

ఇక నర్మద ప్రాజెక్టు నుండి వెళ్ళేటప్పుడు 18వ శతాబ్దానికి చెందిన అవధూత, దత్తాత్రేయ అవతారంగా కొలుచుకోబడిన శ్రీవాసుదేవ సరస్వతీ స్వామి వారిని దర్శించుకున్నాను. వారు తమ స్వయం ఇచ్ఛతో నర్మదా నది ఒడ్డున తనువు చాలించారట.

ఆయన ఆజ్ఞానుసారం ఆయన శరీరాన్ని ఆయన శిష్యులు అక్కడే, నర్మదానది తీరాన ఖననం చేసారట. షిరిడీబాబా, గజానన్ మహారాజ్ మరియు అక్కల్ కోట మహారాజ్ కాలానికి చెందిన ఈ స్వామిని టెంప్లే స్వామిగా కూడా పిలిచేవారు. ఆ దేవాలయంలో నేను మధ్యాహ్న భోజనం చేసుకుని అవధూత సమాధి దగ్గర నా ప్రార్థనలు అర్పించాను.

తిరుగు ప్రయాణంలో రాజ్‌పిప్లాలో ఉన్న హర్సిద్ధి మాత ఆలయాన్ని దర్శించుకొన్నాను. ఇంతకు ముందు ఈ ప్రాంతం రాజుల రాజ్యం అయినప్పుడు అమ్మవారిని వారు తమ కులదేవతగా ఆరాధించేవారు. ఆ రాజ్యంలో రాజు అమ్మవారి కోసం చేసిన ప్రార్థనలను అమ్మ స్వీకరించి, ఉజ్జయిని నుంచి వచ్చి ఇక్కడ వెలిసారట. నేను అక్కడి నుంచి పాయిచలోని నీలకంఠధామ స్వామి నారాయణ మందిరాన్ని దర్శించుకున్నాను.

ఈ ఆలయం నర్మదా నది తీరంలో ఉన్నది. ఒకే క్షేత్రంలో 30 దేవాలయాలు ఉన్నాయి. థీమ్‌పార్క్, పిల్లల పార్క్, లైటింగ్, శిల్పకళ, ఆ పచ్చదనం, నీళ్లు, నదీ ఒడ్డు... సందర్శకులను మంత్రముగ్ధుల్ని, నిష్కల్మషముగానూ చేస్తాయి. ఈ ఆలయము పగలు అందంగానూ, రాత్రులూ దేదీప్యమానంగా వెలుగుతూనూ స్వర్గంలో ఉన్నామా అన్న భావనను కలిగింపచేస్తుంది. ప్రదర్శనాలయమును తప్పకుండా ప్రతి ఒక్కరూ సందర్శించాలి. అక్కడున్న ప్రదర్శన వస్తువులను

సాంకేతికతతో జోడించి హిందూ సంస్కృతి, వారసత్వం, పురాణాలను సందర్శకులకు అందించే ప్రయత్నం చేసారు. ఇవన్నీ చూడటానికి ఒకరోజు మొత్తం పడుతుంది. సాయంకాల రథయాత్ర ఎవరైనా ఒకసారి చూస్తే అది ఒక మరుపురాని అనుభవంగా మిగిలిపోతుంది.

ఆ తర్వాత ప్రధాన ఆలయంలో అద్భుతమైన షోడశోపచార పూజలను, హారతిని దర్శించుకున్నాను. ఒక గంట సేపు అన్నీ మరిచిపోయి, ఆ దివ్య ప్రకంపనలలో సంపూర్ణంగా మునిగిపోయాను. ఆలయంలో అన్నప్రసాదం తీసుకొని బరోడాకు తిరిగి వెళ్లాను. నామమాత్రపు ఖర్చుతో లభించిన వసతి గృహంలో బస చేసాను, శ్రీస్వామినారాయణ మందిరంలో విశ్రాంతి తీసుకున్నాను.

## జూన్ 19, 2019

స్వామినారాయణ మందిర్ సముదాయం, బరోడా నుండి ఉదయం 6 గంటలకు తయారై, గుడిలో జరిగిన హారతి దర్శనానికి బయల్దేరాను. పూజారుల చేత నిర్వహింపబడే అందమైన ఆచారం, బోచ సన్యాసి అక్షర పురుషోత్తమ స్వామినారాయణ సంస్థ (BAPS) వారిచే నిర్వహించబడే ఈ ఆచారంలో గర్భగుడిలో ఉన్న స్వామి వారిని మేల్కొల్పే విధానం చాలా ఆశ్చర్యాన్ని కలుగజేస్తుంది. ప్రతి ఒక్క ఆలయం ఒక ఆధ్యాత్మిక సారాంశమే. BAPS బహుళ ప్రయోజనములతో ఒక ఆసుపత్రి నిర్మించింది, ఇక్కడ అవసరం ఉన్న వారికి అంతా నామమాత్రపు ఖర్చులు వసతి, భోజన సౌఖర్యాలు కల్పించి వైద్యము అందిస్తున్నారు.

### పావ్‌గడ్ మహాకాళి:

బరోడా నుండి రెండు గంటల ప్రయాణం దూరంలో వున్న పావ్‌గడ్‌కి ఉదయం 6:30 కి బయలుదేరాను. సముద్ర మట్టానికి 2500 అడుగుల ఎత్తులో, హలాల్ దగ్గర కాళికామాత ఆలయం ఉంది. పదవ శతాబ్దం నుండి ఉన్నది అనేది నమ్ముతున్న, ఈ ఆలయంను దట్టమైన అరణ్యప్రాంతంలో పెద్ద శిఖరంపై నిర్మించారు. మొదట, నడిచి కొండ ఎక్కుదామని అనుకున్నాను కానీ ముందున్న

ప్రయాణం, ఆ రోజు చూడాల్సిన ప్రదేశాలు వీటన్నిటిని దృష్టిలో ఉంచుకుని, తీగ మార్గంలో ప్రయాణించడానికి నిర్ణయించుకున్నాను. దట్టమైన కొండ మధ్యలో అరణ్యంలో 5 కిలోమీటర్ల మేరకు ఉన్న కాలి దోవలో ప్రయాణించి ఈ ఆలయాన్ని చేరుకోవచ్చు. పాటైరావల్స్ మహల్ శిథిలాల పక్కనుంచి ఈ కాలి దోవ ఉంది. 1986 లో అధికారికంగా ప్రారంభించిన ఈ తీగ మార్గం ద్వారా గంటకు 1200 మందిని తీసుకెళ్లే సౌకర్యం కలుగజేశారు. ఇది మెట్ల దారికి ప్రత్యామ్నాయం. ఈ తీగ మార్గం దేశంలోనే అత్యంత ఎత్తయినది.

ఇది నిజంగా ఒక అపూర్వమైన, విలక్షణమైన అనుభవం. కాళీమాత ఆలయానికి రోప్‌మార్గం ద్వారా ప్రయాణించినప్పటికీ, సుమారు 30 నిమిషాల పాటు కొండ ఎక్కవలసి ఉంటుంది. ఒక్కసారిగా అన్ని వాతావరణ పరిస్థితులను అనుభవించవచ్చు. పొగ, మంచు, చలి, గాలి, వేడి మరియు వర్షం అన్నింటిని ఈ కొండ ప్రాంతాల్లో అనుభవించవచ్చు. పరమానందకరమైన కాళీమాత నేత్రదర్శనాన్ని హృదయపూర్వకంగా చేసిన తరువాత, పూజారి గారు నాకు అమ్మ శేష వస్త్రాన్ని ప్రసాదించారు. గుడి నుంచి బయటికి వచ్చి, మరుక్షణంలోనే, నాకు ఎదురైన తల్లి ఒడిలో ఉన్న పసిబిడ్డకు కాళీమాత పేరుమీద ఆ అమ్మవారి శేష వస్త్రాన్ని బహూకరించాను. అటు నుండి మరొక క్షేత్రానికి బయలుదేరాను.

## దకొర్:

ఈ ఆలయంలో ప్రధాన దేవుడు శ్రీకృష్ణుడు. పంచద్వారకాలలో ఇది ఒకటిగా చెప్తారు. మళ్లీ ఇంకొకసారి భగవంతుడు ఆయన కృపను నా మీద ప్రసరింపచేసారు. నేను దర్శనం చేసుకునేందుకు వెళ్ళడం సరిగ్గా, ఆలస్యం మధ్యాహ్నం 12 గంటలకి ఆలయ తలుపులు మూసివేశారు. చక్కటి విగ్రహం... నల్లనయ్యను చూసి పరవశించాను. అసలు గుజరాత్ ప్రజల భక్తి విశ్వాసాలు నిజంగానే ఎంతో స్ఫూర్తిదాయకం.

## మొథేరా సూర్యదేవాలయం:

మొథేరాలో ఉన్న పురాతనమైన సూర్యదేవాలయానికి (కోణార్క్ సూర్య దేవాలయం తర్వాతది) బయలుదేరాను. భారత ప్రభుత్వ వారిచే దీన్ని అతి

జాగ్రత్తగా పదిలపరచినారు. ఒక పెద్ద కొలను ఎదురుగా ఉన్న ఆలయ సముదాయాన్ని, ఎవరైనా చూసి ఆనందించవలసినదే. ఈ అద్భుతమైన ఆలయపు రూపకల్పనని, ఆ వివరాలను, పరిమాణాన్ని, శిల్ప సంపదను చూసి మనసులో పదిలపరచుకోవడానికి మన రెండు కళ్లూ సరిపోవు అనిపించింది. అణువణువుగా శిల్పకళా చాతుర్యంతో మర్థిల్లుతోంది. ప్రతి రాయినీ ఒక సుందర స్థూపంగా నిలిపిన తీరు అద్భుతం.

పుష్పవతి నది ప్రక్కనున్న శ్రీ సూర్యదేవాలయం సోలంకి రాజైన రెండవ భీందేవ్ క్రీ.శ. 11వ శతాబ్దంలో కట్టించారని చెప్తారు. ఇది చోళరాజుల కాలంలో నాటిది. ఎక్కడ చూసిన కనుచూపు మేరలో కొండగాని, రాయిగానీ లేవు. కొన్నిమైళ్ల దూరం నుంచి రాయిని తొలచి నదికి సుమారు 10 అడుగుల పైగా ఇటుకలతో గట్టి పునాదులు వేసి, రాయిని దూలములు స్తంభములు మూర్తులుగా చిత్రించి అనేక క్రమములుగా తయారు చేసి, ఎక్కడా సున్నం టంకె వెయ్యకుండా రాయిలో రాయి అమర్చి ఒక అద్భుతమైన రాతి దేవాలయమును ఇక్కడ కట్టారు.

**సూర్య కుండ్:**

అత్యంత రమణీయముగాను ఉన్న మెట్ల వరుసలు గల ఒక పెద్ద కొలను సూర్య కుండ్. దీనికినాలుగు మూలలా అత్యంత అందమైన శిఖరములు గల దేవాలయముల నమూనాలు ఉంటాయి. శీతలాదేవి, అనంతశాయి, విష్ణువు మొదలగు విగ్రహములు ఉన్నాయి. ఇవి కాక, నాలుగు వైపులా అక్కడక్కడా వేల సంఖ్యలో చిన్న దేవాలయములు ఉన్నాయి. అసలు అడుగడుగునా కళ్ల ముందు అద్భుతం కనిపిస్తుంది. అక్కడి నుండి రావాలని కూడా అనిపించలేదు.

2020 సంవత్సరంలో అనుకుంటాను ఈ ప్రదేశానికి సంబంధించిన ఒక అద్భుతమైన దృశ్యాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ట్విట్టర్‌లో షేర్ చేసారు. మోడీ షేర్ చేసిన కేవలం మూడు గంటల్లోనే ఏకంగా ఈ వీడియోకి 6 లక్షల వ్యూస్ వచ్చాయి. అంటే ఇక చెప్పేదేముంది.

ఈ దేవాలయం ప్రాంతంలో వర్షం పడితే ఎంతో అద్భుతమైన దృశ్యం ఆవిష్కృతమవుతుంది. కళ్లు తిప్పుకోనివ్వదు. వర్షపు నీరు దేవాలయ మెట్లపై నుంచి జాలువారుతున్న దృశ్యాన్ని చూసేందుకు రెండు కళ్లూ చాలవు. ఇదే

విషయం పేర్కొన్న ప్రధానీ మోదీ, మొధేరా సూర్య దేవాలయం సౌందర్యాన్ని అందరూ చూడాలని ఓ వీడియోను తన ట్విట్టర్‌లో షేర్ చేసారు.

**అంబాజీ:**

అరసురి అంబాజీ పవిత్ర ఆలయంలో చిత్రపటం గాని, విగ్రహం కాని ఉండదు. ప్రధాన దేవతగా "శ్రీ విష్ణుయంత్రాన్ని" ఆరాధిస్తారు. ఆ యంత్రాన్నీ మామూలు కళ్ళతో ఎవరూ చూడలేము, మనోనేత్రంతో దర్శించుకోవలసినదే. అక్కడ చిన్న గుహ కుడ్యంపై ఒక స్వర్ణపత్రం మీద బీజాక్షరాలతో లిఖించిన పవిత్ర దేవీ విష్ణుయంత్రం కూర్మరూపంలో ఉంటుంది. ఉజ్జయినిలోని పీఠం, నేపాల్‌లోని పీఠానికి పోలి ఉన్నా, అక్కడ పీఠం కంటితో చూడవచ్చు కానీ ఇప్పటి వరకు ఇక్కడి పీఠాన్ని ఎవరూ చూడలేదని చెప్తారు. విష్ణుయంత్ర ఆరాధన పూజారులు కళ్ళకు గంతలు కట్టుకున్న తర్వాత మాత్రమే చేయబడుతుంది.

ప్రతి సంవత్సరము లక్షలాది మంది భక్తులు దర్శించే అంబాజీ ఆలయం నగరానికి చాల ప్రాముఖ్యత గలిగినదిగా చెప్తారు. 51 శక్తిపీఠాలలో ఒకటైన సతీదేవి హృదయం పడిందని నమ్ముతారు. ఈ ఆలయ సముదాయంలో ప్రవేశించిన ప్రతి ఒక్కరూ ఒక మహత్తరమైన అనుభూతిని చెందవలసినదే. అమ్మ దర్శనం చేసుకొని, రాత్రికి అక్కడే ప్రసాదం తీసుకున్నాను.

**వైభవ గుజరాత్:**

రాష్ట్ర సరిహద్దులోని శివారు ప్రాంతాలలో కూడా అద్భుతమైన రోడ్లు, మంచి వాతావరణం, ప్రతిచోటా పరిశుభ్రత, మర్యాదపూర్వక వ్యక్తులు, మంచి ప్రవర్తనలతో ఉన్న డ్రైవర్లు, ఆహారం, వసతి చాలా నామాత్రపు ఖర్చుతో ఉండి ఒక ఉత్సాహపూరితమైన వాతావరణాన్ని యాత్రికులకు అందిస్తుంది గుజరాత్ యాత్ర. గుజరాత్ రాష్ట్ర పర్యటన ముగించుకుని, అక్కడికి దగ్గరలోని రాజస్థాన్ రాష్ట్రంలోని మౌంట్ అబూలోని ఓం శాంతి వారి ప్రధాన కార్యాలయానికి ఆ రోజు రాత్రి చేరుకున్నాను. నా భారత దర్శన యాత్ర గురించి తెలుసుకున్న, స్వచ్ఛంద సేవకులు నన్ను ఎంతో ప్రేమతో ఆశ్రమంలోనికి ఆహ్వానించారు.

# రాజస్థాన్

## జూన్ 20, 2019

**మౌంట్ అబూ**

ఉదయం 6:30 రాజస్థాన్, గుజరాత్ సరిహద్దులో ఉన్న మౌంట్ అబూలో గడిపే రోజుకు సిద్ధం అయిపోయాను. మొట్టమొదటి నుంచి బాబాజి సన్నిహిత్యంలో ఉండి, ఓం శాంతితో చిరకాలంగా అనుబంధంతో ఉన్న సోదరుడు బి.కె. కరుణ్ బాయ్ గారిని కలిసాను. ఆయన ప్రస్తుతం కేంద్రానికి PROగా పని చేస్తున్నారు. ఆయన నన్ను చాలా ఆప్యాయంగా పలకరించారు. నా భారత దర్శనం గురించి విని ఎంతోగానో సంతోషించారు. ఒక సీనియర్ సహాయకుడు అరుణ్ బాయ్‌ని పిలిపించి అబూ రోడ్లో ఉన్న వారి కేంద్రాలు అలాగే మౌంట్ అబూని కూడా చూపించమని చెప్పారు.

నేను ఆ రోజు ఓం శాంతి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం చూసాను. శాంతి వనంలో ఉన్న అంతర్జాతీయ ప్రధాన కార్యాలయం, పాండవ వనం, బాబా కుటీరం, బాబా సమాధి, అభ్యాసన కేంద్రాలు, 50 + కార్యాలయాలు, ఉచిత ఆసుపత్రులు, గ్రామీణ ప్రాంతీయ అభివృద్ధి కార్యక్రమాలు, అతిపెద్ద వంటశాలలు, బహుళ ప్రత్యేకతలుకల ఆసుపత్రులు, పరిశోధన కేంద్రాలు, ప్రచురణ కేంద్రాలు, టీ.వి. చానల్స్, హ్యామర్ రేడియో, స్టూడియో, అతిపెద్ద ఆడిటోరియములు, ప్రదర్శనశాలలు, థీమ్‌పార్కులు, ఒక IMWT ప్లాంట్, 5000 మందికి నివాస సముదాయాలు, నిస్వార్థ స్వచ్ఛంద సేవకులు, తమకు తామే అర్పణ చేసిన సన్యాసినులు ఇలా ప్రతిదీ ఆశ్చర్యమే! అంతేకాక అక్కడ మహిళలే నాయకులు... వాళ్లు చేసిన ఇన్ని పనులు నన్ను ఎంతో ముగ్ధుడిని చేసి, ఆనందంలో ముంచివేసినాయి. ఇన్ని అద్భుతమైన పనులు ఒక శతాబ్దంలో జరుగుతాయని నమ్మిన, బాబాజీ గారి విజన్‌కి అభినందనలు తెలపవలసిందే.

సమాజ అభివృద్ధికి నిస్వార్థంగా పని చేస్తున్న ఆత్మ బంధువులను ముందురోజు BAPSలో కాషాయ వస్త్రాలలోనూ... మరుసటి రోజున ఓం శాంతి ప్రధాన కేంద్రంలో శ్వేత వస్త్రాలలోనూ చూసాను. ఇక్కడ ఉన్న ప్రతి ఒక్కటి, ప్రతిఒక్క అడుగును ఎవరైనా సరే గుర్తుంచుకోవలసినదే... అందులో నుండి ఏదో ఒక పాఠం నేర్చుకోవాల్సిందే. ఒక సమాజ సేవకుడిగా, అలాంటి బృహత్కార్యాలను చేయడంలో సాధక బాధకాలు నాకు తెలుసు. వాళ్లు ఎంతో శ్రద్ధాభక్తులతో చేస్తున్న పనులను నన్ను ఎంతో ఆశ్చర్యాన్ని, ఆనందాలకి గురి చేసాయి.

ఓం శాంతి క్యాంపస్ చుట్టూ ఉన్న దర్శనీయ ప్రదేశాలని, నాతో ఉండి అరుణ్ భాయ్ చూపించారు. ఏ సంస్థ అయినా నిరంతర ప్రయాణం చేయాలంటే, నిస్వార్థమైన, అంకిత భావంతో గల స్వచ్ఛంద సేవకులు కావాలని నేనూ గ్రహించాను. ప్రజాపిత బ్రహ్మ కుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలోనే నేను చూసిన ప్రతిదాన్ని, నా దృక్కోణంలో నుంచి వివరించాలంటే చాలా వివరించాల్సి వస్తుంది. కానీ స్థల పరిమితి వల్ల, నేను అంత చెప్పలేకపోతున్నాను.

## గురు శిఖర్

సముద్రమట్టానికి 6000 అడుగుల ఎత్తున శ్రీ దత్తాత్రేయుల వారి ఆలయం ఉన్న ప్రాంతమిది. శ్రీ దత్తాత్రేయుల వారూ ఈ కొండ మీదున్న గుహలో ఇక్కడ ఒక మాసం ఉపవాసం చేసినట్లు చెప్తారు. వారి పాదముద్రలను కూడా గుహలో చూడవచ్చు. ఈ గుహలో నిరంతరంగా వెలిగే ధుని కూడా మనం చూడవచ్చు. ఆ శిఖర ప్రాంతాన్ని చేరుకోవడానికి 30 నిమిషాలు పట్టింది. శిఖరం నుంచి మొత్తం ఆరావళి పర్వత ప్రాంతాన్ని, పాకిస్తాన్ సరిహద్దు ప్రాంతాన్ని కూడా చూడవచ్చు. భారతీయ సైనిక దళం, వైమానిక దళాల శిబిరాలు ఇక్కడ ఏర్పాటు చేయబడ్డాయి.

ఆశ్చర్యం ఏమిటంటే మధ్యాహ్నం రెండు గంటల సమయంలో కూడా సూర్యకిరణాలు ఆ కొండపై పడవు. కొండపై ప్రతి చోటా మేఘాలు మనల్ని తాకడం చూడవచ్చు. ఇది ఎలా ఉందంటే మేఘాలలో తేలుతూ ఉన్నట్లు ఉ ంటుంది. ఒక అడుగు దూరంలో ఉన్నవి కూడా కనిపించడంలేదు. మనం ఎక్కడ చూసిన ఇలాంటి వాతావరణమే కనిపిస్తుంది.

మహారాజ రాణా ప్రతాప్ యుద్ధంలో ఓడిపోయాక తన చేతక్ గుఱ్ఱం

మీద ఈ కొండ కింద ఉన్న గ్రామంలో ఆశ్రయం పొందాడట. అది విన్నప్పుడు హృదయమంతా బాధతో నిండిపోయింది.

## భామషా (1542-1600)

మహారాజ రాణా ప్రతాప్ వారి మంత్రి వర్యులు మరియు అత్యంత దగ్గరి వాడైన అంతరంగికుడు, సహాయకుడు. రాణా ప్రతాప్ ఆర్థికంగా బలహీన పడినప్పుడు, ఒక దశలో, చివరకు ఆకలితో అలమటించిన స్థాయిలో ఉన్నప్పుడు, తన సంపదనంతా ఆయనకు అందించాడు. భామషా పంపిన నిధులన్నింటిని రాజుగారు కోల్పోయిన తమ భూభాగాలను, సైన్యాన్ని తిరిగి సంపాదించు కోవడానికి ఖర్చు పెట్టారట. భామషా గౌరవార్థంగా రాజస్థాన్ ప్రభుత్వం ఉచిత ఆరోగ్య పథకానికి భామషా ఆరోగ్య పథకమని పేరు పెట్టింది. నేను ఆ కథ విని చాలా ఆశ్చర్యానికి, మరెంతో ఉత్తేజానికి గురయ్యాను. అలాంటి మహనీయుల అవిరళ అకుంఠిత దీక్షవలననే ఈ రోజు మనమంతా స్వేచ్ఛా వాయువులను పీలుస్తూ హాయిగా బ్రతుకుతున్నాము.

## దిల్వాడ జైన ఆలయం:

మౌంట్ అబూ పర్వతం మీదనే నేను మరొక అందమైన జైన మందిరాన్ని చూసాను. ఈ ఆలయమ యొక్క అందాన్ని ఎవరైనా వివరించగలరని నేను అనుకోను. దిల్వాడ జైన మతంలో అత్యుత్తమ దేవాలయాల్లో ఒకటిగా చెప్పాలి. ఇది అసాధారణమైన వాస్తుతో మరియు అద్భుతమైన పాలరాతి శిల్పాలతో వర్ధిల్లుతోంది. ఇది ఖచ్చితంగా వాస్తు పరంగా తాజ్ మహల్ కంటే గొప్పదిగా నాకు అనిపించింది. ఇది బయటనుంచి చూడడానికీ చాలా సాధారణమైన ఆలయంగా కనిపిస్తుంది కానీ, ప్రతి దిక్కులో ఒక వెండితీగలు ఉన్నట్లుగా, ఆలయం లోపల భాగం మానవుని యొక్క అసాధారణమైన ప్రతిభను ప్రజలకు ప్రదర్శిస్తుంది.

ఆలయం చుట్టూ ఉన్న అందమైన పచ్చని కొండలు చాలా ఆహ్లాదకరమైన అనుభూతిని కలిగిస్తాయి. పాలరాతితో చెక్కిన అలంకార శిల్పాలు, ద్వారాలు, తోరణాలు ఇలా ఏది చూసినా కళ్లను కట్టిపడేసేవిగా ఉంటాయి, అవి సందర్శకులకు అసాధారణమైన అనుభూతిని కలిగిస్తాయి. ఇక్కడి ఒక శిల్పం

ఇంకొక దాంతో సరిపోల్చలేనివి, ఎంతో సూక్ష్మంగా చెక్కబడ్డాయి అన్నీ కూడా. పైకప్పులు సహితముగా ఎంతో అద్భుతంగా రమణీయంగా మలచారు.

మౌంట్‌అబూలో 1200 మీటర్ల ఎత్తులో రవాణా సౌకర్యాలు, రోడ్లు అందుబాటులో లేనప్పుడు అంబాజీలోని అరసురి గ్రామం నుంచి ఈ మారుమూల ప్రాంతానికి ఏనుగులపైన వేసి భారీ పాలరాళ్ళ రవాణా చేయబడ్డాయనే విషయం విని నోటమాట రాలేదంటే నమ్మాల్సిందే. అసలు మన సంస్కృతి, సంప్రదాయాల విలువ, పాఠాలు మన తరానికీ బోధపడాలి అంటే అందరం ఇలాంటి దివ్య భవ్య నవ్య ప్రదేశాలను, క్షేత్రాలను చూసి నేర్చుకోవాల్సిందే. దిల్వాడ దేవాలయం విదేశీయులకు కూడా ఆకర్షణీయమైన యాత్రా స్థలం.

నేను ఆ దేవాలయ సముదాయానికి సుమారు మధ్యాహ్నం 12:00 గంటలకి చేరుకున్నాను. గుడి మూసివేస్తారు అన్న ఆలోచనలతో కాస్త హడావడిగా చేరుకున్నాము. ఆశ్చర్యం ఏమిటంటే నేనే మొదటి సందర్శకుడిని ఆ పూటకు. జైనులు కాని వారి కోసం తెరిచి ఉంచిన ఆ సమయంలో నేనే మొదటివాడిని అయినందుకు కాస్త సంతోషం అయ్యింది. నాతో పాటు అనేక మంది సందర్శకులు లోపలికి వచ్చారు. నేనూ ఒళ్ళంతా కళ్ళు చేసుకుంటూ ఆలయ ప్రాంగణంలోని ప్రధాన ద్వారము దగ్గరికి చేరుకున్నాను.

ఇంతలో అక్కడున్న జైన పూజారి... నా గురించే వేచి ఉన్నట్లుగా, నా గురించి అడిగి నా చేయి పట్టుకుని గర్భగుడిలోకి తీసుకెళ్లారు. ధూపదీప వింజామర సేవొపచారములను ఆదినాథుడుకి చేయమని చెప్పారు. భారతదేశ యాత్రలో ఇది మరొక రోమాంచితమైనట్టి అనుభవం. నిజానికి గర్భాలయంలోకి జైనులకు మాత్రమే ప్రవేశము అని తెలిసింది. మరి నన్నెందుకు అలా గర్భాలయంలోకి తీసుకొని వెళ్లారో అర్థం కాలేదు. ఏది ఏమైనా భారత దర్శన సంకల్పాన్ని దైవసన్నిధిలో చెప్పి సమస్త లోకములకు శాంతి కలగాలని ప్రార్థించి వచ్చేసాను. అన్నట్టు అక్కడ నేనెవరికీ ఒక రూపాయి కూడా ఇవ్వలేదు సుమా.

చివరగా ఓం శాంతి బృందం, నాకు అమూల్యమైన వీడ్కోలు చెప్పింది. రాత్రి 7 గంటలకు నా భారత దర్శనంలో మరొక క్షేత్రాన్ని చేరడం కోసమై మౌంట్ అబూని వదిలి అహ్మదాబాద్‌కి బయలుదేరాను.

# గుజరాత్

## జూన్ 21, 2019

**మహోన్నత మతాధిపతి మహంత్ స్వామిజీ ఆశీర్వాదములు:**

మహంత్ స్వామీజీ భారతదర్శనమును ఆశీర్వదించారు. స్వామినారాయణ సంస్థ గురించి వారి పనుల గురించి నాకు ఎన్నో ఏళ్ళుగా తెలిసినప్పటికీ, మహంత్ స్వామిజీ, BAPS ప్రస్తుత అధిపతి అయిన ఆయన్ను సందర్శించాలన్న ఆలోచన నా మనసుకి గుజరాత్ ప్రయాణంలో స్ఫురించలేదు. ఈ విషయంలో నా ప్రియ మిత్రుడు శ్రీమాన్ కశ్యప చోక్సీకి ధన్యవాదాలు తెలుపుకోవాలి. ఇతనే మహంత్ స్వామీజీ (86)ని దర్శించమని, గుజరాత్‌లో చూడవలసిన ప్రదేశాలలో షాహిభాగ్ ఆశ్రమము ఒకటని ముంబయిలో వారి గృహంలో ఆతిధ్యము ఇచ్చినప్పుడు మరీ మరీ చెప్పి పంపినారు.

2018 సంవత్సరంలో హైదరాబాద్‌లో మహంత్ స్వామీజీ (అప్పుడు మహంత్ స్వామీజీ ఏకాంతంలో ఉన్నారు) పర్యటనలో ఉన్న సమయంలో మేము వారిని కలిసి ఆశీర్వాదాలు తీసుకోవాలని వారి అంతరంగికులు బ్రహ్మవిహారి స్వామీజీ మరియు ప్రధాన సహాయకుడు కోసం కూడా ప్రయత్నించాము. అయినా మాకు ఆ రోజు అవకాశం కలుగలేదు.

కానీ అహ్మదాబాద్‌కు బయలుదేరగానే నా మిత్రుడు చెప్పిన షాహీబాగ్ గుర్తుకు వచ్చి, ఏది తెలుసుకోకుండానే స్వామీజీని చూడాలనే ఉద్దేశంతోటి ఆ ఆశ్రమానికి ఉదయం 8 గంటలకి చేరుకున్నాను... కాని ఆశ్రమంలో సుమారు 20 వేల మంది గుమికూడి ఉన్నారు ఆడిటోరియంలో, ఎటు చూచినా అందరూ హడావుడిగా ఉన్నారు. అప్పుడే తెలిసింది... శ్రీ మహంత్ స్వామీజీ ప్రభాత ఆరాధన మరియు ఆచారాలని వేదిక మీద చేస్తున్నారని... అందువల్లనే అసంఖ్యాక జనసందోహము అక్కడ చేరిందని తెలిసింది.

స్వామినారాయణ సంస్థల పెద్ద దిక్కును నేను చూడబోతున్నానన్న ఆనందం ఒక ప్రక్క... అయ్యో ఇంత మందిలో అసలు లోనికే ప్రవేశం లేకుంటే నేను ఏమి చేసేదన్న భావన మరొక ప్రక్క బాధిస్తూంటే... ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశించిన మరుక్షణంలో నన్ను గుర్తించి ఒక స్వచ్ఛంద సేవకుడు నా దగ్గరికి వచ్చి నా గురించి తెలుసుకుని, చాలా ఆప్యాయంగా నన్ను వేదిక ముందు భాగంలో... ఆడిటోరియం నిష్క్రమణ మార్గం దగ్గర కూర్చోపెట్టారు. దయతో కూడిన వారి ప్రవర్తనకు నేను మనసులోనే సంతోషించి, కృతజ్ఞతలు తెలుపుకున్నాను. వేదిక మీద ఏమి జరుగుతుందో అని నేను ఆసక్తిగా గమనించడం ప్రారంభించాను. ఇది నిజంగా ఒక వరమే నాకు. మహాంత్ స్వామీజీ వేదిక మీద నుంచి ఇచ్చిన దర్శనం ఎలా ఉందంటే అక్కడ గుమికూడిన వేల మందిని ముకుళిత హస్తాలతో దర్శనం చేసుకుంటున్నట్టు ఉంది. నేను చాలా చోట్ల స్వామీజీలని చూసాను. ఎక్కడైనా జనము వారికీ నమస్కారం చేయడం జరుగుతుంది. ఇక్కడేమో ఆయన ఎంతో వినయపూర్వకంగా చేతులు జోడించి వచ్చిన భక్తుల దర్శనం చేసుకుంటున్నట్లుగా ఉంది.

**స్వామినారాయణ గురు పరంపర:**

అక్షర పరబ్రహ్మ – పరబ్రహ్మ తత్వ శాస్త్రం – భగవాన్ స్వామినారాయణ్ వెల్లడించినట్లుగా, అతను తన అమృత శరీరాన్ని విడిచిపెట్టిన తర్వాత, ఈ భూమిపై అక్షరము లేదా సత్పురుషుడు ద్వారా నిరంతరం జీవించే ఉంటారు. గురు పరంపర సంపూర్ణ జీవితాన్ని గడపడానికి అవసరమైన మార్గదర్శకత్వం మరియు నాయకత్వం, నిరంతరము సత్సంసంగీలకు అందిస్తుంటారు. మోక్షము మరియు శాశ్వతమైన ఆనందం వైపు అందరినీ తీసుకుని వెళ్తారు. భగవాన్ స్వామినారాయణ్ గుణాతీత స్వామీజీని అక్షర పరబ్రహ్మగా ఆయన జీవిత ప్రయాణంలో అనేకసార్లు గుర్తించారు. అదే తరహాలో, వారసులను వారి గురువులు గుర్తించారు. అతని ఆధ్యాత్మిక వారసుల్లో భగవాన్ స్వామినారాయణ్ వారసత్వం నిజమైన అర్థంలో గోచరిస్తుంది.

గురుపరంపర వారసులు గుర్తించబడతారు... కమిటీ లేక బోర్డు సభ్యులు వేసే ఓటు ద్వారా ఎన్నుకోబడరు. BAPS స్వామి నారాయణ సంస్థ యొక్క

ఆధ్యాత్మికత మరియు పరిపాలన నాయకత్వం గుణాతీత గురువు చేతనే నిర్వహించబడుతుంది. భగవాన్ స్వామినారాయణ్ వచనామృత గ్రంథము 3-27లో అటువంటి సాధుగుణాలను వివరిస్తారు. దీనిలో ఆయన ఇలా చెప్పారు: "సంత్ యొక్క ప్రధాన లక్షణాలు: కామం, చిరాకు, అహం, అహంభావం, రుచి, అనుబంధం మొదలైనవి లేకపోవడం అన్న విషయాలు కూడా గ్రంథాలలో వివరించబడ్డాయి. ఈ లక్షణాలను కలిగి ఉన్న సత్పురుషులు దేవుడితో ప్రత్యక్ష సంబంధాన్ని కలిగి ఉంటారు. ఆయన వచనామృతములో చెప్పినదాని ప్రకారం, అలాంటి సంత్‌లను దర్శించినప్పుడు, నిజంగా దేవుడి దర్శనం చేసుకున్నాను" అని గ్రహించాలి.

**అంతర్జాతీయ యోగా దినోత్సవం:**

అంతర్జాతీయ యోగా దినోత్సవం మహంత్ స్వామీజీ దివ్య సమక్షంలో జరిగింది. స్వామీజీ యోగా గురించి మరియు ఆధ్యాత్మికత గురించి క్లుప్తంగా చెప్పారు. 150 ఎకరాలలో న్యూజెర్సీలో మరొక అక్షరధామం నిర్మించ బడుతుందని ప్రకటించారు. కార్యక్రమం ముగిసింది. నేను నిష్క్రమణ ద్వారము నుంచి ముందున్న ఆవరణము చేరుకున్నాను. మహంత్ స్వామీజీ మహారాజ్ సభ వేదిక నుంచి బయటకు వెళ్ళిపోతున్నప్పుడు నేను అక్కడి నుంచి బయటకు వచ్చి, ఆయన్ను చాలా దగ్గరగా చూడవచ్చనుకున్నాను. అక్కడ వుండే బ్యాటరీ కార్‌ను చూచి, వారు ఖచ్చితంగా అందులోనే నిష్క్రమించ వచ్చని తలచి, దానికి దగ్గరగా ఉన్న బెంచ్ మీద కూర్చున్నాను.

ఇంతలో ఒక సీనియర్ స్వామీజీ నన్ను నా వేషమును చూసి, నా గురించి అడిగి తెలుసుకొని మరింత దగ్గరగా ఉన్న ప్రదేశానికి వెళ్ళమని చెప్పారు. నా మాటల్లో ఆయన నా భారత దర్శనం గురించి తెలుసుకొన్నారు. కొన్ని నిమిషాల తరువాత అదే స్వామీజీ నా దగ్గరకి వచ్చి, నన్ను ఆయనతో పాటుగా రమ్మన్నారు. నన్ను ఎక్కడికి తీసుకెళ్లారో చూసినప్పుడు నా ఆశ్చర్యానికి ఆనందానికి అంతే లేదు. మహంత్ స్వామీజీ వేదిక దిగి ఆయన గదికి వెళ్లే దగ్గరికి తీసుకెళ్లారు. ఆ స్వామీజీ నా భారతదేశ యాత్ర గురించి మరికొన్ని విషయాలు తెలుసుకున్నారు. ఆయన్ని చుట్టూ ఉన్న తోటి స్వామీజీలకు కూడా పరిచయం చేసాను.

మహంత్ స్వామీజీ వచ్చాక, నన్ను ఆయన దగ్గరకు తీసుకెళ్లి పరిచయం చేసారు. ఆనందంలో నన్ను నేను మరచిపోయాను. ఆయన పాదాల ముందు మోకరిల్లి, ఎలుగెత్తి సమస్త లోకా సుఖినోభవంతు గీతాన్ని బిగ్గరగా ఆలపించాను. అందరికీ అన్నీ అందాలని చెప్పే సంస్కృత శ్లోకాన్ని బిగ్గరగా... ఏడుస్తూ చెప్పేసాను. ఆయన నా చేతులని వారి చేతులలోకి తీసుకుని నా భుజాన్ని ప్రేమగా తట్టారు. నా భావోద్వేగం చూసి చిన్నగా నవ్వారు. భారత దర్శనం గురించి తెలుసుకొని ఒక గులాబి పువ్వు ఇచ్చి దీవించారు. అంతే అక్కడున్న మిగతా సందర్శకులు అందరూ చేష్టలుడిగి నిలిచిపోయారు.

నా జీవితంలో ఎంతో మంత్రముగ్ధమైన సమయం ఇది. ఇది మరొక దైవ సంఘటన. నా నమ్మకాన్ని బలోపేతం చేసింది. మన ఉద్దేశ్యం పవిత్రం అయితే భగవంతుడు ఆ కార్యం కోసం పని చేస్తాడు అన్నది మరొకసారి రుజువైంది. ఈ సంఘటన తర్వాత నేను పెదవి కూడా కదపలేకపోయాను, కారణం అనిర్వచనీయమైన అనుభవం.

మహంత్ స్వామీజీ దీవెనలందుకోవడానికి కారణమైన శ్రీ బ్రహ్మముని వత్సల స్వామీజీకి నా ప్రగాఢ కృతజ్ఞతలు తెలుపుకున్నాను. భారత దర్శనంలో ప్రతిరోజు దైవిక ఆలోచనలు, మాటలు, పనులతో నిండి జీవితానికో అర్థం ఇస్తోంది. భారత దర్శన్‌లోని ప్రతి దశలోనూ భగవంతుడిని చూడగలిగాను. స్వామి నారాయణ మందిర్‌లో దర్శనం అయిన తర్వాత నేను సబర్మతి ఆశ్రమానికి బయలుదేరాను.

## సబర్మతి... సబ్కో సన్మతి.... దేశ్‌కో స్వేచ్ఛాగతి!!:

"గుజరాతినైన నేను అనుకున్నాను. గుజరాతి భాష ద్వారా దేశానికి సేవలు చేయాలని. ఆ తర్వాత చేనేత పనికి పురాతనమైనది అహ్మదాబాద్ కేంద్రం కాబట్టి చరకా కుటీర పరిశ్రమని పునర్జీవింపచేయడానికి అనుకూలమైన ప్రదేశంగా భావించాను. గుజరాత్ ముఖ్య పట్టణం కాబట్టి మరి ఎక్కడా దొరకనంత ఆర్థిక సహాయం ఇక్కడున్న సంపన్నుల నుంచి లభిస్తుందని ఆశ కూడా ఉంది."

1917లో అహ్మదాబాద్‌ను ఆయన కార్యక్షేత్రముగా చేసుకున్న సమయంలో గాంధీజీ వ్రాసుకున్న మాటలు ఇవి.

ఇక్కడే మన మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ, మహాత్మా గాంధీ అయ్యారు, ఇక్కడే మన బాపూజీ జాతిపిత అయ్యారు. ఇక్కడ నుంచి వారు స్వాతంత్ర్యం కోసం కోట్ల హృదయాలలో చైతన్యం నింపారు. సబర్మతి నది తీరాన ఉన్న ఈ ఆశ్రమాన్ని దర్శించుకుని, ఇక్కడ కొంత సమయం గడపగలిగే భాగ్యం నన్ను వరించింది.

వంద సంవత్సరాల క్రితం గాంధీజీ తన కార్యక్షేత్రంగా ఎంచుకున్న ఈ ప్రదేశం గురించి వ్రాసుకున్న ఈ భావనలు అక్కడ చదివాను. ఆనాటి జ్ఞాపకాలు అన్నీ నా మనసుని తాకాయి.

ఇలాంటి ప్రదేశాల గురించి ఏమని చెప్పను స్నేహితులారా?

మన ప్రియమైన / దగ్గరి బంధువులను కలిసినా కలవకపోయినా.

మన ఆలయాలని / పుణ్యక్షేత్రాలను దర్శించినా దర్శించకపోయినా...

విదేశాలలో అనేక ప్రదేశాలు చూసినా చూడకపోయినా...

మనం తీర్థయాత్రలు చేసినా చేయకపోయినా...

అదేమంత పెద్ద విషయం కాదు.

కానీ మన భారత స్వతంత్ర పోరాటంతో సంబంధం ఉన్న ప్రతి ప్రదేశాన్ని దర్శించవలసినదే, నిద్రాణంగా ఉన్న మన ఆత్మను తట్టిలేపి మనలను మనం దేశ సేవకు వినియోగించుకునేందుకు తప్పక దర్శించుకోవాల్సిందే!

ఇంకా గాంధీజీ ఇలా వ్యాఖ్యానించేవారు, “ఒక వైపు మన కార్యకలాపాలను నిర్వహించుకోవడానికి, సత్యాన్వేషణ చేసేందుకు, నిర్భయతను పెంపొందించేందుకు... మరొక వైపు విదేశీయుల సంకెళ్ళు, ప్రకృతి మాత ఆకస్మిక పెను విలయాలు ఎదుర్కునేందుకు ఇదే సరియైన స్థలం” అని.

ఇక్కడ కొన్ని ముఖ్యమైన నిర్మాణాలు జరిగాక, 1917లో ఆశ్రమ కార్యక్రమాలు మొదలయ్యాయి. సబర్మతి ఆశ్రమంగా ప్రసిద్ధి చెందిన ఈ ఆశ్రమం నుండి గాంధీజీ స్వతంత్ర్యానికి సంబంధించిన అన్ని కార్యక్రమాలు మరియు సమాజ ఉద్ధరణకు సంబంధించిన ఎన్నో కార్యక్రమాలను నిర్వహించారు. మార్చి 12, 1930లో ఉప్పు చట్టాన్ని నిరోధించేందుకు దండి మార్చ్ మొదలు పెట్టేంత దాకా ఆయన ఆశ్రమంలో చాలా సంవత్సరాలు వున్నారు. కానీ దండి మార్చ్‌కు బయల్దేరే ముందు “స్వతంత్రం వచ్చేంత వరకూ ఈ ఆశ్రమానికి తిరిగి రాను”

అని ప్రకటించారు. ఇక్కడ గడిపిన ప్రతిక్షణం కూడా ఆనాడు గాంధీజీ ఎంత నిరాడంబరంగా, నిబద్ధతతో జీవించారో తలచుకొని ఎంతో స్ఫూర్తి పొందాను. ఆశ్రమంలోని అన్నీ ప్రాంగణాల్లో కూడా తిరిగి ఎక్కడెక్కడ ఏమున్నాయి చూసుకుంటూ చాలా సమయం గడిపాను.

## గాంధీజీ స్మారక సంగ్రహాలయము:

ఆశ్రమంలో ఏర్పాటు చేసిన గాంధీ స్మారక వస్తు సంగ్రహాలయమునూ నేను చూసాను. గాంధీజీ పేరున ఒక స్వచ్ఛంద సంస్థ దీనిని 1951 నుంచి నిర్వహిస్తోంది. 1963వ సంవత్సరంలో కొత్త భవనం నిర్మించి గాంధీజీ బ్రతికున్న సమయంలో ఉపయోగించిన ఎన్నో వస్తువులను సేకరించి, సంరక్షించి, సర్వులకు సందర్శన సౌలభ్యమును కలుగజేస్తున్నారు. వారికి చేతులెత్తి నమస్కారం చేయాలి. కారణం ఆ వస్తువులను చూస్తున్నప్పుడు గాంధీజీ మన ముందే వాటిని వాడుతున్న జ్ఞాపకాలు మనల్ని కదిలిస్తాయి. వారి జీవిత చరిత్రలోని ఎన్నో ముఖ్య ఘట్టాలను మన కళ్ల ముందు ఆవిష్కరించే వారి దస్త్రాలు, ఉత్తరాలు, పత్రాలు, చిత్రాలు, వ్యక్తిగత వస్తువులు, వాచీలు, పరికరాలు, వంటపాత్రలు, చరఖా, వ్రాసుకునే బల్ల, చివరికి వారు పరమపదించిన సమయంలో వేసుకున్న వస్త్రాలు, చేతికర్రలు ఇలా ఎన్నో వస్తువులను అక్కడ చూసాను.

ఆ ప్రాంగణములో వున్నంత సేపు కూడా నన్ను నేను మరచిపోయాను. నాతో మాట్లాడేవారు గాని... నన్ను ఇబ్బంది పెట్టేవారు గాని ఎవరు లేకపోవడం వలన... చాలాసేపు ఇలా అన్నీ గదులు చూస్తూ... ఓ వంద సంవత్సరాల క్రితంకి జారిపోయాను.

## ప్రభుత్వానికి వినతి:

కానీ, ప్రభుత్వం ఇంకా ఎంతో శ్రద్ధ తీసుకుని ఈ క్షేత్రాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది. లేదంటే భావితరాల వాళ్లకు మనం అన్యాయం చేసినట్లు అవుతుంది. సాంకేతికతను అందిపుచ్చుకుని సబర్మతి ఆశ్రమాన్ని సమూలంగా ఆధునికరించి, సందర్శకులకు నిజ జీవిత అనుభూతులను అందజేయవచ్చు. అసలు ఎవరైనా ఈ క్షేత్రంలోకి వస్తే తిరిగి

వెళ్ళేప్పుడు ఒక దేశభక్తుడిగా మారి వెళ్ళాలి. ఆ విధంగా ఆశ్రమాన్ని తీర్చిదిద్దాలి. ఇప్పుడయితే నేను ఈ క్షేత్రానికి కేవలం 40/100 మార్కులే ఇస్తాను.

**అక్షరధామ్... ఆధ్యాత్మికతకు అక్షయము:**

భక్తిని అందించడానికి, శాశ్వతమైన శాంతిని అనుభవించడానికీ అక్షరధామ్ శాశ్వతమైన ప్రదేశం. గాంధీనగర్లోని స్వామినారాయణ అక్షరధామ్ ఒక భవ్యదివ్య మందిరం అనీ చెప్పాలి. కన్నులను కట్టిపడేసే అద్భుతమైన మనుష్య సృష్టి ఇది, ఆ క్షేత్రమంతా దివ్య, ఆధ్యాత్మిక మరియు సాంస్కృతిక వైభవాల మేళవింపుతో కనిపించకమానదు. విద్య మరియు ఏకీకరణకు అంకితమైన హిందూ మందిరం. కాలాతీతమైన భక్తి సందేశాలు, శక్తివంతమైన హిందూ సంప్రదాయాలు, ఆధునికత మేళవించిన నిర్మాణ కౌశలం, అబ్బుర పరిచే శిల్పకళా చాతుర్యం అన్నీ ఇక్కడ ప్రతిబింబిస్తున్నాయి. భగవాన్ శ్రీమన్నారాయణునికి మరియు హిందూ మత అవతారాలకు, దేవతలకి, ఋషులకు ఈ మందిరం BAPS బృందం భక్తి శ్రద్ధలతో అందించిన వినయ పూర్వకమైన నివాళి.

అక్షరధామ్ సందర్శనం అనేది ఎవరికైనా ఆధ్యాత్మిక వర్షంలో తడవడం లాంటిది. BAPS అలాంటి అందమైన దేవాలయాలను సృష్టించారు. ఉదయం షాహీన్‌బాగ్‌లో మహంత్ స్వామి వారి ఆశీర్వాదాలు తీసుకుంటున్న సమయంలో, అక్కడ అందరికీ నేను లైవ్లో కనిపించాను. నేను అక్కడ కార్యాలయానికి వెళ్లినపుడు అక్కడి విధులను నిర్వహించే సన్యాసి నన్ను చాలా ఆదరంగా స్వాగతించినప్పుడు విషయం తెలిసింది. వారు ఒక సీనియర్ స్వామీజీ, అక్షరధామంలో ఉన్న శ్రీమాన్ జతీష్‌ని నేను వెళ్లినప్పుడు సహాయం కోసం కలవమని సలహా ఇచ్చారు. ఇక అక్కడకు నేను చేరకమునుపే అక్షరధామ్ సిబ్బంది నన్ను సాదరంగా తోడ్కొని ప్రముఖుల ప్రవేశ ద్వారం ద్వారా నన్ను తీసుకువెళ్లారు. వారు అంతా అక్షరధామ్‌లో నేను గడిపిన 5 గంటల సమయంలో నన్ను చాలా బాగా చూసుకున్నారు.

నేను సుమారు ఉదయం పది గంటలకు అక్షరధామంలోకి ప్రవేశించగానే అక్కడి సిబ్బంది నన్ను అభిషేక మండపానికి తీసుకెళ్లారు. తమ తమ కోరికలను నెరవేర్చుకునేందుకు భగవంతుడికి మన చేత చేయించే అభ్యంగన స్నానమే ఈ

అభిషేకం. ఆరాధకులు మంత్రాల మధ్య, ప్రార్థనల మధ్య భగవంతుని స్వచ్ఛమైన నీటితో అభిషేకిస్తూ ఉంటారు.

అభిషేక ఆచారం, పవిత్ర కంకణం నామణి కట్టుకు కట్టుకోవడంతో మొదలైంది. ఆ తర్వాత సంక్షిప్త సంస్కృత శ్లోకాలు చెప్పారు. తదుపరి ఒక చిన్న కమండలంలో పవిత్ర జలంతో నీలకంఠుని అభిషేకిస్తూ, సమస్త లోకా: సుఖినో భవంతు అంటూ యధావిధిగా ప్రార్థించాను.

**అక్షరధామ్‌లో తెలుసుకున్న ముఖ్య అంశాలు:**

1990లో శ్రీ యోగి మహారాజ్ కల, 1992లో శ్రీ ప్రముఖ్ స్వామీ మహారాజ్ గారు చేసిన బృహత్‌కార్యం ద్వారా ఈ ఆలయం ఏర్పాటు చేయబడింది. BAPS వారు గుజరాత్‌లోని గాంధీనగర్‌లో, 20వ సెక్టార్‌లో 28 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఆలయాన్ని నిర్మించారు. 4000 మంది స్వచ్ఛంద సేవకులు సుమారు 8, 000, 000 పైగా స్వచ్ఛంద పని గంటలు ఇచ్చి ఈ ఆలయం నిర్మించారు. ఈ భూమిపై వేల సంవత్సరాల పాటు నిలిచి ఉంటే ధృడమైన ఇసుకరాయితో నిర్మించబడిన ఈ ఆలయం ఒక అద్భుతమైన ఇంజనీరింగ్ పనితనాన్ని ప్రతిబింబిస్తుంది.

ఇక్కడున్న ప్రతి అంశం మన జీవితం కోసం ప్రేరణనిచ్చేలా ఉందని నేను అనుకొన్నాను. వ్రాసేందుకు స్థల భావాన్ని దృష్టిలో వుంచుకుని తెలుసుకునే ఆసక్తి కలిగిన వారి కోసం ఈ అనుభవాలను వివరిస్తూ, నేను కొన్ని ముఖ్యమైన అంశాలను క్లుప్తంగా వివరిస్తున్నాను.

ఈ క్షేత్రంలో సందర్శకులు అందరూ తప్పక చూడవలసిన విషయాలు:

1. స్వామినారాయణ మహారాజ్ యొక్క పాదముద్రలు.
2. 97 క్లిష్టంగా చెక్కిన స్థంభ రాజములు, అద్భుత శైలిలో నిర్మించిన 17 గోపురాలు, 220 రాతి దూలాలు, 57 రాతి తెరలు, 3 ముఖ మండపాలు మరియు 226 హిందూమతంలోని ఆధ్యాత్మిక వ్యక్తుల విగ్రహాలు. 108 అడుగుల ఎత్తులో ఆకాశాన్నీ తాకినట్లుగా ఉండే మందిరం, 131 అడుగుల వెడల్పు, 240 అడుగుల పొడవును కలిగిన సువిశాల ప్రాంగణం. మందిరం లోపల ప్రతీ స్థంభం అత్యంత జాగ్రత్తగా చెక్కబడింది, భక్తి కథలను చెబుతూ,

హరి మండపం దగ్గర దేవత దర్శనాన్ని అందిస్తుంది.

3. స్వామినారాయణ దర్శనం.
4. ప్రసాద మండపం.

భగవాన్ శ్రీ స్వామినారాయణను విస్తృతంగా అనుసరించే భక్తులు ఆయనను దివ్య అవతారంగా భావిస్తారు. ఆయన చేత వాడబడిన వస్తువులన్నీ చాలా జాగ్రత్తగా భద్రపరచబడినవి మరియు భావితరాల వారికి అందించబడింది. ప్రసాద మండపంలో శుద్ధి చేయబడిన వస్తువులు భగవాన్ శ్రీమన్నారాయణ అవతారంకొక చారిత్రక సాక్ష్యాలుగా గౌరవప్రదంగా భావించబడ్డాయి. భగవాన్ శ్రీమన్నారాయణ అవతారంతో సంబంధించి చారిత్రాత్మక సాక్ష్యాలు ప్రామాణికంగా ప్రదర్శించబడ్డాయి. పవిత్ర అవశేషాలు అమూల్యమైనవి, ఎందుకంటే వాటిలో అపారమైన ఆధ్యాత్మిక శక్తి నిండింది. ఈ అవశేషాలలో స్వామినారాయణుని ఉన్నత దైవత్వం స్పష్టంగా ఉంది.

5. విలువలు తెలిపే విశాల మందిరం
6. ఆధ్యాత్మిక భారతదేశం
7. ఆధ్యాత్మిక వారసత్వ మందిరం
8. సామరస్యపూర్వక గది
9. పావన సాధకులు
10. సంత్సరంహితకరి
11. థీమ్ పార్కులు
12. సత్‌చిత్ ఆనంద జలతరంగిణి

**నా వినయపూర్వక ప్రార్థన:**

భారతదేశంలోని ఏ రాష్ట్రానికైనా మన జీవితంలో ఎప్పుడైనా పర్యటించినప్పుడు ఇలాంటి అద్భుతమైన ప్రదేశాలను చూడడానికి సమయాన్ని కేటాయించండి. ఒకవేళ మనం అలాంటి వాటిని చూడలేకపోతే మనల్ని మనం పునఃనిర్మించుకునే, ప్రణాళికను తిరిగి శక్తిని పొందే అవకాశాన్ని, మన మూలాలను జ్ఞాపకం చేసుకునే అవకాశాలను అన్నీ కోల్పోతాం. కోట్లాది విశ్వపౌరుల ప్రయోజనార్థమై ఇలాంటి అద్భుతమైన ఆలయాలను బహుమతిగా

ఇచ్చినందుకు నేను BAPS కు శిరస్సు వంచి నమస్కరించుకున్నాను.

మధ్యాహ్నం 2.30 గంటలవుతూ ఉండగా నేను దర్శనాన్ని ముగించుకున్నాను. ప్రేమావతి ఆహారకేంద్రం వద్ద చాలా ప్రఖ్యాతిగాంచిన స్వామి నారాయణ్ కిచిడిని తీసుకొని, నేను అక్కడికి ఎనిమిది గంటల దూరంలో ఉన్న ద్వారకకి బయలుదేరాను.

## జూన్ 22, 2019

### ద్వారక: కృష్ణ నివాస ద్వారము

ఉదయం 12 గంటల నుంచి రాత్రి 12 గంటల దాకా సమయమెలా గడిచిపోయిందో తెలియదు. గుజరాత్ రాష్ట్రంలో అరేబియా సముద్రతీరంలో ఉన్న ద్వారకకు అర్ధరాత్రి 12 గంటల సమయంలో చేరుకున్నాను. ఆలయం దగ్గరలో ఏదైనా వసతిగృహం ఉందేమో అనుకుని వెతికాను, చివరికి స్వామి నారాయణ ఆలయంలో ఆశ్రయం ఇచ్చారు. కొన్నిగంటల విరామం తర్వాత ద్వారకాధీశ ఆలయానికి నడిచి వెళ్లాను. సముద్రాన్ని, అందమైన శ్రీకృష్ణ ఆలయాన్ని, ఆవలి ఒడ్డున ఉన్న ఆయన కుటుంబాన్ని చూడడం ఒక అద్భుతం. ద్వారక, శారదా మఠంలోని పశ్చిమామ్నాయ శంకరాచార్య పీఠం దగ్గర నేను శిరోముండనం చేయించుకున్నాను.

శ్రీస్వరూపానంద సరస్వతి (95 సంవత్సరాల వయసు), ప్రస్తుత ఆశ్రమ పీఠాధిపతి వృద్ధాప్యంతో ఢిల్లీలో ఉన్నారు. అందువలన నేను ఆయనను చూడలేక పోయాను. గోముఖ తీర్థానికి వెళ్లి పవిత్ర స్నానమాచరించాను. భారతదేశ దర్శనంలో 40వ రోజున పశ్చిమ కనుమకు చేరుకున్నాను. అంటే నేను రెండవ దశను పూర్తి చేసుకున్నాను. శ్రీ ఆది శంకరాచార్య జన్మస్థలం అయిన కాలడి నుంచి మే 14న బయలుదేరి కేరళ, కర్ణాటక, గోవా, మహారాష్ట్ర, రాజస్థాన్‌ల మీదుగా గుజరాత్‌కు 22 జూన్ 2019 రోజున చేరుకుని శ్రీకృష్ణ దర్శనాన్ని పూర్తి చేసుకున్నాను. ఇటు నుంచి భారత దర్శన దేశ మూడవ దశలో... మధ్యప్రదేశ్ మరియు రాజస్థాన్ దిశగా ప్రయాణం సాగించాను.

## ద్వారక - స్వర్గద్వారము

ద్వారక ప్రధాన ఆలయము ఐదు అంతస్తులలో 72 రాతి స్తంభాల ఆధారంగా నిర్మించబడింది. ఇది జగత్ ఆలయంగా లేదా నిజమైన మందిరంగా పిలవబడుతుంది. పురావస్తు శాఖ వారిచే లెక్కల ప్రకారం, ఇది రెండువేల రెండువందల సంవత్సరాల క్రితం నిర్మించబడినది. 15, 16వ శతాబ్దాలలో ఆలయం విస్తరించబడింది. ద్వారకాధీశుడి ఆలయం పుష్టిమార్గ ఆలయము. అందువల్ల వల్లభాచార్యులు మరియు విహలేశ్నాథులు సూచించిన ఆచారాలతో పూజలు చేస్తారు ఇక్కడ.

## హరిగృహ (శ్రీకృష్ణుల వారి నివాస స్థలం)

నిజ ఆలయ శ్రీకృష్ణుని మనుమడు అయిన వజ్రనాభు చేత నిర్మించబడిందని నమ్ముతారు. ఆది శంకరాచార్యులు 8వ శతాబ్దంలో ఈ ఆలయాన్ని దర్శించారు. అందుకుగాను గుడిలో నిర్మించబడ్డ ఒక స్మారకాన్ని ఇప్పుడు కూడా మనం చూడవచ్చు.

భారత ఉపఖండంలో ద్వారకాధీశుడి ఆలయం విష్ణువు యొక్క 98వ దేశంగా దివ్యప్రబంధ పవిత్ర గ్రంథాలలో అళ్వారులచే కీర్తించబడింది. ఈ ద్వారకకు సంబంధించిన అనేక కృష్ణ కథలు ప్రాచుర్యంలో ఉన్నాయి. శ్రీకృష్ణుడు, ఆయన భార్యలు, కుటుంబం, రాజ్యం, చిన్ననాటి స్నేహితుడు అయిన సుదాముడు, తులాభారము, రుక్మిణి ఆలయం, బెట్ద్వారక మొదలైనవి. అన్ని కూడా నేను దర్శించుకున్నాను. రుక్మిణి ఆలయాన్ని కూడా దర్శించాను. ఈ ఆలయం ద్వారక నుండి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇందుకు సంబంధించిన ఒక కథ కూడా దీని వెనుక ఉంది. ఇప్పటికీ, రుక్మిణి కళ్యాణం, శ్రీకృష్ణుల వారిని ఇక్కడికి తీసుకుని వచ్చి అమ్మ వారితో శాస్త్రోక్తంగా జరిపిస్తారు. ఈ కళ్యాణం ముగించే లోపు పూజారి రుక్మిణి అమ్మవారు రాసిన ఉత్తరాన్ని చదువుతారు.

ఇక బెట్ద్వారక, ఇది ద్వారక ఆలయానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఒక ద్వీపంలో ఉంది. దీనిని శ్రీకృష్ణుల వారి భవనంగా నమ్ముతారు. చాలా వారాల నుండి తీర ప్రాంతంలో తుఫాన్ హెచ్చరికలు కొనసాగించడంతో ఇక్కడికి చేరుకోవడం సాధ్యమౌతుందా లేదా అన్న సందేహం ఉండేది. కాని ఆ

తరువాత విచారణలో, అది ఆ రోజు తెరిచి ఉంచబడిందని తెలిసింది.

దాదాపు రెండుగంటల సమయాన్ని ఆ ప్రాంత దర్శనానికి కేటాయించాను. టాప్లెస్ బోట్లో ప్రయాణం, మండుతున్న ఎండలు, అల్పాహారం తీసుకోకపోవడం, నిరీక్షణ, నడక అన్నీ కలిసి కాస్త శ్రమకి గురిచేశాయి. కానీ, దర్శనాన్ని విజయవంతంగా ముగించుకోగలిగాను.

## భారతీయుల సంకల్పం - సోమనాథ జ్యోతిర్లింగం

అనాదిగా అత్యంత శక్తివంతమైన మరియు సుసంపన్నమైనదిగా నమ్మబడుతున్నది సోమనాథ జ్యోతిర్లింగ క్షేత్రం. ఇక్కడే దక్షుడి చేత శపించబడి తన అందాన్ని కోల్పోయిన చంద్రుడు, శివుని కోసం తపస్సు చేసి తన అందాన్ని తిరిగి పొందినట్లు ప్రతీతి. సోముడు అంటే చంద్రుడు... నాథుడు అంటే ప్రభువు అని అర్థం. అంటే చంద్రుని కటాక్షించిన శివుడుకి సోమనాథుడు అన్న పేరు వచ్చింది.

ద్వాదశ జ్యోతిర్లింగాలలోని శివ నామాలలో మొదటి పేరు సోమనాథుడు. సోమనాథుడు ఉన్న ఆలయాన్ని సోమనాథ్ దేవాలయమని పిలుస్తారు. ఈ దేవాలయము గుజరాత్ రాష్ట్రంలో, సౌరాష్ట్రలోని, వెరావళ్లలో ఉన్న సోమనాథ్‌లో ఉంది. సోమనాథ్ ప్రముఖ హిందూ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతుంది. దీనిని "ప్రభాసతీర్థం" అని కూడా పిలుస్తారు.

ద్వాదశ జ్యోతిర్లింగాల యాత్రకు బయలుదేరే భక్తులు ఇక్కడి నుంచే తమ యాత్రను ప్రారంభిస్తారు. ఈ క్షేత్రంపై పదహారుసార్లు దాడులు జరిగాయి, అయినా అన్నిసార్లు పునర్నిర్మాణం జరిగింది. ఈ పుణ్యక్షేత్రం శివభక్తులకు మాత్రమే కాక, విష్ణుభక్తులకూ సందర్శనీయ క్షేత్రమే. శ్రీకృష్ణ పరమాత్ముడు ఇక్కడ తన అవతారాన్ని చాలించినట్లు ప్రతీతి.

అనేకమార్లు ధ్వంసం చేసినా తిరిగి పునర్నిర్మించబడినందు వలన ఈ ఆలయాన్ని అక్షరమైన ఆలయంగా వర్ణిస్తారు. జునాగఢ్ భారతదేశంలో విలీనమైన సందర్భంలో ఇక్కడకి విచ్చేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ ఈ ఆలయాన్ని దర్శించడంతోపాటు, ఈ ఆలయ అభివృద్ధికి ప్రణాళికను ప్రతిపాదించారు. చివరిలో పునర్నిర్మాణం శ్రీ కే.ఎం. మున్షీ మరియు సర్దార్ పటేల్ ద్వారా

ప్రేరేపించబడింది. గాంధీజీ యొక్క వ్యక్తిగత సలహా మేరకు ప్రజల/భక్తుల నుండి నిధులు సమకూర్చబడ్డాయి. అప్పటి దేశాధ్యక్షుడు శ్రీ రాజేంద్ర ప్రసాద్ గారి చేత 1951లో ప్రారంభించబడి జాతికి అంకితం చేయబడింది.

ఈ ఆలయం విదేశీ ఆక్రమణదారులచే, అనేక సార్లు ధ్వంసం చేయబడింది. అలా జరిగిన ప్రతి సారి మహనీయులు లేదా నాటి భారతీయ రాజులు అక్కడ జ్యోతిర్లింగ శక్తిని ప్రదర్శిస్తూ దేవాలయాన్ని పునర్నిర్మించుతూ, తద్వారా ఆధ్యాత్మికతతో పాటు ప్రాచీన భారతీయ సంస్కృతి మరియు వారసత్వాన్ని కాపాడారు.

అసలు ఆ క్షేత్రము, అక్కడి సముద్రతీరములోని దేవాలయ ప్రాంగణము… గంభీరంగా ఎగసిపడే సముద్రమును చూసినప్పుడు ఎంతో గర్వంగా అనిపించింది. భారతీయుల దృఢ సంకల్పానికి నేను నిజంగా ఎంతో స్ఫూర్తిపొందాను. భారతీయుల చిత్తము అసమానమైనది. ఎవరైనా తమ వ్యక్తిగత జీవితములో గానీ, వ్యవస్థలో గానీ, జరిగిన విధ్వంసం ద్వారా నిరాశకు గురైతే వారు ఈ దేవాలయాన్ని తప్పక చూడాలి.

ఈ ఆలయం పడిపోయిన ప్రతిసారి ఎలా నిలబడింది అన్న నిజాన్ని పరిశీలిస్తే ఎలాంటి వారయినా సరే, చైతన్యవంతులుగా మారిపోతారు. ఈ అందమైన అతిపెద్ద జ్యోతిర్లింగం సందర్శకులను మంత్రముగ్ధులను చేస్తుంది. నాకు సాయంత్రం 6 గంటల హారతి చూసి ఆనందపడే దివ్యావకాశం కలిగింది. భారత దర్శన సంకల్పం చెప్తూ అందరికోసం ప్రార్థన చేసాను. దేవాలయ ప్రాంగణంలో ఉన్న అందమైన శిల్పాలను, పరిసరాలను వాటి అందాలను చూడడానికి కనీసం ఒక గంట అయినా గడపాలి ఇక్కడ. అప్పుడే అసలు ఆ క్షేత్రములో అనాదికాలం నుంచి ఏం జరగిందో తెలుస్తుంది.

**బాణ స్తంభం:**

దక్షిణం వైపున ఒక బాణం గుర్తు ఉంది. అది సముద్రపు చివరివరకూ అడ్డంకులు లేకుండా సాగే కాంతి మార్గంగా పిలుస్తారు. ఈ బాణం సోమనాథ్ ఆలయం నుంచి దక్షిణధృవం వరకు ఉన్న సరళ రేఖలో ఒక భూప్రదేశం కూడా లేకుండా ఉందని నిరూపించే ఒక అద్భుతమైన గుర్తు. భారతీయులకూ

భూమి గుండ్రంగా ఉందని తెలిసి, అదే విధంగా భూమి దక్షిణ ధ్రువం అనే విషయాన్నీ కూడా అప్పటినుండి భారతీయులకు తెలియజేస్తున్న ఈ స్థంభం సూచిస్తుంది. ఈ స్థంభం క్రీస్తు శకం 600 సంవత్సరాల క్రితమే నిర్మించబడిందని అక్కడి శాసనాలు చెబుతున్నాయి.

## జూన్ 23, 2019

**సముద్ర వీక్షణ స్థానం:**

సముద్రతీరం ఆలయ ప్రహరీ గోడ పక్కన ఉంది. అక్కడ ప్రకృతి శక్తిని చూడవచ్చు. ఇంకా అక్కడ తప్పక చూడవలసిన ప్రదేశాలు: శిధిలమైన పార్వతమ్మ వారి దేవాలయం, పరిద వినాయకుడు, పాత ఫోటోల ప్రదర్శనశాల, జ్యోతిర్లింగ దర్శనం, శబ్ద మరియు కాంతి ప్రదర్శన.

మరుసటి రోజు మధ్యప్రదేశ్ చేరడానికి ఐదు వందల కిలోమీటర్ల పైగా ప్రయాణ దూరాన్ని దృష్టిలో ఉంచుకుని, అహ్మదాబాద్ మధ్య మార్గాన్ని 12:00 లోపల దాటడానికీ నేను రాత్రి 8 గంటలకు ప్రయాణం మొదలుపెట్టాను.

**స్వామి నారాయణ మందిర్, గొండల్:**

మరుసటి రోజు ఉదయం ఐదుగంటలకు స్వామినారాయణ ఆలయంలో నా రోజు ప్రారంభమైంది. నేను ఈ ఆశ్రమానికి చేరుకోవడానికీ అర్ధరాత్రి 12 గంటలు అయ్యింది. అయినప్పటికీ కౌంటర్ వద్ద ఉన్న స్వచ్ఛంద సేవకుడు నన్ను ఎంతో ఆదరంగా ఆహ్వానించాడు. నా భారతదేశ యాత్ర గురించి తెలిసి, ఆయన ఎలాంటి రుసుములు లేకుండా చక్కటి గది ఇచ్చి, ఆ రోజు కార్య ప్రణాళికను వివరించి, ఆహారం కోసమై ఉచిత టోకెన్లు ఇచ్చాడు. నేను ఒక, రెండు గంటల పాటు విశ్రాంతి తీసుకున్నాను. అక్షరతేరి మహా పూజలో (యోగీ మహారాజ్ చివరిగా విశ్రమించిన స్థలం) పాల్గొన్న తర్వాత అల్పాహారం తీసుకున్నాను.

స్వామినారాయణ మందిరం చూడడానికి ప్రతీ ఒక్కరూ ఇష్టపడతారు. ఈ ఆలయం తన అద్భుత అందంతోనూ ఆధ్యాత్మిక గుభాలింపుతోను సందర్శకులను ఆశ్చర్యపరుస్తుంది. ఇతర దేవాలయాల మాదిరిగా, ఈ ఆలయం కూడా అద్భుతమైన శిల్పాకళాచాతుర్యంతో మనల్ని సంభ్రమాశ్చర్యాలకు గురి చేసే

అద్భుత సృష్టి. ఇది రాజ్కోట్–జునాగఢ్ హైవే మార్గం దగ్గర ఉంది. విశాలమైన ప్రాంగణంలో, ఇంత భారీ స్థాయిలో ఉన్న ఈ నిర్మాణం మనలను మంత్రముగ్ధులను చేస్తుంది. స్వామినారాయణ మిషన్ మరియు వారి పని తీరును చూసి నేను ఎంతో ప్రభావితుడయ్యాను. అక్కడి నుంచి విర్పూర్కు బయలుదేరాను.

**విర్పూర్ జాలారాం బాబా:**

ఆ సాధువుల కథలు విని నేను చాలా ఆశ్చర్యపోయాను. నేను ఇంతవరకూ ఈ సాధువు పేరు కూడా వినలేదు. యాత్రికులకు, మరియు సాధువులకు మాత్రమే సేవ చేయడానికి అంకితమైన ఈ సాధువు పద్దెనిమిదవ శతాబ్దానికి చెందినవారు. ఆయన శ్రీరాముడిని ఆరాధించేవాడట. శ్రీరాముల వారు ఆయన సేవ నిరతిని పరీక్షించి... ఆయనకు ఒక దండం/జోలి ఇచ్చి ఆశీర్వదించారు అని నమ్ముతుంటారు. వాటిని ఇక్కడ భద్రపరిచారు.

ఇక్కడే శ్రీ హనుమంతుల వారు అవతరించారని చెప్పారు. జాలారాంబాబా ఇక్కడే సమాధి చెందారు. అక్కడ ఎక్కడ కూడా ఒక హుండీని కూడా చూడలేదు. కానీ నిరంతరం ఇక్కడ ప్రసాద వితరణ జరుగుతుంది. జాలారాం బాబా చేత ఉంచబడిన పెద్ద పాత్రల్లో గంగా, యమునా, సరస్వతి నదులు ప్రవహిస్తాయి. అలాంటి సాధువులు ఎలా జీవించారో తెలుసుకొని ఆశ్చర్యపోయాను. అక్కడ నుండి అహమదాబాద్ దారి గుండా చోటీలకి బయలుదేరాను.

**చోటిల చాముండి ఆలయం:**

ఈ అమ్మవారి ఆలయం చోటీల పర్వతం మీద ఉంది. ఈ పర్వతం రాజకోటకు 40 కి.మి. దూరంలో అహ్మదాబాద్కు 50 కి.మి. దూరంలో ఉంది. పాదరక్షలు లేకుండా మండుతున్న ఎండలలో ఆ పర్వతాన్ని ఎక్కడం ఇక్కడ అంత సులభ సాధ్యం కానప్పటికీ, ప్రార్థన చేస్తూ పైకి ఎక్కాను. ద్విముఖి (చండి, ముండి) అమ్మవారిని చేరాలంటే వెయ్యి మెట్లను ఎక్కాలి.

సాయంత్రం హారతి అయిన తర్వాత పూజారులు కూడా ఎవరూ గుడి దగ్గర ఉండకూడదని చెప్పుకుంటారు. రాత్రిపూట గుడి బయట పడుకున్న వ్యక్తి కథ గురించి స్థానికంగా చెప్పుకోవడాన్ని విన్నాను. అలా పడుకున్న వ్యక్తి

ఉదయం లేచి చూచేసరికి కొండ దిగువన కనిపించాడు. అమ్మను రక్షించే సింహం ఆలయ పరిసరాలలో ఉంటుందని నమ్ముతారు. కాబట్టి, చాముండి తల్లి ఆలయం దగ్గర సింహం విగ్రహం ఉంది.

చండ మరియు ముండ అనే రాక్షసులు దేవి మహాకాళితో యుద్ధానికి వచ్చినప్పుడు, దేవి వారి తలలను కత్తిరించి అంబికా మాతకు సమర్పిస్తుంది. ఆమె మహాకాళీకి చాముండాదేవిగా పూజించబడుతుందనీ చెప్పబడుతుంది. ఆ తల్లి వెలసిన క్షేత్రం చోటీల.

చోటిలా ఆలయ విగ్రహం స్వయంభూ మూర్తి. మాత ఒకసారి తన భక్తుని కలలో వచ్చి, అతనికి ఒక నిర్దిష్ట స్థలాన్ని తవ్వి ఆమె విగ్రహాన్ని వెలికి తీయాలని ఆదేశించింది. అలానే చేసి చాముండి మాత విగ్రహాన్ని కనుగొన్నాడు. అదే స్థలంలో ఆలయాన్ని నిర్మించారు. నేడు, ఆలయం కూడా అదే స్థలంలో ఉంది. అమ్మవారిదర్శనం చేసుకుని, అన్నప్రసాదాలు తీసుకుని, గాంధీనగర్ అక్షరధామ్ వైపు బయలుదేరాను.

## అక్షరధామ్, గాంధీనగర్:

ఇండోర్ వెళ్లడానికి ఇంకా టైం ఉండడం వల్ల ఇంతకు ముందు దర్శనంలో చూడలేకపోయిన అక్షరధామం జలతరంగిణి చూడాలని నిర్ణయించుకున్నాను. PRO జితేష్ గారు నాకు VIP ద్వారం దగ్గర స్వాగతం చెప్పి చక్కగా ఆదరించారు. నా పక్కన కూర్చుని నా క్షేమ సమాచారాలు అడుగుతూ భారత దర్శన్ దివ్య అనుభవాలు తెలుసుకుని ఆశ్చర్యానందాలకు లోనై, మహంత్ స్వామిజీ గారు నన్ను ఎలా ఆశీర్వదించింది తెలుసుకుని దివ్య అనుభూతికి లోనయ్యారు. వారు స్వామినారాయణ పేరుతో కంకణం మరియు ప్రసాదం నాకిచ్చారు. నాలాంటి సాధారణ సాధకుడుపై వారు చూపించిన ప్రేమాభిమానాలకు నేను ఎంతో విచలితుడిని అయ్యాను.

వెయ్యి మంది టికెట్ తీసుకుని ఒక గంట పాటు ఆనందించే వాటర్ షోకు ఆయన నాకు ఉచిత ప్రవేశం ఏర్పాటు చేసారు. ఒక రెండు గంటల ప్రత్యేక వసతి గృహంలో సేద తీరిన తర్వాత స్వచ్ఛంద సేవకుడు నన్ను జలతరంగిణీ వేదిక దగ్గర వదిలివెళ్లారు.

**సత్చిత్ ఆనంద వాటర్ షో:**

సూర్యాస్తమయములో వెయ్యి మందికి పైగా సందర్శకులు బహిరంగ ప్రదర్శనశాలలో (ఆంఫిథియేటర్) వారి సీట్లలో కూర్చుని సత్చిత్ఆనంద వాటర్ షో ద్వారా జ్ఞానోదయ సంతోషాన్ని అనుభవిస్తారు. తన మృత్యు లోకమునకు వెళ్ళుతున్న సమయములో నిర్భయుడు, నచికేతుడు మృత్యుదేవత అయిన యముణ్ణి ఎదుర్కొని అతని నుండి అమరత్వం పొంది, జ్ఞానాన్ని మరియు శాశ్వతమైన ఆనందాన్ని పొందుతాడు.

సత్చిత్ఆనంద వాటర్ షో ఒక అద్భుతమైన 60 నిమిషాల ప్రదర్శన, ఇది పురాతనమైన కఠోపనిషత్తుకు ప్రాణం పోస్తుంది. 85 Ft వెడల్పు × 60 Ft ఎత్తుగల నీటి తెర, మల్టీ కలర్ల లేజర్లు, వీడియో లైట్ ప్రొజెక్షన్లు, వైర్‌లెస్ లౌడ్ స్పీకర్లతో, నీటి అడుగున మంటలతో వాటర్ జెట్లు, స్వర సమ్మేళనాలతో సందర్శకులను ఆకర్షిస్తుంది. ప్రత్యక్ష నటీనటుల మరియు జ్ఞానోదయాన్ని కలిగించే ప్రయాణంలోకి మనలను తీసుకువెళ్తారు.

స్వామినారాయణ సంస్థలో ఉన్న ప్రేమవతి క్యాంటీన్లో రుచికరమైన ఆహారాన్ని సరసమైన ధరలకు అందజేస్తాయి. నేను త్వరగా ప్రసిద్ధిగాంచిన స్వామినారాయణ కిచిడీ పెరుగు తీసుకొని ఇండోర్ తీసుకువెళ్లే ట్రావెల్ ఏజెన్సీకి ఒక గంట ప్రయాణించి చేరుకున్నాను.

వారం రోజుల పాటు నాతో పాటు ఉన్న క్యాబ్ డ్రైవర్ బాబుకి కృతజ్ఞతలు తెలుపుకున్నాను. అతను నిజంగా నన్ను చాలా బాగా చూసుకున్నాడు, నేను కూడా అతనిని అలాగే చూసుకున్నాను. గుజరాత్‌కి వెళ్లేవారు అతని సేవలను తీసుకోవచ్చని సిఫారసు చేస్తున్నాను (63513 11979). గుజరాత్ ప్రయాణ ఖర్చులు అన్నింటినీ నా ప్రియ స్నేహితుడు రాంప్రసాద్ సుంకు (ముంబై) చూసుకున్నారు.

# మధ్యప్రదేశ్

## జూన్ 24, 2019

ఇండోట్రావెల్స్ క్యాబ్ డ్రైవర్ జిత్, ఇండోర్ బస్టాండ్ నుండి నన్ను తీసుకెళ్లడానికి వచ్చాడు. అతను హీరోలా ఉన్నప్పటికీ, చాలా భక్తి విశ్వాసం ఉంది. అతను నన్ను ఓంకారేశ్వర్‌కు తీసుకెళ్లే 12 గంటల ప్రయాణంలో నా గురించి చాలా శ్రద్ధ తీసుకున్నాడు. నాకు ఎలాంటి ఇబ్బంది లేని ప్రయాణం అందించాడు. మార్గమధ్యంలో నర్మదా ప్రవాహం దగ్గర ఉన్న ఒక అందమైన ప్రదేశంలో కారును ఆపి, నేను అక్కడ చల్లని నీటిలో స్నానం చేసి, ఆ రోజు ప్రయాణానికి సిద్ధమయ్యాను.

**ఓంకారేశ్వర జ్యోతిర్లింగం:**

ఈ ఆలయం శివుడికి అంకితమైనది. భారతదేశంలో ఉన్న 12 పవిత్ర జ్యోతిర్లింగాలలో ఇది ఒకటి. మందాత ద్వీపకల్పంలో హిందూ అక్షరం "ఓం" ఆకారంలో ఇది ఉందని చెబుతారు. నర్మదానది తీరం వద్ద ఉన్న అందమైన ఓంకారేశ్వర దర్శనం చేసుకున్నాను. ఈ పురాతనమైన ఆలయాలు కొండల మీద, నదుల ఒడ్డున, దట్టమైన అరణ్యాలలో మరియు ఇంకా చేరుకోలేని ప్రదేశాలలో ఉన్నాయని అనిపిస్తుంది. బహుశా ఆ భగవంతుడు తన దయ కొరకు భక్తులు కష్టపడి, తన దగ్గరికి రావాలని అనుకుంటున్నారేమో అనిపిస్తుంది.

ప్రతి ఒక్క ఆలయం కూడా ప్రత్యేక స్థలాలలో, దిశలో, కళాకృతులతో, శిల్ప సంపదలతో, చరిత్రతో మరియు నదులతో అనుసంధానించబడినట్టు చూడవచ్చు. భారతీయ ఆరాధన స్థలాలన్నీ ఈ దేశ సామాజిక, ఆర్థిక, నాగరిక, భౌతిక, మానసిక, విద్యా, ధార్మిక మరియు ఆధ్యాత్మికపరంగా, ప్రగతి కోసం,

ప్రజల కోసం ఎన్నో ఏళ్ల నుంచి ఉన్నాయని నా ప్రగాఢ విశ్వాసం.

**మహేశ్వరం:**

నేను ఇంతకుమునుపు ఆలయాల పునర్నిర్మాణం గురించి మాట్లాడు తున్నప్పుడు రాణి అహల్యాబాయి/దేవి గురించి ప్రస్తావించి ఉన్నాను. ఆ రాణి/యోగి/భక్తురాలి గురించి నేను ఇంకా తెలుసుకోవాలని అభిలాషించాను. శతాబ్దాల క్రితం ఆవిడ నివసించి, పరిపాలించిన రాజ్యమైన మహేశ్వరాన్ని దర్శించినందుకు నేను ఎంతో పొంగిపోయాను.

ఈ మహిళ గురించి నేను తెలుసుకున్న కొన్ని స్ఫూర్తిదాయకమైన వాస్తవాలను నేను కింద పొందుపరిచాను.

**రాజమాత రాణీ అహల్యాబాయి:**

ఎనిమిది ఏళ్ల వయసుకి ఆవిడ వివాహం జరిగింది. ఆవిడ యుద్ధ నైపుణ్యాలన్నీ తన అత్తగారింట్లో నేర్చుకుంది. తన చిన్నతనం నుంచే నాయకురాలిగా ఉంది. తన భర్త చనిపోయినప్పుడు సతీసహగమన ఆచారాన్ని తను పాటించలేదు. మాల్వా రాజ్యానికి రాణి అయ్యింది. తను స్వయంగా తన రాజ్యాన్ని సంరక్షించింది. తన స్వంత కొడుకుకే అతను చేసిన తప్పులకు దండన విధించింది.

17వ శతాబ్దంలో 30 ఏళ్ల తన పరిపాలనలో రాజ్యము యొక్క రూపురేఖలను మార్చి వేసింది. భారతీయ పురాతన ఆలయాల పునర్నిర్మాణానికి అండగా నిలబడ్డారు.

తన రాజ్యంలోని వస్త్ర పరిశ్రమకు చేయూతను ఇచ్చి ఆదరించారు. వేల మందికి మహిళలకు సాధికారత మార్గాన్ని చూపించి, తద్వారా అక్కడ నేసిన వస్త్రాలకు దేశవ్యాప్తమైన పేరు, ప్రఖ్యాతి తీసుకువచ్చారు. తన జీవిత సర్వస్వాన్ని ఆవిడ శివుడికి అంకితం చేసారు. అక్కడ పొందుపరిచిన శిలాశాసనాలను ఆలయం గోడలపై ఉన్నవి చూస్తే, అసలు ఆవిడ రాణిగా ఎలా ఉండేవారో తెలుసుకోవచ్చు.

"ఆ భగవంతుడు నాకు ఒక బాధ్యతను అప్పగించాడు... నేను అతని

ఆదేశాలను పాటించాలి. నా ప్రజలను సంతోషంగా, సురక్షితంగా ఉంచడం నా కర్తవ్యం. నా సామర్థ్యం, నా శక్తి ఆధారంగా నేను చేసిన పనులకు నేను జవాబుదారిగా ఉంటాను. నేను ఆ భగవంతుడికి సమాధానం చెప్పాలి."

"ఇక్కడ ఉన్నది ఏదీ నాదికాదు. ప్రతిదీ ఆ భగవంతుడికి చెందినది. నేను దానిని తిరిగి ఇవ్వాలి. ఇది నా బాధ్యత, విధి. తదనుగుణంగానే నేను వ్యవహరించాలి."

ఆ కోట నుంచి, ఆమె జ్ఞాపకాల నుంచి, అద్భుతమైన ఆ శివాలయం నుంచి, నర్మదా నది నుంచి, మహేశ్వరంనుంచి నేను ఎంతో ప్రేరణను పొందాను. అందుకేనేమో ఈ ప్రదేశమే మహేశ్వరమైంది.

## ఉజ్జయినీ మహాకాళేశ్వర్ - జ్యోతిర్లింగం:

అధిష్టాన దేవత దక్షిణామూర్తి. ఇక్కడ ఉన్న శివలింగం దక్షిణాభిముఖంగా ఉంటుంది. ఇది పన్నెండు జ్యోతిర్లింగాలలో ఒకటి. మహాకాళేశ్వరంలో మాత్రమే కనిపించే తాంత్రిక శివనేత్ర సంప్రదాయం ఇక్కడి ప్రత్యేకత.

మహదేవుని విగ్రహం మహాకాళీ మందిరం పైన ఉన్న గర్భగుడిలో ప్రతిష్ఠించబడింది. మూడవ అంతస్తులోని వినాయక, పార్వతి, నాగచంద్రేశ్వర విగ్రహాలు నాగపంచమి రోజున మాత్రమే దర్శనానికి తెరిచి ఉంటాయి.

ఆలయంలో ఐదు అంతస్తులు ఉన్నాయి. వాటిలో ఒకటి భూగర్భంలో ఉంది. ఈ ఆలయం ఒక సరస్సు సమీపంలో భారీ గోడలతో కట్టబడిన ఒక విశాలమైన ప్రాంగణంలో ఉంది. ఆలయం శిఖరం శిల్పకళా సొగసులతో అలంకరించబడి ఉంటుంది. గర్భగుడిలోకి వెళ్ళే మార్గంలో దీపాలు వెలుగుతూ ఉంటాయి. ఇక్కడ దేవుడికి సమర్పించే ప్రసాదం ఇతర పుణ్యక్షేత్రాల మాదిరిగా కాకుండా తిరిగి సమర్పింపబడుతుంది అని నమ్ముతారు.

మహాకాళేశ్వరుడు మహాపరమేశ్వరుడు అయ్యాడు. బ్రహ్మ, విష్ణు, శివ, రాజావిక్రమాదిత్య, అవంతి, సతీదేవి, అహల్యాదేవి, ఆదిశంకరాచార్య, కాళిదాస, భర్తృహరి, మొదలగువారు ఈ ఆలయానికి సంబందించిన అపూర్వమైన కథలను మనకు జ్ఞప్తికి తెస్తాయి. ఆ రోజు సోమవారం ఆలయమంతా రద్దీగాఉంది. ప్రత్యేక దర్శనం కూడా రద్దీగా ఉంది. అసలు ఉజ్జయినికి వెళ్ళే ప్రధాన

రహదారులలో కూడా దైవదర్శనం కోసమై వెళ్ళేవాళ్ళు కోకొల్లలుగా కనిపించారు.

మధ్య ప్రదేశ్‌లోని అన్ని ప్రదేశాల్లో కూడా శివుడుని వారి ఇలవెల్పులా చూస్తారట. సోమవారం వచ్చిందంటే అక్కడి వాళ్లు మహాకాళేశ్వరుడిని తమ ఇంటి అల్లుడిలా చూస్తారన్నా అతిశయోక్తి కాదు. సాయంకాలం ఇండోర్ వెళ్ళే కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని నాతోపాటు వచ్చిన డ్రైవర్ చెప్పాడు. స్వామీ, మీరు ప్రత్యేక దర్శనం టికెట్ తీసుకుని వెళ్ళండి. తనకి కూడా నేనే టికెట్ తీయాలేమో అన్న భావన కలిగింది. లేదంటే లేట్ అవుతుంది అని చెప్పాడు. అతను హుందాగా ప్రత్యేక టికెట్ తీసుకుని వెళ్ళిపోయాడు. కానీ నేను అలా అన్నిచోట్లా ప్రత్యేక దర్శనాలకి డబ్బులు వెచ్చిస్తే ఎలా అన్న భావనతో... ఆలయ కార్యనిర్వాహణ అధికారి కార్యాలయానికి వెళ్ళిన భారతదేశ యాత్ర మరియు నా పేరు చెప్పి... చేతులు జోడించి దర్శనం ఇప్పించమని అడిగాను.

అయ్యా మీలాంటి వాళ్లకు సేవ చేయలేకపోతే ఇంకేమున్నది మేమంతా ఎందుకు అంటూ... ఆ నిర్వహణ అధికారి, ఆలయ సిబ్బందిని పిలిచి, నన్ను జాగ్రత్తగా దర్శనానికి తీసుకువెళ్ళమని పురమాయించారు. అలాగా మూడు గంటల తర్వాత లభించే దర్శనం 10 నిమిషాల్లోనే అయింది, గర్భగుడిలో అభిషేకము, ప్రార్థనలతో సహా. శ్రీ శంకరాచార్యుల వారితో ముడిపడి వున్న జ్యోతిర్లింగ క్షేత్రాలలో వారి తాలూకా జ్ఞాపకాలనూ కూడా సందర్శన చేస్తున్న నాకు...

దర్శనం ముగించుకుని బయటికి వస్తున్నప్పుడు ఆలయ సిబ్బంది శంకరాచార్యుల వారి గుడి గురించి చెప్పారు. అప్పుడు... అయ్యో చూడటం మరచిపోయానని బాధపడుతుంటే... ఆయన, స్వామి! ఏమి పర్వాలేదు... రండి అనీ మళ్ళీ నాకు ఆలయంలోకి తీసుకువెళ్ళి భగవద్ పాదుల వారిని చూపించారు. ఆతరువాత ఫోటోలకు అనుమతి లేని ఆలయంలో... వారు కొన్ని ఛాయా చిత్రములు కూడా తీసి... మహాకాళేశ్వరుడి అనుగ్రహ ప్రసాదము అందించారు. చాలా అలౌకిక ఆనందము అనిపించింది. అక్కడి దివ్యమైన విశేషాలు కంటూ వింటూ వుంటే అలాగా చాలా సమయం గడిపాను.

మధ్యప్రదేశ్ యాత్ర ముగిసింది. ఇండోర్‌లో సాయంకాలం ఏడు గంటలకి అజ్మీర్ (రాజస్థాన్) వెళ్ళే ప్రైవేట్ కోచ్‌లో నన్ను ఎక్కించి టాక్సీడ్రైవర్

వెళ్ళిపోయాడు. బస్టాండుకి వెళ్ళే మార్గంలో ఉన్న రంజిత్ ఆలయాన్ని దర్శించుకున్నాను. తీరా బస్సులో కూర్చున్న తరవాత... నా కాళ్ళకు ఉండాల్సిన అతి ఖరీదైన స్కెచర్స్ పాదరక్షలు లేవని గుర్తించాను. చాలా ఆలోచించిన తరవాత గుర్తొచ్చింది వాటిని కార్లోనే వదిలేసాను అని. డ్రైవర్‌కి ఫోన్ చేస్తే... అయ్యో స్వామీజీ, అవును మీ షూ సీటు క్రింద వున్నాయి... క్షమించండి నేను చూడలేదు. అని ఒక 10 నిమిషాలలో మళ్ళీ వచ్చి వాటిని నాకు అందించి నమస్కారం చేసి వెళ్ళిపోయాడు.

# రాజస్థాన్

## జూన్ 25, 2019

ఇండోర్ నుంచి 8 గంటల ప్రయాణం తరువాత నేను ఉదయం ఆరు గంటలకు అజ్మీర్ చేరుకున్నాను. రైల్వే స్టేషన్‌కి దగ్గర్లో ఉన్న ధర్మశాల గురించి కనుక్కోవడానికి ప్రయత్నించాను, కాల కృత్యాలను తీర్చుకోవడానికీ డబ్బులు వెచ్చించడం ఇష్టంలేక. దగ్గరలో ఉన్న ధర్మశాలలో 150 రూపాయలు చెల్లించి 8 గంటలకు అంతా నేను బయటపడ్డాను.

**అజ్మీర్:**

ఈ పట్టణం అజేయమేరు (అజేయమైన కొండ)గా, శాకంబరీ చౌహా మన (చౌహాన్) అధినేత, అజయ్ రాజా I, లేదా అజయ్ రాజా II ద్వారా నిర్మింపబడినది. పన్నెండవ శతాబ్దం దాకా చౌహాన్ల రాజధానిగా ఉంది. ఆరావళి పర్వత ప్రాంతంతో చుట్టబడి ఉంది అజ్మీర్. హిందూ పురాతన యాత్ర నగరమైన పుష్కర్ (17 కిమీ) ను దర్శించడానికి ఇది మొదటి అడుగుగా వుంది, బ్రహ్మ దేవుడి ఆలయం ఇక్కడ ప్రసిద్ధి పొందింది. కేంద్ర ప్రభుత్వ వారసత్వ సంపదగా గుర్తించిన ఆలయాలలో ఇది ఒకటి. (హృదయ యోజన స్మార్ట్ సిటీ మిషన్).

రోడ్డు మీదకి వెళ్ళగానే జైసింగ్ (65 సంవత్సరాలు) అనే ఒక ఆటో డ్రైవర్‌ని మాట్లాడుకున్నాను. అటు నుంచి రైల్వే స్టేషన్‌కి వెళ్ళి ఆ రోజు ప్రయాణానికి కావలసిన సాధనాల కోసం ప్రయత్నించాలనుకున్నాను కాని జైసింగ్ అజ్మీర్, పుష్కర్ నగరాలలో చూడవలసిన ప్రదేశాల ప్రయాణంలో తోడుగా ఉంటానని చెప్పాడు, 2500 క్యాబ్‌కి అయ్యే ఖర్చు వెయ్యి రూపాయల నామమాత్రపు ఖర్చుతోనే పూర్తి చేయొచ్చని చెప్పాడు. వెనువెంటనే సంతోషంగా అతని ఆటోను అద్దెకి తీసుకున్నాను.

రోజు రోడ్ల మీద వుండటం వలన వేసుకునే దుస్తులు అన్నీ కూడా చాలా మరకలు అయిపోయి... నేను శుభ్రం చేసుకునే పరిస్థితుల్లో లేకుండా పోయాయి. డ్రై క్లీనర్స్‌కు ఇస్తే ఒక్కో జతకు ఎక్స్‌ప్రెస్ వాష్ సుమారు 200 అన్నాడు, అది కూడా 2 రోజులకి ఇస్తాము అంటారు. అంత సమయం... వనరులు రెండూ నా దగ్గర లేవు.

ఇక జైసింగ్‌తో మాట్లాడి అక్కడే ఉన్న ఒక చాకలితో మొత్తం నా బట్టలన్నింటిని కలిపి కేవలం 100 రూపాయలకే ఉతికేలా మాట్లాడాను. అది కూడా అదే రోజు సాయంత్రం ఇవ్వాల్సిందిగా చెప్పాను. అదే డ్రై క్లీనింగ్ దగ్గరైతే వెయ్యి రూపాయలు ఖర్చు అయ్యేది. ఎంతోమందిని నాకు ఇచ్చిన ధన వనరులను ఒక్క పైసా కూడా వృథా చేయొద్దని నా భావన.

**ఖాజా గరీబ్ నవాజ్:**

ఇక, మేము మొదటిగా అజ్మీర్ దర్గా షరీఫ్ ని దర్శించుకున్నాము. అజ్మీర్ దర్గా షరీఫ్ 13వ శతాబ్దానికి చెందిన ఒక ప్రముఖ సూఫీ మందిరం (దర్గా). ఇది సుప్రసిద్ధ సూఫీ సెయింట్ మొయినుద్దీన్ చిష్టీకి అంకితమైంది. ఈ మందిరంలో మొయినుద్దీన్ చిష్టీ సమాధి (Maqbara) ఉంది.

ఆయన 114 సంవత్సరాలు జీవించి చివరకు అజ్మీర్ వద్ద సమాధి చెందారు. ఈ పవిత్ర స్థలం గురించి తెలుసుకోదగిన ముఖ్యమైన అంశాలు క్రింద పేర్కొంటున్నాను.

1. దేశంలో ఉన్న అనేక ముస్లిముల పవిత్ర స్థలాలలో ఇది ఒకటి.
2. 1332లో మహమ్మద్ బిన్ తుగ్లక్ దీనిని మొదటిగా దర్శించారు.
3. దర్గాలో ఉన్న స్మారక కట్టడాల్లో ఒకటి అయిన జహర్లా, ఒకప్పుడు అక్కడ ముఖ్యమైన నీటివనరు. ఇప్పటికీ ఇక్కడ ఆచారాల నిర్వహణకు ఈ నీటివనరునే ఉపయోగిస్తున్నారు.
4. మొగల్ శిల్పకళా చాతుర్యానికి ఒక అందమైన రూపకల్పనగా ఉన్న షాజహాన్ మసీదు లేదా జుమ్మా మసీదులో ఖురాన్లోని 33 పద్యాలు 99 అల్లా పేర్లతో చెక్కబడ్డాయి.
5. ప్రవేశ ద్వారం దగ్గర రెండు పెద్ద దేగి సాలు (పాత్రలు) బియ్యం గింజలు,

కుంకుమ పువ్వు, డ్రై ఫ్రూట్స్‌తో నింపబడి వండడానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ ఆహారం రాత్రిపూట, ఉదయపు ప్రార్థన తర్వాత తబురక్ (ప్రసాదం)గా పంచుతారు. చిన్న పాత్రలో 12.7 కేజీలు, పెద్ద పాత్రలో 31.8 కేజీల అన్నం వండుతారు. ఆ డేకిసాల చుట్టుకొలత పది అడుగులు ఉంటుంది. అందులో ప్రసాదం పంచడం వల్ల భక్తులకు అక్షయం అవుతుందని ముస్లింల నమ్మకం.

6. పశ్చిమాన ఉన్న అందమైన వెండి జన్నత్ ద్వారాలు సంవత్సరానికి నాలుగు సార్లు తెరుస్తారు. వార్షిక పండుగ ఉర్స్ మరియు ఈద్ అప్పుడూ, రెండుసార్లు ఖవాజా సాహెబ్ పీర్త్ ఉర్స్ అప్పుడే తెరుస్తారని విన్నాను.
7. సూఫీ సెయింట్ మొయినుద్దీన్ చిష్తీని స్మరించుకోవడానికి చేసే వర్ధంతి నాలుగు రోజుల వార్షిక పండగ అజ్మీర్ శరీఫ్‌లో చేస్తారు. ఆయన 114వ సంవత్సరంలో సమాధి చెందే ముందు నాలుగు రోజుల పాటు తనను తాను ఒక గదిలో బంధించుకుని ప్రార్థనలు జరిపారట.
8. అజ్మీర్ శరీఫ్‌లో ఉన్న అక్బర్ మసీదును చక్రవర్తి తన కొడుకు జహంగీర్ పుట్టుకకు కృతజ్ఞతగా నిర్మించారట. ఇది ఇప్పుడి పిల్లలకి మతపరమైన విద్య నేర్పే ఖురాన్ విద్యా సంస్థగా విరాజిల్లుతుంది.
9. ఆగ్రా ఫోర్ట్ నుండి అక్బర్ కాలినడకన వచ్చేవారట. అజ్మీర్‌లో తన సౌకర్యార్థం ఒక కోటను కూడా కట్టించారట. కానీ దానిని ఇప్పుడు స్టేట్ మ్యూజియంగా మార్చారు.
10. ఎవరైతే అజ్మీర్ దర్గాలో స్వచ్ఛమైన హృదయంతో ప్రార్థన చేస్తారో వారి కోరికలు తీర్చబడతాయని నమ్ముతారు.

అసలు ఈ విషయాలు ఏమీ తెలియకుండానే నేను ప్రధాన ప్రవేశ ద్వారంలోకి అడుగు పెట్టాను. అక్కడ దర్గా రోడ్లన్నీ రద్దీగా ఉన్నాయి. వేలకొద్దీ ముస్లిముల భక్తి శ్రద్ధలతో అక్కడే రోడ్ల మీద నిరీక్షిస్తూ ఉన్నాను. మన పుణ్యక్షేత్రాలలో ఎలా అయితే జనాలు ఎక్కడ పడితే అక్కడ ఉంటారో అలాగా ఉంటుంది ఆ ప్రాంతం అంతా కూడా. అత్యంత పెద్దగా ఉన్న ప్రవేశ ద్వారం గుండా లోనికి వెళ్లే ప్రయత్నం చేస్తున్నా... అసలు ఆ ప్రాంతంలో విషయాలు దృశ్యాలు చూసుకుంటూ నన్ను నేను మరచిపోయాను. నా పక్కన నడుస్తున్న

ఒక ముస్లిమ్ పెద్దని ప్రవేశ ద్వారంలో ఉన్న పెద్ద దేగసాల గురించి చాలా మామూలుగా అరా తీశాను. అంతే, ఆయన చాలా ఆత్మీయంగా నా చేతులను తన చేతుల్లోకి తీసుకుని తలని దస్తీతో కవర్ చేసుకోమని చెప్పారు.

ఏదో అంతకు ముందు నేను తెలిసినట్లుగా, ఒక ఆప్తుడిలాగా దగ్గరుండి మసీదు మొత్తం నాకు చూపించారు. ఆయన ప్రేమాభిమానాలు మా బాబాయ్ చూపించినట్లుగా ఉన్నాయి. ప్రతి ముఖ్య సమాచారాన్ని అందించి చివరిగా సమాధి దగ్గర తల వంచి ప్రార్థన చేయమని చెప్పారు. నేను వెనువెంటనే సమస్తలోకా సుఖినోభవంతు అని ప్రార్థించాను. ఆ ప్రార్థనలను విన్న ఆయన, సమాధి మీద ఉన్న చద్దర్‌తో నన్ను సత్కరించారు. తన క్యాబిన్‌లోకి తీసుకుని వెళ్లి ఆదరించారు. అప్పుడే నేను ఆయనని సయ్యద్ మహమ్మద్ నజీంహాష్మీ (75) గా గుర్తించాను. ఆయన అక్కడి ప్రధాన ఫకీరులలో ఒకరని తెలిసింది. ప్రేమపూర్వకమైన తండ్రిగా ఆయన నన్ను ఆదరించారు.

అభయ ద్వారా చేసే మంచి పనులకి నన్ను వెన్నుతట్టి అభినందించారు. ఆయన అన్నాడు ఈ స్థానం పరమపవిత్రమైనదినీ, నేను ప్రార్థించిన తీరు ఆయనను ఎంతో కదిలించినది అని చెప్పాడు. నేను ఆయన ప్రేమ ఆదరణలకి మంత్రముగ్ధుణ్ణి అయ్యి ఒక భావాతీత స్థితిలో ఉండిపోయాను. నాకు తేనీరు తెప్పించి ఇచ్చారు. నా బాగోగుల్ని అడిగారు. ఆయన నా చేతికొక పవిత్ర దారాన్ని కట్టారు. స్వామి నారాయణ్ ఆలయ సందర్శనంలో కూడా ఒక స్వచ్ఛంద సేవకుడు ఒక పవిత్ర దారాన్ని నాకు కట్టారు. నేను ఈ రెండు పవిత్ర దారాల మధ్య ఎలాంటి తేడాను గమనించలేదు.

ఇదేకాదు, ఈ భారతదేశంలోనే నేను ఎక్కడికి వెళ్ళినా, ఎవరి మతపర నమ్మకాలూ వారికి ఉన్నప్పటికీ ఈ క్రింది విషయాల్లో ఎలాంటి భేదాలను గమనించలేదు.

1. యాత్రాస్థలముల పట్ల ధృడమైన నమ్మకము
2. ఆచార విశ్వాసములు
3. సర్వజన సంక్షేమ ప్రార్థనలు
4. భగవంతుడిపట్ల ప్రేమ
5. పవిత్ర జలాలు

6. పుష్పాలు మరియూ పూలమాలలు
7. సుగంధ పరిమళాలు
8. నిస్వార్థ సేవ
9. ప్రసాదం
10. అద్భుతాలు
11. నైతిక విలువలు
12. తీర్థయాత్రలు
13. దీక్షలు, ఉపవాసాలు
14. అర్పణ / సమర్పణ

ఇలానే నేను పట్టిక వ్రాసుకుంటుంటే భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారు చెప్పిన పద్య సూక్తిని గుర్తు చేసుకున్నాను.

మతములన్నియు చేరి మంచినే బోధించు ।
తెలిసి మెలగ వలయు తెలివి తోడ ॥
మతులు మంచివైన మతమేది చెడ్డది ।
వినుము భారతీయ వీర సుతుడా ॥

అజ్మీర్‌ను దర్శించుకునే ముందు నేను షాహిద్ స్మారకాన్ని, గాంధీభవన్, క్లాక్‌టవర్, అన్నసాగర్ మరియు కొన్ని ముఖ్య ప్రదేశాలను దర్శించాను. కాని అన్నింటిలోను మూడు ప్రదేశాలు నాకు అద్భుతమైన, అమూల్యమైన జ్ఞాపకాలను అందించాయి. ఆ విశేషాలను మీతో పంచుకుంటున్నాను.

**సోనీ జీ కిన జియాన్:**

సోనీ జీ కిన జియాన్ వెండి, బంగారు కళాకృతులతో అమూల్యమైన జాతిరత్న తోరణాలతో ఉంది. ఈ ఆలయం 1865లో నిర్మించబడి, మొదటి తీర్థంకరుడు అయిన ఆదినాధుడికి అంకితం చేయబడినది. జైన దిగంబర శాఖకు చెందిన ఈ ఆలయం రెండు అంతస్తులతో ఉంది. ఆలయంలో ఒక భాగం ఆదినాధుని విగ్రహాన్ని పూజించే స్థలంగాను, మిగితాది ఒక మ్యూజియంగా చేయబడింది. అందులో ఒక విశాలమైన గది బంగారంతో నిర్మించబడిన

అంతర్గత మ్యూజియం ఆదినాథుని ఐదు దశల జీవితం అంశంగా మలచబడింది. సుమారు 3,200 చదరపు అడుగుల స్థలంలో అంతర్గత భాగాలు బెల్జియం స్పెయిన్ గ్లాసుతోను, మినరల్స్ కలర్ పెయింటింగ్స్, టోరీ, స్పెయిన్ గ్లాసు వర్క్‌తోను అలంకరించ బడున్నాయి.

## స్టేట్ మ్యూజియం:

వివిధ రకములైన పవిత్ర గ్రంథాలు, ఆయుధాలు, వస్త్రధారణలు, కళాకృతులకు ఈ మ్యూజియం పరిమితమైనది. శిల్పకళా చాతుర్యం, ఆయుధాలు ఉంచిన స్థలాన్ని నేను ఎంతో ఇష్టపడ్డాను. అద్భుతమైన మౌలిక సదుపాయాలు ఉన్న ఆ కోటలో ఢిల్లీ చక్రవర్తి విశ్రాంతి తీసుకొనే దివాన్ ఈఖాసు ఉంది. పచ్చటి తోటలతో చుట్టబడి పొడవైన గదులతో, సేవకులు లేదా ఇతర మంత్రుల ఇళ్ళతో ఉన్నది. బహుశా అజ్మీర్‌లో ఉన్న ఖ్వాజా మొయినుద్దీన్ దర్గాను దర్శించుకునే సమయంలో అక్బర్ చక్రవర్తి విడిది కోసం చేసిన విశ్రాంతి మందిరం అయినందువల్ల నేమో మిగతా కోటలలో ఉన్నంత అద్భుతమైన కళాకృతులు ఇక్కడ అంతగా కనిపించలేదు. ఏదేమైనా, మొగలై శిల్పకళల్ని ప్రశంసించకుండా ఉండలేము.

## నరేలి జైన్ ఆలయం:

అజ్మీర్ పొలిమేరలో ఉన్న ఈ అందమైన ఆలయం. ఈ ఆలయ దర్శన కోసం సొంత కారుని గానీ క్యాబ్‌ని కానీ తీసుకొని వెళ్ళవలసి ఉంటుంది. ఈ ఆలయాన్ని పగలు దర్శించుకోవచ్చు, కానీ సాయంకాలపు వేళలో దర్శించుకుంటే చాలా బాగుంటుంది. ఆ పరిసరాలు ప్రశాంతమైన అనుభూతిని ఇస్తాయి. ఆలయం రద్దీ ఉండదు, పూజ ప్రసాదాలు ఉండవు. ఈ కొండ మీద ఉన్న అనేక ఆలయాలను చూడాలనుకున్నవారు చేతిలో తగినంత సమయం ఉంచుకొని సూర్యాస్తమయానికి చాలాముందే బయలుదేరితే అన్నింటినీ చూడవచ్చు. ఈ ప్రదేశాన్ని చూడటానికి నాకు ఒక ఆటోరిక్షా సరిపోయింది. ఎంత అద్భుతమైన ప్రదేశం! అందమైన పరిసరాలతో, పరిశుభ్రంగా ఉన్న ఆ ప్రదేశం నన్ను ఎంతో ఆకట్టుకుంది. ఈ ప్రదేశం మనశ్శరీరాలను అద్భుతంగా

సేద తీరుస్తుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు.

స్వర్ణదేవాలయంగా గుర్తించబడ్డ ఈ ఆలయపు మధ్య హాలు బంగారు, వెండి కళాకృతులతో అలంకరించబడి ఉంది. షోకేస్ చెక్కలకి బంగారు పూత పూయబడిన గాజు నగిషీలతో చిత్ర కళలతో నిండి ఉంది.

జైన దిగంబరుల పవిత్ర తీర్థముగా నిలిచింది ఈ నరేలి జైన్ దేవాలయం. అందమైన వాస్తు, సాంప్రదాయ, పురాతన, సమకాలీన, అధునికతల మేలుకలయికతో ఉన్న క్లిష్టమైన ఆ రాతి చెక్కడాలను చూసి నేను మంత్రముగ్ధుడిని అయ్యాను. పాలరాయితో చేయబడిన ఈ ఆలయం కోరికలన్నింటినీ నెరవేర్చి శ్రేయస్సును తెచ్చిపెడ్తుంది అని నమ్ముతారు. ప్రధాన ఆలయంలో గురు ఆదినాథ్‌జీ భారీవిగ్రహం, 24 చిన్న దేవాలయాలు మొదటి అంతస్తులో ఉన్న కొండపై వరుసలో ఉన్నాయి. పైనుంచి ఆ దృశ్యం అద్భుతంగా, ఉత్కంఠ భరితంగా ఉంటుంది. ఇది ఆరావళి పర్వత శ్రేణులలో ఆర్కే మార్బుల్స్‌కు చెందిన మార్బుల్ దిగ్గజం శ్రీ అశోక పటానిచే నిర్మింపబడింది. ఈ దర్శనాల మధ్యలోనే నేను రాజస్థానీ మిఠాయిలు, లస్సీ, మజ్జిగ, జల్జిర మొదలైన వాటిని ఆస్వాదించాను.

ఆ తరువాత అజ్మీర్ నుంచి 17 కిలోమీటర్ల దూరంలో ఉన్న పుష్కర క్షేత్రానికీ బయలుదేరాను.

జైసింగ్, ఆటో డ్రైవర్ నన్ను పుష్కర్ తీసుకువెళ్ళాడు. ఆదిశంకరా చార్యులు తన దిగ్విజయ యాత్రలో ఈ స్థలాన్ని దర్శించారు. ఉన్న సమాచారం ప్రకారం పుష్కర, అజ్మీర్లను మాత్రమే ఆయన దర్శించారని చెప్తారు. అందుకే నేను రాజస్థాన్‌లో అబూరోడ్, ఓంశాంతి, దిల్వాడ జైన్మందిర్, గురు శిఖర్, మౌంట్ అబూలనే కాకుండా వీటినీ కూడా దర్శించాను.

**పుష్కర్:**

అజ్మీర్‌కి వాయువ్యంగా నేలమట్టం నుండి 500 మీటర్ల ఎత్తులో ఉన్న పుష్కర్ అనేకమైన పురాతన దేవాలయాల్లో ఒకటి. మూడు వైపులా కొండలతో చుట్టబడినది. నాగ అంటే పాము అని అందుకే ఈ పర్వత శ్రేణులను నాగావళి అన్నారేమో. ఇది అజ్మీర్ మరియు పుష్కరాల మధ్య సహజ సరిహద్దుగా ఉంది. పురాణాల ప్రకారం, సృష్టికర్తగా విశ్వసించే బ్రహ్మ ఒక కమలాన్ని నేలపైకి

జారవిడిచారట. అది వెంటనే ఒక సరస్సుని సృష్టించింది.

ఆయన అప్పుడు ఆ ప్రాంతానికి ఆ పువ్వు పేరు పెట్టాలని నిర్ణయించుకున్నారు. బ్రహ్మదేవుడికి ఈ ప్రపంచంలో ఉన్న ఏకైక ఆలయాం ఈ పుష్కర్. ముక్తి సంపాదించడానికీ ఇది అంతిమ యాత్రగా హిందువులు అందరూ నమ్ముతారు. హిందువుల గ్రంథాల ప్రకారం, పవిత్ర పుష్కర్ సరస్సును తీర్థ రాజుగా అన్నీ పుణ్యక్షేత్రాలకు రాజుగానే అభివర్ణిస్తారు. ఏయాత్ర కూడా పుష్కర్‌లో మునక వేయకుండా పూర్తిగా కాదు. 52 ప్రత్యేక స్నాన ఘట్టాలతోను, నాలుగు వందల ఆలయాలతోనూ చుట్టబడి చూసేవారి దృష్టిని నిజంగానే ఆకట్టుకునే అద్భుతమైన దృశ్యం ఈ పుష్కర్ తటాకం పరిసరాలు.

**సావిత్రి మహా మందిరం:**

పుష్కరక్షేత్రంలో పర్వత శిఖరంపైన ఉన్న ఈ ఆలయం వద్ద నుంచి మొత్తం పుష్కర్ పట్టణాన్నీ మరియు చుట్టుపక్కల ఉన్న లోయలను చూడవచ్చు. నేను రోడ్డు మార్గం ద్వారా ఈ కొండకి వెళ్లాను.

**హట్పటేశ్వర్ ఆలయం:**

12వ శతాబ్ద కాలం నాటి ఈ దేవాలయం శివుడికి అంకితం చేయబడినది. ఈ ఆలయం భూగర్భంలో నిర్మించబడింది. క్లిష్టమైన హేమంత్ పంత్ నిర్మాణ శైలిలో ఉన్న శిల్పాలు ఈ ఆలయానికి అద్భుతమైన రూపాన్ని అందిస్తాయి.

**మిరాజ్ సినిమాస్‌లో భరత్ మూవీ, అజ్మీర్:**

ఢిల్లీకి వెళ్ళే బస్సు రాత్రి 9:20కి ఉంది. ఊర్లో ఉన్న ఎన్నో ప్రదేశాలను దర్శించిన తర్వాత జైసింగ్ నన్ను ఊరి మధ్యలో ఉన్న క్రాస్ రోడ్డు దగ్గర వదిలి వెళ్లిపోయాడు. ఢిల్లీ బస్సుకు నాకూ ఇంకా 4 గంటల సమయం ఉంది. రాజస్థాన్ వేడి భరించలేనంతగా ఉంది, నేను అనుకున్నాను అలా రోడ్డుమీద ఎండకు దిక్కు లేకుండా తిరగడం కంటే ఆ సమయాన్ని ఏదైనా ఏసి థియేటర్లో గడపటం తెలివైన పని అని. అక్కడ ఆటోరిక్షా కోసం చూస్తూ ఉన్నాను కానీ వాటి రేటు చాలా ఎక్కువగా చెప్తుంటే ఏమి చేయాలో తెలియక... ఇక నడవాలని

నిర్ణయించుకున్నప్పుడు... ఒకతను నా పక్కన బండి ఆపి స్వామి మిమ్మల్ని పుష్కర్‌లో చూసాను. "మీరు ఎక్కడికి వెళ్ళాలి?" నేను మిమ్మల్ని వదులుతాను... అన్న ఆ వ్యక్తిని చూసి చాలా ఆశ్చర్యపోయాను. నేను అతని ఆహ్వానాన్ని వినయంగా అంగీకరించి మిరాజ్మాల్‌ను చేరుకున్నాను. రాత్రి 8:45 దాకా అక్కడ భరత్ సినిమాను చూసి ఆటోరిక్షాగా మార్చిన బైక్‌లో బస్టాండుకు చేరుకున్నాను. నన్ను వదిలిన ఆ సౌమ్యుడి ఆదరణ చూసి నేను నిజంగా ఎంతో ఆశ్చర్యపోయాను.

# ఢిల్లీ

## జూన్ 26, 2019

**రిషబ్ ట్రావెల్స్:**

రిషబ్ ట్రావెల్స్ స్లీపర్ కోచ్ బస్సులో సుమారు 8 గంటల ప్రయాణం తర్వాత ఢిల్లీకి చేరుకున్నాను. ప్రయాణంలోనే నేను, అభయ కార్యదర్శి శ్రీ శివకృష్ణను చాలాసార్లు తలచుకున్నాను. నేను భారత దర్శనం చేస్తున్న సమయంలో అభయ సంస్థ కార్యకలాపాలను చూసుకుంటూ, నా ప్రయాణానికి కావలసిన టికెట్లు అందించడానికి 24/7 నాకూ అందుబాటులో ఉన్న తనకు మరియు తన కుటుంబానికి సర్వదా కృతజ్ఞతలు తెలుపుకున్నాను. నా జీవితంలో అలాంటి ఆత్మీయులు ఉండటం నాకూ ఒక వరమని అనుకుంటాను.

**దేశ రాజధాని: ఢిల్లీ... దేశ నాయకుల గమ్య స్థానం**

నేను ఢిల్లీ వెళ్లాలని నిర్ణయించుకున్నప్పుడు బెంగళూరు నుంచి ఢిల్లీకి వచ్చి స్థిరపడ్డ మేనకోడలు శ్రీమతి కీర్తిమూర్తిని గుర్తు చేసుకున్నాను. హిమాలయ పర్వత శ్రేణులలో ఉన్న ప్రదేశాలను (జమ్ము, కాశ్మీర్, వైష్ణోదేవి, అమరనాథ్, హరిద్వార్, ఋషికేశ్, కేదారనాథ్, మానససరోవరం, మౌంట్ కైలాష్) దర్శించుకునే సమయంలో, ఒకటి లేక రెండు రోజులు వేచి ఉండాల్సి వచ్చింది. కీర్తి కుటుంబముతో సమయం గడపవచ్చునని అనుకున్నాను.

కానీ, దైవ నిర్ణయం మరొకటిగా ఉంది. నేను ఢిల్లీకి చేరిన వెంటనే కీర్తికి ఫోన్ చేసాను. నా ఫోన్ కాల్స్ కీర్తి అందుకోలేదు. ఏమీ చేయాలో అర్థం కాక రోడ్డు పక్కన ఉన్న ఒక లాడ్జిలో స్నానాన్ని ముగించుకున్నాను. ఆ తరువాత కరోల్ బాగ్‌లో ఉన్న సదరన్ ట్రావెల్స్‌కు వెళ్లాను. రుచికరమైన ఆంధ్ర టిఫిన్, కాఫీ తీసుకున్నాను. విచారణలో తెలిసింది ఏమిటంటే, హిమాలయ

పర్యటనలన్నింటికీ చాలా ముందుగానే బుక్ చేసుకోవాలని. ఏమి తోచలేదు. సుమారు 20 రోజుల తరువాత మాత్రమే మళ్ళీ పర్యటన కొనసాగించగలనని తెలుసుకున్నాను. చాలా బాధ కలిగింది.

ఇది ఇలా జరిగింది. మరోప్రక్క బెంగళూరులో ఉన్న మా వదినగారు, వాళ్ళ చిన్నమ్మాయి చిన్మయితో కలిసి అమెరికాలో ఉన్న పెద్దమ్మాయి వైష్ణవి దగ్గరకు వెళ్ళుతుంది అని తెలిసింది. మా అన్నయ్య రంగయ్యగారితో మాట్లాడిన తర్వాత, నేను కొంత సమయం తల్లితండ్రులతో గడపవచ్చు అనుకొని బెంగళూరుకి సాయంత్రం విమానం టికెట్ బుక్ చేసుకున్నాను.

ఇంట్లో వృద్ధాప్యం కారణం వల్ల మంచానికి పరిమితమైన తండ్రిని... ఇంట్లో ఒంటరిగా వున్న తల్లి... వీళ్ళను చూసుకుంటూ కొన్నాళ్లు ఉండొచ్చు... తల్లితండ్రుల దర్శనం కూడా భారత దర్శన్‌లో భాగమే అనుకున్నాను.

**రాజ్‌ఘాట్:**

ఇక నా దగ్గర ఉన్న సమయం, ఢిల్లీలో, నా జీవితం ప్రతి దశలో మనసులో మెదిలే అత్యంత ఆకర్షణీయమైన స్థలాన్ని చేరుకున్నాను. అదే గాంధీ మహాత్ముడు చివరిగా విశ్రాంతి తీసుకున్న రాజ్‌ఘాట్. నేను యువకుడిగా ఉన్నప్పుడు ఆయన కథ, అహింసా సిద్ధాంతము, సత్యము, శాంతి, భక్తి, తల్లితండ్రుల పట్ల ప్రేమ, దేశంపట్ల ప్రేమ అన్నీ ఎంతో మంత్రముగ్ధుడిని చేసేవి. ఇవన్నీ నా జీవితాన్నీ సమాజ సేవతో జోడించడానికి పునాదులుగా నిలబడ్డాయి.

మరొక ప్రక్క నేను అటల్‌జీకి నివాళి సమర్పించుకునే అదృష్టం దొరికింది. నా జీవితానికి స్ఫూర్తి, ఆరాధ్యుడు, జననేత, శ్రీ అటల్‌జీ. ఆయన దేశభక్తి, RSS భావజాలం, జాతీయవాదం, బ్రహ్మచర్యం, రాజనీతి, స్నేహపూర్వక స్వభావంతో నా జీవితంలో చెరగని ముద్ర వేసారు. రెండున్నర దశాబ్దాల క్రితం అనుకుంటాను. నేను ఆయనని బెంగళూరు నేషనల్ కాలేజీ మైదానంలో జరిగిన ఎన్నికల ప్రచార బహిరంగ సభలో దగ్గరగా చూసాను. నేను ఆనంద పారవశ్యానికి లోనై ఆయన పాదాలకు నమస్కరించుకొని ఆలింగనం చేసుకోగలిగాను.

నేను ఎంతో మంది వ్యక్తుల నుంచి స్ఫూర్తి పొందాను (ఆచార్యత్రయం, స్వామి వివేకానంద, అల్లూరి సీతారామరాజు, మహాత్మా గాంధీ, మదర్ థెరిసా

మొ॥వారు). నేను నిజ జీవితంలో వారెవరినీ చూడలేకపోయినప్పటికీ, వారి కథలు నన్ను ఎంతో ప్రభావితం చేసాయి. అంతేకాదు, అవసరమైతే దేశం కోసం ప్రాణాలు అర్పించడానికయినా సిద్ధం అన్నంతగా, వీరి నుండి నాకు స్ఫూర్తి అందింది. నా జీవితంలో నా ఇష్ట దైవమైన శ్రీ సత్యసాయి బాబా వారుకాక, నన్ను అత్యంత ప్రభావితం చేసిన వారు శ్రీ అటల్ బిహారీ వాజపేయి మరియు డాక్టర్ ఏ.పి.జే. అబ్దుల్ కలాం.

**సదైవ అటల్:**

శ్రీ అటల్ బిహారీ వాజపేయి స్మృతివనము, అత్యంత రమణీయంగా, స్ఫూర్తిదాయకంగా నిర్మించారు. పూర్వ ప్రధాని చేసిన అభివృద్ధి మరియు వారి సేవానిరతి సదా గుర్తుంచుకునే విధంగా సదైవ అటల్ నిలిచి ఉంటుంది అని చెప్పొచ్చు. ఆ క్షేత్రాన్ని చూస్తున్నప్పుడు, అక్కడ తిరుగుతున్నప్పుడు నేను చాలా శక్తి పొందాను. నేను వెళ్లిన సమయం ఉదయం కావడం, చుట్టూ ఎవ్వరూ లేకపోవడం వల్ల నేను ఎక్కువ సమయం అక్కడ గడిపి, చాలా చిత్రాలు తీసుకున్నాను.

కవిగా, మానవతవాదిగా, రాజనీతిజ్ఞుడిగా, గొప్ప నాయకుడిగా అటల్ బీహారీ వాజపేయి వ్యక్తిత్వం అక్కడ ప్రతిబింబితమైంది. అటల్‌జీ సమాధి తొమ్మిది చదరముల నలుపు రంగు పాలిష్‌గ్రానైట్, సాలిడ్‌స్టోన్ బ్లాక్లను కలిగి మధ్యలో దీపం ఉంది. తొమ్మిది సంఖ్య నవగ్రహాలనూ సూచిస్తుంది. సమాధి చుట్టూ ఉన్న స్థలం వృత్తాకార, తామర పుష్పంలా ఉంటుంది.

తొమ్మిది చదరపు ప్లాట్లలో తెల్లటి మిశ్రమ పలకలతో తయారు చేసిన మార్గాల ద్వారా 4 దిశలలో వెళ్ళడానికి వీలుగా చేయబడింది, నేల వేడి ఎక్కదు. సమాధి చుట్టూతా బాహ్య వలయములో 9 గోడలు కట్టబడి, ఆయన కవితలు అన్నీ చెక్కబడి... ఆ వలయములో మనము ప్రదక్షిణం చేస్తున్నప్పుడు, చదువుకోవడానికి వీలుగా ఉండేలా ఏర్పాటు చేసారు. ఆయన సమాధి కట్టడానికి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి తెచ్చిన రాళ్ళను ఉపయోగించారు. అణువణువు పులకరించింది ఆ ప్రదేశములో. చాలా సేపు అటల్ జ్ఞాపకాలతో అక్కడ వుండిపోయాను.

**ఇండియా గేట్:**

ఢిల్లీలోని నడిబొడ్డున ఉన్న ఈ యుద్ధస్మారకం గురించి మనకు తెలుసు. నేను అక్కడ కొంత సమయాన్ని గడిపాను. స్మారకంపై ఉన్న శాసనాలలో, ఫ్రాన్స్, మెసపటోమియా, పర్షియా, ఈస్ట్, మరియు ఇతర దేశాల యుద్ధాలలో ప్రాణాలు కోల్పోయిన భారత వీర సైనికులకు నివాళిగా ఈ స్మారకం నిర్మించారని తెలుస్తుంది. కింది నుండి పై దాకా ఇండియా గేట్ పై 13,2018 మంది వీరుల పేర్లను స్మరించుకునేందుకు చెక్కబడ్డాయి. అమర జవాన జ్యోతి, నల్లపాల రాయితో నిర్మించబడిన ఎల్1ఎ1 సెల్ఫ్ లోడింగ్ రైఫిల్, హెల్మెట్‌తో అలంకరించబడిన ఆరు కలశాలతో, ప్రతీ ఒక్కటి అఖండంగా వెలుగే దీపజ్వాలలతో (CNG) చూపరులను ఆకట్టుకుంటుంది. వందలాది మంది సందర్శకులు అక్కడ దృశ్యాలను కెమెరాలలో బంధించడంలో నిమగ్నమై ఉన్నారు. నేను కూడా రెండు ఫోటోల కోసం ఫోటోగ్రాఫర్‌కు డబ్బులు ఇచ్చాను.

ఇక అటునుండి, భారత ప్రభుత్వం నిర్మించిన జాతీయ యుద్ధ స్మారకాన్ని చూడడానికి వెళ్ళాను.

**జాతీయ యుద్ధ స్మారకం:**

ఇది సాయుధ దళాల గౌరవార్థం ఇండియా గేట్ పరిసరాల్లో భారత ప్రభుత్వంచే నిర్మించబడిన స్మారక చిహ్నం. సుమారు 40 ఎకరాల స్థలంలో నిర్మించబడిన కేంద్ర స్మారక స్థంభం చుట్టూ వలయాకార నిర్మాణములలో నిర్మించబడి ఉన్న సౌందర్యాన్ని మరింత ద్విగుణీకృతం చేసేదిగా చెప్పవచ్చు.

1947 - 48, 1961 (గోవా), 1962 (చైనా), 1965, 1971, 1987 (సియాచిన్), 1987-88 (శ్రీలంక), 1999 (కార్గిల్) మరియు ఇతర యుద్ధాలలో పాల్గొన్న అమరవీరుల పేర్లు ఆ స్మారక గోడలపై చెక్కబడినవి.

స్మారక చిహ్నాన్ని చూసి, ప్రేరణతో నిండిన నేను మనదేశం కోసం ప్రాణాల్ని అర్పించిన వారందరికీ వందనాలు సమర్పించాను. మన దేశం కోసం బ్రతికి చివరిదాకా ప్రేమతో సేవ చేసిన వారికి నా రుణం ఎప్పటికైనా తీర్చుకోగలనా? ఇలాంటి ఆలోచనలు చిన్నతనంలో నేర్చుకొన్నాను. నా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, మరియు పరమ గురువు శ్రీ సత్యసాయిబాబా ద్వారా నాకు

ఇలాంటి ఆలోచనలు సంక్రమించాయి.

నేను ఏదీ చూస్తున్నా, నేను ఎక్కడికి వెళ్తున్నా, నేను ఎవరిని కలుస్తున్నా, నేను ఏదీ చదువుతున్నా, భారత దర్శన్ దేశానికి రుణపడాలన్న అనుభవాన్ని ఇచ్చింది! ఎదుటపడిన ప్రతి సంఘటన, వ్యక్తుల నుంచి ఏదో ఒకటి నేర్చుకునే అవకాశాన్ని ఇచ్చిన ఈ యాత్ర నాకు ఒక గొప్ప అవకాశం.

**గాంధీ మ్యూజియం:**

ఇంతకుముందు నేను చూడని ప్రదేశాలను చూడాలనుకొని, గాంధీ మ్యూజియంకి వెళ్లాను. గాంధీజీ పుట్టినప్పటి నుండి మరణించే వరకూ ఉన్న ఆయన జ్ఞాపకాల దొంతర్లను చూసి నేను ఎంతో ఆశ్చర్యపోయాను. జాతీయ గాంధీ మ్యూజియం, మహాత్మా గాంధీ, కస్తూరిబాయి జీవితం, అలాగే భారత జాతీయ స్వతంత్ర సంగ్రామంతో ముడిపడిన ఎన్నో వస్తువులతో, జ్ఞాపకాలతో, ఛాయాచిత్రాలతో నిండింది. ప్రతి భారతీయుడు ఈ స్థలాన్ని తప్పక దర్శించి తీరవలసిన క్షేత్రం.

వీటిని క్షేత్రాలుగా అనడం ఎందుకంటే, ఇవి భారతీయులందరికీ దేవాలయాల లాంటివే. మహాత్మా గాంధీ చివరి అవశేషాలున్న స్థలమిది. వాటిని చూస్తున్నప్పుడు నేను ఎంతో భావోద్వేగానికి లోనయ్యాను. ఏడవాలని కూడా అనిపించింది.

**అక్షరధామం:**

ఢిల్లీలో నాకు కొద్దిగా సమయం మిగిలి ఉండటంతో మళ్లీ మరొకసారి అక్షరధామాన్ని చూడాలని నిర్ణయించుకున్నాను. భగవాన్ స్వామి నారాయణ్ (1781–1830) యొక్క విశ్వవ్యాప్త భక్తులు మరియు సాధకులు ఎంతో నిజాయితీతో సమర్పించిన ఒక నిస్వార్థమైన ఆలయం ఇది. H.H. ప్రముఖ స్వామి మహారాజ్ గారి దిశానిర్దేశంలో 2005వ సంవత్సరం నవంబర్ 6న సంప్రదాయబద్ధంగా ప్రారంభించిన ఈ ఆలయ సముదాయా అంకితభావంతో పని చేసిన వాలంటీర్స్ మరియు నైపుణ్యాలతో కూడిన కళాకారుల ద్వారా నిర్మించారు.

**అక్షరధామం అక్షర సత్యాలు:**

1. 6 నవంబర్ 2005: BAPS చే ప్రారంభించబడింది.
2. H.H. యోగి మహరాజ్ యొక్క దివ్య ప్రేరణ నేపథ్యం.
3. H.H. ప్రముఖ స్వామి మహరాజ్ చేత సృష్టింపబడినది.
4. 300,000,000 పని గంటలను స్వచ్ఛంద సేవకులు నిర్మాణ కార్యంలో పెట్టినారు.
5. 8000 మంది స్వయం సేవకులు నిర్మాణంలో భాగం పంచుకున్నారు.
6. ఇసుక మరియు పాలరాయితో క్లిష్టంగా చెక్కబడిన నిర్మాణం ఇది.
7. హిందూ సంస్కృతి, ప్రదర్శనశాలలు, భగవాన్ స్వామి నారాయణ్ జీవితం, ప్రార్థన, దయ మొదలైన బోధనలతో, బహిరంగ తోటలు, జల తరంగణిలు, మెట్ల బావి ఉన్న ప్రాంగణం చూసి తీరాల్సినవి.
8. అందరూ పిల్లలతో చూడవలసిన ఒక మంచి స్థలం.
9. దర్శించిన ప్రతిసారీ మొదటి సారి దర్శించినప్పటి ప్రేరణను పొందుతాము.

ఢిల్లీకి వీడ్కోలు పలికి మళ్లీ జులైలో హిమాలయ యాత్రకై తిరిగొచ్చే ప్రణాళికతో నేను తల్లిదండ్రులకు తోడుగా ఉండడానికి బెంగళూరుకి బయలు దేరాను. ఢిల్లీ నుంచి బయలుదేరుతున్నప్పుడు నాలో మెదిలిన భావాలకు, గాంధీ స్మారక ప్రదర్శన శాలలో నేను చూసిన వారి ఆలోచనలకు పోలిక కుదిరిందని అనిపించింది. అందుకే ఇక్కడ ప్రస్తావిస్తున్నాను.

**నా కలల భారతదేశం:**

పేదల్లో పేదవాడు కూడా ఇది నా దేశం అన్న నమ్మకంతో చెప్పగలిగే భారతదేశం. ఉన్నత తరగతి ప్రజలు, కింది తరగతి ప్రజలు అన్న తారతమ్యం లేని భారతదేశం... అన్ని వర్గాల ప్రజలు పరిపూర్ణ సామరస్యంతో ఉండే భారత దేశం... అంటరానితనం, మత్తుపానీయాలు, మాదకద్రవ్యాలు లేని భారతదేశం... స్త్రీలు, పురుషులతో సమానమైన హక్కులను అనుభవించే భారతదేశం... ప్రపంచంలోనికి మిగిలిన వారికి శాంతి సందేశం పంపించే భారతదేశం... దోపిడీ దౌర్జన్యం లేని భారతదేశం... ఊహించనలవి కాని అత్యంత చిన్న సైన్యంతో కూడిన భారతదేశం... ఇదీ నా కలల భారతదేశం. – మహాత్మా గాంధీ, యంగ్ ఇండియా, 10.9.1954.

# బెంగళూరు

## జూన్ 27, 2019

**తల్లిదండ్రులతో సమయం బెంగళూరులో:**

తీవ్ర ఒత్తిడితో గడిచిన రోజులు తర్వాత నేనూ ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకొని అక్కడ విమానం ఎక్కాను. ఐదు గంటల పాటుగా నిరీక్షణలో గడిపాను. కానీ నేను ఆ సమయాన్ని భారత దర్శన్ అనుభవాలను వివరంగా వ్రాసుకోవడానికే ఉపయోగించాను. అసలు ఎక్కడా సమయాన్ని వృథా చేయలేదు. ప్రతి క్షణమూ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ, అతి తక్కువ సమయాన్ని నా వ్యక్తిగత అవసరాల కోసం ఉపయోగిస్తూ, నా యాత్రా కాలంలో గడపాలన్న నా యోచన ప్రకారం నేను నడుచుకోగలిగినందుకు ఆనందించాను.

జూన్ 27, తెల్లవారు ఝామున సుమారు 1.30 గంటలకి ఇంటికి చేరాను. నన్ను ఇంటికి తీసుకువచ్చిన ఒక ముస్లిం ఆటో డ్రైవర్ నేను ఎక్కడి నుంచి వస్తున్నానో అడిగి, ఇలా భారత దేశం దర్శిస్తున్నాను తెలుసుకుని చాలా సంతోషించాడు. అజ్మీర్ దర్గా దర్శనం విషయాలను నేను అతనితో పంచుకున్నాను. అందుకని ఆయన ఇంకాస్త సంతోషపడ్డాడు. అజ్మీర్ దగ్గర నాకు ప్రసాదంగా లభించిన చద్దర్ని నేను దిగగానే ఆయనకు ఇచ్చాను, అందుకు ఆయన ఆనందంలో మునిగిపోయాడు.

ఇంట్లో ఉన్న నా తల్లిదండ్రులకు, నా తోబుట్టువుకు, నా బావగారికి నా నమస్కారాలు అర్పించి, భారత దర్శన్‌లో అత్యుత్తమమైనవి, ఆసక్తికరమైన విషయాలను మరియు వివరాలను నేను వారందరితో పంచుకున్నాను.

**అభయ యువ సాధికారత కేంద్రం:**

యువశక్తి ఫౌండేషన్, వ్యవస్థాపకులు శ్రీమాన్ భూషణ్ భారతీయ, నన్ను

బెంగళూరుకు వచ్చిన సమయంలో, వైట్‌ఫీల్డ్ దగ్గర ఉన్న అభయ యువ సాధికారత కేంద్రం, అజగొండహళ్లికి ఆహ్వానించారు. నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి, నేను అక్కడ ఉన్నప్పుడు, మొదటి అంతస్తు పై కప్పుకు కాంక్రీట్ వేసారు. అభయ ప్రాంగణం, కర్ణాటక రాష్ట్ర సేవల కోసం ఏర్పాటు చేయగలిగినందుకు నేను చాలా సంతోషించాను. భూషణ్ వాళ్ల ఇంటికి వెళ్ళినప్పుడు ప్రాజెక్ట్ గురించి మాట్లాడుతూ కొంత సమయం గడిపాను. వారు నన్ను భోజనానికి ఆహ్వానించారు, నేను వారితో నా ప్రేమను పంచుకుంటూ కొంత సమయం గడిపాను. కర్ణాటకలో కొత్తగా నిర్మాణం చేయబోతున్న అభయ గురించి తెలుసుకోవాలనుకున్న ప్రతీ ఒక్కరికీ ఇక్కడ సంక్షిప్త వివరణ ఇస్తున్నాను.

అభయ ఫౌండేషన్ (www.abhayafoundation.org) యొక్క లక్ష్యం H.E.A.R.T. (Healthcare, Educare, Awareness, Rural Development, Transformation) అన్నది, ఇది యువశక్తి సేవ ఫౌండేషన్‌తో కలిసి అజగొండహళ్లి, వైట్‌ఫీల్డ్ దగ్గర ఉన్న గ్రామీణ నిరుద్యోగ యువతకు సాధికారతను కల్పించడంలో సిద్ధంగా ఉంది. ఈ ప్రాజెక్టును పూర్తిచేయడానికి 50 లక్షల రూపాయలు అవసరం. కార్పొరేట్ సంస్థలు మరియు అభయ శ్రేయోభిలాషులు కలిసి పనిచేసి దీన్ని సాధ్యము చేసుకోవడం కోసం తమ వంతు సహాయం అందించాలి.

## జూన్ 29, 2019

### తండ్రిగారి నిష్క్రమణము:

భారత దర్శన యాత్రలో నాన్నగారు గుర్తుకొచ్చినప్పుడల్లా, ఆయనను ఈ ప్రపంచం నుండి త్వరగా, సులభంగా మరియు అనాయాసంగా తీసుకెళ్లిపోవాలని ఆ భగవంతుడిని కోరుకున్నాను. 83 సంవత్సరాలున్న ఆయన కొద్ది సంవత్సరాలుగా అనారోగ్యంతో ఉన్నారు. నేను హిమాలయ సందర్శన కోసం టికెట్ దొరకనప్పుడు... ఆ మధ్య సమయం భారత దర్శన్‌లో భాగంగా తల్లిదండ్రుల దగ్గరికి వెళ్లి కొద్ది రోజుల పాటు గడపాలని నిర్ణయించుకున్నాను.

## భగవంతుడు ఎంతో కరుణామయుడు...

నాన్నగారి చివరి క్షణాలలో నన్ను నాన్న దగ్గర ఉండేందుకు ఇలాంటి ఏర్పాట్లు చేసారు అనిపించింది. నేను బెంగళూరుకు వచ్చిన 48 గంటల ముందు నాన్నగారు నా పేరే కలవరిస్తూ ఉన్నారట. నా పేరు ఆయన నోటి నుంచి వినడం అనేది ఆశ్చర్యకరమైన విషయం. చాలా నీరసంగా ఉన్నారు. వైద్యులు ముక్కులో అమర్చిన ప్రత్యేక గొట్టము ద్వారా ఆహారం అందిస్తున్నారు.

ఇంట్లో నాన్నగారితో అమ్మ వుంటే, నేనూ మా అక్కయ్య బయట హాల్లో కూర్చుని మాట్లాడుకుంటున్నాం. అమ్మ ఒక్కసారిగా పెద్దగా అరుస్తూ నన్ను పిలిచింది. నేనూ ఒక్క వుదుటన లేచి లోపలికి వెళ్లాను. నాన్న శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిని గమనించి, త్వరగా నేను ఆయన బెడ్ దగ్గరికి వెళ్లి మహామృత్యుంజయ మంత్రాన్ని, గాయత్రి మంత్రాన్ని, శ్రీరంగ నామాన్ని, శాంతి మంత్రాన్ని చదువుతూ తులసి తీర్థం ఇచ్చి సున్నితంగా ప్రేమతోనూ, భక్తితోనూ ఆయన ఛాతిపై సున్నితంగా రుద్దుతూ భగవాన్ బాబా నామస్మరణ చేసుకుంటూ ఉండు అని చెబుతూ ఉండగానే 29 జూన్ 2019 శనివారం సాయంకాలం 7:29 గంటలకు అమ్మా, అక్కయ్య సమక్షంలో నా చేతుల్లో ఆయన చేయి ఉండగా ప్రశాంతంగా మమ్మల్ని వదిలి వెళ్ళిపోయారు.

ఈ జన్మలో ఆయనను తండ్రిగా పొందడంతో మేము ధన్యులం. ఈ రోజు మేము ఇలా ఉన్నామంటే అంతా ఆయన మాకు అందించిన విలువలతో కూడిన దిశానిర్దేశం వల్లనే. నేను నా పెద్దన్నయ్య (మిగిలిన ఈ నా జీవితానికీ ఆయనే ఇక నా తండ్రి)కు కృతజ్ఞతలు చెప్పుకున్నాను. బెంగళూరులో తన ఇంట్లోనే నాన్నను ఎంతో జాగ్రత్తగా, ప్రేమగా, ఆత్మీయంగా చూసుకున్నారు. మా నాన్నగారు మరియు మా అన్నయ్య నేను బ్రతకడానికి చేయూతనిచ్చి ఆశీర్వదించారు. మా అందరినుంచి నాన్నని వైకుంఠ ధామానికి తీసుకెళ్లిన ఆ పరమాత్ముడికి నేను సదా రుణపడి ఉంటాను.

## జూన్ 30, 2019

**తండ్రి పాదాల వద్ద అష్ట పద్మముల సమర్పణ:**

జీవితం అంటే నేను నుండి మనం వరకు చేసే ప్రయాణం: మరణించిన తండ్రి గారి ఆత్మ శాంతి కోసం ప్రార్థనలు చేస్తూ... వారి అంతిమ యాత్ర సందర్భంగా అష్ట పద్మ పద్యాలు వారికి అంకితం చేసాను

1. 'అ'కారమునకు... ఆకారము దాల్చిన వాడు
అందరికంటే తానెప్పుడు ముందుండు వాడు
అమ్మను చేపట్టి నాకు ప్రాణము పోసినాడు
చదువు సంధ్యలు నాకు నేర్పించినాడు

2. అన్నయ్యను నాకు వెన్ను దన్నుగా నిల్పినాడు
అక్కయ్యను నాకు ప్రేమను పంచ పెంచినాడు
తమ్ముడిని కూడా నాకు తోడుగా నిల్పినాడు
మాకు అయ్య! లోకమును సృష్టించినాడు

3. పద్యాలు... పాటలు అలవోకగా నేర్పినాడు
అనర్గళంగా మాట్లాడటం నేర్పినాడు
సరళంగా వ్రాయడం నేర్పినాడు
సంస్కరవంతముగా జీవించడం నేర్పినాడు

4. కష్టమెంతొచ్చిననేమి... విలువలు వదులకోలేదు
నష్టమెంతొచ్చిన నేమి... మోసమే చేయలేదు
అందరి తలలో నాలుకల మెదలినాడు
అయ్య నాకెంతో ఆదర్శమయ్యాడు ఇలలో

5. తప్పు చేసిన నాడు అయ్య కళ్ళ పడక తప్పలేదు
మందలింపులే నా జీవితానికి మేలుకొలుపులు
బంధుమిత్రులెవరైన నేమి సాయమే అందించినాడు

భక్తి శ్రద్ధల భావన మాకెంతో సదా నేర్పినాడు

6. స్వర్ణోత్సవ గృహస్థుడు మా అయ్య వారు
సహస్ర పూర్ణ చంద్రులను దర్శించినాడు
ఆరు తరాలను చూసిన ధన్యుడితడు
అమృతమద్దినాడు మా అందరి జీవితాన

7. తన కష్టమును.. మాకెప్పుడు చెప్పనే లేదు
తరములకు తరగని విద్యను ఆస్తిగా ఇచ్చినాడు
తారతమ్యం లేని... తేట తెల్లమైన వారి యాత్ర
పరి సమాప్త మాయెను నేడు మా కళ్ళ ముందే

8. నేను జీవించే ప్రతి క్షణం... వారిచ్చిన శ్వాస తోనే
కడ దాకా వదలకుండా అయ్య లాగనే నే మసలుకొందు
కీర్తిని శేషముగా మిగిల్చి నేను కూడా నిన్ను చేరుకొందు
అర్చించు కొందునయ్యా నిన్ను అష్ట పుష్పాలతోటి

ఎల్లప్పుడూ నిన్ను తలచుకొంటూ... నీ వైకుంఠ ప్రయాణం సుగమం అవ్వాలని ప్రార్థిస్తూ... నీ కుమారుడు, బాలచంద్ర సుంకు

అసలు హిమాలయాలకు టికెట్టు దొరకని కారణం, ఇంట్లో వదిన తన కూతురుని చూడటం కోసం అమెరికా వెళ్ళడం, అన్నయ్య తన ఆఫీసు పనుల్లో ఉండటం, నేను భారత దర్శన్‌లో మళ్లీ తిరిగి రావడం అంటూ జరిగితే నాన్నగారి నిష్క్రమణ సమాచారంతోనే అనుకోవడం... ఇలాగా కారణాలు ఏవైనా, ఎదో వ్రాసిపెట్టినట్టుగా నేను బెంగళూరుకు రావడం... నాన్నగారు నా చేతుల్లో ప్రాణం వదలడం... ఇవేవీ యాదృచ్ఛికంగా జరిగినవి కావని నాకు అర్థం అయ్యింది.

ఒక సన్యాసిలా భారత దర్శనం చేస్తున్న నాకు నాన్నగారి చివరి క్షణాలలో వారితో ఉండగలిగే అవకాశం భగవంతుడు ఇచ్చిన వరముగా అనిపించింది.

లేదంటే నేను, నిజంగా టికెట్లు దొరికి ఉంటే హిమాలయాలకు వెళ్ళిపోయే వాడిని కదా. ఇక అప్పుడు చివరి చూపులకు కూడా నోచుకోని వాడిగా మిగిలిపోయే వాడిని.

### జూలై 1, 2019

### నాన్నగారి అంతిమ యాత్ర జరగుతుంటే...

ఎవరో అంటుంటే విన్నాను ఇంట్లో... "భలే వచ్చాడు బాలాచంద్ర సమయానికి, ఆ రోజు శంకరుల వారు ఆర్యాంబను చూడటానికి వచ్చినట్లు" అని. ఏది ఏమైనా ఈ జన్మకు భగవంతుడు కల్పించిన అవకాశానికి సదా ధన్యుడను అనుకున్నాను.

నాన్నగారి మరణ సమాచారం విన్న తర్వాత కుటుంబ సభ్యులు, స్నేహితులు, తెలియని వాళ్ళు, చాలామంది ఇంటికి వచ్చేసారు. అమెరికా నుంచీ, ఆఫ్రికా నుంచీ కూడా వచ్చారు. ఇక దక్షిణ భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుంచీ కూడా వచ్చారు. వచ్చిన ప్రతివారూ నాన్నతో వారికున్న అనుబంధాన్ని, జ్ఞాపకాలను పంచుకున్నారు. ప్రతి ఒక్కరి జ్ఞాపకాల ద్వారా ఈ ప్రపంచంలో మనం ఎలా జీవించాలో మేము మళ్లీ ఒక సారి తెలుసుకోగలిగాము.

ఇంటి నుంచి 'నాన్నగారి తుది ప్రయాణాన్ని వైదిక ఆచార వ్యవహారాలతో చక్కగా నిర్వహించగలిగాము. నేడు సమాజంలో మనం చేసే వైదిక కర్మలు (Rituals) జీవం లేకుండా పోతున్నాయి. అందువలన వాటిలో ఉన్న పరమార్థం మరుగున పడిపోయింది. నిజానికి, చేసే ప్రతి కర్మను మనం Spirit తో చేస్తే అది నిజమైన ఆధ్యాత్మికమవుతుంది (Spirit + Ritual = Spiritual). భజనలు, నామ సంకీర్తన నేను చేస్తూ హిందూ ఆచార వ్యవహారాల్లోని ప్రాముఖ్యత ఏమిటో చెప్తూ అంతిమయాత్రకు అక్కడికి వచ్చిన వారందరినీ భాగస్వామ్యులుగా చేసే ప్రయత్నం చేసాను.'

భగవంతుడు కరుణించి నాన్నగారిని ఆయన సన్నిధిలోనికి తీసుకున్న తర్వాత జరిగిన ప్రతి ఒక్క కార్యక్రమాన్ని ఒక పండగలా చేయడానికి సాధ్యమైనంతగా మేము ప్రయత్నించాము. నాన్నగారు చివరి ప్రయాణంలో నేను అమితంగా ప్రేమించి అభిమానంచే ఉదయన్న, గోపి అన్న, సాగర్‌లు

హైదరాబాద్ నుంచి వచ్చారు. అది నన్ను ఎంతో కదిలించింది. వారిని చూసినప్పుడు, నేను అనుకున్నాను, అన్నయ్యల రూపంలో సత్యసాయిబాబా వారు మా ఇంటికి వచ్చారు అని. వారి ప్రేమను నేను నా జీవితంలో పొందడాన్ని అదృష్టంగా భావిస్తున్నాను.

బంధుమిత్రులతో శ్రేయోభిలాషులతో చేరి, కుటుంబసభ్యులు అందరితో నాన్నగారికి ప్రార్థనలతో హృదయపూర్వకమైన వీడ్కోలు ఇచ్చాము. ఈ కార్యక్రమం ఎలా వుందంటే, ఆత్మని స్వర్గానికి పంపించే బృహత్తర యజ్ఞంలా అనిపించింది. మేము నలుగురు తోబుట్టువులం (నారాయణ, రేవతి, బాలచంద్ర, మరియు శ్రీనివాస్) అందరము కలిసిమెలిసి ఈ సంబరాన్ని, ఐకమత్యంగా, బాధ్యతాయుతంగా నిర్వహించాము. నేను అయితే, నాన్నగారి అంతిమ యాత్రకు వచ్చిన ప్రతీ ఒక్కరినీ వ్యక్తిగతంగా పలకరించి, కృతజ్ఞతలు చెప్పినాను. పెద్ద వారందరికీ పాదాభివందనాలు చేసి, వారి ఆత్మీయతను, ఆశీర్వాదాలను అందుకున్నాను.

ఇక, ఆ తర్వాత 14 రోజులూ కూడా బెంగళూరులో, నాన్నగారికి సంబంధించిన వైదిక కర్మలను ఆచరించడం కోసం ఉండిపోయాను. అదేదో దైవ నిర్ణయమయినట్లుగా భారత దర్శనము మళ్లీ 19 జూలై 2019 నాటికి అమరనాథ యాత్రతో పునఃప్రారంభించేందుకు ఏర్పాట్లు జరిగినాయి ముందుగానే. అలానే నేను హిమాలయాలకు వెళ్లాలని నిర్ణయించుకున్నాను. నేను నాన్నగారి చివరి చూపు చూడడానికీ, ఆనాటి శంకరాచార్య కాకపోవచ్చు కానీ నేను ఇలా ఆయన చనిపోయేముందు రోజు బెంగళూరుకి చేరుకోవడం మాత్రం ఒక అద్భుతమే అని చెప్పాలి.

అంతరాత్మ ప్రబోధనను విని నేను, ఢిల్లీలో నుండి అమ్మా నాన్నల వద్దకు రావడం గురించీ, ఇక ఏమనుకోవాలా అన్నది నాకు తెలియలేదు. అందరిలాగానే సర్వసామాన్య మానవుడినే... కానీ ఆ దేవుడు ఎంతో కరుణతో చివరగా నాన్నగారు ఈ లోకాన్ని వదిలి వెళ్లే సమయంలో వారి సమక్షంలో ఉండే అదృష్టం కల్పించాడు. నేను చేయగలిగినంతగా ఆ అంతిమ క్షణాల్లో వారి కోసం ప్రార్థనలు చేసాను.

ఆయన చితాభస్మాన్ని తీసుకుని, హిమాలయాల్లో ప్రవహిస్తున్న అన్ని నదులలో కలపాలని మరియు యాత్రలో నేను చూడబోయే ప్రతి సముద్రం,

నది, తీర్థం, వాగు, వంకలలో కలపాలని నిర్ణయించుకున్నాను. భారతదేశ దర్శనంలో నాన్నగారికి నేను ఇచ్చే ఘన నివాళి ఇదే అని హృదయపూర్వకంగా భావించాను.

మా నాన్నగారు సుంకు సాల రంగయ్యగారు, వారి ఐదుగురు అన్నదమ్ములు. ఎవరి పేర్లు అయితే ఆలూరుకోన శ్రీరంగనాథస్వామి పేరున ఉన్నాయో. వారి అందరి జ్ఞాపకార్థం ఐదు లక్షల రూపాయలను అభయ ఫౌండేషన్ ద్వారా, అనంతపురం దగ్గర నిర్మించబోయే సాధికారత ప్రాంగణంలో శ్రీ రంగ నివాసముకు సమర్పించేందుకు కుటుంబ సభ్యులందరం నిర్ణయించుకున్నాము.

ప్రియమైన అత్మీయులారా, నా కుటుంబంపై నాకు అనురాగ విరాగాలేమీ లేవు. భారత దర్శనంలో భాగంగా మరొక పవిత్ర స్థలాన్ని అమ్మా, నాన్న వుండే ప్రాంతాన్ని దర్శించుకున్నాను అని అనుకున్నాను అంతే.

అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం దగ్గర నిర్వహించే వృద్ధాశ్రమం, 'అభయ ఆనంద నిలయము'లో ప్రతీ సంవత్సరం 29 జూన్, నాన్నగారి వర్ధంతి రోజున, అన్నప్రసాదం కోసం నేను విరాళంగా రూ. 10,116/- ఇవ్వడం నాన్నగారి అంతిమయాత్ర తరువాత చేసిన మొదటి పని.

ఇంట్లో ఉన్నప్పుడు, అమ్మను కాస్తా వేరే ఆలోచనలతో గడిపేలా చేయడానికి ప్రయత్నించాము అందరం. ఆవిడ మా చిన్నతనంలో, మాటలు చెప్తూ, చిన్నగా ఉన్నప్పుడు జరిగిన ఒక ఆసక్తికరమైన విషయాన్ని నాతో చెప్పినప్పుడు ఆశ్చర్యపోయాను. నాకు 12 ఏళ్ల వయసులో, అమ్మనాన్న నాకు ఎప్పుడూ కొత్త బట్టలు కొనిస్తే, అప్పుడు నేను ఒకటి లేక రెండు జతల పాత బట్టలను పేదవారికి ఇవ్వడానికి పక్కన తీసిపెడుతుండేవాడినని చెప్పింది. ఈ విషయం వింటున్నప్పుడు నా జీవితంలో సేవను, చుట్టూ ఉన్న వాళ్ళందరూ ఎలా నెలకొల్పారో కదా అని అనిపించింది.

నిజానికి నా జీవితమంతా నేను ఇదే పాటిస్తున్నాను. నాకు ఇంకా గుర్తుంది, 2011లో నేను ధోతిని ధరించడాన్ని మొదలు పెట్టాక దాదాపు 100 జతల బట్టలు (ఆఫీసుకి వెళ్తున్నప్పుడు వేసుకునేవి) అందరికీ పంచేసాను. నాకూ గుర్తుంది, నా రెండు అల్మారాల్లో 100 జతలకు పైగా బట్టలు ఉండేవి. నాకు తెలుపు, సఫారీలు, రంగురంగుల వస్త్రాలు వేసుకోవడం చాలా ఇష్టంగా

అనిపించేది అప్పుడు. నాన్నగారూ కూడా అలాగే ఉండేవారు, ఆయనకు చాలా ఇష్టమైన డ్రెస్ కోడ్ సఫారీ, ఆయన లాయర్ అయినందున అందంగా ఉండే ప్యాంట్లు, షర్ట్‌లు, బ్లేజర్లు మొదలైనవి వేసుకోవడాన్ని ఇష్టపడేవారు. వారూ వాడుకున్న బట్టలు సామగ్రి ఎన్నో ఉండి పోయాయి ఇంట్లో.

కుటుంబ సభ్యులందరం కలిసి చర్చించుకుని నాన్నగారికి సంబంధించిన బట్టలు, మందులు, పరికరాలు అన్నీ ప్రోగు చేసాము. మాకూ అందరికీ తెలుసు, నాన్నగారు చివరి రోజుల్లో మంచముకే పరిమితం అయ్యి ఎంత బాధ అనుభవించారో... ఎన్నోరకాల ప్రత్యేక సామగ్రిని, ఔషధాలను సుమారు 6 నెలల పాటు ఉపయోగించాము. అవి ఎంతగా ఉపయోగపడ్డాయో మాకు తెలుసు. అందుకని నేను ఆలోచించా, ఆ విలువైన వస్తువులన్నీ ఏదైనా వృద్ధాశ్రమానికి ఇచ్చేస్తే అక్కడి ఆశ్రమవాసులకు ఉపయోగపడతాయని. నాకు తెలిసిన ఉచిత అనాధాశ్రమం గుర్తుకు వచ్చింది. ఏమాత్రం ఆలస్యం చేయకుండా నేను వాటిని అక్కడున్న వారికి ఇచ్చేలా నిర్ణయించుకున్నాను. ఒకప్రక్క కర్మకాండలు జరుగుతున్నప్పుడు, మేము తీసిపెట్టిన బట్టలన్ని మూట కట్టుకుని కారులో వేసుకుని మా ఇంటి నుంచి 30 కిలోమీటర్ల దూరంలో బెంగళూరు పొలిమేరలో ఉన్న న్యూ ఆర్క్ మిషన్‌కు బయలుదేరాను.

ప్రియమైన స్నేహితులారా! మీరు ఎప్పుడైనా బెంగళూరుకు వచ్చినప్పుడు సమయం అనుకూలిస్తే న్యూ ఆర్క్ మిషన్ – అనాధాశ్రమం సందర్శించండి. గూగుల్లో ఆటో రాజా అని వెతికితే భగవంతుడు తన అద్భుతాలను ఎలా చేస్తాడో మీకు తెలిసిపోతుంది.

అక్కడ సుమారు 800 మంది అనాధలు పెద్దలు, పిల్లలు కలిసి ఉంటారు. వీరందరినీ ఆటో రాజు చాలా ఆత్మీయంగా చూసుకుంటాడు.

ఇంట్లో ఒకరు బెడ్‌మీద ఉంటే వారిని చూసుకోవడం ఎంత కష్టమో మనకు తెలుసు. అలాంటిది అక్కడ వంద మందికి పైగా బెడ్‌మీద ఉన్న వాళ్లను చాలా ప్రేమతో మరియు ఆప్యాయంగా చూసుకుంటారు. నేను అక్కడ కొంత సమయాన్ని వాళ్లందరితో గడిపి తిరిగి వచ్చాను. వాస్తవానికి నాకు రాజా గత 8 సంవత్సరాలుగా తెలుసు. అభయ ఆనంద నిలయం స్థాపించడానికి ఇతనే నాకు స్ఫూర్తి.

మనమందరం ఇతని సేవాకార్యానికి వీలైనప్పుడు అన్ని సహాయాలు చేద్దాం. అక్కడి నుండి బయటకు వెళ్ళే సమయములో ఆశ్రమం ముందు నిలబెట్టిన ఒక బోర్డు చూసి నేను చాలా చలించిపోయాను. ఇక్కడ రోజుకి 25 లీటర్ల పాలు అవసరం. స్నేహితులారా, కార్పొరేట్ ఉద్యోగులారా, ఎవరికి ఎంత వీలైతే అంత దయచేసి ధారాళంగా విరాళంగా ఇవ్వండి అన్నది దాని సారాంశము.

అంతేగాక కొత్తగా కట్టించిన క్యాంపస్ ను ఇంకా అభివృద్ధి పరచవలసి వుంది. ఇక్కడ దాతల అవసరం ఎంతగానో ఉంది. మనలో ఎవరికైనా కార్పొరేట్ సంస్థలు తెలిస్తే వారి CSR Funds ని కృపతో, ప్రేమతో నిండిన ఈ దేవదూతకు పంపించగలిగితే సంతోషం.

అటు నుంచి వచ్చాక నా మనసులో చాలా ఆలోచనలు మొదలయ్యాయి.

ఈ ప్రపంచంలో ఏది శాశ్వతం?

మనం సంపాదించినదంతానా?

మనము అనుభవించినదంతానా?

మనము జీవించిన జీవితం అంతానా?

మనము నిర్మించుకున్నదంతానా?

మనము తిన్నదంతానా?

మనకి ఉన్నదంతానా?

నేను ఈ విషయం మీతో చెబుతు ఉన్నప్పుడు... మన దేశానికి ఆత్మ బంధువులైన ఇద్దరిని గుర్తు తెచ్చుకోవాలనుకుంటున్నా, వారు భౌతికంగా మన నుండి దూరమై శతాబ్దాలు అయినా కూడా ఇప్పటికీ సజీవంగా నిలచారు.

## స్వామి వివేకానంద (1863–1902)

ఆయన కేవలం 39 సంవత్సరాలు జీవించి, ఈ భావనలు వ్రాస్తున్న రోజు (జూలై 4, 1902 – సమాధి రోజు)న ఈ ప్రపంచం నుండి నిష్క్రమించారు.

ఆయన చాలా సమస్యలను ఎదుర్కొన్నారు:

ఆయన ఒక నిరుద్యోగి.

ఆయన కుటుంబాన్ని పోషించుకోలేకపోయాడు.

ఆయన ఆకలి బాధను ఎదుర్కొన్నారు.

మనలాగే చాలాసార్లు ఏడ్చారు కూడా.

ఈ సాధారణ బాధలు కష్టాలు అతన్ని శాశ్వతంగా నిలిపినవి కాదు!!!

కాని, అతని అచంచల దీక్ష! తన చుట్టూ వున్న ప్రపంచంలో ఒక మార్పు తేవాలన్న ఆశయం. ఇది మాత్రమే ఆయన ఆశయాన్ని, ఆయనను సజీవంగా ఈనాటికీ నిలబెట్టింది. అతడే స్వామీ వివేకానందుడు.

## విప్లవజ్యోతి అల్లూరి సీతారామరాజు (1897-1924)

27 ఏళ్ల మాత్రమే జీవించినారు. వారు జులై 4, 1897న పుట్టినారు. అల్లూరి సీతారామరాజు భారతదేశ స్వతంత్ర పోరాటంలో విప్లవ వీరుడు. 1882లో మెద్రాస్ ఫారెస్టు చట్టాన్ని విడుదల చేసిన తర్వాత, ఆదివాసులు స్వేచ్ఛగా, అడవిలో తిరగడాన్ని, వారి ఆచారమైన పోడు వ్యవసాయ విధానాన్ని, షిఫ్టింగ్ వ్యవసాయ విధానాన్ని నిషేధించారు. 1922-24లో రంప విప్లవాన్ని కొంత మంది బోయలు మరియు కోయల సహాయంతో మరియూ దేశ భక్తులతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడారు.

మెద్రాస్ప్రెసిడెన్సీ (ఇప్పటి ఆంధ్రప్రదేశ్) ప్రాంతంలో నుండి ఈస్ట్ గోదావరి మరియు విశాఖపట్నం ప్రాంతాలలో ఉన్న వాళ్ల 'సానుభూతి పరులు' అందరితో కలసి, బ్రిటిష్ వాళ్ళు మెద్రాస్ ఫారెస్ట్ ఆక్ట్‌ను ప్రవేశపెట్టినప్పుడు వారి పై సాయుధ పోరాటం చేసినారు. 27 ఏళ్ల వయసులో అడవిలో స్నానం చేస్తూ ఉన్నప్పుడు ఆయనను హత్య చేసారు. ఆయనను 'మన్యం వీరుడు' అని ఆ ప్రాంతాల వారు పిలుస్తారు. ఈయన కూడా సామాన్యమైన వ్యక్తే.

అతను ఒక మధ్యతరగతికి చెందినవాడు.

చిన్న వయసులోనే దేశభక్తితో జీవించినవాడు.

అతనికి సీత అనే ప్రేమికురాలు ఉండేది.

జీవితములో పెళ్లి చేసుకోలేకపోయాడు.

ఆమె ఆత్మహత్య చేసుకుంది.

ఆతడు సన్యాసి జీవితాన్ని గడిపాడు.

కానీ ఇవేవీ అతనిని శాశ్వతుడిగా చేయలేదు.

అన్ని వదిలేసి ఆ అమాయక ఆదివాసులకి అండగా నిలబడటం మాత్రమే అతడిని శాశ్వతుడిని చేసింది.

ప్రియమైన స్నేహితులారా... ఒకసారి ఆలోచించండి, మన ఆలోచన ధోరణిని మనము మెరుగుపరచుకోవాలి... మన జీవితంలో మనం మాటలాడే మాటలు, మనం చేసే పనులు చుట్టూ ఉన్న ప్రపంచాన్ని చాలా ప్రముఖంగా ప్రభావితం చేస్తాయి. మహనీయులలాగా మన జీవితం దేశం కోసం ధారపోయక పోయినప్పటికీ ఫరవాలేదు. మన దేశ ప్రజల కోసం, వారిని ప్రేమించడం కోసం, మనం బ్రతకడం ప్రారంభిద్దాం. మనం కూడా శాశ్వతులు అవుదాము. అప్పుడే మన జీవితానికి మరణము కూడా తెర దించలేదు. వారి లాగానే ఈ ప్రపంచ హృదయములో శాశ్వతంగా జీవిద్దాం.

# ఉత్తర ప్రదేశ్

## జూలై 5, 2019

**వారణాసిలో పిండ ప్రధానం:**

శ్రీ సుంకు సాల రంగయ్య గారి పిల్లలమైన మేము, తండ్రిగారి అస్థికలను కాశీ ప్రయాగలోని పవిత్రమైన గంగానదిలో కలపడాన్ని ఉచితంగా మరియు ఉన్నతంగా వుంటుంది అనుకున్నాము. మమ్మల్ని విడిచి వెళ్లిన మా తండ్రిగారికి ఈ పవిత్రమైన కార్యక్రమాన్ని కాశీలో జరపాలని మేమందరం కలిసిమెలిసి ఏకగ్రీవంగా నిర్ణయించుకున్నాము. కాశీ, ఉత్తర భారతదేశంలో అత్యంత నిగూఢార్థాలతో, అంత్యక్రియలను నిర్వహించేందుకు, అఘోరాలకు, ఋషులకు నిలయమైన ప్రదేశం. సనాతన సంప్రదాయాలకు మరియు భక్తులకు ఆలవాలమైన పవిత్ర నగరం వారణాసి.

హిందూ సంప్రదాయాలు చాల ఆనందాన్నిస్తాయి. నేలపై రంగవల్లులు అద్దుతాము. అద్భుతమైన, రుచికరమైన ఆహారాన్ని దేవుడికి సమర్పిస్తాము. దేవుని పూలతో, మాలలతో అలంకరించడం, ధూపదీపాలు వెలిగించడం, సంగీతంతో దేవుని కీర్తించడం, దానం చేయడం, సేవ చేయడం, నర్తించడం ఇవన్నీ కూడా మన సంప్రదాయంలో భాగాలుగా ఉన్నాయి.

ఏకాదశి ఉపవాసం, శివరాత్రికి మేల్కొని ఉండడం, ధ్యానంలో కూర్చోవడం, చనిపోయేదాకా మౌన వ్రతంలో ఉండడం, ఉపవాస దీక్షలు చేయడం, ప్రాణ ఉపసంహరణ ఇవన్నీ కూడా మన సాంప్రదాయాలే.

కాశీ నగరం హిందూ సంప్రదాయాల వెలుగుల సంక్షిప్త సారాంశం. మనం అందరూ ఈ ప్రపంచంలో సంగీతాన్ని, పువ్వులను, అత్యంత రుచికరమైన ఆహారాన్ని ఆనందంగా అనుభవించడానికి వచ్చాము. అలానే ఆ పరమశివుని లాగా మనం కూడా సర్వమూ త్యజించి, మన బిక్షా పాత్రలో ఏది వస్తే అది స్వీకరించేందుకు

ఉండడం అన్న భావంతో బ్రతికేందుకు వచ్చిన వారిని ఇక్కడ చూడవచ్చు.

ఇంకా మనం పవిత్రమైన నదులలో అస్థికలు కలపడాన్ని నమ్ముతాము. మేము అస్థికలను సేకరించి కుండలో భద్రపరిచి ఇక్కడకు తీసుకొని వచ్చాము. మా అమ్మగారు కూడా మాతో వచ్చారు. మేము నాన్నగారి అస్థికలకు పూజ జరిపి వాటిని పవిత్ర గంగలో కలపడానికి బోటులో వెళ్లాము. గంగమ్మలో మన ఆత్మీయుల చితాభస్మాన్నీ కలపడం అన్నది ఆత్మని బంధనల నుండి విడుదల చేసుకొని విముక్తి వైపుగా ముందుకు సాగడానికి చేసే సహాయమని మన పవిత్ర గ్రంథాలు చెబుతూ ఉన్నాయి.

అందువల్ల భారతదేశంలోని ప్రతి కుటుంబం వారి ఆత్మీయుల కోసం పవిత్రమైన ఈ అంతిమ సంస్కారాన్ని నిర్వహించాలన్న ప్రగాఢమైన కోరికతో ఉంటారు.

మా దృష్టి అంతా గంగమ్మ తల్లికి సంబంధించిన ఆచారాలపై ఉండటంతో ఏ దేవాలయాన్నీ దర్శించలేదు. కాశీలో భరించలేనంతగా వేడిగా వుండటం వలన మేమంతా చెమటలు కక్కుతూ ఉన్నాము. పడవలో పుణ్య గంగానదీ తీరం పొడవునా నిర్మించిన స్నాన ఘట్టాలను సందర్శించి, సూర్యాస్తమయం తరువాత పవిత్ర గంగా హారతికి వేదిక సిద్ధమయ్యే సరికి, దశాశ్వమేధ ఘాటుకు చేరుకున్నాం. కాశీ యాత్రకు వచ్చిన ప్రతి ఒక్కరూ కులమత భేదాలు లేకుండా ఈ గంగమ్మ హారతిని చూడటానికి పోటీలు పడి చక్కగా జరిగే ఆ వేడుకని సరిగా కనిపించేలా ప్రధాన ప్రదేశాలలో కూర్చుంటారు. సుమారు 60 నిమిషాల పాటు జరిగే గంగా హారతి నిజంగా అందరికీ కన్నులకి పండగే అనటంలో ఎట్టి సందేహం లేదు.

మేము మమ్మల్ని వదిలి వెళ్ళిన తండ్రిగారి ఆత్మ కోసం ప్రార్థన చేసి గదికి తిరిగి వచ్చాము. వారణాసిలో వందలాది ఆశ్రమాలు. అనేక మందికి ఆశ్రయాన్ని, భోజనాన్ని ఇస్తున్నందుకు కృతజ్ఞతలు చెప్పుకోవాలి. ఇలాంటి సత్రాలను, ఆశ్రమాలను భారతదేశంలో అనేక యాత్ర స్థలాలలో నిర్మించడానికీ ఇంత ఎక్కువగా సాయం చేస్తున్న శ్రీ మేడానర్సింహులు, మేడాచారిటీస్ వంటి వేలాది మంది కృషికి మన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియపరచుకోవాలి. కాశీలోని అన్నపూర్ణ సత్రంలో మేము ఉండటానికి అందులో గది నిర్మాణానికి విరాళం

ఇచ్చిన శ్రీ మేడా నరసింహులుగారి నుంచి ఒక ఉత్తరం తెచ్చుకున్నాము.

మొత్తం భారతదేశ సందర్శనలో నాతో అత్యంత ప్రభావితంగా పరిగణించ బడిన ఒక అసాధారణ విషయం ఏమిటంటే, భారతదేశంలో అనేక మంది ప్రతిభావంతులైన వ్యక్తులు వారి శక్త్యానుసారం చేసిన నిస్వార్థమైన సేవ. నా దృష్టిలో మనలను శాశ్వతంగా చేయించేవి మనం బ్రతికి ఉన్నప్పుడు చేసిన మంచి పనులే అనిపిస్తుంది.

మరుసటి రోజు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ గారు కాశీకి రానున్న నేపథ్యంలో ఆ నగరమంతా పటిష్టమైన భారీ బందోబస్తు చేసారు. మోదీగారు కాశీని తన నియోజకవర్గంగా ఎంచుకోవడమంటే చాలా పవిత్ర లక్ష్యం ఉన్నదని నేను అనుకుంటాను. ఈ లక్ష్యం రాజకీయ కోణంలో కాక, మానవీయ కోణంలో, సంస్కృతి కోణంలో, సంప్రదాయ కోణంలో, ఆధ్యాత్మిక కోణంలో చూడాలి అనిపిస్తుంది.

త్వరలో కాశీకి పుర్వ వైభవాన్ని మరింత అభివృద్ధిని తీసుకువచ్చే ప్రయత్నం చేస్తారని నాకు కనిపిస్తోంది.

## జూలై 6, 2019

## సోదర త్రయం - నదీ త్రయం:

హిందువులకు అత్యంత పవిత్రమైన స్థలం ఉత్తరప్రదేశ్‌లోని ప్రధాన పట్టణమైన 'ప్రయాగ్‌రాజ్'. ఇది వారణాసికి సుమారు 120 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఉదయమే 6 గంటలకు బయలుదేరి 9 గంటలకు చేరుకున్నాము (ఇంతకు ముందు దీనిని అలహాబాదుగా పిలిచేవారు).

ప్రయాగ్‌రాజ్ అనేది గంగ, యమునా మరియు సరస్వతీ నదుల సంగమం వద్ద ఉన్న ఒక అందమైన నగరం. ఈ నగరం ఆధ్యాత్మికత మరియు పౌరాణికతతో ప్రపంచ యాత్రికులను ఆకర్షిస్తుంది, ప్రపంచ నలుమూలల నుండి వచ్చిన యాత్రికులనే కాక, వారసత్వ సంపదని ప్రేమించే వారిని కూడా ఇది ఆకర్షిస్తుంది.

ప్రయాగ్‌రాజ్ పవిత్రత, ప్రాచీనత, చరిత్ర, వాస్తు జ్ఞానముల కలయిక. ఈ నగరంలో చరిత్ర నుండి మతం వరకు విభిన్నమైన అనుభవాలను అందిస్తుంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద భక్తుల సమ్మేళనంగా నిర్వహించే

కుంభమేళాను నిర్వహించే గమ్యస్థానాలలో ఒకటి.

మొఘలులకు వారి సామ్రాజ్యాన్ని రక్షించుకోవడానికి ఈ నగరంకు గొప్ప వ్యూహాత్మక ప్రాముఖ్యత ఉంది. అంతేకాక, బ్రిటిష్ వారి హయాంలో వారికి ప్రముఖ పరిపాలన కేంద్రంగా ఉంది. భారతదేశం యొక్క స్వాతంత్ర ఉద్యమ సమయంలో ఈ నగరం వారి కార్యక్రమాలకు కేంద్రంగా ఉంది. ఎందరో గొప్ప నాయకులు ఈ నేలపై జన్మించారు. వారు స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొనడమే కాక, హిందీ, ఉర్దూ సాహిత్య అభివృద్ధిలో ప్రముఖ పాత్రను కూడా పోషించారు. ఈ నగరాన్ని పురాతన గ్రంథాల్లో తీర్థరాజుగా వర్ణించారు. ఇది అత్యంత పవిత్రమైన తీర్థయాత్ర కేంద్రంగా భాసిల్లుతోంది.

వాస్తవానికి, మనుషుల భావోద్వేగాల నుంచి తప్పించుకునేందుకు ఇది ఒక పరిపూర్ణ వేదిక. ఎస్.ఎస్.రంగయ్యగారి కుమారులమైన మేము, మా అమ్మగారితో కలిసి, ఇక్కడే మా నాన్నగారి అస్థికలను/చితాభస్మాన్ని కలపడానికి నిర్ణయించుకోవడానికి ఇది సరైన కారణం.

మేము నదిలో స్నానం చేసి, అస్థికలను/చితాభస్మాన్ని పవిత్రంచేసే కర్మలను నిర్వహించాము. మా తండ్రిగారిని మనసారా స్మరించుకుంటూ, ఆ చితాభస్మానికి అంతిమ నివాళులు అర్పించాము. ఇదంతా కూడా స్థానిక పూజారి ద్వారా జరిగిన ఒక గంట ప్రక్రియ. తర్వాత ఆ చితాభస్మాన్ని తీసుకొని పడవలో ప్రయాగ సంగమానికి వెళ్లి, మరణించిన మా నాన్నగారి ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయనకు మోక్ష ప్రాప్తి కలగాలని ప్రార్థిస్తూ, ఆ సంగమంలో సమర్పించాము.

ఆచార వ్యవహారాలు ఒక్కో మతానికి ఒక్కో విధంగా ఉండవచ్చు, కానీ అంతరార్థము ఒకటే. అది మరణించిన వారి ఆత్మను దైవ సన్నిధికి పంపడం. మేము చితాభస్మాన్ని నదిలో కలిపి తర్వాత స్నానం చేసి తిరుగు ప్రయాణం అయ్యాము.

ఆ సమయంలో నేను శ్రీ చిన్న జీయర్ స్వామీజీ నుంచి ఒక సందేశం అందుకున్నాను:

“జై శ్రీమన్నారాయణ! బాలచంద్రాజీ! మీ నాన్నగారి పరమపదోత్సవమునకు మంగళశాసనములు.” – చినజీయర్.

ఈ సందేశాన్ని నేను స్వీకరించిన సమయం, స్థలం, అప్పుడు జరిగిన ఆచార వ్యవహారాలు విధి విధానాల వల్ల నాకు, ఒక దివ్యానుభూతిని కలిగించింది.

ప్రియమైన స్నేహితులారా! నాకు, నా తండ్రిని దైవసన్నిధికి ఈ విధంగా పంపడం కూడా జీవితానికి అభ్యాసం మరియు అనుభవం అనుకున్నాను. చితాభస్మాన్ని కలుపుతున్నప్పుడు నాకు ఈ క్రింద ప్రార్థన గుర్తుకు వచ్చింది.

వాయురనీలామృతం । మథీదమ భస్మాథం శరీరం ॥

ఓమ్ క్రతో స్మర కృతం । స్మర క్రతో స్మర కృతం స్మర ॥

ఈ తాత్కాలిక దేహము బూడిద కానివ్వు, ఈ ప్రాణవాయువు అనంత వాయువులో లీనం కానివ్వు. ఓ దేవా! నేను చేసినది గుర్తుంచుకో. నీవే చరమ భోక్తవు కనుక, నీకొరకు నేను చేసినదంతా దయచేసి గుర్తుంచుకో.

రెండు రోజుల కాశీ ప్రయాణ కాలంలో మేమంతా కలిసి మా తల్లిదండ్రులతో మాకు ఉన్న అనుభవాలను నెమరు వేసుకుంటూ, అన్నిటికి మించిన మా నాన్నగారి వ్యక్తిగత లక్షణాల గురించి, అవి చిన్నప్పటి నుంచే మాపై చూపిన ప్రభావం గురించి మాట్లాడుకున్నాము.

ఆ తర్వాత వారణాసిలో లాల్ బహదూర్ శాస్త్రీ విమానాశ్రయానికి చేరుకున్నాము. విమానాశ్రయానికి చేరుకున్న తర్వాత, ఆ రోజు ఉదయం శ్రీ నరేంద్ర మోడీ గారు వారణాసికి వెళ్ళే సమయంలో ఆవిష్కరించిన శ్రీ లాల్ బహదూర్ శాస్త్రీ గారి అందమైన, గంభీరమైన, ఎత్తైన విగ్రహాన్ని గమనించాను. విమానాశ్రయంలో వేచి ఉండే సమయాన్ని ఆ రోజు నోట్స్ తయారుచేసుకొని, సద్వినియోగం చేసుకున్నాను. బెంగళూరుకు తిరుగు ప్రయాణం మొదలు పెట్టాను.

## జూలై 12, 2019

### కుటుంబంతో కావేరినదీ తీరానికి:

కళ్ళతో చూసేదే ఏది వాస్తవం కాదు.
కళ్లకు కనిపించనిదే వాస్తవం కావచ్చు.
చుట్టూ ఉన్న వాళ్లు శాశ్వతం కాదు.
సూత్రం ఎప్పుడూ తన రూపాన్ని మార్చుకోదు.

మార్పు తప్ప ఈ ప్రపంచంలో స్థిరంగా ఏమీలేదు. అలాగే మన జీవితంలో

కూడా. పుట్టినప్పటి నుంచి ప్రతీక్షణం మనిషి తన ఆకారాన్ని మార్చుకుంటూనే ఉంటాడు. ఏదేమైనా చివరికీ మరణం మాత్రమే ముగింపు అవుతుంది.

ఇది భారతీయ తత్వశాస్త్రం యొక్క విశ్వాసం.

నాన్నగారు ఈ లోకం నుంచి నిష్క్రమించినప్పటి నుండి, మేము ఏం చేస్తున్నామో, అవన్నీ కూడా ఎన్నో కొత్త విషయాలను నేర్చుకోవడానికీ ద్వారాలు తెరుస్తూనే ఉన్నాయి. ఆర్తితో నిర్వహించబడే ఈ ఆచారాలు కూడా చెప్పనలవి కానటువంటి సత్యాలను వెలికితీస్తూ ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించాయి. అందుకే ఏ కర్మ (Ritual) ను ఆచరించేవారైనా అందుకు స్ఫూర్తి (Spirit) ని చేరుస్తేనే అది ఆధ్యాత్మికం (SpriRitual) అవుతుంది.

ఇక మేము దక్షిణ భారతదేశ జీవ నది అయిన కావేరి నదిని సందర్శించాము. ఆ పుణ్య నదీ తీరంలో మేము అస్థి సమర్పణ కార్యక్రమాలను నిర్వహించాము. మా నాన్నగారి భౌతిక శేషాలకు, ప్రేమతో, శ్రద్ధతో, గౌరవంతో, భక్తితో చేస్తున్న శ్రాద్ధకర్మ. అస్థికలకు పాలు, పెరుగు, తేనె, పంచదార, గంగనీరు, పువ్వులు, కొబ్బరి నీళ్లతో పవిత్ర స్నానం చేయించడం అన్నది అగ్ని సంస్కారంలో వారి శరీరానికి కలిగిన వేడి నుండి ఉపశమనం కోసం.

మేము మా తండ్రికి అత్యంత భక్తిశ్రద్ధలతో నిత్య కర్మలు చేసినాము. మా తండ్రికి ఇష్టమైన ఆహార పదార్థాలని సమర్పించాము. చివరికి, మేము వారి చితాభస్మాన్ని శ్రీరంగపట్నంలోని కావేరి (పశ్చిమవాహిని) లో విలీనం చేసాము. అలా కోన రంగనాథుని ప్రసాదంగా పుట్టిన వారి అస్థికలను కావేరి తీరంలో రంగనాథుని సన్నిధిలో విసర్జన చేసాము. మాతో పాటు కొద్దిమంది కుటుంబ సభ్యులు భక్తితో, ప్రేమపూర్వక ప్రార్థనలతో వచ్చారు. మేమంతా సాయంకాలం బెంగళూరు చేరుకున్నాము.

మనిషి జీవిత సారాంశం పంచభూతాల నుంచి ఉద్భవించి, ఈ ప్రపంచం నుంచి నిష్క్రమిస్తూ మళ్ళీ అదే పంచభూతాలతో కలిసిపోవడమే అన్నది అర్థం అయింది. ఇక మధ్యలో ఆ వ్యక్తి ఏవైనా మంచి పనులు చేసి సద్గతిని పొందటమే పరమార్థం.

నేను జూన్ 27, 2019 నాడు బెంగళూరు చేరుకున్నప్పటి నుండి, మా నాన్నగారికి సంబంధించిన వివిధ కార్యక్రమాలలో, ఆయన అంతిమ యాత్రలో

నిమగ్నమై ఉన్నాను. నేను దీనిని భారత దర్శన్‌లో ఒక భాగంగా భావించాను. ఈ ప్రయాణంలో ఎన్నో జీవిత ప్రయోగాలు చేస్తూనే ఉన్నాను. ఈ నిత్యకర్మలో పడిపోవడం వలన భారత దర్శన్ సమయములో జరిగిన కొన్ని అద్భుతమైన విషయాలు చెప్పడాన్ని మరచిపోయాను.

నేను వాటిని కనుక మీతో పంచుకోకపోతే... నా కృతజ్ఞత తెలుపకుండా కృతఘ్నుడిగా మారినట్టే.

భగవంతుడు జీవితంలో ప్రసాదించిన అరుదైన అవకాశం ఈ భారత దర్శన్... ఇది చాలా అమూల్యమైనదని నేను భావిస్తున్నాను. నా ఈ ప్రయాణంలో ఎదురైన మంచి, చెడు విషయాలన్నీ చక్కగా నమోదు చేయాలని నిర్ణయించు కున్నాను. నన్ను నేను సరిదిద్దుకునేందుకు దోహదం చేసిన అంశాలు ఉన్నాయి... ఇంకొన్ని నన్ను అంతర్ముఖునిగా చేసాయి.

భారత దర్శన్ సంకల్పానికి తోడుగా సుమారు 300 మంది దయార్ద్ర హృదయులు సహకరించారు. వారందరికీ నేను ఎక్కడున్నానో, ఏం చేస్తున్నానో చెప్పడం, నా అనుభవాలను పంచడం నా బాధ్యతగా భావించాను. ఇది నా కనీస ధర్మం మరియు కృతజ్ఞతపూర్వక అర్పణము అని భావించాను.

అందుకై ఫేస్బుక్, వాట్సాప్, అభయ న్యూస్ అప్‌డేట్, కుటుంబ సభ్యులతో సంపర్కం ఇలా ఎన్నో మాధ్యమాల ద్వారా విశేషాలను తెలియజేసే ప్రయత్నం చేసాను. ఈ విశేషాలను వేలాది మంది భారత దర్శనము నిజంగానే చేస్తున్నట్టుగా భావిస్తూ చదువుతున్నారు. వారి ప్రేమను, శ్రద్ధను, నాకు తెలియచేస్తూనే వున్నారు. ఎవరికి తోచినంత వాళ్లు సాయం కూడా చేస్తున్నారు.

ఖమ్మం వాస్తవ్యులు శ్రీ దేవకి వాసుదేవరావుగారు భారత దర్శన్ సమయములో నా చేతుల్లో మంచి ఫోన్ ఉండాల్సిన ప్రాముఖ్యత గుర్తించి, బెంగళూరు మజిలీలో ఉన్న నాకు చేరే విధంగా సుమారు 50 వేలు విలువ చేసే One+7 PRO స్మార్ట్‌ఫోన్‌ను బహుమతిగా పంపించారు. హైదరాబాదులో గత రెండున్నర దశాబ్దాలుగా ఆయన తన కుటుంబ సభ్యులతో కలసి నాతో పాటు నడుస్తూ శ్రేయోభిలాషిగా ఉండటం నిజానికి నేను చేసిన అదృష్టమే. ఆయనకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

బెంగళూరు వాస్తవులు శ్రీ ఎస్వీ హరి ప్రసాద్, అభయ ఫౌండేషన్ వ్యవస్థాపక

ధర్మకర్త, నా ప్రయాణం గురించి తెలుసుకుని, సంతోషించడమే కాక, చేపట్టిన కార్యం సులభ సాధ్యం కాదని ఆశ్చర్యపోయారు. వెళ్ళేముందు భారత దర్శన్‌కు సహాయం చేయండని చేసిన విజ్ఞప్తిని ఆయన చూడలేదని చెప్పి, అప్పటికప్పుడే ఒక 25 వేల రూపాయలను నా ఖాతాలో జమచేసారు. నేను పుట్టినప్పటి నుంచి అన్నీ తెలిసిన వ్యక్తిగా, తన అభిప్రాయాలను నిష్కల్మషంగా, నిర్మొహమాటంగా వారు చెప్పడం అనే దానిని నేను ఒక వరంగా భావిస్తాను.

హైదరాబాద్ వాస్తవ్యులు శ్రీమతి లీలా & శ్రీ లక్ష్మారెడ్డి, హరిత విప్లవ మండలి వ్యవస్థాపక సభ్యులు. వారు నా భారత దర్శన్ గురించి తెలుసుకుని ఎంతగానో సంతోషించి, వారి వంతుగా ఏం చేయాలో చెప్పమన్నారు. నా ప్రయాణానికి సంబంధించి ఏదైనా నాకు ఉపయోగకరంగా ఉండే విధంగా చేయమని అర్థించాను. వారు తమ శుభాకాంక్షలతో పాటు 25 వేల రూపాయలను నా ఖాతాకు బదిలీచేసారు. వారిని గురించి తెలిసిన ఆరేళ్లలో నేను కేవలం మూడు సార్లే వారిని చూసాను. వారు ఎంతో నిస్వార్థంగా దేశంలో హరిత విప్లవం కోసం కృషి చేస్తున్నారు. వారికి భగవంతుడు శక్తిని ఇవ్వాలని ప్రార్థిస్తున్నాను.

శ్రీ హరి నా చిరకాల సహచరుడు మరియు తమ్ముడు లాంటివాడు. బెంగళూరులో ఉన్న వ్యాపార వేత్త. నా ప్రయాణం గురించి విన్నాడు, చాలా ప్రేమతో పదివేల రూపాయలను నా ఖాతాకు బదిలీచేసారు. బెంగళూరుకు నేను వచ్చినప్పుడు నాకు తన సమయాన్ని, అచంచల విశ్వాసంతో వెచ్చించి, నా తోడుగా ఉండే వ్యక్తి.

మరో మంచి స్నేహితుడు శ్రీ కరుణాకర్, అతి ప్రతిభావంతుడైన వృత్తి నిపుణుడు. నా భారత దర్శన్ పూర్తయ్యేంత వరకు నెలకి 5000 రూపాయలు పంపిస్తూనే ఉంటానని చెప్పాడు. నాకు అతనికి కృతజ్ఞతలు తెలియపరిచేందుకు మాటలు లేవు. అతని ప్రేమ, ఆదరణ నాకు మంత్రముగ్ధుడిగా మార్చాయి.

ఇక, నేను సందర్శించే ప్రతీ రాష్ట్రంలో, నాకు అండగా నిలిచేందుకు అసంఖ్యాక శ్రేయోభిలాషులు ఉంటూనే ఉన్నారు.

హిమాలయ ప్రాంతాలలో నా ప్రయాణాన్ని పరిగణలోకి తీసుకుని అమర్నాథ్, కేదార్నాథ్, ముక్తినాథ్, హరిద్వార్, ఋషికేశ్ మరికొన్ని ప్రాంతాల

పర్యటనలో ఖర్చు గురించి వాకాబు చేసాను. ఆఖరుకు అనుకున్న దానికంటే ఎక్కువ ఖర్చు అవుతుందనే నేను ఊహించినాను. వందలాది శ్రేయోభిలాషులు ఇచ్చిన ప్రతి పైసా జాగ్రత్తగా, పొదుపు చేయాలని నిర్ణయించుకున్నాను, అలా పిసినారిలాగా మారిపోయాను. విజిట్ కైలాష్ టీం వారు నా భారత దర్శన్ గురించి తెలుసుకున్న తరువాత, కైలాస యాత్ర ఖర్చులో మంచి తగ్గింపు ఇచ్చారు.

నేను నా జీవితంలో ఒక విషయం గాఢంగా నమ్ముతాను: సంకల్పాలు స్వచ్ఛంగా ఉంటే, జీవితంలో మన చుట్టూ ఉండే ప్రతీ ఒక్కరూ దేవుళ్లుగా మారి మనకోసం నిలబడతారు. అంతేకాదు, ప్రేమతో సంరక్షణను అందించడమే కాకుండా, మార్గం తెలుసుకొని మరింత మార్గనిర్దేశం చేస్తారు.

ఇక ప్రస్తుతంలోకి వస్తాము...

## జూలై 14, 2019

## అయ్యా, మీరు సద్గతిని పొందుదురు గాక

తండ్రిగారు పరమపదించిన తరువాత, 16 రోజుల పాటు నేను అంత్యక్రియలతో సంబంధిత వివిధ ఆచారాలను నిర్వహించడంలో నిమగ్నమై ఉన్నాము. స్వర్గంలో ఉన్న తన తండ్రి, తాతల దగ్గరికి ఆయన ఆత్మను పంపాలన్న సంకల్పంతో నిర్వహించిన ఆచార వ్యవహారాల్లోనే నేను వ్యక్తిగతంగా నిమగ్నమై ఉండటం వల్ల మన శాస్త్రాలలోని ఆచారాలు ఎంత అద్భుతంగా చెప్పబడ్డాయో అర్థం చేసుకున్నాను. ఈ లోకం నుండి వెళ్లిపోయిన వారి ఆత్మను సద్గతిలోకి పంపించే లక్ష్యంతోనే ఈ ఆచారాలన్నీ ఉంటాయి. ఇది ఒక సురక్షిత ప్రయాణం.

వైశ్యకులముకు చెందిన శ్రీ రంజిత్, బెంగళూరులో 30 సంవత్సరాల క్రితం శ్రీ గుండయ్య శెట్టిగారు స్థాపించిన వేద పాఠశాలలో వేద విద్య చదువుకున్నాడు. అతనిలాగే సుమారు 300 మంది పేద విద్యార్థులు వేద విద్యను ఉచితంగా చదువుకొని, నిష్ణాతులై.... పౌరోహిత్యమే ఉపాధిగా చేసుకున్నారు. గౌరవప్రదమైన జీవితాన్ని గడుపుతూ, భారతీయ నాగరికతను, సంస్కృతి సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను, వారి విద్వత్తు మరియు వేద పరిజ్ఞానంతో ఉన్నత స్థాయికి తీసుకెళ్ళే ప్రయత్నం చేస్తున్నారు అని తెలుసుకున్నాను.

ఆ రంజిత్ తండ్రిగారి నిత్యకర్మలను శాస్త్రోక్తంగా చేయించారు. ప్రతీ

ఆచారంలో నున్న విశిష్టతను వివరిస్తూ చాలా చక్కగా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ రంజిత్ గారి కృషిని తెలుసుకున్న నేను ఎంతగానో సంతోషపడ్డాను. ఆయన్ని ఒక శాలువాతో సత్కరించి, కొంత ధనమునూ అందించి ఉత్సాహపరచే ప్రయత్నం చేసాను.

ఇంకోపక్క, హైదరాబాద్ నుంచి అదే పనిగా, నాన్నగారు మరణించిన తర్వాత అమ్మని నన్ను పలకరించడానికి బెంగళూరుకు వచ్చిన సాయి సోదరులు గంగాధరశర్మ (రింగురాజు), రవికిరణ్, ఫణిశంకర్, సాయి వినోద్‌లను చూసి ఎంతో ఆశ్చర్యచకితుడినయ్యాను. వారి ఆప్యాయత మరియు అనురాగాలకి నేను పులకించిపోయాను. వారి ప్రేమకు దాసోహమయ్యాను.

ఎంతో మంది బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు నాన్నగారిని పుణ్య లోకాలకు పంపే చివరి ఆచార వ్యవహారాల్లో పాల్గొన్నారు. నా చిన్ననాటి స్నేహితుడు డాక్టర్ పివి ప్రదీప్ కుమార్ IRS, దాదాపు 35 సంవత్సరాల తర్వాత 2010లో నాతో మరియు అభయ ఫౌండేషన్‌తో నూతనంగా సంపర్కంలోకి వచ్చారు. అప్పటి నుండి, తను నా జీవితంలో భగవంతుడు పంపిన దూతలాగా మారిపోయారు.

అమ్మగారి అయిదు మంది అన్నదమ్ములు కూడా వయోభారాన్ని కూడా లెక్కచేయక, చివరి రోజున కార్యక్రమానికి వచ్చి ఆశీర్వదించారు. అక్క, చెల్లెళ్ళు, అత్తయ్యలు, పిన్నమ్మలు నా భారతదర్శనం గురించి తెలుసుకుని నాకు కాషాయ వస్త్రాలు బహుకరించి, కొంత ధనాన్ని కూడా అందించారు. వారికి నేను ఎంతో కృతజ్ఞతలు తెలుపుకున్నాను.

శ్రీమతి భైసాని రుక్మిణి గుప్తా, మా వదినగారి (శైలజా నారాయణ) అమ్మగారు. వారు నా భారత దర్శన్ యాత్ర గురించి విని నన్ను ఎంతో ప్రేమతో ఆశీర్వదించి నాకు 20,000 రూపాయలు అందించారు. వారి చర్య నాకు దైవప్రేరణగా అనిపించింది.

మేనమామ (అమ్మ చిన్న తమ్ముడు) పుట్ట వేదప్రకాష్, కోయంబత్తూర్, నాకు భారత దర్శన్‌కి పదివేల రూపాయల విరాళం ఇచ్చారు. ఇవన్నీ నాకు ఎలా అనిపిస్తున్నాయి అంటే దేశంలోని వివిధ దేవాలయాల్లో, దేవతలు స్వయంగా విచ్చేసి వారి ప్రేమానుగ్రహములు ఈ విధంగా వర్షించారని అనిపించింది.

నేను పెద్దలందరికీ పాదాభివందనాలు చేసి, వారి ఆశీర్వచనాలు తీసుకున్నాను.

## జూలై 15, 2019

### నాన్నగారి జ్ఞాపకార్థం అంకితం:

దక్షిణ భారతదేశం నలుమూలల నుంచి తండ్రిగారి వైకుంఠ సమారాధనకు వచ్చిన కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషులందరికి వారిండ్లకు వారు వెళ్ళే సమయములో విలువలతో కూడిన హృదయంతో తిరిగి వెళ్లేలాగా ఆయన వైకుంఠ సమారాధనను చేద్దామని నిర్ణయించున్నాము.

అట్టి ఆలోచనతో SSR Lives On…(వీడియోను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసాము) ఇక్కడికి వచ్చిన ప్రతీ ఒక్కరి దృష్టిని కట్టిపడేసే విధంగా ఆ వీడియోను వైకుంఠ సమారాధన కార్యక్రమంలో ప్రదర్శించాము. అందులో నాన్నగారి జీవితకథ, చిన్నప్పటి జ్ఞాపకాలు, పాత/కొత్త ఫోటోలు, వీడియోలు, బంధువుల మాటలు, కుటుంబ సభ్యుల స్పందనలు ఉన్నాయి.

హైదరాబాద్ నుంచి అభయ ఫౌండేషన్ ప్రెసిడెంట్ రంగారావు గారు, అలాగే అభయ ఫౌండేషన్ సభ్యుడు సిఎ బీవీ ప్రసాద్ గారు ప్రత్యేకంగా, వచ్చి నాన్నగారికి శ్రద్ధాంజలి ఘటించారు. వారి ఈ ప్రేమానురాగాలు జీవితంలో మానవ సంబంధాల విలువల యొక్క ప్రాముఖ్యతను నాకు  తెలిపింది.

ప్రియమైన మిత్రులారా!

ప్రపంచం నలుమూలల నుండి కొన్ని వందల మంది వారి సంతాపాన్ని మా కుటుంబానికి అందించారు. వారందరికీ నేను విన్నవించేదేంటంటే, అందరూ నాన్నగారి గురించి తెలుసుకోవాలంటే, యూట్యూబ్‌లో ఉంచిన ఆ వీడియోని కొద్ది సమయం కేటాయించి చూడండి అని. ఈ వీడియోని తయారుచేసిన బెంగళూరులోని Areena మల్టీమీడియాకు, కృతజ్ఞతలు తెలుపుతూ వారిని అభినందించాను. చాలా కొద్ది కాలంలో ఆ చిన్న వీడియోని అత్యంత సుందరంగా తీర్చిదిద్దిన వారి ప్రతిభకు మనసులో ఎంతో ఆశ్చర్యపడ్డాము.

మేము వారికొక జ్ఞాపికను అందించాము. ఆ తర్వాత నాన్నగారి జ్ఞాపకార్థం అందరికీ రజత పతకాలను కుటుంబంలో మొదటి తరానికి వెండి సామాను అందించాము. మరోపక్క, భారత దర్శన్ యాత్ర కోసం నేను చేసిన విజ్ఞప్తిని

గుర్తుంచుకుని, ఎంతో మంది బంధువులు నాకు వస్త్రాలు బహూకరించి ఆశీర్వచనాలు అందజేశారు. అందులో ప్రతి ఒక్కరూ కూడా నాకు హిమాలయ యాత్ర కోసం శుభాకాంక్షలు తెలిపారు. ఈ క్రింద కనబరిచిన కుటుంబ సభ్యులు, స్నేహితులు నా భారతదర్శనం కోసం ఎంతో సహాయం చేసారు.

శ్రీమతి & శ్రీ సుంకు వెంకటహరి ప్రసాద్

శ్రీమతి & శ్రీ లక్ష్మారెడ్డి

శ్రీమతి & శ్రీ మోహన్ గుప్తా

శ్రీమతి బైసాని రుక్మిణి దేవి

శ్రీమతి & శ్రీ సి.ఎ.ఎ.వి. సతీష్ కుమార్

శ్రీమతి & శ్రీ పుట్ట వేదప్రకాష్

శ్రీమతి & శ్రీ కే రంగారావు

శ్రీమతి & ఆర్ శ్రీహరి

శ్రీమతి & శ్రీ కె ఉదయ్ రాకేష్

శ్రీమతి & శ్రీ కరుణాకర్

శ్రీమతి విశాలాక్షి

శ్రీమతి గాయత్రి మూర్తి

శ్రీమతి మేడా సుదర్శనమ్మ

శ్రీమతి & శ్రీ జి సుబ్బారావు

శ్రీమతి పద్మా వెంకటేష్

శ్రీమతి వాణి రవి

డాక్టర్ చంద్రన్

శ్రీమతి & డాక్టర్ కె నరసింహారావు

కుమారి సుంకు చిన్మయి

శ్రీమతి జి భరతి సురేశ్

ప్రపంచవ్యాప్తంగా వందలాది మంది ఆత్మబంధువులు భారత్ దర్శన్‌కు చేయూతనిచ్చి, వారి ప్రేమతోనూ శ్రద్ధాసక్తులతోనూ నాకు తోడుగా నిలవడం అన్నది నన్ను వారందరూ దైవానుగ్రహమునకు దగ్గరగా చేర్చినట్లు భావించాను. తెలిసిన వారి కోసం మరియు తెలియని వారి క్షేమార్థం భారత్ దేశయాత్ర

సంకల్పం మరియు ప్రార్థన నాది అయినప్పటికీ... నా ఈ భారత్ దేశయాత్రకు చేయూతనిచ్చి, ఆశీర్వదించి, శుభాకాంక్షలు అందించిన ప్రతీ ఒక్కరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపడానికి నేను ఈ అవకాశాన్ని తీసుకుంటున్నాను.

ఆనాటి సాయంకాలం భగవంతుడి ఆశీర్వాదాల కోసం మేము ముగ్గురు అన్నదమ్ములం కలిసి ఇంటి వద్ద నవగ్రహ మరియు నక్షత్ర శాంతి హెూమాన్ని నిర్వహించాము. పురోహితులు అందరూ బయలుదేరేముందు మా కుటుంబాన్ని ఆశీర్వదించారు. ఈ అంకంతో నాన్నగారి అంతిమ యాత్రకు సంబంధించిన సుదీర్ఘ కర్మలకు తెరదించాము.

# ఆంధ్రప్రదేశ్

## జూలై 17, 2019

**ప్రశాంతి నిలయం:**

నన్ను స్వార్థరహితంగా మార్చిన ప్రదేశం. నేను అక్కడికి చేరిన రోజున ఆషాడ శుద్ధ పూర్ణిమ. దీనిని వ్యాస పూర్ణిమ అని అంటారు. వేదాలు మరియు భారతీయ ఇతిహాసములకు చేసిన అత్యుత్తమ సేవకు, అనంతమైన కృషికి వేదవ్యాసుడు ఆదిగురువుగా కీర్తించబడినాడు. అంతే కాక ఆ రోజు బుద్ధ భగవానుడు తన ప్రథమ సందేశం ఇచ్చిన రోజు బుద్ధ పూర్ణిమగా కూడా గుర్తిస్తారు. కోట్లాది హిందువులు, బౌద్ధులు, జైనులు, ఇతర వర్గాల వారు తమ గురు పరంపరకు కృతజ్ఞతలు చెప్పేందుకు ఈ రోజును గురు పూర్ణిమగా కీర్తించారు. అలాగా గురు పూర్ణిమ గురించి ఆలోచిస్తూ నా గురు పరంపరకి కృతజ్ఞతలు తెలుపుకోవడానికి ప్రశాంతి నిలయం వెళ్లాను. ఇలలో పరిపూర్ణ ప్రశాంతత దొరికే దైవ సన్నిధికి నేను, సోదరుడి కారులో అతని కారు డ్రైవర్‌తో సహా సందర్శించాము.

పవిత్రమైన గురుపూర్ణిమ రోజున నా సంరక్షకుడు, గురువు, దేవుడి సమక్షంలోనే ఉండగలగడం నా అదృష్టంగా భావించాను. తండ్రిగారి అంతిమ యాత్రకు సంబంధించిన అన్నీ కర్మలు పూర్తిచేసిన తరువాత ప్రతి ఒక్కరూ తమ ఇళ్లకు తిరిగి వెళ్ళిపోవాలి. నేను నా ఇల్లు అయిన ప్రశాంతి నిలయానికి వచ్చాను. స్వామీ! నేను నీ బిడ్డని అని స్వామికి చెప్పడానికి. చివరి శ్వాస వరకూ అందరిని ప్రేమించాలనీ, అందరిని సేవించాలనీ హృదయపూర్వకంగా ప్రయత్నిస్తున్నాను అనీ చెప్పడానికి స్వామివారి దరి చేరాను.

## సాయి ఆత్మబంధువు మధుసూదనరావు:

నేను ఉదయం ఎనిమిది గంటలకి ప్రశాంతి నిలయం చేరుకున్న సమయానికీ నాకు అత్యంత ప్రియమైన సాయిసోదరుడు మధుసూదనరావు, తన తల్లితో శ్రీ సత్యసాయి జనరల్ హాస్పిటల్‌లో వున్నట్లు తెలిసింది. నేను బాబా నివాసంలోకి ప్రవేశించేకి ముందే ఆమెను దర్శించాను. హిందూపుర్‌లో తన కొడుకుతో కలిసి ఉండమని నేను ఆమెను అభ్యర్థించాను. ఆమెకు సుమారు 80 సంవత్సరాలు చాలా బలహీనంగా ఉంది, ఆమె ఆ వయసులోనూ అంతా స్వామి చూసుకుంటారు అని చెప్పారు. నేను జీవితంలో చూసిన అత్యుత్తమ వ్యక్తులలో వారి అబ్బాయి మధు ఒకరు. మూడున్నర దశాబ్దాల నుండి నేను ఆయన ప్రేమలోను మరియు సంరక్షణలోను ఉండడం నా అదృష్టము. దేశంలోని సాయిసంస్థల సభ్యులలో ఆయన చాలా ప్రముఖులు. అప్పుడెప్పుడో, స్వప్నంలో బాబా కనిపించి హిందూపురం వచ్చి స్వామి సేవ చేస్తూ అక్కడే ఉండమన్న ఆజ్ఞకు బద్ధుడై జీవితభీమా సంస్థలో పదోన్నతులు కూడా వదులుకుని అక్కడే స్థిరపడినారు. ఎంతో మంచి వ్యక్తి, సేవాస్ఫూర్తితో జీవిస్తూ... తన జీవితాన్ని సార్థకం చేస్తున్నాడు ఈయన. అసలు ఇలాంటి వారు నిజమైన సాయి ఆత్మబంధువులు (Sai SoulDears).

## సాయిసన్నిధిలో గురుపూర్ణిమ:

ఆ తరువాత సాయికుల్వంత్ సభా మందిరంలో జరుగుతున్న గురుపూర్ణమ వేడుకల్లో పాల్గొన్నాను. అక్కడ ఉన్న అత్యంత పవిత్రమైన వాతావరణంలో నేను ఎంతో ఉత్తేజితుడినయ్యాను. చివరకు వెళ్లి దివ్య సాయి సన్నిధిని స్పృశించగలిగాను. చాలామంది సాయి సోదరులను కలిసాను. దర్శన శ్రేణుల్లో ఉన్న ఎందరో పెద్దల ఆశీస్సులను కూడా అందుకున్నాను. గురుపూర్ణిమ పర్వదినం సందర్భంగా స్వామివారి దివ్య సందేశమును మందిరంలో వినిపించారు. చాలా విచిత్రంగా అందులో స్వామివారు...

మాతానాస్తి, పితానాస్తి
నాస్తి బంధు సహోదర
అర్థం నాస్తి గృహం నాస్తి

తస్మాత్ జాగృత జాగృత

అన్న ఆదిశంకరుల వారి శ్లోకములను ఉదహరిస్తూ, వాటి అర్థములను చెప్పారు. నేను ఈ విషయములను 11 జూలై 2019 జరిగిన సత్సంగంలో కుటుంబ సభ్యులకి వివరించాను. అలాగా డైరీలో కూడా నోట్ చేసుకున్నాను. అయితే అదే సందేశాన్ని గురుపూర్ణమ ఆడియో సందేశం ద్వారా బాబా నుంచి అందుకున్నాను. ఆదిశంకరుల వారు లోకములో శోకతప్తులైన మానవులకు శ్లోకమును అనుగ్రహించారు. తెలియకుండానే ఆ లోతైన సత్యం నా హృదయంలో లీనమై పోయింది. మా నాన్నగారి అంతిమ యాత్రకు సంబంధించిన ఆచార వ్యవహారాలను ముగించే లక్ష్యంతో నేను కాషాయవస్త్రాలు ధరించి అక్కడికి వెళ్లాను. అత్యంత శక్తివంతమైన రీతిలో సాయిసందేశాన్ని ఆ రోజు ప్రశాంతినిలయంలో అందుకున్నాను. నాకు అసలు నోట మాటలు లేదు. నా జీవితంలో బాబావారి ప్రేమలో... సంరక్షణలో... నా మీద అత్యంత అద్భుతమైన శాశ్వత ప్రభావాన్ని చూపిన గురువులందరినీ ఒక్కసారిగా గుర్తు చేసుకున్నాను.

## చిన్ని గురువు లలిత లహరి:

ఆ తర్వాత నా బిడ్డ లహరిని కలవడానికి అనంతపురం చేరుకున్నాను. ఈ చిన్నారి గత దశాబ్ద కాలం నుండి తన ప్రేమతో సంరక్షణతో నా హృదయాన్ని ద్రవింప చేస్తూనే ఉంది. ఆమె హైదరాబాద్‌లో చదువుతున్నప్పుడు నన్ను కలుస్తూ ఉండేది. ఇప్పుడు ఆమె స్వస్థలం ప్రొద్దుటూరులో ఉండటంతో ఆమెను కలవడం అరుదుగా జరుగుతుంది. ఆమె నాకు చిన్నిగురువు కూడాను. మేమిద్దరం కలిసి అనంతపురంలో భోజనం చేసాము.

## అభయ సాధికారత ప్రాంగణం, రోటరీపురం:

గత ఆరు నెలలుగా వివిధ కారణాలతో, నిధుల కొరతతో నిలిచిపోయిన అభయ సాధికారత కేంద్రాన్ని సందర్శించాము. ఆ బృహత్తర కార్యాన్ని నిర్విఘ్నంగా పూర్తి చేయమని బాబాను ప్రార్థించాను. నాకు ఖచ్చితంగా తెలుసును... ఈ భూమిపై ఏ మూలనైనా సరే బాబా తన పని చేయడంలో మనల్ని తన సాధనాలుగా మలుచుకుంటారు అని. ఆ నమ్మకంతోనే శ్రీ మేడా నరసింహులు,

మేడా ధార్మిక సంస్థ & ధర్మకర్తలు, స్వామివారు ఆదేశించారని అభయ సభ్యులకు చెప్పి, సుమారు 0.75 ఎకరాల స్థలాన్ని 25 ఏళ్ళకు లీజుకు ఇచ్చి ఏదైనా ధర్మకార్యం చేయండని చెప్పినారు. తదాజ్ఞగా అభయ ధర్మకర్తల సౌజన్యంతో ఆ స్థలంలో సుమారు 2.5 కోట్ల వ్యయంతో గ్రామీణ యువత సాధికారత కోసం భవన సముదాయం నిర్మాణానికి పూనుకున్నాము.

# తమిళనాడు

## జూలై 17, 2019

**కోయంబత్తూరు... ఈషా ఫౌండేషన్!**

బెంగళూరు నుండి సుమారు 6 గంటల ప్రయాణం తర్వాత కోయంబత్తూర్‌కి ఉదయం 4:30 కి చేరుకున్నాను. ప్రయాణం యొక్క ఉద్దేశ్యం... మా నాన్న గారికి చేసిన ఉత్తరకర్మల తర్వాత నేను మేనమామ ఇంట్లో భోజనం చేసి బట్టలు స్వీకరించి వారి ఆశీర్వాదాలు తీసుకోవడం.

నేను అక్కడికి చేరిన రోజు చంద్రగ్రహణం ఉదయం 5:30 గంటలకి ముగుస్తుంది. కోయంబత్తూర్‌కి సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈషా ఫౌండేషన్‌ను దర్శించాలని నిర్ణయించుకున్నాను. ఆ తర్వాత నేనే మామ గారింటికి వెళ్ళాలని అనుకున్నాను. మా మేనమామ, బస్సు దగ్గరికి వచ్చి నన్ను పలుకరించి, నేను ఈషా ఫౌండేషన్‌కు వెళ్ళడానికి వాహనాన్ని ఏర్పాటు చేసారు.

నేను ఈషా ఆశ్రమానికి చేరుకొని ఆ ప్రాంగణంలో చాలా సేపు తిరుగుతూ అక్కడే స్నానం చేసాను. ఆ తరువాత నేను ధ్యానలింగం, లింగభైరవి, నంది, సూర్యకుండ్ చివరకు ఆది యోగిని దర్శించాను. చాలా ఉన్నతమైన విగ్రహం. భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోడీగారు ప్రారంభించారు. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది ఈ ప్రాంతాన్ని ఒక క్షేత్రంగా భావించి, వివిధ కారణాలతో వస్తుంటారు.

వెళ్లియగిరి పాద భాగములో, పద్మవిభూషణ్ జగ్గీవాసుదేవ్ (సద్గురు) స్థాపించిన బృహత్తర ప్రాంగణం ఇది. యోగ, ధ్యానం, భక్తి, సేవ మరియు వ్యక్తులకు సంబంధించిన అనేక నమ్మకాలతో ఆ క్షేత్రం నిండి పోయిందని గ్రహించాను. ఇలాగా దేశంలో అసంఖ్యాక ఆశ్రమాలలో జరుగుతూ ఉంటుంది. ఇవన్నీ లేకుండా ఏ క్షేత్రమైనా, ఆశ్రమమైనా మనుగడలో ఉంటుందని నేను

అనుకోను. ఏ సంస్థ అయినా పెద్దగా చేసేది దాని పరిమాణమే అని అనుకోవాలి.

బహిరంగ చర్చా వేదికల మీద ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖులతో చేసిన సద్గురు సంభాషణలు చాలాప్రఖ్యాతి గాంచినాయి. ఇవే కాకుండా ఈషా ఫౌండేషన్‌లో ఇన్నర్ ఇంజనీరింగ్ కోర్సు చాలా ప్రసిద్ధి పొందింది. సద్గురు ఈ మధ్యకాలంలో "Save Water... Save Rivers... Save Soil" అన్న నినాదంతో ప్రపంచ వ్యాప్తంగా చాలా చురుకుగా ఉద్యమాలు నడిపినారు. ఈషా ఒక సాంప్రదాయ ఆశ్రమంగా కాకుండా కార్పొరేట్ క్యాంపస్‌లాగా ఉంది అని చెప్పాలి. ఈ ప్రాంగణం అంతా కూడా ఆధునాతన సాంకేతికతతో అనుసంధానించి నడపబడుతున్నదని చెప్పాలి.

అన్నిటికన్నా ముందు అక్కడ చాలామంది సద్గురు అనుచరులు మరియు స్వచ్ఛంద సేవకులు వారి వారి దినచర్యల్లో నిమగ్నమైపోయి ఉన్నారు. నేను సద్గురును చూడలేకపోయాను. ఎందుకంటే సూర్యోదయానికి ముందు నా సందర్శన మొదలయి మధ్యాహ్నం 12:30కి తిరుగు ప్రయాణం నిర్ణయించ బడింది కనుక.

భారతీయులు దేవుళ్లతోను, విశ్వాసాలతోను ఎక్కువగా ప్రభావితమవుతారు అని చెప్పక తప్పదు. ఇవి మాత్రమే వారి జీవితాలను ప్రభావితం చేస్తాయి. మరింత సానుకూల స్థిర ప్రభావం, మరింత పరివర్తన, మరింత సాధన, వారి జీవితాలను సార్థకం చేస్తాయి. మన దేశంలోని ప్రతి మహానుభావుడు ఇది బోధిస్తాడు. చెప్పే సూత్రాలను కేవలం వింటే సరిపోదు కదా... ఆచరించినప్పుడు ఏదైనా మార్పు కలుగుతుంది. అది ఒక్కటే తేడా...

ఈషా ఫౌండేషన్ వారి మరింత సమాచారం కోసం www.ishafoundation.org ని సందర్శించవచ్చు. అక్కడి నుండి బయలుదేరి మామయ్య వాళ్ళ ఇంటికి వెళ్ళాను. నేనూ మా మామయ్యతో చాలా సేపు గడిపాను. ఆయన ఆశీర్వాదం తీసుకుని అన్నపూర్ణ హోటల్లో భోజనం ముగించాను.

## CS PS రావు గారికి పుట్టినరోజు శుభాకాంక్షలు:

ఆప్తులు, ఆత్మీయులు అయిన CS PS రావు, www.abhayafoundation.org ట్రస్టీ గారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా నా హృదయపూర్వక

శుభాకాంక్షలు తెలిపాను. ఆయన దేశంలోనే పేరున్న వృత్తినిపుణులు. ఆయన, వేలాది మంది ప్రొఫెషనల్ కోర్సులు చదువుతున్న వారందరికీ వారి బోధనా తరగతుల్లో, వారి కార్యాలయం ద్వారా మార్గదర్శిగా ఉన్నారు. తోటివాళ్ల పట్ల ఆయన చూపించే ప్రేమ మరియు వాత్సల్యాలు సాటిలేనివి. నేను జీవితంలో వారి ఆత్మీయతను పొందడం అనేది గొప్ప వరంగా ఎల్లప్పుడూ భావిస్తాను. వారు నాకో స్నేహితుడు, శ్రేయోభిలాషి, మార్గదర్శకుడు, గురువు అని చెప్పాలి. 2019 సంవత్సరానికి, మరొక సంవత్సరం వయసు పెరిగిన ఆయన క్షేమం కోసం ప్రార్థిస్తున్నాను.

## జూలై 18, 2019

**హిమాలయాలకు నా ప్రయాణం:**

నా జీవితంలో భగవత్సంకల్పంతో మూడవ విడత భారత దర్శన్ కోసమై ఉదయం 6 గంటలకు అమ్మ ఆశీర్వాదం తీసుకుని బెంగళూరు నుంచి బయలు దేరాను. నాన్నగారి అస్తికలను నా యాత్రలో నేనూ దర్శించే ప్రతి పవిత్ర నదిలో... ఇంకా ముఖ్యంగా హిమాలయాల్లో ఉన్న పవిత్ర నదులలో కలపడానికి నా సోదరులు మరియు వదినగారు కలిసి ఒక కుండలో భద్రపరిచి ఇచ్చారు.

భారత దర్శన్ కోసం నాకు తోడుగా ఉన్న ప్రతి ఒక్కరూ బాగుండాలని, క్షేమంగా ఉండాలని దేవుడి ఆశీర్వాదం కోసం ప్రార్థించాను. అలా బెంగళూరు నుంచి విమానంలో బయలుదేరి ఢిల్లీ చేరుకున్నాను. కరోల్ బాఘ్ సదరన్ ట్రావెల్స్ కార్యాలయాన్ని చేరుకున్నాను. బస్సులో దక్షిణాది ప్రాంతాల నుంచి వచ్చిన 30 మంది యాత్రికులతో వైష్ణోదేవిని చేరుకోవడానికి ఢిల్లీ-హర్యానాల గుండా ప్రయాణం ప్రారంభమైంది.

బస్సులో ఉన్న తోటి ప్రయాణికులతో మాట్లాడి వారి పేర్లు, వృత్తులు, ప్రదేశాలు మొదలగు వివరాలు పుస్తకంలో వ్రాసుకున్నాను. గైడ్ ఆశిష్‌తో దాదాపు 11 రోజుల ఉత్తర దేశ యాత్ర మొదలైంది. ఢిల్లీలోని తిరుపతి బాలాజీ దేవాలయాన్ని దర్శించుకుని మేము ప్రయాణిస్తున్న బస్సుకు సామూహికంగా పూజ నిర్వహించాము.

డ్రైవర్ సీటు వెనకాల ఉన్న రెండవ నెంబర్ సీటు దొరికినందుకు చాలా

సంతోషించాను. నాకు అందుబాటులో మైక్రోఫోన్ పబ్లిక్ అడ్రస్ సిస్టం ఉన్నందుకు ఇంకా సంతోషం అనిపించింది. ఇది భగవత్ కృపగా భావించి ఆధ్యాత్మిక దృక్పథంతో బస్సులోని ప్రతి ఒక్కరిని కలిపాను. చేయబోయే యాత్ర గురించి దాని ప్రాముఖ్యత గురించి చెప్పి, కొన్ని ప్రయాణపు చిట్కాలు కూడా చెప్పి, ప్రతి ఒక్కరిని బస్సులోని మిగతా వారికి పరిచయం చేసాను. మేమందరం కలసి ప్రార్థన, భజనలతో చక్కగా సత్సంగం చేసుకుంటూ ముందుకు సాగాము. ఇందులో ప్రతి ఒక్కరు ఎంతో చురుకుగా, భక్తిగా, శ్రద్ధగా పాల్గొన్నారు. వైష్ణోదేవి గురించి, ఆ యాత్రకు సంబంధించిన పురాణ ఇతిహాసములు ఉటంకిస్తూ, యాత్ర ప్రాముఖ్యతను అందరిని ఆకర్షించేలాగా చెప్పాను. నా భారతదేశ యాత్ర గురించి కూడా క్లుప్తంగా వివరించాను. దీనితో అందరూ ఉబ్బితబ్బిబ్బయ్యారు. నేను వారితో ప్రయాణించడం వారి అదృష్టం అని చెప్పారు. అంబాలాలో రాత్రి భోజనాల తర్వాత కత్రాకు రాత్రి ప్రయాణం మొదలైంది.

# జమ్మూ & కాశ్మీర్

## జూలై 19, 2019

### వైష్ణోదేవి నిర్మలమైన ప్రకృతి అభయారణ్యం:

అతిసుందరమైన త్రికూట పర్వతాలు... అత్యంత దుర్లభమైన వృత్తాకార మార్గము... ఆపై సుమారు 14 కిలోమీటర్లు కాలినడకతో ప్రయాణం... మధ్యలో గాలి, వాన, ఎండా, వేడి... వెరసి శరీరము, మడిమ నెప్పితో ముగిసింది.

మిగతా యాత్రికులు అందరూ హెలికాప్టర్లు, బ్యాటరీ కార్లు, గుర్రపు స్వారీలు, పల్లకిలు ఎంచుకున్నారు. నేను మాత్రం కాళ్లను నమ్ముకుని నడక మార్గం ఎంచుకున్నాను.

కానీ చాలా క్లిష్టమైన నడక ఇది అని తరువాత జ్ఞానోదయం అయింది. ఆ సిమెంటు, మరియు బండల దారిమీద నడిచే అలవాటు లేకపోవడం వలన చాలా ఇబ్బంది పడ్డాను. సహ యాత్రికుడు యశస్వి కూడా నాతో వచ్చాడు. దారి పొడవునా ప్రకృతి గురించి, వైష్ణోదేవి గురించి వివిధ విషయాలు చర్చించుకుంటూ వేడి, చలి, పొడి గుమ్మరించే వాతావరణాన్ని దారి పొడుగునా అనుభవిస్తూ ముందుకు సాగాము. నిజానికి ఇంతటి పుణ్యక్షేత్రానికి అంత కష్టంతో ప్రయాణించడం ఒక అద్భుతమైన అనుభవమే అని చెప్పాలి.

ఒక గంట క్యూలో నుంచున్న తర్వాత నేను వైష్ణోదేవిని దర్శించుకోగలిగాను. ప్రతి జీవిపై ఆమె దయ ప్రసరించేలా చేయమని ప్రార్థించాను. ఇక్కడ అమ్మవారు మూడు రూపాల్లో (వైష్ణోదేవి, మహాసరస్వతి, మహాకాళి) ఒక గుహలో కనిపిస్తారు. ఈ గుహ యుగాల క్రితం భైరోనాథ్ నుండి తప్పించుకోవడానికి ఆమె సృష్టించినది అని అంటారు. సహజ శిలాజలాలతో సృష్టించబడ్డ పర్వతములు ఎక్కడ చూసినా ప్రకృతి తో ఏర్పడిన శిలాశిఖరమే అమ్మవారి ఆలయం. అందుకే ఇక్కడ గోపురం మరియు ప్రత్యేకమైన ఆలయ సౌధం ఉండవు.

గుహలోకి వెళుతుంటే సింహం గుహలోకి వెళ్తున్న భావనను కలిగింప చేస్తుంది. చాలా గంభీరమైన పరిసరాలు... నిజంగా అమ్మవారి ఇంట్లోకి వెళితే ఇలా ఉండి వుంటుందేమో అన్న భావన ఎవరికైనా కలుగక మానదు. అమ్మను తనివి తీరా దర్శించుకుని కిందకు దిగడం మొదలుపెట్టాను.

సుమారు 7 కిలోమీటర్ల పాదచార మార్గంలో నడిచాక, పాదాలలో నెప్పి, ఎక్కువసేపు నడవడం వల్ల తొడల మధ్య రాపిడితో వచ్చిన చర్మ సమస్య, ఇంకొక అడుగుకూడా ముందుకు పడనీయలేదు. చాలా ప్రయత్నం చేసాను... కుడి కాలి మడమ దగ్గర చాలా నెప్పి... ఇక గత్యంతరం లేక కత్రాకు వెళ్లడానికి గుర్రాన్ని అద్దెకు తీసుకున్నాను. అతడిని బ్రతిమిలాడి అడిగిన దానికంటే కాస్త తక్కువకు మాట్లాడి ఎక్కాను.

గుర్రం మీద నుంచి క్రిందికి దిగటం కూడా చాలా కష్టం అయిన విషయం అని తెలిసింది. ఎదో దేవుడి దయవలన ఎక్కడా క్రిందపడకుండా క్రిందికి చేరాను. కాలు నెప్పి నన్ను అడుగు తీసి అడుగు వేయనీయలేదు.

## కమలా పద్మనాభన్ పరమపదం

గుడి సముదాయం నుంచి బయటకి రాగానే కర్ణాటకలో బాలవికాస్‌కు మార్గదర్శకురాలైన శ్రీమతి కమలా పద్మనాభం గారి పరమపద వార్త తెలిసింది. నేను బెంగళూరులో ఉన్న కాలంలో (1990-96), శ్రీ సత్యసాయిబాబా సంస్థల రాష్ట్ర నాయకురాలిగా తన భర్త Dr. R.S. పద్మనాభన్ గారితో కలిసి, నన్ను స్వామి కార్యక్రమంలో దరిచేర్చుకుని, దారి చూపి... నా వ్యక్తిత్వానికి సొబగులు అద్దిన వ్యక్తి ఆమె.

నేను వారి ఇంటికి క్రమం తప్పకుండా వెళుతూ, బాబా జీవితం మరియు సందేశాన్ని తెలుగు నుంచి కన్నడలోకి అనువదించాను (శ్రీ సత్యసాయి మహావతార దర్శన్ - చిత్రప్రదర్శన).

చిన్నతనం నుండి నా జీవితాన్ని సార్థక మార్గంలోకి నడిపేందుకు సాయపడిన ఇట్టివాళ్లు అసంఖ్యాకంగా ఉన్నారు అని చెప్పాలి. ఆ మాతృమూర్తి ఆత్మశాంతి కోసం ప్రార్థించి ముందుకు కదులుతుంటే ఎన్నో జ్ఞాపకాలు నన్ను కమ్మేశాయి.

వారు నాపై కురిపించిన ప్రేమ, ఆదరణలకు... నేను సరిపోల్చలేను కాని వారి అంచనాలను చేరుకునేందుకు చివరి శ్వాస వరకూ పని చేస్తాను అని అనుకున్నాను. స్వామివారికి కూడా వారంటే ఎంతో దయ. చాలా అవకాశాలు, అనుభవాలను వాళ్లకు ప్రసాదించారు. బెంగళూరులో ఉన్నప్పుడూ నేను ఇంగ్లీషు నేర్చుకోవడానికి ఆ దంపతులు సత్యసాయి ట్రస్టు ద్వారా సాయం చేయడమే కాక, కన్నడ నేర్చుకోవడానికీ అండగా నిలబడ్డారు. వారి సహచర్యంలో నన్ను మించి నేను ఆలోచించేలా చేసారు.

వారివల్ల మాత్రమే నేను మరో 10 అడుగులు బాబాకి దగ్గరగా చేరుకోగలిగాను అనుకుంటాను. సాయి ఆత్మ బంధువైన శ్రీమతి కమలా పద్మనాభన్ కోసం ప్రార్థించాను. బాబా పట్ల వారి భక్తి సాటిలేనిది.

భారతదేశంలోని దేవాలయాలు, ప్రార్థన స్థలాలు, ఆర్థిక అభివృద్ధికి, సంఘము యొక్క సర్వ శ్రేయస్సుకు కేంద్రాలుగా మారడం గురించి ఆలోచిస్తూ నేను వసతి గృహాన్ని చేరుకున్నాను. ప్రతి సంవత్సరం కోట్ల మంది వైష్ణోదేవిని దర్శిస్తారని నాకు అర్థమైంది. భక్తుల నుండి సేకరించబడిన వనరులతో ప్రభుత్వం ఆలయ సముదాయాలను అభివృద్ధి చేయడం, సౌకర్యాలను మెరుగుపరచడమే కాకుండా ఆ ప్రాంతంతో అనుసంధానించబడిన సభ్య సమాజ కళ్యాణానికి కూడా కృషి చేస్తుందని అర్థం అయింది.

ప్రార్థనా కేంద్రాల్లో ఉన్న నిర్వాహకులు అందరూ అంకితభావంతో పని చేయడం ప్రారంభించినప్పుడే ఈ దేశం సర్వతోముఖ అభివృద్ధిని చూడగలుగు తుందని నేను గట్టిగా నమ్ముతున్నాను.

## జూలై 20, 2019

### జవాన్లతో ప్రయాణం:

తెల్లవారుజామున 2:45 కి నిద్రలేచి మూడు గంటలకి అంతా రెడీ అయ్యాము. కత్రా నుంచి 275 కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీనగర్‌కి అందరం బయలుదేరాము. మా ప్రయాణం ప్రార్థనలతోను, భజనలతోను ప్రారంభమైంది. అందరూ భక్తి పారవశ్యంతో పాల్గొన్నారు. ఉదయం త్వరగా నిద్ర లేవడం వల్ల అందరూ నిద్రలోకి జారుకున్నారు.

మార్గమంతా కూడా రోడ్డుకి రెండు వైపులా భారీ భద్రత ఉండటాన్ని చూసాను. వాహనం నెమ్మదిగా పర్వత వంపుల గుండా వెళ్తుంది. ముందు రెండుసార్లు ఈ లోయను సందర్శించే అవకాశం నాకు వచ్చింది. అప్పటి దృశ్యాలు గుర్తు చేసుకుంటే, ఇప్పుడు రోడ్డు స్థితి మెరుగుగా కనిపించింది. ఈ అభివృద్ధి చెందిన రహదార్లు ప్రతి ఒక్కరి ప్రయాణ ఖర్చులను తగ్గించి గమ్యస్థానాలకు సులభంగా ప్రయాణించడానికి దోహదం చేస్తున్నాయి అని చెప్పడంలో ఎట్టి సందేహం లేదు.

మార్గ మధ్యలో ఆసియాలో అతిపెద్దదైన చనీ నర్సిట్ టన్నెల్ 9.28 కిలోమీటర్ల రహదారి సొరంగ మార్గం. ఇది పూర్తిగా ఇంటిగ్రేటెడ్ టన్నెల్ కంట్రోల్ సిస్టంతో ఏర్పాటయింది. ఇది శ్రీనగర్ మరియు జమ్మూ-కాశ్మీర్ ల మధ్య దూరాన్ని 30 కిలోమీటర్ల మేర, ప్రయాణ సమయాన్ని 2 గంటల మేర తగ్గిస్తుంది. అన్నిరకాల వాతావరణాలలో కూడా తట్టుకునే విధంగా చాలా దృఢంగా సొరంగాన్ని నిర్మించారు.

ప్రతీ శీతాకాలంలోనూ జాతీయ రహదారి 44లో, హిమపాతంతో ఆటంకం కలిగించే ప్రాంతాలైన పాట్నిటాప్, కుడ్, బాటోటి ప్రాంతాలను ఈ సొరంగ మార్గం సులభంగా దాట వేస్తుంది. గతంలో ఎన్నో సార్లు ఈ మార్గంలో రోజులు తరబడి వందల వాహనాలు నిలబడే దృశ్యం ఇప్పుడు కనపడదు.

ప్రతిష్టాత్మకంగా కేంద్ర ప్రభుత్వం నిర్మించిన ఈ సొరంగ మార్గాన్ని 2 ఏప్రిల్ 2017 రోజున భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ జాతికి అంకితం చేసారు. నిర్మాణంలో నైపుణ్యంతో కూడిన కార్మికులతో పాటు సుమారు 1500 మంది ఇంజనీర్లు, జియాలజిస్టులు, కార్మికులు పాల్గొన్నారు. నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఈ ప్రాజెక్టు కోసం సుమారు 3720 కోట్లను ఖర్చు చేసింది. 2011లో పనులు ప్రారంభించబడింది. 2 ఏప్రిల్ 2017న మన ప్రధాని శ్రీ నరేంద్ర మోది గారి చేతుల మీదుగా ప్రారంభింపబడింది. ఈ ప్రాంతంలో మరో రెండు సొరంగాల నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయి.

ఎవరికైనా సరిగ్గా దేవాలయాలను దర్శించినప్పుడు హృదయం దైవ భక్తితో నిండిపోతుంది. అలాగే దేశ అభివృద్ధికి ఉద్దేశించిన ఇంజనీరింగ్ అద్భుతాలను చూసినప్పుడు హృదయాలు దేశభక్తితో నిండిపోతాయి.

దారి పొడవునా ఆర్మీ, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (CRPF), జమ్మూ

& కాశ్మీర్ పోలీసులు సాధారణ ప్రయాణికులకు భద్రత కల్పించే పనిలో ఉన్నారు. అంతేగాక, యాత్రకు బహుళస్థాయి భద్రత ఏర్పాట్లు కూడా ఉన్నాయి.

యాత్రికులకు ఉచిత మరియు సురక్షితమైన ప్రయాణం కోసం 24/7 ఎలాంటి వాతావరణ పరిస్థితులలోనైనా సేవలు అందించేందుకు వేలాది మంది భద్రతా సిబ్బంది విధులలో కనిపించారు. వారి మొక్కవోని దేశభక్తిని చూస్తే మాటలు కూడా రావు. అప్రయత్నంగా నోట్లో నుండి... కాదు నాభి నుండి భారత మాతకు జై జై అనే నినాదాలు రాకుండా ఉండవు. ఒళ్లు గగుర్పొడిచే విధమైన పహారా అని చెప్పాలి.

నేనే కాదు ఆ మార్గంలో ప్రయాణిస్తున్న యాత్రికులు అంతా భద్రత సిబ్బందికి అభివాదం చేస్తూ కనిపించారు. భక్తులు మరియు యాత్రికుల కోసం ప్రభుత్వం ఇంత అపూర్వమైన ఏర్పాట్లు చేయడం స్ఫూర్తిదాయకమైన విషయం.

భద్రత దళాలు యాత్ర మార్గాలను ఎప్పటికప్పుడూ సుగమం చేస్తూ, యాత్రికుల భద్రతకు ఆధునాతనమైన సాంకేతికత, పరికరాలు ఆయుధాలతో యాత్రకు మరింత రక్షణ కల్పించడం చూస్తే భారత జాతి యావత్తూ గర్వంతో ఛాతీ విరుచుకుంటుంది అని చెప్పాలి.

ఫిబ్రవరి 14 నాడూ ఉగ్ర మూకల దాడిలో సుమారు 40 మంది CRPF భద్రతా సిబ్బంది చనిపోయాక, సైన్యం ఇక ఎలాంటి అవకాశమూ తీసుకోలేదు అని అర్థం అయ్యింది. అలాంటి భద్రత దృష్ట్యా యాత్రకు సంబంధించిన వాహనాలు అన్నీ చాలా చిన్నగా కదులుతూ ఉన్నాయి.

వారి అంకిత భావాన్ని మాటల్లో వ్యక్తపరచలేము. కానీ మన సొంత దేశంలో యాత్ర చేయడానికి కూడా ఇంత భద్రత అవసరమా అనుకున్నప్పుడే కాస్త అసంతృప్తిగా అనిపించింది. దేశంలో ఎప్పుడూ కూడా హాని కలిగించని సమాజం కోసం నేను ప్రార్థిస్తున్నాను. భగవంతుని పితృత్వం మానవ సౌభాతృత్వం ప్రతీ చోట ప్రభవించాలి అని అర్థించాను.

## బ్యాగ్లీహార్ డ్యామ్

బ్యాగ్లీహార్‌కు, హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ ప్రాజెక్ట్ అని పేరు. ఇది జమ్మూ & కాశ్మీర్‌లోని రాంబన్ జిల్లాలోని చీనాబ్ నదికి చెందిన పవర్ ప్రాజెక్ట్. ఈ ప్రణాళిక

1992లో భారత ప్రభుత్వం ఆమోదించింది. 1996లో నిర్మాణం ప్రారంభించబడింది. ప్రాజెక్ట్ నిర్మాణ ఖర్చు US $ 1 బిలియన్. బాగ్లీహారు డ్యామ్ యొక్క మొదటి దశ 2004లో పూర్తయ్యింది. రెండవ దశ అక్టోబర్ 10, 2008లో పూర్తయ్యింది. భారత మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ 900 మెగావాట్ల బాగ్లీహార్ హైడ్రో ప్రాజెక్ట్‌ను దేశానికి అంకితం చేసారు.

ఆనకట్టపై నుండి జాలు వారుతున్నప్పుడు వినబడే ఆ నీటి శబ్దం ఒక అద్భుతమే. ఇక్కడ మేమంతా ప్రకృతి యొక్క అనంత శక్తిని చర్మచక్షువులతో చూడగలిగాము. నదీ ప్రవాహాన్ని బట్టి అంతర్లీనంగా ఉన్న నీటిశక్తిని మనం అంచనా వేయవచ్చు. రెండు సంవత్సరాలు గవర్నర్ పాలనలో ఉన్న జమ్మూ కాశ్మీర్‌ను మేము చేరుకున్నాము. మధ్యాహ్న భోజనం చేసి హొటల్ జమాల్ రిసార్ట్స్‌కి విశ్రాంతి తీసుకోవడానికి చేరుకున్నాము. వైష్ణోదేవి యాత్రలో చేసిన దుర్భరమైన ట్రెక్కింగ్ అందరిలో ఉన్న శక్తిని హరించి వేసింది. నా శరీరంలో నొప్పులు అన్ని నన్ను మరొక పని చేయకుండా విశ్రాంతి తీసుకోమని అర్థించాయి కూడా. మానసికంగా ఎంత ఆహ్లాదంగా ఉన్నా, శారీరకంగా సత్తువ లేదంటే, ఇక తీర్థయాత్ర కాదు... ఇంట్లో ఒక గది నుండి మరొక గదికి కూడా వెళ్లలేము. ఇక, ఈ మధ్యలో నాకు మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేదని గ్రహించాను.

బెంగళూరులో ఉండగానే ఈ సర్టిఫికెట్ విషయం నా దృష్టి నుంచి జారిపోయింది. ఇంకా యాత్ర గురించి రిజిస్టర్ కూడా చేయలేదు. ఈ విషయంలో టూర్‌గైడ్‌కు నేను వివరించాను. పరిష్కారం లభిస్తుందని ఆశించాను.

## జూలై 21, 2019
## ఖీర్ భవాని

పౌరాణిక కథలు, హిమాలయాలను శివుడి నివాసాలుగా చెబుతాయి. ఆయన యోగులకు రాజు అని కూడా చెప్తారు. అలాగే, కాళిదాసు హిమాలయాలను శివుని లాస్యపుఛాయలుగా వర్ణించారు. హిందూ సాంప్రదాయాలలో కాశ్మీర్ శివారాధనకు (కాశ్యపమైర్యా) కేంద్రంగా ఉంటుంది. మరికొన్ని సాంప్రదాయాల ప్రకారం, ఇక్కడ నుండే శైవ మతం అవిర్భవించి, భారతదేశంలోని మిగతా ప్రదేశాలకు వ్యాపించిందని కూడా అంటారు. అలాంటి

ఈ కాశ్మీర్‌ను అన్వేషించడానికీ నేను ఉత్సాహంగా ఉన్నాను.

మేమంతా జమాల్ రిసార్ట్స్‌లో ఉదయం 6:30 గంటలకు సిద్ధంగా ఉన్నాము. శ్రీనగర్‌లోని దర్శనీయ స్థలాలను చూసేందుకు ఒక్కో స్థానిక వాహనంలో ఎనిమిది మంది యాత్రికుల బృందాన్ని నాలుగు బృందాలుగా విభజించారు. మొదటి సందర్శన ఖీర్ భవాని, ఇది శ్రీలంక నుండి రావణ వధ అనంతరం అమ్మ వారి కోరిక మేరకు హనుమంతుడు ఇక్కడకి తీసుకుని వచ్చారు అని స్థానికుల విశ్వాసం. "లంకాయం శాంకరీ దేవి"... రావణుడి దుష్కర్మలకు దేవి తనని అందరికీ దూరంగా హిమాలయాల్లోని పవిత్ర ప్రదేశానికి తరలించమని హనుమను ఆదేశించింది. హనుమ దేవిని హిమాలయ భూభాగాల్లోని తుల్ ముల్ (అతుల మూల్య - పవిత్రమైన విలువైన ప్రదేశం) కు నాగ దేవతల (సర్పాలు) భారీ సైన్యంతో పాటు తీసుకువచ్చాడు. అప్పటి నుంచి ఆమెకు పూజలు జరుగుతున్నాయి.

కాలక్రమంలో ఆలయం వరదల్లో మునిగిపోయింది. కృష్ణ పండిట్‌కు కల వచ్చింది, అక్కడ ఆలయం మునిగిపోయిన ప్రాంతంలో పాము కదులుతుందని దేవి ఆదేశించింది. అక్కడ ఆమె నీటి కింద తన ఉనికిని గుర్తించే స్తంభాలను బిగించమని ఆదేశించింది. అదే ప్రదేశం ఇప్పుడు భవానీగా దర్శనమిస్తోంది. పూర్వం పాల పాయసాన్ని (ఖీర్) అమ్మకు నివేదించి అందించే వారు... కాల క్రమంలో అమ్మ పేరు ఖీర్ భవానీగా మారింది అని చెప్తారు.

హరి ప్రభాత పర్వతం పైన ఉన్న సారికాదేవి ఆలయాన్ని దర్శించుకున్నాము. దీనికి ప్రధ్యుమ్న పీఠం అనే పేరు ఉంది. కాశ్మీర్ పండితులు ఈ ప్రద్యుమ్న క్షేత్రాన్ని పరమ పవిత్రమైనదిగా పరిగణిస్తారు. అక్కడ శక్తి ఆలయం ఉంది. ఆమె ఇక్కడ జగదాంబ సారికా భగవతి పేరుతో పూజింపబడుతుంది. ఆవిడ 18 చేతులతో శ్రీ చక్రంలో కూర్చుని ఉంటుంది. ఈ దేవిని శ్రీనగర్‌కు అధిష్టాన దేవతగా నమ్ముతారు. శ్రీ చక్రం నుంచి శ్రీనగర్‌కు ఆ పేరు వచ్చిందని చెప్తారు. ఆ తల్లి చాలా బ్రహ్మాండమైన శిలా రూపంలో అక్కడ ఉంటుంది. చూడటానికి రెండు కన్నులెప్పుడూ చాలవు. ఇక సూక్ష్మంగా ఆ శిల మీద రేఖామాత్రంగా కనిపించే అమ్మను దర్శించడానికి చర్మ చక్షువులు కాదు... జ్ఞాన చక్షువులు కావాలేమో అనిపిస్తుంది. అక్కడ కాసేపు అందరూ కూర్చుని

ధ్యానం చేసుకున్నాం.

తదుపరి గోపాద్రి మీద ఉన్న శ్రీ శంకరాచార్యుల వారి ఆలయాన్ని సందర్శించాము. కాశ్మీరీ బ్రాహ్మణులకు పూర్వం ఎప్పుడో గోపాదిత్య మహారాజు ఈ ప్రదేశాన్ని ఇచ్చారు. ముస్లింలు, బౌద్ధులు, పర్షియన్లు వారి పాలకుల కాలంలో ఈ ప్రదేశము వారికి అత్యంత పవిత్రమైనదిగా ఆసక్తిమయమైనదిగా భావించేవారు. కానీ ఆది శంకరుల వారు విజయంలో ఉన్నప్పుడు ఈ ప్రదేశాన్ని సందర్శించిన కాలం నుంచి ఇది శంకరాచార్య ఆలయంగా మారింది. ఆయన ఇక్కడ తపస్సు చేసి సౌందర్య లహరి స్తోత్రాన్ని రచించారంటూ స్థానిక కథనం.

స్వామి వివేకానంద తను శిష్యులతో జులై 25, 1898 న ఈ శివాలయాన్ని దర్శించుకున్నారు. ఇది శంకరాచార్య కొండపై సముద్రమట్టము నుంచి వెయ్యి అడుగుల ఎత్తులో ఉంది. ఇక్కడ నుండి ప్రసిద్ధమైన తేలియాడే ఉద్యానవనాన్ని కూడా చూడవచ్చు. అక్కడ నా చుట్టూ వందలాది మంది ఉన్నప్పటికీ నా అంతరంగము దైవభావనలతో మరియు దివ్య ప్రకంపనలతో నిండి ఉంది.

మేము చశ్మీ సాహి నిషాద్ గార్డెన్స్ (మొగల్ గార్డెన్స్)ను సందర్శించాము. అక్కడ ఉన్నప్పుడు సమయం ఎంతో చక్కగా గడిచిపోయింది. అక్కడ చేరిన అందరూ ముస్లిం కుటుంబాల వాళ్లే. ఆ బహిరంగ ప్రదేశంలో నా వస్త్రధారణ చాలా మందిని ఆకర్షించింది. అక్కడ ఉన్న చాలా మంది పిల్లలు నన్ను చూసి నవ్వారు... నేను కూడా వాళ్ళ అమాయకత్వాన్ని అంతే నవ్వుకున్నాను. కొంత మంది పెద్దలు నన్ను గ్రహాంతర వాసిని చూసినట్లుగా చూశారు. కొంతమంది వచ్చి నాకు నమస్కరించారు, కొందరు షేక్‌హ్యాండ్ ఇచ్చారు, మరికొందరు ఫోటోలు తీసుకున్నారు, ఇంకా కొంతమంది నా గురించి నా భారత దర్శనం గురించి ప్రశ్నలు అడిగారు. కాశ్మీర్ పర్యటన ఒక మంచి అనుభవంగా ముగిసింది. భారత దర్శనంలో ప్రతిచోటా, ప్రతీ ఒక్కరి కోసం ప్రార్థన చేస్తూ నాపై కూడా కాసింత కరుణని ప్రసరింపచేయమని ప్రార్థిస్తూ కాళ్ళ నొప్పుల్ని లెక్కచేయకుండా తిరుగుతూ ఉండిపోయాను.

జూలై 22, 2019

**సహాయాత్రికుడు 60వ జన్మ దినోత్సవం:**

ఆయన జన్మదిన వేడుకలను జరుపుకోవడానికి మేమంతా జమాల రిసార్ట్‌లో బయట గార్డెన్‌లో సమావేశం అయ్యాము. నేను ఆయన్ను గురించిన కొంత సమాచారం సేకరించి ఆయన్ని, ఆయన భార్యను సమావేశంలో ఉన్న వారందరికీ పరిచయం చేసాను. యాత్రికులందరి పుట్టినరోజు ప్రార్థనల మధ్య ఆయన కేక్ కట్ చేసేశారు. ఆయన ఆనందానికి అవధులు లేవు. మేము ఆయన పుట్టిన రోజు జరిపిన విధానాన్ని చూసి ఎంతో ఆశ్చర్యపోయారు. చుట్టుపక్కల వాళ్ళు నన్ను వారి సొంత వ్యక్తిగా భావించడము మొదలుపెట్టారు. నేను చెప్పిన వారు చాలా శ్రద్ధగా వినడం మొదలుపెట్టారు. వారందరి దృష్టి కూడా భగవంతుడు మీదనే ఉందని నేను గ్రహించాను.

**భద్రతా సిబ్బందికి కృతజ్ఞతలు మరియు అభినందనలు:**

మేము అమర్‌నాథ్ గుహకి వెళ్లడానికి హెలీపాడు ఉన్న పహల్‌గాం వైపుకు ఉదయం 8 గంటలకు బయలుదేరాము. దారి పొడవునా అమర్‌నాథ్ యాత్ర నిరాటంకంగా, సురక్షితంగా జరగడానికి భారత ప్రభుత్వం నియమించిన వేలాది మంది భద్రతా సిబ్బంది దీక్షా దక్షతలను చూస్తుంటే కృతజ్ఞతలు చెప్పడానికి మా దగ్గరున్న పదాలు సరిపోవు అనిపించింది. లక్షలాది మంది యాత్రికులకు రక్షణగా ఉండి మార్గ నిర్దేశం చేస్తూ వారు దేవుడు వైపు వెళ్ళే మార్గంలో దేవదూతల్లాగా ఉన్నారు. ఇంతకుముందు ఎప్పుడూ అలాంటి ఏర్పాట్లు చూడలేదు. ఇవన్నీ కుడా CRPF వారి చేసిన ఏర్పాట్లు. వారిలో ప్రతీ ఒక్కరికీ అభినందనలు చెప్పక తప్పదు. అన్ని రకాల వాతావరణంలో ప్రయాణికుల రక్షణగా శిలల్లా నిలబడిపోయిన వారికీ కృతజ్ఞతలు చెప్పడానికీ ఏ భాషలో కూడా పదాలు సరిపోవు అనిపించింది. నేను బహిరంగం గానే ఏడ్చాను. లక్షలాది మంది అకుంఠిత దీక్షతో రక్షణగా మారిన వారిని చూస్తూ నేను దారి పొడవునా వారికి నమస్కరిస్తూ, ఒక్కోసారి చేతులు ప్రేమగా ఊపేస్తూ, మరో సారి వారికి గౌరవంగా అభినందనలు చేస్తూ ఇంకోసారి సెల్యూట్ చేస్తూ ప్రయాణం చేసాను. నాతో పాటు బస్సులో అందరూ అలాగే చేసారు.

**లంగర్లో విశ్రాంతి:**

మేము సెక్యూరిటీ స్కానింగ్ ఎంట్రీ పాయింట్స్ ద్వారా దాదాపు మధ్యాహ్నం ఒంటి గంటకి పహాల్గాం చేరుకున్నాము. హొటల్ తాజ్ దగ్గర అందరూ దిగాము. నేను హొటల్ ఖర్చులను పరిగణలోకి తీసుకోని ఉచితంగా దగ్గరలో ఉన్న లంగర్లోనే ఉండాలని నిర్ణయించుకున్నాను. మేమంతా లంగర్లో రుచికరమైన ఉచిత ఆహారాన్ని భుజించాము. చాలా మంది అక్కడ నుండి గుర్రాల మీద ఆ హిమాలయ పర్వత ప్రదేశాలని చూడడానికి వెళ్లారు. అందరూ వెచ్చగా దుప్పట్లు కప్పుకున్నా నేను మాత్రమే లంగర్లోనే కాసేపు విశ్రాంతి తీసుకుని తర్వాత బస్సులో పడుకున్నాను.

**చంద్రయాన్ 2:**

మేము భోజనం చేస్తూ మిషన్ చంద్రయాన్ 2 యొక్క విజయవంతమైన ప్రయోగాన్ని చూశాము. ఇది ప్రతి భారతీయుడికి ఎంతో గర్వకారణం. చంద్రయాన్ 2 విజయవంతంగా ప్రయోగించిన టీమ్ ISRO కు అభినందనలు. ఇది చంద్రుడి దక్షిణ ప్రాంతానికి ఇంతకు ముందు ఏ దేశం వెళ్లని చోటికి ధైర్యంగా చంద్రయాన్ మిషన్ వెళ్లింది. ఈ ప్రయత్నం ద్వారా భారతదేశానికి మాత్రమే కాకుండా యావత్తు విశ్వమానవాళికి ప్రయోజనం చేకూరబోతోంది. అంతేగాక చంద్రునిపై అవగాహనను మెరుగుపరచడం లక్ష్యంగా సాగింది. ఈ అంతరదృష్టి మరియు అనుభవాలు, సుదూర తీరాల్లో మరిన్ని ప్రయాణాలను మన ముందుకు తీసుకురావడానికి, రాబోయే చంద్రమండల యాత్రలు ఎలా చేయాలి అన్న విషయంలో ఒక నవ్య మార్పును లక్ష్యంగా పెట్టుకున్నారు.

**ముఖ్యాంశాలు - చంద్రయాన్ 2:**

- చంద్రుని దక్షిణ ప్రాంతంలో మృదువుగా దింపేందుకు చేపట్టిన మొదటి అంతరిక్ష యాత్ర
- పూర్తి స్వదేశీ సాంకేతికతతో చంద్రుని పైకి భారత అంతరిక్ష కేంద్రం వారు చేపట్టిన మొట్ట మొదట యాత్ర
- చంద్రుని ఉపరితలంపైకి ఉపగ్రహాన్ని చేర్చిన 4వ దేశంగా నిలచింది

ఈ సందర్భంగా ప్రధాన మంత్రి, "మన ఉజ్వల చరిత్రలో కలకాలం నిలిచిపోయే ప్రత్యేక ప్రయోగం ఇది! చంద్రయాన్2 ప్రయోగం మన శాస్త్రవేత్తల పరాక్రమాన్ని, 130 కోట్ల మంది భారతీయుల దృఢ సంకల్పాన్ని తెలియ జేస్తుంది. విజ్ఞాన శాస్త్రంలో మరింతగా మన పరిశోధనలు కొత్త పుంతలు తొక్కాలని నిర్ధారిస్తుంది. ఈ రోజు భారతీయులు చాలా గర్వపడుతున్నారు!

భగవంతుని అందమైన సృష్టి లో చుట్టూ వున్న ప్రకృతిని చూస్తూ నేను స్వేచ్ఛగా అక్కడి పర్వతాలలో తిరిగాను.

## జూలై 23, 2019

## అమర్‌నాథ్ పరమశివుని పవిత్ర నివాసం:

నేను హోటల్లో కాకుండా బస్సులోనే బస చేసాను అని చెప్పాను కదా. ఇక అక్కడ మకాం చేసిన ఆ రెండు రోజులు కూడా అక్కడే భోజనం చేసాను. అక్కడ లంగర్లలో అమర్‌నాథ్ యాత్రికులందరికీ ఉచితంగా ఆహారం అందించ బడుతుంది. ఇలాంటి నిస్వార్థ కార్యక్రమాలు వందలాది సంవత్సరాల నుంచి జరగుతూనే ఉన్నాయి. చాలా మంది దాతృత్వ హృదయులు యాత్రికులు పవిత్ర గుహను చేరుకునే వరకు ఉన్న మార్గమంతా ఇలాంటి సేవలు చేస్తూ ఉంటారు. త్రికూట పర్వతం మీద నడుస్తున్నప్పుడు నా కాలి చీలమండ బెణికింది. నేను ఆయింట్‌మెంట్ పూసుకున్నాను, హాస్పిటల్‌కి వెళ్లాను కాని ఉపశమనం లభించలేదు. సాయంత్రం ఒక కాశ్మీర్ మసాజర్ మసాజ్ చేసి అతని అత్యుత్తమ సేవను అందించాడు. దానితో నేను తాత్కాలికంగా ఉపశమనాన్ని పొందగలిగాను.

ఇక ఉదయం 5:30కి లేచి సహ యాత్రికురాలి గదిలో స్నానం ముగించాను. మేమంతా ఉదయం 6:30 గంటలకు హెలీపాడ్ వద్ద రిపోర్ట్ చేసాము. మా వంతు ఉదయం 8:15 నిమిషాలకూ వచ్చింది. అది పది నిమిషాల్లో ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న పంచతరణి దగ్గర మమ్మల్ని దింపింది. నేను నడవగలనని అనుకున్నాను కానీ నా కాలు నొప్పి నన్ను నిర్బంధించింది. అడుగు తీసి అడుగు వేయడం దుర్భరంగా అయింది. ముందు చేయాల్సిన మరిన్ని హిమాలయ ప్రయాణాల గురించి ఆలోచిస్తూ, నాకు చాలా ఖర్చుతో కూడినది అయినప్పటికీ పవిత్ర గుహకు వెళ్లడానికి గుర్రపుస్వారీని

ఎంచుకున్నాను.

హెలికాప్టర్లో ప్రయాణించడము పుష్పక విమానంలో కైలాసానికి ప్రయాణించినట్లు, గుర్రపు స్వారీ అనేది దేవతాశ్వాలను అధిరోహించి దివ్య సన్నిధికి చేరడమే! నలుగురు వ్యక్తులు మనల్ని ఎత్తుకుని పల్లకిలో వెళ్లడం అన్నది బ్రతికి ఉండగానే స్వర్గానికి ప్రయాణించినట్లు, అంటే బొందితో స్వర్గానికి వెళ్ళడం అన్నమాట! పర్వతంపైన ట్రక్కింగ్ చేయడమంటే సాధువులాగా భగవంతుని కనుగొనడంలో ముందుకు సాగడం లాంటిది.

ఏ విధంగా కావాలి అంటే అలాగా వెళ్లొచ్చు కానీ ఎలా వెళ్ళినా యాత్రికులు మాత్రం ఇబ్బందులు ఎదుర్కొవాల్సిందే. కష్టాలు లేకుండా ఈ యాత్రని మనము దివ్యస్మృతిగా చెప్పలేము కూడా. దేవుడూ తపస్సు చేయకుండా వెళ్లే మనలాంటి వాళ్లకూ ఆ మాత్రం కష్టపెట్టి మరి దర్శనం ఇవ్వడం సబబు అనుకుంటాడేమో శివుడు.

నేను ఉదయం 11 గంటలకి అమర్‌నాథ్ చేరుకున్నాను. హిమనీ నదాలు పడటం వల్ల ఆ మార్గమంతా చాలా జారుడుగాఉంది. గుహను చేరుకునేందుకు దాదాపు రెండు గంటలు పట్టింది. ఇది వెండి కొండల (కైలాసం) మీద నడవడం లాంటిది. అమర్‌నాథ్ యాత్రకోసం భద్రతా సిబ్బంది చేస్తున్న సేవను చూసి నేను మూగబోయాను. అమర్‌నాథ్ యాత్ర క్రెడిట్ అంతా CRPF మరియు మిగతా భద్రతా సిబ్బందికే దక్కుతుంది. యుగాలకు పూర్వం పరమశివుడు గుహలోకి ప్రవేశిస్తూన్నప్పుడు వదిలిన గంగమ్మ అమృతతుల్యమైన రుచితో శాశ్వతంగా ఇక్కడ ప్రవహిస్తుంది. ఈ నదికి పంచతరణి అని పేరు. నేను కొంచెం వీలు చూసుకుని నదిలోకి వెళ్లి తండ్రి చితాభస్మాన్ని గంగమ్మ ఒడిలో చేర్చాను. తండ్రి గారి చితాభస్మాన్ని నిమజ్జనం చేయగలిగాను అనే గొప్ప అనుభూతిని నా హృదయంలో నిక్షిప్తమైపోయింది. అంతేకాదు మార్గ మధ్యములో హెలికాప్టర్ నుండి కొంత చితాభస్మాన్ని మంచుకొండల్లో చల్లి తండ్రిగారు పరమ పదం చేరాలని ప్రార్థించాను.

నేను మధ్యాహ్నం ఒంటి గంటకు విరాటరూపములో ప్రకృతి సిద్ధంగా వెలసిన పవిత్ర గుహలోకి వెళ్ళాను. ఆ అమర్‌నాథ్ జ్యోతిర్లింగాన్ని చూసిన పారవశ్యంలో నన్ను నేను మరచిపోయాను. ఎక్కువ రద్దీ లేకపోవడంతో పదేపదే

స్వామి వారి దివ్యదర్శనాన్ని పొందుతూ అందరి కోసం ప్రార్థన చేస్తూ ముందుకు సాగాను. అమర్‌నాథ్ గుహలోని గణపతి విగ్రహాన్ని, కొండలపై ఉన్న సింహాకార శిలను, ఎదురుగా ఉన్న కొండలపై సర్పాకార శిలల దర్శనము పొందగలిగే భాగ్యం నాకు లభించింది. ఇది సాక్షాత్తు కైలాసమే అని చెప్పాలి... అంతటా హిమగిరులే, పర్వత శిఖరాలపై నుంచి కురుస్తున్న నీరు, గడ్డకట్టుకున్న మంచుపై నడవడం, అమృతజలాలని రుచి చూడడం, పాలలా స్వచ్ఛంగా ప్రవహిస్తున్న పంచతరణిలో స్నానం చేయడం, ఆర్మీ సిబ్బంది, గుర్రాలు, పాల్కీలు ఇవన్నీ ప్రమథ గణాలుగా వీక్షించడం... వెరసి ఆ కైలాసాన్ని మన చర్మచక్షువులతో చూడడం లాగా నాకు అనిపించింది. అమర్‌నాథ్ దర్శనము నా ఆత్మని, హృదయాన్ని ఎంతగానో ఉత్తేజపరిచింది. త్రివర్ణ పతాకాన్ని పట్టుకొస్తున్న ఒక దేశభక్తుడు యాత్ర నుంచి తిరిగి వస్తూ ఉన్నప్పుడు, నేను ఆ జెండాతో ఫోటో దిగడానికి నాకు త్రివర్ణ పతాకాన్ని అందించాడు. ఆ త్రివర్ణ పతాకాన్ని పట్టుకొని భారత మాతకి జై అన్నీ బిగ్గరగా అరవడం చూసి మిగితా వాళ్ళంతా ఆశ్చర్య పోయారు.

నేను గుర్రం మీద మధ్యాహ్నం మూడు గంటలకి పంచతరణి హెలిపాడ్ చేరుకున్నాను. అక్కడ భారీ రద్దీ ఉన్నప్పటికీ అదృష్టవశాత్తు నేను బోర్డింగ్‌ని పొందగలిగాను. సుమారు 6:00కి అంత పెహల్గాం చేరుకున్నాను. మా జట్టులో చాలా మంది అమర్‌నాథ్‌లోనే చిక్కుకున్నారు. కేవలం ఆరుగురు మాత్రమే హోటల్‌కూ చేరుకున్నారు. మిగతావారు చేరుకోవడానికి మరో రోజు పడుతుందేమో అని అనిపించింది.

నేను అమర్‌నాథ్ క్షేత్రంలో హిమాలయాలలో మంచు కరిగి అమర్ గంగాగా మారి ప్రవహిస్తున్న శ్వేతవర్ణపు కాంతులతో విరాజిల్లే నదిని సందర్శించి, బట్టలు ఉతుక్కొని బస్సులోనే ఆరబెట్టాను. మందులు వాడి, మసాజ్ చేసినప్పటికీ కాలు ఇంకా నొప్పిగానే ఉంది. నేను హోటల్‌కి చేరుకున్నాను. మరొక మసాజ్ స్నేహితుడు నన్ను చూసి మసాజ్ చేయొచ్చునా అని అడిగాడు. నేను అతనికి సంతోషంగా అనుమతిని ఇచ్చాను, నొప్పి తగ్గింది. అతనికి ధన్యవాదాలు చెప్పాను. కాళ్లకు వేడి నీళ్ల ట్రీట్‌మెంట్ చేయమని సలహా ఇచ్చాడు. విక్కీ, బస్ కండక్టర్ నాకు ఎంతో దయతో వేడి నీటిని అందించాడు. నేను ఆ తరువాత కొంత ఆ రోడ్‌పై నడవగలిగాను.

**ముస్లిం యువకుడితో అనుభవం:**

నేను రోడ్డు వైపు వున్న స్థలంలో ఏర్పాటు చేసిన ఇస్లాం మత ప్రచార కేంద్రం దగ్గర ఆగాను. అక్కడే ఉండి ఇస్లాం మత ప్రచారం చేస్తున్న బృంద నాయకుడిని నేను విష్ చేయడం, అతని ముందు కూర్చుని, వారు ఏం చేస్తున్నారు అని ఆరా తీస్తున్నందుకు కొంచెం ఆశ్చర్యపోయాడు. నా వేషధారణను చూసి అతను వేదాలు ఖురాన్ గురించి ప్రస్తావించాడు. డ్రై ఫ్రూట్స్ మరియు కవ్వాటీ ఇచ్చి దాదాపు 30 నిమిషాలు పాటు ఇస్లాం, మహమ్మద్ మరియు అల్లా బోధనల గురించి సమాచారం ఇచ్చాడు. నేను చాలా ఆనందపడ్డాను. అందులో అభ్యంతరకరమైనది ఏదీ లేదు అతని సంభాషణను స్వాగతించాను. అక్కడి వారందరూ నన్ను చూసి చాలా సంతోషించారు. అల్లా బోధనలు అంగీకరించి అరబిక్ ప్రసంగాలను చెప్పమని నన్ను వారు కోరారు. సత్యసాయి బాబా దగ్గర ఉన్నప్పుడు నేర్చుకున్నదానితో వారు కోరినట్లుగానే చేసాను. కారణం ఏమిటంటే స్వామివారు చెప్పినది... ఉన్నది ఒకటే మతం అదీ ప్రేమ మతం. ఇక అక్కడ నన్ను చూసి చాలా మంది ప్రజలు మమ్మల్ని చుట్టూ ముట్టి ఒక గ్రహాంతరవాసిగా చూసారు. నేను ఎవరికీ వ్యతిరేకిని కాదు. నాకు మతం అనేది ఒక ఆత్మాన్వేషణ కోసం మాత్రమే. మనల్ని మనం తెలుసుకోవడానికి మాత్రమే అనుకున్నాను.

నేను అక్కడి నుంచి లంగర్ వరకు నడిచాను. నాకు ఉప్పుతో కూడిన వేడి నీటిని అందించమని నేను ముఖ్య సర్దార్ని అభ్యర్థించాను. స్వచ్ఛంద సేవలను అందించిన ఓం ప్రకాష్‌ను పిలిచి నాకు సహాయం చేయమని చెప్పారు. ఓం ప్రకాష్ చాలా శ్రద్ధగా నన్ను లోపలికి తీసుకువెళ్లి వ్యక్తిగతంగా నా కాళ్లకు వేడి నీళ్ల చికిత్స చేసి మళ్లీ ప్రేమతో మసాజ్ చేసాడు. చాలా ఆశ్చర్యం అనిపించింది...

నేను లంగర్లోనే భోజనం చేసాను. ఆ తర్వాత ఓం ప్రకాష్‌తో కొంత సమయం గడిపాను. ఈ గ్రామీణ ప్రాంతంలో దయగల, ప్రేమగల చాలా మంది వ్యక్తులను చూడడం నాకు చాలా సంతోషంగా అనిపించింది. ఇలాంటి వారివల్లనే ఇంకా మంచి కొనసాగుతూంది. నేను తిరిగి రాత్రి బసకు చేరుకున్నాను. అక్కడ రాత్రి విశ్రాంతి కోసం బస్సుని ఆపారు. ఖర్చు ఎంత తక్కువ చేస్తే మునుముందు యాత్రలో అంత క్షేమమనుకుని... హొటల్లో గది తీసుకోలేదు. బస్సులోనే పడుకున్నాను. నా అవస్థ చూసి టూర్ గైడ్ ఆశిష్

హోటల్లో ఉన్న తన రూమ్‌లో ఉండడానికి నన్ను ఆహ్వానించాడు. నేను అక్కడికి సంతోషంగా చేరుకుని రాత్రి హాయిగా నిద్రపోయాను.

అమర్‌నాథుని శిఖరంపై నున్న మేము అందరం అక్కడి నుండి శ్రీనగర్‌కి వచ్చాము. అపూర్వమైన భద్రత కాన్వాయి యాత్రికుల వాహనాలను కంటికి రెప్పలా అన్ని దిశల నుండి కాపాడారు. కాశ్మీరు లోయల్లో తిరుగాడే ప్రధాన మంత్రిలాగా ఎవరికి వారు భావించారు అంటే అతిశయోక్తి కాదు. అలా ఉంది భద్రత. ఇంతకు మునుపు కూడా ఒకటి రెండు సార్లు అమర్‌నాథ్ యాత్రకు వెళ్ళినా ఇలాంటి ఏర్పాట్లు నేను చూడలేదు. అమర్‌నాథ్ యాత్రికుల కోసం ఆర్మీ వారు చూపిస్తున్న ప్రేమ దయకి అనేక అభినందనలును తెలుపుకున్నాను.

యాత్రలో ఉన్న ప్రతీ ఒక్కరు కూడా భద్రతా సిబ్బందిని చూసి చాల గర్వపడ్డారు. వేలాది మంది యాత్రికులకు ఇది ఒక రాజ ప్రయాణం లాంటిది. కానీ బాధాకరమైన విషయం ఏమిటంటే మన దేశంలోనే ఉగ్రవాదుల దాడులకు వ్యతిరేకంగా మనల్ని కాపాడుతున్న మన భద్రతా సిబ్బందిని చూడడం. కాశ్మీర్ లోయల్లో శాంతి నెలకొనాలని నేను ప్రార్థించాను. ప్రియమైన మిత్రులారా కాశ్మీర్‌ను అందరూ మన ప్రార్థనలో ఉంచుదాం. సమిష్టిగా మనం ప్రార్థిస్తే మన ప్రజల శ్రేయస్సు కోసం భగవంతుడు దీవిస్తాడు.

మేము సుమారు ఉదయం 11:30 గం။ల కి సురక్షితంగా శ్రీనగర్ చేరుకుని దాల్ సరస్సులోని స్వాన్ హౌస్ బోట్‌లోకి చేరుకున్నాము. దాల్ సరస్సు జమ్మూ కాశ్మీర్ వేసవి రాజధాని అయిన శ్రీనగర్‌లోని ప్రఖ్యాత పర్యటన కేంద్రం గా మారి పోయింది. అత్యంత ప్రజాదరణ పొందిన అందమైన ప్రదేశాలలో ఇది కూడా ఉంటుంది కాశ్మీరులో. రాష్ట్రంలో రెండవ అతిపెద్ద పట్టణం దాల్. కాశ్మీర్‌లో పర్యాటకం మరియు వినోదాలు రెండు కూడా అంతర్భాగంగా ఉంటాయి అని చెప్పాలి. దాల్ ను "పువ్వుల సరస్సు" లేదా "కాశ్మీర్ కిరీటంలో రత్నం" లేదా "శ్రీనగర్ రత్నం" అని కూడా పిలుస్తారు. ఈ సరస్సు చేపలు పట్టేందుకు మరియు వాటర్ హార్వెస్టింగ్‌లో వాణిజ్య కార్యకలాపాలకు కూడా ఒక ముఖ్యమైన మూలం అని చెప్తారు

## జూలై 24, 2019

### శ్రీనగర్ దాల్ సరస్సు:

ఈ సరస్సు 18 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంది. ఇది 21.1 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో సహజముగా ఏర్పడిన చిత్తడి నేల అని చెప్పాలి. అక్కడి జలములలో భాగంగా తేలియాడే తోటలు కూడా పెంచబడుతున్నాయి. కాశ్మీర్ రాడ్గా పిలవబడే ఈ తేలియాడే తోటలలో జూలై, ఆగస్టు మాసాలలో తామర పూలు వికసిస్తాయి. ప్రాచీన సంస్కృత గ్రంథాలలో దాల్ సరస్సును మహాసరిత్‌గా పేర్కొన్నారు. దాల్ సరస్సు తూర్పున ఇస్బాబార్ అనే గ్రామం దుర్గాదేవి నివాసంగా పురాతన చరిత్ర పేర్కొంది. శతధార అనే నీటి బుగ్గ ద్వారా వచ్చిన ఈ ఒడ్డున ఉన్న ఈ ప్రదేశాన్ని సురేశ్వరి అని పిలిచేవారు.

## జూలై 25, 2019

### తేలియాడే ఇంట్లో బస:

సరస్సులో పర్యాటకులకు ఆనందకరమైన జ్ఞాపకాలూ అందించేందుకు స్థానికులు హౌస్‌బోట్లు ఏర్పాటు చేసి వాటి ద్వారా ఆదాయం సంపాదిస్తారు. ఈ తేలియాడే ఇళ్ళు చాలా ఖరీదైనవి. నిజాయితీగా చెప్పాలంటే నేను అలాంటి ఖరీదైన హౌస్‌బోట్‌లో ఉండేవాడిని కాదేమో. ఆ రోజు ఇంకేమీ చేయలేదు, అక్కడే రుచికరమైన భోజనం చేసి అందులోనే విశ్రాంతి తీసుకున్నాము. మేము వ్యక్తిగతంగా తెలుసుకున్నది ఏంటంటే కాశ్మీర్ ప్రజలు చాలా మంచి వారే. కాని అశాంతి, అల్లర్ల కారణంగా, వారి ప్రవర్తన, వారు చూసిన ఎన్నెన్నో అనుభవాల వల్ల ప్రభావితమై విచిత్ర జీవనశైలిని అలవరచుకున్నారు. కేవలం అందమైన ప్రకృతిని చూడటంవల్ల మనసు, హృదయం, ఆత్మలకు సానుకూలమైన అనుభూతులు సమకూరాయి. ప్రత్యేకించి ఆ రోజుఏమి చేయలేదు కానీ మనసు, శరీరం చాలా సేద తీరాయి. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి లోయలో జరిగిన అశాంతి కారణంగా భారతీయులు ఈ అందాలను ఎంతగా కోల్పోయారో అని ఆలోచిస్తూ ఉన్నాను. త్వరలో ఊహించిన దానికంటే వేగంగా ఒకరితో ఒకరు ప్రేమతో… పరస్పర ఆదరాభిమానాలతో… సామరస్యతతో ఉండే శాంతితో కూడిన వాతావరణానికి కాశ్మీర్ సాక్షిగా నిలుస్తుంది అని నేను ప్రగాఢంగా విశ్వసిస్తున్నాను…

**కర్ణాటక ఒక నాటకం:**

మరోవైపు H.D. కుమారస్వామి, ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడానికి దారి తీసిన వరుస సంఘటనలు గమనిస్తే, ప్రస్తుత రాజకీయాల గురించి నా మనసు మూగవోయి, నిర్లిప్తమై ఉంది. కారణం ఏదైనా కావచ్చు, ఎవరైనా కావచ్చు, అది రాజకీయాల పట్ల నమ్మకాన్ని కోల్పోయేలా చేస్తుంది. ఇకనైనా ఎన్నికయ్యే కర్ణాటక తదుపరి CM ఎవరైనా సరే, వారు ప్రజాస్వామ్యానికి జీవం పోసి తమ పాలనతో ప్రజల విశ్వాసాన్ని పొందడం ద్వారా వారి చర్యలు, వారి మాటల కంటే పెద్దగా నిరూపించబడాలి... అట్టి ప్రభుత్వం కర్ణాటక ప్రజల సొంతం కావాలి. ఇక కర్ణాటక ఎప్పటికీ నాటక కానివ్వకుండా చూడాలి.

దాల్ సరస్సులో తేలియాడుతున్న స్పాన్‌హౌస్‌లో నేను ఉదయం 7.30 కంతా సిద్ధమయిపోయాను. మేమందరం శ్రీనగర్ నుంచి 70 కి.మీ. దూరంలో కొండ మీద ఉన్న గుల్మార్గ్‌కి వెళ్ళాలని అనుకొన్నాము. ఇది ఇక్కడ ప్రఖ్యాతి గాంచిన స్కీయింగ్ గమ్యస్థానం. మొదట్లో గౌరిమార్గ్ అంటే దేవి మార్గ్ అని పిలిచేవారు. ఆ తర్వాత చక్‌రాజు వంశానికి చెందిన యుసుఫ్ షా గుల్మార్గ్ (పువ్వుల పచ్చిక భూమి) గా మార్చారు.

**గుల్మార్గ్:**

అధిక ఎత్తులో ఉన్నందున గుల్మార్గ్ తేమతో కూడిన ఖండాంతర వాతావరణం కలిగి ఉంది. ఇక్కడ తేమతో కూడి, శీతాకాలం భారీ హిమాపాతాన్ని కలిగి ఉంటుంది. వేసవి కాలం ఉష్ణోగ్రతని దీవిలో మధ్యస్థంగా ఉంటుంది. ఇతర రుతువులు మామూలుగా చల్లగానే ఉంటాయి. కానీ శ్రీనగర్‌లో కొన్ని గంటల పాటు కురిసిన భారీ వర్షంతో వాతావరణం అధ్వానంగా మారింది. ఇక మేము బోట్ హౌస్‌లోంచి బయట కాలు పెట్టడానికీ ధైర్యం చేయలేకపోయాము. వర్షం తగ్గుముఖం పట్టిన రెండు గంటల తర్వాత మేము ఆ రోజుకి బయట తిరిగేది రద్దు చేయాలని నిర్ణయించుకున్నాము. అందరము కామన్ హాల్లో కూర్చుని పిచ్చాపాటీ మొదలుపెట్టాము. పరిశీలనలు, అనుభవాలు, సేవ, తీర్థయాత్ర, మొదలగు వాటితో మొదలైన చర్చలు ఒక అద్భుతమైన విజ్ఞానంతో కూడిన సత్సంగానికి దారి తీసాయి. లేకపోతే ఏదో ప్రాపంచిక

చర్చలు చేసి వదిలివేసే వాళ్ళమేమో! నేను అన్ని విషయాలకూ అందర్నీ కనెక్ట్ చేయడానికిని ప్రయత్నం చేసాను. ఈ సందర్భంగా క్లుప్తంగా అభయ ఫౌండేషన్ గురించి కూడా చెప్పాను.

లంచ్‌కి ఎవరి దారిన వారు వెళ్ళిపోతూ ఉండగా అందులో ఇద్దరు యాత్రికులు భోజనానంతరం గుల్మార్గ్ వెళ్ళాలని ప్రతిపాదించారు. ఒక టెంపోలో మా ప్రయాణం మొదలైంది. సముద్ర మట్టానికి 1000 అడుగుల ఎత్తులో ఉన్న ఆ ప్రాంత వాతావరణం గురించి అందరికీ అనేక సందేహాలు ఉన్నప్పటికీ సాహసం చేసి మా జట్టు ముందుకు సాగింది.

భారతదేశంలో అత్యంత సుందరమైన గుల్మార్గ్‌కు ఘాట్‌రోడ్లలో, కొండల వంపుల్లో సుమారు రెండు గంటలు ప్రయాణించి చేరుకోవాలి. ఇది చాలా చిన్నది కాని అత్యంత అద్భుతమైనది. సాహసికులకు స్వర్గధామం, ప్రకృతి ప్రేమికులకు మరో ప్రపంచమే! విస్తారమైన తీగలతో, పూలతో కప్పబడిన పచ్చిక భూములు, మంచుతో ఆల్పైన్ వృక్షాలతో నిండి ఉంది. సాహస క్రీడలకు ప్రేరేపిస్తూ, అదే సమయంలో మనసును ఆహ్లాదంతో నింపుకునే తాజా వాతావరణాన్ని అందిస్తుంది. గుల్మార్ నిజమైన కాశ్మీర్ అందాల మిశ్రమాన్ని రుచి చూపించే ఓ అద్భుతమైన ప్రదేశము.

సుందరమైన ప్రకృతి దృశ్యం ఈ గుల్మార్గ్ సందర్శన కోసం అనేక రకాలైన మార్గాలను మనకు అందిస్తుంది. ఇక్కడ ప్రతి అంగుళము వర్ణించదగినంత సుందరంగానే ఉంటుంది. ఈ మనోహరమైన ప్రదేశాలు, లోయలు, వాటియొక్క విశాల దృశ్యాలను చూస్తే ఎవరికైనా ఆనందం కలిగిస్తాయి. నాగిన్‌వాలిలో ఉ న్న పవిత్ర మందిరము ఈ నిర్మలమైన లోయను ఇంకా పవిత్రం చేస్తుంది. గుల్మార్గ్ అని పిలవబడే అంతులేని ఈ దృశ్యమాలిక ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రయాణికులకు అనేక రకాల కారణాలు అందిస్తాయి ఇక్కడికి రావడానికి, ఆ సుందర దృశ్యాలను అనుభవాలుగా మార్చడానికి.

మేము అందరితో చేరి మంచి సమయం గడపడం ఆనందంగా ఉంది. కొంత మంది నడకకు వెళ్లారు, నేను రోడ్డు దాటి అత్యంత సుందరమైన ప్రకృతిని ఆస్వాదిస్తూ వుండగా... నన్ను గమనించి ఇద్దరు రాజకీయ శాస్త్రం చదువుకునే విద్యార్థులు, నేను అక్కడ ఎలా ఉన్నాను, ఇక్కడి ప్రజలు ఎలా అనిపించారు

లాంటి ప్రశ్నలు అడిగారు. నేను ఎంతో సంతోషంగా, ప్రేమగా, పరిశీలనల గురించి చెప్పాను, వారు ఎంతో సంతోషంగా నన్ను అభినందించి నన్ను, నా మాటలను వీడియో, ఫోటోగ్రాఫ్స్ తీసుకున్నారు. రాత్రి 8.30 గంటలకు శ్రీనగర్ తిరిగి వచ్చాను శ్రీనగర్ అందాల గురించి ఆలోచనలతోనే...

## జూలై 26, 2019

**జమ్ము:**

మరుసటి ఉదయం 6.30 నిమిషాలకు శ్రీనగర్ నుంచి 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న జమ్ముకి బయలుదేరాం. మా ప్రతి ప్రయాణం ప్రార్థనతోను, ప్రేమతోనూ మొదలవుతుంది. ఈ ప్రయాణంలో కూడా సత్సంగం మరియు భజనలు చేసుకున్నాము.

**రఘునాథ్ ఆలయం:**

మార్గమధ్యంలో అల్పాహారం కూడా ముగించేసుకుని రఘునాథ్ ఆలయాన్ని చేరుకున్నాము. రఘునాథ్ ఆలయం హిందూ దేవాలయము, 7 హిందూ పుణ్యక్షేత్రాల సమూహాన్ని కలిగి ఉంది. ఈ ఆలయాన్ని మొదట డోగ్రా పాలకుడు మహారాజా గులాబ్ సింగ్ 1835లో నిర్మించారు, ఆ తర్వాత ఆయన కుమారుడు మహారాజా రణ్‌బీర్ సింగ్ 1860లో ఆలయాన్ని పూర్తి చేసారు. ఈ పుణ్యక్షేత్ర సమూహంలో 6 మంది దేవతలు ఉన్నారు కానీ ప్రధాన దేవుడు రాముడు. ఆయననే రఘునాథునిగా పిలుస్తారు. ఇది విష్ణువు (వైష్ణవ దివ్య దేశం) యొక్క అవతారం.

ఆలయ ప్రాకారంలో బంగారు పూత పూసిన గోపురాలు ఉన్నాయి. పుణ్యక్షేత్రము గోడలలోని చిన్న గుడులలో సూర్యుడు, శివుడుతో సహా 300 మంది దేవతా స్వరూపాలుచక్కటి ఆకారాలతో చెక్కబడి ఉన్నాయి.

వాటిలో చాలా వరకు రాముడు, కృష్ణుల కథలు సంబంధించిన మూర్తులు. ప్రధాన మందిరంలోని 15 ప్యానళ్ళలో పెయింటింగ్స్ ద్వారా రామాయణం, మహాభారతం, మరియు భగవద్గీత ఇతివృత్తాలను ప్రదర్శించారు.

ఆలయ ప్రాంగణంలో అనేక భారతీయ భాషల్లో ఆరు వేల చేతి వ్రాతలు

/ తాళపత్రాలు భద్రపరచబడిన పురాతన గ్రంథాలయముంది. శారదా లిపి సంస్కృత చేతి వ్రాతల యొక్క ముఖ్య సేకరణలను ఇక్కడ చూడచ్చు.

హిందువుల్లో 33 కోట్ల మంది దేవుళ్లను సూచించే అనేక సాలిగ్రామాలను అక్కడ చూసాము. ప్రధాన ఆలయం చుట్టూ వేదికపై ఏర్పాటు చేసిన (తత్వశాస్త్రం) కూడా చూసాము. ఇలాంటివి భారతదేశంలో మరెక్కడా కూడా లేవని నా అభిప్రాయం.

2002 సంవత్సరంలో రెండు తీవ్రవాదుల దాడులను ఈ ఆలయం ఎదుర్కొంది. మార్చి మరియు నవంబర్‌లో ఇస్లామిక్ ఉగ్రవాదులు బాంబు దాడి చేసి, విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. అప్పుడు 20 మంది భక్తులు చనిపోయారు, 40 మందికి పైగా గాయపడ్డారు. అందువల్లనే ఈ ఆలయానికి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసారు.

ఆలయాన్ని సందర్శించిన తర్వాత, మేము రాత్రి బస కోసం జమ్మూ నగరానికి వెలుపల ఉన్న మ్యాంగో హొటల్‌కి చేరుకున్నాము.

# పంజాబ్

## జూలై 27, 2019

**అమృత్‌సర్ – త్యాగ భూమి:**

మేము జమ్మూ నుంచి సుమారు 400 కిలోమీటర్ల దూరంలో ఉన్న పంజాబ్ రాష్ట్ర రాజధాని నగరమైన అమృత్‌సర్‌కు ప్రయాణం ప్రారంభించాము. దారిలో అల్పాహారాన్ని తీసుకున్నాము. యాత్ర ఢిల్లీలో ప్రారంభమైన నాటి నుండి 12 రోజులయ్యింది. ఈ మధ్య కాలంలో బస్సులో యాత్రికులు ఒకరికొకరు సుపరిచితులుగా మారిపోయారు.

యధావిధిగా నిత్యమూ ప్రార్థనలూ భజనలతో మారోజు ప్రారంభమైంది. ప్రతి ఒక్కరూ కూడా తమ జీవితంలో దర్శించిన అద్భుత క్షేత్రాలను వివరించారు. అంతేకాదు, ప్రతి వ్యక్తి తమ జీవితంలో ఒక సారైనా తప్పక దర్శించవలసిన క్షేత్రాల గురించీ పంచుకున్నారు. మరికొంత మంది తమతో పాటు తెచ్చిన ఫలహారాలను అందరితో పంచుకున్నారు. మహిళా యాత్రికులు సామూహికంగా గోవింద నామస్మరణ చేసారు. మార్గమధ్యంలో 9.2 కిలో మీటర్ల ప్రసిద్ధ సొరంగాన్ని దాటుకుంటూ అక్కడ ప్రసిద్ధ మిఠాయి అంగడి దగ్గర ఆగి పసా స్వీట్‌ని బంధువులకు, ఇరుగుపొరుగు వారికి పంచడానికీ తీసుకున్నారు.

శ్రీకాకుళానికి చెందిన శ్రీమతి & శ్రీ జగన్నాథరావు గార్లు అమ్మమ్మ తాతయ్యలు అవుతున్నందుకు యాత్రికులందరికీ అక్కడ మిఠాయిలు కొని పంచారు. ఇక జయశ్రీ దేవరాజు గారు తమాషా ప్రశ్నావళి నిర్వహించి, అందరికీ చిన్న వెండి జ్ఞాపికలను అందజేశారు. ఇలా ప్రయాణం అంతా ప్రేమ, శ్రద్ధ, అవగాహన, సర్దుబాటు, దైవభక్తి, దేశభక్తితో నిండిపోయి ఆహ్లాదంగా సాగిందని చెప్పాలి. ఈ యాత్రికుల్లో ఎవరో ఒకరు వాట్సప్ గ్రూప్‌ను తయారు చేసారు. నేను అందరి మెయిల్ ఐడీలు తీసుకొని ప్రయాణంలోనే నేను నా ఫోన్ ద్వార

బంధించిన అందమైన చిత్రాలను, దృశ్యాలను ఎప్పటికప్పుడూ అందరికీ పంపించడం చేసాను.

**జలియన్ వాలాబాగ్:**

మనల్ని కళ్ళనీళ్ల పర్యంతం చేసే భారత స్వతంత్ర పోరాట పుటల నుండి జాలువారిన ఒక రక్త చరిత్ర జలియన్ వాలాబాగ్. సుమారు ఉదయం 11:30 గంటలకు అమృతసర్ చేరుకున్నాము. మొట్టమొదట సుమారు వంద సంవత్సరాల క్రితం దేశం కోసం తమ ప్రాణాలను అర్పించిన వందలాది మంది భారతీయులకు అంకితం చేయబడిన జలియన్ వాలాబాగ్ దర్శించాము. జలియన్ వాలాబాగ్ 6 ఎకరాల విస్తీర్ణంలో అన్ని వైపులా గోడలు, ఐదు ప్రవేశ ద్వారాలతో కూడిన ఒక మైదానం. ఇక్కడే బైసాకీ కోసం గుమిగూడిన వేలాది మందిపై నిరవధికంగా కాల్పులు జరపమని జనరల్ డయ్యర్, బ్రిటిష్ దళాలను ఆదేశించారు. విచక్షణారహిత కాల్పుల్లో అమాయకులైన వందలాది మంది తమ ప్రాణాలను కోల్పోయారు... వేలాది మంది క్షతగాత్రులయ్యారు. రక్తం ఏరులై పారింది అక్కడ.

అక్కడి అణువణువు భారత మాత దాస్య శృంఖలాలను పగలగొట్టి స్వేచ్ఛా వాయువును అందించాలని తపించిన దేశభక్తుల రక్త తర్పణముతో పునీతమైనది అనిపించింది. స్వాతంత్ర్యం కోసమై అసువుల బాసిన యోధుల కోసం, జలియన్‌వాలాబాగ్‌లో స్మారక కేంద్రాన్ని నిర్మించడానికి 1920లో ఒక ట్రస్ట్‌ను స్థాపించారు. అదీ ఏప్రిల్ 13, 1961న అప్పటి భారత రాష్ట్రపతి అయిన రాజేంద్ర ప్రసాద్ గారి చేత ప్రారంభించబడింది.

ఈ రోజుకి కూడా, ఆ స్మారక చిహ్నం పక్కనున్న భవనాల మీద బుల్లెట్ల దెబ్బకు చెదిరిన గోడలు కనిపిస్తాయి. ఆ రోజూ ప్రజలు భారతమాత స్వేచ్ఛ కోసం అనుభవించిన బాధ, కష్టాన్ని వర్ణిస్తాయి. బ్రిటిష్ సైనికులు ప్రయోగించిన బుల్లెట్ల వల్ల ప్రాణాలు పోవద్దని... ఆత్మార్పణ చేసుకునేందుకు అక్కడి మైదానంలో చాలా మంది యోధులు దూకిన బావి కూడా అక్కడ ఈ ప్రదేశంలో చూడచ్చు. అలా దూకిన యోధులను కూడా బ్రిటిష్ వాళ్ళు విచక్షణారహితంగా కాల్పులు జరిపి ప్రాణాలు తీశారు.

నాకు అసలు చెప్పడానికీ మాటలు లేవు. నేను ఈ ప్రదేశాన్ని దర్శించిన ప్రతిసారీ అమర లోకంలోకి ప్రవేశించిన అనుభూతి వస్తుంది. శతాబ్దము క్రితం జరిగిన మన పెద్దల త్యాగాలను స్మరించుకుంటూ... అశ్రునయనాలతో... అమరస్తూపం... అమరజ్యోతి పక్కన అలానే నిలబడిపోయాను.

ప్రియమైన మిత్రులారా, స్వాతంత్ర్య పోరాటంలో మన భారతీయులు చేసిన త్యాగం ఎన్నటికీ వృధాపోదు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్, చంద్రశేఖర్ ఆజాద్, ఉద్ధమ్ సింగ్ మనకు తెలిసినా... ఇంకా తెలియని చాలా మంది స్వాతంత్ర్య యోధులు దేశం కోసం ప్రేమతో ప్రాణాలు అర్పించి చేసిన ఆ త్యాగం వృధాపోదు. వారి జీవితాలు సందేశాలుగా మారి మన అందరినీ కూడా దేశం కోసం ప్రేమతో, త్యాగంతో జీవించాలని నిత్యం నిర్దేశిస్తాయి. వారి స్ఫూర్తిదాయకమైన జీవితాలను పంజాబ్‌లో ఒక జ్ఞాపకంగా భద్రపరిచారు. ఈ ప్రదేశం ధైర్యాలకు, త్యాగాలకు చిహ్నంగా నిలిచింది, తరతరాలకు స్ఫూర్తినిచ్చి, ఎప్పటికీ ఉంటుంది. వాళ్ల లాగా నేడు దేశం కోసం ప్రాణాలు అర్పించాల్సిన పని లేదు కాని మనం అందరం కూడా దేశం కోసం బ్రతికే పనులు చేద్దాం.

### నా దేశ ప్రజల కోసం రక్తదానం:

స్మారక చిహ్నం నుండి తిరిగి వస్తూ ఉండగా, వెలుపలికి వచ్చిన మార్గంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న స్వచ్ఛంద సేవకులను చూసాను. వంద సంవత్సరాల క్రితం జలియన్ వాలాబాగ్‌లో ప్రాణత్యాగం చేసిన వారి గౌరవార్థం నా రక్తాన్ని అవసరమైన వారికోసం ఇవ్వాలని అనుకున్నా. అలాగే చేసాను కూడా... రక్తం ఇవ్వడం నాకు ఎంతో సంతోషంగా అనిపించింది. ప్రతి ఒక్కరు దైవభక్తిని, దేశభక్తిని కలిగిఉంటే భారతదేశం కోల్పోయిన పూర్వ వైభవాన్ని... మనం అందరూ తిరిగి పొందగలమని ప్రగాఢంగా నమ్ముతున్నాను.

యాదృచ్ఛికంగా ఈ రోజు భారత భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం గారి జయంతి. నా 50 సంవత్సరాల జీవితంలో... స్ఫూర్తిప్రదాతలు ముగ్గురు. అందులో మొదటగా ఇష్టదైవం భగవాన్ శ్రీ సత్యసాయి బాబా గారు, భారతరత్న అటల్ బిహారీ వాజ్ పేయీ గారు, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వీరంతా నాకు ఈ దేశం కోసం ఎలా బ్రతకాలనే దాని గురించి... వారి జీవితాల

ద్వారా నాకు నేర్పించారు, నా జీవితంలో విలువలను నింపారు.

ప్రియమైన స్నేహితులారా!

అబ్దుల్ కలాం గారి జీవితంలో ఒక్క విలువని తీసుకున్నా మన జీవితం ఈ దేశానికి విలువగా మారుతుంది అని నేను నమ్ముతాను.

**డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం:**

1931: తమిళనాడు రామేశ్వరంలో అక్టోబర్ 15న జన్మించారు. చిన్నతనంలో తండ్రికి సహాయం చేయడానికీ పాఠశాల తర్వాత పత్రికల పంపిణీ చేసేవారు.

1954: మద్రాసు విశ్వవిద్యాలయం నుండి భౌతిక శాస్త్రంలో పట్టభద్రులయ్యారు.

1957: MIT నుండి ఏరోనాటికల్ ఇంజనీరింగ్ డిగ్రీ పొందారు.

1958: ఏరోనాటికల్ డెవలప్‌మెంట్‌లో శాస్త్రవేత్తగా DRDOలో చేరారు.

1969: ISROకి బదిలీ చేయబడ్డారు. SLV-3 ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పనిచేసారు.

1980: రోహిణి ఉపగ్రహాన్ని మోసుకెళ్లే భారతదేశం యొక్క మొదటి ప్రయోగాత్మక ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రారంభించి, భారతదేశాన్ని ప్రపంచ దేశాల సరసన నిలబెట్టే ప్రత్యేకమైన రాకెట్‌ను ప్రారంభించారు.

1982: DRDOలో డైరెక్టర్‌గా నియమితులయ్యారు.

1983: అగ్ని, పృథ్వి క్షిపణుల అభివృద్ధికి ముందున్నారు. మిసైల్ మాన్ అనే పేరుని సంపాదించారు.

1998: DRDO చీఫ్‌గా పోఖ్రాణ్ 2 అణు పరీక్షలను విజయవంతంగా నిర్వహించారు. తక్కువ ధరలో డెసీల్, జెట్ ఇంజిన్, స్టంట్‌ని అభివృద్ధి చేసారు.

2002: భారత 11వ రాష్ట్రపతిగా KR నారాయణ్ మీద విజయం సాధించారు.

2007: అబ్దుల్ కలాం పీపుల్స్ ప్రెసిడెంటుగా పదవీకాలాన్ని ముగించారు. విద్య, రచన మరియు ప్రజాసేవ జీవితానికి తిరిగి వచ్చారు.

2015: ఆయన ఉత్తమంగా, నిజంగా ఇష్టపడే పనిని చేస్తూ మరణించారు. మెరుగైన ప్రపంచాన్ని నిర్మించడానికి యువకులను సదా ప్రేరేపించారు.

## సన్యాసికి ఐదు నక్షత్రాల హోటల్ అనుభవం:

హోటల్ రమదా అమృతసర్‌లో ప్రసిద్ధ 5 నక్షత్రాల హోటల్. చాలా అందమైనది అని చెప్పాలి. ఏమూల చూసిన అందం మరియు సౌందర్యమే. డబ్బులు ఉండాలే గానీ భూలోకంలో స్వర్గాన్ని కూడా చూసేయచ్చునని అనిపించింది నాకు. ఇక అక్కడ కేటాయించిన అద్భుతమైన గదిలో కాల కృత్యాలు ముగించుకొని... అల్పాహారం తీసుకుని... కూర్చున్నాము. తోటీ యాత్రికులకు మంచి గుర్తులు అందించాలని... సాధ్యమైనంత మందికి ఫోటోలు తీశాను. అందరూ చాలా సంతోషపడ్డారు. ఈ రోజుల్లో సొంతవాళ్లు కూడా కుటుంబ సభ్యులలో పెద్ద వాళ్లను కాస్తా ప్రక్కన పెడుతుంటారు. అలాంటిది వయసుతో సంబంధం లేకుండా అందరిని పిలచి, పిలచి వైవిధ్యంగా ఫోటోలు తీసాను. వారి ఆనందానికి అంతే లేదంటే నమ్మండి.

ఆ తరవాత మేమంతా నగరానికి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న అత్తారి వాఘా బోర్డర్‌కు వెళ్లాము.

## అత్తారి బార్డర్:

పాకిస్తాన్ సరిహద్దుగా వాఘా ప్రసిద్ధి చెందిన ప్రదేశం. మన దేశంలో సరిహద్దు ప్రాంతం అత్తారి గ్రామంలో ఉంది. మా అందరి సందర్శన యొక్క ఉద్దేశం ఏమిటి అంటే అక్కడ జెండా అవనతం వేడుకను చూడటమే. ఇది ప్రతి రోజూ సాయంత్రం పూట అధికారికంగా ఇరుదేశాల మధ్య ఉన్న సరిహద్దు ద్వారాలను మూసివేయడం మరియు ఇరుదేశాల జాతీయ జెండాను అవనతం చేసే కార్యక్రమం అని చెప్పొచ్చు. ప్రతిరోజు సూర్యాస్తమయానికి ముందు ఈ కార్యక్రమం జరుగుతుంది. భారత సరిహద్దు ప్రాంతంలో జరిగే ఈ వేడుకలో వేలాది మంది పర్యాటకులు ఇరుదేశాల వైపు ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్యాలరీలలో కూర్చుని కన్నులపండుగగా జరిగే కార్యక్రమాన్ని వీక్షిస్తుంటారు. వినోదముగా ప్రారంభించే ఈ కార్యక్రమం... ఇరువైపులా చేరిన దేశాల వాళ్ళలో నిద్రాణమై ఉన్న దేశభక్తిని నిద్రలేపే ప్రదర్శనగా మారి... మన వైపు చేరిన భారతీయుల నరనరములలో నిండుగా భారతమాత మీద అవ్యాజమైన ప్రేమను, అభిమానాన్ని చిగురింపచేస్తుంది. ఆ కోలాహలం అంతా ఇంతా అని చెప్పేందుకు వీలు కాదు.

చిన్నా, పెద్దా, కుల, మత, ప్రాంత, భాష అన్న తేడా లేకుండా అందరూ అక్కడ జరిగే కార్యక్రమాలలో పాల్గొంటారు. సైనికులు చేస్తున్న అద్భుతమైన విన్యాసాలకు మైమరచిపోయి... ఉగ్రూతలూగి... సింహల్లాగా గర్జించడం చూడచ్చు. మొత్తంగా ప్రదేశం అంతా మూడు రంగుల కాంతులతో... దేశభక్తితో అందరిని సమ్మోహితులను చేస్తుంది అని చెప్పడంలో సందేహమే లేదు.

జాతీయ గీతం ఆలాపనతో అందరూ రోమాంచితులై ఆనందభాష్పాలను కారుస్తారు. దేశభక్తి నినాదాలు మరియు పాటలతో వెర్రెత్తిన వాళ్ళైపోయి అందరూ నృత్యాలు చేస్తారు. అంతేకాకుండా కొన్ని సార్లు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించబడతాయి. అందులో అక్కడ చేరిన మనలాంటి వారు భాగం అవుతారు.

ఆ సరిహద్దు వేడుకల్లో వందలాది మంది విదేశీ పర్యాటకులు కూడా భారతీయులతో పాటుగా చాలా చురుకుగా పాల్గొనటం చూసాను.

ఇక తిరోగమన సమయంలో పెద్ద పెద్ద గర్జనలతో సైనికుల భారీ అడుగుల ముద్రలతో కవాతు చేసే సమయం అందరిని ఉద్వేగభరితముచేస్తుంది. ఆ సమయంలో సరిహద్దు ఒక యుద్ధభూమిలా కనిపిస్తూంటుంది. సైనికులు తమ కాళ్ళను తమ తలల కంటేకూడా ఎత్తుగా పైకి లేపి చేసే కవాతును గ్రూప్ మార్చింగ్ అనీ అంటారు. వాళ్లకు మద్దతుగా ఇక్కడ చేరిన భారతీయులు, పర్యాటకులు ఇరువైపులా చేసిన నినాదాలతో ఆ ప్రాంతం దద్దరిల్లిపోతుంది. మొత్తం 60 నిమిషాల పాటూ కార్యక్రమం కొనసాగుతుంది.

ప్రధాన ఆకర్షణ ఏమిటి అంటే వీరులు చేసే కవాతు. వారి పదఘట్టనలకు ఆ మైదానంలో చేరిన వారు సింహనాదాలు చేస్తుంటే చెవులు కాసేపు పని చేయడం ఆగిపోతాయి.

నిజం చెప్పాలి అంటే... ఇది కన్నులకు నిజమైన పండుగ. ఎవరికైనా ఆసక్తి ఉంటే... ఎవరైనా తమ ఉత్సాహాన్ని తక్షణం వంద రెట్లు పెంచుకోవాలనుకుంటే ఈ కార్యక్రమం జరిగే సమయంలో ఉండమని నేను సలహా ఇస్తున్నాను. ఇది దేశం కోసం బ్రతకాలన్న జీవితకాల స్ఫూర్తిని అందిస్తుందని నేను కచ్చితంగా చెప్పగలను. ఆ భావోద్వేగాలు, జ్ఞాపకాలు మన హృదయ పీఠికలో దీర్ఘకాల ముద్రలు వేస్తాయి అని దృఢంగా నమ్ముతాను.

రెండు దేశాల మధ్య పరస్పర సహకారం మరియు సామరస్య వాతావరణం

నెలకొల్పడం అత్తారి సరిహద్దు వేడుక ప్రధాన లక్ష్యం. అలాగా ఈ వేడుక మన దేశ సరిహద్దుని రక్షించడానికి సైనికులు చేసిన త్యాగాలను కూడా అర్థం చేసుకోవడానికీ ఒక మంచి ప్రదేశము.

BSF అంటే బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ అని అర్థం. కానీ నాకు మాత్రం "బీయింగ్ ఇన్ సర్వీస్ ఫర్ ఫైటింగ్... భారత సర్వీస్ ఫస్ట్!" అని స్ఫురించింది.

## స్వర్ణ దేవాలయం ప్రకృతిలో నిజమైన బంగారం:

బోర్డర్ నుండి అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయంకు వెళ్ళాము. గోల్డెన్ టెంపుల్ గా ఈ ప్రదేశం ప్రఖ్యాతిచెందింది. ఇది సిక్కు మత ప్రధాన క్షేత్రం మాత్రమే కాక, మానవ సౌభ్రాతృత్వం మరియు సమానత్వానికి ప్రతీక. ప్రతిఒక్కరు కుల, మత, జాతి భేదాల లేకుండా ఆధ్యాత్మిక స్వాంతన మరియు మతపరమైన సాఫల్యతను పొందవచ్చు. ఇది సిక్కుల అస్తిత్వానికి, కీర్తి ప్రతిష్టలకు, చరిత్రకు మరియు వారసత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తుంది.

శ్రీ హర్మిందర్ సాహెబ్, తత్వశాస్త్రం, భావజాలం, అంతర్గత మరియు బహిర్ సౌందర్యం, అలాగే చారిత్రక వారసత్వం గురించి రాయటం చాలా ముఖ్యమైన విషయం. ఇది వర్ణన కంటే కూడా మన అనుభవానికి సంబంధించిన విషయం. అయినప్పటికీ అవగాహన కోసం నేను అమృత్‌సర్ స్వర్ణ దేవాలయ విశేషాల గురించి సంక్షిప్త వాస్తవాలను ఇక్కడ పొందుపరుస్తున్నాను.

- స్వర్ణ దేవాలయాన్ని శ్రీ హర్మిందర్ సాహెబ్ లేదా శ్రీ దర్బార్ సాహిబ్ అని పిలుస్తారు.
- ఇది గొప్ప అందమైన మరియు ఉత్తమమైన శాంతియుత ప్రదేశం.
- శ్రీ హర్మిందర్ సాహెబ్ అంటే దేవుని ఆలయం.
- సిక్కు మతం యొక్క అతిముఖ్యమైన పుణ్యక్షేత్రం ఇది.
- నిజానికీ ఇది ఒకప్పుడు దుర్గం, అడవిలో ఒక చిన్న సరస్సు. ఈ స్థలం ప్రాచీన కాలం నుండి ప్రాధాన్యత పొందినది. ఇక్కడికి యోగులు, ఋషులు ధ్యానం కోసం వచ్చేవారు.
- బుద్ధుడు కూడా ఈ ప్రదేశంలో ధ్యానంలో గడిపినట్టు తెలుస్తుంది.
- బుద్ధుడి తర్వాత 2000 సంవత్సరాల తదనంతరం తత్వవేత్త

శ్రీ గురునానక్ ఇక్కడికి వచ్చారు. 1469 నుంచి 1539 వరకు ధ్యానం చేస్తూ ఇక్కడ జీవితాన్ని గడిపారు.

- స్వర్ణ దేవాలయాన్ని 1574లో నాలుగవ సిక్కు గురు రాందాస్ నిర్మించారు.
- ఐదవ సిక్కు గురువు అర్జున్ దాస్, గురుద్వారా నిర్మాణాన్ని ప్రారంభించారు. ముస్లిం మత పెద్ద పునాది రాయి వేశారు.
- గురు అర్జున్ దాస్ శ్రీ హర్మిందర్ సాహెబ్‌ను ఈ పవిత్ర సరస్సు మధ్యలో నిర్మించేలా రూపొందించారు. దాని నిర్మాణం తర్వాత సిక్కు మత పవిత్ర గ్రంథం అయిన ఆది గ్రంథాన్ని కూడా ప్రతిష్ఠించారు.
- మహారాజా రంజింత్ సింగ్ (1780-1839) పరిపాలించిన కాలంలో జస్వంత్ సింగ్ ఆషు తాలియాచే పునర్మించబడింది.

ఐదవ సిక్కు గురువైన గురు అర్జున్ సింగ్ గురుద్వారను నిర్మించారు. శంఖు స్థాపన అప్పటి ముస్లిం మత పెద్ద మీఆన్మీర్ చేత డిసెంబర్ 28 రోజున 1558లో చేయించారు. గురుద్వారా 1604లో పూర్తయింది. అనేక సందర్భాలలో ముస్లింలచే ఈ ఆలయం ధ్వంసం చేయబడింది. అలా ధ్వంసం చేయబడిన ప్రతిసారి సిక్కుల గురు ద్వారా పునర్నిర్మించబడింది. ఇప్పుడున్న స్వర్ణ దేవాలయం అంతా కూడా పాలరాతి శిల్పాలతో, బంగారు పూతతో దేశంలోని విలువైన రాళ్లతో అలంకరించబడింది.

పొడవైన నడవా చివర్లో నీళ్లలో గంభీరంగా తేలియాడే స్వర్ణ దేవాలయం, హిందూ ఇస్లామిక్ నిర్మాణ శైలిల సమ్మేళనం అనిచెప్పాలి. పియాత్ర దురావర్క్తో, పువ్వులు, జంతువుల నేపథ్యాలతో సొగసైన పాలరాతి రాళ్లతో అలంకరించబడింది (తాజ్‌మహల్ మీద చూపినట్లు) రెండవ స్థాయిలో బంగారు రేకులతో కప్పబడింది (సుమారు 750 కేజీ లేదా 1653 పౌండ్స్ బంగారం వినియోగించారని చెప్తారు). బంగారంతో పూతపూసిన గోపురంతో పాటూ అంతరాలయ గోడల మీద కూడా రాగి ఫలకాల మీద ప్రత్యేకమైన డిజైన్లు వేసి బంగారు ఆకులతో కప్పబడి ఉన్నాయి.

హర్మిందర్ సాహెబ్ పై కప్పు బంగారం, వెండి మరియు విలువైన రాళ్లతో తయారు చేయబడింది. స్వర్ణ దేవాలయంలో సిక్కు మత పవిత్ర గ్రంథం అయిన గురు గ్రంథ సాహెబ్ ఉంది. విలువైన ఆభరణాలతో పొదగబడిన పందిరి

కింద ఎత్తైన వేదిక మీద ఉంది. ఈ గ్రంథం 10 మంది సిక్కు గురువులు, వివిధ ముస్లింలు, హిందూ సాధువులు స్వరపరిచిన భక్తి పద్యాలు, ప్రార్థనలూ శ్లోకాల సమాహారం. నిర్మాణ పరంగా ఆలయం భూమి స్థాయికి కింద స్థాయిలో ఉంది. ఇది దేవుని ఆలయానికి చేరుకోవడానికీ ఎవరైనా వినయంతో నేరుగా వెళ్లాలన్న భావనను సూచిస్తుంది. ఆలయ నిర్మాణ శైలి హిందూ ఆలయాలకు విరుద్ధంగా ఉంటుంది. హిందూ దేవాలయాలు అన్ని కూడా చాలా ఎత్తులో నిర్మించబడ్డాయి.

దర్శిని దీయోఢి ఆర్క్ హర్మిందర్ సాహెబ్ నడవా మొదట్లో ఉంది. ఇది సుమారు 6.2 మీటర్లు (20.3 అడుగుల) ఎత్తులో ఆరు మీటర్లు (20 అడుగుల) వెడల్పుతో ఉన్నది. ఈ స్వర్ణ దేవాలయానికి నాలుగు దిశల నుంచి ప్రవేశాలు ఉన్నాయి. ఇలా ఉండడం అన్నది సర్వజనామోదం, నిష్కల్మషము మరియు నిర్కపటము ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. స్వర్ణ దేవాలయం లోపల గతంలోని సిక్కు చారిత్రాత్మక సంఘటనలు, సాధువులు, అమరవీరుల జ్ఞాపకార్థం అనేక స్మారక ఫలకాలు ఉన్నాయి. వీటిలో మొదటి మరియు రెండవ ప్రపంచ యుద్ధంలో మరణించిన సిక్కు సైనికుల స్మారక శాసనాలు కూడా ఉన్నాయి. స్వర్ణ దేవాలయం చుట్టూ సరోవరం ఉంది. ఇది అమృత (పవిత్ర జలములు లేదా అమృతం) జలాలను కలిగి ఉన్న ఒక పెద్ద సరస్సు. ఇక్కడ మూడు పవిత్ర వృక్షాలు ఉన్నాయి. ప్రతి ఒక్కటి చారిత్రాత్మక సంఘటన లేదా సిక్కు సాధువుల విషయాలను సూచిస్తుంది. స్వర్ణ దేవాలయంలో అతి పెద్ద భోజనాలయము ఉన్నది. సాధారణంగా 75 వేల మందికి ప్రతిరోజు భోజన వసతి ఉంటుంది. ఇంకా మతపరమైన రోజుల్లోను, సెలవుల్లోనూ, వారాంతాలలోనూ దాదాపు లక్ష మందికి పైగా ఆహారం అందజేస్తుంది. విరాళాలు మరియు స్వయంసేవకుల ద్వారా సాగుతున్న అద్భుతమైన సేవా కార్యం ఇది. ఇక్కడ కులం, మతం, హోదాలతో సంబంధం లేకుండా భోజనానికి వచ్చిన ప్రతి ఒక్కరు కిందనే కూర్చోవాలి. ఇది ప్రజలందరి సమానత్వానికి సంబంధించిన సిక్కు సిద్ధాంతానికి ప్రతీక. ఇదిగోప్ప ప్రేరణ కలిగించే విషయం. దేవుడుకాదు, గురువు, ఇది ఒక గురి (ఒక నమ్మకం). అందుకే గురు గ్రంథం అన్నారు. ఈ పవిత్ర గ్రంథం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సిక్కు సమాజాలన్నింటి పరివర్తనలో పెను మార్పులను

తీసుకురాగలదు.

వాహే గురు వాహే గురు వాహే గురుజీ బోలో
సత్యనాం సత్యనాం సత్యనాం జీ బోలో
నిత్యం నిత్యం జపియే హరి నాం జీ బోలో
సత్యం సత్యం జపియే రామ్నాం జీ బోలో

## జూలై 28, 2019

## పోయిన సామాను దొరికింది (మళ్లీ ఒకసారి)

ఉదయం 6 గంటలకి హోటల్ నుండి బయటకు వచ్చాను. హోటల్ రామదా అమృత్‌సర్‌లోని అత్యంత అందమైన హోటళ్లలో ఒకటి అని చెప్పాలి. అక్కడి అందమైన అమరికలు, అలంకారాలు, కూడ్యాచిత్రాలు, ఆసనాలు. బల్లలు చూస్తూంటే, అక్కడ ప్రతిమూలలో ఫోటో తీసుకోకుండా ఉండలేక పోయాను. భారత దర్శన్‌లో నేను పొందిన అత్యంత ఖరీదైన వసతి కూడా ఇదే అని చెప్పాలి. నాకు ఈ విలాసవంతమైన అనుభవాన్ని అందించిన సదరన్ ట్రావెల్స్‌కు మరియు నా దాతలకు ధన్యవాదాలు. నేనూ హోటల్లో కాంటినెంటల్ బ్రేక్‌ఫాస్ట్ చేసాను.

ఉదయం 9 గంటలకి మేము అమృత్‌సర్ నుండి 320 కిలోమీటర్ల దూరంలో ఉన్న హర్యానా రాష్ట్రంలోని కురుక్షేత్రానికి చేరుకోవాలని బయలు దేరాము. మేము అందరం రోజుని ప్రార్థనలతోనూ, సత్సంగంతోనూ ప్రారంభించాము. బస్సులో ఉన్న అందరిని ప్రోత్సహిస్తూ, నేను కలిసి మూడు సార్లు సంస్కృత శ్లోకాన్ని చెప్తూ, ఎవరైతే ఆ శ్లోకాన్ని నేర్చుకొని వెంటనే తిరిగి చెప్తే, వారికి 500 రూపాయల బహుమతి ఇస్తానని చెప్పాను.

శ్రీమతి సూర్యకుమారి రావు గారు వెంటనే ముందుకు వచ్చి ఆ శ్లోకాన్ని చెప్పారు. వారికి బహుమతి ఇచ్చేందుకు నా చేతి సంచిని చూస్తే అది అక్కడ లేదు. అందులో నా వాలెట్, ఐడీ కార్డులు, పాస్‌పోర్టు మొదలైనవి ఉన్నాయి. ఒక్క క్షణం నిరుత్తడినయ్యాను. బహుశా అది నేను ఫోటోలు తీసుకునే సమయంలో హోటల్‌లోనే ఎక్కడో వదిలేసి ఉండవచ్చు. ఆ విషయం అందరికీ చెప్పాను. అప్పటికే సుమారు 15 కిలోమీటర్లు ప్రయాణం చేసాము. టూర్ గైడ్ అంశుల్

బస్సుని ఆపి హోటల్‌కు ఫోన్ చేసారు.

మేము హోటల్‌కి తిరిగి వెళ్లి విచారించడానికి నిర్ణయించుకున్నాము. మేము ఒక ఆటో తీసుకుని హోటల్‌కి వెళ్లాము. ఫ్రంట్ ఆఫీస్‌లో ఉన్న మేనేజర్ గారు "బ్యాగ్, క్లీనింగ్ టీంకి దొరికిందని, వారు ఆఫీస్ రూంకి వచ్చి ఇచ్చారని" చెప్పి, బ్యాగ్‌ను నాకు ఇచ్చేశారు. ఇది ఒక ఆహ్లాదకరమైన అనుభవం.

చేతి సంచిని గుర్తించి తెచ్చిన స్వీపర్ జగ్బీర్‌సింగ్ నిజాయితీకి ముగ్ధుడినై ఒక వెయ్యి రూపాయల నగదు బహుమతి ఇచ్చాను. ఇంకా, బస్సులో దేవరాజు దంపతులు ఇచ్చిన వెండి జ్ఞాపికను హోటల్ మేనేజర్‌కి ఇచ్చాను. అక్కడి నుంచి తిరిగి బస్సు దగ్గరికి చేరుకున్నాము. ఈ సంఘటన మొత్తం జరగడానికి 60 నిమిషాల సమయం పట్టింది.

కానీ ఈ సంఘటన వల్ల నేను ఈ క్రింది విషయాలను నేర్చుకున్నాను.

1. ప్రతిక్షణం భగవంతుడు నాతోనే ఉన్నాడు.
2. యాత్రికులు జరిగిన విషయంపై ఆశ్చర్యపోయారు.
3. సామాన్య ప్రజలకు కూడా దయగల హృదయం ఉంటుంది.
4. ఉద్దేశాలు స్వచ్ఛంగా ఉంటే భగవంతుడు తప్పక సహాయం చేస్తాడు.
5. అమర్‌నాథ్ యాత్ర ఆఖరి ఘట్టం ఇలా అద్భుతమైన సంఘటనతో ముగిసింది.

నేను బస్సులో తోటి ప్రయాణికులను చేరుకున్నప్పుడు వారందరూ నేను పోయిన వస్తువులు అన్నీ తిరిగి పొందడం పట్ల చాలా ఆనందపడ్డారు. రాఘవరావు గారు అందరికీ మిఠాయిలు పంచారు. నేను అక్కడ ఏం జరిగిందో అందరికీ క్లుప్తంగా వివరించాను. మా 12 రోజుల తీర్థయాత్రలో టూర్‌గైడ్, కండక్టర్, డ్రైవర్ మాకు సహకరించిన విధానానికి వారు చేసిన మంచికి, వారికీ ఎంతో కొంత డబ్బు ఇవ్వాలని మేము డబ్బులు సేకరించడం మొదలు పెట్టాము. మరో ప్రక్క అమర్‌నాథ్ యాత్ర ప్రారంభమైనప్పటి నుంచి, భారత దర్శన్ గురించి తెలుసుకున్న ఆ బస్సులోని యాత్రికులు అందరూ కలసి నేను ముందుకు సాగడానికై అయ్యే ఖర్చులు నిమిత్తం 10 వేల రూపాయలు విరాళంగా ఇచ్చారు. వారికి కృతజ్ఞతలు తెలియజేయడానికీ నా దగ్గర అసలు మాటలే లేవు. ఆ యాత్రికులు అంతా నాలో ఒక గురువుని చూసి భక్తి శ్రద్ధలతో పాదాలకు

నమస్కరించడం మొదలుపెట్టారు.

నేను ముందుకు సాగడానికి, సహాయ సహకారాలు ఇచ్చిన ఈ క్రింద పేర్కొన్న యాత్రికులు అందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియ జేస్తున్నాను.

1. తాళంకి అనురాధ రత్నమయ్య, ఆంధ్రప్రదేశ్
2. బచ్చలి సుధా శ్రీనివాస రావు, ఆంధ్రప్రదేశ్
3. ఇచ్చుటూరి సూర్యకుమారి జగన్నాథ రావు, ఆంధ్రప్రదేశ్
4. శ్రీమతి & శ్రీ లక్ష్మణ రావు, ఆంధ్రప్రదేశ్
5. కనకయ్య రాజేశ్వరి కృష్ణ ప్రసాద్, కర్ణాటక
6. అంబోలు బేబీ రాఘవరావు, ఆంధ్రప్రదేశ్
7. కుంచాలత లోగనాథన్, కర్ణాటక
8. సర్వ తిలంగవతి, తెలంగాణ
9. మనవి గీతా సత్యనారాయణ, కర్ణాటక
10. జయశ్రీ దేవరాజ్, కర్ణాటక

అమర్‌నాథ్ యాత్ర మరికొన్ని దివ్య అనుభవాలను నాపై కురిపించింది.

# హర్యానా... మొత్తం హరితం

**కురుక్షేత్రం**

దాదాపు సాయంత్రం 4 గంటలకు కురుక్షేత్రము చేరుకున్నాము. ఈ ప్రదేశం ద్వాపర యుగంలో జరిగిన మహాభారత యుద్ధంతో ముడిపడి ఉంది. భగవద్గీత అద్భుత గీతంగా మారి యోధుడైన అర్జునుడి విషాదాన్ని తొలగించి కర్తవ్యముఖునిగా చేసి విజయ తీరాలకు నడిపించిన శ్రీకృష్ణుడు జ్ఞానబోధ చేసిన ప్రదేశం. జగత్ప్రభువు మానవాళిని భగవద్ గీతతో ఆశీర్వదించిన ప్రదేశం ఇది. అప్పటి గీతా సందేశానికి సాక్షిగా నిలిచిన అతి పురాతనమైన మర్రి చెట్టును నేను చూసాను మరియు మహాభారత పురాణం యొక్క అందమైన పాలరాతి విగ్రహాలను కూడా చూసాను.

అక్కడ నుండి, బ్రహ్మ సరోవరాన్ని సందర్శించాము, అక్కడ బ్రహ్మ హవనం చేసాము. భారత యుద్ధం ముగింపులో భీముడు మరియు దుర్యోధనుడు యుద్ధం చేసిన ప్రదేశాన్ని సందర్శించాము.

మరొక ప్రక్క కాస్తా సమయం తీసుకుని తండ్రిని స్మరిస్తూ, బ్రహ్మ సరోవరంలో వారి చితా భస్మాన్ని కలిపి వారి మోక్షం కోసం ప్రార్థించాను.

12 రోజుల తీర్థయాత్ర ముగియనున్న నేపథ్యంలో అందరూ తమ ఆలోచనలు, పరిశీలనలు, ప్రశంసలను, అనుభవాలు, మొ॥ అందరితో పంచుకున్నారు. ప్రతి ఒక్కరూ నా గురించి మరియు వారితో నా సహవాసం గురించి చెప్పుకుంటూ సంతోషపడ్డారు. నా వల్లనే ఈ యాత్ర చాలా చిరస్మరణీయము, ఆధ్యాత్మికం మరియు అంతర్దృష్టితో నిజమైన తీర్థయాత్రగా మారింది అని అనుకున్నారు కూడా. మానవతా విలువలు, జీవిత స్ఫూర్తి, దైవ భక్తి, దేశభక్తి మొదలైన వాటితో నిండిన ఇంత ఆహ్లాదకరమైన ప్రయాణం తమకు ఎప్పుడూ లేదని వారందరూ చెప్పారు, అలా చెబుతూ, ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంగా

వచ్చి నేను భారత దర్శన్‌లో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

చివరగా, మేము సుమారు రాత్రి 10PM గంటలకు న్యూఢిల్లీకి చేరుకున్నాము, భరత దర్శనంలో అమర్‌నాథ్ తీర్థయాత్రకు ముగింపు తీసుకువచ్చి, మరుసటి రోజు కేదార్‌నాథ్ బద్రీనాథ్ యాత్రకు వెళ్లడానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నాము. శ్రీమతి మరియు శ్రీ జగన్నాధరావు గారు దయతో హొటల్‌లో తమతో కలిసి రాత్రికి వారి గదిలోనే బస చేయమన్నారు

# ఢిల్లీ

## జూలై 29, 2019

నాకు ఆశ్రయం ఇచ్చిన కుటుంబీకులు తిరిగి వెళ్ళి పోతున్న సమయంలో నేను కూడా గదిని ఖాళీ చేసాను. కేదార్‌నాథ్‌కు వెళ్లే ప్రయాణం రాత్రి 9 గంటలకు ఉన్నందున నేను 12 PM నుండి ట్రావెల్స్ వాళ్ళ ఆఫీసులో వేచి ఉండాలని నిర్ణయించుకున్నాను.

**సూపర్ 30:**

నాకు సుమారు 9 గంటలు ఏమి చేయాలో తోచలేదు, కీర్తి (నా సోదరి కుమార్తె) నాకు కొత్త ఫోన్ కోసం "స్క్రీన్ గార్డ్" పంపింది. ఆమె నా ప్రయాణ సంబంధ కొనుగోళ్లు చేసేందుకు వీలుగా నేను చుట్టూ తిరగడానికి కారును సిద్ధం చేసింది. హోటల్ దగ్గరనే ఉన్న ఒక లాండ్రీ లో నా డ్రెస్సులు ఇచ్చి, మందులు, సాక్స్, థర్మల్ వేర్ కొని ఫోన్ స్క్రీన్ గార్డ్ ఫిక్స్ చేసి కారుని వెనక్కి పంపించాను. ఇంకా నాలుగు గంటల సమయం ఉంది కాబట్టి నేను సూపర్ 30 సినిమా చూసాను. ప్రతి సంవత్సరం IIT కోసం 30 మంది నిరుపేద విద్యార్థులకు ఉచిత కోచింగ్‌ను అందించే సూపర్ 30 కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ వ్యవస్థాపకుడు ఆనంద్‌కుమార్ గురించిన సినిమా ఇది.

టైమ్స్ మ్యాగజైన్ "ది బెస్ట్ ఆఫ్ ఆసియా 2010" జాబితాలో సూపర్ 30ని చేర్చింది. అప్పటి US అధ్యక్షుడు బరాక్ ఒబామా ప్రత్యేక ప్రతినిధి రషద్ హుస్సేన్ నుండి ప్రశంసలు అందుకుంది, అతను దానిని దేశంలో "ఉత్తమ" సంస్థగా పేర్కొన్నాడు. న్యూస్‌వీక్ మ్యాగజైన్ ప్రపంచంలోని నాలుగు అత్యంత వినూత్న పాఠశాలల జాబితాలో సూపర్ 30ని చేర్చింది. ఆనంద్ కుమార్‌కు నవంబర్ 2010లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ శిక్షా పురస్కారం లభించింది,

ఇది విద్యా రంగంలో బీహార్ రాష్ట్ర ప్రభుత్వం అందించే అత్యున్నత పురస్కారం.

దేశప్రజల కోసం ఏదైనా మంచి చేయాలనుకునే ప్రతి భారతీయునికి ఇది నిజంగా స్ఫూర్తిదాయకం. సూపర్ 30తో సంబంధం ఉన్న వివాదాలను పక్కన పెడితే, నేను సినిమాను పూర్తిగా ఆస్వాదించాను. థియేటర్‌లో ప్రేక్షకులు లేరు, మంచి ఎప్పుడూ చెడ్డదే. కానీ నాకు గుర్తుంది, ఇటీవల ఢిల్లీలో జరిగిన సినీ కళాకారుల సమావేశంలో దేశభక్తి మరియు దేశ విలువలపై పని చేయాలని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ సలహా ఇచ్చారు. సినీ కళాకారులు సలహాలను సీరియస్‌గా తీసుకుని దేశాభివృద్ధికి కృషి చేస్తారని ఆశిస్తున్నాను.

# ఉత్తరాఖండ్

## జూలై 29, 2019

**ఋషికేశ్**

మేము అంతా చేరి తొమ్మిది మంది బృందం (బెంగుళూరు నుండి రెండు కుటుంబాల వాళ్ళు, గుంటూరు నుండి కొడుకుతో తల్లి మరియు నేను). మేము ప్రయాణించే వాహనం ఢిల్లీ నుంచి తెల్లవారుజామున బయలుదేరింది. కన్వర్ యాత్ర 2019 కారణంగా, వాహనం ఋషికేశ్ మార్గంలో చాలా ఎక్కువ మళ్లింపులను తీసుకోవలసి వచ్చింది. బృందంలోని సభ్యులు చాలా దయ మరియు శ్రద్ధగలవారు అని తెలుసుకున్నాను. ప్రార్థనతో రోజు ప్రారంభమైంది.

## కన్వర్ వార్షిక తీర్థయాత్ర

శ్రావణ మాసంలో ఉత్తర భారత రాష్ట్రాల్లో హిందువులు ప్రతి సంవత్సరం చాలా భక్తి శ్రద్ధలతో చేపట్టే యాత్ర కన్వర్ యాత్ర. ఇక్కడ శివభక్తులు హరిద్వార్, గోముఖ్ మరియు ఇతర ప్రదేశాలలో హిమాలయ భూభాగాల నుండి గంగను సేకరిస్తారు. గంగతో కూడిన కుండలను కావడిలా భుజాల మీద వేసుకుని కాలినడకన తమ గ్రామాలకు తీసుకెళ్లి వాళ్ళ గ్రామంలో శివలింగంపై అభిషేకిస్తారు. ప్రతి సంవత్సరం కన్వర్ యాత్రను లక్షలాది మంది భక్తులు చేస్తూ వుంటారు. నా లాంటి వాళ్లకు నడక లేదా ట్రెక్కింగ్ ఒక పీడకల, కానీ ఇక్కడ లక్షలాది మందికి ఇది భక్తితో చేసే అద్భుత కార్యం... పగలు మరియు రాత్రి నడుస్తూ దైవమునకు సమర్పించే అద్భుత విన్యాసం. హరిద్వార్‌లో పెద్ద సంఖ్యలో జనం గుమిగూడడంతో, మేము హరిద్వార్‌ను సందర్శించలేక పోయాము.

మేము ఉదయం 11:30 గంటలకు ఋషికేశ్ చేరుకున్నాము. అత్యంత

పవిత్రమైన గంగా నది శక్తివంతమైన హిమాలయాల నుండి భూమి పైకి అడుగిడే ప్రదేశం ఇది. ఈ ప్రదేశంలో రాముడు తపస్సు చేసాడు అని, ఆయన సపర్యలు చేస్తూ లక్ష్మణుడు రాముడికి తాడు మార్గం (లక్ష్మణ జూలా) నిర్మించాడు అని చెప్తారు. ఈ ప్రదేశం చాలా కాలం నుండి సాధువులు, సన్యాసులు మరియు ఋషులు ఎంచుకున్న ప్రదేశం. స్వామి శివానంద జీవితం - కార్యం మనం పరిశీలిస్తే, స్థలం యొక్క ప్రాముఖ్యతను ఎవరైనా అర్థం చేసుకోవచ్చు. ఋషికేశ్ ఖచ్చితంగా సాధకులు, యోగులు, సన్యాసులు, ఋషులు, సాధువులు మొదలైన వారికి ఒక దివ్య క్షేత్రంగా నేటికీ కూడా అలరారుతోంది.

ఋషికేశ్‌లో గంగాదేవికి నా నమస్కారాలు అర్పించాను. కోట్లాది మంది జీవితాలను పునీతం చేయాలి అని కోరుకుంటున్నట్లుగా గంగామాత చాలా శక్తితో ప్రవహిస్తోంది. నీటి మట్టాలు పెరగడం వల్ల లోయలో అన్ని సాహస క్రీడలు నిషేధించబడ్డాయి. స్వర్గాశ్రమం, గీతాశ్రమం, పరమార్థ నికేతన్, శివానంద ఆశ్రమం మరియు ఇతర ముఖ్యమైన ప్రదేశాలను మేము సందర్శించాము. వేలాది మంది భక్తులు తమ కన్వర్ యాత్ర చేస్తూ ఋషికేశ్ అంతటా కనిపించారు

గంగానది ఒడ్డున ఉన్న చోటివాలా హొటల్‌లో భోజనం చేశాం. కేదార్‌నాథ్ మార్గంలో రాత్రి 8:30 గంటలకు శ్రీనగర్‌కు చేరు కున్నాము, మార్గ మధ్యంలో మేము దేవ ప్రయాగను సందర్శించాము.

దృష్టి ఎట్టిదో సృష్టి అట్టిది అన్న మాట, నేను గట్టిగా నమ్ముతాను. భరత దర్శన్ అంతటా, నేను ఆధ్యాత్మికత మరియు అంతర్దృష్టి లేని ఏ విషయము క్షేత్రం కనుగొనలేదు అంటే అతిశయోక్తి కాదు. ప్రతిదానిలో ఏదో ఒకటి నేర్చుకోవడం ఉంటుంది. ఉదాహరణకు, ఋషికేశ్ అనే పేరు హృషీకేశ్ నుండి ఉద్భవించింది, అంటే ఇంద్రియాలను నియంత్రించే దేవుడు అని అర్థం. భారతీయులు చాలా మంది ప్రతిదీ కూడా దేవుడనే భావనను విశ్వసించరు. కానీ, కోట్లాది మందికి జీవం పోస్తూ నిత్య ప్రవహిస్తున్న గంగను చూస్తే... భారతీయులు నదులను మాతృమూర్తిగా ఎందుకు పూజిస్తారో ఎవరికైనా అర్థమవుతుంది.

## జూలై 30, 2019

ఉత్తరాఖండ్‌లో బయలు దేరిన దగ్గర నుండి నేను ఏ రోజు కూడా సూర్యుడిని చూడలేకపోయాను. కేదార్‌నాథ్ మార్గంలో రాంపూర్ చేరుకోవడానికి సుమారు 100 కిలోమీటర్లు ప్రయాణం చేయాలి. ఘాట్ రోడ్లు, ఘోరమైన వంపులు, కీకారణ్యాలు, వర్షపు వాతావరణం మొదలైన వాటి గుండా ప్రయాణం దుర్భరమైనప్పటికీ, ప్రకృతిపైన మనసు పెట్టి వుండటం వలన అవేవీ నన్ను ఇబ్బంది పెట్టలేదు... నేను అలసిపోనూలేదు. నేను ప్రయాణాన్ని పూర్తిగా ఆస్వాదించాను.

ప్రయాణం మధ్యలో కొండచరియలు విరిగిపడటం, ట్రాఫిక్, టీ మరియు స్నాక్స్ కారణంగా చాలా సార్లు వాహనం ఆగిపోయింది. మా సుదీర్ఘ ప్రయాణంలో ధారీ దేవి, గుప్త కాశీ మరియు త్రియుగి నారాయణ్ ఆలయాలను సందర్శించారు.

### ధారీ దేవి:

దుర్గాదేవి యొక్క అత్యంత శక్తివంతమైన క్షేత్రం ఇది. సుమారు 3000 సంవత్సరాల క్రితం అమ్మవారి పెద్ద శిలా విగ్రహం... చాలా బరువున్న విగ్రహం గంగా ప్రవాహంలో గ్రామానికి చేరుకుంది అని చెప్తారు. గ్రామస్తులు ఆమెను పూజించడం ప్రారంభించారు. ఆవిడే ధారీ దేవి ఉత్తరాఖండ్ రక్షకురాలిగా నమ్ముతారు. అమ్మవారు ఉదయం చిన్నారిగా, మధ్యాహ్నం యువతిగా, సాయంత్రం వృద్ధురాలిగా భక్తులకు దర్శనమిస్తారు అని అక్కడ స్థల పురాణం.

ఆలయం అలకనంద నది ఒడ్డున లోతట్టు ప్రాంతంలో ఉండేదట. కానీ అలకనంద హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కంపెనీ వాళ్ళు, పవర్ ప్రాజెక్ట్ పూర్తి చేస్తే ఆలయము పూర్తిగా నీటిలో మునిగి పోతుంది అని భావించి... అమ్మవారి విగ్రహాన్ని ఎత్తైన ప్లాట్‌ఫామ్‌పైకి మార్చాలని ప్లాన్ చేసి ఆమె ఉన్న ప్రదేశం నుండి తొలగించారు. అది జరిగింది 2013 సంవత్సరంలో. సరిగ్గా అదే సమయంలో కేదార్‌నాథ్ ప్రాంతంలో కని విని ఎరుగని వరదలు ఉత్తరాఖండ్ మొత్తం ప్రాంతములో విధ్వంసం సృష్టించాయి. కారణం ఇదే అంటూ చాలా మంది చెప్తుంటే విన్నాను. ప్రస్తుతం ఎత్తైన ప్లాట్‌ఫామ్ మీద అమ్మ వారికి సరి కొత్త దేవాలయం ఏళ్ల తరబడి సిద్ధంగా ఉన్నా... అమ్మవారిని కదిలించి కొత్త

గుడిలోకి మార్చే ధైర్యం మాత్రం ఎవరికీ లేదు అన్న మాటలు అక్కడ విన్నాను.

నేను నా తండ్రిని స్మరించుకుంటూ... ప్రార్థనలతో ఆయన చితాభస్మాన్ని అలకనందా నదిలో కలిపాను. ఆయనపై అత్యంత గౌరవంతో ఆయన అస్థికలను అన్ని పవిత్ర నదుల్లో, హిమాలయాల్లో కలపడం నా అదృష్టంగా భావించాను.

## గుప్త కాశీ:

ద్వాపర యుగంలో పాండవుల జీవితంలోని చివరి మజిలీ లో ఉన్నప్పుడు వారి దృష్టి మరాల్చడానికి శివుడు తనను తాను దాచుకున్న ప్రదేశం ఇది. భగవంతుడు దాగి ఉన్న ప్రదేశం నుండి గంగా యమునా రెండూ ప్రవహించడం ప్రారంభించాయి. ఈనాటికీ ఆలయం ముందు ఉన్న వృషభ & గజ ముఖముల నుండి నిరంతరాయంగా పవిత్ర జలాలు ప్రవహించడాన్ని మనం చూడవచ్చు.

తరువాత శివుడు ఇక్కడ దాగి ఉన్నాడని తెలుసుకుని పాండవులు ఈ ఆలయాన్ని నిర్మించారు అని చెప్తారు. దానికి విశ్వేశ్వర దేవాలయం అని పేరు పెట్టారు. హిమాలయ భూభాగాలలోని ఈ పర్వతాలలో ఎవరైనా స్వర్గాన్ని అనుభవించగలిగేంత వాతావరణం చాలా ఆహ్లాదకరంగా ఉంటుంది.

కేదార్‌నాథ్ చేరుకోవడానికి హిమాలయాల ట్రెక్కింగ్ ప్రారంభ స్థానం అయిన గౌరీకుండ్ నుండి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న రాంపుర చేరుకున్నారు. పంచవటి హెూటల్‌లో తాజాగా వేడి వేడి తెలుగు భోజనం వండి వడ్డించారు. లేక్ వ్యూ హెూటళ్లు, పిక్చర్ వ్యూ రిసార్ట్‌లు, హిల్ వ్యూ కాటేజీలు మొదలైన వాటి గురించి మనం వింటూనే ఉంటాం. కానీ ప్రియమైన మిత్రులారా... ఇక్కడ ఉత్తరాఖండ్‌లో... పేరు మరియు ప్రదేశంతో సంబంధం లేకుండా మనము ఏ హెూటల్‌లో బస చేసినా... తలుపులూ, కిటికీలూ తెరిస్తే చాలు. స్వర్గం తప్పక కనిపిస్తుంది. లోయల మధ్యలో ఉండడం అంటే ఇదే అనిపిస్తుంది.

## త్రియుగి నారాయణ్: శివుడి వివాహం జరిగిన ప్రదేశం

విష్ణువు, దేవతలు మరియు ఋషుల సమక్షంలో వేల సంవత్సరాల క్రితం పార్వతితో శివుని వివాహాన్ని ఈ క్షేత్రంలో జరిపించారట. హిమాలయాల రాజు మరియు పార్వతి తండ్రి అయిన హిమవంతుడు వారి కుమార్తె పార్వతి దేవి

వివాహానికి ఇక్కడే ఏర్పాట్లు చేసారు. బ్రహ్మ కుండ్, విష్ణు కుండ్ మరియు రుద్ర కుండ్ వచ్చిన అతిథుల స్నానానికి అందుబాటులో ఉంచబడ్డాయి. ఈ రోజు కూడా ఆలయంలో స్వచ్ఛమైన నీటి బుగ్గలను చూడవచ్చు. 3 యుగాల క్రితం వివాహ సమయంలో వెలిగించిన అగ్ని ఇప్పుడు కూడా వెలుగుతూ... ప్రత్యక్షంగా కనిపిస్తుంది. మొత్తానికి కమనీయమైన దేవతా కళ్యాణం ఎలా జరిగిందనే ఫీల్ కలుగుతుంది భక్తులకు.

10 దిక్కులలో ప్రకృతిని చూసి మైమరచి పోయాను... ప్రకృతిని తప్ప మనము చుట్టూ మరేమీ కనుగొనలేమనే చెప్పాలి... స్వచ్ఛమైన గాలి, పచ్చని కొండలు, జల జల దుమికే జల పాతాలు, హిమపాతం, సజీవ నదులు, పూలు, బురద, అడవులు, ఆకాశం, మేఘాలు, పర్వతాలు, పక్షులు, జంతువులు... ఏది కాదు? ప్రకృతి మొత్తాన్ని కూడా ఉత్తమంగా కనుగొనవచ్చు. కేదారనాథ్ మార్గంలో ప్రకృతి ఖచ్చితంగా దైవ సమానమే అని చెప్పాలి. ప్రకృతి ప్రేమికులకు ఇదో స్వర్గం

బస్సు ప్రయాణాన్ని... ఆ రోజుని... అందరం... ఆస్వాదిస్తు సాయంత్రం ఏడు గంటలకి అంతా రాంపూర్లోని పంచవటిని చేరుకున్నాము. మరుసటి రోజు ఉదయం నాలుగు గంటలకి కేదారనాథ్ ప్రయాణానికి సిద్ధమవుతున్నాము. ఇంతకు ముందు యాత్ర చేసినప్పుడు చాలా అలసటతో కూడిన ప్రయాణమైంది. అయినా నేనూ కాలినడకనే వెళ్లాలనుకున్నాను. కాని వైష్ణోదేవి దగ్గర కాలు బెణకటం వల్ల వైద్యులు నన్ను గుర్రం మీద వెళ్ళమని సలహా ఇచ్చారు. ఇంక కాలినడకన కైలాసపర్వత పరిక్రమణను దృష్టిలో ఉంచుకొని నేను కూడా కేదార్‌నాథ్ దర్శన కోసం సుమారు 17 కిలోమీటర్ల పర్వతారోహణాన్ని గుర్రం మీద వెళ్ళడానికి నిర్ణయించుకున్నాను.

మరో ప్రక్క బృందంలో ఉన్న మిగతా యాత్రికులు అందరూ ఏ విధంగా వెళ్ళితే బాగుంటుందా అన్న చర్చలలో మునిగిపోయారు. కానీ నా హృదయం దివ్యానందంతో నిండిపోయి మనసుకి మంచి తప్పు ఏది కనిపించలేదు.

## ఆగస్ట్ 1, 2019
**కేదారనాథ్:**

ప్రయాణానికి ముందు రోజు రాత్రి అసలు నిద్రపోలేక పోయాను. నా హృదయం కేదారనాథ్ గురించిన ఆలోచనలతో నిండిపోయింది మరి. అయినా కూడా ప్రభాత సమయంలో నాలుగు గంటలకు లేచి గౌరీ కుండ్ ప్రయాణానికి సిద్ధమయ్యాను. మహేష్ వాళ్ల అమ్మగారు ఆరోగ్యం బాగా లేదు. కడుపు నొప్పితో బాధపడుతూ రాత్రి వాంతికి చేసారు. నేనూ నా దగ్గర ఉన్న మెడికల్ కిట్ వాడాలని, డాక్టర్ సాయిలత సలహా తీసుకోమని చెప్పాను. ఇక మిగిలిన ఎనిమిది మంది సభ్యులతో కూడిన బృందంతో కేదారనాథ్ బేస్ క్యాంప్ గౌరీకుండ్‌కి చేరుకున్నాము. నేను తప్ప మిగతా బృందం అంతా పర్వతారోహణ కాలినడకన చేయాలని అనుకున్నారు. కానీ చీలమండ నొప్పి వలన మరియు వైద్యుల సలహా మేరకు 17 కిలోమీటర్ల ఆ ప్రయాణం నేను గుర్రం మీదనే చేయాలని నిర్ణయించుకున్నాను. ఇక ఆ ప్రయాణంలో... యాత్రికులను తమ మీద భరిస్తూ, ఆ దుర్భర మార్గాలలో గుర్రాలు పడుతున్న అవస్థని చూసి, సుధానాగరాజు వాళ్ళ అమ్మాయి అపూర్వ ఏడవడం ప్రారంభించింది. సాటి ప్రాణి కష్టాన్ని చూసి మనిషి స్పందించడం అన్నది అద్భుతం.

ఇది ఆధ్యాత్మికతలో అత్యున్నతమైన విషయం అని చెప్పాలి. ఈ అమ్మాయిని నేను బృందములో చూసినప్పుడు, బాబాగారి మాటలు గుర్తు తెచ్చుకున్నాను. స్వామి ఎప్పుడూ అంటూ ఉండేవారు, ఎవరైనా కష్టంలో ఉన్నప్పుడు ఆ కష్టం మనం అనుభవించాలి. నేను ఆ అమ్మాయి కోసం ప్రార్థించాను. ఈ అమ్మాయి తప్పకుండా ఒక అత్యుత్తమమైన వ్యక్తిగా అవుతుంది. ఇక ఆ అమ్మాయి చేస్తున్న అహింసావాదానికి ఊతం ఇస్తూ... అమ్మాయి కుటుంబ సభ్యుల అందరూ కలిసి మెలసి కాలినడకనే పర్వతారోహణ చేయాలని సంకల్పించారు. ఇది మరో అద్భుతం. కానీ ముందు జాగ్రత్తగా వాళ్లు నాలుగు గుర్రాలను కూడా ఏర్పాటు చేసుకున్నాను.

నా ఉద్దేశ్యం కేదార్‌నాథ్ ఆలయ దర్శనం గుర్రం మీద వెళ్ళి దర్శనం కాగానే రావాలని. కానీ ఆ నాలుగు గుర్రాలు, కలిసే నడుస్తున్నాయి. ఇంకో విషయం, ఏమిటంటే ఆ నాలుగు గుర్రాలు ఒక్కదానిని ఒకటి విడిచి ఉండడానికి

సిద్ధంగా లేవు. మేమన్నా కాస్తా అటు ఇటు నడుస్తున్నాం కానీ, అవి మాత్రం విడిపోవడానికి సిద్ధంగా లేవు. ఇది నాకు మరో గొప్ప పాఠాన్ని నేర్పింది. బృందం అంటే ఎలా పని చేయాలో అన్నది నేను హైదరాబాద్ సాయి యూత్ తోటి సేవలు చేస్తున్నప్పుడు గమనించాను. హైదరాబాద్ సాయి యువత బృందంలోనే నేను ఒక సభ్యునిగా ఉండే అదృష్టం నాకు కలిగింది. మేమెప్పుడూ కలసికట్టుగా పని చేసేవాళ్లం. అందుకే బాబా ప్రేమకు పాత్రులు అయ్యాము. బాబా మమ్మల్ని హైదరాబాద్ బాయ్స్ అని ముద్దుగా పిలిచేవారు.

కాలినడకన ప్రయాణం కష్టమే. కానీ గుర్రంమీద పర్వతారోహణ చేయడం అనేది ఇంకా దుర్భరమైన ప్రయాణం అని అర్థం అయ్యింది. పది నిమిషాలూ కూడా గడవక ముందే ఆ గుర్రం మీద ఉండే కఠినమైన జీనుపై కూర్చోవడం వల్ల భరించరాని నొప్పి మొదలైంది. మరొక మార్గం లేకపోవడంతో అలాగే కొనసాగించవలసివచ్చింది. అలాగా మరొక ఆరు గంటలు ఆ నొప్పితో ప్రయాణించవలసివచ్చింది. చుట్టూతా కళ్ళకు విందు చేసే ప్రకృతి అందాలను చూడగలగడం గొప్ప ఉపశమనం.

పర్వతాలన్నీ కూడా పరమశివుని జటాజూటంలా, ఇక ఉప్పొంగుతు పైనుండి క్రిందికి జారే జలపాతాలు శివుని తలపై నుండి దుమికే గంగ లాగా అనిపించాయి. నేనక్కడ ఏ పర్వత శిఖర భాగాన్ని చూడలేకపోయాను, ఎందుకంటే ఆ పర్వతాల పైభాగాలన్నీ దట్టమైన పొగమంచుతో కప్పబడి ఉండటం వలన. ఇక మార్గ మధ్యంలో మేఘావృతమైన ఆకాశం నుంచి వర్షం పడటం ప్రయాణాన్ని మరింత ఆనందభరితంగా చేసింది. గుర్రాల నుండి యాత్రికులు దిగాల్సిన ప్రదేశము నుంచీ ఆలయానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఉంది. ఆ కాస్తా దూరం కూడా కాలి నెప్పి వలన చాలా భారంగా నడిచాను కానీ ప్రకృతి సోయగాలను చూస్తూ నా బాధను దిగమింగుకున్నాను.

ఇక అల్లంత దూరంలో మందిరం కనిపిస్తోంది... మందాకినీ జలధారలు కేదారనాథుని ఆలయానికి మూడు దిక్కుల నుండి అత్యంత వేగంగా వచ్చి నేను నిల్చున్న ప్రదేశంలో సంగమిస్తూ క్రిందకు ప్రవహించడం చూసిన క్షణాలు నా హృదయాన్ని దివ్యప్రకంపనలతో నింపివేసాయి.

మా నాన్నగారిని స్మరించుకుంటూ మెల్లగా ఆ దివ్య నదీ సంగమాన్ని

చేరుకుని ఆయన చితాభస్మాన్ని ఆ పవిత్ర ప్రవాహంలో కలిపాను.

అనంతరం కేదారనాథేశ్వరుని ఆలయాన్ని చేరుకున్నాను. ఇక్కడ ఆలయ సముదాయం చుట్టూ జరిగిన అభివృద్ధి హర్షదాయకము. మునుపటికీ ఇప్పటికీ ఆలయ సముదాయ ప్రాంగణంలో హస్తిమశకాంతరభేదం ఉన్నది. భారత ప్రధాని శ్రీ మోడీ గారికి ధన్యవాదాలు. నేను ఇక్కడికి మూడో సారి వస్తున్నాను. ఇక్కడ జరిగిన అభివృద్ధికి ప్రభుత్వాన్ని ప్రశంసించకుండా ఉండలేకపోతున్నాను. ఎడతెరిపి లేని వర్షాల కారణంగా హెలికాప్టర్ సేవలు రద్దు చేయబడ్డాయి. ఆలయం వద్ద రద్దీలేదు, పొడవైన క్యూలు, వేచి ఉండటాలు లేనే లేవు.

నేను గర్భగుడి లోనికి పరిగెట్టి వెళ్లాను. దూడ తన తల్లి వద్దకు పరుగెత్తినట్లు ఉంది. నేను ఆ లింగాన్ని ముట్టుకొని బిగ్గరగా మృత్యుంజయ మంత్రం జపిస్తూ ఆ శివలింగం మీద నా శిరస్సుని ఉంచాను. అలా ఎంత సమయం గడిచి పోయిందో నాకు తెలియదు. ఇది అంతా నేను చాలా భక్తితో, ప్రేమతో, ఆర్ద్రతతో చేసాను. నా పారవశ్యం చూసి అక్కడే కూర్చుని ఉన్న పూజారి నా భుజం తట్టి, నాచేయి పట్టుకుని బయటకు తీసుకుని వచ్చి, చలికివణికి పోతున్న నాకు వేడి కాఫీ ఇచ్చారు. నా భారత దేశ యాత్ర గురించి తెలుసుకొని నాకూ శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ సముదాయం నుంచి బయటకు వస్తూ ఉంటే నా కన్నుల నుండి ఆనంద భాష్పాలు రాలుతున్నాయి... చాలా ఉద్వేగానికి గురయ్యాను. నాకు మళ్లీ 3వ సారి ఇక్కడికి వచ్చే భాగ్యం కలిగినందుకు.

నేను మళ్లీ ఇక్కడికెప్పుడు వస్తానో నాకు తెలియదు. నేను దర్శనం పూర్తి చేసుకునే సరికి మధ్యాహ్నం 3:00 గంటలు అయ్యింది. ఆలయం కూడా మూసివేశారు. కేదారనాథ్ నుంచి తిరిగి వస్తూ ఉన్నప్పుడు నాకు అక్కడ ఫ్రీ వైఫై దొరికింది. ఇక అక్కడే కూర్చుని తాజా అనుభవాలన్నీ రాసుకున్నాను. రాంపూర్లోని పంచవటికి చేరుకునేటప్పటికీ రాత్రి 8:30 గంటలు అయ్యాయి. అప్పటికి ఒళ్ళంతా నెప్పులతో, జ్వరంతో, విరోచనాలతో ఉన్నాను. నేను కాస్తా ఆహారం తీసుకోని, మందులు వేసుకున్నాను. ఇక ఆ రోజుకు అలసిపోయి విశ్రమించాను.

## ఆగస్ట్ 4, 2019

**బద్రీనాథ్:**

బద్రీ కేదార్ యాత్ర, ఈసారి వర్షాలు, మంచు పతనం, కొండ చరియలు విరిగి పడటం, ట్రాఫిక్ జామ్‌లు మొదలైన కారణాల వల్ల చాలా క్లిష్టమైనదిగా మారిపోయింది. ఎక్కువ సమయం మేమంతా దిక్కు మొక్కు లేకుండా... స్నానం పానం లేకుండా రోడ్డు మీదనే వుండాల్సి వచ్చింది. అంతలా ఆ కొండల్లో రోజుల తరబడి చిక్కుకు పోవడం నేను ఎన్నడూ ఎరుగను. ప్రాంతంతో సంబంధం లేకుండా మొత్తం హిమాలయ శ్రేణుల పరిస్థితి అదే. సుమారు 3 రోజులు (24 ఆగస్టు, 2019) లో మేము కేదార్‌నాథ్ మరియు బద్రీనాథ్ మధ్య దూరాన్ని అధిగమించగలిగాము.

బద్రీనాథ్ మార్గంలో... మేము జ్యోతిర్మఠ్ (జోషి మఠం), నర్సింహ మందిరం, విష్ణు ప్రయాగ్, పాండుకేశ్వర్ మరియు ఇతర ముఖ్యమైన ప్రదేశాలను సందర్శించాము. మా మార్గదర్శి కాస్త వైవిధ్యంగా ఆలోచించి పిప్పిల్‌కోట నుండి చోప్తా రోడ్ ద్వారా మమ్మల్ని తీసుకువెళ్లడానికి ప్రయత్నం చేయడం నచ్చింది. ఇక ఆ మార్గములో బస్సులో ప్రయాణం చేస్తున్న మేమంతా అలా అందమైన ప్రకృతితో బంధించబడి పోయాము... స్వచ్ఛత దివ్యత ఆ పర్వతాల శిఖరాగ్రంలో ఉంది అనిపించింది. మైమరచి పోయాము అంటే నమ్మాలి. అప్పటి దాకా వున్న ప్రయాణ బడలిక, నిస్పృహ ఎవరో తీసేసినట్లుగా మటు మాయం అయిపోయాయి. సాధారణ మార్గంలో కాకుండా భిన్నం మైన దిక్కులో ప్రయాణించడం వలన దారి పొడవునా ఎలాంటి కాలుష్యం లేదు. దారిలో ప్రతి అంగుళం కొండల మీద నుండి జాలు వేరే సెలయేళ్ళు, అంతటా అలుముకున్న పచ్చదనం, దట్టమైన పొగమంచు, హిమపాతం, విస్తారమైన అడవులు ఇలా ఇవన్నీ మమ్మల్ని మంత్ర ముగ్ధులను చేసేసాయి. పర్వత శిఖరాగ్రం వద్ద మేమంతా కాసేపు ఆగి కొన్ని అందమైన క్షణాలను మా కెమెరాల్లో బంధించాం. ఈ మార్గంలో స్నేహితులు మరియు కుటుంబాలతో విశ్రాంతిగా ఉండేందుకు చాలా అందమైన ప్రదేశాలు ఉన్నాయి. మనం జీవితంలో ఒక్కసారైనా ఈ ప్రదేశాలను తప్పక సందర్శించాలి అనిపించింది. అప్పుడు భగవంతుని సృష్టిని మనం తప్పకుండా అభినందిస్తాము అంతే కాదు ప్రకృతి

విశ్వరూపాన్ని చూడగలము కూడా.

జగద్గురు ఆది శంకరాచార్యులు ఈ ప్రాంతంలోనే ఉండి తపస్సు చేసారు అని విన్నాను. వారు తరువాత కాలంలో జ్యోతిర్ మఠాన్ని స్థాపించారు. భారతదేశంలోని 4 దిక్కులలో వారు స్థాపించిన 4 ఆమ్నాయ పీఠములలో ఇది ఒకటి. తరువాత కాలంలో దీనిని జోషి మఠం అని పిలవడం మొదలు పెట్టారు.

బద్రీనారాయణ స్వామి వారిని, ఈ ప్రాంతాన్ని పూర్తిగా మంచు కప్పబడినపుడు ఇక్కడ ఉన్న నర్సింగ్ మందిర్, జోషి మఠానికి తరలిస్తారు.

తండ్రికి ప్రార్థనలతో, నేను బద్రీనాథ్ మార్గంలో విష్ణు ప్రయాగ, అలకనంద మరియు సరస్వతి నదులలోని పవిత్ర సంగమాలలో వారి అస్థికలను కలిపాను.

కేదారనాథ్ మరియు బద్రీనాథ్ సమీపంలోని రాంపూర్ మధ్య దూరం దాదాపు 300 కిలోమీటర్లు ఉన్నప్పటికీ... బద్రీనాథ్ చేరుకోవడానికి 30 గంటల కంటే ఎక్కువ సమయం పట్టింది. ట్రాఫిక్, శిథిలాలు, కొండచరియలు విరిగిపడటం, నీటి ప్రవాహములను మొదలగునవి నియంత్రించి యాత్రికులకు ప్రయాణాన్ని సాఫీగా చేయడంలో 24×7 పని చేస్తున్న ఉత్తరాఖండ్ పోలీసులు, భారత ఆర్మీ మరియు రెస్క్యూ టీమ్‌లను మనం అభినందించాలి.

దారిలో చాలా అడ్డంకులు రావడంతో ట్రావెలింగ్ షెడ్యూల్ డిస్టర్బ్ అవడంతో.. పగటిపూట ఆహారం తీసుకోలేకపోయాము. స్నానం చేయడం లేదు.. కానీ ప్రయాణాన్ని పూర్తిగా ఆస్వాదించాను. నాతో పాటు ప్రయాణిస్తున్న టీమ్ కూడా ట్రిప్‌ని ఎంజాయ్ చేసింది. వాహనంలో పాటలు, భజనలు, సత్సంగాలతో దివ్యంగా గడిపాం.

శ్రీ నాగరాజు, సుధా నాగరాజు, అనంత్, సుమ అనంత్, అనఘా, అపూర్వ, మహేష్ & మహేష్ తల్లి రూపంలో భరత దర్శన సమయంలో నా జీవితములో మరి కొన్ని కుటుంబాలు కలవడం నిజంగా నా అదృష్టం భావించాను. జట్టులోని ప్రతి ఒక్కరూ దేవుడు మరియు దైవిక విషయాలపై దృష్టి సారించారు. భజనలు పాడుతున్నప్పుడు, నాగరాజు గారి కుటుంబం బాబాతో పరిచయం వున్నదని నేను గుర్తించాను.

శ్రీ నాగరాజు శ్రీ సత్యసాయి యూనివర్శిటీకి చెందిన పూర్వ విద్యార్థి (1976) స్వామి, నాగరాజు మరియు అతని ముగ్గురు స్నేహితులను బృందావన్‌లో

Small Boys అని పిలుచుకునే వారట. హాస్టల్‌లో భోజన సమయంలో బ్రహ్మార్పణం భోజన మంత్రం జపించే మొదటి వ్యక్తి నాగరాజు కాబట్టి స్వామి అతన్ని బ్రహ్మార్పణం అని పిలిచేవారట. గత 5 దశాబ్దాలలో స్వామితో ఆయనకు మరియు అతని కుటుంబానికి అనేక అనుభవాలు ఉన్నాయి.

శ్రీ సుధా నాగరాజు దంపతుల చిన్న కుమార్తె, అపూర్వ ఒక అద్భుతమైన అమ్మాయి మరియు మధురమైన గాయని కూడా. బస్సులో ఆమె కనకదాస కృతి పాడటం వినగానే... కన్నడ కృతిలోని సారాంశాన్ని అర్థం చేసుకుని భావోద్వేగానికి గురయ్యాను. ఆ కృతులలో సారాంశం నా ప్రస్తుత మానసిక స్థితికి చక్కగా సరిపోతాయి... నా కోసం ఆ పాటను మరొక్క సారి పాడమని నేను ఆమెను అభ్యర్థించాను, అమ్మాయి పాడుతుంటే నేను ఫోన్ కెమెరాలో వీడియో తీసుకున్నాను, తద్వారా నేను మళ్లీ మళ్లీ వినవచ్చు అనిపించింది. నన్ను నేను శుద్ధి చేసుకుని నా జీవితాన్ని సార్థకం చేసుకునేందుకు ఆ పాట ఒక సాధనం అవుతుంది అనుకున్నాను.

బద్రీనాథ్‌కీ చేరుకున్న వెంటనే అక్కడి ఉష్ణోగ్రతలలో తగ్గుదల ఉన్నప్పటికీ మేమందరం భారతదేశ సరిహద్దుల్లో ఉన్న చివరి గ్రామమైన 'మానా గ్రామాని'కి బయలుదేరి వెళ్ళాము. అలాగే వ్యాస మహర్షి గుహ, గణేశ గుహ, సరస్వతి నదిని కూడా చూసాము. అక్కడ ఉన్న ప్రతి ఒక్క ప్రదేశం కూడా ఏదో ఒక పౌరాణిక సంఘటనను, ఒక అద్భుతమైన సందేశాన్ని మనందరికీ అందిస్తాయి.

ఇక మరో విషయమేంటంటే, నేను నా భారతయాత్రలో దేనిని కూడా చేజార్చుకోలేదు. నా అనుభవాలు అన్నింటిని మరచిపోకుండా కలకాలం గుర్తించుకునేలా ఏ రోజు కారోజు చక్కగా వ్రాసుకుంటూ నా పరిశీలనలను రికార్డ్ చేయడం మాత్రమే కాకుండా ఆయా ప్రదేశాల్లో ఉన్న ప్రజలతో మరియు తోటీ యాత్రికులతో కలసి మెలిసి సంభాషించడం కొనసాగిస్తూ అలా తెలుసుకున్న విషయాలను, విశేషాలను కూడా వ్రాసుకున్నాను. కారణం ఏమిటంటే తర్వాత రాబోయే తరాల వాళ్లు ఈ ప్రదేశాలను తెలుసుకోవడానికీ ఈ అనుభవాలు మూలాలుగా ఉపయోగపడతాయి అన్న ఆలోచన.

ఆ తర్వాత సాయంత్రం మేము బద్రీనాథ్ క్షేత్రానికి తిరిగి చేరుకున్నాము. నా తోటివారు అందరూ ఇక ఆ రోజుకి అలసిపోయి తమ గదులకి వెళ్లి విశ్రాంతి

తీసుకోవాలన్న ఆలోచనతో వెళ్తే, బద్రీకి చేరుకున్న వెంటనే నేను అసలు రేపు బ్రతికే ఉంటానో లేక పోతానో అన్నట్టుగా ఆలయంలోకి పరిగెత్తి పోయాను. నాలోని అహంకారాన్ని, జీవితంపట్ల ఉన్న బంధములను, బంధనములను అన్నింటిని తెంచివేస్తున్నట్టుగా ఆయన ఆశీస్సుల కోసం ఆయన పాదాల దగ్గర నా తలను వాల్చాలనుకున్నాను.

ఒక పక్కన అలకనంద చల్లటి ప్రవాహం, దాని పక్కనే ఉన్న వేడి నీటి బుగ్గలు అక్కడికి వచ్చిన ప్రతి యాత్రికుడిని సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తాయి. అక్కడ నీళ్లు చాలా వేడిగా ఉన్నాయి. కాని ఎలాగోలా నేను స్నానం చేసుకుని సేద తీరాను. ఇంతలో ఇక ఆ రోజుకి గుడి మూసివేస్తున్నందుకు గుర్తుగా గుడి గంటలు మొగాయి. అక్కడే ఉన్న స్థానికులు ఆ విషయం చెప్పారు.

వెంటనే నేను తడి దుస్తులు అక్కడే ఒక మూల కవర్లో పెట్టేసి, పొడి దుస్తులు మార్చుకుని ఆలయానికి పరిగెత్తి వెళ్ళిపోయాను. ఆ రాత్రి సమయంలో బద్రినారాయణ, ఆయన అనుయాయుల నిజరూప దర్శనం కలగడం అన్నది అత్యంత ఆశ్చర్యానికి గురిచేసింది. ఆ దైవానుగ్రహాన్ని వర్ణించడానికీ నా దగ్గర భాష లేదు. వర్ణనాతీతమైన అనుభూతి అది. చాలా దివ్యంగా అనిపించింది.

ఇక ఆలయం నుంచి బయటకు వచ్చినప్పుడు, తోటి యాత్రికులతో కలిసాను. వారంతా కూడా గదిలో కాస్తా విశ్రమించి ఫోటోలు తీసుకోవడానికి వచ్చారన్న మాట. మేమందరం బద్రీనాథ్ ఆలయాన్ని నేపథ్యంగా, సంతోషంగా ఫోటోలు తీసుకున్నాము. ఆ తరువాత హొటల్‌కు చేరుకొని, రేపు మళ్లీ మాకు దర్శనం ఉంటుందనే ఆశతోటి నిద్రపోయాము.

తిరిగి ఉదయం 6 గంటలకి ఆలయ సముదాయానికి తయారై వెళ్ళాను. మిగతా సభ్యులు అందరూ వాళ్ల నమ్మకాలు, ఆచారాల ప్రకారం శ్రాద్ధకర్మలను నిర్వహించడానికి బ్రహ్మకపాలానికి వెళ్ళారు. అంటే శివుడు బ్రహ్మహత్యా పాతకం చేత ఈ ప్రదేశంలోనే దోష నివారణ చేసుకున్నాడని నమ్ముతారు. నేనూ మొదట త్వరగా దర్శనం చేసుకుని వచ్చేద్దామనుకున్నాను.

కానీ అక్కడ ఆలయాన్ని చేరుకున్న తర్వాత మూడు గంటల అభిషేక దర్శన పూజ జరుగుతోంది. ముందురోజు రాత్రి నేను హిందూపూర్ పురోహితునితో మాట్లాడుతున్నప్పుడు ఆయన ఏం చెప్పారంటే, ఒక ఖరీదైన

సేవ ఉంటుంది ఉదయాన్నే. అదీ సుమారు 4,500 రూపాయలతో కూడి ఉంటుంది. నువ్వు అసలు దాన్ని వదులుకోవద్దు అని ఆయన చెప్పారు. కానీ భారత దర్శనంలో ప్రతి ఒక్క పైసా లెక్క చూసుకుంటున్నందువల్ల, నేను అలాంటి ఖరీదైన ఆలోచనలను మనసులో నుంచీ తుడిచివేశాను.

ఆశ్చర్యంగా అక్కడ ఉన్న ఆలయ సిబ్బంది నా వస్త్రధారణ చూసి... చాలా వినయంగా నన్ను స్వాగతించి అంతరాలయంలో మూలమూర్తులకు జరుగుతున్న అభిషేక దర్శనానికి నన్ను లోపలికి పంపారు. ఇదంతా రూసుము ఏదికూడా కట్టకుండా... ఎలాంటి చీటీ తీసుకోకుండానే జరిగినదంటే నాకు నమ్మశక్యంగా లేదు. నేను ఆ బద్రీనాథుడుని ఇచ్చిన భాగ్యానికి, అనుగ్రహానికి వారి దివ్యపాద సన్నిధిలో కృతజ్ఞతలు తెలుపుకుంటూ... శరణాగతి వ్యక్తం చేస్తూ... ఆ గర్భగుడిలోకి ప్రవేశించాను. ఇక అక్కడ స్వామివారికి జరుగుతున్న శాస్త్రోక్తంగా నిర్వహించే ఆచారాలన్నింటిని గమనించాను. ఆ తర్వాత అభిషేక ప్రసాదాన్ని తీసుకొని, దానితో పాటుగా అత్యంత అద్భుతమైన దివ్య అనుగ్రహ ఆశీస్సులనూ హృదయంలో నింపుకుని హెూటల్‌కు చేరుకున్నాను.

ఇక క్షేత్రమేదైనా... అక్కడి దేవుడు ఎవరైనా నా గురించి నేను ప్రార్థించింది ఎప్పుడూ లేదు... ఈ విశ్వములో ఉన్న ప్రతి ప్రాణి కోసం అత్యంత శ్రద్ధతో ప్రార్థించాను. కారణం నాకంటూ ఏ కోరికలు లేకపోవడమే... చచ్చేదాకా సమయాన్ని పూర్తిగా పరుల సేవలో గడపాలన్న ప్రబలమైన ఆశయంతో ఇక నా కోసం ఏదైనా కోరాలన్న ఆలోచనే ఎక్కడా రాలేదు. ఇక దైవదర్శనం తరవాత మళ్లీ అందరం మా యాత్ర ప్రారంభించాము.

## ఆగస్ట్ 5, 2019
## హరిద్వార్, మానసాదేవి

ఈ ప్రాంతం అంతటా అనేక కొండచరియలు విరిగిపడటంతో, ప్రయాణం మరో రోజు ఆలస్యమైంది, అందుకే రాత్రికి ఢిల్లీకి తిరిగి వెళ్లకుండా, హరిద్వార్‌లో ప్రయాణాన్ని ముగించాలని నిర్ణయించుకున్నాము, 12AMకి శివగంగా హెూటల్‌కు చేరుకున్నాము.

మరుసటి రోజు ఉదయం 8 గంటలకు అందరం అల్పాహారం తీసుకున్న

తర్వాత, హరిద్వార్ క్షేత్రానికి వెళ్లాము. అక్కడ హరికి పౌరి వద్ద గంగ చేరుకునే ప్రదేశం. గంగానది పర్వతాలను విడిచిపెట్టి, దాని అత్యంత అద్భుతమైన రూపం మరియు ప్రవాహంతో మైదానాల్లోకి ప్రవేశించే ఖచ్చితమైన ప్రదేశం ఇది అని నమ్ముతారు. హరికి పౌరిలో ప్రతిరోజూ వేలాది మంది యాత్రికులు పవిత్ర స్నానం చేస్తూ వుంటారు.

తండ్రి ఆత్మ విష్ణు లోకానికి చేరాలని ప్రార్థనలతో, గంగామాత ఒడిలో తండ్రి చితాభస్మాన్ని నిమజ్జనం చేసాను. అందరూ కూడా గంగానదిలో పవిత్ర స్నానం చేసి పూజలు చేసారు. ఢిల్లీ చేరుకోవడానికి మిగిలిపోయిన కొద్ది సమయాన్ని పరిగణనలోకి తీసుకుని, బిల్వకొండలు మరియు నీలకొండలపై ఉన్న మానసాదేవి మరియు చండీదేవిని దర్శించుకోవడానికి మేమంతా త్వరగా కదిలాము. సమయ భావాన్ని దృష్టిలో ఉంచుకొని, రెండు ఆలయాలకు రోప్‌వేలో వెళ్ళాము.

మానసాదేవి శివుని మనస్సు నుండి పుట్టిందని మరియు ఆమెను శివుని కుమార్తెగా నమ్ముతారు. ఆమె ఉత్తరాఖండ్ రక్షకురాలు, మానసాదేవి ఆలయం ఒక సిద్ధపీఠం. క్షేత్రంలో కొలువైన అమ్మ భక్తుల కోరికలను తీర్చుతుందని అంటారు. హరిద్వార్‌లో ఉన్న అటువంటి మూడు పీఠాలలో ఇది ఒకటి, మిగిలిన రెండు చండీదేవి ఆలయం మరియు మాయాదేవి ఆలయం. లోపల గుడిలో ఇద్దరు దేవతలు ఉంటారు చుట్టూ గుంపు ఉండటం వలన సుధానాగరాజు తన మనీ పర్సు మరియు లక్ష్మీ బహుమతులను కూడా పోగొట్టుకున్నారు. ఈ సంఘటన వలన ఆమె కొంచెం కలత చెంది కనిపించింది.

తరువాత, దుర్గాదేవి అయిన చండీదేవిని సందర్శించాము. శుంభుని శుంభ మరియు చండముండాసురులను చంపిన తర్వాత అమ్మవారు కొంత కాలం అక్కడ విశ్రాంతి తీసుకున్నారు. కొండపై ఉన్న స్థంభంలో ఆమె స్వయంభువుగా వెలిసిందని స్థానికులు నమ్ముతారు. ఈ కారణంగా ఈ ప్రదేశం పవిత్రమైనది. ఆ తల్లి రాక్షస సంహారం చేసింది.

తరువాత, శ్రీ ఆది శంకరాచార్యుల వారు ఈ ప్రదేశాన్ని సందర్శించి ఆమెను శాంత రూపిణిగా ఉండమని కోరుకున్నారట. దేవిని చూసి... కాసేపు ఆది శంకరుని గురించి, ఆయన అత్యంత శక్తివంతమైన జీవితం గురించి

ఆలోచించాను. బృందం వస్తుందని ఎదురుచూస్తూ పద్మాసనంలో, కళ్ళు మూసుకుని గుడిలో ఒక మూల ఒదిగి కూర్చుని గాయత్రీ మంత్రం పఠించడం మొదలుపెట్టాను. కళ్ళు తెరిచి చూసేసరికి అక్కడ గర్భగుడి లోని పూజారి నన్ను పిలవడం చూసాను. అతని హావభావాలకి ఆశ్చర్యపడి, అతను నన్ను మరోసారి అమ్మ వారి దర్శనం చేసుకోమని పిలుస్తున్నాడని అర్థం చేసుకున్నాను. చాలా ఆశ్చర్యానికి గురి అయ్యాను. ఆ పూజారి నన్ను గర్భగుడిలోకి తీసుకెళ్లాడు. నా ఆత్మానుభవాన్ని వ్యక్తీకరించడానికి నా దగ్గర మాటలు లేవు. నేను చండీ దేవి పాదాలపై పడి అందరి కోసం బిగ్గరగా ప్రార్థించాను.

నేనా చండీదేవి కాళ్ళ మీద పడి దేశసౌభాగ్యం, సౌశీల్యం, సాధికారత కోసం ఆశీర్వాదం కోసం ఏడుస్తూ వేడుకున్నాను. పూజారి నన్ను పువ్వులు సమర్పించమని చెప్పి, అమ్మవారి పాదాల ముందు ఉంచిన ప్రసాదం ఇచ్చాడు. పూజారి చేసిన ఈ చర్యతోనే నేను మంత్రముగ్ధుడయ్యాను. వాహనం వద్దకు తిరిగి వస్తుండగా, టీమ్‌కి ఇదంతా వివరించి, నాకు పూజారులు ఇచ్చిన వస్తువులు పోగొట్టుకున్న సుధానాగరాజుకు అమరనాథ్ సన్నిధిలో రజత జ్ఞాపికతో పాటుగా ప్రసాదాన్ని అందజేసాను.

ఎనిమిది రోజుల పాటు ఈ భూమి మీద ఉన్న అత్యంత పవిత్రమైన ప్రదేశాలకు చేసిన ప్రయాణంలో కలిసిన బృంద సభ్యులు అంతా మంచి స్నేహితులయ్యారు. ఎన్నో విధాలుగా ఒకదానితో ఒకటి బంధాన్ని కలిగిన భారతీయ సంస్కృతి మరియు వారసత్వానికి ధన్యవాదాలు తెలపాలి. తీర్థయాత్రలు అన్నీ విలువలు, స్నేహం, ప్రేమ, సమయపాలన, పరస్పర అవగాహన, ఆధ్యాత్మికత ఇలా ఎన్నో విషయాలను మనకు నేర్పుతాయి అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

నాగరాజు మరియు కుటుంబ సభ్యులు నన్ను వారి కుటుంబ సభ్యుడిలాగా చూసుకున్నారు... యాత్ర సమయంలో నా ఖర్చులు మొత్తం వాళ్లే చూసుకున్నారు. భారత్ దర్శనంలో ముందుకు సాగుతున్నప్పుడు జట్టులోని ప్రతీ ఒక్కరి కోసం నేను ప్రార్థించడం తప్ప నేను ఏమి చేయగలను.

**ఆర్టికల్ 370/35ఎ రద్దు – భారతదేశానికి చారిత్రాత్మక దినం:**

నేనూ దేవాలయ సముదాయం నుండి బయటకు వస్తున్న సమయంలో, భారత రాజ్యాంగంలోని 370/35ఎ ఆర్టికల్‌ను భారత పార్లమెంట్ రద్దు చేసిన అద్భుతమైన వార్తతో మాకు స్వాగతం లభించింది. ఇక, ముందు జమ్మూ కాశ్మీర్ కూడా భారతదేశంలో అంతర్భాగంగా ఉండబోతోంది. ఆర్టికల్ 370/35ఎ రద్దు... రాజ్యసభ (ఎగువ సభ) యొక్క చారిత్రాత్మక నిర్ణయం. తద్వారా అభివృద్ధి చెందిన భారతదేశాన్ని సాధించడంలో ఖచ్చితంగా ఒక భారీ ముందు అడుగు.

130 కోట్ల మంది భారతీయులకు అతి శక్తివంతమైన రోజు. కాశ్మీర్ ఇప్పుడు మిగిలిన భారతదేశంతో సమానంగా అన్ని శక్తులతో పాటు తల ఎత్తగలదు. భారతదేశాన్ని ఉద్ధరించడానికి అవసరమైన నాయకులను సృష్టించినందుకు నేను దేవునికి కృతజ్ఞతలు తెలుపుకున్నాను. మరిన్ని అధికారాలు కాశ్మీరీయులకు వచ్చి మరింత శక్తివంతంగా చేయాలని ఆశిస్తున్నాను. కోల్పోయిన వైభవం మరియు శాంతి ఊహించిన దానికంటే త్వరగా తిరిగి వస్తుందనే నమ్మకం నాకు ప్రగాఢంగా ఉంది. ఆర్టికల్ 370 మరియు ఆర్టికల్ 35ఎ, ఏడు దశాబ్దాల పాటు ఈ దేశాన్ని పీడిస్తున్న రాజకీయ క్యాన్సర్లుగా మిగిలిపోయాయి. ఇప్పుడు మన దేశభక్తి, అంకితభావం, సమర్థత మరియు ప్రసిద్ధి చెందిన రాజకీయ శస్త్రవైద్యులు ఈ సమస్యకు పరిష్కారం కనుగొన్నారు. వారంతా తమ పూర్తి శ్రద్ధ, పట్టుదల, చతురత, నైపుణ్యము మరియు సంకల్పశక్తితో ఈ క్యాన్సర్‌ను ఆపరేషన్ చేసి తొలగించారు. మోడీజీ, అమిత్ షాజీ, వారి బృందానికి మరియు ప్రతి ప్రభుత్వ విభాగానికి హ్యాట్సాఫ్.

స్వాతంత్ర్యానంతరం దేశ ప్రజలకు ఇది ఒక చారిత్రాత్మకమైన రోజు. కాశ్మీర్ ఇప్పుడు ఆరోగ్యంగా మరియు సంపన్నంగా తన చేతులు, తలలు మరియు హృదయాలను మిగిలిన భారతదేశానికి అందజేయాలని ఆశిద్దాం. దాని శక్తి మరియు సాధికారత దాని ధైర్యం మరియు ప్రోత్సాహం అలాంటిది. పార్లమెంటు నిర్ణయంతో దేశం మొత్తం సంబరాలతో మునిగిపోయింది. మేము 300 కిలో మీటర్ల పైగా ప్రయాణించి, న్యూఢిల్లీ చేరుకున్నాము.

# ఢిల్లీ

బద్రి, కేదార్నాథ్ యాత్ర నుండి తిరిగి వస్తున్నప్పుడు యాత్రికులందరూ వారితో నేను చేసిన ప్రయాణం గురించి తమ ఆనందాన్ని వ్యక్తం చేసారు. అందరూ ఎంతో ప్రేమగా నన్ను చూసుకున్నారు. వారందరికీ పేరుపేరున కృతజ్ఞతలు తెలియజేసాను. వారికీ యాత్రలో నేను తీసిన ఫొటోలు, వీడియోలు జ్ఞాపకాలుగా ఇచ్చాను. అందరూ తమ తమ అనుభవాలు, అనుభూతుల్ని మిగతా వారితో పంచుకున్నారు. ఎంతో సంతోషంగా ఢిల్లీకీ ప్రయాణం సాగింది.

వీలు చేసుకుని తమిళనాడు మరియు కర్ణాటకలోని వారి ఇళ్లకు రావలసినదిగా ప్రేమతో ఆహ్వానించారు. నేనూ కూడా ఈ ప్రయాణంలో వారు నా పట్ల చూపించిన ప్రేమకు, ఆదరణకు చాలా సంతోషించాను. నేను ఈ ప్రయాణ కాలంలో తెలియకుండా వారి మనసును కష్టపెట్టి ఉంటే క్షమించ వలసిందిగా అభ్యర్థించాను.

నేను ఢిల్లీలో దిగుతూనే వారందరికీ ఒక సందేశాన్ని పంపాను. అదేమిటంటే:

"మీ అందరికీ శుభాకాంక్షలు, అభినందనలు, కృతజ్ఞతలు. మీరు అందరూ క్షేమంగా విమానాశ్రయానికి చేరుకుని, విమానం ఎక్కాలని ఆశిస్తున్నాను. సురక్షితమైన ప్రయాణం మీకూ అందుగాక! నా స్వంత ఇంటి నుంచి నా ప్రియమైన బంధువులు వదిలి వెళ్ళిపోతూ ఉంటే ఎంత విచారం కలుగుతుందో, అలాంటి విచారమే నాకు ఇప్పుడు కలుగుతుంది. ఈ ప్రయాణ సమయంలో మీరు నా పట్ల చూపించిన ప్రేమ కూడా అలాంటిదే. నేను కూడా నా ప్రేమను, ప్రార్థనలను మీకు అందిస్తున్నాను. సాయిరాం!"

దానికి ప్రతిస్పందనగా నాకు రెండు అద్భుతమైన సందేశాలు వచ్చాయి. వాటిలో ఒకటి:

"నమస్కారం స్వామి, మేము బెంగళూరుకు సురక్షితంగా చేరుకున్నాము.

మీ దివ్య ప్రసంగాలతో, తీర్థయాత్రలోని ప్రతిక్షేత్రం మీరూ ఇచ్చిన వివరణలతో మేము మా ప్రయాణాన్ని మరింతగా ఆస్వాదించగలిగాము. మీరు చూపించిన ప్రేమ, ఆప్యాయతను ఎప్పటికీ మర్చిపోలేము. మీ భారత దర్శన్‌కు మా శు భాకాంక్షలు అందజేస్తున్నాము." జయజయ శంకర, హర హర శంకర! – **అమర్‌నాథ నారాయణ, హొసూరు.**

"మీరు పంపించిన సందేశానికి కృతజ్ఞతలు. సాయి కుటుంబం మనకు చేసేది ఇదే. సాయి ఎల్లప్పుడూ మిమ్మల్ని అనుగ్రహించాలి. సాయి రాం! సోదరుడు ఇంటికి క్షేమంగా చేరుకున్నాడు. స్వామివారి అనుగ్రహంతో వేరే సంచిలో నాణెము, శివలింగం దొరికాయి. డబ్బు మాత్రం పోయింది. మీకు ఎంతో సంతోషకరమైన, ఫలవంతమైన ప్రయాణం సిద్ధించాలని, ఆ భగవంతుని దయ మీకు సదా ఉండాలని ప్రార్థిస్తున్నాను." సాయిరాం! **– నాగరాజు, బెంగళూరు.**

ఆహా! ఎంత చక్కటి కుటుంబం ఇది! ఇలాంటివారిని భారతదేశ యాత్రలో కలవడం అన్నది, దేవుళ్లను మనుష్యరూపంలో చూడటమే. యాత్ర సమయంలో వారు నా కోసం ఖర్చు చేసిన డబ్బును నేను లెక్క చేసి వారికి అందజేసినప్పుడు, వారు ఆ మొత్తాన్ని సున్నితంగా తిరస్కరిస్తూ... నేను చేసే భారత దర్శన్‌లో వారు భాగం కావాలని కోరుకుంటున్నామని చెప్పారు. బాబా పేరుతో వారికి, వారి కుటుంబాలకు నా ఆప్యాయతలను తెలియజేయడం తప్ప నాకు మరో విధమైన మాటలు రాలేదు. అసలు ఎవరు అయినా యాత్రలో నా లాంటి వాడికి అంటే ఏ సంబంధం లేని వాళ్లకు ఎవరైనా ఖర్చులు భరిస్తారా??? ఇది ఒక అద్భుతం భారత దర్శన్ యాత్ర! ప్రతి అంగుళం ఇలాంటి దివ్య సంఘటనలు, అనుభవాలతోనే నిండిపోయింది అనిచెప్పక తప్పదు.

## ఆగస్ట్ 6, 2019

### MP గారి ఇంటికి అతిథిగా:

ఆగస్టు 8, 2019న వెళ్ళవలసిన ఖాట్మాండు (మానస సరోవర యాత్ర) ప్రయాణాన్ని దృష్టిలో ఉంచుకుని, ఢిల్లీలో మూడు రోజుల పాటు ఉండాల్సి వచ్చింది. అందుకు అయ్యే ఖర్చును దృష్టిలో ఉంచుకొని, నేను స్వామి నారాయణ్ ఆశ్రమంలో సాధారణ వసతి గృహంలో రిజర్వు చేసుకున్నాను. కానీ భగవంతుడు నిర్ణయం మరోలా ఉంది.

నేను హరిద్వార్ నుంచి తిరిగి వస్తుండగా దేవుడు పంపించిన దూతగా నా ప్రియ స్నేహితుడు శ్రీ వాసుదేవరావు దేవకి తాను ఢిల్లీలో ఉన్నానని, భారత యాత్రలో కొంత సమయం వారితో గడపమంటూ సందేశం పంపారు. నేనూ చాలా సంతోషించాను. ఎక్కడికి రావాలి? అని అడిగాను. అడ్రస్ ఇచ్చిన తర్వాత, బస్సు డ్రైవరు చాలా దయతో నన్ను ఆ అడ్రస్ దగ్గర దింపారు.

నిదానంగా నడుస్తూ ఆ చిరునామా గల ఇంటి ముందుకొచ్చినప్పుడు, ఆ ఇల్లు పార్లమెంట్ సభ్యుడు (రాజ్యసభ) శ్రీ గరికపాటి మోహనరావు (GMR)కి చెందిందని నేను గ్రహించాను. నేనూ నా స్నేహితుడు వాసుదేవరావు దేవకి కలుస్తానని అనుకున్నాను. కానీ నన్ను ఆశ్చర్యపరిచే విధంగా ఢిల్లీలోని ఎంపీ ఇంటికి అతిథిగా వచ్చాను.

శ్రీ GMR, నేను కోరుకున్నంత కాలం వారి ఇంట్లో అతిథిగా ఉండొచ్చని చెప్పడం నన్ను ఆశ్చర్యపరచింది. వారు ఎంతో మంచితనంతో నన్ను ఆదరించి, సేద తీరడానికీ ఏర్పాట్లు చేసారు. నా గురించి, భారత దర్శన గురించి వివరణలు తెలుసుకొని వారు ఆశ్చర్యపోయారు. చాలా సంతోషంగా, నేను ఢిల్లీకి ఎప్పుడొచ్చినా సరే వారి ఇంటికి రావచ్చని చెప్పారు. ఇక ఆ రాత్రి అక్కడ విశ్రాంతి తీసుకున్నాము.

అతను సామాన్య రాజకీయ నాయకుడు కాదు, ఒక అసామాన్యమైన వ్యక్తి అనీ నేను గ్రహించాను. చిన్న స్థాయి నుంచి గొప్ప స్థానం వరకు ఎదిగిన మనిషి అని తెలుసుకున్నాను. మా పట్ల ఆయన చూపిన ప్రేమ, వాత్సల్యాలు చాలా ప్రశంసనీయం. అతని జీవిత కథను విన్న తర్వాత, ఆయన క్షేమం కోసం ప్రార్థించాను. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రస్తుత పార్లమెంటు సమావేశాలు, బీజేపీ మరియు దాని నాయకత్వం గురించి చర్చించుకుంటూ, మేము అందరం మంచి సమయాన్ని గడిపాము.

**భారత పార్లమెంటులో:**

శ్రీ GMR గారి సౌజన్యంతో మేము నిరాటంకంగా భారతదేశ పార్లమెంటు భవనంలోకి ప్రవేశించగలిగాము.

జమ్మూ & కాశ్మీరు పునర్వ్యవస్థీకరణ బిల్లును లోక సభలో ప్రవేశపెట్ట బడినప్పుడు, మాకు పార్లమెంటులో ఉండే అదృష్టం కలిగింది. నేను భారత

సార్వభౌమత్వానికి రాజ చిహ్నంగా సమున్నతంగా నిలిచిన పార్లమెంటు భవనాన్ని చూస్తుంటే, చాలా గర్వంగా అనిపించింది. ఇక్కడే కదా దేశానికి దిశ దశ చూపించగలిగే చట్టాలు తయారవుతాయి అనుకున్నప్పుడు చాలా ఉత్సాహంగా అనిపించింది. ఇక, పార్లమెంట్ లోపలికి అడుగు పెడుతూనే, దానిముందు నమస్కరించాను.

పార్లమెంట్ భవనాన్ని, దాని భారీతనాన్ని, సదుపాయాలను చూస్తుంటే ఏదో ఒక స్వర్గంలోకి ప్రవేశించినట్లే అనిపించింది. ప్రాంగణంలోని ప్రతి మూలలో జాతీయ నాయకులు నిలబడి ప్రజాస్వామ్య దేవాలయంలో వున్న నాయకులు నిర్వహిస్తున్న వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నారా ఏమి? అనిపించింది. 130 కోట్ల మంది భారతీయుల ఆకాంక్షలు ఇక్కడ పార్లమెంటులోనే నెరవేరుతాయి.

జమ్మూ & కాశ్మీర్ పునర్ వ్యవస్థీకరణ బిల్లు లోక్‌సభలో భారీ ఆధిక్యతతో ఆమోదించబడినందుకు చాలా సంతోషించాను. చిన్ననాటి నుండి నేను రాష్ట్రీయ స్వయంసేవక సంఘంలో ఉండడం వలన కాశ్మీరు సమస్య గురించి పూర్తి అవగాహన ఉంది. అందుకే ఆ రోజు అక్కడ జరిగిన సంఘటన పట్ల నేను చాలా సంతోషపడ్డాను. పార్లమెంటు నుంచి జమ్మూ & కాశ్మీర్‌లోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న భారతీయ పౌరులందరికి క్షేమం కోసమై నేను ప్రార్థించాను.

అక్కడి నుంచి అందరం శ్రీ GMR గారి ఇంటికి తిరిగి చేరుకున్నాము. నా చిరకాల మిత్రుడు (రెండున్నర దశాబ్దాలుగా) ఖమ్మం (2019) నుండి BJPలో లోకసభ ఎన్నికలలో పోటీదారుడు, CS వాసుదేవరావు దేవకితో సమయం గడిపే అదృష్టం నాకు కలిగింది... మేమిద్దరం ఒకరినొకరు కలుసుకోవడం, ఢిల్లీలో రెండు రోజుల గడపడం మరియు అతను నన్ను జాగ్రత్తగా చూడడం ఇదంతా నాకు ఎంతో ఆత్మానందాన్ని కలిగించాయి.

నాకు నా జీవితంలో ఇలాంటి మంచి వారితో పరిచయం ఏర్పడటం నిజంగా అదృష్టమే అని అనుకుంటాను. జరిగే ప్రతీ విషయం ఈ విధంగా ఎందుకు జరుగుతుంది అన్నది తెలీయదు. వాసుదేవరావు దేవకి నాతో, ఢిల్లీలో ఒక్క రూపాయి కూడా ఖర్చుపెట్టనీయలేదు. పైగా, కాలి నొప్పితో బాధపడే నాకు డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లి మందులు తెచ్చి ఇచ్చాడు. మేమిద్దరం ఢిల్లీలో అంతా తిరగడానికి ఒక వాహనాన్ని కూడా ఏర్పాటుచేశాడు. మేము ఇండియా గేట్, నేషనల్ వార్ మెమోరియల్, బిర్లా మందిర్ తదితర ప్రదేశాలను దర్శించాము,

ఢిల్లీ చాట్, లస్సీ, జిలేబీలు కూడా ఆస్వాదించాము. మిత్రుడు వాసుదేవరావు త్వరలో చట్ట సభలకు వెళ్లాలని కోరుకుంటున్నాను. ఆయన నాతో సెలవు తీసుకొని వెళ్ళిపోతే, నేను శ్రీ గరికపాటి వారి గృహంలో ఉండిపోయాను.

తను నాకొక సందేశం పంపారు. "బాలా, నువ్వు నా పట్ల చూపించిన ప్రేమ మరియు ఆదరణకు కృతజ్ఞతలు. నేనూ శ్రీరామకృష్ణ శారదా వివేకానందుని ప్రార్థిస్తున్నాను, నీవు చేస్తున్న కార్యక్రమాలను చక్కగా నిర్వహించేందుకు కావాల్సిన శక్తి, యుక్తులను, ధైర్యాన్ని ఇవ్వమని. నువ్వు నీ కాలునెప్పుడూ నిర్లక్ష్యం చేయకు నీ ఆరోగ్యాన్ని కూడా జాగ్రత్తగా చూసుకో. ఈ రోజు నిన్ను కలవడం నాకు చాలా సంతోషం ఇచ్చింది. 'శుభమస్తు' " వాసు.

మరోప్రక్కన, ఢిల్లీలో పర్యటనలోనే, శ్రీ మోతుకూరి నారాయణరావును (ఖమ్మం) కలవగలిగాను. భద్రాచల యాత్రలో ఏప్రిల్ 6, 2019 (నా పుట్టినరోజు ఉగాది పండుగ) శ్రీ స్వామి వారి అభిషేక దర్శనానికి కారణమైన వ్యక్తి. అలానే భారత యాత్రకు కూడా ఆయన ఒకరకంగా కారకుడు. భారత దర్శన ద్వారా నా జీవితాన్నీ మలుపు తిప్పేందుకు మార్గం సుగమం చేసినందుకు ఆయనకు నా హృదయపూర్వక ధన్యవాదాలు.

అలాగే మరొక చిరకాల మిత్రుడు శ్రీ శశిరాజ్‌ధార గారిని, జాయింట్ డైరెక్టర్, మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ కలిసాను. ఆయన హైదరాబాద్‌లో ఉన్నప్పుడు డిప్యూటీ R.O.C గా నాకూ సుపరిచితుడు. 2017లో MCAకు మారారు ఆయన నాన్న ఢిల్లీలో చూసి ఎంతో సంతోషించి, ఢిల్లీలో ఏ అవసరం వచ్చిన వాళ్ల ఇంటికి రమ్మని ఆహ్వానించారు. ప్రతి ఒక్కరూ జీవితంలో మరొకరికి నేర్పించగలరు అనిపించింది.

## ఆగస్ట్ 7, 2019

### శ్రీమతి సుష్మా స్వరాజ్‌కి నివాళులు:

శ్రీమతి సుష్మా స్వరాజ్ గారు నాకు తెలిసినంతలో ఇప్పటి వరకు అత్యుత్తమ విదేశాంగ మంత్రిగా మరియు మోడీ నేతృత్వంలోని NDA ప్రభుత్వంలో అత్యుత్తమ కేబినెట్ మంత్రిగా కూడా సేవలందించిన అద్భుతమైన మహిళ. భారతదేశానికి భగవంతుడు ఈమె రూపంలో ఒక సోదరిని సృష్టించి, అందరికీ అత్యంత సహాయకారిగా ఉండేందుకు నిలబెట్టారు. సాంకేతిక పరిజ్ఞానం ఉన్న

కొద్ది మంది మంత్రుల్లో ఒకరిగా ప్రసిద్ధి చెందినారు. ఆమె తన అంకిత భావంతో, పరిపాలన దక్షతతోనూ ప్రజలందరి విశ్వాసాన్ని చూరగొన్నారు. ప్రపంచవ్యాప్తంగా అందరి మన్ననలు మరియు ప్రశంసలు అందుకున్నారు.

2019 ఆగస్టు 6వ తేదీన సుష్మా స్వరాజ్‌కు గుండెపోటు రావడంతో ఆమెను AIMS కు తరలించారు. వైద్యులు ఎంతో శ్రమించినా వారిని బ్రతికించ లేకపోయారు. ఆమెకు 2016లో కిడ్నీ మార్పిడి జరిగింది మరియు అనారోగ్య కారణాల దృష్ట్యా ఆ సంవత్సరం ప్రారంభంలో లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడం నుండి తప్పుకుంది. ఇంత అద్భుతమైన వ్యక్తిత్వమే నాలాంటి వారికి అభిమానులుగా చేసిందని చెప్పాలి.

భారత దర్శనం సందర్భంగా న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ రోడ్డులో ఆమెకు అంతిమ నివాళులు అర్పించడం నా అదృష్టంగా భావించాను.

ఆమె మాట్లాడే విధానం,
ఆమె వస్త్ర ధారణ,
ఆమె స్పందించే గుణం,
ఆమె పెద్దలతో వ్యవహరించే విధానం,
ఆమె యువతను ప్రేమించే విధానం,
ఆమె భావ ప్రకటన,
ఆమె వాదనా పటిమ,
ఆమె హృదయాలను గెలుచుకున్న విధానం,
ఆమె నాయకులను అభిమానించే విధానం,
కిడ్నీ సమస్యలను ఆమె సవాలు చేసిన విధానం,
ఆమె రాజకీయాలకు దూరమైన తీరు,
చివరి శ్వాస వరకు ఆమె జీవించిన విధానం,
ఇదంతా భారతీయులకు స్ఫూర్తిదాయకం.

దేశం కోసం ప్రాణాలర్పించిన ఇట్టి భారత ఆత్మబంధువుల గౌరవార్థం మనం ఏమి చేయాలి? సుష్మా స్వరాజ్ అమర్ రహే! ఇక ఆవిడలా చివరి శ్వాస వరకు నిండుగా జీవించడమే మనం ఆవిడకు ఇచ్చే నిజమైన నివాళి కదా. ఆమె తన వ్యక్తిత్వంతో స్వర్గంలో కూడా అందరినీ మంత్ర ముగ్ధులుగా చేసి అక్కడ కూడా నాయకురాలిగా ఉండాలని మనం అంతా కోరుకుందాం.

# నేపాల్

## ఆగస్ట్ 8, 2019

ఢిల్లీ నుండి ఉదయం 6:40 నిమిషాలకు బయలుదేరి ఇందిరాగాంధీ విమానాశ్రయం, టర్మినల్ 3కి చేరుకున్నాను. దాదాపు మూడుగంటల తర్వాత, నేపాల్ ఎయిర్‌లైన్స్‌లో ఎక్కాను. సిబ్బంది అందరూ చాలా మర్యాదపూర్వకంగా ప్రవర్తించారు.

ఈ విమాన ప్రయాణం నాకు మంచి అనుభవాన్ని ఇచ్చింది. సుమారుగా మధ్యాహ్నం 12:40కి ఖాట్మండు త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నాను. మళ్లీ అక్కడ విదేశీ ఆగమన లాంఛనాలు ముగించుకుని హోటల్ మూన్‌లైట్‌కు చేరుకున్నాను. Visits Kailash సిబ్బంది నన్ను ప్రేమగా ఆహ్వానించారు. మానససరోవర యాత్ర బృందంలో నాకు తోడుగా దాదాపు 30 మందికి పైగా ఉన్నారు. అందులో ఇద్దరు తెలుగు రాష్ట్రాల నుంచి, మరో 16 మంది ఉత్తర భారతదేశం నుంచి, 7 మంది పశ్చిమ బెంగాల్ నుంచి, నలుగురు కేరళ నుండి, మిగిలిన వారు వివిధ ప్రాంతాల నుంచి వచ్చారు అని తెలుసుకున్నాను.

నేపాల్ అనేది మొదటిగా భారత ఖండంలో భాగంగా, వేదకాలం నుంచి గ్రంథాలలో పేర్కొనబడింది. పురాతన భారతదేశంలో ప్రధాన మతంగా హిందూమతం స్థాపించబడిన కాలంలో, క్రీస్తు పూర్వం 10వ శతాబ్దం మధ్యలో బౌద్ధమత స్థాపకుడు గౌతమ బుద్ధుడు దక్షిణ నేపాల్‌లోని లుంబిని ప్రాంతంలో జన్మించారు.

హోటల్‌కు చేరుకోగానే, హైదరాబాదు నుంచి వచ్చిన మహేంద్రతో కలిసాను. ఇతడు ప్రయాణ ప్రేమికుడు. అన్నీ ప్రదేశాలను చూడడమనేది అతనికి అలవాటు. భగవంతుని కంటే ప్రకృతిని ఆస్వాదించే వ్యక్తి అని తెలిసింది. మేము

అతిత్వరలో మంచి స్నేహితులుగా మారిపోయాము. ఖాట్మండు నగర శివారులో ఉన్న కైలాస మహదేవ ఆలయాన్ని సందర్శించాలనుకున్నాము. మేము ఇద్దరం బయలుదేరి, స్థానిక రిక్షా మరియు టెంపో ద్వారా ప్రయాణించాము. విగ్రహం ఉన్న ప్రదేశానికి చేరడానికి ఒక కిలోమీటరు ట్రెక్కింగ్ కూడా చేసాము.

కైలాస మహదేవుని విగ్రహం ప్రపంచంలోనే అతి ఎత్తైనది అని తెలిసింది. మేమిద్దరం అక్కడ మంచి సమయం గడిపాము. కొన్ని ఫోటోలు, వీడియోలు కూడా తీసుకున్నాను. సాయంకాలం 7:30కి హోటల్ చేరుకున్నాము. ఆ సమయానికి మిగితా యాత్రికులు వారి వారి ప్రదేశాల నుంచి హోటల్‌కు చేరుకున్నారు. మానస సరోవర యాత్ర 9 ఆగస్టు 2019న మొదలవుతుంది అని చెప్పారు.

## ఆగస్ట్ 9, 2019

**పశుపతినాథ్:**

మిగతా ప్రయాణికులు అంతా నెమ్మదిగా ఖాట్మండులోని మూన్ లైట్ హోటల్‌ని చేరుకున్నారు. మరికొంతమంది ఆ ప్రాంతంలో వున్న దర్శనీయ క్షేత్రాలను మరియు ప్రదేశాలను చూడడానికి బయలుదేరారు. దాదాపు 20 మంది యాత్రికులు అందరం త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయానికి దగ్గర్లోనున్న పశుపతినాథ్ ఆలయానికి బయలుదేరాము. తమ దేశం కాకుండా మరో దేశంలో ఉండడం అందరినీ భావోద్వేగానికి గురిచేసింది.

పశుపతి నాథ ఆలయం పవిత్ర భాగమతి నది ఒడ్డునున్న ప్రసిద్ధ పవిత్ర దేవాలయ సముదాయం. శతాబ్దాలుగా విస్తృతంగా పెరిగిన దేవాలయాలు. ఇక్కడ ఉన్న ఆశ్రమాలు, చిత్రాలు, శాసనాల సేకరణ మొదలైన వాటి వల్ల UNESCO వారు ఖాట్మండులోని ఈ దేవాలయాన్ని ప్రపంచ సాంస్కృతిక వారసత్వ ప్రదేశంగా గుర్తించింది. ఈ దేవాలయంలోని ప్రధాన పండుగ మహాశివరాత్రి. ఈ పవిత్రమైన రోజున లక్షలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకోవడానికి వస్తుంటారు.

ఎవరైతే శివుడిని ఆరాధిస్తారో... ఆయనకి తమను తాము సమర్పించు కుంటారో, వారు ఏ బాధలకి, ఏ దుఃఖానికి, కలలో కూడా లోను కారు. ఇలా

జరగడం అన్నది నిజమైన ముక్తికి తార్కాణం.

పురాణ ఇతిహాసాల్లో చెప్పబడినట్లు శివుడు, నరనారాయణుల కోరిక మేరకు ఇక్కడ నివసించడానికి అంగీకరించినట్లు కథనం. కురుక్షేత్ర యుద్ధం తరువాత, వ్యాస మహర్షి సలహా మేరకు, పాండవులు యుద్ధ సమయంలో తమ బంధువులను చంపినందుకు శివుడిని దర్శించి క్షమాపణ కోరటానికి హిమాలయ ప్రాంతానికి వచ్చారని, అది ముందుగా గ్రహించి, శివుడు వారిని క్షమించటానికి ఇష్టపడక, ఎద్దుగా మారి కొండపై ఉన్న పశువుల మధ్య దాక్కున్నాడు. పాండవులు ఎద్దు రూపంలో ఉన్న శివుడుని గుర్తించే సరికి, ఆ రూపం నేలమీద పరుండి మునిగిపోయి అదృశ్యమైంది. పాండవ సోదరులలో ఒకరైన భీముడు శివుని రూపంలో ఉన్న ఎద్దు తోకను పట్టుకుని, వారి ముందు హాజరు కావాలని, వారిని క్షమించమని బలవంతం చేశాడు. పాండవులు పదే పదే శివుణ్ణి ప్రార్థించారు. వారి ప్రార్థనలను స్వీకరించి ఇక్కడే పరమశివుడు మరో నాలుగు స్థలాలో ఆవిర్భవించారు. చేతులు తంగనాథ్, బొడ్డు పొట్ట భాగం మధ్య మహేశ్వర్ గాను, ముఖం రుద్రుడిగా భారత్‌లోనూ, తల నేపాల్‌లో ప్రకటితం అయింది.

మిగితా అవయవాలు స్పృశించిన ప్రదేశాలు తుంగనాథ్, మధ్యమహేశ్వర్ పైన వివరించాను. రుద్రనాథ్ మరియు కల్పేశ్వర్ లింగ రూపంలో పూజలు అందుకుంటున్నాయి. శివుడి తల భాగము నేపాల్ లోని ఖాట్మండు ప్రాంతములో ప్రకటింప బడింది. అదే పశుపతి నాథ్ దేవాలయంగా నమ్ముతారు.

పశుపతి నాథుని ప్రత్యేకత ఏమిటి అంటే ఒకే లింగమునకు ఐదు తలలు ఉంటాయి. తూర్పుముఖంగా తత్పురుష, ఉత్తర ముఖంగా అర్ధనారీశ్వర (వామదేవ), పడమరగా సద్యోజాత, దక్షిణంగా అఘోర, ఊర్ధ్వ ముఖంగా నిరాకారుడిగా శివుడు దర్శనమిస్తారు.

ఇక్కడ మరొక దివ్య అనుభవం నాకు ఎదురైంది. దర్శన సమయంలో నన్ను చూసిన గైడ్ నన్ను ప్రత్యేక లైనులో మందిరం చేరుకోవడానికి మార్గం సుగమం చేసారు. శృంగేరి నుంచి నియమించబడ్డ భట్‌లు భక్తిగా అభిషేకం చేస్తున్న తరుణంలో నాకు ఆ స్వామి దర్శనం అయింది. నేను మృత్యుంజయ మహామంత్రాన్ని, గాయత్రి మంత్రాన్ని అంతర్ బహిర్‌దృష్టిని కేంద్రీకరించి జపం చేస్తూ సమస్త జీవకోటి కోసం ప్రార్థనలతో వరుసలో కదులుతున్నాను. ప్రధాన

పూజారి నా గురించి ఆరా తీస్తూ, పశుపతి నాథుని అలంకరించబడి వున్న ఒక రుద్రాక్ష మాలను నా పైకి విసిరారు. అది ఆశ్చర్యంగా వచ్చి నా మెడలో పడింది. నాకు చాలా సంభ్రమాశ్చర్యాలు కలిగాయి. నాల్గవ ద్వారంలో స్వామివారిని దర్శించి బయటకు వస్తున్న సమయంలో అక్కడి పూజారి స్వామి వారి మీద వున్న మరొక రుద్రాక్ష మాలను తీసి నా వైపు విసిరేస్తే అది కూడా వచ్చి నా మెడలో పడింది. నాకు మాటలు రాలేదు.

మేము తర్వాత మూన్ లైట్ హొటల్‌కు చేరి మధ్యాహ్న భోజనం చేసాము. ఆ తరవాత స్వయంభూనాథ్ స్థూపానికి చేరుకున్నాం. ఇది నేపాల్‌లోని పవిత్రమైన భౌద్ధ స్థూపాలలో ఒకటి. రెండు వేల సంవత్సరాల క్రితం ఆదిమ సరస్సులో నుండి లోయ సృష్టించినప్పుడు ఈ స్తూపం ఆకస్మాత్తుగా స్వయంభుగా వెలసిందని చెబుతారు, అత్యంత పురాతనమైనదిగా అభివర్ణిస్తారు. ఈ ప్రాంగణంలో అనేక మందిరాలు మఠాలు ఉన్నాయి.

స్వయంభు అంటే స్వయంగా వ్యక్తీకరించబడినది అని అర్థం. ఇది 460AD నాటిది. ఈ చుట్టూ ఉన్న ఆలయాన్ని దేవరాజు నిర్మించారు. 13వ శతాబ్దానికల్లా ఇది బౌద్ధ మతానికి ముఖ్యమైన కేంద్రంగా మారింది.

ఒకప్పుడు ఖాట్మండులో విస్తరింపబడి ఉన్న సరస్సు మధ్యలో వికసించిన తామర పువ్వు నుండి స్వయంభునాథ్ ఆవిర్భవించడం గురుంచి పురాణాలు చెబుతున్నాయి. నేపాల్‌లో సాక్యముని బుద్ధుడు స్వయంభు యొక్క పశ్చిమ సరిహద్దులో ఎత్తైన పీఠంపై కూర్చున్నాడు. కొండపైన వెనుక వైపు మంజుశ్రీ లేదా సరస్వతికి అంకితం చేయబడిన ఒక ఆలయం ఉంది. చైత్యాలు, బౌద్ధ, హిందూ దేవతల విగ్రహాలు, మందిరాలు స్థూప సముదాయాన్ని నింపి ఉన్నాయి. ఆ గుట్ట మీదున్న స్థూప పునాది పూర్తిగా ప్రార్థనా చక్రాలు మరియు దేవతల విగ్రహములతో నిర్మించబడి ఉంటుంది. భక్తులు నిత్యం వాటిని తాకుతూ, దైవ నామ స్మరణం చేస్తూ స్తూపం చుట్టూ ప్రదక్షణలు చేస్తారు.

భారీ బంగారు పూతతో ఉన్న వజ్ర పిడుగు దీపాంకర్ బుద్ధ విగ్రహం, నిద్రిస్తున్న బుద్ధుడు ఇది చూడటం అనేది నిజంగా కళ్ళకి విందే. దేవ ధర్మ మొనస్టరీ కాంస్య బుద్ధ విగ్రహాలకు, సాంప్రదాయ టిబిటన్ చిత్రాలకు అత్యంత పేరు గాంచినది.

అక్కడే ఉన్న మరొక ఆలయం చూసాను. పిల్లలందరి దేవత అయిన హారతికి అంకితం చేయబడ్డ ఆలయం ఇది. బుద్ధ భగవానుడు ఆమెను పిల్లలందరికీ సంరక్షకురాలుగా మార్చడానికి ముందు ఆవిడ మహా దూకుడుగా దురుసుగా ఉండేదట.

మేము హొటల్‌కి తిరిగి వచ్చే సమయానికి ప్రమోద్ గౌతమ్ సునీల్ లామా నేతృతంలో కైలాస యాత్రకై విచ్చేసిన బృందమునకు ఒక ముఖ్యమైన సమావేశం ఏర్పాటు చేసింది. ఇది రెండు గంటల పాటు జరిగింది. ప్రతి ఒక్కరికి ఏదో ఒక ప్రశ్న ఉంది, సందేహాలు ఉన్నాయి, కొన్ని విషయాల పట్ల శ్రద్ధ చూపవలసిన అవసరం ఉంది, ఇలాంటి వాటన్నిటిని అక్కడ విశదీకరించి చెప్పారు. ప్రతి ఒక్కరికి ట్రావెల్ కిట్, బ్యాక్ ప్యాక్, రెయిన్ కోట్, డ్రై ఫ్రూట్స్, చెస్ట్ ప్యాక్ మొదలైనవి ఉచితంగా అందించబడ్డాయి.

భగవంతుని ప్రార్ధిస్తూ నేను కాలినడకన కైలాస పర్వతాన్ని పరిక్రమణ చేయాలని నిర్ణయించుకున్నాను. తదనుగుణంగా చైనాలో ప్రయాణానికి 1500 చైనీస్ యువాన్లను కొనుగోలు చేసాను. భారత దర్శన్‌లో చేయడానికి కావాల్సిన శక్తిని, అవకాశాన్ని ప్రసాదించమని ప్రార్థించడం మొదలు పెట్టాను.

# చైనా

## ఆగస్ట్ 10, 2019

ఖాట్మండు నుంచి సుమారు 170 కిలోమీటర్ల ప్రయాణం తరవాత చైనా సరిహద్దుకు చేరుకోనున్నాము అని తెలిసింది. యాత్ర నిర్వాహకులు అందరికీ చిన్న బస్సును ఏర్పాటు చేసి అప్పటికే సిద్ధం చేసిన యాత్రికుల సామాగ్రి సంచులను బస్సుమీద ఉంచారు. దూరం తక్కువగా ఉన్నప్పటికీ పర్వత ప్రాంత మవ్వడంతో సుమారు 10 గంటల సమయం పట్టింది. నిజానికి ఆ ప్రయాణం చాలా ప్రమాదకరమైన విధంగా సాగింది. యాత్రికులు అందరూ భయంతో ప్రాణాలు అరచేత పెట్టుకుని ప్రయాణం చేసినట్లే అనిపిస్తుంది. కొండ మలుపుల్లో, లోయ మార్గములలో, చాలా చిన్న దారుల్లో, పడుతూ లేస్తూ పరుగులెత్తే బస్సులో దేవుని తలవక కూర్చున్న వాళ్ళు లేరంటే నమ్మలేరు. అంత కఠినమైన ప్రయాణం. మార్గ మధ్యలో మేము భాగమతి పసాంగ్ లహమా హైవేలో భోజనం చేసాము.

బస్సు డ్రైవర్ సాగర్ బస్సును సుమారు 10 గంటల పాటు నడపడం అభినంద నీయమైన విషయం అని అందరూ అనుకున్నారు. నడపడంలో ఏదైనా చిన్న పొరపాటు జరిగితే యాత్రికులందరిని నేరుగా స్వర్గానికి తీసుకెళ్లే ఇలాంటి రోడ్ల పైన ప్రయాణాన్ని ఎవరు కూడా ఊహించలేరు. ఇక ప్రయాణంలో ఏదైనా మంచి వుందని చెప్పాలి అంటే... చుట్టూతా పరచుకున్న ప్రకృతి చాలా ఉత్తమంగా, అందంగా కనిపిస్తుంది. లోపల కూర్చున్న వారికి బయట ప్రకృతిని ఆస్వాదించే అవకాశం రాలేదంటే నమ్మాలి, కారణం వెళ్ళే మార్గం... ఎగిరి పడే బస్సు... ఇక మేము అలా సముద్రమట్టానికి దాదాపు 600 అడుగులకి చేరుకున్నాము. మేము సాయంత్రం 7:30 సమయంలో నేపాల్ సరిహద్దును దాటాం. డ్రైవర్ అద్భుతమైన సురక్షితమైన డ్రైవింగ్ నైపుణ్యాల్ని మేమంతా ఎంతగానో ప్రశంసించాము.

మార్గమధ్యంలో చైనా సరిహద్దు ప్రయాణం అంతా పర్వతాల గుండా ప్రవహించే త్రిశూలి నదిని చూడగలిగాము. ఈ నది శివుని త్రిశూలం నుండి మూడు పాయలుగా పుట్టిందని నమ్ముతారు. నది ప్రవహించే శక్తిని మాటల్లో వివరించలేం కూడాను, రాళ్లను కూడా కోసే ప్రవాహాన్ని నేను చూసాను. ఆ నది చేసే శబ్దం భరించ రానిదిగా ఉంది. ఈ నది నేపాల్‌లోని నారాయణి నదిని చేరుకుని, చివరకు గంగలో కలుస్తుంది అని చెప్పారు.

దార్చను వెళ్లడానికి చైనా బోర్డర్లో వీసా ఫార్మాలిటీస్ ముగించుకొని మేము అక్కడికి చేరుకున్నాము. ఇక్కడి నుంచి కైలాస పర్వతం మొదటి దర్శనం అవుతుంది. వాస్తవానికి సంస్కృతంలో ఈ ప్రదేశాన్ని దర్శన్ అని పిలుస్తారు. ఆరోజు మేము నేపాల్‌లోని పొటాలా హౌస్‌లో బస చేసాము.

# టిబెట్

## ఆగస్ట్ 11, 2019

**దర్చున్/దర్శన్:**

మేము నేపాల్ చైనా బోర్డర్‌లో ఉన్న పొటాలా విడిదిలో ఉదయం ఏడు గంటలకి సిద్ధంగా ఉన్నప్పటికీ సమన్వయ లోపం వల్ల మమ్మల్ని సుమారు నాలుగు గంటలకు కన్నా ఎక్కువ సమయం వేచి ఉండమని చెప్పారు. ఇక ఈ ప్రదేశము రెండు పర్వతశ్రేణుల మధ్య ఇరుకైన దారిలో ఉంటుంది. త్రిశూలి నది తన శక్తివంతమైన రూపంలో ప్రవహిస్తూ ఆ కొండల నడుమ ప్రవహిస్తూ.. యాత్రికులను కట్టి పడేస్తుంది. నేను కొన్ని మంత్రముగ్ధమైన దృశ్యాలను ఒడిసిపడుతూ ఆ లోయలో కాసేపు నడిచాను.

మధ్యాహ్నం భోజనం తర్వాత మేమంతా చైనా ఇమిగ్రేషన్ సెంటర్ దాకా నడిచాము. చైనా వారిచే బాగా నిర్వహింపబడుతున్న సరిహద్దు ప్రాంతము ఇది. భారతదేశము, నేపాల్ దేశాలతో పోల్చినప్పుడు మౌలిక సదుపాయాలలో భారీవ్యత్యాసము యాత్రికులకు ఇక్కడ అనుభవంలోకి వస్తుంది. మేము సరిహద్దు క్లియరెన్స్ సంబంధించిన పత్రాలను చూపించి అనుమతులు తీసుకున్నాం. తర్వాత మిగతా యాత్రికులందరి కోసం వేచి ఉన్నాము. రెండు గంటల సమయం గడిచిన తర్వాత చిన్న చిన్న బస్సులలో టిబెట్‌లోని కెరొంగు గ్రామానికి చేరుకున్నాం. పర్వత ప్రాంత ప్రయాణం మరియు అక్కడి శీతల వాతావరణానికి అలవాటు పడటం కోసం ఒక రోజు బస అక్కడ ఏర్పాటు చేసారు.

మా జట్టులో 30 మందికి పైగా ఉన్నారు. ప్రతి ఒక్కరూ చుట్టుపక్కల వస్తువుల్ని మరియు ప్రదేశాలను చూడటంలో తమ తమ అభిరుచి మేరకు సమయం వెచ్చిస్తుండటం గమనించి, ఇక నేను ఆ విదేశీ భాష, సంస్కృతుల పరిమితి కారణంగా కాస్తా రోడ్డు మీదకు చేరి అన్ని గమనించడానికి సిద్ధం

అయ్యను. నాకు చాలా విలువైన సమయం దక్కింది. చైనాలోని ప్రతి ఒక్క దానిలోనూ నాణ్యత కనిపిస్తుంది.

## ఆగస్ట్ 12, 2019

మానస సరోవర్ మార్గంలో కెరుంగు చాలా అందమైన ప్రదేశం. ఇక్కడికి చైనా, నేపాల్ సరిహద్దు నుండి రెండు గంటల ప్రయాణం ఉంది. పర్యాటకులను ఆకర్షించేందుకు, చైనా ప్రభుత్వము హిల్స్ స్టేషన్‌ను చాలా వ్యూహాత్మకంగా అభివృద్ధి చేసింది. అక్కడ ఏర్పాటైన పట్టణ వాటికని కూడా చాలా చక్కగా నిర్వహిస్తూ ఉన్నారు. చైనీయులు మాంసాహారులు, మద్యపానం, ధూమపానం చేసేవారు అయినప్పటికీ అక్కడ వాళ్ళు సృష్టించిన వాతావరణం యాత్రికులు అలవాటు పడడానికి బాగా ఉపయోగ పడుతుంది అని చెప్పాలి. అలాంటి సౌకర్యాలను ఏర్పాటు చేసి అందులో జీవనాధారం వెతుక్కునే వాళ్ళందరినీ ప్రశంసించకుండా వుండలేక పోయాను.

యాత్రికులంతా వారి డబ్బును ఖర్చు చేయడానికి వారికి తోచిన మార్గాలని ఎన్నుకున్నారు అనిపించింది. చాలా మంది చుట్టూ వున్న ప్రకృతిని ఆస్వాదించడానికి వెళ్లారు. కొంతమంది షాపింగ్ లోనూ, మరి కొంతమంది జంటలుగా దగ్గర్లో ఉన్న చిన్న కొండల్ని ఎక్కడంలోనూ, చాలామంది జట్టులో ఉన్న రిటైర్డ్ నేవీ ఆఫీసర్ సహాయంతో యోగా చేయడంలోనూ నిమగ్నమై ఉన్నారు.

కేవలం రెండేళ్ల కాల వ్యవధిలోనే ఇక్కడ నిర్మించబడ్డ సౌకర్యాలు, భవనాలు, మౌలిక సదుపాయాలు, వాతావరణం చూసి చాలా సంతోషంగా అనిపించింది. ఇప్పుడు మొత్తం టూర్ ఆపరేటర్లు ఇక్కడి వాళ్ళు తమ కస్టమర్లకు అందించే సౌకర్యాలను పరిగణలోకి తీసుకుని ఈ మార్గాన్నే ఎంచుకుంటున్నారు అని తెలిసింది. నేను 2012లో చేసిన మానస సరోవర్ యాత్రలో మట్టి ఇళ్లలో ఉండేవాడినని గుర్తుంది, కానీ ఇప్పుడు పరిస్థితి చాలా బాగా మెరుగుపడింది. పూర్వకాలంలో ప్రజలు చాలా ఇబ్బంది పడేవారు. పర్యాటకులకి సౌకర్యాలను కల్పించడంలో ఈ ఏడేళ్లలో పరిస్థితులన్నీ చాలా మంచిగా మారిపోయాయి.

**నడక కర్ర మాయాజాలం:**

మేము సరిహద్దుకు చేరుకున్నప్పుడు, ముందు చేయబోయే ప్రయాణానికి కావాల్సిన ఫ్లాస్కు, ట్రెక్కింగ్ స్టిక్, టార్చి లైట్ మొదలగు వస్తువులు నేను కొని పెట్టుకోలేదని గ్రహించాను. అందుకే విడిది చేసిన ప్రాంతంలో వున్న షాపుల్లో వాటి గురించి ఆరా తీయడం మొదలుపెట్టాను. కర్రలు అమ్మే దుకాణాలు ఏవి నాకు అక్కడ కనిపించలేదు. బహుశా భాషావరోధం వలన నాకేం అవసరమో అక్కడి షాపుల వారికి అర్థం కాలేదు. నేను చిత్రాలను గూగుల్లో వెతికి ఇవి ఎక్కడ దొరుకుతాయో? నేను ఎలా వాటిని పొందగలను? అని ఆరా తీస్తూ అక్కడున్న వ్యక్తులకి చూపించాను.

ఇంతలో రోడ్డు పక్కన కర్ర పట్టుకున్న వ్యక్తి కనిపించాడు. అతని దగ్గరికి వెళ్లి నా ప్రయాణానికి కావాల్సిన అలాంటి కర్ర ఎక్కడ దొరుకుతుందని అడిగాను. ఈ ప్రయత్నం ఇలా జరుగుతుండగా, నా చుట్టూ చేరిన పదిమంది నేను చెప్పేది అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇంతలో ఆ గుంపు నుంచి ఒక యువకుడు ముందుకు వచ్చి కొత్త కర్రని ఇచ్చాడు. మరొకరు ముందుకు వచ్చి కొత్త ఫ్లాస్క్ ఇచ్చారు. ఆ బృంద నాయకురాలు కూడా శిరము వంచి గౌరవంగా నాకు నమస్కరించి 50 యునాన్లను బహుకరించింది. జట్టు అంతా నాతో ఒక ఫోటో దిగారు. వారి ప్రేమకు, ఆప్యాయతకు మంత్రముగ్ధుణ్ణి అయ్యాను. ఇది వారి బహుమతుల గురించి కాదు, వారి అమూల్యమైన ఆదరణకు స్పందన. ఈ విషయం నేను నా జట్టులో వారితో చెప్పినప్పుడు వారంతా నన్ను చూసి నవ్వారు, నేను ఈ యాత్రలో జరిగే, జరుగుతున్న ప్రతి ఒక్కటి ఆ భగవంతుడి ఇచ్ఛ ప్రకారమే జరుగుతుందని ప్రగాఢంగా నమ్ముతున్నాను కాబట్టి నేను వారి ప్రతిస్పందనకి ప్రభావితం కాకుండా నిలబడిపోయాను.

టూర్ ఆపరేటర్లు మా అందరి విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఒక దశాబ్దానికి పైగా అటువంటి యాత్రలు నిర్వహించి ఉన్నందువలన తీర్థయాత్రలో ఏమిటి, ఎలా, ఎక్కడికి వెళ్లాలో వారికి బాగా తెలుసును. వారు ఏర్పాటు చేసిన ఆహార పానీయాలు అన్ని కూడా రుచి కరంగా వున్నాయి. అందరికీ కూడా సంపూర్ణ సంరక్షణ, సానుభూతితో కూడిన సేవలు చేయడం చాలా అద్భుతం అనిపించింది. కైలాష్ విజిట్స్ ఫైవ్ స్టార్ రేటింగ్ పొందుతుంది.

మరో రోజుకి తెరలు తీస్తూ మరుసటి రోజున ప్రయాణానికి సన్నద్ధమై పడుకున్నాను.

## ఆగస్ట్ 13, 2019
**భక్తితో ఆరాటపడడం:**

మేము ఉదయం 10:30 గంటలకు అల్పాహారం తర్వాత కేరంగు నుండి బయలుదేరాము. అక్కడి నుండి సాగా చేరుకోవడానికి చిన్న బస్సులలో నెమ్మదిగా సాగితే 6 గంటల ప్రయాణం. ఆ మార్గం మొత్తం పర్వతాలు, కొండలు, లోయలు, సెలయేళ్ళు, నదులు, జలపాతాలు మధ్యలో వంపులు తిరిగి వెళుతున్నట్లు అనిపించింది. బస్సు గంటకు 20 కిలోమీటర్ల వేగాన్ని మించి దాటలేకపోయింది. ఎగుడు దిగుడు దారుల్లో పడుతూ లేస్తూ వెళ్తున్నట్లు బస్సులో ప్రయాణం వలన శరీరం చాలా అలసిపోయినప్పటికీ అత్యున్నతమైన, అద్భుతమైన ఆ ప్రకృతిని ఆస్వాదించడానికి నేను కళ్ళు తెరుచుకునే ఉన్నాను.

యాత్రికులకు ఆహ్లాదాన్ని ఇవ్వడానికి మార్గ మధ్యంలో అత్యంత సుందరమైన మూడు ప్రదేశాలలో బస్సుని ఆపారు. ప్రతి ఒక్కరూ ఆ అందమైన ప్రయాణాన్ని ఆస్వాదించారు. బస్సు కదులుతూ ఉన్నప్పుడు కేరళ దంపతులు చేస్తున్న లలిత సహస్ర పారాయణంలో నేను కూడా గొంతు జత కలిపాను.

ఇక మేము అత్యంత శక్తివంతమైన బ్రహ్మపుత్ర నదిని దాటుకుంటూ దాదాపు మధ్యాహ్నం మూడున్నర గంటలకు సాగా (టిబిటియన్) చేరుకున్నాము. ఇది ఒక చిన్న పట్టణ వాటిక. ఇది 4640 మీటర్ల ఎత్తులో (సముద్రమట్టం నుండి 15, 223 అడుగులు) వున్న ప్రాంతం. సాగా (హ్యాపీ ల్యాండ్) అన్నది టిబిటీయన్ నేపాల్ సరిహద్దు మొత్తం పొడవునా గస్తీ నిర్వహించే చైనీస్ దండుతో కూడిన ఒక ఆర్మీ పట్టణము.

సాగ, దర్గాయిచాన్గోపో నది మరియు బ్రహ్మపుత్రా నదితో సంగమించే నుంచి చోటుకి ఎగువన ఉంది. కైలాస్ పర్వతాన్ని సందర్శించే యాత్రికులకు, పర్యాటకులకు ఈ 'సాగ' ఒక ముఖ్యమైన పాయింట్. ఇది షాపులు, అనేక వసతి గృహాలు హొటల్స్‌తో, ప్రయాణికుల సామాగ్రితోను చాలా మంది వుండే చోటు, దక్షిణ మార్గంలో ఉన్న చివరి పట్టణం. మేము ముని లింసన్ హొటల్లో

బస చేసాము. ఇది పర్వతాల మధ్యలో మౌంట్ కైలాష్‌కి వెళ్లే యాత్రికులతో నిండి ఉన్న ఒక పెద్ద వసతి భవనం.

బ్రహ్మపుత్ర నదిని గురించి తెలుసుకుని, నది ఒడ్డున రెండు కిలోమీటర్లు నడిచి, నాన్నగారి అస్థికలను ప్రార్థనలతో నదిలో నిమజ్జనం చేసాను.

హోటల్‌కి తిరిగి వెళుతున్నప్పుడు ఉష్ణోగ్రతలో తగ్గుదల, చల్లని వాతావరణం మొదటిసారిగా నన్ను తాకినట్లు నేను భావించాను. కేవలం కుర్తా, పైజామా, శాలువాతో బయటికి వెళ్లిన నాకు, ఒక్క క్షణం అక్కడికి గాలులకి కాస్తా భయం వేసింది. నెమ్మదిగా నడుస్తున్నప్పటికీ నాకు కాలు నొప్పి గురించి కూడా భయం వేసింది. పరిక్రమణ పూర్తి చేయడానికి నాకు శక్తిని ఇవ్వమని ఆ భగవంతున్ని మరీ మరీ ప్రార్థించాను. ఎత్తు ప్రాంతం అవడంతో తలనొప్పి కూడా మొదలైంది. టూర్ ఆపరేటర్ అన్నివేళలా సాధ్యమైనంత ఉత్తమమైన ఆహారాన్ని అందించినప్పటికీ జీర్ణక్రియ సమస్య గురించి భయంతో నేను ఆహారం ఎక్కువ తీసుకోవడం మానేశాను.

ప్రతిపాదిత మానస సరోవర్ కైలాష్ పర్వత పరిక్రమ యాత్ర బృందంలో ప్రతి ఒక్కరికి ఏదో ఒక ఆహార సమస్య ఉన్నట్లు నాకు అనిపించింది. యాత్రికులు అందరూ సముద్రమట్టానికి 1900 అడుగుల ఎత్తు చేరుకోవడానికి ఎలా? ఏమిటి? అన్న చర్చోపచర్చలు మరియు విచారణలో మునిగిపోయి ఉన్నారు.

నేను తిరిగి హోటల్‌కి చేరుకుని ఉన్ని స్వెటర్, జర్కిన్, మంకీ క్యాప్, శాలువా, సాక్స్ బూట్లు వేసుకుని ఆ చిన్న పట్టణంలో మరొక్కసారి రెండు కిలోమీటర్లు నడిచినప్పుడు వెచ్చగా అనిపించింది. ఈసారి కొంచెం మెరుగ్గా, సురక్షితంగా ఉన్నట్టు అనిపించింది.

ఆది శంకరాచార్యుల వారి భారత దర్శన యాత్ర మార్గంలో నేను ఇంత దూరం ప్రయాణించాక, ఆ భగవంతుని పదే పదే ప్రార్థించాను ఆయన నాతో నాలోనే ఉండాలని! కారణం ఏమిటంటే ఎవరి జీవితంలో అయినా అతి దుర్లభమైన కష్టతరమైన యాత్ర ఇది. ఈ మానస సరోవర్ యాత్రలో ముందుకు సాగుతూ ఉన్నప్పుడు నన్ను నేను ఆయన పాద పద్మాలకి సమర్పించుకున్నాను.

2012లో వచ్చినప్పుడు ఇదే పరిస్థితి ఉన్నప్పటికీ నేను ఆ పరిక్రమణ మంచిగానే పూర్తి చేసుకోగలిగాను. కానీ ఇప్పుడు కాలి నొప్పి అన్నది నన్ను

పిరికివాడిని చేస్తుంది. ఆయన పవిత్ర పాదపద్మాలు నావి కావాలని భావిస్తూ పరిక్రమకు సిద్ధమయ్యాను

## ఆగస్ట్ 14, 2019
## అనారోగ్యమే కానీ దృఢత్వం:

ఎత్తైన పర్వత ప్రాంతాలలో సాధారణంగా కలిగే నలత మరియు అనారోగ్యం రాత్రంతా నన్ను నిద్రపోనివ్వలేదు. శ్వాస తీసుకోవడంలోని ఇబ్బంది, అలసట మొదలైనవి నన్ను చాలా భయపెట్టాయి.

నేను నిరంతరం ఆ భగవంతుని దయ కోసం ప్రార్థిస్తూనే ఉన్నాను. తెల్లవారు ఝామున మూడున్నరకు అనుకుంటాను డాక్టర్ సాయిలత ఫోన్ చేసింది. నా క్షేమ సమాచారాలు అడిగింది వీడియో కాల్‌లో ఆవిడ కొన్ని మందులు చెప్పింది. కానీ అవి నా దగ్గర లేవు అందువలన సర్వస్య శరణాగతి చేస్తూ ఒక గంట అలా నిద్రపోయాను.

ఉదయం 6 గంటలకు లేచి స్నానం చేసి నా వస్తువులన్నింటిని సర్దుకుని బృందంతో కలిసి ఉపాహారం చేసాను. సాగ నుంచి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న మానసరోవరాన్ని చేరుకునే దుర్భరయాత్ర... కానీ దివ్య యాత్ర. మేము యాత్ర ప్రారంభించేటప్పటికీ నా ప్రార్థనలన్నీ ఫలించి సంపూర్ణంగా కోలుకునేటట్లు చేసిన ఆ భగవంతునికి అనేక కృతజ్ఞతలు చెబుతూ తోటి యాత్రికులు అందరితో కలిసి యాత్ర మొదలు పెట్టాను. ఆ మార్గం మొత్తం ప్రకృతి అందాలు తప్ప మరింక ఏమీ లేదు. మేము సముద్రమట్టం నుంచి 1400 అడుగుల ఎత్తులో ఉన్నాము. ఎప్పటికప్పుడు పడిపోతున్న ఉష్ణోగ్రతలు ప్రతి ఒక్కరినీ వెచ్చని దుస్తులు ధరించేలా చేసింది. ప్రతి ఒక్కరూ తమని తామే గుర్తు పట్ట లేనంతగా కప్పేసుకున్నారు. చాలా మంది యాత్రికులు ఇతర అనారోగ్య కారణాలతో బాధపడుతూ ఉన్నారు, కానీ ప్రతి ఒక్కరూ వారి వారి శక్తులన్నిటిని లోపల నుంచి కూడగట్టుకుంటూ, భక్తితో ప్రయాణంలో దేనిని కోల్పోకూడదు అన్న భక్తి భావనతో ముందుకు సాగుతూ ఉన్నారు.

మానస సరోవర్ మార్గంలో అర డజను కంటే ఎక్కువసార్లు బస్సు ఆగిపోయింది. ఆగిపోయిన ప్రతి ప్రదేశము మరొక ప్రదేశానికి మించిన

అందంతో కనిపిస్తుంది. మేము ఆగిన వాటి కంటే బస్సు అప్పుడే దాటిన ప్రదేశాలు చాలా అందంగా కనిపించాయి. అందమే అలాంటిది మరి! ఆది, అంతం లేకుండా అలాగా సాగుతూనే ఉంటుంది.

యాత్ర పొడవునా వున్న రోడ్లు, నెట్‌వర్క్, భద్రత, పరిశుభ్రతతో కూడిన పట్టణ వాటికలు మొదలైన వాటికోసం చైనా వారు సృష్టించిన మౌలిక సదుపాయాలు ఇవన్నీ భారతీయుల ఊహా శక్తికి మించినవి. వారి పరిపాలన దక్షతకు అభిరుచికి, పర్యాటక అభివృద్ధికి, వారికి అభినందనలు తెలుపవలసినదే. మన భారతదేశ ఆధ్యాత్మిక పర్యాటక వ్యవస్థ ఇంకా వ్యవస్థీకరించ వలసిందని, అత్యుత్తమంగా రూపాంతరం చెందాలని నేను భావిస్తున్నాను.

**మానస సరోవర్:**

సుమారు 88 కిలోమీటర్ల విస్తీర్ణంలో వృత్తాకారముగా విస్తరించి ఉన్న మానస సరోవర్‌ను మేము ఎట్టకేలకు చేరుకున్నాము. ప్రపంచంలో ఉన్న నదీ తీర్థములు అన్నింటిలోకీ, హిందువులకు అత్యుత్తమమైన, పవిత్రమైన, దివ్యమయిన తీర్థం ఈ మానస సరోవర్.

ఈ సరస్సు బ్రహ్మదేవుని మనసు నుండి సృష్టించబడిందని ఆ తర్వాత భూమి మీద వ్యక్తం అయిందని నమ్ముతారు. ఈ మానస సరోవర్ స్వచ్ఛతకు ప్రతిరూపమని ఎవరైతే సరస్సులో నీటిని తాగుతారో వారు మరణానంతరం సాక్షాత్తు కైలాశమును చేరి శివుడి సన్నిధికి చేరుకుంటారని విశ్వాసం. 100 జన్మల క్రితం చేసిన పాపాలు కూడా ఇక్కడ తొలగింప బడిపోతాయని అందరూ నమ్ముతారు. మౌంట్ కైలాష్ ఒక యాత్రా స్థలముగా మారి ఇండియా, నేపాల్ టిబెట్ వాటి పొరుగు దేశాలలోని వివిధ మతముల వాళ్ళను ఆకర్షిస్తుంది. ఇక్కడ స్నానం చేయడం వల్ల వారి పాపాలన్నీ కూడా, నశించిపోతాయని హిందువుల ప్రగాఢ నమ్మకము. తగ్గిపోతున్న ఉష్ణోగ్రతల వల్ల ఎవరిని సరోవరంలోకి అనుమతించలేదు. అంత చల్లగా ఉంది ఆ నీరు. వాస్తవికతను అంగీకరిస్తూ మేమందరము ఆ సరస్సు దగ్గరనే ఉదయం దాకా వేచి ఉన్నాము. నేను కూడా ఆ సరస్సులో ప్రవేశించడానికి సాహసించలేదు. ఉదయమే నేను ఆ సరస్సుకి శిరస్సు వంచి నమస్కరిస్తూ ఈ ప్రపంచంలోని ప్రతి ప్రాణి కోసం

ప్రార్థించాను. ఆ పవిత్ర జలాన్ని నిండారా భక్తితో తీసుకొని తాగి నా తలపై కూడా చల్లుకున్నాను. ఆ తరువాత నా తండ్రి గారి చితా భస్మం ఆ పవిత్ర సరస్సులో వారి ముక్తి కోసం ప్రార్థిస్తూ కలిపాను. ఆ సమయంలోనే ఆవలి ఒడ్డున ఉన్న కైలాస పవిత్ర పర్వత దివ్య దర్శనాన్ని పొందగలిగాను.

ముందుకు వెళుతున్నప్పుడు మేము ఒక సమస్యను ఎదుర్కున్నాము. మేము ప్రయాణించే బస్సు వెళ్ళవలసిన మార్గంలో ముందు రద్దీ వలన అనుకుంటా చాలా వాహనాలు నిలిచిపోయాయి. ఒకటి, రెండు గంటలు వేచి ఉన్నాక, ఇక లాభం లేదని గ్రహించి బస్సును మరొక మార్గంలో తీసుకుని వెళ్లడానికి డ్రైవర్ నిర్ణయించుకున్నారు.

నేను యాత్రికులకు ప్రతి యాత్రలో చెబుతూనే వచ్చాను. ప్రత్యేకించి హిమాలయ పరివాహక ప్రాంతంలోని కైలాశ మానస సరోవర్ యాత్ర అత్యంత ప్రయాస పూర్వకమైనదని. ఎందువలన అంటే ఆయన సమక్షానికి మనం చేరుకునే ముందు, నేను అన్న భావనని వదిలించుకోవాలన్నది ఆ భగవంతుడి అభిమతం, అహం అనేది ముక్కలు అయిపోవాలి, శారీరక మానసిక అహంకారాలు మనలో శూన్య స్థాయికి చేరుకోవాలి. ఆ స్థితిలో మాత్రమే మనము భగవంతుని శక్తిని సంపూర్ణముగా అనుభవించగలము. అప్పుడే మనల్ని మనము మరచి ఈ అనంత సృష్టిలో మనం ఏమిటి, మనం ఎవరు అన్నది కూడా మరిచిపోతాము. ఇక ఆ స్థితిలో మనిషి ఆధ్యాత్మిక ప్రపంచంలోకి ఆ భగవంతుడి కృప కోసం తిరిగి కరిగి పోతాడు. అప్పుడు నా పరిస్థితి కూడా అలాగే ఉంది.

## ఆగస్ట్ 15, 2019

### ఆనందంగా ఉండడం ఆశీర్వాదంగా భావించాను

ప్రయాణంలో... హిమయాలలో మరింత ఎత్తుకు చేరుకుంటున్నప్పుడు ఉష్ణోగ్రతతో పాటు ఆక్సిజన్ లెవెల్స్ కూడా పడిపోతూ ఉన్నాయి. ఇదే స్థితి మానస సరోవర్ వద్ద కూడా జరిగింది. రాత్రి 11 గంటలకు సమయంలో ఆరుగురు సభ్యులతో కూడిన గదికి చేరుకుని నన్ను నేను స్థిమితపరుచుకున్నాను. అప్పుడు ఉష్ణోగ్రత 5 డిగ్రీలు ఉంటాయేమో! చాలా వెచ్చని దుస్తులు వేసుకున్నప్పటికీ చలి శరీరాన్ని విపరీతంగా వణికిస్తోంది.

నా 2012 మానసరోవర్ యాత్రని గుర్తు తెచ్చుకున్నాను అప్పట్లో ఉండడానికి సరైన ఏర్పాట్లు ఉండేవి కాదు. కానీ ఇప్పుడు మానసరోవర్ సరస్సుకి పక్కనే షేరింగ్ రూములు, ఒక మంచం, ఒక పరుపు, ఉలెన్ దుప్పట్లు మొదలైనవి ఉన్నాయి కానీ టాయిలెట్స్ కి వెళ్లడం అనేది అందరికీ ఒక పీడ కల అనిపిస్తుంది. ఎందుకంటే అవి బహిరంగ మరుగుదొడ్లు.

ఒక రెండు గంటలు నేను నిద్రపోయి ఉండవచ్చు. నేను మేల్కొనేసరికి వర్షం పడుతూ ఉంది. చలి వలన ఎవరూ కూడా ఇంకా నిద్ర లేవలేదు. చాలా నిర్మానుష్యంగా వుంది. ముందు రోజు అక్కడ సెక్యూరిటీ వాళ్ళు చెప్పింది ఏమిటి అంటే ఎవరు కూడా సరోవరం లోకి వెళ్లి స్నానం చేయకూడదు అని. కారణం యాత్రికులు ఆ స్వచ్ఛమైన తటాకన్ని కలుషితం చేస్తున్నారు అని ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

మానసరోవర్లో స్నానం చేయడం అనేది హిందువులకు అత్యంత పవిత్రమైన విధి. కానీ దానికి చాలా దృఢ సంకల్పం కావాలి. నేను అలాంటి దృఢ సంకల్పంతోనే పవిత్రమైన ఆ సరస్సులో స్నానం చేసాను.(ఆ సమయంలో అక్కడ అడ్డుకునే వాళ్ళు ఎవరూ లేక పోవడం వలన) అంతటితో జలుబు, శ్వాస కోస సమస్యలన్నీ కూడా తొలగిపోయాయి. నేను నా దుస్తులు మార్చుకున్నాను. ఈసారి నా శరీరం పై రెండు దోతిలే ఉన్నాయి. దయతో భగవంతుడు అంత ప్రొద్దున్నే నాకు ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేస్తూ నేను స్వేచ్ఛగా మానసరోవర్ పరిసరాల్లో తిరగగలిగాను.

భారత దర్శనం తర్వాత నేను ఇంటికి చేరుకునే సమయానికి అవి ఇవి కొంటే బాగు బరువు పెరుగుతుందని భావించి ఎక్కడా ఎటువంటి జ్ఞాపకాలను నేను సేకరించలేదు. కానీ ఇక్కడ నేను కేవలం ఒక గులకరాయిని తీసుకోవాలి అని అనుకున్నాను. గాయత్రి మంత్రాన్ని జపిస్తూ నది నుండి ఒక గులక రాయిని తీసుకున్నాను. ఆశ్చర్యంగా కైలాస పర్వతం యొక్క చిన్ని ప్రతిరూపం దొరికింది. నేనెంతో భక్తితో దానిని తీసుకున్నాను.

నేను రాత్రి 2:00 దాకా నిద్ర పోలేక పోయాను. రెండు సార్లు కాలకృత్యాలకు హాజరు కావలసి వచ్చింది. నేను బహిరంగ ప్రదేశంలోనే కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఎంచుకున్నాను, కానీ ప్రకృతి పిలుపులకు

హాజరవ్వడం యాత్రికులు అందరికీ చాలా పెద్ద పని అనే చెప్పాలి. నీటిని తాకడం మరో క్లిష్టమైన పని. ఆ నీళ్ళలో చేతులు ముంచితే, చేతి వేళ్ళని కూడా స్తంభింప చేసేంత చల్లవిగా నీళ్ళు మారి పోయాయి. ఇక నేను ఏది చేసినా అది నాకు ప్రార్థనతో కూడిన సాధన.

ఇంత దూరం రావటం అనేది నా జీవితంలో ఒక వరం. జీవితంలో రెండోసారి మానస సరోవరానికి వస్తానని నేను ఎప్పుడూ అనుకోలేదు. భారత దర్శనాన్ని నా జీవితంలో నిజం చేసిన ఆ భగవంతునికి చాలా కృతజ్ఞత తెలియ జేసాను హృదయంలో. ఈ యాత్ర నన్ను పునీతునిగా చేసింది అని దృఢంగా చెప్పగలను, నా చివరి శ్వాస ఉన్నంత వరకు నా తోటి జీవులకు సేవ చేయాలని నేను మరొక్కసారి కృతనిశ్చయము చేసాను.

యాత్రికులు అందరికీ ఉత్తమమైన సౌకర్యాలను అందించడంలో టూర్ ఆపరేటర్ ప్యూరీ అతని సహాయక బృందము తమ వంతు కృషి చేసారు. నేను వారికి అభినందనలు తెలుపుతూ, మెచ్చుకున్నాను కూడా.

నేను మానస సరోవర్ ఎదురుగా ఒక నిర్మానుష్య ప్రదేశంలో కూర్చుని ప్రార్థన చేస్తూ అన్ని దిక్కుల వైపు చూస్తూ ఏకాంతంగా కాలం గడపడం మరచి పోలేని దివ్యానుభూతి. అక్కడ ప్రతి అంగుళం పవిత్రతతోను, దివ్య స్వచ్ఛతతోనూ నిండిపోయింది. సరస్సు చుట్టూ వందలాది మంది ప్రార్థనలు, అగ్నిహోత్రాదులు చేస్తూ పవిత్ర ధారాలను కార్చడం, తమ దగ్గర వారిని, ప్రియమైన వారిని స్మరించుకుంటూ పుణ్యకర్మలలో మునిగి వుండటం చూసాను. కానీ నాకు ప్రియమైన వారు ఎవరున్నారు??? ఈ జగత్తులోని ప్రతి జీవి నాకు ప్రియమే కదా! నేను ప్రతి జీవి క్షేమం కోసం ప్రేమతో ప్రార్థించాను. ఈ యాత్రలో యువ మిత్రులైన మహేంద్ర (హైదరాబాద్) సుష్మ (ముంబై )లకు ఈ యాత్రలోని దివ్యక్షణాలను శ్రద్ధగా తీసి పెట్టినందుకు ధన్యవాదాలు తెలుపుకున్నాను.

మరుసటి రోజు ప్రారంభం అయ్యేదే అసలైన యాత్ర. హిందువులకు జీవిత కాలపు కోరికగా భావించే కైలాస పర్వత పరిక్రమ మూడు రోజుల పాటూ చేయాల్సి వుంటుంది. నేను లోక కళ్యాణ కోసం పరిక్రమ చేస్తున్నప్పుడు ఆ ఆదిదేవుడు నాలోనే ఉండాలని ప్రార్థించాను.

అద్భుతమైన మానస సరోవర్ నేపథ్యంలో మేమందరము ఒక గ్రూప్

ఫోటో తీసుకున్నాము. చాలామంది యాత్రికులు నాతో ఫోటో తీసుకున్నారు. మానస సరోవరములో అందరం పుణ్య స్నానం చేయగలిగినందుకు ఆనందంతో యాత్రికుల మోములు మెరిసిపోవడం నేను గమనించాను. వారి అనన్య భక్తి నాకు ఒక పాఠం అయింది. భారతదేశాన్ని సురక్షితంగా మార్చడానికి ప్రజల యొక్క ఈ అనన్య భక్తి జవాబుగా నేను భావిస్తున్నాను.

మధ్యాహ్న భోజనం తర్వాత మానసరోవర్ నుంచి 30 కిలోమీటర్ల దూరంలో (16 వేల అడుగుల సముద్ర మట్టం) ఉన్న దర్చన (దర్శన్ ) చేరుకోవడానికి బయులుదేరాము. ఆ గ్రామంలో మార్పులు చూసి సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యాను అప్పటికి ఇప్పటికీ హస్తిమస్కాంతర భేదం ఉంది. గత ఏడేళ్లలో ఊహకందనంత విధంగా రూపాంతరం చెందింది. హిమాలయా గెస్ట్ హౌస్‌లో మేము బస చేసాము. పర్యాటకుల కోసం అద్భుతమైన ఏర్పాట్లు, వసతిని చేసారు.

## ఆగస్ట్ 16, 2019

మౌంట్ కైలాష్‌లో ఉష్ణోగ్రతలు భారీగా తగ్గడం వలన, భారత్ చైనా దేశాల మధ్య ఉన్న సమయ వ్యత్యాసం (రెండున్నర గంటలు)తో నిద్రపోవడం చాలా కష్టమైన పనిగా మారింది. ఒకటి రెండు గంటలు నిద్రపోగలిగితే అది ఒక వరంగా అనుకోవాలి. మూసి ఉన్న గదులు, చెక్క మంచాలు, పరుపులు, రెండు పొరల మందపాటి శీతాకాలపు దుప్పట్లు మొదలగునవేవి కూడా అక్కడి చలి నుంచి మా శరీరాలని కాపాడలేదు. ఎందుకంటే ఆ దర్చను ప్రాంతం సముద్రమట్టానికి సుమారు 15 వేల అడుగుల ఎత్తులో ఉంది. అక్కడి నుండే అందరికీ మొదటి సారి కైలాస పర్వత శిఖర దర్శనం జరుగుతుంది. అందుకే దాన్ని దర్చన్ అని పిలిచారు... అంటే మన భాషలో దర్శన్ అనుకోవచ్చు.

నేను కాల కృత్యాలు అంటే కేవలం బ్రష్ చేసుకున్నాను. నిజానికి అప్పటికి మూడు రోజుల నుంచి స్నానం లేదు. ఉదయం 7 గంటలకు అంత అన్ని వస్తువులు సర్దుకున్నాను. మేమందరము యమద్వారం చేరడానికి మా ప్రయాణాన్ని మొదలుపెట్టాం. కైలాశ పర్వత పరిక్రమ గురించి ప్రతి ఒక్కరికి వ్యక్తిగత నమ్మకాలు, సిద్ధాంతాలు ఉన్నాయి. నాకు ఈ భారత దర్శనం వెనుక

ఉన్న ఆలోచన లోక కళ్యాణం కోసమే అన్నది మరి మరీ గుర్తు చేసుకున్నాను కూడా.

మేము యమద్వారం చేరుకున్నాము. ఇది మరణ దేవడు అయిన యముని అనుమతి గృహంగా అందరూ నమ్ముతారు. అంటే మన భాషలో ఆ పై లోకానికి ఇమ్మిగ్రేషన్ కేంద్రం లాగా అన్న మాట. ఆ ద్వారం నుంచి వెళ్లే వాళ్లు ఈ యాత్ర విజయవంతం కావాలని ప్రార్థిస్తూ వెళతారు. అంటే యముని అనుమతి తీసుకుని వెళ్ళేది అనుకోవచ్చు. ఆది శంకరాచార్యుల మార్గంలో ఆ భగవంతుని దర్శించే అవకాశాన్ని ఆ భగవంతుడే నాకు ఇచ్చాడని అదేవిధంగా యమధర్మరాజు ఆశీస్సులు అనుమతి కావాలి అని నేను ప్రార్థించాను.

12 కి.మీ పరిక్రమ 5 గంటలలో ముగించగలము, కానీ నాకు ఏడు గంటలు పట్టింది వివిధ కారణాలవల్ల. శ్రమతో కూడిన ఈ ప్రయాణము లో యాత్రికులందరు అలసి పోవడానికి నేను గమనించిన కొన్ని కారణాలు నేను ఇక్కడ పొందుపరుస్తున్నాను.

1. వయస్సు.
2. శారీరక దృఢత్వం
3. అనారోగ్య విషయాలు.
4. తీవ్రమైన వాతావరణ పరిస్థితులు.
5. చాలా దుస్తులు ధరించడం.
6 సరి అయిన ఆహారం లేకపోవడం.
7. మనసులో అచంచల భక్తి లేకపోవడం.
8. ప్రకృతి సౌందర్యం పై దృష్టి
9. భగవంతుడి ఇచ్ఛ (ఇది అన్నిటికన్నా ముఖ్యమైనది)

నా పన్నెండు కిలోమీటర్ల మార్గానికి సహాయకురాలిగా డోల్మా పాల్ అనే స్త్రీని యమ ద్వారం దగ్గర నాకు జత చేసారు. మధ్య వయసులో ఉన్న ఆమె నన్ను చాలా ఆదరించింది. పెద్దగా చదువుకోనప్పటికీ, ఆమెని నేను పర్యావరణ ప్రేమికురాలిగా గమనించాను. ఎందుకంటే మార్గ మధ్యములో మొదటి నుండి చివరిదాకా దారిలో దొరికిన చెత్తనంతా చెత్త కుండీలో వేయడం చూసాను. నా గురించి శ్రద్ధ తీసుకుంటూనే, చేతిలో జపమాలతో మంత్రం చేస్తూనే వుంది.

చాలా ఆశ్చర్యం కూడా అయింది.

పూర్తి ప్రతికూలమైన వాతావరణ పరిస్థితిలో పర్వతాలను ఎక్కుతున్నప్పుడు, నిజంగా నాతో నేను యుద్ధం చేస్తున్నట్లు ఉంది. కానీ ఆ పరాత్పరున్ని నా హృదయంలోనూ పెదవుల మీద ఉంచుకొని అడుగు తర్వాత అడుగు వేసుకుంటూ ముందుకు సాగాను. నేను ఉదయం 11 గంటలకు ప్రారంభమై సాయంకాలం ఆరు గంటలకి బౌద్ధారామమైన ధీరపక్కి చేరుకున్నాను. బృందంలోని చాలామంది యాత్రికులు కొన్ని కారణాల వల్ల ముందుకు సాగలేకపోయారు. మరి కొద్ది మంది మాత్రమే ముందుకు ప్రయాణం సాగించారు.

మా బృందంలో 28 మంది యాత్రికులు మాత్రమే ఉన్నారు అందులో ఇద్దరూ మాత్రమే తెలుగు మాట్లాడేవాళ్లు ఉన్నారు, మొదటిసారిగా నేను భాషా సమస్యను మిగతా వారితో సంభాషించేటప్పుడు ఎదుర్కొన్నాను, ఎందుకంటే ఈ జట్టులో చాలామంది హిందీ మాట్లాడే వారే ఉన్నారు.

యాత్రలో కొన్ని విషయాలు నన్ను చాలా ఇబ్బందికి గురి చేశాయి. యాత్రికులంతా ఆధ్యాత్మికంగా కాక చాలా లౌకిక దృష్టితో ఉండేవారు. అందులో కొంతమంది పొగ తాగే వారు. మరి కొంతమంది మందు తాగేవారు, ఇంకొంత మంది మాంసాహారము / పొగాకు తినేవారు. వారిని చూస్తే నాకు చాలా బాధగా అనిపించేది. ఆధ్యాత్మిక ప్రయాణాల్లో కూడా ఈ ప్రపంచంలో చాలామంది ఇలా పొగాకు తింటూ ఆల్కహాల్ తాగుతూ మాంసాహారం తింటూ ఉండడం నన్ను ఎంతో వ్యాకులతకు గురిచేస్తుంది. అసలు ఈ యాత్రలు విలువలతో చేయాలి అనేది వదిలేద్దాం. కనీసం వాళ్ళ జీవితానికి హానిచేసే అలవాట్లకి వాళ్ళు దూరంగా ఉంటే అది మన దేశానికి వరం కాదా? నా ఆప్తులు అందరికీ నేను అభ్యర్థన చేస్తున్నాను, దయచేసి మీ అనారోగ్యానికి హాని కలిగించే వాటికి దూరంగా ఉండండి అని.

జట్టులో చాలామందికి నేను స్వామీజీ గానే సుపరిచితుని అయ్యాను నా పేరు ద్వారా కాకుండా. ఎందుకంటే నేను నా రోజుని ప్రార్థనతో మొదలు పెడతాను కాబట్టి. ఎప్పుడు అవకాశం ఉంటే అప్పుడు భోజన సమయ ప్రార్థన చేసే టీమ్ ఒకటి నాకు దొరికింది. వారికి నాకు తెలిసిన మంచి విషయాలు చెబుతూ ఉండేవాణ్ణి. యాత్రికుల అందరితో నేను కలిసి కలిసి పోయేవాడిని.

నా పరిక్రమ సమయంలో మొత్తం నేను ఎన్నో దివ్య దృశ్యాలను చూడ గలిగాను. యాత్రలో అడుగడుగు, ఇంచు ఇంచు ఒక దివ్యత్వాన్ని సంతరించుకుంది. ఇక్కడ ప్రకృతి ఆ భగవంతుడి నిజమైన సహచరిగా గోచరించడం కళ్ళకు కట్టి నట్టు తెలుస్తుంది. భగవంతుని పట్లనే హృదయాన్ని కేంద్రీకరించగలిగే వారికెవరికైనా ఈ దృశ్యాలు అన్నీ కనిపిస్తాయి. నాలుగు కిలోమీటర్ల పరిక్రమ తర్వాత కైలాస పర్వత దర్శన్‌తో ఆత్మ తృప్తి పొందాను. దృష్టి ఎలా ఉంటే సృష్టి అలా ఉంటుంది. కృతజ్ఞతా మరియు భక్తితో కూడిన హృదయంతో ప్రార్థన చేసాను. ఒకసారి కైలాశ శిఖర పరిక్రమ లో ముందుకు వెళ్ళాము అంటే, చుట్టూ వున్న పర్వత శ్రేణువులు, శిఖరాలు కలగలిపి చూస్తే నంది, గణపతి, తపస్సులో మునిగి వున్న మునులు ఇలా చాలా దివ్యమైన ఆకృతులు చూడటం సాధ్యం అవుతుంది. సామాన్యంగా ఈ పర్వత శిఖరాలు అలా అందరికీ అగుపించవు. కారణం అంత తదేక దృష్టితో ప్రకృతిని గమనించే సత్తువ లేకపోవడమే అని చెప్పాలి. అలా చూడకుండా కొన్ని అడుగులు ముందుకు వేసినా ఆ అద్భుత మయిన ఆకృతులను చూసే అవకాశం కోల్పోయినట్లే ఎందుకు అంటే ఆ పర్వతా శ్రేణులను ఒక్కో కోణంలో చూసినప్పుడే అవి దివ్యాకారములుగా గోచరిస్తాయి. నేను చూసిన... నాకు అగుపించిన ప్రతి పర్వతాకారములను నేను నా కెమెరా లో నిక్షిప్తం చేసుకున్నాను. కారణం కొన్ని అడుగులు ముందుకు వేసినా ఇక ఆ అమరికలు మనం చూడలేము. మున్ముందు ప్రయాణంలో ఇలాంటి రాతి ఆకృతుల్ని ఎన్నో చూడవచ్చు.

పరిక్రమ ఆద్యంతం గాయత్రి, మృత్యుంజయ, సమస్త లోకా సుఖినోభవంతు అన్న మంత్రాలను జపిస్తూనే ఉన్నాను. ఐదు నిమిషాలకు ఒకసారి నేను శారీరిక బడలికతో ఒక్క అడుగు కూడా వేయలేని స్థితిలో విధిలేక విశ్రాంతి తీసుకొని ప్రయాణించాను. కానీ ఒక్కసారి గమ్యస్థానమైనా కైలాస్ పర్వత సంపూర్ణ దర్శనం లభించినంతనే ఆ కైలాశ వాసునికి సాష్టాంగ నమస్కారం చేయకుండా ఉండలేక పోయాను. అలాగే ఆ రోడ్డు మీద బిగ్గరగా రోదిస్తూ... ఆ దుమ్ములో దొర్లుతూ ఒక ఉన్మాద స్థితిలో ఆ కైలాశ నాథుని పిలుస్తూ... ఈ సృష్టిలో నేను పోయే లోపుగా చేయవలసిన పనులేవో నాతో నా చివరి ఊపిరి ఆగే లోపుగా చేయించమని ప్రార్థించాను. నీళ్ళు నిండిన నా కళ్ళకు ఒక లిప్తకాలం కైలాశ

పర్వతం మీద శివుడు కరుణ నిండిన కళ్ళతో నన్ను చూస్తున్నట్లు సాక్షాత్కరించారు. ఒళ్లు జలదరించింది... పులకరించింది... నేను ఒక్కసారి కళ్ళు నలుపుకొని చూస్తే అక్కడ నాకు ఇంకా ఏమీ కనిపించలేదు. కానీ నా హృదయం అంతా దైవ దర్శనంతో నిండిపోయింది. అంత ఏడుపు లోనూ చేతిలో కెమెరా కు పని చెప్పడం ఆపలేదు. నాకు కనిపించిన దృశ్యాలను భందించాలన్న తపన. నేను కెమెరాలో భందించిన దృశ్యాలు చూస్తే నాకు నేనే నమ్మ లేక పోయాను. సాక్షాత్తు శివ పార్వతుల రూపాలు నామ మాత్రంగా అందులో కనిపిస్తున్నాయి. నా ఆనందానికి హద్దే లేకుండా పోయింది.

నేను నెమ్మదిగా వసతి గృహానికి చేరుకున్నాను. నేను అక్కడికి చేరుకోగానే ఒక్క నిముషం కూడా వృథా చేయకుండా మహేంద్రని వీడియో తీయడానికి నాతో పాటు రమ్మని అడిగాను. ఆయన వెంటనే దయతో అంగీకరించి, సుమారు 16,000 అడుగులు ఎత్తులో ఎగిసిపడుతున్న జల ధారల వింతైన శబ్దం ఒక ప్రక్క, అక్కడ వింత శబ్దముతో వీస్తున్న గాలి మరో ప్రక్క... వీడియో తీయడం చాలా ఇబ్బందిగా కష్టంగా అనిపించింది. కానీ ఎంతో ప్రేమతో ఈ యాత్ర చేయడానికి నాకు సహకరించిన ఎన్నో వందల మందికి, నా దేశ ప్రజల కోసం... అక్కడ నేను పొందిన దివ్యానుభూతిని జీవిత గ్రంథంలో నిక్షిప్తం చేయడానికి శ్రమపడి మాట్లాడాను. చాలా చాలా ఆనందం అయింది. నేను పొందిన దివ్య అనుభూతులు నన్ను వివసుణ్ణి చేసాయి అని చెప్పాలి. వేరే ఆలోచన రాలేదు. నాకేదో సాక్షాత్కారం అయిందన్న భ్రమ కలుగుతోంది కూడా... నిజమా కాదా అన్నది తెలియదు... కానీ హృదయం ఉప్పొంగిపోతోంది... నిలువ నియలేదు కూర్చో నివ్వలేదు ఆ దివ్య ప్రకంపనలు. చాలా ఆనందంతో ఎగురుతున్నాను.

తిరిగి గదికి వస్తూంటే, ఒకతను ఎంతో గౌరవంగా నా దగ్గరికి వచ్చి మీరే సాంప్రదాయానికి చెందిన వారిని ప్రశ్నించారు. వెనువెంటనే ఒక లిప్త కాలం కూడా ఆలోచించకుండా మానవ సేవ సంప్రదాయమని బదులిచ్చాను ఆయన తలవంచి నాకు నమస్కరించి వెళ్లిపోయారు.

నేను మరుసటి రోజు పరిక్రమ కోసం సిద్ధంగా ఉన్నాను. కానీ భగవంతుడు ఇచ్చ నా పట్ల మరోలా ఉంది. నేను వసతి గృహానికి చేరుకునేటప్పటికీ మహిళలు ఇద్దరు పర్వత ప్రాంతం వలన వచ్చే అనారోగ్యంతో నీరసపడిపోయారని విన్నాను.

వారిద్దరి పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. వారి దగ్గర వాళ్లు వారి గురించి ఆందోళన చెందుతూ ఉన్నారు. నేను వారికి ముందుకు ప్రయాణం కొనసాగించకుండా దర్శన్ బేస్ క్యాంప్‌కి అంబులెన్స్‌లో పంపించమని చెప్పాను. కొంతసేపటి చర్చల తర్వాత వారిలో ఎవరు వెళతారు అన్న ప్రశ్న ఉదయించింది. వారి ఆత్మీయులంతా జీవితంలో ఒకేసారి వచ్చే పరిక్రమలో ఉన్నవారే. ఎవరూ కూడా తిరిగి క్రిందకు వెళ్లేందుకు సిద్ధంగా లేరు. వారి కుటుంబ సభ్యులు కూడా సిద్ధంగా లేరు సుమా! ఆశ్చర్యం అయింది. వాళ్ళందరూ అనారోగ్యంగా వున్నోళ్లను అంబులెన్స్‌లో పంపేందుకు సిద్ధం అయ్యారు కానీ... వారితో పాటుగా ఎవరూ వెళ్లేందుకు సిద్ధంగా లేరు. కొద్దిసేపటి క్రితం నేను అపరిచితుడికి చెప్పిన విషయాన్ని గుర్తుతెచ్చుకొని నాకు నేను స్వచ్ఛందంగా నా పరిక్రమను తగ్గించుకొని, వారికి సాయంగా బయలుదేరుతాను అని చెప్పాను. ఎవరికైతే సాయం అవసరమో వారి పక్కన నిలబడడమే, నా మతమని మిగతా వారిని ఆ దైవం వైపు మళ్ళించడం నా జీవిత కార్యం అని నేను ప్రగాఢంగా నమ్ముతాను. నేను నా నిర్ణయాన్ని వారికి తెలియజేసినప్పుడు చాలామంది ఆశ్చర్యపోయారు. నేను మాత్రం భగవంతుడు మరో విషయాన్ని నేర్చుకునేందుకు నాకు ఇచ్చిన అవకాశం అని భావించాను. వారిద్దరికి నేను తోడుగా ఉండి ప్రత్యేక అంబులెన్స్‌లో హోటల్‌కి తెచ్చాను. అక్కడ వారికి సపర్యలు చేసి, జాగ్రత్తగా వారిని కుదుట పరిచాను. 17 ఆగస్టు రాత్రి 12 గంటలకు అంత వారి ఆరోగ్య పరిస్థితి కాస్తా బాగుపడింది. ఎవరైనా సరే శుద్ధం అవ్వాలి అంటే వారు మరొకరికి సేవ చేయవలసిందిగా నేను చెప్తాను. నేను నందీశ్వరుడు, గణపతి, మునులు, పార్వతీ మాత, శివుడు, పవిత్ర కైలాస పర్వతం దివ్య స్వరూపాలను నా కెమెరాలో శాశ్వతంగా బంధించాను... హృదయంలో కూడా సుమా!

## ఆగస్ట్ 18, 2019

**నా జీవితంలో చారిత్రాత్మక రోజు:**

గదిలో మహిళలు ఇద్దరు కూడా తేరుకుంటూ ఉండంగా నన్ను తీవ్ర ఆలోచనలు చుట్టుముట్టాయి ముందుకు వెళ్లే మార్గం ఏమిటి అని ఆలోచన పరంపరలు పదేపదే నన్ను చుట్టుముట్టడంతో నేను నిద్ర పోలేకపోయాను.

హృదయాంతరాళములలో ఎన్నో ఆలోచనలు వస్తూనే ఉన్నాయి. నేను ఇక మంచం మీద కూర్చుని, ఫోన్‌లో నోట్ పాడ్ తెరచి, నా ఆలోచనలు అన్నింటినీ ఒక క్రమంలో వ్రాస్తూ వచ్చాను. వాటిని సంక్షిప్తంగా చెప్తున్నా.

**ఆత్మదర్శన్:**

అమావాస్యనాడు ఈ దేహమునకు జన్మనిచ్చిన తల్లిని తలచాను
బ్రహ్మచర్యమును అనుమతించిన తండ్రిని జ్ఞాపకం చేసుకున్నాను
జీవిత పరమావధిని చూపి వెలుగు నింపిన గురువు జ్యోతిని గుర్తు చేసాను
సన్యాసమునకు ఇంకా సమయం ఉందన్న పరమాచార్యుని స్మరించాను
నాలుక మీద బీజాక్షరాలు రాసి సరస్వతీపుత్రుడన్న విజయశ్వరీ దేవిని,
సన్యాసి అని పిలిచి కాషాయం ఇచ్చిన శ్రీ సత్య సాయి బాబాను
కాషాయం కట్టకున్న నేమి, సన్యాస కదా నీదన్న చిన్న జీయర్ని తలచాను
భారత దర్శన ముందు దర్శన్ చేరితి
కైలాసనాథుని నేత్ర కరుణాకటాక్షం గంటి
దర్శన్ గ్రామం ఆత్మ దర్శనమునకు వేదికగా
భవిష్య ప్రణాళిక హృదయాన జన్మించెనిచట
భారత దర్శనం విజయవంతంగా ముగించి
ప్రేరణ నొసగిన భద్రాద్రి రాముని స్మరించి
దారి చూపిన శీతలాంబను శరణు వేడి
లగ్నము పెట్టిన జీయర్ ముందు తలవాల్చి
భవిష్య ప్రణాళికను చర్చించ భావనకల్గెనిచట
బాలచంద్ర మనోగతమునకు ఆవిష్కరణ త్వరలో
నలుబది ఐదేళ్లు జీవించాలన్న ఆశయం నెరవేరిపోతుంది
ఇకముందు బ్రతుకు నందు దేహ భావన వీడి ఆత్మ భావన తోడి
దేశ సౌజన్య సౌభాగ్య సౌశీల్యముల కోసమై కొనఊపిరిదాక
నాదంటూ ఏమీ లేని నాకంటూ ఎవరు లేని జీవన పథంలో
నేను అందరివాడిగా... విశ్వమునకు మిత్రుడినై అభయానందుడి నై
ప్రతిక్షణం సర్వజీవ శ్రేయస్సుకై... దీక్ష చేయంగ పూనినాను.

2019 ఆగస్టు 18న కైలాస పర్వతం దగ్గర పరిక్రమ పూర్తయినప్పటికీ మేము ఖాట్మండు చేరుకోవడానికి మూడు రోజులు పట్టింది. చైనా, టిబేట్, నేపాల్ దేశాలను దాటుకుంటూ రావడానికి దీర్ఘ సమయం పట్టింది. మూడవ రోజు రాత్రికి ఖాట్మండు చేరుకున్నాము. శుభమస్తు.

భారత దర్శన్ రెండవ భాగంతో మళ్ళీ మీ ముందుకు మరొక పుస్తకం ద్వారా కలుస్తాను. మొదటి భాగం చదివి మీ అభిప్రాయాన్ని తెలుపడం మరచిపోకండి!

**– బాలచంద్ర**



“శ్రీమాన్ బాలచంద్ర గారు, మీ భారత దర్శన దివ్యానుభవాలు మిమ్మల్ని తప్పక ఉన్న స్థితి నుండి భగవద్ సేవలందు ఉత్తమ స్థితికి చేరుస్తాయి. మీ అనుభవాలను గ్రంథీకరించడమే గాక అందరితో పంచుకోవడం ద్వారా ఎంతో మందికి భారత దర్శన స్ఫూర్తి కలుగుతుంది. అంతే గాక తద్వారా వారికి కూడా దివ్యానుభవాలు కలుగుతాయి. మా మంగళాశాసనములు మీకు ఎల్లప్పుడూ ఉంటాయి”.

– చిన్న జీయర్



“శ్రీ ఆది శంకరాచార్య, శ్రీ రామానుజచార్యుల వారివలే బాలచంద్ర గారు కూడా ఆర్యావర్తమంతా దర్శించి వారి అనుభవాలను పుస్తకంలా చేసి ఒక ప్రసాదంలాగా ఈ అమృతాన్వేషకులతో పంచుకున్నారు. వారి అద్భుతమైన శైలితో ఎంతో సరళంగా తమ అనుభవాలను గ్రంథీకరించి అందరినీ తమతో పాటుగా దివ్య, భవ్య భారత దర్శనము గావించారు.”

– శ్రీ వి.వి. లక్ష్మీనారాయణ, IPS Retd.,



“I am sure, your experiences while travelling across the breadth and corner of this noble land will surely beneficial to the readers of this book. I convey my best wishes to you and all those who stood by you during Bharata Darshan.”

- MVR Krishna Teja, IAS, Govt of Andhra Pradesh



“సత్యాన్వేషకులకు, యాత్రికులకు శ్రీ బాలచంద్ర వ్రాసుకున్న అనుభవాల పుస్తకము భారత దర్శనము, ఒక కరదీపికలాగా ఉపయోగ పడుతుంది. కారణం భారతీయ సంస్కృతి సంప్రదాయాలను మరియు పూర్వ వైభవాన్ని చక్కగా వివరించారు. బాలా తన యాత్రను ఎలాంటి ప్రణాళిక లేకుండా ఒక సన్యాసిలా దేశమంతా పర్యటించారు. అన్ని ప్రదేశాలలో ఇమిడి ఉన్న అద్భుతమైన విశేషాలను ఆధ్యాత్మిక విలువలను ఏరి కూర్చినాడు. పుస్తకము చదువుతుంటే నేను కూడా తనతో పాటుగా ప్రయాణించినట్లు ఉంది”.

– శ్రీ పిడతల గోపి కృష్ణ, శ్రీ సత్యసాయి సేవా సంస్థలు, హైదరాబాద్.


Published By

abhaya FOUNDATION
an assurance for no fear...

Flat No: 502, Vipanchi Residency,
Lane besides Paradise Take Away,
Masab Tank Hyderabad-500028
abhayafoundation@yahoo.com
www.abhayafoundation.org
www.abhayahome.org

Secretary: KSV Siva Krishna (99592 20450)
fb: abhayafoundationHyd
fb Page: abhaya Foundation - Home of Happiness
fb: Balachandra Sunku
fb Page: Balachandra Sunku